# సైద్ధాంతిక ప్రవక్త

## MUHAMMAD - A PROPHET FOR ALL HUMANITY



మౌలానా వహిదుద్దీన్ ఖాన్

# సైద్ధాంతిక ప్రవక్త

## (సల్లల్లాహు అలైహి వసల్లం)

వైజ్ఞానిక, చారిత్రక దృష్టితో పరిశీలన

**మౌలానా వహీదుద్దీన్ ఖాన్**

ఉర్దూ కంటెన్ పైగంబరె ఇన్ ఖిలాబ్

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| | భూమిక | -- | 1 |
| **మొదటి భాగం :** | ఆదం నుంచి ఏసుక్రీస్తు వరకు | -- | 7 |
| | ప్రవక్త ప్రభవం | -- | 11 |
| | ఉదార ప్రాయమైన శీలం | -- | 15 |
| | ఉత్తమ నడవడిక | -- | 31 |
| | ప్రవక్త జీవితం నేర్పే పాఠాలు | -- | 41 |
| | ప్రవక్త సంప్రదాయం | -- | 76 |
| **ద్వితీయ భాగం :** | సైద్ధాంతిక ప్రవక్త | -- | 81 |
| | ప్రవక్త ప్రణాళిక (Method) | -- | 106 |
| | మక్కాలో ప్రవక్త | -- | 124 |
| | యస్రిబ్‌వాసుల ఇస్లాం | -- | 157 |
| | ప్రస్థానం | -- | 159 |
| | విజయానంతరం | -- | 176 |
| **మూడవ భాగం :** | దైవ దౌత్య పరిసమాప్తి | -- | 184 |
| | ప్రవక్త మహిమ – ఖుర్‌ఆన్ | -- | 190 |
| | ప్రవక్త సహచరులు | -- | 196 |
| **నాల్గవ భాగం :** | వర్తమాన కాలంలో దౌత్య ప్రతిష్టత (Manifestation) | -- | 211 |
| | హీరోల నర్సరీ | -- | 219 |

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడైన అల్లాహ్ పేరుతో...

# భూమిక

అమెరికా నుండి ఒక గ్రంథం వెలువడింది. దాని పేరు 'ది హంగ్రెడ్', ఆ గ్రంథంలో, రచయిత దృష్టిలో మానవ చరిత్రలోకెల్లా అత్యంత ప్రభావితులైన వందమంది ప్రముఖుల పేర్లు ప్రస్తావించబడ్డాయి. గ్రంథ రచయిత క్రైస్తవుడు, జాతీయత రీత్యాను వెస్ట్రనిస్ట్, విద్యాపరంగా అతను ఒక సైంటిస్టు అయితే ఆ వందమంది సర్వ శ్రేష్ఠుల జాబితాలో అతను మొదటి స్థానం ఏసుక్రీస్తుకో, న్యూటన్‌కో గాని కేటాయించలేదు. అసాధారణ ఘనకార్యాల రీత్యా, అద్భుత విజయాల దృష్ట్యా అతను రూపొందించిన జాబితాలో ప్రథమ స్థానం ఇస్లాం ప్రవక్తకు లభించింది. మానవ జాతిపై ప్రవక్త వేసినంత ప్రభావం మరేమత నాయకుడు గాని, మరే ఇతర సెక్యులర్ నాయకుడుగాని వేయలేదంటాడు ఆ రచయిత.

ప్రవక్త అద్భుతాలను అంగీకరిస్తూ ఆ రచయిత ఇలా అంటాడు.

He was the only man is history who was supremely successful on both the regions and secular bevels.

- Dr. Michael H.Hart. The 100, Nowyork - 1978.

జీవితంలో మతస్థాయినూ, ప్రాపంచిక స్థాయిలోనూ సంపూర్ణ విజయం సాధించిన తొలివ్యక్తి ఆయన (స).

ఆంగ్ల చరిత్రకారుడైన థామస్ కార్లయిల్ ఇస్లాం ప్రవక్తను ప్రవక్తల హీరోగా అభివర్ణిస్తాడు. మైకేల్‌హార్ట్ ఆయన్ని మానవుల్లోకెల్లా శ్రేష్ఠులుగా ఖరారు చేశాడు. ఇస్లాం ప్రవక్త ఔన్నత్యం ఎంత స్పష్టమైందంటే ఆయన తన అనుయాయుల కొరకు ఆయన కేవలం "విశ్వసనీయమైన' స్థాయిని మాత్రమే కలిగారు. ఆయన వ్యక్తిత్వం ఒక ప్రమాణ బద్ధమైన చారిత్రక సత్యం చరిత్రనెరిగిన ప్రతివ్యక్తీ ఈ సత్యాన్ని అంగీకరించి తీర్తాడు.

ఎవరైనా పైకి దృష్టినిసారిస్తే అతనికి అన్ని వైపులా ఆకాశం కానవస్తుంది. అలాగే మానవజీవితంలో ఏ వంకచూసినా ఇస్లాం ప్రవక్త చేసిన ప్రభావం తొణకిసలాడుతున్నట్లు కానవస్తుంది. నేడు మానవజీవితంలో ప్రావీణ్యాన్ని సంతరించుకున్న అత్యుత్తమ విలువలు, ఉన్నత విజయాలన్నీ ఆయన తీసుకువచ్చిన నైతిక విప్లవం యొక్క ప్రత్యక్ష పరోక్ష ఫలితాలే.

మత సంస్థలో వ్యక్తి పూజ స్థానంలో దైవపూజను నెలకొల్పిన వారెవరు? "విశ్వాసాలకు" మూఢనమ్మకాలస్థానే సత్యప్రాతిపదికను కల్పించిన వారెవరు? సైన్సులో ప్రకృతిని ఆరాధించే

బదులు ప్రకృతిని జయించే పాఠం నేర్పినదెవరు? రాజకీయాలలో అనువంశిక రాజరిక వ్యవస్థల స్థానే ప్రజా ప్రభుత్వాలకు మార్గం సుగమం చేసినవారెవరు? జ్ఞాన వైజ్ఞానిక రంగాలలో ఊహాకల్పనలకు బదులు యదార్థ దృష్టితో కూడిన ఒరవడి ప్రసాదించినదెవరు? సామాజిక వ్యవస్థకై అన్యాయం బదులు న్యాయ ప్రాతిపదికను సమకూర్చినదెవరు? సమాధానం ఒక్కటే – ఈ వస్తువులన్నీ మానవచరిత్రకు ఇస్లాం ప్రవక్త ద్వారానే లభ్యమైనాయి. ఈ ఘనకార్యాలను ఆ మహోపకారికి తప్ప మరొకరికి ఆపాదించటం న్యాయం కాదు. ఇతరులంతా ఆయన విప్లవ స్రవంతిని ఉపయోగించుకున్నవారే తప్ప దాన్ని ఉనికిలోనికి తీసుకువచ్చిన వారు మాత్రం కాదు.

దేవుడు తన అంతిమ ప్రవక్తను చరిత్రలో పురుషోత్తమునిగా చేసి మానవ జాతికి మహోపకారం చేశాడు. ఈ విధంగా మనకు తెలిసిన చరిత్రలో ఒక సర్వోన్నత 'స్థూపం' నిలబెట్టబడింది. మనిషి ఎటునుంచి చూసినా ఆయన్ని చూసేలా, అతనెప్పుడు తన నాయకుని అన్వేషణకు బయలుదేరినా అతని దృష్టి అన్నిటికన్నా ముందు ఆయనపై పడేలా సర్వోత్కృష్ట ఆదర్శం నెలకొల్పబడింది, ఆయన సమస్త మానవాళికై మార్గం చూపే మహా మార్గదర్శకుని స్థాయిని కలిగిఉన్నారు. అందుకే ఆయన్ని చరిత్రలో అంతటి ఉన్నత స్థానాన నిలబెట్టడం జరిగింది. కళ్లున్న ఏ వ్యక్తి కన్నెత్తిచూచినా ఆయన్ని చూడకుండా ఉండని విధంగా ఆయన స్థానం ఏర్పాటుచేయబడింది.

ప్రవక్త ముహమ్మద్ కూడా ఇతర దైవప్రవక్తల్లా ఓ దైవప్రవక్తే. ఖుర్ఆన్ ఇచ్చిన వివరణ ప్రకారం ఇతర ప్రవక్తలు నిర్వర్తించిన పనికి ప్రవక్త నిర్వర్తించిన పనికి వాస్తవానికి వ్యత్యాసం ఏమీలేదు. అయినా ఆయన స్థానం ఒక విధంగా విశిష్టమైనది. ఆయన ప్రవక్తలపరంపరకు పరిసమాప్తిగా ప్రభవించారు. (ఖుర్ఆన్ 33:40)

ఈ ప్రపంచం పరీక్షాస్థలం కావటంవల్ల, ఇక్కడ ప్రతి ఒక్కరికీ ఆచరణా స్వాతంత్ర్యం ఇవ్వబడినందువల్ల ప్రజలను బలవంతాన మార్చే బాధ్యత ఇక్కడ దైవప్రవక్తలపై మోపబడలేదు. దేవుని తరఫున లభించిన సందేశాన్ని స్పష్టంగా ఉన్నదున్నట్లుగా – ప్రజలకు అందజేసే బాధ్యత మాత్రమే ప్రవక్తలది (ఖుర్ఆన్ 15:53)

అయితే ప్రవక్తలకు పరిసమాప్తంగావచ్చిన ప్రవక్త ముహమ్మద్‌పై ఒక అదనపు బాధ్యత కూడా వేయబడింది. అదేమిటంటే ఆయన క్రియాత్మకంగా ఒక శాంతియుత విప్లవం తీసుకువచ్చి, భూ మండలంలోని ఒక పెద్దభాగంలో తన అనుచర సమాజాన్ని ప్రభవింప జెయ్యాలి. ఆయనపై అవతరింపజేయబడిన ఆకాశ గ్రంథం (ఖుర్ఆన్) పరిరక్షణకు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరగటానికిగాను ఇదంతా అవసరమైంది. దైవగ్రంథం గనక సురక్షితంగా ఉండని పరిస్థితిలో ప్రవక్తల పరంపరకు 'ఫుల్‌స్టాప్' పడదు. దీన్ని బట్టి అర్థమయ్యేదేమిటంటే ఇతర ప్రవక్తలు కేవలం సందేశ ప్రదాతలైతే ప్రవక్త సందేశ ప్రదాతతోపాటు శాంతియుత విప్లవ ప్రవక్త కూడా.

మనిషికి తన ఆచరణ విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉంది. అయితే దాని పరిణామం విషయంలో మటుకు అతనికెలాంటి అధికారంలేదు. ఇది అత్యంత సంక్లిష్టమైన పరిస్థితి. ప్రతి మనిషి ప్రపంచంలో ఈ పరిస్థితిని గత్యంతరం లేక ఎదుర్కొంటున్నాడు. అందుకే దేవుడు మానవుని మార్గదర్శకత్వం కొరకు ఏర్పాట్లు చేశాడు. ప్రాపంచిక న్యాయస్థానంలో ఎవరికీ ఎలాంటి సాకులు, వంకలు చూపే ఆస్కారం ఉండరాదన్నదే దీని ఉద్దేశ్యం.

మానవుడు అత్యంత ఉత్తమ రూపంలో పుట్టించబడ్డాడు. అతని నైజంలో మంచీచెడుల విచక్షణా జ్ఞానం కూడా పొందుపరచబడింది. ఆ తరువాత అతన్ని సమత్వం, సమతూకంపై నెలకొల్పబడిన లోకంలో వసింపజెయ్యటం జరిగింది. దాంతోపాటు అతనికి సమకూర్చబడిన మరో ప్రత్యేక ఏర్పాటు ఏమిటంటే అన్ని కాలాల్లోనూ అన్ని జాతుల్లోనూ దైవ ప్రవక్తలు వచ్చారు. ప్రవక్తలందరూ తమ జాతి ప్రజలు మాట్లాడే భాషలో విషయాన్ని సులభగ్రాహ్యమైన శైలిలో విశదీకరించారు.

ఆఖరిసారిగా దేవుడు ప్రపంచానికి ఓ శాశ్వితమైన ఆదర్శాన్ని అందించదలిచాడు. స్వయంగా మానవ జీవితం రూపంలోనే ఓ సంపూర్ణ ఉదాహరణను నెలకొల్పి సమస్త మానవాళికి దాన్ని నమూనాగా చేయాలన్నదే దైవాభిమతం. అయితే దైవప్రవక్త నూహ్ (మనువు) కాలం నుంచి దైవప్రవక్త ఏసుక్రీస్తు కాలం వరకు ప్రవక్తలు ఎదుర్కొన్న అవాంచనీయ పరిస్థితుల మూలంగా ఆ 'సంపూర్ణ ఆదర్శం' చరిత్రలో నెలకొనలేకపోయింది.

దైవ ప్రవక్త అబ్రాహాము కాబాగృహాన్ని నిర్మిస్తున్న సందర్భంగా అటువంటి సంపూర్ణ ఆదర్శాన్ని నెలకొల్పగల ఒక ప్రవక్తను ప్రభవింపజేయమని పరమ ప్రభువును ప్రార్థించటం జరిగింది. ఆయన ప్రార్థించిన రెండున్నరవేల సంవత్సరాల తర్వాత అంతిమ ప్రవక్త ముహమ్మద్ దేవుని ప్రత్యేక తోడ్పాటుతో ఆ ప్రణాళికకు పరిపూర్ణతను చేకూర్చడానికి ప్రభవింపజెయ్యబడ్డారు.

ఆయన కేవలం వ్యక్తిగత జీవితం దృష్ట్యా మాత్రమే అవసరమగు మానవ ఆదర్శాన్ని ప్రపంచంలో నెలకొల్పలేదు. దైవ ప్రణాళికానుసారం ఆయన అనేక సామూహిక సంఘటనలను ఎదుర్కొన్నారు. సర్వావస్థల్లో ఆయన దైవ శాసనంపై నికార్సుగా నిలబడి దేవుని ఈ ప్రపంచంలో దైవప్రీతి పొందదలచిన మనిషి ఎలా మసులుకోవాలో నిరూపించారు.

ప్రపంచంలో మానవులు దైవారాధన ఎలా చేయాలన్న దృష్టాంతం మాత్రమే ఆయన ద్వారా నెలకొల్పబడలేదు. నిజదైవాన్ని ఆరాధించి ఆయనకు పూర్తిగా విధేయులైన తరువాత ఏ విధంగా దైవదాసులకు దైవసహాయం అందుతుందో కూడా ఆయన తన జీవితంలో రుజువుచేశారు. దైవానికి భయపడే మనిషి ఏవిధంగా ప్రపంచంలో ఇతరత్రా భయాందోళనల నుంచి విముక్తి నొందుతాడో కూడా ఆయన కళ్లకు కట్టినట్లు చూపించారు. రెచ్చగొట్టబడే సందర్భంలో దైవం కొరకు పాటించే నిగ్రహం ఎలా విజయానికి వారధి అవుతుందో ఆయనే రుజువుచేశారు. పరలోకం కోసం ప్రాపంచిక స్వప్రయోజనాలను త్యజించిన మనిషికి ఏ విధంగా దేవుడు ఇహం మరియు పరం – రెండింటిలోనూ గౌరవున్నతులు ప్రసాదిస్తాడోనన్న దానికి ఆయన ప్రబల తార్కాణంగా నిలిచారు. నకారాత్మక భావనల నుండి పైకివచ్చి వ్యవహారం చేయటం వలన ఎటువంటి స్పష్టమైన విజయం వరిస్తుందో, శత్రువులు సైతం ఎలా స్నేహితులుగా మారిపోతారో ఆయన క్రియాత్మకంగా లోకానికి చూపించారు.

అంతిమ ప్రవక్త ముహమ్మద్‌కు పూర్వం వచ్చిన ప్రవక్తల జీవిత చరిత్రలు క్రోడీకరించబడిన, చరిత్రలో ఖచ్చితంగా చోటుచేసుకోలేకపోయాయి. తత్ఫలితంగా చారిత్రకంగానూ, శాస్త్రీయంగానూ వారి దైవ దౌత్యాన్ని గురించి తెలుసుకునే ఆధారాలు లేకుండాపోయాయి. చివరికి పూర్వపు ప్రవక్తలందరిలోకి ఆఖరివారైన ఏసుక్రీస్తు జీవిత చరిత్ర కూడా చారిత్రకంగా ప్రామాణికమైనదిగా మన ముందు లేదు. ఈ కారణంగానే కాబోలు ఒక పాశ్చాత్య తత్వవేత్తకు ఇలా అభిప్రాయపడేందుకు వీలు చిక్కింది. ఆయన ఏమన్నాడంటే,

Historically it is quite dutiful whether Christ ever existed at all.

(B.Russell)

చారిత్రకంగా, ఏసుక్రీస్తు అసలీలోకంలో ఉనికిలోకి వచ్చాడా అన్న విషయమే పూర్తిగా అనుమానాస్పదం అయిపోయింది.

అయితే అంతిమ దైవ ప్రవక్త విషయం ఇందుకు విరుద్ధమైంది. చారిత్రకంగా ఆయన ఎంత ప్రమాణబద్ధమైన వారంటే, ఆయన్ని గురించి కలం చేపట్టిన ఒక వ్యాఖ్యాత ఇలా అభిప్రాయపడ్డాడు.

Mohemmed was born within the full light of History. (Hitti)

ముహమ్మద్ చరిత్ర యొక్క పూర్తి వెలుగులో ప్రభవించారు.

ఆయన నిత్య సజీవ ప్రవక్త అనడానికిగాను ఆయనకు ప్రసాదించబడిన ఒక

అద్భుతం – ఒక మహిమ – కూడా సజీవమైనది. నిత్యమైనది. అదే దివ్య ఖుర్ఆన్. అందరికీ ఇవ్వబడినట్లే ఆయనకు సాధారణ మహిమ ఇవ్వబడి ఉంటే అది ఆయన మరణంతోనే ముగిసేది. ఆయన 'ప్రవక్తపదవి' ఆయన తదనందరం కూడా మిగిలి ఉండేది కావటంవల్ల ఆయన తెచ్చిన గ్రంథాన్ని ఒక మహిమగా చేయటం జరిగింది. మానవ శక్తియుక్తులకు అందని అనుకరించనలవికాని అసాధారణ సంఘటనే మహిమ! ఖుర్ఆన్‌ను అనుకరించే, కాపీ కొట్టే శక్తి ఏ వ్యక్తికీ, మరే వర్గానికీ లేదు. ఖుర్ఆన్ ఒక దైవిక మహిమ అని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

అంతిమదైవ ప్రవక్త కొరకు విజయ సాధనాలు (ఒనరులు) పుష్కలంగా సమకూర్చ బడ్డాయి. ఆయన అనంతరం ఆయన అనుచరుల విషయమూ ఇంతే. అయితే ఒక రైతుకు ఫలితం చేకూరడానికి అతనికి ఏఏ కారకాలు అవసరమో ఇదీఅంతే. ఒక రైతు విత్తనం నాటిన రోజు నుంచి పసిడి పచ్చని పంటను కోసేవరకూ దేవుడు ఏఏ పరిస్థితులను, కారకాలను సానుకూలం చేశాడో అలాగే ప్రవక్త మరియు ఆయన అనుయాయుల కోసం ప్రపంచంలో పరిస్థితులను సానుకూలంగా సమకూర్చిపెట్టాడు. సత్య ధర్మ ఉన్నతికై వారు ఎప్పుడు ఈ ఒనరులను సద్వినియోగం చేసుకున్నా నిస్సందేహంగా అవి సకారాత్మక ఫలితాలనిస్తాయి.

అబ్రహాము కాలం మొదలుకుని ముహమ్మద్ ప్రవక్త ప్రభవం వరకూ గల రెండవున్నరవేల సంవత్సరాల కాలంలో ఆయన (స) కోసం సానుకూల పరిస్థితులన్నీ అత్యుత్తమ రీతిలో సమకూర్చబడ్డాయి. ఆయన దైవశాసనాన్ని తు.చ. తప్పకపాటిస్తూ పరిస్థితులతో సమరసంచెందారు. తత్ఫలితంగా అద్భుత విజయాలు చేతికందాయి.

ఆ తరువాత 1400 సంవత్సరాల కాలగమనంలో సంభవించిన వివిధ చారిత్రక శాస్త్రీయ పరిణామాల మూలంగా అన్నిరకాల సానుకూల పరిస్థితులు మన కొరకు స్వాగతంచెబుతూ నిలిచాయి. అంతిమదైవ ప్రవక్త తెచ్చిన ధర్మాన్ని ఉద్ధానస్థితికి తీసుకెళ్ళడానికి నేటికీ ఆ అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే ఇవి సంభవమయ్యేదెప్పుడు? దైవశాసనానుసారం ఒక వాస్తవిక ఫలితాన్ని ఉనికిలోకి తీసుకురావటానికి అవసరమైన ప్రయత్నాలన్నీ నిజంగా జరిగినప్పుడు!! దైవ ప్రవక్తకైనా, ఆయన అనుచర వర్గానికైనా, మరెవరికైనా సరే ఈ షరతు నుండి ఎలాంటి మినహాయింపులేదు.

# మొదటి భాగం

# ఆదం నుండి ఏసుక్రీస్తు వరకు

దేవుని తరఫున ఎందరు ప్రవక్తలు పంపబడినా వారందరి సందేశం ఒక్కటే, లక్ష్యం ఒక్కటే – జీవిత సత్యాన్ని మానవునికి ఎరుకపరచటం! ప్రస్తుత ప్రాపంచిక జీవితం మానవుని శాశ్విత జీవితానికి ఒక పరీక్షా వ్యవధి మాత్రమే. రమారమి నూరేళ్లు జీవితం గడిపి మనం మన శాశ్విత లోకంలోనికి అడుగుపెడతాము. అక్కడ దైవ విధేయులకు స్వర్గం లభిస్తుంది. దైవధిక్కారుల కొరకు నరకం నిరీక్షిస్తూ ఉంటుంది. ఈ సత్యాన్నే దైవప్రవక్తలు చాటిచెప్పారు.

ఆదం (శివుడు) తొలి మానవుడు మాత్రమే కాదు, తొలి ప్రవక్త కూడాను. ఆయన మొదలుకుని ఏసుక్రీస్తు వరకు నిరంతరం దైవ ప్రవక్తలు ప్రభవిస్తూనే ఉండేవారు. అబూ ఉమామ ఉల్లేఖనం ప్రకారం అబూజర్ గఫ్ఫారీ దైవ ప్రవక్తల సంఖ్యను గురించి ప్రవక్త (స)ను దర్యాప్తు చేయగా "ఒక లక్షా ఇరవై నాగులువేలు – వాళ్లల్లో మూడు వందల పదిహేను మంది 'రసూల్‌లు (సందేశహరులు)గా' నియుక్తులయ్యారు" అని ఆయన (స) సమాధాన మిచ్చారు.దేవుని ఈ ప్రతినిధులు వివిధ జాతులకు, వివిధ జనవాసాలకు ఈ సత్యసందేశం వినిపించారు. దైవానికి భయపడుతూ జీవితం గడపమని ప్రభోధించారు. అయితే మానవుల్లో బహుకొద్ది మంది మాత్రమే తమ క్రియాస్వేచ్ఛను దైవాభీష్టానికి లోబరచడానికి అంగీకరించారు. దైవప్రవక్త యహ్యాకు ఒక్క సహచరుడూ దొరకలేదు. పైగా ఆయన హతమార్చబడ్డారు. లూత్ తన జాతిని వదిలిపెట్టినపుడు ఆయన వెంట ఆయన కుమార్తెలిద్దరూ మాత్రమే మిగిలారు. తోరా గ్రంథం ప్రకారం నూహ్ ఓడలో ఆయన వెంటవచ్చిన వారు ఎనమండుగురు మాత్రమే. దైవ ప్రవక్త అబ్రాహాము తన స్వదేశమైన ఇరాక్ నుండి బయలుదేరినపుడు ఆయనకు చేదోడుగానున్నది ఆయన సతీమణి సారా మరియు అన్నగారి కుమారుడు భ్రాతృజుడు లోతు మాత్రమే. అనంతరం ఆ పయనబృందంలో ఆయన కుమారులైన ఇస్మాయిల్ మరియు ఇస్‌హాఖ్‌లు చేరారు. సకల ప్రయత్నాలు చేసిన మీదట ఏసుక్రీస్తుకు తోడైనది 12 మంది మాత్రమే. వాళ్లు కూడా చివరి ఘడియల్లో ఆయన్ని విడిచిపోయారు. (మత్తయి 26:56)

చాలామంది ప్రవక్తల పరిస్థితి ఇంచుమించు ఇలాగే ఉండినది. కొందరు ఒంటరి పోరాటం సాగించారు. మరికొందరికి గుప్పెడు మంది సహచరులు దొరికారు. ఆ గుప్పెడు మందిలో కూడా చాలా వరకు కుటుంబీకులే. కుటుంబ సంబంధాలను త్రెంచుకోవటం సాధ్యం కాదు గనక గత్యంతరం లేక ప్రవక్తను అనుసరించిన వారే, ప్రవక్తల ఈ స్థితిగతులకు దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్ అద్దం పడుతోంది.

“దాసుల స్థితి కడు శోచనీయం, వారి వద్దకు ఎప్పుడు ఏ ప్రవక్త వచ్చినా వాళ్ళు ఆయన్ని ఎగతాళి చేశారు”. (యాసీన్ 36:30)

దేవుని దృష్టిలో మానవ జాతిలోకెల్లా శ్రేష్ఠులు ప్రవక్తలనబడేవారే. కాని విచిత్రం ఏమిటంటే చరిత్రలో అందరికన్నా ఎక్కువగా నిరాదరణకు గురయ్యిందికూడా వారే. ఉపేక్షించబడినవారు కూడా వీరే, రాజుల, సేనాధిపతుల గాథలను చరిత్ర పుటలు మనసారా స్వీకరించి భద్రపరిచాయి. కాని ఆదం నుడి ఏసుక్రీస్తువరకు ఏ ఒక్క ప్రవక్త కూడా ప్రమాణబద్ధమైన రీతిలో చరిత్రలో చోటు చేసుకోలేదు. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) మోషేకు వెయ్యేళ్ల తరువాత పుట్టాడు. కాని అతనికి మోషే పేరు కూడా తెలియదు. దీనికి కారణం ఏమిటంటే చాలా మంది ప్రవక్తలు ఆయాజాతుల తరఫున నిరాదరణకు లోనయ్యారు. వారి ఇళ్లు వాకిళ్లు కూల్చివేయబడ్డాయి. సమాజంలో వారిని అనామకులుగా పరిగణించటం జరిగింది. ప్రస్తావనకు కూడా అర్హులు కానంత అతి సామాన్యవ్యక్తులుగా చిన్నచూపు చూడడం జరిగింది.

దైవ ప్రవక్తలపట్ల ఈ వైఖరికి కారణం ఏమిటి? అంటే వాళ్లు తమకు శ్రోతలైన జాతులను విమర్శించటం, మనిషి సాధారణంగా ప్రశంశలు, పొగడ్తలను అమితంగా ఇష్టపడతాడు. అలాగే తనపై జరిగే విమర్శలపై ఆగ్రహం చెందుతాడు. ప్రవక్తలు మంచీ చెడులను తప్పొప్పులను స్పష్టంగా విడమరచి చెప్పే వారవటంవల్లనూ, వారు లౌక్యానికి తావివ్వని సంస్కర్తలవటం మూలంగానూ, వారు ప్రజల మూఢ విశ్వాసాలను, ఆచారదురాచారాలను ఎండగట్టే వారవటంవల్ల ఆయాజాతులకు వ్యతిరేకులుగా బద్ధ శత్రువులుగా కానవస్తారు. ప్రవక్తలే గనక లౌక్యాన్ని ప్రదర్శించి ప్రజల మనోభీష్టానికనుగుణంగా ప్రసంగించే వారై ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేదేమో!

సర్వ సాధారణమైన ఈ పరిణామక్రమం నుంచి అతి కొద్దిమంది ప్రవక్తలకు మాత్రమే మినహాయింపు లభించింది. ఉదాహరణకు దావూద్, సులైమాన్, యూసుఫ్‌లు అయితే ఈ మహనీయులకు ఆదరణ, అధికారం లభించినంతమాత్రాన వారి సిద్ధాంతం ప్రజామోదం పొందిందని భావం ఎంతమాత్రం కాదు. దానికి వేరే కారణాలున్నాయి.

దావూద్ ఇశ్రాయేలు చక్రవర్తి అయిన సావుల్ కొలువులో ఒక యువ సైనికుడుగా ఉండేవారు ఆయన కాలంలో ఇశ్రాయేలీయులకు – పాలస్తీనియన్లకు మధ్య యుద్ధం జరిగింది. పాలస్తీ సైనికుల్లో జాలూత్ అనే ఒక అసాధారణ పహిల్వాన్ ఉండేవాడు. అతనితో

తలపడటానికి ఎల్లరూ జంకేవారు. ఆ పహిల్వాన్‌ను ఎదుర్కొని అతన్ని తుదముట్టించిన వారికి తన కుమార్తె నిచ్చి వివాహం చేస్తానని చక్రవర్తి ప్రకటించాడు. దావూద్ ఆ అరవీరభయంకరమైన వ్యక్తిని సవాలుచేసి అతన్ని తుదముట్టించారు. ఆ విధంగా ఆయన ఇస్రాయేలు చక్రవర్తికి అల్లుడైపోయారు. ఆ తరువాత ఒక యుద్ధంలో ఇస్రాయేలు చక్రవర్తి మరియు యువరాజు మరణించడంతో సింహాసనం దావూద్‌కు దక్కింది. ఈయన కుమారుడే సులైమాన్. తండ్రి నుంచి ఈయనకు రాజ్యాధికారం సంక్రమించింది. యూసుఫ్‌కు స్వప్న సారాంశం తెలిపే జ్ఞానం ప్రసాదించబడింది. ఒక సందర్భంగా ఈజిప్టు చక్రవర్తి కన్న కలకు యూసుఫ్ మతలబు వివరించేసరికి బహుదైవారాధకుడైన ఈజిప్టు చక్రవర్తి ప్రభావితుడై తన రాజ్యాధికారం యొక్క ఉన్నతాధికారాలన్నీ ఆయనకు అప్పగించాడు" అయితే రాజు మరియు ప్రజలు మాత్రం యాధాలాపంగా తమ బహుదైవోపాసనా నమ్మకాలనే అంటిపెట్టుకుని ఉన్నారు.

పరిస్థితుల ఈ స్వరూపం మూలంగా అన్ని కాలాల్లోనూ అత్యధిక మంది ప్రజలు దైవమార్గదర్శకత్వపు భాగ్యానికి దూరంగా ఉండిపోయారు. అంతకుమించిన మరోనష్టం ఏమిటంటే దైవప్రవక్తలు దైవం నుంచి తెచ్చిన సందేశాలను, గ్రంథాలను సురక్షితంగా ఉంచే అనుయాయులు కరువైపోయారు. ప్రవక్త తదనందరం ఆయన సందేశాన్ని భద్రపరచగలవారు అనుచరులే. కాని ఆ అనుచరులే కరువైపోవడంవల్ల లేదా ఆ అనుచరులు కూడా మార్గభ్రష్టతకు లోనుకావటం వల్ల దైవ ప్రోక్తమైన గ్రంథాలు సురక్షితంగా ఉండలేకపోయాయి.

ఏ దేవుని జ్ఞానమైతే ఆదినుంచి అంతం వరకు విస్తరించి ఉందో, ఏ దేవుడైతే గతాన్ని తిలకించినట్లే భవిష్యత్కాలాన్ని కూడా తిలకిస్తున్నాడో ఆ దేవునికి మానవత యొక్క ఈ పరిణామం గురించి తెలియదని కాదు, తెలుసు. అందుకే ఆయన నిర్ధారించుకున్నాడు – ప్రవక్తల పరంపరలో చిట్ట చివరన ఒక ప్రత్యేక సందేశ హరుణ్ణి పంపి ధర్మ సందేశంతోపాటు ధర్మాన్ని ప్రతిష్ఠం చేయాలని ఆ ప్రవక్తకు తన ప్రత్యేకసాయం అందించి తద్వారా ప్రజల హృదయాలను జయించేవాడులా చేయాలని, దైవసైన్యాన్ని అతనికి తోడుగా పంపి సత్యతిరస్కారశక్తుల మెడలు వంచాలని. "ఆ విధంగా దైవధర్మానికి శాశ్విత ప్రాతిపదికన బలమైన పునాదుల్ని సమకూర్చాలని ఎట్టకేలకు దేవుడు నిర్ణయించుకున్నాడు. తద్వారా దైవగ్రంధ రక్షణకు పూర్తి బందోబస్తు జరగాలన్నదే దైవాభిమతం. బైబిల్ మాటల్లోనే చెప్పాలంటే; ఏవిధంగానైతే సముద్రం నీటితో నిండి ఉన్నదో అదే విధంగా భూమి దేవుని తేజస్సుతో నిండి ఉండాలి." – (జుఖూఖ్ 14-2)

బైబిల్ సాక్ష్యానుసారం దేవుడు తన ఈ ప్రణాళికను వేలవేల సంవత్సరాల క్రితం నుంచే పలువురు ప్రవక్తల ద్వారా బహిర్గతం చేయసాగాడు. తన నుంచి ప్రత్యేక తోడ్పాటును పొందే 'ఆ ప్రవక్త' అరేబియా ఎడారిలో ఉద్భవిస్తాడనీ, అతడు ఇశ్రాయేలు సంతతి యొక్క మిగతా వంశీయులకు, అంటే వారి సోదర వర్గానికి (బనీ ఇస్మాయీల్) చెందినవాడై ఉంటాడనీ, అతడుఏసుక్రీస్తు అనంతరం వస్తాడనీ, అతని సహచరులు దేవుని తరఫున కొనబడినవారుగా వ్యవహరించబడతారని, వారిని ఎదుర్కొన్న జాతులు తుత్తునియలై పోతాయని, మహాపర్వతాలు (ఈరాన్, రోము సామ్రాజ్యాలు) తలవంచుతాయని, అతని సామ్రాజ్యం కటిక ఎడారులనుంచి సముద్ర ప్రాంతాల వరకూ విస్తరిస్తుందని ముందే భవిష్యవాణి చెప్పివేయబడింది.

ప్రస్తుత బైబిల్ అనేక ప్రక్షిప్తాలు, వ్యాఖ్యలవల్ల సిసలైన బైబిల్ కంటే ఎంతో భిన్నమైనదిగా తయారైనప్పటికినీ నేటికీ దానిలోని అనేక వచనాలు రానున్న ప్రవక్త గురించి స్పష్టంగా సూచిస్తున్న సంగతిని నిష్పాక్షిక దృష్టిగల పాఠకుడు గ్రహిస్తాడు. అసలు ఏసుక్రీస్తు రాకలోని ప్రధాన ఉద్దేశ్యమే రానున్న ప్రవక్త గురించి మానవాళికి, ముఖ్యంగా యూదులకు ఎరుకపరచటం, ఆయన ఏ 'క్రొత్త నిబంధన' గురించి సువార్తత ఇచ్చారో అది వాస్తవానికి ఇస్లామే. అది యూదుల ఉద్వాసన తరువాత బనీ ఇస్మాయీల్ ద్వారా విధించబడింది. బైబిల్ క్రొత్తనిబంధన యొక్క సువార్తే గాని స్వయాన అది కొత్త నిబంధన కాదు.

ప్రవక్తకు ఆరువందల యేండ్ల పూర్వం ప్రభవించారు. ఏసుక్రీస్తు దివ్య ఖుర్ఆన్‌లోని 61వ సూరాలోని ఒక వచనం ప్రకారం ఏసుక్రీస్తు పాలస్తీనాలోని యూదులతో ఇలా అంటారు. "అల్లాహ్ నన్ను రానున్న ఓ ప్రవక్తకు మునుపు ఆయన గురించిన శుభవార్తా హరునిగా చేసి పంపాడు. ఆయన నా తరువాత వస్తాడు. ఆయన పేరు 'అహ్మద్' అయి ఉంటుంది" (సఫ్ 61:6)

అహ్మద్ మరియు ముహమ్మద్‌లు సమభావంగల పదాలు. దీనిఅర్థం "ప్రశంసనీయుడు" బర్నబాస్ బైబిల్‌లో స్పష్టంగా 'ముహమ్మద్' అనే ఉంది. అయితే క్రైస్తవ సోదరులు బర్నబాస్ బైబిల్‌ను ప్రామాణిక గ్రంథంగా భావించరు గనక మేము దాని రెఫరెన్సులు ఇవ్వటం సముచితమనుకోలేదు.

ఇబ్నెఇషామ్ సంకలనం చేసిన ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ (మరణం : 152 హిజ్రీ) ఉల్లేఖనం ప్రకారం బహుశా అది 'మున్‌హమన్నా' అయి ఉండవచ్చు. ప్రవక్త జీవిత చరిత్రను

సంకలనం చేసిన వారిలో ఇబ్నె ఇస్‌హాఖ్ అందరికన్నా ఎక్కువ ప్రామాణిక రచయితగా పేర్కొనబడతారు. ఆయన ఇలా అంటారు : "యోహాను బైబిల్‌లో రాబోయే ప్రవక్త గురించిన భవిష్యవాణిలో అతనిపేరు 'మున్‌హమన్నా' అని చెప్పబడిందని నాకు తెలిపినవాడు అన్నాడు" (తహ్‌జీబ్ సీరత్ ఇబ్నె ఇష్షామ్. సంపుటి-1, పేజి-50) బహుశా ఈ విషయం ఆయనకు తన సమకాలీనులైన పాలస్తీనా క్రైస్తవుల ద్వారా తెలిసి ఉంటుంది. అప్పటికి పాలస్తీనా ప్రాంతం ఇస్లాం రాజ్యాపరిధుల్లోకి వచ్చేసింది. మున్‌హమన్నా అనేది సిరియన్ పదం. "ప్రశంసించబడినవాడు" అని దీని భావం, గతకాలం నుంచి అప్పటివరకూ పాలస్తీనియన్ల భాష సిరియన్ భాష అయి ఉండేది. ఏసుక్రీస్తు మాతృభాషలో పలుకబడిన అసలుపదం 'మున్‌హమన్నా' అయి ఉండవచ్చని ఒక అంచనా. అనంతరం గ్రీకు అనువాదాల్లో అది 'ఫార్ ఖలీత్' అనే మార్పుకు లోనయింది.

## ప్రవక్త ప్రభవం

ఒకవైపు ఆఫ్రికా, మరోవైపు మధ్యాసియా, ఐరోపాల దృష్టిలో అరేబియా ద్వీపానికి భౌగోళికంగా ఎనలేని ప్రాముఖ్యం ఉండేది. అది ప్రాచీన జన ప్రపంచానికి గుండెకాయలాంటిది. కాని ప్రాచీన రాజనీతిజ్ఞుల్లో ఏ ఒక్కడూ ఈ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలుపుకోవటానికి సాహసించలేకపోయాడు. ఏ రాజ్యసైనిక సమూహాలైనా అరేబియా సరిహద్దు ప్రాంతాలైన ఇరాక్, సిరియా, పాలస్తీనా, లెబనాన్ మరియు జోర్డాన్‌ల వరకూ వచ్చి నిలిచిపోయాయి. అక్కడినుంచి ఒక్క అడుగైనా ముందుకు పోయి నజద్ మరియు హిజాజ్ ప్రాంతాన్ని తమ రాజ్యపరిధుల్లో కలుపుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అనుకోలేకపోయాయి. ఎందుకంటే ఈ ప్రాంతానికి మూడువైపులా సముద్రతీరం ఉన్నప్పటికీ అది కటిక ఎడారి ప్రదేశం మాత్రమే. అక్కడి వారికి ఇసుక తుఫానులు తప్ప మరో లాభదాయకమైన స్వరూపం కానరాలేకపోయింది.

అటువంటి నిర్జల లోయలకు కేంద్ర స్థానమైన మక్కాలో ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ బిన్ అబ్దుల్లా జన్మించారు. ఆయన పుట్టుకకు కొన్నాళ్ల క్రితమే ఆయన తండ్రి అయిన అబ్దుల్లా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మరణించారు. ఆయన ఆరవయేటలో అడుగిడేసరికే ఆయన తల్లిగారు కూడా ఈ లోకం నుంచి నిష్క్రమించారు. అనంతరం ఆయన తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్ ఆయన్ని తన సంరక్షణలోకి తీసుకున్నారు. కాని రెండేళ్లకే తాతగారు కూడా కన్నుమూశారు. కడకు ఆయన సంరక్షణా బాధ్యతను ఆయన పినతండ్రి అయిన

అబూతాలిబ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ స్వీకరించారు. అయితే మదీనా వలసకు మూడేళ్ల పూర్వమే – ప్రవక్త (స) అత్యంత క్లిష్టస్థితిలో ఉన్నతరుణంలోనే – పినతండ్రికి కూడా మరణవార్త వచ్చింది.

ప్రకృతి నుంచి ఆయన అపారమైన గుణాలను అపురూప వ్యక్తిత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. చిన్నతనంలో ఆయన్ని చూసినవారు "ఈ పసివాని భవిష్యత్తు ఉజ్వలమైనది" అని ఊహాగానం చేసేవారు. అలీ మాటల్లోనే చెప్పాలంటే ఒకసారి ఆయన్ని చూసినవారంతా ఆయన వ్యక్తిత్వానికి ముగ్ధులయ్యేవారు. ఆయనతో కలసి కూర్చున్న వారంతా ఆయన్ని అమితంగా ప్రేమించేవారు. ఆయన పట్ల వారికి అంతగా గౌరవాభిమానాలున్నప్పటికీ నలభై ఏళ్ల వయసులో ఆయన దైవ ధ్యేయాన్ని వినిపించేసరికి అది వారికి వేళాకోళం అనిపించింది. ఆయన సందేశాన్ని వారు ఎగతాళి చేశారు. "చూడబోతే వాడొక పల్లెటూరి కుర్రాడు, వాడికి ఆకాశం నుంచి దైవవాణి అందుతుందట!" అని గేలిచేశారు.

ఆయన దైవసందేశ వ్యాప్తి కొరకు పాటు పడింది 23 ఏళ్లు మాత్రమే. కాని ఈ అతి స్వల్పగడువులో ఆయన అరబ్బుతెగలలో రగుల్గోల్పిన చైతన్యం అనుపమమైనది. అటువంటి ఉపమానం మానవ చరిత్రలో మరెక్కడా కనిపించదు. ఈ విప్లవం నూరేళ్లకన్నా తక్కువ కాలంలోనే ప్రపంచంలోని అతిపెద్ద సామ్రాజ్యాలైన రోము, ఇరాన్ సామ్రాజ్యాలను చిత్తు చేసింది. ఒకవైపు ఇరాక్ ఇరాన్‌లు మొదలుకుని బుఖారా వరకు, మరోవైపు సిరియా పాలస్తీనాలు మొదలుకుని ఈజిప్టు మరియు ఉత్తర ఆఫ్రికాల వరకు విజయకేతనం ఎగురవేసింది. ఆపైన ఈ విప్లవ వెల్లువ పశ్చిమం వైపుకు ప్రవహించసాగింది. క్రీ.శ. 711లో జిబ్రాల్టర్ మీదుగా సాగిపోతూ స్పెయిన్, పోర్చుగల్‌లలో ప్రవేశించింది. పశ్చిమ ఐరోపాలో ఇస్లాం వాహిని అడుగు పెట్టబోగా క్రీ.శ. 732లో ఫ్రాన్స్ చక్రవర్తి చార్లెస్ కార్టల్ తూర్ అనే చోట నిలువరించాడు. ఆ తరువాత రెండు శతాబ్దాల పాటు శిలువయుద్ధాలు జరిగినా, తాతారీలు నిరంతరాయంగా దండయాత్రలు జరుపుతున్నా – ముస్లింలు తమ అంత: కలహాల మూలంగా స్పెయిన్‌ను కోల్పోకుండా ఉన్నంతవరకూ (15వ శతాబ్దివరకూ) – వారికి ఎవరూ భారీనష్టం కలిగించలేకపోయారు.

ఆ తరువాత ఇస్లాం అంతర్బలం తురుష్కులను, మొగలులను నిలబెట్టింది. తురుష్కులు 1453లో ఇస్లాంబుల్‌ను జయించారు. ఆపైన తూర్పు ఐరోపాలోని యుగోస్లావియా వరకూ చేరుకున్నారు. 1683 వరకూ వియన్నా ముంగిట ఒక టర్కిష్ సైనికపటాలం ఉండేది.

క్రీ.శ. 16వ శతాబ్దిలో మొగలులు భారత ఉపఖండంలోనూ, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోనూ ఇస్లాం అధికారాన్ని నెలకొల్పారు. 13 శతాబ్దాల కృషి ఫలితంగా నేడు ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో ముస్లిములున్నారు. ఆసియా ఆఫ్రికాలు మొదలుకుని ఐరోపా వరకు నాలుగు డజన్ల పైచిలుకు ముస్లిం దేశాల బెల్లురూపొందింది. "మోతమర్ ఆలమెఇస్లాం" సంస్థ ప్రచురించిన అంతర్జాతీయ ముస్లిం గెజిటర్ (1975) ప్రకారం నేడు ప్రపంచం మొత్తంలో ముస్లిం జనాభా 90 కోట్లు.

ఇంతటి పురోగతి ఎలా సాధ్యమైనదంటే, ప్రవక్త ముహమ్మద్ (స) సారధ్యంలో 23 ఏండ్ల స్వల్పకాలంలో అరేబియాలో నిర్వహించబడిన సందేశ కృషి వల్లనేనన్నది నిర్వివాదాంశం. 23 సంవత్సరాల సంక్లిష్ట వ్యవధిలో ఒక మహావిప్లవం పెల్లుబికటం. అది మానవచరిత్రలో శాశ్వతంగా వ్రేళ్లూనుతూ తనదంటూ ఓ నూతన చరిత్రను – శాశ్విత ప్రాతిపదికగల చరిత్రను సృష్టించుకోవటం – ఇదంతా మానవమాత్రుని వల్ల అయ్యేపనికాదు. ఇదొక దైవాంశ వ్యవహారం. ఆయనే ఈ వ్యవహారాన్ని నడిపించాడు. 'బద్ర్' యుద్ధరంగంలో విజయం సాధించి తిరిగివస్తున్న ముస్లిం సేనకు 'రోహా' అనే స్థలంలో కొంతమంది శుభాకాంక్షలు తెలియజేయగా సల్మ బిన్ సలామ ఇలా అభిప్రాయపడ్డారు : "మీరు శుభాభివందనాలు చెప్పేది దేవునికి? దైవ సాక్షి! వాళ్లు కట్టిపడేసిన ఒంటెల్లా ఉండగా మేము వాళ్లను జిబహ్ చేశాము" (తహజీల్ సీరత్ ఇబ్నెఇషామ్ 153)

వివిధ ఆధారాల ద్వారా తెలియవచ్చేదేమిటంటే దేవుడు తన ప్రత్యేక ఏర్పాటు ద్వారా ఆయా పరిస్థితులను ఉత్పన్నం చేశాడు. అరేబియావంటి కటిక ఎడారి ప్రదేశంలో ఒక నికార్సయిన మనుజ జాతిని సమీకరించాడు. కఠోర ఎడారి జీవితం వల్ల ఆ జాతి ప్రజల్లో కల్లాకపటం కానని వ్యక్తిత్వం ఉట్టిపడసాగింది. వాళ్లు స్వీకృతి – తిరస్కృతి మధ్య మరో విషయాన్ని ఎరుగరు. ఒక ఉద్యమ కార్యకర్తకు, యోధుడికి ఉండవలసిన సహజ లక్షణాలన్నీ వారిలో మెండుగా ఉండేవి. మరోవైపు అరబ్బు ద్వీపానికి ఇరువైపులా ఆకాలంలో రెండు మహా సామ్రాజ్యాలుండేవి. వాటి ప్రక్కలో ఓ తృతీయశక్తి ప్రభవించడటం సహజంగానే వాటికిష్ట ముండదు మరి! ఈ మహా సామ్రాజ్యాలు ఆ కొత్త శక్తిని అణచివేయటానికి పూనుకోవటం సహజపరిణామమే. ఈ పరిణామాలే ముస్లింలలో ఆత్మాభిమానాన్ని పెంపొందించి వారిని యోధులుగా తయారు చేయటం, ప్రపంచ విజేతలుగా మలచటం కూడా సహజమే. చెప్పవచ్చిందేమంటే అప్పటి వరకూ ప్రపంచంలో రెండు సూపర్ పవర్లుగా చెలామణి అవుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్న మహా సామ్రాజ్యాల (రోమ, ఈరాన్) పరాక్రమాన్ని

నిలువరించే అవకాశం ముస్లిం సేనలకు లభించింది. ఇస్లామీయ యుద్ధాలు పరాక్రమంతో కూడుకున్నవిగాక ఎదుటివారి పరాక్రమానికి విభిన్నకర పోకడలను సమాధానంగా తీసుకోబడే చర్యలన్నది వాస్తవం. దుష్ట శిక్షణ, శిష్టరక్షణకు ఉద్దేశించిన ఇలాంటి చర్యలు ప్రపంచంలో సర్వదా ధర్మ సమ్మతంగానే భావించబడ్డాయి.

ఈ విధంగా ఒకదాని తరువాత మరొకటి ఉనికిలోకి వచ్చిన అనూహ్య సంఘటనలకున్న ప్రాముఖ్యం కేవలం రాజకీయపరమైనదే కాదు, అంతకు మించిన పరమార్థాలు వాటితో ముడిపడి ఉన్నాయి. ఈ శాంతియుత విప్లవం ద్వారా మూసుకుపోయివున్న మానవ చరిత్ర ద్వారాలు తెరువటం ఒక ప్రధానాశయమై ఉండింది. తద్వారా అప్పటి వరకూ చారిత్రక సత్యంగా రూపొందని సత్యధర్మాన్ని ఓ చారిత్రక సత్యంగా రూపొందించటం, ఖుర్‌ఆన్‌ను శాశ్వితంగా పరిరక్షించేందుకు దోహదపడే ముద్రణా యుగానికి నాందిపలకటం, సత్యధర్మ సందేశకుల మార్గంలోని కృత్రిమ అవరోధాలను తొలగించడానికి తోడ్పడే ప్రజాస్వామిక యుగం రావటం, దైవ ధర్మ వాస్తవికతను హేతువు వెలుగులో నిరూపించడానికి ఉపయోగపడే శాస్త్రీయ పరిశోధనా యుగం మొదలవటం – ఇత్యాది పరమార్థాలు ఈ సంఘటనతో ముడిపడి ఉన్నాయి మరి.

ఈ విప్లవానికి సంబంధించిన ఇంతకన్నా ముఖ్యమైన కోణం ఇంకొకటి ఉంది. అదేమిటంటే అల్లాహ్ తన ప్రవక్త ద్వారా ప్రళయానికి ముందే ప్రళయ దృశ్యాన్ని చూపెట్టాడు. పరలోకంలో శాశ్వితంగా ఆధిక్యతను పొందే సత్యమంతులకు ఈ ప్రపంచంలోనే ఆయన ద్వారా విజయం చేకూర్చాడు. పరలోకంలో కలకాలం పరాభవానికి గురై ఉండే దుర్మార్గులకు ఈ ప్రపంచంలోనే ఆయన చేతిలో పరాజయం పొందేలా చేశాడు.

దేవుని సత్యవంతులైన దాసులు ఇక్కడ సతతం అణిగిమణిగి ఉన్నట్లే కనిపిస్తారు. ఐశ్వర్యాన్ని అధికారాన్ని పూజించే వారికి ఇక్కడ పేరుప్రతిష్టలు ఉంటాయి. ప్రవక్తల, సంస్కర్తల జీవిత చరిత్రల ద్వారా ఈ విషయమే కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. పరిస్థితుల ఈ స్వరూపం నిజస్థితికి పూర్తిగా భిన్నమైంది. ఎందుకంటే ఎట్టకేలకు జరిగేదేమిటంటే దేవుడు తన నికార్సయిన దాసులకు శాశ్విత గౌరవాన్ని, ఆధిక్యాన్ని అనుగ్రహిస్తాడు. మనోవాంఛల దాస్యం చేసి ఇహాన్ని పూజించిన వారిని శాశ్వితమైన అవమానానికి, పరాజయానికి లోనుచేస్తాడు.

ఈ ప్రపంచం పరీక్షా స్థలం. ఇక్కడ ప్రజలకు తాము తలచిందల్లా చేసేందుకు

స్వేచ్ఛ ఉంది. ఇక్కడ దేవుడు ఏ ఒక్కరి చెయ్యినీ పట్టుకోడు. అయితే ఇస్లాం ప్రవక్త ద్వారా దేవుడు పరలోకంలో ఎదురయ్యే శాశ్విత దృశ్యాన్ని సూచనా ప్రాయంగా ఈ ప్రపంచంలో చూపెట్టాడు. ఆయనగారి ఏ ప్రియసహచరులైతే ఇళ్ల నుంచి వెళ్లగొట్టబడ్డారో, ఏ సహచరులకైతే స్వస్థానంలో నిలువనీడలేకుండా చేయబడిందో, ఎవరి ఆర్థిక స్థితైతే కొల్లగొట్టబడిందో, ఏ సహచరులకైతే క్షణం క్షణం భీతావహులై బ్రతికే పరిస్థితి సృష్టించబడిందో – వారికి గౌరవాధికారాల పీఠం వేయబడింది. మరోవంక ధనాధికారాల మదంతో విర్రవీగిన ఖురైషులు, యూదులు, రోములు, ఈరానీయులు, యమనీలు పరాభవపు లోయల్లోకి నెట్టివేయబడ్డారు.

దేవుని తరపున నియుక్తుడై వచ్చిన ప్రతి ప్రవక్తా ధరణిపై దేవుని న్యాయస్థానమవుతాడు. ఆ న్యాయస్థానం ద్వారా దేవుడు పరలోకంలో ఎదురుకానున్న పరిణామాన్ని ప్రకటిస్తాడు. అయితే ఇస్లాం ప్రవక్త (స) ద్వారా ఈ దైవ న్యాయస్థానం ఎటువంటి విశిష్ఠరూపంలో బహిర్గతమైందంటే అది తనంతట తానుగా మానవ చరిత్రలో అంతర్భాగమైపోయింది. అనేక మానవ ప్రయోగాలు చారిత్రక సత్యాలుగా పరిణమించినట్లే ఇది కూడా ఓ చారిత్రక వారసత్వంగా ముద్రవేసుకుంది. దేవుడు ధర్మ నిష్ఠగల తనదాసులను అమితంగా అనుగ్రహిస్తాడు. తలబిరుసుతనం చూపిన వారిని పతనాల లోయల్లోకి నెట్టివేస్తాడన్న సంగతి మానవ మనోఫలకంపై ముద్రవేసింది. స్వర్గ నరకాలు మరో ప్రపంచంలో ఏర్పడే సత్యాలైనప్పటికీ మానవ గుణపాఠం కొరకు దేవుడు ఈ ప్రపంచంలోనే దానికి సంబంధించిన దృశ్యాన్ని చూచాయగా చూపెట్టాడు.

యదార్థానికి దైవ ప్రవక్తగా ముహమ్మద్ (స) ప్రభవం దేవుని దైవత్వపు ప్రభవనానికి ప్రతీకవంటిది. అందుకే బైబిల్‌లో దీనిని "దేవుని సార్వభౌమత్వం"గా అభివర్ణించటం జరిగింది. ఆయన తెచ్చిన నైతిక విప్లవానికి రాజకీయ ప్రాముఖ్యంతో పాటు ఇతరత్రా అనేక ప్రాముఖ్యాలు కూడా ఉన్నాయి. ఆ ప్రాముఖ్యాలలోకెల్లా ముఖ్యమైనదేమంటే అది మనిషికి దేవుని ప్రతాపాన్ని చూపెడుతుంది. అది దేవుని న్యాయస్థాన దృశ్యాన్ని దర్శింపజేస్తుంది. అది యదార్థాలను ప్రళయదినానికి ముందే మనిషి ఎదుట బహిర్గతం చేస్తుంది.

## ఉదార ప్రాయమైన శీలం

ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ (స) క్రీ.శ. 517 ఏప్రిల్ 22వ తేదీన అరేబియాలో జన్మించారు. క్రీ.శ. 632 జూన్ 8వ తేదీన పరమపదించారు. ఆయన అత్యంత ఆరోగ్యవంతునిగా, బలవంతునిగా ఉండేవారు. బాల్యం నుంచీ ఆరోగ్యవంతులే. ఆయన్ని

చూసిన వారంతా "పెద్దవాడయ్యాక ఈయన వ్యక్తిత్వం మరింతగా ఇనుమడిస్తుంది" అని చెప్పుకునేవారు. ఆయన్ని చూసిన వారందరూ ఆయన పట్ల ఆకర్షితులయ్యేవారు. ఆయన మృదుభాషి, ఆయనతో సంభాషించిన వారెవరైనా కొద్దిసేపట్లోనే ఆయనకు సన్నిహితులై పోయేవారు. ఆయన్ని ప్రగాఢంగా ప్రేమించసాగేవారు. సహనం, సత్యం, విషయావగాహన వంటి గుణాలు ఆయనలో నిండుగా ఉండేవి. ఒక్క మాటలో చెప్పాలంటే మనస్తత్వ శాస్త్రం పరిభాషలో ఎవరైతే "సమతూకం గల వ్యక్తిత్వం" (Balanced Personality) అని అంటారో దానికి ఆయన ప్రతిరూపంగా ఉండేవారు. దావూద్ బిన్ హసీన్ ఇలా అంటారు. ముహమ్మద్ బిన్ అబ్దుల్లా సమగ్ర రూపంలో యౌవ్వనస్తుడయ్యాడు. ఆయన తన జాతి ప్రజల్లో అందరికన్నా నీతిమంతుడు, పొరుగువారి యోగక్షేమాలను విచారించేవాడు. మృదు స్వభావి, సత్యసంధుడు, నిజాయితీపరుడు, వివాదాలకు దూరంగా ఉండేవాడు. నీతి బాహ్యతకు, దుర్భాషకు దూరంగా మసలుకునేవాడు అని అరబ్బుజనులు ఆయన గురించి చెప్పుకునేవారు. ఈ కారణంగానే నేమో ఆ జాతివారు ఆయన్ని 'అమీన్' అని సంభోదించేవారు. (ఖసాయసే కుబ్రా : సంపుటి–1, పేజి–91)

25 ఏండ్ల ప్రాయంలో ఆయన వివాహం చేసుకున్నారు. వివాహ సందర్భంగా ఆయన పినతండ్రి అబూతాలిబ్ నికాహ్ ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు.

"నా భ్రాతృజుడైన ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్‌ను ఎవరితో పోటీ బెట్టినా ఇతను సద్వర్తన, సౌశీల్యం, హుందాతనం, నడవడికలో పైచేయి అనిపించుకుంటాడు. దైవసాక్షి! ఇతని భవిష్యత్తు ఉజ్వలమైనది. ఇతని స్థానం ఉన్నతమైనది."

అబూతాలిబ్ పలికిన పలుకులకు అర్థం వేరు. ప్రవక్త ఏ క్షేత్రంలో నెగ్గుకు వచ్చారో దాన్ని దృష్టిలో పెట్టుకుని కాదు, అబూతాలిబ్ వ్యాఖ్యానించింది. ప్రాపంచికంగా ఆయన పేరు ప్రఖ్యాతులు మార్మోగుతాయని, ఆయన అపురూప వ్యక్తిత్వానికి ప్రపంచ విపణిలో పెద్దమూల్యం లభిస్తుందని, జాతి ప్రజలలో ఆయన గౌరవ ప్రదమైన స్థానాన్ని సంపాదిస్తారని అబూతాలిబ్ ఊహించారు.

నిస్సందేహంగా ఇస్లాం ప్రవక్తకు ఈ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆయన తలచుకుంటే తనలోని సుగుణాలకు గాను ప్రాపంచికంగా అతి పెద్ద మూల్యం పొందగలిగేవారు. ఆయన మక్కాలో ఒక ఉన్నత కుటుంబంలో జన్మించారు. ఆయనకు తండ్రి ఆస్తిగా లభించింది. ఒక ఒంటె మరియు ఒక సేవకురాలే అయినప్పటికీ జన్మతః

ఆయనలో గల విశిష్ఠతలు మక్కాలోకెల్లా శ్రీమంతురాలైన ఓ మహిళను ఆకట్టుకున్నాయి. 25 ఏండ్ల వయసులో ఆయన వివాహం ఆమెతో జరిగింది. ఆమె ఒక వాణిజ్య కుటుంబానికి చెందిన వితంతువు. ఆమె ద్వారా ఆయనకు సిరిసంపదలేగాక అరేబియాలోనూ, అరబ్బేతర ప్రపంచంలోనూ గొప్ప వాణిజ్య రంగం ప్రాప్తించింది. ఈ వివాహంతో ఆయనకు సుఖప్రదమైన జీవితం గడిపే మహదవకాశం చేకూరింది. అయితే ఆయన ఈ సుఖసంతోషాలను కాదని వేరొక మార్గాన్ని ఎన్నుకున్నారు. తెలిసీ ఆయన దుర్గమమైన మార్గం వైపుకు సాగిపోయారు. ఆ మార్గంలో ఆయనకు ప్రాపంచికంగా కష్టనష్టాలు తప్ప మరొకటి లభించవు ఖదీజాను పెండ్లాడక పూర్వం ఆయన జరుగుబాటు కోసం కొంత సమయాన్ని కేటాయించేవారు. పరిశ్రమించేవారు. ఇప్పుడు ఆ అవకాశం కూడాలేదు. బాల్యం నుంచీ ఆయనలో ఏ చింతన ఉండేదో దానికోసం ఆయన పూర్తి సమయాన్ని కేటాయించసాగారు. సత్యాన్వేషణలో గంటల తరబడి ఆలోచిస్తూ ఉండేవారు. భూమ్యాకాశాల ఈ అనంత విశ్వవ్యవస్థపై లోతుగా యోచించసాగారు. మక్కాలోని కులీనులతో సంబంధాలు పెంచుకుని వారి సదనాలలో ప్రముఖ స్థానం సంపాయించే అవకాశం ఉన్నప్పటికీ ఆయన కొండలు ఎడారులనే పరిశోధనా కేంద్రాలుగా చేసుకున్నారు. మక్కాకు మూడుమైళ్ల దూరంలో ఒక పర్వత శ్రేణి ఉంది. వాటిల్లో ఒక గుహపేరు హిరా. ఆయన ప్రతిరోజు సత్తు అనే ఆహారపదార్థాన్ని, మంచినీళ్లను తీసుకుని ఆ గుహవైపుకు సాగిపోయేవారు. ప్రశాంతమైన పర్వత ప్రాంతంలో గంభీరంగా సత్యం గురించి శోధించేవారు. భూమ్యాకాశాలను సృష్టించిన వానిని ఆర్ద్రంగా వేడుకుంటూ ఉండేవారు. "ప్రభూ! నీకు నువ్వుగా నాపై సాక్షాత్కరించు. సత్యం ఏమిటో నాకు తెలియజెయ్యి" అన్న పానీయాలు అయిపోయాక తిరిగి ఇంటికి రావటం, వాటిని మోసుకుని మళ్లీ ప్రశాంతమైన పర్వత లోయల్లోకి పోవటం ఆయన దినచర్యగా మారిపోయింది. సత్యం కోసం పరితపిస్తున్న ఆయన జనారణ్యం మధ్య తన ప్రశ్నలకు సమాధానం పొందలేకపోయారు. రణగొణధ్వనులు లేని నిశ్శబ్ద ప్రదేశంలోనే తన ప్రశ్నలకు జవాబు లభిస్తుందన్న ఆశతో దినాలు గడపసాగారు.

యవ్వన శక్తిసామర్థ్యాలతో నిండిన ఒక వ్యక్తి ఈ విధమైన వైర్యానికి ఎన్నుకోవటం మామూలు మాటకాదు. సుఖసంతోషాలను కాదని దుఃఖాన్ని కొనితెచ్చుకునే బాట ఇది. ఆలుబిడ్డలతో హాయిగా గడపటం, వర్తకాన్ని అభివృద్ధిపరచుకోవటం, సొసైటీలో పేరుప్రఖ్యాతుల్ని పెంచుకోవటం – ఇత్యాది అవకాశాలు ఆయన కొరకు వేచి ఉండేవి. కాని సత్యం కోసం తహతహలాడుతున్న ఆయన మనసును ఈ ఆకర్షణలు ఆకట్టుకోలేకపోయాయి. జీవనరహస్యాన్ని కనుగొనేదాకా ప్రపంచంలోని వస్తువులన్నీ ఆయన దృష్టిలో పూచికపుల్లలులాగే

కనిపించాయి. ఈ గోచరవస్తువుల పైన ఏదైనా సత్యం అంటూ ఉంటే అదేది? అనేదాన్ని ఆయన తెలుసుకోవాలని ఆరాటపడేవారు. లాభనష్టాల, సుఖదుఃఖాల పరిభాషలో ఆలోచన చేసేబదులు ఏది సత్యం! ఏది అసత్యం? అన్న సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఉబలాటపడేవారు.

ఇస్లాం ప్రవక్త జీవితంలోని ఈ తహతహ, ఈ కోణాన్ని ఖుర్‌ఆన్ ఇలా చిత్రీకరించింది. జుహా 93:7 ఈ అరబీ వచనంలో 'జుహా' అనే పదం వచ్చింది. 'జుహా' అంటే దారి మరచిన వాడు, తచ్చాడేవాడు అని అర్థం.

దారితప్పిపోయి కలతచెంది దిక్కుతోచక దిక్కులు చూసే బాటసారికొరకు ఈ మాట ఉపయోగించబడుతుంది. అందుచేత ఎడారి ప్రదేశంలో చుట్టుప్రక్కల ఏ వృక్షమూలేకుండా ఒంటరిగా నిలచిఉన్న వృక్షాన్ని, 'జుహా' అనటం జరుగుతుంది. పై ఆయత్‌లోని సారాంశం ఏమిటంటే ఆయన అజ్ఞానపు లోయలో ఒంటరిగా వృక్షం మాదిరిగా నిలుచుని ఉండేవారు. తాను అనుసరించదగిన సత్యం ఏది? అని ఆలోచిస్తూ ఎడారుల్లో, పర్వత లోయల్లో విచారంగా సంచరించేవారు. ప్రపంచ చిత్రపటంలో తన స్థానాన్ని సంపాదించే బదులు దుఃఖ వదనుడై ఏకాంతంలో ధ్యానం చేసేవారు. ఒక్క సత్యం తప్ప మరో వస్తువేదీ తన ఆత్మకు నెమ్మదిని చేకూర్చలేని స్థితికి ఆయన లోనయ్యారు. సత్యపథాన్ని కనుగొనాలనే ఆరాటం ఆయనలో ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే జీవితం ఆయనపాలిట ఒక బరువుగా, నడుం విరిచే భారంగా సాగింది (94:1-8)

ఆ కీలక దశలో దైవకారుణ్యం ఆయన వైపుకు మరలింది. ఆయన కొరకు కాంతిరేఖలు, రుజు మార్గ ద్వారాలు తెరువబడ్డాయి. క్రీ.శ. 610 ఫిబ్రవరి 2వ తేదీన ఆయన హిరాకొండ గుహలో కూర్చొని ఉండగా దైవదూత మానవ రూపంలో ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యారు. దేవుని తరఫున సద్వచనాలను ఆయన చేత చదివించారు. దివ్య ఖుర్‌ఆన్‌లోని 96వ సూరాలో గల మొదటి ఆయత్‌లే ఈ వచనాలు. ఎట్టకేలకు ఆయన పరిశోధన ఆయనలో ఉత్పన్నమైన ప్రశ్నలకు జవాబు ఇచ్చింది.

కలతచెందిన ఇస్లాం ప్రవక్త మనసుకు సకలలోక ప్రభువుతో సంబంధం ఏర్పడింది. దేవుడు ఆయనకు సన్మార్గం చూపటమేగాక ఆయన్ని తన ప్రత్యేక ప్రతినిధిగా ఎన్నుకున్నాడు. ఆయనపై దేవసందేశం అవతరించసాగింది. ఈ దైవ దౌత్యం 23 సం॥ల పాటు కొనసాగింది. ఈ 23 ఏండ్ల వ్యవధిలో దైవగ్రంథం సంపూర్ణ రూపంలో ఆయనపై అవతరించింది.

ఇస్లాం ప్రవక్త తన క్లిష్టమైన జీవితపు 40వ ఏట సత్యాన్ని కనుగొన్నారు. అయితే ఈ సత్యం ఆయనపాలిట నల్లేరుపై నడక కాలేదు. అది ఆయన నుండి భారీమూల్యాన్నే తీసుకుంది. ఈ పరిశోధన తన అశక్తతకు ప్రతిగా దేవుని గొప్పతనాన్ని అంగీకరించటం వంటిది. దేవుని సమక్షంలో తనదంటూ ఏదీ ఏలదు, అంతా దైవానిదేనన్న చేదు వాస్తవాన్ని గుర్తించటం వంటిదే ఈ శోధన. ఈ లోకంలో విశ్వాసి అయిన దాసునికి సతతం బాధ్యతలే తప్ప అతనికి హక్కులంటూ ఏమీ లేదన్న పరమార్థాన్ని జీర్ణించుకోవటమే ఈ పరిశోధన.

సత్యాన్ని కనుగొన్న తర్వాత ఇస్లాం ప్రవక్త దృష్టిలో జీవితం అంటే అర్థం ఏమిటి? దీన్ని తెలుసుకునే నిమిత్తం ఇక్కడ ఒక హదీసును పొందుపరుస్తున్నాయి. ఒకసారి ఆయన ఇలా ప్రవచించారు.

నా ప్రభు నాకు 9 ఆదేశాలిచ్చాడు.

గోప్యంగా ఉన్నా, బహిరంగంగా ఉన్నా ఏ స్థితిలో ఉన్నా నేను దైవానికి భయపడుతూ ఉండాలి.

కోపంలో వున్నా, సంతోషంలో వున్నా నిత్యం న్యాయసమ్మతమైన మాటనే పలకాలి.

లేమిలో వున్నా, కలిమిలో వున్నా రెండు అవస్థలలోనూ నేను సమతూకాన్ని పాటించాలి.

నాకు దూరమయ్యే వాడికి నేను చేరువకావాలి.

నాకు ఇవ్వనివాడికి నేను ఇవ్వాలి.

నన్ను వేధించిన వానిని నేను క్షమించాలి.

నా మౌనం ఆలోచనాత్మకమైన మౌనం అయి ఉండాలి.

నా పలుకులు దైవ నామస్మరణతో కూడిన పలుకులై ఉండాలి.

నా చూపు గుణపాఠం గురిపే చూపు అయి ఉండాలి.

ఇది ఉత్త ప్రసంగం కాదు. కేవలం సుభాషితాలు కూడా కావు. ఇది ఆయన మాటల్లో వ్యక్తమైన ఆయన జీవిత దృక్పథం. ఇంతటి ప్రభావవంతమైన పలుకులు, ఇంతటి పరిపక్వతను సంతరించుకున్న సుభాషితాలు ఒక మామూలు వ్యక్తి నోట వెలువడలేవు. ఈ మాటలు స్వయంగా ప్రవచించే మనిషి స్థాయిని చాటి చెబుతున్నాయి. అవి చెప్పేవాని ఆంతర్యాన్ని కుమ్మరిస్తున్నాయి.

దైవ దౌత్యానికి పూర్వం కూడా ఆయన జీవితం ఇలాంటి సాత్వికజీవితమే అయినప్పటికీ అది ప్రకృతికి ప్రతిగా ఉండేది. ఇప్పుడు సత్యాన్ని కనుగొన్న తరువాత దానికి స్పృహ, చైతన్యం అబ్బాయి. ఏ క్యారెక్టరైతే అప్పటి వరకూ స్వాభావికమైన కోర్కెలకు కట్టుబడి అభివ్యక్తమవుతూ ఉండేదో అది ఆనాటి నుంచీ ఆలోచనలో పండిపోయిన ఒక మేధా సంకల్పంలో అంతర్భాగమైపోయింది. ఏ దైవదాసునికైనా ఇంతటి ఉన్నతమైన స్థానం ఎప్పుడు ప్రాప్తిస్తుంది? అతను ప్రాపంచికమైన తన వాంఛలను కనిష్ఠస్థాయికి అణచుకుని, జీవికై అవసరమైనన్ని కోర్కెలతోనే సంతృప్తి చెందినపుడు! సాధారణ మనుషులకన్నా విలక్షణమైన రీతిలో జీవించసాగినపుడు!! భౌతికంగా తాను ఈలోకంలో జీవిస్తున్నప్పటికీ ఆధ్యాత్మికంగా, మానసికంగా మరొకలోకంలో ఊపిరి పీలుస్తున్నప్పుడు!!!

ఒక ఉల్లేఖనం ప్రకారం ఇస్లాం ప్రవక్త (స) ఇలా ప్రవచించారు.

వివేచనాపరుడైన వ్యక్తిపై కొన్ని ఘడియలు రావటం అనివార్యం. తన ప్రభువుతో సంభాషించే ఘడియలు అతనిపై వస్తాయి. ఆత్మ పరిశీలన చేసుకునే ఘడియలు అతనిపై ఆసన్నమవుతాయి. దైవ సృష్టిపై యోచన చేసే ఘడియలను అతను ఎదుర్కొంటాడు. అన్నపానీయాలకోసం సమయం కేటాయించే ఘడియలు అతనిపై వస్తాయి. (ఇబ్నెహిబ్బాన్)

దేవుని విశ్వసనీయుడైన దాసుడెవడంటే రేయింబవళ్ళలో ఏదో ఒక ఘడియలో కలతచెందిన అతని మనసు అతని ప్రభువుకు సన్నిహితమై ఆయనతో ఊసులాడక తప్పని పరిస్థితిని సృష్టిస్తుంది. లెక్కతీసుకోబడే రోజు గురించిన భయం అతన్ని తరచూ ఆత్మపరిశీలనకై సమాయత్తం చేస్తూ ఉంటుంది. వేరొక సమయంలో అతను విశ్వవ్యవస్థలో సృష్టికర్త కళా విన్యాసాలను చూచి ఉబ్బితబ్బిబ్బవుతుంటాడు. ఆయన కార్య దక్షతను తలచుకుని ఆయనపట్ల కృతజ్ఞతాభావంతో తలవంచుతుంటాడు. ఆవిధంగా అతను దైవంతో, విశ్వమండలంతో, తన ఆత్మతో సమావేశాలు జరిపి కాలక్షేపం చేస్తాడు. ఆపైన అతను అవసరం మేరకు అన్నపానీయాల కోసం కూడా కొంత సమయాన్ని కేటాయించుకుంటాడు.

ఎక్కడో దూరాన ఉన్న మనిషిని పరిచయం చేసే మాటలు కావివి. ఇందులో స్వయంగా ఇస్లాం ప్రవక్త వ్యక్తిత్వం మాట్లాడుతోంది. దీన్ని బట్టి ఆయన శరీరం లోపల వున్న విశ్వాస భరితమైన ఆత్మలో అనుక్షణం ఎలాంటి పెనుతుఫానులు చెలరేగేవో, ఆయన జీవితం ఏ విధమైన "ఘడియ"ల మధ్య గడిచేదో భోధపడుతుంది. యదార్థానికి ఏ వ్యక్తయితే ఇలాంటి ఘడియలను ఖుద్దుగా అనుభవించడో అతనెన్నటికీ ఇంతటి ఉన్నతమైన పలుకుల్ని పలుకలేదు.

ఇస్లాం ప్రవక్తకు దైవవాణి అందక పూర్వ, ప్రస్తుత ప్రపంచంలో వెలితి స్పష్టంగా కనిపించేది. ప్రాపంచిక జీవితానికి ఒక అర్థం లభించేది కాదు. కాని ఈ ప్రపంచం తరువాత మరో ప్రపంచం ఉందని, అది శాశ్వితమైందని, నిత్యమైందని, అదే మనిషి శాశ్విత నివాస స్థావరమన్న సత్యాన్ని దేవుడు ఆయనపై స్పష్టం చేసిన తరువాత ప్రాపంచిక పారలౌకిక జీవితాలు రెండూ ఆయన కొరకు అర్థవంతం అయిపోయాయి. ఇప్పుడు ఆయన జీవికకు అవసరమైన సరైన ప్రాతిపదిక దొరికిపోయింది. తన మనసును లగ్నం చేసి ఏకాగ్రచిత్తంతో పాటుపడేందుకు కావలసిన కేంద్రబిందువు లభించిందాయనకు. తన ఆశలు, ఆశయాలకనుగుణంగా జీవిత పథకాన్ని రూపొందించుకుని సాగిపోయే స్పష్టమైన మార్గం ఆయనకు కానరాసాగింది.

"ప్రపంచం పరలోకపు పంటపొలం" అన్న మాటల సారాంశం ఇదే. ఈ భావాల కనుగుణంగా రూపుదిద్దుకునే జీవితాన్నే నేటి పరిభాషలో "పరలోక ప్రధానమైన జీవితం" (Akhirat Oriented Life) అంటారు. ఇలాంటి మనిషి తన జీవన దృక్పథం దృష్ట్యా పరలోకాన్నే ప్రదానాంశంగా పరిగణిస్తాడు. ప్రంచం తన గమ్యస్థానం కాదని, అదొక మార్గం మాత్రమేనని, అది పరలోక భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు తోడ్పడే తొలిమజిలీ మాత్రమేనని అతను తెలుసుకుంటాడు. ఏ విధంగానైతే ప్రపంచ ప్రధానమైన జీవితం గడిపే ఒక వ్యక్తి కార్యకలాపాలన్నీ ప్రపంచం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయో అదేవిధంగా ఒక దైవదాసుని దృష్టంతా పరలోకంపై కేంద్రీకృతమై ఉంటుంది. ఏ వ్యవహారం ఎదురైనా పారలౌకికంగా దాని పర్యవసానం ఎలా ఉంటుందనే అతను ఆలోచిస్తాడు. సంతోషమైనా, దుఃఖమైన, సాఫల్యమైనా, వైఫల్యమైనా, ఒత్తిడితో కూడినదైనా, స్వచ్ఛయుతమైనదైనా, ప్రశంసలెదురైనా విమర్శలెదురైనా, కోపగించుకునేటప్పుడైనా, మెచ్చుకునేటప్పుడైనా – సర్వకాల సర్వావస్థల్లో పరలోక చింతనే అతనికి మార్గదర్శి అయి ఉంటుంది. ఆ విధంగా క్రమక్రమంగా పరలోకచింతనలో తన్నుతాను మరచిపోతాడు. అప్పటికీ అతను మానవ మాత్రుడేననుకోండి, కాని అతని ఆలోచనలు ఎంతసేపటికీ పరలోకంతోనే ముడిపడి ఉంటాయి. పరలోకంతో సంబంధంలేని కార్యకలాపాలను అతను దాదాపు త్యజిస్తాడు.

ఎవరైనా ఈ స్థాయికి చేరారంటే అది కేవలం ఒక శాస్త్రీయ పరిశోధన మాత్రమే కాదు. అది అంతకన్నా గొప్పది. దాన్ని పొందిన మీదట మనిషి జీవిత విధానమే మారిపోతుంది. ప్రమాణాలే మారిపోతాయి. దీనికొక అత్యుత్తమ ఉదాహరణ ఇస్లాం ప్రవక్త వ్యక్తిత్వమే. ఆయన జీవితం ద్వారా లభించే ఒక గొప్ప గుణపాఠం ఏమిటంటే మనిషి

జీవన ప్రాతిపదికను మార్చుకోనంత వరకూ అతని ఆచరణా తీరు కూడా మారదు.

ఇస్లాం ప్రవక్త ఈ యదార్థాన్ని కనుగొన్న తరువాత అది ఆయన యావజ్జీవితపు అత్యంత ప్రధానాంశం అయిపోయింది. ఏ సర్గలోకపు శుభవార్తనైతే ఆయన జనులకు వినిపించేవారో దాన్ని ఆయన అందరికన్నా ఎక్కువగా ఆశించేవారు. ఏ నరకం గురించి ఇతరులను హెచ్చరించేవారో ఆ నరకానికి ఆయన అందరికన్నా ఎక్కువగా భయపడేవారు. ఆయన అంతరంగంలోని ఈ తుఫాను మాటిమాటికీ దైవసన్నిధిలో వేడుకోళ్ళు, క్షమాపణకై పురుకొల్పుతూ ఉండేది. ఆయన జీవిత విధానం సాధారణ మనుషులకన్నా విలక్షణంగా ఉండేదన్న దాన్ని తెలుసుకునే నిమిత్తం కొన్ని సంఘటనలు పొందుపరుస్తున్నాయి.

"ఉమ్మెసల్మ తెలియజేస్తున్నారు - దైవప్రవక్త తన ఇంట ఉన్నారు. ఆయన తన సేవకురాలిని పిలిచారు. కాని ఆమె ఆలస్యంగా వచ్చింది. ఆయన మోముపై ఆగ్రహం వ్యక్తమైంది. ఉమ్మెసల్మ పరదా వద్దకెళ్ళి చూస్తే ఆ సేవకురాలు బయట ఆడుకుంటోంది. ఆ సమయంలో ఆయన దగ్గర ఒక పసుదోము పుల్ల ఉంది. ఆయన తన సేవకురాలినుద్దేశ్యించి, 'తీర్పుదినాన నాకు ప్రతిఫలానికి సంబంధించిన భయంలేని పక్షంలో నిన్ను ఈ పుల్లతో కొట్టి ఉండేవాణ్ణి' అని మందలించారు.

బద్ర్ యుద్ధరంగం (రమజాన్, హిజ్రీ-2)లో చేజిక్కిన యుద్ధ ఖైదీలందరూ ఆయనకు బద్ధ శత్రువులే. కాని ఆయన వారి యెడల ఎంతో మర్యాదగా ప్రవర్తించారు. ఆ ఖైదీలలో ఒకడు సుహైల్ బిన్ అమర్. అతను గొప్పవక్త. జనులనుద్దేశ్యించి ప్రవక్తపై లేనిపోని నిందలుమోపుతుండేవాడు. అతని నోట్లోనుంచి కిందివరుస పండ్లు రెండు తీసివేయాలని ఉమర్ సలహా ఇచ్చారు. ఆవిధంగా అతని వాగ్ధాటి కొంత క్షీణిస్తుందని ఆయన ఉద్దేశ్యం. ఇది విన్న ప్రవక్త ఇలా అన్నారు.

"నేను గనక ఈ చర్య తీసుకుంటే దేవుడు తీర్పుదినాన నా ఆకారాన్ని మార్చేస్తాడు. నేను దైవప్రవక్త అయినంతమాత్రాన ఈ చర్యను దేవుడు సహించలేడు."

దైవ ప్రవక్త సాధారణ మనుషుల్లాంటి ఒక మనిషే. సంతోష వార్తవిని ఆయనకు సంతోషం కలిగేది. దుర్వార్త విని ఆయన దుఃఖ వదనులయ్యేవారు. అయితే ఆయనలోని దాస్య భావం ఆయన్ని దేవుడు నిర్ణయించిన హద్దుల్ని దాటి పోనిచ్చేదికాదు.

ఇస్లాం ప్రవక్త చివరికాలంలో ఆయనకు మారియ ఖిబ్‌తియ ద్వారా ఒక పిల్లవాడు పుట్టాడు. ఆ పిల్లవాడు చాలా అందంగా, ఆరోగ్యంగా ఉండేవాడు. ఆ పిల్లవానికి ఆయన ప్రవక్తల పితామహుడైన అబ్రాహాము పేరు పెట్టుకున్నారు. అబ్రాహాము పుట్టిన శుభవార్తను అబూరాఫె వినిపించినపుడు ఆయన అమితంగా సంతోషించి అబూరాఫెకు ఒక బానిసను బహూకరించారు. ఆయన అబ్రాహామును ఎత్తుకుని ముద్దాడేవారు. అరబ్బు ఆచారం ప్రకారం అబ్రాహాముకు పాలుత్రాపే నిమిత్తం ఒక అన్సారీ ఆయాకు అప్పగించటం జరిగింది. ఈ ఆయా ఒక కంసాలి భార్య. ఆమె ఇంట్లో ఎప్పుడూ పొగవస్తూ ఉండేది. ఆయన అత్యంత సున్నిత స్వభావులై ఆ పొగ దాటిని సహించేవారు. ఏడాదిన్నర వయసుకు చేరగానే ఆ పసివాడు – హిజ్రీ 10వ సంవత్సరంలో – (జనవరి 632) చనిపోయాడు. కొడుకు మరణాన్ని చూచి ఆయన విలపించసాగారు.

ఈ సంఘటనల్లో ప్రవక్త ఒక సాధారణ మనిషిలాగే కానవస్తున్నారు. ఆయన భావాలు, అనుభూతులు ఒక మామూలు తండ్రి భావాలనే పోలిఉన్నాయి. అయినప్పటికీ ఆయనకు దైవంతో విడిపోని బంధం ఏర్పడి ఉంది. ఆ దుఃఖ సమయంలోనూ ఆయన నోట ఈ పలుకులు వెలువడ్డాయి.

“దైవసాక్షి! ఓ అబ్రహాము నీ మరణంతో నేను దుఃఖానికి లోనయ్యాను. నా నయనాలు వర్షిస్తున్నాయి. మనసు ఖేదపడుతోంది. కాని ఈ స్థితిలో కూడా నేను నా ప్రభువుకు అయిష్టకరమైన మాట ఏదీ అనలేను”

అబ్రాహాము మరణించిన రోజునే యాదృచ్ఛికంగా సూర్యగ్రహణం పట్టింది. మహనీయులు మరణించినప్పుడే సూర్యగ్రహణంగానీ, చంద్రగ్రహణం గానీ పడుతుందని పూర్వం ఒక మూఢనమ్మకం ఉండేది. ప్రవక్త పుత్రుని మరణం మూలంగా ఈ సూర్య గ్రహణం పట్టిందని మదీనాలోని ముస్లిములు చెప్పుకోసాగారు. ఈ విషయం తెలుసుకుని దైవ ప్రవక్త కలతచెందారు. ఎందుకంటే ఈ ఆలోచన వినమ్రతా భావానికి విరుద్ధమైనది. ఆయన సహచరులను సమావేశపరచి ఇలా ప్రభోదించారు.

‘‘సూర్యచంద్రగ్రహణాల్లో మానవ మరణాల ప్రమేయం ఏదీలేదు. అవి దైవనిదర్శనాలలో రెండు నిదర్శనాలు మాత్రమే. మీరెప్పుడైనా ఇలాంటి వాటిని చూసినపుడు నమాజ్ చేయండి.’’

ఆయనకు సంబంధించిన ఒక సంఘటనను చరిత్ర

“ఒకసారి ఆయన తన సహచరులతో కలసి ప్రయాణం చేస్తున్నారు. ఒకరోజు తన సహచరులనుద్దేశ్యించి వేట మాంసం తయారుచేయమని ఆదేశించారు. తాను మేకను జిబహ్ చేస్తానని ఒకవ్యక్తి అన్నాడు. చర్మం వలిచే పనిని తాను చేబడతానని మరోవ్యక్తి చెప్పాడు. వంటచేసే పని తనదంటూ మూడోవ్యక్తి ముందుకువచ్చాడు. కట్టెలు ప్రోగుచేసే పని తాను తీసుకుంటానని దైవప్రవక్త (స) చెప్పారు. “దైవప్రక్తా! మీకెందుకు శ్రమ! పనంతామేము చేసుకోగలం” అని సహచరులు అభిప్రాయపడగా దైవప్రవక్త (స) ఇలా అన్నారు. మీరు చేసుకోగలరని నాకు తెలుసు. కాని ప్రత్యేకతను నేను ఇష్టపడను. దైవదాసుడెవరైనా తన సహచరుల మధ్య ప్రత్యేకతను సంతరించుకోవటాన్ని దేవుడు ఇష్టపడడు.”

ఆయనలోని అణకువకు, ఆశక్తతకు ఒక ఉదాహరణ ఆయనగారి ఈ ప్రవచనం.

“దైవసాక్షి! నాకు తెలియదు. దైవసాక్షి! నాకు తెలియదు. నేను దేవుని సందేశ హరుడైనప్పటికీ నా పట్ల ఎలా వ్యవహరించబడుతుందో, మీ పట్ల ఏ వ్యవహారం జరుగుతుందో నాకు తెలియదు.”

అబూజర్ గిఫ్ఫారీ తెలుపుతున్నారు – ఒకరోజు నేను ఒక ముస్లిం సహచరుడు ఇంట కూర్చొని ఉన్నాను. ఆయన నల్లగా ఉండేవాడు. ఏదో అవసరం వచ్చినేనాయన్ని పిలవగా నానోట ఈమాట వెలువడింది : ఏమయ్యా నల్లవాడా!

ఈ సంగతి ప్రవక్తకు తెలియగానే ఎంతో అయిష్టతను వ్యక్తం చేశారు. ఇలా అన్నారు : “కొలిస్తే పూర్తిగా కొలవు. పూర్తిగా కొలవు.”

అంటే అందరినీ ఒకే కొలమానంతో ఇవ్వండి. కొందరిని గౌరవ వచనాలతో సంబోధించి, మరికొందరిని అల్పమైన మాటలతో పిలవటం చేయరాదు. మనిషీ – మనిషీ మధ్య విచక్షణ చూపరాదని దీనిభావం. అనంతరం ఆయన ఇలా ప్రవచించారు.

ఏ తెల్లవానికీ మరో నల్లవానిపై ఎటువంటి ఆధిక్యత లేదు. ఇలా హెచ్చరించేసరికి ఆయన కటికనేలపై పడిపోయారు. అంతకుముందు తాను కించపరచిన వ్యక్తినుద్దేశ్యించి నీ కాళ్లతో నా ముఖాన్ని త్రొక్కెయ్యక” చూస్తూ నిలబడ్డావా! అని అన్నారు.

ఒకసారి దైవప్రవక్త ఒక శ్రీమంతుడైన ముస్లింను చూశారు. అతను తన ప్రక్కన కూర్చున్న ఒక పేదముస్లిం బారినుండి తప్పించుకోవటానికి నానా అవస్థలు పడుతున్నాడు. తన శరీర దుస్తువులను సర్దుకుంటున్నాడు. ఆయన (స) ఇలా అన్నారు.

"ఏం? అతని దారిద్ర్యం నిన్ను చుట్టుముట్టేస్తుందని భయపడుతున్నావా?".

మదీనాలో పూర్తిస్థాయిలో రాజ్యస్థాపన జరిగిపోయింది. ప్రవక్త ఆ రాజ్యానికి ఉన్నతాధికారిగా ఉన్నారు. ఆ రోజుల్లోనే ఆయన ఒకసారి ఒక యూదుని వద్ద కొంత మొత్తం అప్పు తీసుకోవాల్సివచ్చింది. ఆయూద వ్యక్తిపేరు జైద్ బిన్ సానా. అప్పు చెల్లించటానికి నిర్ణయించబడిన గడువు పూర్తిగాకముందే వచ్చి అతను డిమాండు చేయసాగాడు. వాడు ఆయన్ని పట్టుకుని "నా అప్పు చెల్లిస్తావా లేదా?" అన్నాడు. "అబ్దుల్ ముత్తలిబ్ సంతానమంతా ఎగ్గొట్టేరకం" అని కించపరిచాడు.

ఆ సమయంలో ఉమర్ ఫారూఖ్ కూడా అక్కడే వున్నారు. యూదుని దురుసువైఖరిపై ఆయనకు అమితమైన కోపం వచ్చింది. ఆయన అతన్ని హెచ్చరించారు. ఆయన వాలకం చూడబోతే యూదునిపై చేయిచేసుకునేలా ఉన్నారు. కాని ఇస్లాం ప్రవక్త ముఖంపై చిరునవ్వు చెదరలేదు. ఆ రుణదాతనుద్దేశ్యించి, "గడువుముగియడానికి ఇంకా మూడురోజులు మిగిలివున్నాయి కదా!" అన్నారు. మరోవంక సహచరుడైన ఉమర్‌తో ఇలా అన్నారు.

"ఉమర్! నేనైనా, ఈ యూదుడైనా మీనుండి మరొకటి ఆశించాము. (మీరిలా ఆవేశపడే బదులు) అప్పుచెల్లించమని నన్ను కోరి ఉండాల్సింది. అడిగేదేదో కాస్త మంచి పద్ధతిలో అడుగు అని అతనితో అంటే సరిపోయేది".

ఆ తరువాత ఉమర్‌ను ఆదేశిస్తూ ఇలా అన్నారు. "వెళ్ళండి, ఫలానా వ్యక్తి నుండి ఖర్జూరపుపండ్లు తీసుకొచ్చి ఇతని అప్పుచెల్లించండి. లెక్కకంటే మరో 20 డబ్బాల (సుమారు 40 కిలోలు) అధనంగా ఇవ్వండి. ఎందుకంటే మీరు ఇతన్ని కోప్పడ్డారు".

ఇస్లాం ప్రవక్తకు ఎంత గొప్ప విజయం ప్రాప్తించిందంటే ఆయన అరేబియా నుండి పాలస్తీనా వరకు గల ప్రాంతానికి రాజ్యాధికారి అయ్యారు. దైవ ప్రవక్త అయిన కారణంగా ఆయన నోట వెలువడే ఒక్కోవాక్కు చట్టస్థాయిని కలిగి ఉండేది. తన పట్ల అపూర్వమైన ఆదరాభిమానాలు, భక్తీ ప్రవత్తులు కలిగివున్న సహచరుల మధ్య ఆయన నివసించేవారు. హుదైబియా సంధి సంప్రతింపుల సందర్భంగా ఉర్వ బిన్ మస్‌వూద్ ఖురైష్ ప్రతినిధిగా వచ్చి అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్య చకితులయ్యారు. ఆయన 'వుజూ' చేస్తుంటే శిష్యులు నలువైపుల నుంచీ ఎగబడి నీటిచుక్కలు క్రింతపడనీయటం లేదు. ఆ నీటిని పరమపావనమైన నీరుగా తీసుకుని తమ శరీరాలకు పూసుకుంటున్నారు శిష్యులు. "అత్యంత ప్రేమాభిమానాలు ఉన్నప్పటికీ మేము దైవ ప్రవక్తను తనివి తీరా చూడలేకపోయేవాళ్లం" అని అంటారు అనస్.

ఎవరైనా సహచరుడు ప్రవక్త ఇంటికెళ్ళి తలుపుతట్టవలసివస్తే అతను చేత్తోగాక గోటితో తలుపు తట్టేవాడని ముగైరా చెప్పారు. జాబిర్ బిన్ సమ్ర కథనం ప్రకారం ఒకసారి ప్రవక్త ఎర్రని దుప్పటి కప్పుకుని వెన్నెలలో పండుకుని ఉన్నారు. 'నేను ఒకసారి చంద్రుణ్ణి మరోసారి ఆయన్ని చూడసాగాను. ఆఖరికి చంద్రుని కన్నా ఆయనే అందంగా ఉన్నారన్న నిర్ణయానికి వచ్చాను' అంటారాయన. హునైన పోరాటంలో తొలుత ముస్లిం సేనలకు ఓటమి ఎదురైంది. ఆ సమయంలో శత్రుసేనలు ఆయన (స)పై బాణవర్షం కురిపించసాగితే సహచరులు ఆయనచుట్టూ అడ్డుగోడలా నిలిచి ఆ బాణాలకు ఆహుతి అయ్యారు. ఆ బాణాలు తగిలిన సహచరులను చూస్తే వారు ముళ్ళవృక్షాల్లా కానరాసాగారు. కాని ప్రవక్త శరీరాన్ని ఒక్కబాణం కూడా తాకకుండా జాగ్రత్తపడ్డారు.

ఈ రకమైన భక్తీ విశ్వాసాలు మనిషి స్వభావాన్ని మార్చేస్తాయి. తనపట్ల గల ఈ ఆదరాభిమానాలను చూచి మనిషి తాను ఇతరులకన్నా అధికుడినని తలపోస్తాడు. అయితే ఆయన మాత్రం జనుల మధ్య ఒకసాధారణ మనిషి లాగానే ఉండేవారు. ఆయన గురించి పరనిందచేసేవాడు గాని, వీపువెనుక విమర్శలు చేసేవాడుగాని ఉండడు. సహీ హదీసు గ్రంథంలో అనస్‌గారి ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక పల్లెటూరి బైతువచ్చి ఆయన దుప్పటిని విసురుగా లాగాడు. తత్కారణంగా ఆయన మెడపై ఒడుసుకుపోయిన గుర్తుపడింది. పైగా ఆ పల్లెటూరివాడు ఇలా అన్నాడు. ముహమ్మద్! ఈ రెండు ఒంటెలు నావి. వీటి వీపుల పైనున్నది కూడా నా కివ్వు. ఎందుకంటే ఈ సొమ్ము నీది కాదు, నీ అబ్బదీకాదు". దానికాయన "అతను ఈ సొమ్ము వాస్తవానికి అల్లాహ్‌ది. నేను ఆయన దాసుణ్ణి" అని బదులిచ్చారు. తరువాత ఇలా అన్నారు. "అవును, నువ్వు నా యెడల ఇంతదురుసుగా వ్యవహరిస్తున్నావు. నీకు భయభక్తులు లేవా?" 'లేవు' అన్నాడతను. "ఎందుకనీ?" అని ఆయన ప్రశ్నించగా, 'నువ్వు చేత్తో ఎదుర్కోవు అన్న సంగతి నాకు బాగాతెలుసు' అని జవాబిచ్చాడు ఆ పల్లెటూరివాడు. దానికాయన నవ్వేసి ఈ వ్యక్తికి ఒక ఒంటె మోసినన్ని గోదుమలు, ఒక ఒంటె మోయగలిగినన్ని ఖర్జూరపు పండ్లు ఇచ్చి పంపండి అని సహచరులకు ఆదేశించారు.

ఆయన (స)లో దైవభీతి ఎంత అధికంగా ఉండేదంటే అనుక్షణం ఆయనలో అణకువ, దైవదాస్యభావం తొణకిసలాడుతూ ఉండేవి. చాలా తక్కువగా మాట్లాడేవారు. నడిస్తే వినమ్రులై నడిచేవారు. విమర్శలపై విసుగు ప్రదర్శించేవారు కారు. దుస్తులు ధరించినపుడు "నేను దేవుని దాసుణ్ణి, దాసుల మాదిరిగానే దుస్తులు ధరించాను" అని అంటూ ఉండేవారు. అన్నం తినేటప్పుడు ఎంతో సంస్కారవంతంగా కూర్చుని, దాసులమాదిరిగా తింటున్నాను అని చెప్పి తినేవారు.

ఈ విషయం (దైవదాస్యభావన)లో ఆయన చాలా సెన్సెటివ్‌గా ఉండేవారు. ఒకసారి ఆయన సహచరుడొకడు ఏదో విషయంలో ఆయన్ని ఉద్దేశించి, "అల్లాహ్ మరియు తమరు తలచుకుంటే..." అని అనబోతుండగా ప్రవక్త గారి ముఖంపై రంగుమారిపోయింది. కలతచెందిన మనసుతో ఆయన ఇలా అన్నారు. "ఏమిటీ, మీరు నన్ను అల్లాహ్‌తో సమానుణ్ణి చేస్తున్నారా? మీరు అలా చెప్పేబదులు "ఒక్కడైన అల్లాహ్ తలచుకుంటే" అని చెప్పి ఉండాల్సింది.

అలాగే వేరొక సహచరుడు ఆయన్నుద్దేశ్యించి ఇలా అన్నారు.

"ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పట్ల విధేయత కలిగి ఉంటాడో అతను సన్మార్గంపై ఉన్నాడు మరెవడైతే వీరిరువురి యెడల అవిధేయత కనబరుస్తాడో అతడు మార్గ భ్రష్టుడయ్యాడు".

ఆయన (స) ఇది విని, 'నువ్వు జాతిని పెడత్రోవ పట్టించే వక్తవు' అని చెప్పారు. అల్లాహ్ మరియు ప్రవక్తను ఒకే వరుసలో నిలబెట్టడాన్ని ఆయన ఇష్టపడలేదు.

ఇస్లాం ప్రవక్తకు ముగ్గురు కుమారులు పుట్టారు. ముగ్గురూ బాల్యంలోనే మరణించారు. నలుగురు కుమార్తెలు మాత్రం యుక్త వయస్సుకు చేరారు. వీరు నలుగురు ఆయన మొదటి ధర్మపత్ని ఖదీజాతో ఫాతిమా అందరికన్నా చిన్న కూతురు. ఆయన ఫాతిమాను అమితంగా ప్రేమించేవారు. ప్రయాణం నుంచి ఎప్పుడైనా తిరిగివస్తే తొలుత మస్జిద్‌లో రెండు రకాతుల నమాజ్‌చేసి ఆ తరువాత నేరుగా ఫాతిమా ఇంటికి వెళ్ళేవారు. ఆమె నుదుటిని, చేతులను ముద్దాడేవారు. 'ప్రవక్తకు అందరికన్నా ప్రియమైన వారెవరు?' అని జుమై బిన్ ఉమైర్ ఆయిషాను అడగ్గా "ఫాతిమా" అని ఆమె సమాధానమిచ్చారు.

అయితే ఇస్లాం ప్రవక్తగారి జీవితమంతా పరలోక ప్రధానమైన జీవితంగా ఉండేది. అందుచేత కన్నపిల్లల పట్ల ఆయనకు గల ప్రేమ కూడా ద్వితీయ శ్రేణికి చెందిందే అనాలి. సహీహ్ హదీసుల్లోని ఒక ఉల్లేఖనం ప్రకారం అలీ ముర్తుజా ఒకసారి ఇబ్నె అబ్దుల్ వాహెద్‌నుద్దేశ్యించి "దైవప్రవక్త అత్యంత ప్రియమైన ఆయన కూతురు ఫాతిమాకు సంబంధించిన ఒక సంఘటన నీకు వినిపించనా?" అన్నారు. 'సరే' అన్నారు ఇబ్నె వాహెద్.

అలీ ఇలా అన్నారు – "ఫాతిమా పరిస్థితి ఎటువంటిదంటే ఆమె తిరుగలి తిప్పితే ఆమె చేతులు కాయలుకాసేవి. నీళ్ళ తిత్తులు మోసిమోసి భుజంపై గుర్తులు పడిపోయేవి. వాకిలి ఊడ్చితే ఆమె దుస్తులపై దుమ్ము ధూళి పేరుకుపోయేది. సరిగ్గా ఆ రోజుల్లోనే

ప్రవక్త వద్దకు కొంతమంది సేవకులు (విజయప్రాప్తిగా) తేబడ్డారు. నేను ఫాతిమానుద్దేశ్యించి, 'నువ్వు నీ నాన్నగారి దగ్గరకెళ్ళి ఒక నౌకరును ఇవ్వమని అడగరాదూ!' అని సలహా ఇచ్చాను. ఫాతిమా వెళ్ళింది. కాని అక్కడ జన సందోహం ఉండటంతో అగడలేక వచ్చేసింది ఫాతిమా. మరునాడు ప్రవక్త స్వయంగా ఇంటికివచ్చి "నీకు ఏం అవసరం పడిందమ్మా" అని అడిగారు. ఫాతిమాకు నోరు పెగలలేదు. అసలు సంగతిని నేను వివరించాను. నా సలహాపైనే ఫాతిమ అక్కడికి వచ్చిందని అన్నాను. ఇది విన్న తరువాత ఆయన (సఅసం) ఇలా సెలవిచ్చారు.

"ఓ ఫాతిమా! దైవానికి భయపడు. నీ ప్రభువు విధించిన విద్యుక్త ధర్మాలను నిర్వర్తించు. నీ ఇంటివారి పనులు చేయి. పడకపై విశ్రమించబోయినపుడు 33 సార్లు దేవుని పవిత్రతను కొనియాడు. 33 సార్లు దైవ స్తోత్రం చేయి. 34 సార్లు దేవుని ఔన్నత్యాన్ని చాటిచెప్పు. ఇవి మొత్తం వంద అవుతాయి. ఇవి నీ పాలిట నౌకరుకన్నా ఉత్తమమైనవి."

ఈ పలుకులు విన్నంతనే ఫాతిమ ఇలా అన్నారు. "ఈ విషయమై నేను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతో రాజీపడుతున్నాను".

ఇస్లాం ప్రపక్తపై బహిర్గతం చెయ్యబడిన సత్యం ఏమిటంటే, "దైవం లేకుండా ఈ విశ్వం లేదు. దీనికొక దేవుడున్నాడు. ఆయనే దీన్ని పుట్టించాడు. ఆయనే దీనికి యజమాని. మానవులంతా ఆయన దాసులే. అందరూ ఆయన ఎదుట జవాబు చెప్పుకోవలసి ఉంది. మరణానంతరం మనిషి అంతమైపోడు మరో ప్రపంచంలో తన శాశ్విత జీవితాన్ని గడిపే నిమిత్తం దాఖలవుతాడు. అక్కడ మంచివారికి స్వర్గ సౌఖ్యాలున్నాయి. దుర్మార్గులకొరకు నరకాగ్ని వేచి ఉంది."

ఈ సత్యాన్ని ఆయనకు ప్రసాదించిన దేవుడు సమస్త మానవాళికి దీన్ని అందజేయమని కూడా ఆదేశించాడు. మక్కా నగరానికి అంచున 'సఫా' అనే కొండ ఒకటి ఉండేది. ఆ కొండరాయి ఆ కాలంలో అక్కడి ప్రజలకు ఉపన్యాసవేదికగా ఉపయోగపడేది. ఆయన (స) సఫా కొండపై కెక్కి మక్కా జనులను ఎలుగెత్తి పిలిచారు. జనులు సమావేశమైన మీదట ఆయన ఉపన్యసించారు. దైవస్తోత్రానంతరం ఆయన ఇలా ప్రకటించారు.

"దైవ సాక్షి! ఏవిధంగానైతే మీరు నిద్రపోతారో అలాగే మారు మరణించవలసి ఉంది. ఏవిధంగానైతే మీరు మేల్కొంటారో ఆ విధంగానే తిరిగి లేపబడతారు. మీరు చేసే దానిపై తప్పకుండా మీ నుండి లెక్కతీసుకోబడుతుంది. ఆపైన సత్కార్యాలకు సత్ఫలితం, దుష్కార్యాలకు దుష్ఫలితం లభిస్తుంది. ఆ తరువాత శాశ్వితమైన స్వర్గవనాలలో లేక ఎల్లకాలానికి

గాను నరకాగ్నినో చవిచూడవలసి ఉంటుంది.”

కాలానికి వ్యతిరేకంగా మనిషి ఏదైనా విధానాన్ని వ్యక్తిగతంగా అనుసరించగోరితే అడుగడుగునా అతనికి అవరోధాలు ఎదురవుతాయి. అయితే ఈ అవరోధాలు అంత తీవ్రస్థాయిలో ఉండవు. ఈ అవరోధాలు మనిషి భావాలను, ఆలోచనలను కృంగతీస్తాయే తప్ప శారీరకంగా మనిషిని గాయపరచేటంత తీవ్రస్థాయిలో ఉండవు. కాని మనిషి కాలానికి, ఆచార వ్యవహారాలకు వ్యతిరేకంగా నినదించిపుడు, ఒక సంస్కర్తగా సందేశప్రదాతగా నిలబడినపుడు పరిస్థితుల స్వరూపం పూర్తిగా మారిపోతుంది. ఇస్లాం ప్రవక్త కేవలం విశ్వాసి అయిన దైవదాసుడు మాత్రమేకారు. దైవ సందేశాన్ని ఇతరులకు పరిచయం చేసే బాధ్యత కూడా ఆయనపై మోపబడింది. ఆయనగారి ఈ రెండవ స్థాయి ఆయన్ని యావత్తు అరబ్బు జాతిని ఎదుర్కొనేలా చేసింది. ఆకలి దప్పులు మొదలుకుని యుద్ధరంగం వరకు కఠినాతి కఠినమైన పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా 23 ఏళ్ల సందేశకాలంలో ఆయన పూర్తిగా న్యాయానికి, సదాచారానికి కట్టుబడి ఉన్నారు. దీనికి కారణం ఆయనలో మానవభావాలు, భావనలు లేకకాదు, కాని దైవభీతి ఆయన్ని అన్నివిధాలా కట్టిపడేసింది.

ఆయన మదీనా వైపు వలసపోయిన మూడవ సంవత్సరంలో మక్కా వ్యతిరేకులు మదీనాపై దండెత్తివచ్చారు. ఉహద్ వంటి భీకరసంగ్రామం ఎదురయింది. ఈ యుద్ధంలో మొదట ముస్లిం సేనలదే పైచేయి అయింది. కాని ఆతరువాత ఆయన శిష్యుల్లో కొంతమంది చేసిన పొరబాట్ల మూలంగా శత్రువులకు వెనుకనుంచి మెరుపుదాడి చేసే అవకాశం లభించింది. యుద్ధరంగం నుండి పారిపోసాగారు. కడకు ఆయన సయితం శత్రుసేనల వ్యూహంలో చిక్కుకుపోయారు. శత్రుసేనలు ఆకలిగొన్న తోడేళ్ళలా ఆయనవైపుకు కదలసాగాయి. ఆయన తన సహచరులను పిలువసాగారు. “దైవదాసులారా! నావైపుకురండి. నా కొరకు తన ప్రాణాన్ని త్యాగం చేసేవాడెవడు? దుర్మార్గులను నాముందు నుండి తొలగించేవాడెవడు? అలాంటివాడు స్వర్గంలో నా స్నేహితునిగా ఉంటాడు (ముస్లిం)” అని ఇస్లాం ప్రవక్త పిలిచారు.

దైవప్రవక్త నోట వెలువడిన ఆపలుకులను తలచుకుంటే, ఆపిలుపు ఎంత మనోవేదనతో కూడుకున్నదో, ఆ దృశ్యం ఎంత భయంకరమైనదో అర్థమవుతుంది. ఆయన పిలుపుకు సమాధానంగా కొంతమంది ఆయన దగ్గరకు పరుగెత్తుకువచ్చారు కాని అక్కడ ఏర్పడిన గందరగోళ పరిస్థితి మూలంగా ఆ ప్రియశిష్యులు కూడా ఆయన్ని పూర్తిగా కాపాడలేకపోయారు.

ఉతబా బిన్ అబీ వకాస్ ఆయనపై ఒక రాయి విసిరాడు. ఆ రాయి ఎంత విసురుగా తగిలిందంటే ఆయన పెదాలు నుజ్జునుజ్జయ్యాయి. క్రిందపల్లు రాలిపోయాయి. అబ్దుల్లా బిన్ ఖమీ అనే విఖ్యాత ఖురైష్ పహిల్వాన్ ఒకడుండేవాడు. వాడు ఆయనపై అమాంతం లంఘించాడు. తత్ఫలితంగా రెండు ఇనుపకడియాలు ఆయన దవుడలో బాగా లోతుగా గుచ్చుకుపోయాయి. అబూ ఉబైదా బిన్ జరాహ్ పంటితో వాటిని తీయడానికి ప్రయత్నించినపుడు అబూ ఉబైదా పళ్లు రెండు విరిగిపోయాయి. అబ్దుల్లా బిన్ షిహాబ్ అనే మరోవ్యక్తి ఆయనపై రాయి రువ్వగా ఆయన నుదిటిపై పెద్ద గాయం అయింది. ఏకధాటిగా రక్తం ప్రవహించటం వల్ల ఆయన సొమ్మసిల్లి ప్రక్కనే ఉన్న ఒక గోతిలో పడిపోయారు. యుద్ధరంగంలో కొంతసేపు ఆయన కనిపించకపోయేసరికి ఆయన అమరగతులైపోయారన్న వార్త వ్యాపించింది. అంతలోనే ఒక సహచరుని దృష్టి గోతిలో పడివున్న దైవప్రవక్తపై పడింది. ఆ సహచరుడు సంతోషాన్ని పట్టలేక "దైవప్రవక్త ఇక్కడున్నారు" అంటూ కేకలేయసాగారు. అలా కేకలేయవద్దని, తాను అక్కడున్న సంగతిని శత్రువులకు తెలియనీయరాదని దైవప్రవక్త చేత్తో సైగచేశారు.

అలాంటి భీకరమైన పరిస్థితుల్లో ఖురైషు సర్దారుల (సఫ్వాన్, సుహైల్, హారిస్) పట్ల ఆయన నోట కొన్ని శాపనార్థాలు వెలువడ్డాయి. ఆయన ఇలా అన్నారు. 'తన ప్రవక్తను గాయపర్చిన జాతి ఎలా బాగుపడుతుంది?" ఇంతటి మాట కూడా దైవానికి నచ్చలేదు. దైవదూత జిబ్రీల్ దేవుని తరఫున 'వహీ' (సందేశం) తీసుకువచ్చారు.

"వ్యవహార నిర్ణయంచేసే అధికారం నీకులేదు. దేవుడు వారికి పశ్చాత్తాపపడే సద్బుద్ధినైనా ఇవ్వచ్చులేదా వారిని శిక్షించనైనా శిక్షించవచ్చు. ఎందుకంటే వారు దుర్మార్గులు".

దేవుని తరఫున ఆ మాత్రం మందలింపు ఆయనకు చాలు. తక్షణం ఆయన కోపం చల్లారిపోయింది. ఆయన క్షతగాత్రులై రక్తసిక్తమై అలసిపోయివున్నారు. అయినా దుర్మార్గుల కొరకు ఆయననోట సద్వచనాలే వెలువడుతున్నాయి. ఆయన సన్నిహిత సహచరుల్లో ఒకరైన అబ్దుల్లా బిన్ మస్వూద్ ఇలా అంటారు. ఆ సమయంలో నేను దైవప్రవక్త దగ్గరున్నాను. ఆయన తననుదిటి రక్తాన్ని తుడుచుకుంటూనే ఇలా అంటున్నారు.

దేవా! నా జాతిని మన్నించు, వీళ్లు తెలియక ఇలా చేస్తున్నారు. (ముస్లిం)

పైన పేర్కొన్న సంఘటనలు హదీసు, సీరత్ గ్రంథాల్లో పొందుపరచబడివున్న అసంఖ్యాక సంఘటనల్లో కొన్ని మచ్చుతునకలు మాత్రమే. ఇస్లాం ప్రవక్త జీవితం నైతికంగా ఎంతప్రమాణ

బద్ధమైనదో ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయి. ఈ సంఘటనలు క్రియాత్మకంగా చాటి చెప్పేదేమిటంటే, మానవుడు దైవదాసుడు మాత్రమే. అతను ఎట్టిస్థితిలోనైనా దాసుడుగా జీవించవలసిందే. దైవానికి – దైవదాసునికి మధ్య గల అనుబంధం కోరేదేమిటంటే దాసుని హృదయంలో అనుక్షణం దైవభీతి, పరలోక భీతి చెలరేగుతూ ఉండాలి. సమస్త విశ్వవ్యవస్థ అతని కొరకు దైవనామస్మరణ వేదికగా అయిపోవాలి. అతను ప్రతి సంఘటనను దైవదృష్టితో చూడాలి. ప్రతి వస్తువులో దైవనిదర్శనాన్ని కనుగొనాలి. ప్రపంచంలో ఏ వ్యవహారమైనా చేసేటప్పుడు అది ఎట్టకేలకు దేవుని హస్తగతం కానున్నదన్న సంగతిని విస్మరించకూడదు. నరకభీతి అతనిలో కంపనం పుట్టించి సాటి మనుషుల యెడల మృదువుగా మసలుకునేటట్లు చేయాలి. స్వర్గం పట్ల అతనికి గల శ్రద్ధవల్ల ఇహలోకం అతని దృష్టికి అతి స్వల్పమైన వస్తువుగా కనిపించాలి. దేవుని గొప్పతనం గురించి తలంపురాగానే అతను తన పెద్దరికాన్ని, గొప్పతనాన్ని మరచిపోవాలి. అతను విమర్శలకు, కవ్వింపులకు రెచ్చిపోకూడదు. ప్రశంశలు అతని మనసును పెడత్రోవపట్టించకుండా ఉండాలి. ఇదీ ఆదర్శప్రాయమైన జీవితం, ఇటువంటి జీవితాన్ని దైవప్రవక్త క్రియాత్మకంగా మన ముందుంచారు.

# ఉత్తమ నడవడిక

దివ్య ఖుర్ఆన్‌లో దైవప్రవక్తనుద్దేశ్యించి సెలవీయబడింది. అల్‌ఖలమ్ : 3 (ఓ ముహమ్మద్! మీరు నైతికత యొక్క ఉన్నతస్థానాన్ని అధీష్టించి ఉన్నారు) ఏమిటీ ఉన్నతానైతికత? ఏమా ఉత్తమ నడవడిక?" ప్రవక్త గారి కొన్ని ప్రవచనాల ద్వారా ఇది సుబోధకమవుతుంది.

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రభోదించారు. "మీరు 'అమియ్య' (నువ్వెంతో నేను అంతే)గా మారకండి. (అంటే) జనులు మంచిగా మెలిగితే మేము కూడా మంచిగా వ్యవహరిస్తాము, జనులు చెడుగా వ్యవహరిస్తే మేము కూడా వారి యెడల చెడుగానే వ్యవహరిస్తాం అని మీరంటారేమో! దీనికి బదులు పరోపకారాన్ని అలవరచుకోండి. జనులు మీ పట్ల మంచిగా మెలగినా మీరు మంచిగానే మెలగండి, ఒకవేళ జనులు చెడుగా మెలగినా మీరు వారికి కీడు తలపెట్టకండి"

"ఎవరు మీకు దూరమవుతారో వారికి మీరు చేరువకండి. మీపై అన్యాయానికి ఒడిగట్టిన వారిని మీరు క్షమించండి. మీపట్ల చెడుగా వ్యవహరించే వారిపట్ల మీరు మంచిగా మెలగండి".

ఇదీ హదీసులో వివరించబడిన ఉత్తమ నైతికత. ఈ నైతికతలో ఆయన అత్యున్నతమైన

స్థానంలో కనిపిస్తారు. సాధారణ ముస్లిములు గనక ఈ ఆదర్శాన్ని నెలకొల్పితే అది వారి నైతిక పరాకాష్ఠకు ప్రతిరూపం అనిపించుకుంటుంది. కాని దైవ ప్రవక్త మాత్రం ఇలా ప్రవర్తించటం అనివార్య విషయం. ఆయన ఇలా ప్రవచించారు. “నా ప్రభువు నాకు ఏమని ఆదేశించాడంటే, ఎవరైతే నానుండి దూరమవుతాడో నేనతనికి దగ్గరవ్వాలి. నాకు ఇవ్వని వాడికి నేను ఇవ్వాలి. నాకు అన్యాయం చేసిన వారిని నేను క్షమించాలి”.

నైతికతకు రెండు ప్రాతిపదికలున్నాయి. ఒకటి సాధారణమైనది. రెండవది ఉన్నతమైనది “ఎదుటివాడు నాపట్ల ఎలా ప్రవర్తిస్తే నేను వానిపట్ల అలా ప్రవర్తిస్తాను’. అన్న నైతికత సాధారణమైనది. తనకు దూర్ణమైపోదలచినవారికి తానూ దూరమవుతాను, తనకు అన్యాయం చేసిన వారిపట్ల తానూ అలాగే ప్రవర్తిస్తాను అన్నది నైతిక నియమం అయి ఉంటుంది. ఇదీ సాధారణ నైతికత.

దీనికి ప్రతిగా ఎదుటివాడి వైఖరి ఎలా ఉన్నప్పటికీ తన వైఖరి సవ్యంగా ఉండేటట్లు జాగ్రత్త పడటమే ఉత్తమ నైతికత. ఉత్తమ నైతికత అనేది నియమబద్ధమైనదై ఉంటుంది. అది సర్వత్రానుసరణీయమైనదై ఉంటుంది. వ్యవహారం తనకనుకూలంగా వున్నా, ప్రతికూలంగా వున్నా ఎదుటివాడు తన పట్ల విముఖుడైనా, సుముఖంగా వున్నా అతనిపట్ల మంచిగానే వ్యవహరించాలి. ఆఖరికి ఎదుటివాడు తన యెడల చెడుగా వ్యవహరించినా సరే తాను అతనిపట్ల మంచిగానే ప్రవర్తించాలి. తనకు హాని తలపెట్టిన వారిని సయితం మన్నించి అతనితో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలి.

ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత తత్వవేత్త వాల్టేర్ (1694–1778) ఏమంటాడంటే, ఏ వ్యక్తీ తన సన్నిహితుల పాలిట హీరో కాలేడు.

No one is a hero to his Valet.

ఎందుకంటే సహ జీవించే వారి మనుషుల దృష్టిలో మనిషి యొక్క వ్యక్తిగత జీవితం కనిపిస్తుంది. మనిషి జీవితం సన్నిహితుల దృష్టిలో తెరచిన పుస్తకంలాంటిది. ఇలాంటి జీవితంలో చూచేవారికి సమర్థత, పరిపూర్ణత కానరాదు. దూరాన వున్న వారికి అనిపించినంత గొప్పగా మనిషి దగ్గరున్న వారికి అనిపించదు. అందుచేత సన్నిహిత వర్గాల్లో ఆ మనిషి యెడల భక్తీ భావంగాని, హీరోభావనగాని కలుగదు. కాని ఈ సూత్రం ఇస్లాం ప్రవక్తకు ఏ మాత్రం వర్తించదని స్వర్న్ స్మిత్ అంటాడు. ఎందుకంటే, ఆయనకు ఎవరు ఎంత దగ్గరగా ఉన్నారో అంటే ఆయన సుగుణాల పట్ల ముగ్ధులయ్యేవారు. దీనికి చరిత్రే సాక్షి.

జైద్ బిన్ హారిస్ 'కల్బ్' తెగకు చెందినవారు. ఆయన తండ్రిపేరు హారిస్ బిన్ షరాహీల్. తల్లిపేరు సోదబిన్తె సాలబ. జైద్ ఎనిమిదేళ్ల ప్రాయంలో వుండగా ఆయన తల్లి ఆయన్ని తన పుట్టింటికి తీసుకెళ్ళింది. అక్కడ బనీ ఖైన్ బిన్ జసర్ తెగకు చెందినవారు ఆమె విశ్రమిస్తున్న గుడారుపై దాడిచేసి ఆ బాలునితో సహా దొరికినవస్తువులన్నీ దోచుకుపోయారు. ఆ తరువాత వాళ్ళు 'ఉకాజ్' అనే సంతకెళ్ళి ఆ పసివాణ్ణి అమ్మేశారు. ఖదీజా భ్రాతృజుడైన హకీమ్ బిన్ హిజామ్ ఆ అబ్బాయిని కొని మక్కాకు తెచ్చారు. అనంతరం ఆ పిల్లవాణ్ణి బానిసగా తన మేనత్త అయిన ఖదీజాకు బహూకరించారు. ప్రవక్తతో నికాహ్ జరిగిన తరువాత ఖదీజా ఆ అబ్బాయిని ప్రవక్తకు అప్పగించారు. అప్పటికి జైద్ వయస్సు 15 సంవత్సరాలు. కొన్నాళ్ల తరువాత ఈ సంగతి జైద్ తండ్రికి, పినతండ్రికి తెలిసింది. తమ పిల్లవాణ్ణి తీసుకుపోయేటందుకు వచ్చారు. వాళ్ళు ప్రవక్తను కలుసుకుని, మీరు ఎంత పరిహారం అడిగినా ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మా అబ్బాయిని మాకు అప్పగించండని అభ్యర్థించారు. దానికి ప్రవక్త, "నాకు పరిహారం ఏమీ అక్కరలేదు. మీ అబ్బాయి మీతో పాటు వస్తే మీరతన్ని నిరభ్యంతరంగా తీసుకెళ్ళవచ్చు" అన్నారు. జైద్‌ను పిలిపించి, 'వీళ్ళెవరో నీకు తెలుసా?" అని ప్రశ్నించారు. 'తెలుసు. ఈయన నా తండ్రి, ఆయన మా బాబాయి' అన్నాడాబాలుడు. "వీళ్లు నిన్ను పిలుచుకెళ్ళాలనుకుంటున్నారు. నీకిష్టముంటే వీళ్ళవెంట వెళ్ళిపోవచ్చు" అని ప్రవక్త సలహా ఇచ్చారు. దానికి జైద్, "నేను మిమ్మల్ని వదలిపెట్టి ఎక్కడికీ వెళ్ళను" అని నిర్ద్వంద్వంగా బదులిచ్చాడు. అతని తండ్రి, పినతండ్రి ఇద్దరూ మండిపడ్డారు. "నువ్వు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కాదని బానిసత్వాన్ని కోరుకుంటున్నావా? మమ్మల్ని కాదని పరాయి వారిని ఇష్టపడుతున్నావా?" అని కేకలేశారు. దానికి జైద్ ఇచ్చిన సమాధానం గమనించదగింది. "నేను ముహమ్మద్‌లో చూచిన సుగుణాలు ఇన్నీ అన్నీ కావు. ఇక నేను ఆయనపై ఎవరికీ ప్రాధాన్యత కల్పించలేను'. ఇది విని జైద్ తండ్రి, పినతండ్రి ఇద్దరూ తమ ఊరికి వెళ్లిపోయారు. ప్రవక్త దైవప్రవక్తగా నియుక్తం కాకపూర్వం జరిగిన సంఘటన ఇది. దైవ ప్రవక్తలోని ఈ ప్రత్యేకతను గురించి దివ్య ఖుర్ఆన్‌లో ఇలా అనబడింది.

"అల్లాహ్ కృపవల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావుడవు అయ్యావు. నీవేగనక కర్కశుడవు, కఠిన హృదయుడవయినట్లయితే, వారంతా నీ చుట్టు ప్రక్కల నుండి దూరంగా పోయేవారు".

ఇస్లాం ప్రవక్తలోని ఈ ఉత్తమ నడవడికే ఆయనలో వశీకరణ శక్తిని సృజించింది. ఏ వ్యక్తి ఆయనకు చేరువయినా ఆయనలోని ఔన్నత్యాన్ని చూసి ఆయనముందు తలవంచకుండా

ఉండలేకపోయేవాడు.

తాయఫ్ వీధుల్లో తుంటరి పిల్లలు ఇస్లాం ప్రవక్తపై రాళ్లు రువ్వుతూ ఆయన్ని పట్టణం నుంచి తరుముతున్న ఆ దృశ్యం ఎంత భయంకరమైనది! ఆయన మక్కా నుండి 50 మైళ్లదూరం కాలినడకన పయనం చేసి వేసవికాలంలో హిజాజ్ శ్రీమంతులు బసచేసే శీతల పట్టణమైన తాయఫ్ చేరుకున్నారు. తాయఫ్ సర్దారులకు ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేయాలన్నదే ఆయన ఉద్దేశ్యం. కాని తాయఫ్ ధనికులు ఆయన ప్రేమామృత సందేశాన్ని స్వీకరించేబదులు పట్టణంలోని అలగా కుర్రాళ్లకు ఆయన్ని తరిమికొట్టే పని అప్పగించారు. ఆ తుంటరి కుర్రాళ్లు పొద్దుగూకి చీకటి తెరలు కమ్ముకునే వరకూ ఆయన్ని తరుముతూనే ఉన్నారు. ఆయన శరీరం గాయాలతో రక్తసిక్తమైంది. నఖసిఖపర్యంతం శరీరమంతా రక్తంతో తడిసిముద్దయింది. ఆ సమయంలో అలసిపోయిన ఆయన ఒక ద్రాక్షతోటలో శరణు పొందారు. ఆలోచించండి! ఏ మనిషి విషయంలోనైనా ఇది ఎంత క్లిష్టమైన తరుణం! తాయఫ్‌లో తాను చవిచూసిన ఆ సాయంత్రం నా జీవితంలో అత్యంత నికృష్టమైన సాయంత్రం అని ఒకసారి ఆయన స్వయంగా తన భార్య ఖదీజాతో చెప్పుకున్నారు. అయితే అత్యంత దయనీయమైన ఆ ఘడియల్లో కూడా శత్రువుల కొరకు ఆయన నోట ఎలాంటి శాపనార్థాలుగాని, దురుసు మాటలు గాని వెలువడలేదు. పైగా ఆయన ఇలా పలికారు. “దేవా! వీరికి సన్మార్గం చూపు. ఎందుకంటే వీళ్ళేంచేస్తున్నారో వీరికి తెలియదు పాపం!” దైవప్రక్తలోని ఈ నైతికతే రాతి గుండెలను కరిగించింది. కడకు వారంతా ఆయన సందేశాన్ని స్వీకరించారు. ఆయన నెలకొల్పిన ఉత్తమ నడవడిక ముందు అసూయద్వేషాలు, శత్రుత్వాలు, మంకుతనాలు నిలబడలేక పోయాయి. ఆయనలోని సాదుశీలం జనులను మంత్రముగ్ధుల్ని చేస్తూ అంచెలంచెలుగా వారి హృదయాలను జయించసాగింది.

“మేలు చేకూర్చే బంధువులకే మేలు చేకూర్చటం మహోపకారం కాదని కీడు తలపెట్టిన వారికి సైతం మేలు చేకూర్చటమే మహోపకారం” అని ఆయన ఒకసారి ప్రభోదించారు. (బుఖారి, కితాబుల్ అదబ్) ఒకసారి కొందరు శత్రువులు ప్రవక్త ధర్మపత్ని మరియు అబూబకర్ కుమార్తె అయిన అయిషాపై అపనింద వేశారు.

ఈ నింద అసత్యమైంది, నిరాదారమైంది. ఈ అభూతకల్పనను అపాదించిన వారిలో ముస్తహ్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. అతను అబూబకర్‌కు బంధువు కూడాను. బీదవాడన్న ఉద్దేశ్యంతో అబూబకర్ అతనికి కొంత మొత్తం ఇస్తూ ఉండేవారు. అమాయకురాలైన తన

కుమార్తెపై అభాండం మోపిన దుర్మార్గుల్లో ముస్తహ్ కూడా ఉన్నాడన్న సంగతి తెలుసుకున్న అబూబకర్ అతనికి నెలనెలా అందించే ఆర్థిక సహకారాన్ని నిలిపివేశారు. దీనిపై దైవసందేశం అవతరించింది – ఎవరైనా ఒక వ్యక్తి ఆర్థికంగా అగత్యపరుడైన పక్షంలో అతని నైతిక అపరాధాన్ని సాకుగా తీసుకుని ఆర్థికసహాయం నిలిపివేయరాదు, పైగా అతని తప్పును మన్నించి అతనికందించే సహకారాన్ని కొనసాగించాలి అన్నది ఈ 'వహీ' సారాంశం.

దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడింది : "మీలో ఎవరైతే స్థితిమంతులో వారు తమ బంధువులకు, అగత్యపరులకు, దైవమార్గంలో ప్రస్థానం చేసినవారికి సహాయం చేయబోము అని ఒట్టేసుకోరాదు. పైగా వాళ్లను మన్నించి వదలిపెట్టాలి. అల్లాహ్ మిమ్మల్ని మన్నించాలని మీరు అభిలషించరా? కాగా, అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడూను" (24:22)

అబూబకర్‌కి చెందినదే ఇంకొక సంఘటన. ఆయన ఒకసారి దైవప్రవక్త దగ్గర కూర్చుని ఉన్నారు. ఒక వ్యక్తి వచ్చి ఆయన్ని దూషించాడు. అబూబకర్ ఒకసారి ఊరుకున్నారు. రెండవసారి ఊరుకున్నారు. మూడవసారికూడా ఆ వ్యక్తి దురుసుగా మాట్లాడేసరికి ఇక ఆయన సహించలేక బదులు చెప్పబోయారు. ఇది గమనించి ప్రవక్త తక్షణం అక్కడినుంచి లేచి నిలబడ్డారు. "ఓ దైవప్రవక్తా! మీరెందుకు వెళ్ళిపోతున్నారు!" అని అబూబకర్ ప్రశ్నించగా ఆయన ఇలా జవాబిచ్చారు. "అబూబకర్! మీరు మౌనంగా ఉన్నంతసేపూ దైవదూత మీతరపున సమాధానం ఇస్తూ ఉన్నాడు. కాని మీరు కల్పించుకునేసరికి దైవదూత నిష్క్రమించాడు. (సునన్, అబూదావూద్) ఈ విధంగా దైవప్రవక్త బోధించదలిచిందేమిటంటే, చెడుకు బదులుగా మనిషి ఎలాంటి ప్రతీకారం తీర్చుకోకుండా ఉన్నంతసేపూ అల్లాహ్ అతని తరపున ప్రతీకారం తీర్చుకోవటానికి సిద్ధంగా ఉంటాడు. కాని మనిషి స్వయంగా ప్రతీకారచర్యకు ఉపక్రమించినపుడు దేవుడు తన మధ్యవర్తిత్వాన్ని ఉపసంహరించుకుని ఆ వ్యవహారాన్ని ఆ వ్యక్తికే వదిలేస్తాడు. కాగా, ఏ మనిషీ దేవుని కన్నా ఉత్తమంగా ప్రతీకారం తీర్చుకోలేడన్నది నిర్వివాదాంశం.

అలీ కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త ఒక యూదుని నుంచి కొన్ని నాణాలు అరువుగా తీసుకున్నారు. కొన్నిరోజులు గడచిన మీదట ఆ యూదుడు వచ్చి అప్పు చెల్లించమని కోరాడు. "ఇప్పుడంటే ఇప్పుడే మీ రుణం తీర్చడానికి నా దగ్గర ఏమీ లేదు" అని ఆయన ప్రాధేయపడ్డారు. "మీరు నా అప్పు చెల్లించేదాకా మిమ్మల్ని వదలిపెట్టేది లేదు" అంటూ ఆ వ్యక్తి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇంటిదగ్గరే తిష్ఠవేశాడు. మదీనాలో రాజ్య స్థాపన

జరిగిన రోజులవి. తలచుకుంటే ఆ వ్యక్తిపై చర్య తీసుకునేటంత అధికారం ఆయనకుంది. ఆయన సహచరులు కొంతమంది అతన్ని మందలించి పంపదలిచారు. కాని ఆయన అందుకు అంగీకరించలేదు. కొంతమంది శిష్యులు ఆయన్ని ఉద్దేశ్యించి, "దైవప్రవక్తా! ఒక యూదవ్యక్తి చేతుల్లో మీరు ఖైదీగా పట్టుబడినట్లున్నారు" అని అనగా "అవును. కాని ఒకరిపై జులుంచేసేందుకు నాకు అనుమతిలేదు అలాగే ఆరాత్రంతా గడచిపోయింది. తెల్లవారేసరికి యూద వ్యక్తికి జ్ఞానోదయమైంది. చర్య తీసుకునే అధికారముండి కూడా ఆయన సంయమనంతో వ్యవహరించటం చూసి అతను అమితంగా ప్రభావితుడయ్యాడు. తరువాత అతను ముస్లిమైపోయాడు. ఆ యూదుడు మదీనాలో గొప్ప శ్రీమంతుడు. నిన్నటి వరకూ అతను కొన్ని నాణాల కోసం ఆయన్ని ఘెరావ్ చేసి ఉంచాడు. కాని ఆయన సత్ప్రవర్తన అతన్నెంతగా ప్రభావితం చేసిందంటే తన దగ్గరున్న సిరిసంపదలన్నీ తెచ్చి ఆయన కాళ్ల దగ్గర పెట్టాడు. ఈ సోమ్మును మీరు కోరిన రీతిలో ఖర్చు పెట్టండని చెప్పాడు (బైహఖీ). అబ్దుల్లా బిన్ అబీ హస్మా ఏమంటారంటే, ఒకసారి నేను ప్రవక్తతో ఒక క్రయవిక్రయాల వ్యవహారం చేశాను. ఆ వ్యవహారం పూర్తవకముందే నాకొక పనితగిలింది. "తమరు ఇక్కడే ఉండండి. నేను ఇంటికెళ్లివచ్చిన తరువాత ఈ వ్యవహారం పూర్తి చేస్తాను'. అని చెప్పి ఇంటికెళ్ళాను. ఇంటికెళ్ళాక పనుల్లో పడి ఆ సంగతే మరచిపోయాను. మూడు రోజులు గడచిన తరువాత ఆ సంగతి జ్ఞాపకం వచ్చి అక్కడికెళ్ళాను. దైవప్రవక్త అక్కడే నిరీక్షిస్తూ ఉండటం చూసి నివ్వెరబోయాను. ఆయన నన్ను చూసి "మీరు నాకు చాలా శ్రమ కలిగించారు. నేను మూడు రోజుల నుంచీ ఇక్కడ మీకోసం ఎదురు చూస్తున్నాను" అని మాత్రమే పలికారు (అబూదావూద్). ఈ రకమైన ఆచరణ ఆయన వ్యక్తిత్వంలో గొప్ప ఆకర్షణను సృజించింది. కర్కశ హృదయులు సయితం ఈ ఆదర్శాలకు ప్రభావితులు కాకుండా ఉండలేకపోయారు.

ఆయిషా తెలిపారు – ఒకసారి యూద పండితుల బృందం ఒకటి ప్రవక్త వద్దకు వచ్చింది. వాళ్లు ఆయన్ని కలుసుకున్నప్పుడు వాళ్ళు "మీకు వినాశం కలుగుగాక!" అని చెప్పారు. ఈ మాటలను విన్న ఆయిషా సహించలేకపోయారు. "కాదు, మీరే నాశనమవుగాక! మీపై దేవుని ధూత్కారం పడుగాక!" అని బదులిచ్చారు. అలా చెప్పరాదని ఆయన ఆయిషాను వారించారు. పైగా ఆయన ఇలా ప్రవచించారు. "దేవుడు కరుణాకరుడు అన్ని విషయాల్లో ఆయన కనికరాన్నే ఇష్టపడతాడు". యదార్థానికి శత్రువును జయించడానికి మృధుభాష్యాన్ని మించిన ఆయుధం లేదు. ఆ ఆయుధంతో చేసిన దాడి ముందు ఎవరూ నిలువలేరు. దానిముందు ఓటమిని అంగీకరించక తప్పదు.

బరాబిన్ ఆజిబ్ ప్రకారం : దైవ ప్రవక్త మూడు షరతులకు సమ్మతించి ఖురైషులతో హుదైబియా ఒప్పందం చేసుకున్నారు. వాటిలో ఒక షరతు ప్రకారం, ఏ ముస్లిమేతరుడన్నా ఇస్లాం స్వీకరించి ముస్లిముల వద్దకు వస్తే ముస్లిములు అతన్ని వాపసు చేయాలి. అయితే ముస్లిములను విడిచిపెట్టి ఖురైషుల వద్దకు చేరిన వ్యక్తిని మాత్రం ఖురైషులు వాపసు చేయరు. ఒప్పందంపై సంతకాల తడి ఆరకముందే మక్కాకు చెందిన ఒక ముస్లిం (అబూజుందల్) హుదైబియాకు పారిపోయివచ్చారు. ఇస్లాం స్వీకరించినందుకు గాను ఆయన కుటుంబీకులు అప్పటివరకూ ఆయన్ని నిర్భందించి ఉంచారు. ఆయన చేతికి బేడీలున్నాయి. శరీరమంతా గాయాలతో రక్తసిక్తమై ఉంది. శత్రువుల చెరనుండి తనను విముక్తుణ్ణి చేయమని ప్రాధేయపడ్డారు. అబూజుందల్. అది అత్యంత సున్నితమైన ఘడియ. దైవప్రవక్త సహచరులంతా ఒరలో నుంచి కత్తులు తీశారు. అబూజుందల్ పరిస్థితిని కళ్ళారా చూసిన తరువాత ఒప్పందాన్ని కట్టుబడే మొదటి అవకాశం ఇది" అంటున్నారు. ఎట్టకేలకు ప్రవక్త (స) తాను చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండటం తప్ప మరో మాటకు ఆస్కారం లేదని నిర్ణయించారు. ఈ నిర్ణయం సహచరులను కృంగదీసింది. కాని ఆయన మాత్రం అబూజుందల్‌ను మక్కావారికి అప్పగించారు. (సహీహ్) చూడబోతే ఇది పైకి ఒక పీడితుణ్ణి దుర్మార్గులచేతికి తిరిగి అప్పగించటంగా కనిపిస్తోంది. కాని ఈ నిర్ణయం నియమాలకు కొలబద్దవంటిది. ఇది కర్కోటకుల అంతరంగాన్ని సైతం కుదిపివేసే నిర్ణయం అలాంటి పరిస్థితిలో అబూజందల్‌ను లాక్కుపోయి మళ్లీ నిర్బంధించటం ఖురైషుల నైతిక పతనానికి చిహ్నమైతే, పీడితుడైన సాటి సోదరుణ్ణి విలువల కోసం వదలిపెట్టడం ముస్లిముల నైతిక ఉత్థానానికి ప్రతిరూపంగా పరిణమించింది. తత్ఫలితంగా మక్కా వాసులు ఇస్లాంలోని నైతిక శక్తిముందు తలొగ్గసాగారు. అక్కడ క్రమక్రమంగా ప్రజలు ఇస్లాం స్వీకరించసాగారు. మక్కాలో అబూజందల్ ఉనికి ఇస్లాం పరివ్యాప్తికి అమితంగా దోహదపడింది. ఖైదీగా ఉన్న అబూజుందల్‌కి తమ జాతి ప్రజల్లో సానుభూతి పెరగటం చూసి ఆఖరికి వాళ్లు ఆయన్ని వదలివేశారు.

మదీనా జీవితానికి సంబంధించిన ఒకసంఘటనను అబూహురైరా ఇలా వివరించారు. దైవ ప్రవక్త తన యెడల వైర వైఖరిని అవలంబిస్తున్న 'సజద్' ప్రజల వైపుకు కొంతమందిని పంపించారు. మార్గం మధ్యలో యమాకు నగర పాలకుడైన సుమామ బిన్ అసాల్ పట్టుబడ్డాడు. అతన్ని మదీనాకు పట్టి తెచ్చి మస్జిద్ స్థంభానికి కట్టారు. దైవప్రవక్త అతని దగ్గరకు వచ్చి అతని ఉద్దేశమేమిటో అడిగారు. అతనిలా అన్నాడు. "మీరు గనక నన్ను హతమారిస్తే

నాజాతి ఊరుకోదు. రక్తానికి బదులు తీర్చుకుంటుంది. మీరుగనక నన్ను వదలివేస్తే జీవితాంతం నేను మీకు రుణపడి ఉంటాను. మిమ్మల్ని మహోపకారిగా గౌరవిస్తాను. ఒకవేళ మీరు నానుండి ధనాన్ని ఆశించినట్లయితే మీరు కోరినంత మొత్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను". ప్రవక్త అతన్ని విడిచిపెట్టమని ఆదేశించారు. ఎందుకంటే ట్రైబల్ ప్రాంతాల్లో శత్రు తెగకు చెందిన వ్యక్తి పట్టుబడ్డాడంటే ఇక అతని కథ ముగిసినట్లే లెక్క. ప్రవక్త అతన్ని శరీరాన్ని హతమార్చలేదుగాని తనదైన నీతి నడవడికతో అతని మనసును మాత్రం హతమార్చారు. ఎందుకంటే అతన్ని విడిచిపెట్టగానే సుమారు నేరుగా ఒకతోటలోకి వెళ్ళి స్నానం చేసి మస్జిద్‌లోకి వచ్చాడు. అతను తిరిగి ఎందుకు వచ్చాడా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. కాని అతను బిగ్గరగా సాక్ష్యవచనం (కలిమయె షహాదత్) పఠించి తాను ముస్లిం అయినట్లు ప్రకటించేసరికి జనానికి అప్పుడర్థమైంది. ప్రవక్త అతన్ని విడిచిపెట్టి శాశ్వితంగా అతన్ని నిర్భంధంలోకి తీసుకున్నారని! ఆ తరువాత వారు 'ఉమ్రా' చేయడానికి మక్కా వెళ్ళారు. ఆయన మక్కాలో ప్రవేశించి ఉమ్రా చేస్తుండటం చూసి అక్కడి వారు "నువ్వు ధర్మ విహీనుడవయ్యావు" అని నిందించారు. దానికి బదులుగా ఆయన, "నేను ధర్మ విహీనుణ్ణిగాను, దైవప్రవక్త ధర్మాన్ని స్వీకరించాను" అని చెప్పాడు. అంతే కాదు, ఇస్లాంను పటిష్టమైనదిగా చేయడంలో ఆయన దోహదపడ్డారు. ఆ రోజుల్లో మక్కా వారికి బయటినుంచి గోధుమ దిగుమతి అయ్యే ప్రాంతాల్లో యమామ నగరం ముఖ్యమైనది. సుమారు మక్కా వారినుద్దేశించి, "బాగా వినండి, ఇకనుండి ముహమ్మద్ అనుమతి లేనిదే ఒక్క గోధుమ గింజ కూడా ఇక్కడికి చేరదు" అని నిర్ద్వంద్వంగా చెప్పేసారు. (సహీహ్ ముస్లిం). మంచి నడవడిక పైకి విలువలేనిదిగానే కానరావచ్చుగాని దాన్ని ఇచ్చి మనిషి అమూల్యమైన వసువులెన్నో కొనగలడు.

నైతికతకు ప్రమాణం ఏమిటంటే, నీతులు చెప్పేవాడి మాటలకు – చేతలకు మధ్య వైరుధ్యం ఉండకూడదు. చెప్పేదానికి అతను స్వయంగా చేసి చూపించాలి. బలవంతుల పట్ల కనబరచే ఉదారస్వభావాన్ని, రాయితీల వైఖరినే బలహీనులు, సామాన్యులపట్ల కూడా కనబరచాలి. తన కొరకు అవలంబించే నియమాన్నే ఇతరుల విషయంలోనూ అవలంభించాలి. ఎదుటివారి ప్రవర్తన సమర్ధనీయంగా లేకున్నా తాను వారిపట్ల సముచితంగానే మసలుకోవాలి. ఈ రకంగా చూచినపుడు దైవప్రవక్త నైతికత యొక్క అత్యున్నత స్థాయిలో ఉన్నట్లు కనిపించేవారు. ఆయన ఏనాడూ ఉన్నత నైతికతను విడనాడలేదు. ఏ పరమార్థమూ, మరే అభిప్రాయభేదమూ ఆయన్ని నైతిక స్థాయి నుంచి తొలగించలేకపోయింది. ఈ విషయానికి ఆయన అంతరంగికులు, సన్నిహితులే సాక్షి.

సయీద్ బిన్ హాషిమ్ అనే ఆయన దైవప్రవక్త ధర్మపత్ని అయిన ఆయిషాని ఉద్దేశించి ఆయన నడవడిక ఎలా ఉండేది? అని ప్రశ్నించగా, "ఆయన నడవడిక ఖుర్ఆన్ వంటిది" అని ఆమె బదులిచ్చారు. అంటే మనిషి జీవితం ఎలా ఉండాలన్న దానికి ఆయన ఖుర్ఆన్ బోధనలకు ప్రతిరూపంగా ఆచరించారన్న మాట! "నేను పదిసంవత్సరాల పాటు దైవ ప్రవక్తకు సేవలుచేస్తూ ఉన్నాను. కాని ఏనాడూ ఆయన నన్ను (కోపంతో) 'ఉఫ్' అని గాని, నువ్వు అలా ఎందుకు చేశావనిగాని అనలేదు ఆయన అందరిలోకెల్లా ఉత్తమ నీతిమంతులు (సహీహీన్)" అని అనస్ బిన్ మాలిక్ చెప్పారు. ఆయిషా ఉల్లేఖించారని అహ్మద్ చెప్పారు – దైవ ప్రవక్త ఎన్నడూ తన చేత్తో ఏ నౌకరునూ గాని, ఏ స్త్రీని గాని కొట్టలేదు. పరాయి మనిషిని కూడా కొట్టి ఎరుగరు. అయితే ఆయన దైవమార్గంలో పోరాడుతూ ఉన్నారు. ఎప్పుడూ ఆయన ఎదుట రెండింటిలో ఏదో ఒక దానిని అనుసరించే అవకాశం వచ్చినా ఆయన సరళమైన దానినే ఎంపికచేసేవారు. పాపం విషయమైతే అదివేరే సంగతి. ఏ విషయమైతే పాపంతో కూడుకున్నదో దానికి ఆయన అందరికన్నా ఎక్కువ దూరంగా ఉండేవారు. ఆయనకు ఎంత బాధకలిగించినా సరే – ఆయన తన స్వవిషయంలో ఎన్నడూ పరులపై ప్రతీకారం తీర్చుకోలేదు. దేవుడు విధించిన హద్దులను అతిక్రమిస్తే మాత్రం ఆయన చర్య తీసుకునేవారు".

దైవ ప్రవక్త వారి ఈ సుగుణం వల్లనే శత్రువుల దృష్టిలో సయితం ఆయన గౌరవనీయులుగా ఉండేవారు. ఆయన సహచర్యాన్ని అంగీకరించినవారు ఎన్ని కష్టాలు వచ్చినా, మరెన్ని నష్టాలు ఎదురైనా జీవితాంతం ఆయనకు చేదోడుగానే ఉన్నారు. అధికారం ప్రాప్తించిన రోజుల్లో వారు ఆయన్ని ఎంతగా ఆదరించేవారో కష్టాల కడలిని ఎదురీదుతున్న రోజుల్లో కూడా వారు ఆయన్ని అంతే ఆదరించారు. దూరాన ఉండేవారు. ఆయన పట్ల ఏ అభిప్రాయం కలిగి ఉండేవారో దగ్గర వున్నవారు కూడా అదే అభిప్రాయం కలిగి ఉండేవారు. ఆయన నడవడిక చరిత్రలోనే కనీవినీ ఎరుగనంతటి ఆదర్శవంతమైంది.

నియమబద్ధమైన ఆయన జీవితంలో ఉత్తమ నడవడిక శాశ్వితమైన ఒక అంశం అయిపోయింది. ఈ కారణంగానే కాబోలు తనతో విభేదించే, తనకు హానికలిగించే వారిపట్ల సయితం ఆయన ప్రవర్తన ఒకలాగే ఉండేది.

కాబా గృహానికుండే తెర అజ్ఞాన కాలంలో సైతం అత్యంత పవిత్రమైనదిగా భావించబడేది. ఈ తెరను ఎక్కించే బాధ్యత అనాదిగా ఒక ప్రత్యేక కుటుంబానికే పరిమితమై

ఉంది. దైవప్రవక్త కాలంలో ఆ కుటుంబానికి చెందిన ఉస్మాన్ బిన్ తల్హా అనేవ్యక్తి పరదా కట్టేవాడు. కాబా గృహ తాళం చెవులు అతని వద్దనే ఉండేవి.

వలసకు పూర్వం ప్రవక్త ఒకసారి కాబాగృహం లోపలికి ప్రవేశించి ఇబాదత్ (ఆరాధన) చేయాలనుకున్నారు. ఆయన ఉస్మాన్ బిన్ తల్హా వద్దకు వెళ్ళి కాబా తాళం చెవులివమని అడిగారు. ఉస్మాన్ బిన్ తల్హా తాళం చెవులు ఇవ్వకపోగా దురుసుగా మాట్లాడాడు. “చూడు ఉస్మాన్! ఏదో ఒక రోజు ఆ తాళం చెవులు నా చేతుల్లో ఉంటాయి. అప్పుడు తాళం చెవి ఎవరికివ్వాలో ఎవరికివ్వకూడదో నిర్ణయించే అధికారం నాకు ఉంటుంది” అని ప్రవక్త అన్నారు. ఇది విని తల్హా ఇలా అన్నాడు.

“అదే జరిగితే ఆ రోజు ఖురైషులకు వినాశకరమైన, అవమాన భరితమైన రోజవుతుంది”

దీనికి సమాధానంగా ప్రవక్త “లేదు, ఆ రోజు గౌరవప్రదమైన రోజై ఉంటుంది” అన్నారు (బుఖారి) ప్రవక్త విజయకేతనం ఎగురవేశారు. అధికారమంతా ప్రవక్త చేతుల్లోకి వచ్చింది. ఆయన మక్కా నగరంలోకి ప్రవేశించగానే బైతుల్లాహ్‌కు వెళ్ళారు. ఏడుసార్లు కాబా ప్రదక్షిణ చేశారు. ఆ తరువాత ఆయన ఉస్మాన్ బిన్ తల్హాను పిలిపించారు. ఒక ఉల్లేఖనం ప్రకారం అతను హుదైబియా ఒప్పందానికి – మక్కా విజయానికి మధ్య కాలంలోనే ఇస్లాం స్వీకరించాడు. ఆయన అతని వద్ద నుంచి తాళం చెవులు తీసుకుని కాబా తలుపు తెరచి లోనికి ప్రవేశించారు. ఆయన కొంతసేపు అందులో ఉన్నారు. అక్కడ ప్రతిష్ఠించబడి వున్న విగ్రహాన్ని తన స్వహస్తాలతో విరగ్గొట్టారు.

ప్రవక్త బయటకు వచ్చినపుడు ఆయన చేతుల్లో తాళంచెవులున్నాయి. ఆ సమయంలో ఆయన ఈ దివ్యవచనం పఠిస్తున్నారు. (మీరు అమానతులను సంబంధిత వ్యక్తులకు అప్పగించండని అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు). ఆ సమయంలో ఆయన అల్లుడైన అలీ మరియు వరుసకు భ్రాతృజుడైన మరోవ్యక్తి అక్కడే నిలబడి ఉన్నారు. వారిద్దరూ ఇలా అన్నారు. “ఓ దైవ ప్రవక్తా! మీపై దైవకారుణ్యం కురియుగాక! బనూహాషిమ్ తెగవారమైన మాకు మొదటి నుంచీ కాబా యాత్రీకులకు నీరుత్రాపే బాధ్యత అప్పగించబడి ఉంది. ఇప్పుడు కాబా తాళం చెవులు కూడా మాకే అప్పగించండి”. దైవప్రవక్త అలీ అభ్యర్థనపై స్పందించలేదు. “ఉస్మాన్ బిన్ తల్హా ఎక్కడ?” అని ఆయన ప్రశ్నించారు. ఉస్మాన్ బిన్ తల్హా పిలువబడ్డారు. తాళం చెవులు ఆయన చేతికి అందిస్తూ దైవప్రవక్త ఇలా వ్యాఖ్యానించారు.

“ఉస్మాన్! మీ తాళం చెవులు తీసుకోండి. ఈరోజు మన్నించి సత్కరించే రోజు. దీన్ని

తీసుకోండి. ఇది మీ వంశంలో వారసత్వంగా ఉంటుంది. దుర్మార్గుడు తప్ప మరెవడూ దీన్ని మీ నుండి లాక్కోడు".

దైవ ప్రవక్త వారి ఈ సంప్రదాయాన్ని బట్టి తెలిసేదేమిటంటే హక్కుల చెల్లింపు, అప్పగింతల వాపసు విషయంలో ముస్లింములు నిజాయితీగా వ్యవహరించాలి. హక్కుదారుడు ఒకవేళ కటువుగా ప్రవర్తించినప్పటికీ అతని హక్కును అతనికి ముట్టజెప్పటంలో ఎలాంటి వెలితి చేయకూడదు. అవతలివాడు తన అభిమతానికి వ్యతిరేకి అయినప్పటికీ వాడి హక్కును వాడికి పూర్తిగా ఇవ్వవలసిందే.

ప్రపంచంలో అధికారం కోసం ప్రాకులాడేవారు తమకు అధికారం చేజిక్కిన వెంటనే మొట్టమొదట చేసేపని తమ వ్యతిరేకులపై కేసులు పెట్టి వారిని శిక్షించటం! తమ విరోధులను అధికార హోదాలనుంచి తొలగించి అయినవాళ్లను అందలమెక్కించటం!! ప్రతి రాజ్యాధికారి అనుకూల ప్రతికూల పరిభాషలో ఆలోచిస్తూ ఉంటాడు అనుకూలురును ఆదరించి ప్రతికూలురును పాతాళానికి త్రోసెయ్యటం అతని విధానం అయిపోతుంది. కాని దైవ ప్రవక్తకు అరేబియాలో అధికారం ప్రాప్తించినపుడు ఆయన దీనికి భిన్నంగా ప్రవర్తించారు. ఆయన సమస్త వ్యవహారాలను 'అనుకూల' 'ప్రతికూల' పరంగా గాకుండా సత్య దృష్టితో, నిజాయితీ దృక్పథాలతో చూశారు. సమస్త ఫిర్యాదులను, రాగద్వేషాలను విస్మరించి అందరిపట్లా దయాభావంతో, న్యాయ దృష్టితోనే వ్యవహరించారు.

## ప్రవక్త జీవితం నేర్పే పాఠాలు

దివ్య ఖుర్ఆన్‌లో విశ్వాసులను ఉద్దేశించి సెలవీయబడింది.

"మీ కొరకు దైవప్రవక్తలో ఉత్తమమైన ఆదర్శం ఉంది. అల్లాహ్ మరియు అంతిమ దినాన్ని ఆశించే, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే వ్యక్తి కొరకు (ప్రవక్త ఆదర్శప్రాయులు)".

దైవప్రవక్త జీవితం ప్రతి మనిషి కొరకు ఆదర్శ ప్రాయమైందని ఈ వచనంలో చెప్పబడింది. అయితే అత్యధికంగా దైవనామస్మరణ చేసేవారికి, దైవం మరియు తీర్పుదినంపై ఆశలు పెంచుకున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని కూడా ఇందులో స్పష్టం చేయబడింది.

అంటే దైవప్రవక్త జీవితం యొక్క 'ఆదర్శం' సొంతం మనముందు ఉన్నప్పటికీ అది అందరి కొరకూ 'ఆదర్శం' కాజాలదన్న మాట! లోతుల్లోకెళ్ళి దైవాన్ని పొందిన దాసునికీ, ఆశలు, ఆశయాలన్నింటినీ దైవంతోనే ముడిపెట్టిన వానికి, పరలోక శిక్షను తలచుకుని

భీతిల్లేవానికి, పరలోక బహుమానాల కోసం తన సర్వస్వాన్నీ ధారబోయడానికి సిద్ధమయ్యే సజ్జన దాసులకు మాత్రమే దైవప్రవక్త పవిత్ర జీవితం 'ఆదర్శం' అవుతుంది.

ఈ విషయాన్ని ఆకళింపు చేసుకోవటానికి ఒక ఉదాహరణను తీసుకోండి, ప్రవక్త ఇలా ప్రవచించారని హదీసులో ఉంది.

"ఎవరైతే సొమ్మును కాపాడుకునే యత్నంలో చంపబడతాడో అతను అమరగతుడు. మరెవరైతే తన రక్తాన్ని (ప్రాణాన్ని) రక్షించుకునే ప్రయత్నంలో చంపబడతాడో అతను అమరగతుడు. ఎవరైతే తన ధర్మాన్ని అర్జించే ప్రయత్నంలో చంపబడతాడో అతను అమరగతుడు. ఎవరైతే తన ఇంటివారిని కాపాడే యత్నంలో చంపబడతాడో అతను అమరగతుడు". (అబూదావూద్)

ఈ హదీసులోని మాటలను బట్టి ఇది "పోరాడటం" గురించి గాక "చంపబడిన" పక్షంలో విశ్వాసి పర్యవసానం ఎలా ఉంటుందన్న దాన్ని గురించి చెబుతోంది. ఎప్పుడు మీకు ధనం లేక ప్రాణం లేక ధర్మరక్షణ లేక భార్యాబిడ్డల సమస్య ఎదురైనా మీరు కయ్యానికి కాలు దువ్వండన్నది ప్రవక్త ఉద్దేశ్యం కాదు. దీని అసలు సారాంశం ఏమిటంటే, పైన పేర్కొనబడిన కారణాలపై ఎవరైనా విశ్వాసిని హతమారిస్తే అది అతని పట్ల హత్యగా గాక వీరమరణంగా పరిణమిస్తుంది. అంటే ఈ హదీసు జగడాలు తగవులను ఉసికొల్పటంలేదు, చంపబడిన పక్షంలో ప్రాప్తించే వీరమరణాన్ని గురించి మాత్రమే ప్రస్తావిస్తోంది.

కాగా, మత ధర్మం విషయంలో సిన్సియర్ కాని వ్యక్తి, తన వ్యక్తిగత అభిరుచిమేరకు దైవప్రవక్త వారి హదీసును తీసుకుని అంతరంగిక కలహాలను, జాతీయ పోరాటాలను ధర్మసమ్మతమైనవిగా ఖరారు చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. పైగా అతనిలా అంటాడు. "ఇస్లాం శూరత్వాన్ని ప్రభోదిస్తోంది. తమ విశ్వాసరక్షణ, ధర్మరక్షణ కోసం, ధనమాన ప్రాణాల రక్షణకోసం, భార్యాబిడ్డల ఆత్మీయుల రక్షణకోసం యుద్ధం చేయండి. మీరు గనక గెలిస్తే మీ లక్ష్య సాధనలో సఫలీకృతులయ్యారు. ఒకవేళ ఓడిపోయినా ఫరవాలేదు, మీకు అమరగతి లభిస్తుంది. అమరగతి ధన్య జీవులకు మాత్రమే ప్రాప్తమవుతుంది.

అయితే దైవానికి భయపడే మనిషి అత్యంత గంభీరంగా ఈ అంశంపై ఆలోచిస్తాడు. ధన మానప్రాణాల రక్షణ కొరకు, బంధుజనుల రక్షణ నిమిత్తం కదనరంగంలో దూకి ప్రాణాలర్పించటమే కర్తవ్యమైతే మరి ప్రవక్తగారు అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం సహనస్థయిర్యాలను ఎందుకు ప్రదర్శించారు? సంమయనంతో వ్యవహరించమని తన శిష్యులకు ఎందుకు ప్రభోదించారు? అన్న ప్రశ్నలు అతని ఆలోచనా పథంలో ఉత్పన్న మవుతాయి.

1. ఉదాహరణకు ఇబ్నె హిషామ్ అబూ ఉస్మాన్ అల్ నహదీ ఆధారంతో ఈ క్రింది సంఘటనను వివరించారు.

నాకు తెలిసిన విషయమేమిటంటే, సుహైబ్ మక్కా నుండి వలసపోవాలని నిశ్చయించుకున్నప్పుడు ఖురైషు అవిశ్వాసులు ఆయనున్నుద్దేశించి, 'మీరు మా వద్దకు వచ్చిన రోజుల్లో బీదవారుగా ఉండేవారు. ఆ తరువాత మీరిక్కడ బాగా సంపాదించారు. అలా అలా మీరు ఇప్పుడున్న స్థాయికి ఎదిగారు. ఇప్పుడు మీరు మీ ధనప్రాణాలతో ఈ ఊరు విడచిపెట్టి పోవాలనుకుంటున్నారేమో! దైవసాక్షి! ఇలా ఎన్నటికీ జరగదు'. ఇది విన్న సుహైబ్, 'ఒకవేళ నేను నా ధన సంపత్తులను మీకు అప్పగించిన పక్షంలో నన్ను ఇక్కడి నుంచి వెళ్ళేందుకు అనుమతిస్తారా? అని ప్రశ్నించగా 'అవును' అని అవిశ్వాసులు అన్నారు. అయితే నా ధనాన్ని మీకప్పగిస్తున్నాను' అన్నారు సుహైబ్. ఈ సంగతి దైవప్రవక్తకు తెలియగా ఆయన ఇలా అన్నారు. సుహైబ్ వాణిజ్యం సఫలీకృతమైంది. సుహైబ్ వాణిజ్య సఫలీకృతమైంది".

2. వలస 6వ ఏట ప్రవక్త 'ఉమ్రా' చేసే ఉద్దేశ్యంతో మదీనానుండి పయనమయ్యారు. మక్కాకు సమీపంలోనన్ను హుదైబియా ప్రదేశానికి చేరుకునేసరికి ఖురైషులు అడ్డుకున్నారు. ఆ సందర్భంగా ఉభయవర్గాల మధ్య సంధిసంప్రదింపులు జరుగుతుండగానే అబూజుందల్ బిన్ సుహైబ్ పరుగెత్తుకువచ్చారు. అబూజుందల్ ఇస్లాం స్వీకరించిన కారణంగా మక్కావాసులు ఆయన్ని వేధిస్తుండేవారు. ఆయన కాళ్లకు ఇనుపసంకెళ్లు వేశారు. ప్రవక్త తన సహచరుల సమేతంగా వచ్చి హుదైబియాలో మజిలీ చేశారన్న సంగతి తెలుసుకున్న అబూజుందల్ ఏదో విధంగా తప్పించుకుని హుదైబియా వచ్చేశారు. ఆ సమయంలో కూడా ఆయన కాళ్లకు బేడీలున్నాయి. శరీరమంతా గాయాలతో కందిపోయివుంది. ఆయన్ని చూసి సుహైబ్ బిన్ అమరవ్ (అబూజుందల్ తండ్రి), 'అబూజుందల్‌ను మాకు అప్పగించండి' అన్నాడు. అబూజుందల్‌ను అప్పగించటానికి ప్రవక్తగాని, ప్రవక్త సహచరులుగాని సుముఖంగా లేరు. మరోవైపు అబూజుందల్ తండ్రి మొండిపట్టుపట్టాడు. అబూజుందల్‌ను గనక మీరు నాకు అప్పగించకపోతే మీకు మాకు మధ్య సంధి కుదరదు అని కరాకండీగా చెప్పేశాడు.

అది అత్యంత సున్నితమైన ఘడియ. రక్తసిక్తమైన శరీరంతో అబూజుందల్ నిలబడి వున్నారు. "ముస్లిం సోదరులారా! నన్ను తిరిగి అవిశ్వాసుల వద్దకు పంపిస్తారా? చూడబోతే నేను ఇస్లాం స్వీకరించినవాణ్ణి. వాళ్లు నన్ను ఎంతగా హింసించారో మీరు చూడట్లేదా!" అని ప్రాధేయపడ్డారు. అయినప్పటికీ దైవప్రవక్త అబూజుందల్‌ను మక్కాకు పంపేశారు. ఆయన ఇలా అన్నారు.

"ఓ అబూజుందల్! ఓపిక పట్టండి. మీ కోసం మరియు బలహీనులైన ఇతర ముస్లింల కోసం అల్లాహ్ మార్గం తెరుస్తాడు". (సీరతున్ నభి ఇబ్నె ఇషామ్ సంపుట 3, పేజీ 367)

పోరాడటం, వీరమరణం పొందడమే పై హదీసు పరమార్థమనుకుంటే ప్రవక్త తన శిష్యుడైన అబూజుందల్‌ను ఓపిక పట్టమని బోధించేవారే కాదు. దానికి బదులు అమరగతి నొందే మార్గమే చూపించి ఉండేవారు, తాను సైతం సహచరులతో కలసి ఖురైషులతో తలపడి ఉండేవారు.

3. హుదైబియాకు చెందిన మరో ప్రధానాంశం – ఖురైషులు ప్రవక్తను అడ్డుకొని ఈ ఏడాది ఉమ్రా చేసేందుకు తాము సుతరామూ అనుమతించబోమని మొండిపట్టుపట్టారు. ప్రవక్త దీనికి సమ్మతించి 'ఉమ్రా' చేయకుండానే మదీనాకు తిరుగుముఖం పట్టారు. చూడబోతే ఇది ఫక్తు ధార్మిక విషయం. దైవ సంకేతం మేరకే ఆయన ఉమ్రా నిమిత్తం మదీనా నుండి మక్కాకు బయలుదేరారు. పై హదీసు ప్రకారం పోరాడి చావటమే అనివార్య అంశం అనుకుంటే ప్రవక్త ఆ ఏడాదే ఉమ్రా కొరకు మక్కానగరంలో ప్రవేశించి ఉండాల్సింది. దాని పరిణామాలు ఎంత భయంకరంగా ఉన్నా లెక్కచేయకుండా మక్కావైపుకు దూసుకుపోవాల్సింది. కాని ఆయన అలా చేయలేదు.

4. మక్కాలో ఆయన సహచరులైన అమ్మార్ బిన్ యాసిర్ మరియు ఆయన తల్లిదండ్రులు బనూ మష్జూమ్ దగ్గర బానిసలుగా ఉండేవారు. ఈ బానిసలు ప్రవక్త సందేశాన్ని విశ్వసించి ముస్లిములయ్యారు. వాళ్లు ఇస్లాం స్వీకరించటం బనూమఖ్జూమ్‌కు సుతరాము ఇష్టం లేదు. మిట్ట మధ్యాహ్నం మండే ఇసుక తెన్నెల్లోకి తీసుకుపోయి ఆ బానిసలను పడుకోబెట్టి తీవ్రమైన యాతనకు గురిచేసేవారు యజమానులు. కడకు ఆ కర్కశులు అమ్మార్ తల్లిని దారుణంగా హతమార్చారు. ఈ సంఘటనను గురించి వ్రాస్తూ ఇబ్నె హషామ్ ఇలా అంటారు.

"ప్రవక్త ఈ దీన జనుల వైపునుండి వస్తూ పోతూ, అవస్థను చూసి ఇలా అనేవారు : "ఓ యాసిర్ కుటుంబీకులారా! ఓపిక పట్టండి, మీ కొరకు స్వర్గలోక వాగ్దానముంది".

పై హదీసు భావం దీనికి భిన్నమైనదై ఉంటే ఓపిక పట్టమని బోధించటం పిరికితనానికి ఆనవాలు (దైవం మన్నించుగాక!) అవుతుంది.

మనిషి గనక సిన్సియర్ అయినట్లయితే అతన్ని సిన్సియారిటీ అతన్ని ఈ అంశాలపై ఆలోచింపజేస్తుంది. తనకనుకూలమైన విషయాన్ని తీసుకోవటమే అసలు ఉద్దేశ్యంగా గాక, యదార్థానికి దైవప్రవక్త అభిమతం ఏమిటో తెలుసుకోవాలన్న జిజ్ఞాస అతనిలో కలుగుతుంది. అతని ఈ ఆలోచన అతన్ని తప్పుడు అవగాహన నుండి కాపాడుతుంది. నిష్కలమషమైన

మనసుతో ఇప్పుడతను యోచన చేస్తాడు. దైవ సహాయంతో విషయం లోతుల్లోకి పోగలుగుతాడు. ఇప్పుడతనికి తెలిసివస్తుంది – ఒక గొప్ప లక్ష్య సాధనకోసం తేలికపాటి కష్టనష్టాలను భరించక తప్పదని!

విశ్వాసులకు అత్యంత ప్రధానమైనది సందేశపరమార్థమేగాని స్వీయప్రయోజనం కాదు. సందేశ లక్ష్యానికి – స్వీయప్రయోజనానికి మధ్య వ్యాఘాతం ఏర్పడినపుడు స్వీయప్రయోజనాన్ని త్యాగం చేయవలసి ఉంటుంది. పైన పేర్కొనబడిన సంఘటనల్లో ఓపిక పట్టమని ప్రవక్త ప్రబోధించటం వెనుక ఈ సందేశ పరమార్థమే దాగివుంది. సందేశ కృషిని ప్రభావంతంగా నిర్వర్తించడానికి గాను దైవ ప్రవక్త ధన, ప్రాణ, మమకారాలను త్యాగంచేశారు. ఆఖరికి శత్రువులు ధార్మిక విషయాల్లో తలదూరుస్తున్న తాత్కాలికంగా సహించి ఊరుకున్నారు. విశ్వాసుల అన్నిరకాల సాఫల్యాలకు మూలసాధనమై సందేశ కృషికి విఘాతం ఏర్పడరాదన్నదే దీని పరమార్థం.

మనిషి ముందు ఏదైనా ఆశయం ఉన్నప్పుడు అతడు అన్నిటికన్నా ఎక్కువగా ఆ ఆశయానికి ప్రాముఖ్యం ఇస్తాడు. కోరిన లక్ష్యం చేజారిపోకుండా ఉండేందుకు ఇతరత్రా కష్టనష్టాలను ఉపేక్షిస్తాడు. అదే అతని ముందు ఆశయం, లక్ష్యం లేవనుకోండి. అతను ప్రతి చిన్న విషయంలోనూ తలదూర్చి చిక్కుకుపోతూ ఉంటాడు. చీటికీ మాటికీ ఎదుటివారితో చిర్రుబుర్రుమంటుంటాడు. తన ఈ అనుచితమైన వైఖరికి ఎన్ని నష్టాలు ఎదురైనా సహిస్తుంటాడు – కాగా, సందేశ ప్రదాత అయిన మనిషి ఈ ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ ఆశయబద్ధుడైన జీవి. అంచేత అతడు నిత్యం మొదటి విధానానికే ప్రాముఖ్యతనిస్తాడు. రెండవ వైఖరికి దూరంగా ఉంటాడు.

ఈ ఉపోద్ఘాతం తరువాత మేము వివిధ కోణాలనుంచి దైవప్రవక్తకు సంబంధించిన కొన్ని సంఘటనలను ఉటంకిస్తున్నాము. వాటిలో మనకొరకు గొప్ప హితబోధ ఉంది.

## 1

దైవ ప్రవక్తగారి దైవ దౌత్య ప్రభవాన్ని ప్రస్తావిస్తూ ఇబ్నె హీషామ్ ఇలా వ్రాస్తున్నారు : దైవ ప్రవక్తను దైవ ప్రవక్తగా నియుక్తం చేయాలని తలచిన రోజుల్లో ఆయన పరిస్థితి గమనించదగినది. ఆయన ఏదైనా అవసరంపై ఇంటి నుంచి బయలుదేరితేచాలు, బహుదూరం వెళ్లిపోయేవారు. ఆయన మక్కా పర్వతశ్రేణుల్లో కనుమరుగైపోయేవారు. అబ్దుల్లా బిన్ జుబైర్ ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త ఏడాదిలో ఒక నెలరోజులపాటు హిరా కొండ వద్దకు వెళ్ళి ఆ ప్రదేశంలోనే ఉండిపోయేవారు (సీరత్ ఇబ్నె హిషామ్). ప్రవక్త స్థితిని గురించి అబూతాలిబ్

కొన్ని కవితలు అల్లారు. వాటిలో ఒక చరణం ఇది.

("హిరాపైకి ఎక్కటం, అక్కడి నుంచి దిగటం")

దైవప్రవక్తలో సత్యాన్ని కనుగొనాలనే జిజ్ఞాస రేకెత్తగానే ఆయన జనసామాన్యాన్ని విడిచిపెట్టి పర్వత ప్రాంతాల్లోకి వెళ్ళిపోయేవారు. ఇది మామూలు ప్రస్థానం కాదు, ఒక శుభాత్మ జనారణ్యంలోని రణగొణ ధ్వనులను వదలి దివ్యమైన లోకంలోకి వెళ్ళే ప్రస్తానమని! ఎడారి ప్రదేశం ఈ కార్యసాధనకై అత్యంత అనుకూలమైనచోటవుతుంది.

ప్రాచ్య విధ్యల్లో నిపుణుడైన రుమేనియా రచయిత కొన్‌స్తాన్ వర్సీల్ జార్జ్ ఇస్లాం భౌగోళిక స్థితిగతులను తెలుసుకునేందుకు అరేబియాలో పర్యటించాడు. అతను తన పుస్తకమైన "ఇస్లాం ప్రవక్త"లో ఇలా వ్రాశాడు. "మానవుడు అరేబియా ఎడారుల్లో, ప్రాచీన అడవుల్లో కొంతకాలం గడవనంతవరకూ ఆ ప్రాంతం ఏవిధంగా మానవ ఆలోచనలను వికసింపజేస్తుందో, భావాలు భావనలకు బలం చేకూరుస్తుందో అర్థం కాదు. అరేబియా గడ్డికి ఐరోపా గడ్డికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. మండుటెండల అడవుల్లో సువాసన లేని గడ్డి ఉండదు. ఆఖరికి అరబ్బు అడవుల్లోని తుమ్మచెట్లు సైతం సువాసనను వెదజల్లుతుంటాయి. 30 లక్షల కిలోమీటర్ల వైశాల్యంగల అడవి మరియు చంద్రనిప్పులు చెరిగే అరేబియా ప్రాంతంలో మనిషి పరోక్షంగా దైవ సామీప్యం పొంది ఉంటాడు.

ఇతర దేశాలు పెద్ద పెద్ద గోడలపై నిలబడి వున్న కట్టడాల్లాంటివి. కాని అరబ్బు ఎడారుల్లో సత్య దర్శనాన్నే అడ్డుకునే ఇలాంటి అవరోధం ఏదీలేదు. ప్రజలు ఏవైపు దృష్టిని సారించినా అనంతమైన అడవులు ఆకాసాలే వారికి కానవస్తాయి. ఇక్కడ దైవం మరియు దైవదూతలను గుర్తుపట్టడంలో ఏ అడ్డంకీ లేదు".

## 2

అజ్ఞాన కాలంలో కొంతమంది అరబ్బులు ఒక సాంఘిక ఒడంబడిక చేసుకున్నారు. అది "హిల్ఫుల్ ఫుజూల్"గా వ్యవహరించబడేది. అన్యాయం అక్రమాలను, దోపిడీ దౌర్జన్యాలను నిరోధించటం ఈ ఒడంబడిక ముఖ్యోద్దేశం. ఫజల్ బిన్ ఫజాలా, ఫజల్ బిన్ విదా అ, ఫుజైల్ బిన్ హారిన్ అనే ముగ్గురు వ్యక్తులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అందుచేత ఈ ఒప్పందానికి వారి పేర్ల మీదే "హిల్ఫుల్ ఫుజూల్" (ఫజల్ వాళ్ల ఒడంబడిక) అన్న పేరుపడింది. తొలిరోజుల్లో ఈ ఒప్పందం ఆశయ బద్ధంగా ఉండేది. కాని ఆ ముగ్గురు వ్యక్తులు మరణించిన తరువాత అది నామమాత్రంగా మిగిలిపోయింది. జుబైర్‌బిన్ అబ్దుల్

ముత్తలిబ్ ఈ ఒప్పందం గురించి తన కవితా సంపుటిలో ఇలా వ్రాసుకున్నాడు.

(ఫజల్ అనబడే వ్యక్తులు పరస్పర ఒడంబడిక చేసుకున్నారు. మక్కాలో అన్యాయం అక్రమాలు జరగరాదని ప్రతినబూనారు. వారు ఈ విషయంపై ప్రతినబూని దానికి కట్టుబడ్డారు. అంచేత మక్కాలోని పొరుగువాడు, బయటినుంచి వచ్చేవారందరూ సురక్షితు లయ్యారు.

ఇది జరిగిన కొన్ని సంవత్సరాల తరువాత అరేబియాలో ఒక అంతర్యుద్ధం జరిగింది. దాన్ని "హరబుల్ ఫుజ్జార్" (నిషిద్ధమాసాలలో చేసే యుద్ధం)గా వ్యవహరిస్తారు. ఈ యుద్ధానంతరం అరేబియాలో తిరిగి అశాంతి అలజడులు చెలరేగాయి. ఆరోజుల్లో యమన్‌కు చెందిన జుబైర్ తెగ వ్యక్తి ఒకతను వర్తక సామాగ్రితో మక్కా వచ్చాడు. ఖురైష్ సర్దారైన ఆస్ బిన్ వాయబ్ ఆ వ్యక్తి నుండి సామాగ్రి కొన్నాడుగాని అతనికి ఇవ్వవలసిన సొమ్మును ఇవ్వలేదు. సదరు యమన్ వ్యాపారి మక్కావారికి ఫిర్యాదు చేశాడు. అతడు కొన్ని కవితల ద్వారా నగర ప్రజలందరికీ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన మంచిని అభిలషించే కొంతమంది మక్కావాసులను కుదిపివేసింది. జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ చొరవపై బనూహాషిమ్ మరియు బనూ తమీమ్ తెగలకు చెందిన కొంతమంది అబ్దుల్లా బిన్ జద్ఆన్ ఇంట్లో సమావేశమయ్యారు. వారందరూ సమాలోచన చేసి 'హిల్ఫుల్ ఫుజూల్' ఒప్పందాన్ని పునరుద్ధరించాలని తీర్మానించారు. ఒప్పందానుసారం తామంతా పీడితునికి అండగా నిలబడతామని, అతని హక్కును అన్యాయ స్థునినుండి ఇప్పించటానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఒప్పందం చేసుకున్న తరువాత వారంతా ఆస్ బిన్ వాయల్ ఇంటికి వెళ్ళారు. అతను తీసుకున్న సామాగ్రినంతటినీ లాక్కుని సదరువ్యక్తికి అప్పజెప్పారు.

దైవ ప్రవక్త పిన్న వయసులో నున్న రోజుల్లో ఈ ఒప్పందం జరిగింది. అది వాస్తవానికి అరబ్బులు చేసుకున్న ఒప్పందమే అయినప్పటికీ ఆయన దాన్ని న్యాయబద్ధమైన దని ధృవీకరించారు. ఆ ఒప్పందానికి సంబంధించి ఆయన చెప్పిన మాటలు సీరత్ గ్రంథాలలో ఇలా పొందుపరచబడ్డాయి.

"అబ్దుల్లా బిన్ జద్ఆన్ ఇంట్లో జరిగిన ఆ ఒప్పందంలో నేను పాల్గొన్నాను. ఒకవేళ ఇస్లాం ఆవిర్భవించిన మీదట కూడా నన్ను అలాంటి దానిలో ఆహ్వానించి ఉంటే నేనందులో తప్పకుండా పాల్గొనేవాణ్ణి. హక్కుదారునికి అతనికి హక్కును ఇప్పిస్తామని, ఏ దుర్మార్గుడూ బలహీనుణ్ణి అణచకుండా అడ్డుకుంటామని వాళ్లు అందులో శపథం చేశారు".

ఇబ్నె హిషామ్ దీనికి సంబంధించిన కొన్ని సంఘటనలను సంకలనం చేశారు. బావివర్గాలపై హిల్ఫుల్ ఫుజూల్ ప్రభావం ఎంతగా పడిందో వాటి ద్వారా తెలుస్తుంది. వలీద్ బిన్ ఉత్‌బా గారు ముమావియాబిన్ అబూసుఫ్యాన్‌కు భ్రాతృజుడు. ముమావియాగారు ఆయన్ని మదీనా అమీర్‌గా నియమించారు ఆ కాలంలోనే వలీద్ బిన్ ఉతబకి – హుసైన్ బిన్ అలీకి మధ్య ఒక ఆస్తి తగాదా తలెత్తింది. వలీద్ తన అధికార బలం చేత దాన్ని వశపరచుకో జూశారు. దానికి హుసైన్ ఇలా అన్నారు.

"నేను దైవంపై ప్రమాణం చేసి చెబుతున్నాను – మీరు నా హక్కు విషయంలో న్యాయం చేయవలసి ఉంటుంది లేకపోతే నేను నా ఖడ్గాన్ని చేబూని మస్జిదె నబలీలో నిలుచుని హిల్ఫుల్ ఫుజూల్ పేరుపై ప్రజలను పిలుస్తాను".

ఆ సమయంలో అక్కడున్న అబ్దుల్లా బిన్ జుబైర్ కూడా అలాగే ప్రతిస్పందించారు. ఆయన ఇలా అన్నారు – 'నేను కూడా దైవంపై ప్రమాణం చేసి చెబుతున్నా, హుసైన్ గనక ఆ మేరకు పిలిస్తే నేనూ ఖడ్గం పుచ్చుకుంటాను, ఆయన హక్కు ఆయనకు దక్కడమో లేక ఇద్దరం అమరగతి నొందటమో జరిగేదాకా పోరాడుతాము' ఇది విని ముసల్విర్ బిన్ మఖ్రమ జహ్రి కూడా అలాగే చెప్పారు – అబ్దుర్రహ్మాన్ బిన్ ఉస్మాన్ తమీ కూడా అదే విధంగా స్పందించారు. ప్రజల్లో పెల్లుబికిన ఈ ప్రతిస్పందన గురించి తెలుసుకున్న వలీద్ బిన్ ఉదబ హుసైన్ హక్కును అప్పగించేశారు. (సీరత్ ఇబ్నె హిషామ్ : మొదటి సంపుటి – పేజీ 166)

పై వివరాల ద్వారా తెలిసేదేమిటంటే అశాంతి, అన్యాయం సమాజంలో ప్రబలినపుడు దాన్ని ఎదుర్కొనే సరైన ఇస్లాం మార్గం "హిల్ఫుల్‌ఫుజూల్" మార్గం. అంటే సభ్యసమాజంలోని సభ్యులు దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం దైవం సమక్షంలో ప్రతినబూని, దానికి కట్టుబడి ఉండాలి. ఎక్కడ ఏ దుర్మార్గుడు ఒక బలహీనుడిపై జులుం చేసినా సమయానికి అక్కడ చేరుకుని అన్యాయాన్ని అడ్డుకోవాలి. బలహీనునికి అతని హక్కును ఇప్పించాలి.

నేడు ప్రతి వీధిలో ప్రతి ఊరిలో ఈ సమస్య ఉంది. ఒక ముస్లిం మరో ముస్లింను వేధిస్తుంటాడు. ఒకడు ఇంకొకరిని కించపరచడానికి పూనుకుంటాడు. ఒకడు మరొకనిపై తప్పుడు కేసుల్ని బనాయిస్తాడు. ఒకడు వేరొకని సొమ్మును స్వాహా చేయడానికి ఎత్తులువేస్తాడు. చెప్పవచ్చిందేమిటంటే ఎవడికి ఏకాస్త బలం, అధికారం, పలుకుబడి వున్నా బలహీనుణ్ణి అణచివేయటానికి అన్యాయంగా ఇతరుల హక్కులను కాజేయటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇలాంటి సంఘటనలు వీధి వీధినా, వాడవాడనా అనుదినం జరుగుతున్నాయి. కాని అందరూ తమకు పట్టనట్లే తటస్థంగా ఉండిపోతున్నారు. కడకు బాధ్యతాయుతులైన వ్యక్తులు కూడా ఈ వ్యవహారాల్లో తలదూర్చకుండా చూచీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎవరికైనా ముస్లిం సమాజాన్ని సంస్కరించాలనో లేక జాతికి సేవచేయాలనో ఆసక్తి ఉంటే అతను సభలు పెట్టి ఉపన్యాసాలు దంచటం మొదలెడతాడు. నిజానికి చేయవలసింది పీడితుల ఫిర్యాదులు విని చేతనైన సహాయం చేయటమేగాని అధిక ప్రసంగాలివ్వటం కాదు. పీడితుల కొరకు సభలు పెట్టి ప్రసంగాలివ్వటం ఎటువంటిదంటే, ఒక వ్యక్తి గాయపడ్డాడు, మీరతన్ని ఆసుపత్రికి తీసుకువెళ్ళేబదులు ఒక బ్రహ్మాండమైన సదస్సు నిర్వహించి ఆ గాయం గురించి చర్చించదలిచారు".

## 3

ట్రైబల్ ఏరియాలో మనిషి తన తెగవారి నియమ నిబంధనలను సమర్థిస్తూ జీవితం గడిపేవాడు. తన తెగకు మద్దతునివ్వనంతకాలం ఆ తెగ వారి అండదండలు అతనికి ఉంటాయి. దైవ ప్రవక్త మక్కా జీవితంలోని తొలిదశలో తన పినతండ్రిగారైన అబూతాలిబ్ సంరక్షణలో ఉన్నారు. ఆయన బనూహాషిమ్ తెగకు నాయకుడు. దైవ ప్రవక్తకు దైవ దౌత్యం లభించిన పదవసంవత్సరంలో అబూతాలిబ్ చనిపోయారు. ఆ తరువాత అబూలహబ్ బనూహాషిమ్ తెగకు సర్దారుగా ఎన్నికయ్యాడు. వారు ప్రవక్తకు తన మద్దతును ఉపసంహరించుకున్నాడు. ఆయన మరో తెగ మద్దతు కోసం ప్రయత్నించారు. ఏ తెగవారైనా తనకు అండగానిలిస్తే సందేశ కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించవచ్చని దైవ ప్రవక్త భావించారు. ఆ ఉద్దేశ్యంతోనే తాయఫ్‌కు బయలుదేరారు.

తాయఫ్ పట్టణం మక్కాకు నైరుతీలో ఉంది. మక్కాకు 65 మైళ్ళ దూరాన వున్న ఈ పట్టణం పైరు పచ్చని ప్రదేశం. అక్కడ ఆయన బంధువులు కూడా కొంతమంది ఉన్నారు. తన బానిస అయిన జూద్ బిన్ హారిస్‌తో కలసి ఆయన అక్కడ చేరుకున్నారు. ఆ రోజుల్లో తాయిఫ్‌లో ముగ్గురు వ్యక్తులు (అబ్దెయాలీల్, మస్‌వూద్, హబీబ్) పలుకుబడి గల నాయకులుగా చెలామణీ అయ్యేవారు. దైవ ప్రవక్త ఆ ముగ్గురినీ కలుసుకున్నారు. కానివారిలో ఏ ఒక్కడూ ఆయనకు మద్దత్తు ఇవ్వడానికి అంగీకరించలేదు. దేవుడే గనక నిన్ను ప్రవక్తగా నియమించిన మాట నిజమైతే నేను కాబా గృహానికున్న పరదానుచించి పారేస్తానని ఒకడంటే, ప్రవక్తగా నియమించడానికి దేవుడికి నువ్వు తప్ప మరొకడు దొరకలేదా? అని రెండవవాడన్నాడు.

దైవసాక్షి! నేను నీతో మాట్లాడను. ఒకవేళ నీవు ప్రవక్తవైతే నీ మాటలకు బదులివ్వటం అపచారం. ఒకవేళ నువ్వు అబద్ధం చెబుతున్నట్లయితే నీతో మాట్లాడటం నాకేమాత్రం తగదు అని మూడవవాడన్నాడు. (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 2, పేజీ 29)

దైవ ప్రవక్త దుఃఖ వదనులై వెనుదిరిగారు. అయినా వాళ్లు వూరుకోలేదు. పురములోని తుంటరి మూకను ఆయనపైకి ఉసిగొలిపారు. వాళ్లు తిడుతూ, రాళ్లు రువ్వుతూ ఆయన వెనుకబడ్డారు. ఆయన సేవకుడైన జైద్ బిన్ హారిస్ ఆయన్ని తన కంబలిచేత అడ్డుకోవటానికి తీవ్రంగా యత్నించాడు. కాని ఆయనకు గాయాలు తగలకుండా అడ్డుకోలేకపోయాడు. ఆయన శరీరమంతా రక్తసిక్తమైపోయింది.

ఆ పురమునకు కొంత దూరంలో ఉతబా షైబాల ద్రాక్షతోట ఉంది. అక్కడకు చేరుకునే సరికి పొద్దుగూకింది. ఆయన ఆ తోటలో ఆశ్రయం పొందారు. శరీరమంతా గాయాలే. ఆ సమయంలో ఆయన దైవాన్ని వేడుకుంటున్నారు. దేవా! నాకు సహాయపడు. నన్ను ఒంటరి వాణ్ణి చేయకు!!

ఉతబా షైబా ఇద్దరూ బహుదైవారాధకులే. కాని ఆ స్థితిలో చూచిన వారిద్దరికీ ఆయనపై దయవచ్చింది. వాళ్లు అదాస్ అనే తన క్రైస్తవ బానిసను పిలిచి కొన్ని ద్రాక్షపండ్లు ఆయనకు పెట్టమని ఆదేశించారు. అదాస్ కొన్ని ద్రాక్షపండ్లను ఒక పాత్రలో తెచ్చి తినమంటూ మహా ప్రవక్త ముందు పెట్టాడు. దైవ ప్రవక్త ఆ పాత్రను పుచ్చుకుని 'బిస్మిల్లాహ్' (అల్లాహ్ పేరుతో) అని పలికి తినసాగారు.

అదాస్ ఆయన్ని ఆసక్తికరంగా చూసి, "దైవ సాక్షి! ఇప్పుడు మీరు పలికిన పలుకులు ఈ దేశస్థులెవరూ పలకరు" అన్నాడు. 'అదాస్! నువ్వు ఏ దేశస్థుడివి? నీవు అనుసరించే మతం ఏది?" అని దైవప్రవక్త ప్రశ్నించారు. "నేను క్రైస్తవమతస్తుణ్ణి, నీన్వా (ఇరాక్) నా స్వదేశం" అన్నాడు అదాస్. "ఓహూ! యూనుస్ బిన్ మత్తయివూరుకదూ!" అన్నారు దైవప్రవక్త. "యూనుస్ బిన్ మత్తయి ఎవరో మీకెట్లా తెలుసు?" అని ఆసక్తికరంగా అడిగాడు అదాస్ "ఆయన నా సోదరుడు. ఆయన ఒక దైవప్రవక్త. నేను కూడా దైవప్రవక్తనే" అన్నారు. ఆయన ఇది వినగానే అదాస్ అమాంతం ఆయనపై వాలిపోయాడు. గాయాలతో రక్తసిక్తమైన ఆయన కాళ్లు చేతుల్ని ముద్దాడసాగాడు.

ఉతబా షైబాలు కూడా ఈ దృశ్యాన్ని తదేకంగా తిలకిస్తున్నారు. చూశావా! ఈ వ్యక్తి నీ బానిసను చెడగొట్టేశాడు అని వారిలో ఒకడన్నాడు. అదాస్ అక్కడి నుండి తిరిగి వచ్చాక

వాళ్లు అతన్ని నిలదీశారు. "అదాస్! నీకేం పోయేరోగం వచ్చిందిరా? వాడి కాళ్లు చేతులు పట్టుకుంటావేం? అన్నారు. దానికి అదాస్ ఇచ్చిన సమాధానం గమనార్హమైనది. "ఓ యజమాని! ఈ ధరణిలో ఈయన్ని మించిన ఉత్తముడు ఎవరూ లేరు. ఒక దైవ ప్రవక్త తప్ప ఎవరూ తెలుపలేని విషయం ఆయన నాకు తెలిపారు". "ఒరేయ్ అదాస్! నీ పాడుగాను. వాడు నిన్ను నీ మతం నుండి ఎక్కడ తప్పిస్తాడో అని మా అనుమానంరా! ఎందుకంటే నీ మతం వాడి మతం కన్నా గొప్పది, తెలిసిందా?" అని మందలించారు ఆ తోట యజమానులు (సీరత్ ఇబ్నె హిషామ్ ఒకటవ సంపుటి, పేజి 421).

దైవప్రవక్తకు ఒకే ప్రయాణంలో ముగ్గురు విభిన్న వ్యక్తుల పరిచయం అయింది. ముగ్గురూ మూడు రకాలుగా ప్రవర్తించారు.

ఒకరు ఆయనపై రాళ్లురువ్వారు. మరొకరు ఆయనకు ఆతిధ్యమిచ్చారు.

వేరొకరు ఆయన దైవ దౌత్యాన్ని అంగీకరించారు.

ఈ సంఘటనలో గొప్ప గుణపాఠం ఉంది. అదేమిటంటే, ఈ ప్రపంచంలో అవకాశాలకు అంతులేదు. ఇక్కడ ఒకవైపున చదునైన ఇసుక ప్రదేశాలుంటే మరోవైపున నీడనిచ్చే మహావృక్షాలు కూడా నిలబడి ఉన్నాయి. ప్రపంచంలో కొంతమంది దురుసుగా వ్యవహరించినంత మాత్రాన మనం నిరుత్సాహం చెందకూడదు. మనిషి గనక స్వయంగా సత్యానికి కట్టుబడి ఉన్నట్లయితే, నకారాత్మక భావాలకు దూరంగా మసలుకున్నట్లయితే తప్పకుండా అతనికి దైవసహాయం ప్రాప్తిస్తుంది. ఒకరకం ప్రజలు అతనికి సహకార హస్తం అందించకపోతే మరో రకం జనుల హృదయాలు అతని కోసం మెత్తబడవచ్చు.

## 4

దైవప్రవక్త మక్కాలో సందేశపరిచయ కార్యక్రమాన్ని మొదలెడితే తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. ఆయనను అన్నిరకాల యాతనలకు లోను చేయటం జరిగింది. ఆయన్ని అణచి వేయటానికి, పరాభవం పాలుచేయటానికి వ్యతిరేకులు చేయవలసిందంతా చేశారు. కాని ఆయన కార్యక్రమం మాత్రం ఆగలేదు, పైగా అది పెరగసాగింది. కడకు మదీనా ప్రజల వరకు ఆ సందేశం చేరింది. అక్కడ ఎంతో మంది ఇస్లాం స్వీకరించారు. ఆయనతో పాటు ఇతర ముస్లిములను కూడా మక్కావారు వేధించటం మొదలెట్టారు. 'అల్లాహ్ మదీనాలో కొంతమంది సోదరులను మీకు సమకూర్చాడు. వారు మిమ్మల్ని అన్నివిధాలుగా ఆదుకుంటారు. మీరు అక్కడికి వెళ్ళిపోండి" అని దైవప్రవక్త మక్కా ముస్లిములకు సలహా ఇచ్చారు. ప్రజలు

ఒక్కొక్కరుగా వలసపోసాగారు. ఖురైషులకు ఈ సంగతి తెలిసింది. ఈ పథకాన్ని అడ్డుకోవాలని వాళ్ళంతా నిశ్చయించుకున్నారు. కొంతమందిని హింసించారు. మరి కొంతమందిని నిర్బంధించారు. అయినప్పటికీ చాలా మంది విశ్వాసులు ఎదో ఒక విధంగా మక్కా నుండి ప్రస్థానం చేసి మదీనా చేరుకున్నారు.

ఆఖరిలో దైవప్రవక్తగారి వంతు వచ్చింది. ముస్లిములందరినీ మదీనాకు పంపించిన ముహమ్మద్ ఆయన కూడా త్వరలోనే మక్కా వదలిపోతారని ఖురైషులు పసిగట్టేశారు. ఒక్క బనూహాషిమ్ తప్ప మిగిలిన తెగల నాయకులంతా 'దారున్నద్వా' (రచ్చబండ)లో సమావేశమయ్యారు. సమాలోచనలో పలు అభిప్రాయాలు ముందుకువచ్చాయి. చివరకు వాళ్ళంతా ఒక నిర్ణయానికి వచ్చారు. ఒక్కో తెగకు చెందిన ఒక్కో వ్యక్తి ఖడ్గం పుచ్చుకురావాలని అందరూ కలసి ఒకేసారి ఆయనపై మెరుపుదాడి చేసి హతమార్చాలని తీర్మానించారు. ఆ విధంగా ముహమ్మద్‌ను హతమార్చిన ఘనత అన్ని తెగలవారికీ దక్కాలన్నది వారి ఉద్దేశ్యం. ఈ వ్యూహరచన చేసిన మరునాడు రాత్రి సర్దార్లంతా ఆయన ఇంటిని చుట్టుముట్టారు. తెల్లవారాక ఆయన ఇంట్లోంచి బయటకు రాగానే అకస్మాత్తుగా దాడిచేయాలనుకున్నారు.

ఈ కుట్ర గురించి ప్రవక్తకు ముందే తెలిసిపోయింది. అయితే ఆయన కూడా మౌనంగా తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. తన పథకం ప్రకారం ఆయన అదే రాత్రి అబూబకర్ సిద్దీఖ్‌తో కలసి మక్కా నుండి బయలుదేరారు. మక్కాకు నాలుగు మైళ్లదూరాన ఉన్న సౌర్‌గుహ వరకు నడచివెళ్ళి గుహలో దాక్కున్నారు. తాను మక్కాను విడిచివెళ్ళిన సంగతి తెలియగానే ఖురైషులు నలువైపుల నుంచి తనను వెంటాడుతారన్న సంగతి ప్రవక్తకు ముందే తెలుసు. అందువల్ల కొన్నాళ్లపాటు సౌర్ గుహలోనే గడిపి, ఖురైషుల సందడి తగ్గిపోయిన తరువాత మదీనాకు బయలుదేరాలని ప్రవక్త భావించారు.

అనుకున్నంత పనీ అయింది. ఖురైషుల ఒంటెలు మక్కాకు నలువైపులా ఆయన్ని వెతికి పట్టుకోవటానికి పరుగెత్తుతున్నాయి. కొందరు శత్రువులు ఆయన్ని వెతుక్కుంటూ ఆయన తలదాచుకున్న గుహను సమపించారు. వాళ్లచేతుల్లో ఖడ్గాలున్నాయి. వాళ్ల కాళ్లు దైవప్రవక్త మరియు అబూబకర్‌లకు కనిపిస్తున్నాయి. అది అత్యంత సంక్లిష్టమైన సమయం. "దైవప్రవక్తా! శత్రువులు మమ్మల్ని సమీపించారని" భయాందోళన వ్యక్తపరిచారు అబూబకర్. "భయపడకండి, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు" (9:40) అని దైవ ప్రవక్త అబూబకర్‌ను ఓదార్చారు, తరువాత ప్రశాంతంగా ఇలా అన్నారు. 'ఓ ఆబూబకర్! ఏ ఇద్దరికి అండగా అల్లాహ్ ఉన్నాడు ఆ ఇద్దరి గురించి మీ అభిప్రాయం ఏమిటీ?" (బుఖారి హదీసు 3653)

# 5

దైవప్రవక్తకు ఎదురైన యుద్ధాలలో ఒక యుద్ధం పేరు జాతిర్రిఖా. అది హిజ్రి 4వ ఏట జరిగింది. ఈ యుద్ధానికి సంబంధించిన సంఘటనలలో ఒకటి బుఖారి (కితాబుల మగాజీ)లో జాబిర్ ద్వారా ఉల్లేఖించబడింది. సీరత్ గ్రంథాలలో కూడా ఈ సంఘటన స్వల్పమైన వ్యత్యాసంతో ప్రచురించబడింది.

బనూగత్ఫాన్ తెగకు చెందిన ఒక వ్యక్తిపేరు గౌరిస్ బిన్ హారిస్. అతను తన జాతివారితో, నేను మీ కోసం ముహమ్మద్‌ను హతమార్చనా? అన్నాడు. తప్పకుండా హతమార్చు కాని నువ్వీపని ఎలా చేయగలవ్?' "నేనాయన్ని ఏమరుపాటు గురై వున్న సమయంలో పట్టుకుని హతమారుస్తాను" అన్నాడు గౌరస్. ఆ తరువాత అతను బయలుదేరాడు. దైవప్రవక్త తన సహచరులతో మజిలీ చేసిన చోటుకు చేరాడు. ఆ స్థలంలో చెట్లు, కంపలు ఉన్నాయి. ప్రజలు చెట్ల నీడక్రింద విశ్రమించి ఉన్నారు. ఆయన తన ఖడ్గాన్ని చెట్టు కొమ్మకు వ్రేలాడదీసివున్నారు. అంతలో ఆ పల్లెటూరి బైతు ఆయన్ని వెతుక్కుంటూ సమీపించాడు. ఆయన ఒంటరిగా, నిరాయుధులై పండుకుని ఉండటం గమనించిన గౌరిస్ ఒక్క ఉదుటున ఖడ్గం తీసి ప్రవక్త వైపుకు లంఘించాడు. "ఈ వేళ నానుండి మిమ్మల్ని రక్షించగల వాడెవడో?" అని గద్దించాడు. "అల్లాహ్ రక్షిస్తాడు" అన్నారు దైవప్రవక్త. "మీ ఖడ్గాన్ని చూడండి. ఇప్పుడిది నా చేతుల్లో ఉంది. ఇది చూచి మీరు భయపడటం లేదా?" అన్నాడు. "లేదు, నేను నీకు భయపడటమేమిటీ? అల్లాహ్ నన్ను రక్షిస్తాడన్న సంగతి నాకు తెలుసు" ఆత్మ విశ్వాసం నిండిన ఆయన సమాధానం వినేసరికి ఆ మొరటోడికి చర్య తీసుకునేందుకు ధైర్యం చాల్లేదు. అతడు ఖడ్గాన్ని ఒరలో పెట్టి ఆయనకు తిరిగి ఇచ్చేశాడు. సహచరులు వచ్చి చూస్తే ఆయన ఎదుట ఒక పల్లెటూరి మనిషి బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. ఏ క్షణంలోనైనా ఆ ఖడ్గంతో తన తల నరకటం ఖాయమనుకున్నాడు. కాని ఆయన అతన్ని విడిచిపెట్టేశారు. ఏ విధమైన శిక్షా విధించలేదు. (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి – 2, పేజీ 205, అస్మీరాత్ ఇబ్నె కసీర్ మూడోవ భాగం, పేజీ 64-162).

అల్లాహ్‌పై పూర్తి విశ్వాసం కలవారు మరేవస్తువుకూ భయపడరు. అల్లాహ్ ఒక మహాశక్తిమంతుడని, అతడు అనుక్షణం మనిషిని కనిపెట్టి ఉన్నాడని విశ్వాసమున్నప్పుడూ మనిషి మరే శక్తిముందు పిరికితనంతో తలవంచడు. వాస్తవానికి శత్రువుముందు కనబరచే నిర్భయమే అతనిపాలిట గొప్పవానికి, తన ప్రతిద్వంది తనకు భయపడటంలేదన్న సంగతిని గ్రహించిన మరుక్షణం నుంచే శత్రువు భయపడసాగుతాడు.

# 6

దైవప్రవక్త పాల్గొన్న యుద్ధాలలో ఒకటి కందక యుద్ధం. అది హిజ్రీ 5వ సంవత్సరం షవ్వాల్ మాసంలో జరిగింది. దీన్నే అహ్జాబ్ యుద్ధం అని కూడా అంటారు. అంటే సైనికపటాలాల యుద్ధం. ఈ యుద్ధంలో అరేబియాకు చెందిన అనేక తెగలు మూకుమ్మడిగా మదీనాపై దండయాత్ర చేశాయి. ఖురైష్ తెగలు, అతఫాన్ తెగలు, యూద తెగలు దాదాపు 10వేల మంది సైనికులతో ఈ దాడి జరిగింది. ఆ దండయాత్ర ఎంత భీకరమైనదో దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనాల ద్వారా ఊహించవచ్చు. "వారు పైనుంచి క్రింది నుంచి మీపైకి దండెత్తి వస్తున్నప్పుడు భయంతో మీకళ్లు చెదరిపోయాయి. గుండెలు గొంతు దాటి (నోట్లోకి) వచ్చేశాయి. ఇంకా మీరు దేవుని విషయమై రకరకాల అనుమానాలు వ్యక్తం చేయసాగారు. ఆ సమయంలో విశ్వాసులకు పెద్ద పరీక్ష ఎదురైంది. ఇంకా వారు బాగా దెబ్బతిన్నారు (33:11). ఇస్లాం వ్యతిరేకుల ఈ సైన్యం అన్ని విధాలుగా సాయుధమై వుంది. అందులో నాలుగున్నర వేల ఒంటెలు, మూడు వందల గుఱ్ఱాలు ఉన్నాయి.

శత్రువులు మదీనాను దిగ్బంధం చేశారు. నగరం వెలుపలినుంచి ముస్లిములకు ఎలాంటి సహాయం అందే అవకాశం లేకుండా చేశారు. ఆహారపదార్థాల కొరత తీవ్రతమై అనేకమంది పస్తులుండవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే ఒక సహచరుడు తన ఆకలిబాధను గురించి ఫిర్యాదు చేసుకుంటూ చొక్కా లేపిచూపారు. ఆయన కడుపుకు ఒక రాయి కట్టుకుని ఉన్నారు. ఆయన ఫిర్యాదుకు జవాబుగా ప్రవక్త తన చొక్కాను ఎత్తిచూపగా ఆయన కడుపుపై రెండు రాళ్లు కనిపించాయి.

అనేక తెగలవారు కలసి ఉమ్మడిగా మదీనాపై దండెత్తి వస్తున్నారని తెలియగానే ప్రవక్త తన ప్రియసహచరులందరితో సంప్రదించారు. సల్మాన్ ఫార్సీ సలహాప్రకారం మదీనాలోనే ఉండి ప్రతిఘటించాలనే నిర్ణయం తీసుకోబడింది. ఆ కాలంలో మదీనా మూడువైపుల నుంచి కొండలు, దట్టమైన వృక్షాలు, ఇళ్ల గోడలతో ఆవరించబడి ఉండేది. ఒక్క ఈశాన్య ప్రాంతం మాత్రమే ఖాళీగా వుంది. ఆ ఖాళీప్రదేశంలో రెండు పర్వతాలకు మధ్య కందకం త్రవ్వాలని నిర్ణయించబడింది. ఆరు రోజులు నిరంతర శ్రమ ఫలితంగా ఒక కందకం తయారయింది. శత్రువుల దాడిని నిరోధించటంలో ఆ కందకం ఎంతగానో ఉపయోగపడింది. ఆ కారణంగానే ఆ యుద్ధానికి కందక యుద్ధం అనే పేరు పడింది.

సీరత్ గ్రంథాలలో కందకం వివరాలను మనం చదువుతున్నప్పుడు ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఒక మామూలు కందకం అంత పెద్ద సైన్యాన్ని నిలువరించటంలో

ఎలా దోహదపడింది? అన్న సంశయం కలగవచ్చు. పై వివరాల ప్రకారం ఈ కందకం సుమారు 6 కిలోమీటర్ల పొడవైనది. దాని లోతుగాని, వెడల్పుగాని ఒక చిన్న కాలువసైజుకంటే ఎక్కువేమీ కాదు. అది రెండున్నర మీటర్ల లోతు, మూడు మీటర్ల వెడల్పు గల కందకం. ఇలాంటి కందకం సాయుధులైన భారీసైన్యం ముందు పెద్ద అవరోధం కాకపోవచ్చు. వాళ్లు చాలా సులువుగా ఆ ఆగడ్తను దాటి మదీనాలోకి చొచ్చుకుపోవచ్చు. ఈ కందకం త్రవ్వినప్పటికీ చాలా మంది ముస్లిములు శత్రువుల బాణాలకు ఆహుతి అయినట్లు చరిత్ర చెబుతోంది. సాద్ బిన్ మ ఆజ్‌కు తగిలిన బాణం దీనికి ఒక మచ్చుతునక. అదీగాక శత్రు సైనికుల్లో కొంతమంది ఈ కందకాన్ని దాటి అవతలివైపుకు పోవటంలో కృతకృత్యులైపోయారు. ఉమర్ బిన్ అబ్దూద్ కొంతమంది సైనికులతో గుఱ్ఱమెక్కి కందకాన్ని పరిశీలించాడు. కందకం వెడల్పు కాస్త తక్కువగా ఉన్నచోట ఆగి గుఱ్ఱాన్ని అవతలివైపుకు దూకించాడు. హజ్రత్ అలీ అతన్ని ఎదుర్కొన్నారు. భీకర యుద్ధం తరువాత అబ్దూద్ మట్టి కరిచాడు. దాదాపు ఒకనెల రోజులపాటు కొనసాగిన ఈ ముట్టడి ఆఖరికి ఒక పెనుతుఫాను తరువాత ముగిసింది. ఆ తుఫాను శత్రుసైనికుల్లో కలవరం సృష్టించింది. అబూసుఫ్యాన్ ఒంటెత్రాడును విప్పకుండానే ఒంటెపై కూర్చుని దాన్ని తొలసాగాడంటే శత్రుశిబిరంలో ఎంతటి భయోత్పాతం ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు. 10వేల మంది సైనికులు కందకం దాటి, మదీనాలో నామమాత్రపు ఆయుధాలతో దిక్కుతోచని స్థితిలోవున్న మూడువేల మంది జనులను ఎందుకు అదుపులోకి తీసుకోలేదన్న ప్రశ్న కూడా ఇంకా మిగిలేవుంది.

ఈ ప్రశ్నకు సమాధానం ఇందులో దేవుని ఒక సంప్రదాయం తెలుస్తుంది. ఆ సంప్రదాయం ఏమిటంటే, అల్లాహ్ విశ్వాసుల బలాన్ని వారి శత్రువులకు రెట్టింపు చేసి చూపుతాడు. శత్రుసైనికుల్లో భయాందోళనలు కలగటమే దీని ఉద్దేశ్యం. దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడింది. "మేము అవిశ్వాసుల హృదయాల్లో మీరంటే భయం కలిగిస్తాము. ఎందుకంటే వాళ్లు, అల్లాహ్ ఏ ఆధారమూ అవతరింపజేయని వస్తువులను అల్లాహ్‌కు సహవర్తులుగా నిలబెట్టారు (3:151). అల్లాహ్ యొక్క ఈ సహాయం కందక యుద్ధంలోనూ, మరితర పోరాటాల్లోనూ ప్రస్ఫుటమయ్యింది. ఈ యుద్ధంలో ముస్లింలు త్రవ్విన అగడ్త అవిశ్వాసుల కంటికి చాలా పెద్దదిగా కానవచ్చింది. ముస్లింలే గనక ఆ కాలువను త్రవ్వకపోతే దేవుడు ఆ చిన్న కాలువను భయంకరమైన కందకంగా చేసి శత్రువులకు ఎలా చూపెడతాడు?

తొలి కాలపు ముస్లింలకు అనూహ్యమైన రీతిలో అందిన ఈ దైవసహాయం తరువాయికాలపు ముస్లింములకు కూడా అందటం ఆశ్చర్యకరమేమీ కాదు. అయితే వారు

దైవప్రవక్త ప్రియ సహచరుల మాదిరిగా దైవప్రవక్త అడుగుజాడల్లో నడవాలన్నదే షరతు. దీన్ని కాదని ఇతరత్రా మార్గాల్లో నడిచేవారు షైతాన్ సహచరులవుతారు. మరి అలాంటప్పుడు వారికి దేవునితోడ్పాటు ఎలా లభిస్తుంది? మనిషి సత్యానికి పూర్తిగా బద్ధుడై ఆ సత్యం కొరకు తన సర్వస్వాన్ని అర్పించటానికి సిద్ధమైనపుడు, తమ కీర్తి కిరీటాన్ని మరచిపోయినపుడు, మాత్రమే అతనికి దైవసహాయం అందుతుంది.

దైవ సహాయానికి నోచుకునే షరతు ఒక్కముక్కలో ఏమిటంటే, "మీరు సాయపడితే మీకు సహాయం లభిస్తుంది". దైవం నుంచి ఏ సహాయాన్నైతే మనం కోరుకుంటున్నామో ఆ సహాయాన్ని మనం ఇతరులకు చేసినపుడే మనల్ని ఆదుకోవటానికి దేవుడు కదలివస్తాడు. మన చేతులతో ఇతరులకు ఇబ్బంది కలుగుతున్నప్పుడు దైవదూతలు దైవకారుణ్యాన్ని మోసుకుని మనదగ్గరకు రాలేరు. ఎవరిపై మన అదుపు అజమాయిషీ చెల్లుతుందో వారిని మనం అన్యాయంగా వేధిస్తే దేవుడు మనకు తోడ్పడటం అసంభవం. ఒక వ్యక్తి కష్టాల్లో వుండి మనల్ని మొరపెట్టుకుంటూ ఉండగా, అతనికి సాయపడే స్థోమత కలిగిఉండి కూడా మనం అతన్ని ఆదుకోకపోతే ఒక బలవంతుడు మనల్ని వేధిస్తున్న క్షణంలో మనం పెట్టే మొరను దేవుడు ఆలకించి ఎందుకు ఆదుకుంటాడు. ప్రపంచ జీవితంలో మనిషి కొందరి ముందు బలవంతునిగా ఉంటే మరికొందరి సమక్షంలో బలహీనుడుగా ఉంటాడు. పరిస్థితుల ఈ స్వరూపమే దేవుని విషయంలో మనిషికి పరీక్షా పత్రం వంటిది. ఒక మనిషైనా లేక ఒక జాతైనా తాను దేవుని నుంచి ఒక విధమైన తోడ్పాటును ఆశిస్తున్నప్పుడు అలాంటి తోడ్పాటును తనకన్నా బలహీనుడైన వారికి అందించి ఉండాలి మరి! అప్పుడే ఆ వ్యక్తి లేదా ఆ జాతి బలవంతులకు దీటుగా దైవసహాయం పొందడానికి అర్హులవుతారు. ఒకవైపు తాము సాటి మనుషుల యెడల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తూ మరోవైపు దేవుని దయాదాక్షిణ్యాలను అర్థించేవాడు నిజంగా దైవసహాయానికి అర్హుడు కాలేడు.

## 7

బద్ర్‌యుద్ధానికి (హిజ్రీ 2) కొన్ని రోజుల క్రితం ఖురైష్‌కు చెందిన 60 మందితో కూడిన ఒక పెద్ద వర్తక బృందం సిరియా పంపబడింది. ఆ వర్తకంలో మక్కాకు చెందిన పురుషులు స్త్రీలు తమ పెట్టుబడినంతా పెట్టారు. బద్ర్ యుద్ధంలో ఖురైషులకు, సంపూర్ణ పరాజయం తీరప్రాంతం గుండా నడిపించి మక్కా చేరటంలో కృతకృత్యుడయ్యాడు. యుద్ధానంతరం మక్కావారంతా ప్రతీకార వాంఛతో ఉన్నారు. కురైషు నాయకులు కొందరు 'దారున్నద్వ'లో సమావేశమయ్యారు. వాణిజ్యంలో పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారులు కేవలం

తమ పెట్టుబడిని మాత్రమే తీసుకోవాలని, లాభాలన్నీ యుద్ధసన్నాహాల కోసం కేటాయించాలని ఆ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. లాభాల మొత్తం 50 వేలదీనార్లు జమ అయ్యాయి. ఆ కాలంలో 50 వేల దీనార్లంటే చాలా పెద్దమొత్తం. ఖురైషులు అత్యుత్సాహంతో యుద్ధ సన్నాహాలు ప్రారంభించి హిజ్రీశఖం 3వ ఏట షవ్వాల్ మాసంలో మదీనాపై దండయాత్రకు బయలుదేరారు.

ఈ యుద్ధం పేరే ఉహద్ యుద్ధం. ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త తన ప్రియ సహచరులను సమావేశ పరిచారు. వాళ్ళ సలహా కోరారు. మదీనాలో ఉండి ప్రతిఘటించడం శ్రేయస్కరమని సీనియర్ సహచరుల్లో చాలామంది అభిప్రాయపడ్డారు. కాని యువకులు ఈ ప్రతిపాదనకు తీవ్రంగా వ్యతిరేకించారు. తాము గనక మదీనాలో ఉండిపోతే శత్రువులు దానిని తమ బలహీనతగా భావిస్తారని వారి ఆలోచన. అందుకే తాము నగరం బయటకు వెళ్ళి శత్రువును ఎదుర్కోవాలని యువకులు కోరారు (సీరత్ ఇబ్నెహిషామ్ సంపుటి 2, పేజీ 64)

మదీనాలోనే ఉండి యుద్ధం చేయాలని తలచినవారి ఆలోచనలు వేరు. దాని వెనుక మదీనా భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. భౌగోళికంగా మదీనా నగరం శత్రుసేనలకు కొరుకుడు పడకుండా ఉండేది. మదీనాకు దక్షిణాన దట్టమైన ఖర్జూరపు తోటలుండేవి. శత్రువు అటువైపునుంచి జోరబడేందుకు ఆస్కారం లేదు. తూర్పు పశ్చిమ దిశల్లో ఎత్తైన పర్వతాలు ఉండటం వల్ల శత్రుసేనలు అటువైపుగా ముందడుగు వేయటం చాలాకష్టం. భౌగోళికమైన ఈ స్థితి మదీనాను ఒక సురక్షితమైన ప్రదేశంగా తీర్చిదిద్దింది. ఒక విధంగా అది కంచుకోట లాంటాది. నగరం దాటి బయటకువస్తే వాళ్ళు నలువైపులనుంచీ శత్రువుల చేత చుట్టుముట్టబడతారు. కాగా, మదీనాలో ఉండిపోతే కేవలం ఒకవైపు నుంచే శత్రువుకు మార్గం దొరుకుతుంది. కందక యుద్ధంలో ఈ భౌగోళిక స్థితే ముస్లిములకు దోహదపడింది. ఈశాన్య ప్రాంతంలో వారు కందకం త్రవ్వుకుని నగరమంతటినీ సురక్షితం చేసుకున్నారు.

అబ్దుల్లా బిన్ ఉబై మరియు సహచరుల్లో పెద్దవారు మదీనాలో ఉండి ప్రతిఘటించాలని అభిప్రాయపడినప్పటికీ ఆయన నవయువకుల అభిప్రాయాన్ని పరిగణణలోకి తీసుకున్నారు. వెయ్యిమంది సైనికుల్ని తీసుకుని ఉహద్ వైపుకు పయనమయ్యారు. విలువైన తన అభిప్రాయాన్ని ఖాతరు చేయనందుకు అబ్దుల్లా బిన్ ఉబై ఉడుక్కున్నాడు. అందరితో పాటు మదీనా విడిచి వచ్చినప్పటికీ లోలోపల అతనికి కోసం ఉంది. ముస్లిం సైనికులు మదీనాకి ఉహద్‌కి మధ్యలో ఉండగానే అబ్దుల్లా బిన్ ఉబై 300 మంది అనుచరులతో మదీనాకు తిరోన్ముఖుడయ్యాడు, అతనిలా అన్నాడు.

“దైవ ప్రవక్త (స) వాళ్ల మాట విన్నారు గాని నా మాటను లక్ష్య పెట్టలేదు. ప్రజలారా! మనం మన ప్రాణాల్ని ఇక్కడ ఎందుకు పోగొట్టుకోవాలో మనకే తెలీదు”.

మదీనాలో ఉండి పోరాడటమే సమంజసం అని చెప్పేవారి అభిప్రాయమే నిజమైనదని ఉహద్ పరాజయం నిరూపించింది. అందుచేత కందకయుద్ధం (హిజ్రీ –5) జరిగినపుడు ఈ అభిప్రాయాన్నే గౌరవించటం జరిగింది. అయితే పెద్ద సహచరులంతా తమ అభిప్రాయంతో ఏకీభవించకపోయినప్పటికీ దైవప్రవక్తకు అండగా నిలిచారు. యుద్ధంలో తీవ్రమైన కష్టనష్టాలకు ఓర్చి శత్రువును ఎదిరించారు. ఒక్క అబ్దుల్లా బిన్ ఉబై మాత్రమే వేర్పడ్డాడు. ఆ రకంగా అతను కపటాగ్రేసనరుడుగా పేరుమోసాడు. అబ్దుల్లా బిన్ ఉబై అభిప్రాయం సూత్రప్రాయంగా సరైందేగాని అతను తుది నిర్ణయాన్ని శిరసావహించకుండా చూపిన విముఖత అతని మార్గ భ్రష్టతకు, దైవాగ్రహానికి కారణభూతమైంది.

ఇస్లాంతో అభిప్రాయ సేకరణకు గల ప్రాముఖ్యం అపారం. ప్రతి ఒక్కరికీ తన అభిప్రాయం తెలిపే హక్కుంది. అయితే సలహా ఇచ్చే ప్రతి ఒక్కడూ తన సలహాయే చెల్లాలని కోరుకుంటే ఏ పనీ నెరవేరదు. ఎందుకంటే విభిన్న అభిప్రాయాలలో ఏదో ఒక అభిప్రాయమే క్రియాత్మకంగా స్వీకరించబడుతుంది. తమ మనసులోని అభిప్రాయాన్ని తెలిపిన తరువాత ఆ సంగతిని మరచిపోయే వారే నిజమైన ముస్లిములు. నాయకులు ఒక నిర్ణయం గైకొన్న మీదట వాళ్లు మనసారా దాన్ని స్వీకరించాలి. తమ స్వంత అభిప్రాయం మాదిరిగానే దాన్ని గౌరవించాలి.

“అన్నింటికన్నా గొప్ప త్యాగం అభిప్రాయత్యాగం”. అన్న వ్యక్తి మాటలు ఎంతో అర్థవంతమైనది. వాస్తవానికి అభిప్రాయ త్యాగం అద్భుతమైనది. దానిపైనే పటిష్టమైన ఒక సమాజం నిలబడగలుగుతుంది. కొన్ని ఇటుకలు తమనుతాము పునాది రాళ్లుగా అర్పించుకోవటానికి సిద్ధమైనపుడే ఒక కట్టడం తయారవుతుంది. అలాగే కొంతమంది తమ వ్యక్తిగత అభిప్రాయాలను గుండెల్లో పూడ్చుకుని, అభిప్రాయభేదాలున్నప్పటికీ సంఘటితంగా పాటుపడినపుడే నిజమైన సామూహికత ఉనికిలోకి వస్తుంది. ఇటుకలు పునాదిలో పూడ్చుబడటానికి సిద్ధమవనిదే కట్టడం నిర్మితం కావటం ఏ విధంగానైతే అసంభవమో త్యాగాలు చేయనిదే సంఘటిత మానవ సమాజం తయారవటం కూడా అదేవిధంగా అసంభవం.

## 8

హిజ్రీ 6వ సంవత్సరంలో ప్రవక్త ఒక కలగన్నారు. కలలో ఆయన తన సహచరులతో

కలసి 'ఉమ్రా' చేస్తున్నారు. ఈ సంగతిని తన సహచరులకు తెలియచేశారు. దైవప్రవక్త సహచరులందరూ సంతోషించారు. 6 సంవత్సరాల తరువాత స్వదేశాన్ని చూచే పవిత్ర 'కాబా'ను సందర్శించే అవకాశం లభిస్తున్నందుకు వారికి ఎంతో ఆనందంగా ఉంది. ఈ కల ప్రకారం ప్రవక్త సహచరులతో కలసి మక్కాకు బయలుదేరారు. వాళ్లంతా మొత్తం 1400 మంది ఉన్నారు. గదీర్ అష్తాత్ అనే స్థలానికి చేరుకునే సరికి, మక్కా వాసులు తమరాకను గురించి తెలుసుకుని ప్రతిఘటనా సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

కాబా గృహ సందర్శనార్థం వచ్చిన వారిని నిలువరించటం అరబ్బు ఆచారానికి విరుద్ధం. అదీగాక ఆయన దైవసంకేతం మేరకు ప్రయాణమయ్యారు. అయినప్పటికీ ఆయన ఈ వార్త విని రెచ్చిపోలేదు. ఖాలిద్ బిన్ వలీద్ రెండువందల మంది సైనికులతో దారిలో అడ్డుకోవటానికి 'గమీమ్' వరకూ వచ్చేశాడని ఆయన గూఢచార సిబ్బంది కబురు పంపింది. ఈ వార్త వినగానే ప్రవక్త ప్రధాన రహదారిని వదిలేసి దుర్గమమైన మార్గంగుండా ప్రయాణం చేసి హుదైబియా వరకు చేరుకున్నారు. ఖాలిద్‌ను ఎదుర్కొనే స్థితి రాకూడదన్నదే దీని ముఖ్యోద్దేశం. ఈ సంఘటన ఇబ్నెహిషామ్‌లో ఇలా పొందుపరచబడి ఉంది.

"వాళ్ళ మార్గానికి భిన్నమైన మార్గంగుండా మమ్మల్ని తీసుకువెళ్ళే వారెవరు?" అని దైవప్రవక్త ప్రశ్నించగా 'నేను ఓ దైవప్రవక్తా!' అంటూ ఒక వ్యక్తి ముందుకువచ్చాడు. ఆ తరువాత అతను ఓ ఇరుకైన, రాళ్లు రప్పలున్న మార్గం గుండా నడిపించుకుంటూ పోయాడు. ముస్లిములు ఈ మార్గంలోంచి పోతున్నప్పుడు వారికి చాలా బాధ కలిగింది. పర్వతశ్రేణిని దాటి ఒక చదునైన స్థలానికి చేరిన మీదట దైవప్రవక్త అందరినీ ఉద్దేశించి, "మేము దైవసన్నిధిలో క్షమాభిక్షకై వేడుకుంటున్నాము. మేమంతా ఆయన వైపుకే మరలుతున్నాము" అని అనండి అన్నారు. సహచరులంతా అలాగే అన్నారు. "దైవ సాక్షి! ఈ విధంగానే బనీ ఇస్రాయీల్‌తో కూడా చెప్పబడింది (2:58). కాని వాళ్లు మాట వినలేదు" అని ప్రవక్త సెలవిచ్చారు.

సహన స్థయిర్యాలకు అగ్నిపరీక్షలాంటి ఆ సమయంలో మనిషిలో పశ్చాత్తాపభావం, ధర్మనిరతి ఉట్టిపడుతుండాలి. ఈ మార్గంలో నడుస్తున్నప్పుడు ఎన్ని చిక్కులు ఎదురైనా మరెన్ని అవాంతరాలు వచ్చిపడినా అవన్నీ తమ స్వయంకృతాపరాధాల ఫలమేనని తలపోసి దైవాభీష్టంతో రాజీపడాలి. అంతేగాని ఆత్మ విశ్వాసం కోల్పోయి పెడత్రోవ తొక్కరాదు, కుడి ఎడమల అపమార్గాలకు లోనుకారాదు.

హుదైబియా ప్రాంతం మక్కాకు 9 మైళ్ల దూరాన ఉంది. పరిస్థితులను బేరీజు వేయటానికి ఆయన అక్కడ మజిలీ చేశారు. ఆయన ఖరాష్ బిన్ ఉమయ్య ఖుజాయి అనే సహచరుడికి ఒక ఒంటెనిచ్చి మక్కాకు పంపిస్తూ, కేవలం దైవహృగృహాన్ని సందర్శించి వెళ్లటమే తమ ఉద్దేశ్యమని తాము యుద్ధం చేయటానికి రాలేదని మక్కా వారికి సందేశం ఇచ్చారు. కాని ఖురాష్ మక్కాలో ప్రవేశించగానే వాళ్లు కోపంతో ఒంటెను జిబహ్ చేయటమే గాక ఖురష్‌ను సయితం హతమార్చడానికి ఎగబడ్డారు. ఖురాష్ ఎలాగో తప్పించుకుని వచ్చేశారు. ఉస్మాన్ ద్వారా మరోసారి ఆ సందేశం పంపించారు ప్రవక్త. మక్కావాసులు మందితో కలసి హుదైబియా వచ్చి ముస్లింలు నిద్రిస్తున్న గుడారాలపై రాళ్లు రువ్వారు. మక్రజ్‌ను ముస్లింలు అదుపులోకి తీసుకున్నారు. కాని అతనిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. బేషరతుగా అతన్ని విడిచిపెట్టారు. అలాగే తెలతెలవారుతుండగా – ముస్లింలు నమాజ్ చేస్తున్న సమయంలో 80 మంది వచ్చి మెరుపుదాడి చేశారు. వాళ్లు కూడా పట్టుబడ్డారు. ఆఖరికి వాళ్లను కూడా ప్రవక్త బేషరతుగా విడిచిపెట్టేశారు.

ఆ తరువాత ఇరు వర్గాల మధ్య సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. సంధి కుదిరింది. ఈ సంధి స్థూల దృష్టిగల వారికంటికి ఖురైషుల విజయంగా, ముస్లిముల ఘోరపరాజయంగా కానవచ్చింది. దేవుని శుభవార్త అధారంగా తము కాబా సందర్శనార్థం మక్కా వెళుతున్నామని ముస్లిములు భావించారు. కాని ప్రవక్త ఉమ్రా చేయకుండానే హుదైబియా నుంచి తిరిగి పోవటానికి అంగీకరించారు. వచ్చే సంవత్సరం ఉమ్రా చేయడానికి రావచ్చుగాని మూడు రోజులు మాత్రమే మక్కాలో ఉండి, ఆ తరువాత ఇంటి ముఖం పట్టాలి. ఇలాంటి అవమానకరమైన షరతులు ముస్లిములను రెచ్చగొట్టడానికి, కాని ప్రవక్తపైకి ఎంతో అవమానకరంగా కనిపిస్తున్న ఆ షరతులను శిరసావహించారు.

ఖురైషులు ఆ సమయంలో ఆయన్ని కవ్వించడానికి రకరకాల వికృత చేష్టలు చేశారు. ఏ విధంగానైనా ఆయన్ని రెచ్చగొట్టి ఆయన చేత సంయమనం కోల్పోయిన చర్య చేయించాలన్నది ఖురైషుల అభిమతం. అదే జరిగితే ముస్లింములపై దాడిచేసి పగతీర్చుకోవటానికి అది వారికి ఎంతో అనువైన సమయం. కాబా గృహాన్ని సందర్శించటానికి వచ్చినవారితో కయ్యానికి కాలుదువ్వటం అరబ్బు ఆనవాయితీకాదు. అదీగాక అది జిల్‌ఖాయిద అంటే యుద్ధానాకి నిషిద్ధమాసం. ఆ మాసంలో యుద్ధానికి బయలుదేరకూడదు. అలాంటి సమయంలో ముస్లిములను రెచ్చగొట్టే పనులు చేస్తే వారు రెచ్చిపోయి చేయరాని పని ఏదైనా చేయవచ్చు. తాము దాన్ని సాకుగా చేసుకుని ఆత్మరక్షణ కోసం యుద్ధం చేయాల్సివస్తుందని

చెప్పి యుద్ధ ప్రకటన చేయవచ్చు – ఇదీ ఖురైషుల ఎత్తుగడ. కాని ప్రవక్త శత్రువుల కవ్వింపులన్నింటినీ ఉపేక్షించి అత్యంత వివేచనతో వ్యవహరించారు.

ఆ వ్యవహారం అత్యంత సున్నితమైనది. ఒక అబూబకర్ తప్ప సహచరుల్లో అందరూ ఆగ్రహంతో వూగిపోయినవారే. ఏకపక్షషరతులను అంగీకరించి తాము తమ శత్రువుల దౌష్ట్యం ముందు తలవంచుతున్నామన్న బాధ వాళ్లను పీడిస్తోంది. ఈ ఒప్పందానికి సంబంధించి, “ఇది స్పష్టమైన విజయం” అంటూ దివ్యఖుర్ఆన్ వచనం అవతరిస్తే “ఏమిటీ, ఇది విజయమా?” అని సహాబా ప్రశ్నించారు. “మాకు దైవ గృహ దర్శన భాగ్యం కలుగలేదు. మా ఖుర్బానీ పశువులు కూడా అక్కడిదాకా చేరలేకపోయాయి. దైవప్రవక్త నిస్సహాయులై వెనుదిరగవలసివచ్చింది. ఈ ఒప్పందానికి కట్టుబడి పీడితుడైన మా సోదరుణ్ణి (అబూజుందల్) దుర్మార్గులకు అప్పగించవలసి వచ్చింది. అలాంటప్పుడు ఇది విజయమని ఎలా అనిపించుకుంటుంది?” అని ఒక ముస్లిం వాపోయాడు. అయితే అవమాన భరితమైన ఈ ఒప్పందం ద్వారానే అల్లాహ్ విజయ ద్వారాలు తెరిచాడు. (సహీ బుఖారి హదీసు 3182)

పైకి చూస్తే ఈ ఒప్పందం ద్వారా శత్రువు ముందు తల వంచినట్లు కనిపిస్తుంది. అయితే వాస్తవంలో దీనివల్ల అంతరంగిక స్థితిని మెరుగుపరచుకునే, అవకాశం లభించింది. దైవ ప్రవక్తగారు ఖురైషుల ఏక పక్ష డిమండ్లన్నింటినీ ఆమోదించి వాళ్ల నుంచి ఒకే ఒక్క హామీ తీసుకున్నారు. దాని ప్రకారం పదేళ్లదాకా ఉభయవర్గాల మధ్య యుద్ధం జరగకూడదు. అప్పటి వరకూ నిరంతరం యుద్ధాలు చేస్తుండటం వల్ల నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టేందుకు తీరిక లేకుండా పోయేది. సందేశ వ్యాప్తిపై శ్రద్ధ వహించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉండేవికావు. హుదైబియా నుండి తిరిగి రాగానే ఆయన సందేశ ప్రచార కార్యక్రమాన్ని శీఘ్రగతిన నిర్వహించారు. సందేశ పరిచయ కార్యక్రమం శాంతియుత వాతావరణంలో అరేబియా ఎల్లలు దాటింది. వేలాది మంది ఇస్లాం స్వీకరించసాగారు. అరబ్బు తెగలు తండోపతండాలుగా వచ్చి ఇస్లాంలో చేరిపోసాగాయి. విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఇస్లాంను పరిచయం చేసే పని మొదలయింది. మక్కా ముష్రికుల బెడద తాత్కాలికంగా సమసిపోవటంతో వంచనా శిల్ప నిష్ణాతులైన ఖైబర్ యూదులపై చర్య తీసుకునే అవకాశం దైవప్రవక్తకు లభించింది. సందేశ కార్యకలాపాలతో పాటు అంతరంగిక వ్యవహారాలను పటిష్టవంతం చేసుకోవటానికి కావలసినంత సమయం దొరికింది. దీని ఫలితంగా రెండేళ్ల వ్యవధిలోనే ఇస్లాం శక్తి బహు గుణీకృతం అయింది. ఇప్పుడు ఖురైషులు ముస్లిములతో తల పడాలంటేనే భయకంపితులైపోసాగారు. ఏ మక్కానుండైతే పరాభవభారంతో తిరిగి రావటానికి ఒప్పుకున్నారో

ఆ మక్కాలో విజయకేతనం ఎగురవేస్తూ ప్రవేశించడానికి మార్గాలు తెరచుకున్నాయి.

నేడు జనుల పరిస్థితి ఎలా ఉందంటే ప్రతిద్వంది నుంచి ఏదైనా అవాంఛనీయమైన విషయం ఎదురైతే తక్షణం ఉవ్వెత్తున ఎగిరిపడతారు. అతనితో తలపడతారు. నిష్ప్రయోజనమైన ఈ పోరాటాలవల్ల కలిగే నష్టాలను గురించి వివరిస్తే, 'మాకుగా మేము కాలుదువ్వలేదు, మాకు వ్యతిరేకంగా కొంతమంది కుట్రపన్ని యుద్ధం అనివార్యమయ్యేలా చేశారు' అంటారు. జనులు కయ్యానికి కాలు దువ్వినా నిగ్రహం పాటించటమే నిర్యుద్ధం అనీ, జనులు రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా ఉండటమే సంయమనం అనీ, అవతలి వారు తమకు వ్యతిరేకంగా కుట్రలు పన్నినా తాము మౌనంగా ఉండి వారి కుట్రను భగ్నం చేయటమే వివేచన అన్న సంగతి పాపం వీరికి తెలియదు.

ప్రత్యర్థితో పోట్లాడటం అసలు జీవన రహస్యంకాదు, పొట్లాటలకు దూరంగా ఉండి, ప్రత్యర్థి తనపై కాలు దువ్వటానికి జంకేంత శక్తిని కూడదీసుకోవటమే అసలు జీవనరహస్యం. ఎవరైతే రెచ్చిపోయి తొడచరుస్తారో, మౌనంగా ఉండి తన శక్తి సామర్థ్యాలను పెంచుకోవటంలో శ్రద్ధ చూపరో వారికి ఇక్కడ లభించేది పతనమే. దేవుని ఈ ప్రపంచంలో వారు నెగ్గుకు రావటం అసంభవం. దైవప్రవక్త తలపడే ధోరణిని మానుకుని సాధించిన విజయాన్ని మనం ప్రత్యర్థితో తలపడి సాధించాలనుకుంటున్నాము. పైగా మనల్ని మనం దైవప్రవక్త అనుయాయులుగా చెప్పుకుంటాము. ఈ కారణంగా తీర్పుదినాన దైవ ప్రవక్త మన కోసం సిఫార్సు చేస్తారని దృఢంగా విశ్వసిస్తాము. విచిత్రం కదూ!?

## 9

మక్కా విజయం తరువాత అరబ్బు తెగలు పెద్ద సంఖ్యలో ఇస్లాంలో చేరాయి. అయితే వాళ్లలో చాలామంది ఇస్లాం రాజకీయ పురోభివృద్ధిని చూచి ధర్మపరివర్తన చేసుకున్నవారే. అందుచేత తొలిరోజుల్లో ఇస్లాం స్వీకరించిన సహచరుల్లో ఉన్నంత స్ఫూర్తి, ధర్మనిరతి వీరిలో లేదు. ఇస్లాంలోని కొన్ని ఆదేశాలు – ముఖ్యంగా జకాత్ – వారి స్వేచ్ఛా జీవితానికి భరించరాని అంశంగా తోచింది. ప్రవక్త పరమపదించిన కొద్దిరోజుల్లోనే నజద్, యమన్ ప్రాంతాల్లో కొంతమంది నాయకులు తలెత్తారు. వాళ్లు ధర్మాదేశాలకు వక్రభాష్యాలు జోడించి, జకాత్ అన్ని కాలాలకు వర్తించదని చెప్పదలచారు. తమ మాటను దివ్యవచనంగా చెప్పడానికి వాళ్లు తమను దైవప్రవక్తలుగా ప్రకటించుకున్నారు. జకాత్‌ను తమ పాలిట ఒక బరువుగా భావించే తెగలకు ఈ "నబువ్వత్" సంతోషం కలిగించింది. అంచేత వాళ్లు తండోప

తండాలుగా ఈ అసత్య ప్రవక్తలకు మద్దతు ప్రకటించసాగారు. దైవప్రవక్త మరణంతో వాళ్ల ఆత్మ విశ్వాసం మరింతపెరిగింది. ఆ ఉపద్రవం శీఘ్రగతిన వ్యాపించసాగింది. మక్కామదీనా, తాయఫ్‌లకు చెందిన ముస్లింలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో తిరుగుబాటుదారుల సంఖ్య నానాటికీ ఎక్కువ కాసాగింది. ఆ కాలంలోనే తిరుగుబాటుదారులంతా ఏకమై మదీనాపై దండెత్తటానికి సన్నాహాలు చేస్తున్నారన్న పుకార్లు కూడా పుట్టాయి.

దైవప్రవక్త తన చివరిరోజుల్లో ఉసామబిన్ జైద్ సారథ్యంలో ఒక సైన్యాన్ని తయారుచేసి రోమన్లను ఎదిరించటానికి సిరియా వైపుకు బయలుదేవరవలసిందిగా ఆదేశించారు. అంతకు ముందు రోమన్లు ఉసామ తండ్రి అయిన హ॥జ్రత్ జైద్‌ను హత్య చేసివున్నారు. ఈ సైనిక పటాలం మదీనా పొలిమేరలు దాటుతున్న సమయంలోనే ప్రవక్త మరణవార్త తెలిసింది. అందుచేత మొదటి ఖలీఫా ఇచ్చే తదుపరి ఆదేశాలకోసం ఆ సైనికపటాలం అక్కడే ఆగిపోయింది. దైవప్రవక్త మరణానంతరం అబూబకర్ సిద్దీఖ్ (మొదటి ఖలీఫా) ఆ సైన్యాన్ని ముందుకు పంపాలనే నిర్ణయించారు. కాని కొంతమంది ప్రవక్త సహచరులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిచారు. అరేబియా అంతటా తిరుగుబాటు ధోరణులు ప్రబలుతున్నాయనీ, ఏ క్షణంలోనైనా మదీనాపై దాడి జరగవచ్చనీ, ఇలాంటి స్థితిలో సైన్యాన్ని మదీనా రక్షణ కోసం సిద్ధంగా ఉంచటమే శ్రేయస్కరమని ఆ సహచరులంతా వాదించారు. కాని హ॥జ్రత్ అబూబకర్ సిద్దీఖ్ ఈ వాదనతో ఏకీభవించలేదు.

ఆ సమయంలో పెద్ద పెద్ద సహచరులంతా ఉసామ బిన్ జైద్ ఆధ్వర్యంలో మదీనా పొలిమేరలకు అవతల మోహరించి ఉన్నారు. ఆ కాలంలో రెండు విషయాలు ముఖ్యాంశా లయ్యాయి. సంక్లిష్టమైన ఈ తరుణంలో ఇస్లాం సేన మదీనాను విడిచి విదేశాలకు పోవటం వివేకవంతం కాదనేది ఒకటి. ఉసామ బిన్ జైద్ ఒక బానిస కొడుకుకావటం వల్ల ప్రజలు ఆయన నాయకత్వంలో సంఘటితంగా పోరాడలేకపోవచ్చునేమో అన్న సంశయం రెండవది అదీగాక ఉసామబిన్ జైద్ పదిహేడేళ్ల నూనూగుమీసాల కుర్రాడు. ఆయన నేతృత్వంలో తలనెరసిన సహాబాలు ఎలా పోరాడతారు? అన్న మీమాంస కూడా కొందరిలో ఉత్పన్నమైంది.

తొలుత ఉమర్ కూడా ఈ పటాలంలో ఉన్నారు. కాని సహచరుల్లో వినబడుతున్న భిన్నస్వరాలను గమనించి ఆయన ఖలీఫా వద్దకు ఒక ప్రతిపాదనను తీసుకువచ్చారు. ఖలీఫా అబూబకర్‌గారు ఉమర్ విన్నపాన్ని విని ఇలా అన్నారు. ఇది దైవప్రవక్త రూపొందించిన సైనికపటాలం. ఒకవేళ నేను మదీనాలో ఒంటరివాణ్ణయిపోయినా, తోడేళ్లు నన్ను వేటాడి

భక్షించినా నేనీసైన్యాన్ని వెనక్కి రప్పించేదిలేదు. మరొకరి ద్వారా అందిన విన్నపాన్ని విని ఆయన, "ఏమిటీ, వీరిపై ఇప్పటికీ అజ్ఞాన కాలంనాటి అహంభావాల ప్రభావం ఉందా?" అని ఉద్వేగంగా ప్రశ్నించారు. తరువాత ఆయన లేచి నిలబడ్డారు. సైన్యం మజిలీచేసి వున్న ప్రదేశానికి నడచివచ్చి, ఉసామ బిన్ జైద్‌ను ఈ సైన్యంతోపాటు పంపారు. ఉసామ తన వాహనమెక్కి కూర్చోగా ఖలీఫా మాత్రం కాలినడకసాగిస్తూనే ఉసామకు ఏదో సలహాలిస్తున్నారు. ఉసామా మొహమాటపడ్డారు. మీరు వాహనమైనా ఎక్కండి లేకపోతే నేనన్నా వాహనం నుంచి దిగిపోతాను అన్నారాయన. "నేను వాహనమెక్కాల్సిన అవసరమూలేదు, మీరు దిగాల్సిన పనీలేదు" అన్నారు ఖలీఫా. జనసామాన్యంలో చూచాయగా కనిపించిన వైముఖ్యధోరణికి సమాధానంగా ప్రప్రథమ ఖలీఫా ద్వారా వెల్లడైన ప్రతిస్పందన కావచ్చు ఇది. ఖలీఫా అంతటి వ్యక్తి గౌరవసూచకంగా ఉసామ వెనుకనడిచే సరికి అందరి మనస్సుల్లో వున్న సందేహం పటాపంచలైపోయింది.

ఉసామ సారథ్యంలో ముస్లిం సేన రోము ప్రాంతం వైపుకు సాగిపోవటంతో ఆ వార్త నలువైపులా వ్యాపించింది. వ్యతిరేక శక్తుల గుండెల్లో ఈవార్త దడపుట్టించింది. మదీనాలో ఎంతసైనిక బలం లేకపోతే వాళ్లు ఈ స్థితిలో జైత్రయాత్రకు బయలుదేర్తారు? అన్న ఆలోచన తిరరుగుబాటుదారుల మనసుల్లో మెదలింది. ముస్లిములకు – రోమనులకు మధ్య జరిగే యుద్ధం ఎలా ఉంటుందో చూచి, ఆ తరువాతే మదీనాపై దాడి గురించి ఆలోచించవచ్చునని తిరుగుబాటు నాయకులు నిర్ణయించుకున్నారు. ఒకవేళ ముస్లిములు రోమనులతో తలపడి ఓడిపోతే తమపని సులువైపోతుందని, ఆపైన మదీనాను వశపరచుకోవటం చాలా తేలిక అన్నది కపటుల వ్యూహం. (అల్‌బిదాయవల్‌మీహాయ సంపుటి 6, పేజీ 332).

అయితే ఉసామ బిన్ జైద్ సారథ్యంలోని ముస్లిం సేనకు రోమనులపై అద్భుత విజయం లభించింది. ఈ దండయాత్రకు 40 రోజుల సమయం పట్టింది. ఈ యుద్ధానికి ఉసామ సారథ్యం వహించటం చాలా సమంజసం. ఎందుకంటే ఉసామ తండ్రి అయిన జైద్ బిన్ హారిస్‌ను రోమనులు ముఅత్త యుద్ధంలో వధించి ఉన్నారు. తన తండ్రిని హతమార్చిన శత్రువులపై పగతీర్చుకోవాలన్న వాంఛ ఉసామలో చాలా కాలంగా రగులుతూ ఉంది. ఉసామ సారథ్యంలో ముస్లిం సైన్యం తెగించిపోరాడింది. రోమనులు ఓటమి పాలయ్యారు. ముస్లింలు అనేకమంది యుద్ధ ఖైదీలను, విజయప్రాప్తిని తీసుకుని విజయవంతంగా మదీనా చేరుకున్నారు. ఇది చూచి తిరుగుబాటుదారులు కృంగిపోయారు. ఇదే అదనుగా ఆ తిరుగుబాటు దారులందరి మెడలు వంచేపని తేలిగ్గా జరిగిపోయింది. దైవప్రవక్త అడుగుజాడల్లో

తీసుకున్న చర్యఫలితంగా శత్రువులపై అపూర్వవిజయం ప్రాప్తించింది అది సత్య ధర్మోన్నతికై ఎంతగానో దోహదపడింది.

## 10

బైహఖీ మరియు ఇబ్నె అసాకీర్‌లు ఉర్వ బిన్ జుబైర్‌గారి ఒక ఉల్లేఖనాన్ని సంకలనం చేశారు. దాని ప్రకారం దైవప్రవక్త 'జాతుస్సలాసిల్' యుద్ధం కోసం అమర్ బిన్ ఆస్ నేతృత్వంలో ఒక బెటాలియన్‌ను తయారుచేసి పంపారు. ఈ స్థలం సిరియా పరిసరాల్లో ఉంది. అమర్ బిన్ ఆస్ తీరా అక్కడకు చేరిన తరువాత తెలిసింది – ప్రత్యర్థి సేనలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారని. మరికొంత సైన్యాన్ని పంపవలసిందిగా ఆయన దైవప్రవక్త దగ్గరకు సందేశం పంపారు. దైవప్రవక్త ముహాజిర్లను పిలిచి రెండువందల మందితో కూడిన మరొక పటాలాన్ని సిద్ధం చేశారు. ఇందులో అబూబకర్, ఉమర్‌లు కూడా ఉన్నారు. హజ్రత్ అబూ ఉబైదబిన్ అల్‌జ్రహ ఆయన ఈ సైనిక సమూహానికి నాయకునిగా నియమిస్తూ తక్షణం వెళ్ళి అమర్ బిన్ ఆస్‌ను కలుసుకోవలసిందిగా ఆదేశించారు.

అబూ ఉబైద బిన్ జరాహ్ తన సైనిక బృందంతో అక్కడికి చేరుకున్న తర్వాత ఇప్పుడారెండు బెటాలియన్‌లకు అధిపతిగా ఎవరుండాలి? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. "నేను మీ అందరికీ సేనాధిపతిని అదనపు సైన్యాన్ని పంపమని నేను ప్రవక్తను కోరితే వచ్చిన వారు మీరు – అంచేత మీరంతా నా సారథ్యంలోనే ఉండాలి" అన్నారు. అమర్ బిన్ ఆస్ కాని అబూ ఉబైద వెంటవచ్చిన మహాజిర్లు దీన్ని నిరాకరించారు. "మీ పటాలానికి అధిపతిగా మీరుండండి. మా పటాలానికి అధిపతిగా అబూ ఉబైద ఉంటారని" నిర్మోహమాటంగా చెప్పేశారు. ఈ విభజనకు అమర్ బిన్ ఆస్ అంగీకరించలేదు. "మీరు మా సహాయార్థం వచ్చిన సైనికులే గాని సారథ్యం వహించడానికి వచ్చిన వాళ్లుకారు. కాబట్టి మీరంతా నాతో సహకరించాలి" అన్నారాయన.

ఈ పరిస్థితిని చూచిన అబూ ఉబైద బిన్ జరాహ్ ఆఖరికి ఇలా అన్నారు.

"ఓ అమర్! దైవప్రవక్త మమ్మల్ని పంపిస్తున్నప్పుడు మా చేత చేయించిన ప్రతిజ్ఞ ఏమిటో మీకుతెలుసా? ఉభయ సైన్యాలు కలుసుకున్న తరువాత మీరంతా కలసి పోరాడాలని, పరస్పరం విభేదించుకోరాదని ప్రతిజ్ఞ చేయించారు. దైవసాక్షి! మీరు ఒకవేళ నా మాట వినకపోయినప్పటికీ నేను మీకు విధేయతను కనబరుస్తాను".

అలా చెప్పి సారథ్య బాధ్యతలను అమర్ బిన్ ఆస్‌కు అప్పజెప్పారు అబూ ఉబైద్.

అమర్ నేతృత్వంలో పూర్తి విధేయత చూపారు. (అల్‌బిదియావల్‌నిహాయ సంపుటి 4)

ఒకవేళ ఇరువురూ సారథ్యంపై ఆశపెట్టుకున్నట్లయితే సమస్య పరిష్కృతమయ్యేది కాదు. సైనికుల్లోని పోరాట పటిమ సన్నగిల్లేది. శత్రువులతో పోరాడటానికి పంపబడిన సైన్యం అంతః కలహాలలోపడి నాశనమయ్యేది. ఇలాంటి అభిప్రాయభేదాలు తలెత్తిన సమయంలో ఎవరో ఒకరు తలవంచటం యావత్తు సమాజానికి శక్తిని చేకూర్చటంవంటిది. ఆ సమయంలో ఎవరో ఒకరరు దిగి రాకపోతే యావత్తు సమూహం శక్తి హీనమైపోతుంది.

దైవప్రవక్తకు పుట్టిన పిల్లలలో అబ్రాహాము చివరివాడు. ఆ పిల్లవాడు మారియ ఖబ్తియ అనే మహిళ ద్వారా హిజ్రీ 9వ ఏట జన్మించాడు. దాదాపు 8 నెలల ప్రాయంలో ఆ పసివాడు కన్నుమూశాడు. ఆ పిల్లవాడు మరణించిన రోజునే యాదృచ్ఛికంగా సూర్యగ్రహణం పట్టింది. మహ్మూద్ పాషా ఫల్కీ పరిశోధన ప్రకారం అది హిజ్రీ 10వ సంవత్సరం షవ్వాల్ 29వ తేది. ప్రాచీన కాలంలో సూర్యగ్రహణానికి సంబంధించి రకరకాల మూఢనమ్మకాలు ఉండేవి. రాజ్యంలోని ఒక గొప్ప వ్యక్తి మరణించినపుడు సూర్యుడో చంద్రుడో ఆ దుఃఖంలో పాలు పంచుకుంటారన్నది వాటిల్లో ఒక నమ్మకం. అబ్రాహాము చనిపోయిన రోజున సూర్యగ్రహణం పట్టడంతో, దైవప్రవక్తకు పుత్ర వియోగం కలిగినందుకు సూర్యుడు ప్రకటిస్తున్నాడని జనులు చెప్పుకోసాగారు. ఈ విషయం దైవప్రవక్తకు తెలియగానే మరణాలతో దీనికి ఎలాంటి సంబంధం లేదని ఆయన ఖండించారు. అబూమూసా అష్అరి ఉల్లేఖనం ప్రకారం ఆయన ఇలా ఉపదేశించారు.

"అల్లాహ్ తరఫున పంపబడే ఈ నిదర్శనాలు ఒకరి జననం వల్లనో, మరణం వల్లనో బహిర్గతం కావు. పైగా ఇలాంటి వాటి ద్వారా అల్లాహ్ జనులను హెచ్చరిస్తూ ఉంటాడు. కనుక మీరు ఇలాంటి వాటిని చూచినపుడు దైవభీతితో ఆయన్ని స్మరించండి. ఆయన్ని వేడుకొనండి. క్షమాపణకై ఆయన్ని అర్థించండి". (సహిఅల్‌బుఖారి హదీసు 1059)

సూర్య గ్రహణం గాని, చంద్ర గ్రహణం గాని కేవలం కాకతాళీయంగా ఏర్పడవు. ఖగోళశాస్త్ర నియమాలననుసరించి అవి నిర్ణీత సమయాల్లో ఏర్పడుతూ ఉంటాయి. సూర్యచంద్రులు అత్యంత క్రమబద్ధంగా ప్రకృతి నియమాలనుసారం పనిచేస్తాయి. ఈ పరిభ్రమణ ప్రక్రియలో ఒక్కోసారి భూమి సూర్యచంద్రులకు మధ్య అడ్డువస్తూ ఉంటుంది. ఆ విధంగా సూర్య వెలుగు చంద్రుని వరకు చేరదు. అంచేత చంద్రగ్రహణం పడుతుంది. అలాగే ఒక్కోసారి చంద్రమండలం భూమి మరియు సూర్యునికి మధ్య అడ్డంగా వచ్చేస్తుంది.

ఈ కారణంగా సూర్యరశ్మి భూమండలంపై ప్రసరించదు. తత్ఫలితంగా సూర్యగ్రహణ మవుతుంది. ఇదంతాఆ ఖగోళ వ్యవస్థలోని పరిణామక్రమం ప్రకారం జరుగుతుంది. ఉదాహరణకు 1980 ఫిబ్రవరి 16వ తేదీన ఏర్పడిన సూర్యగ్రహణాన్ని చాలామంది ఖగోళశాస్త్ర నిపుణులు ముందుగానే ఊహించారు. వాళ్లు నిర్ధారించిన సమయంలోనే గ్రహణం పట్టి వీడింది. ఇలాంటి గ్రహణాలు తరచూ పడుతూనే ఉంటాయి. కాకపోతే అవి వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో కనిపిస్తాయి. కొన్నిసార్లు సంపూర్ణంగా గ్రహణం పడితే మరికొన్ని సార్లు పాక్షికంగా పడుతూ ఉంటుంది. సంపూర్ణ సూర్యగ్రహణం పట్టినపుడు సూర్యుని వెలుతురు దాదాపు వెయ్యి రెట్లు తగ్గిపోతుంది.

సూర్యగ్రహణమైనా, చంద్రగ్రహణమైనా ఏర్పడినపుడు నమాజ్ చేయటం సాంప్రదాయం. ఈ ప్రార్థన దేవుని ముందు దాసుని అశక్తతను, అణకువను ప్రతిబింభిస్తుంది. సూర్యుడు దేవుని తరఫున ఒక మహదానుగ్రహం. దీని ద్వారా దేవుడు మన కొరకు వెలుగును, వేడిమిని ప్రసాదించి మహోపకారం చేయగలడని, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడనీ సూర్యగ్రహణం చాటి చెబుతోంది. కాబట్టి సూర్యునికి గ్రహణం పట్టి అది కాంతి హీనమైపోయినపుడు దాసుడు దేవునిముందు తలవంచి తన నిస్సహాయస్థితిని వ్యక్తపరచాలి. “దేవా! నువ్వే గనక ఈ సూర్యదీపాన్ని ఆర్పివేస్తే దీన్ని వెలిగించేవాడు ఎవడూ లేడు. నువ్వే గనక మాకు వెలుగు వేడిమిని ప్రసాదించకపోతే ఈ అనుగ్రహాలను మాకు ఇచ్చేవాడెవడూ లేడు”. అని దేవుని మహత్తును అంగీకరించాలి.

“గ్రహణం” అనే ఈ వ్యవహారం కేవలం సూర్యచంద్రులతోనే ముడిపడిలేదు. ఇలాంటి సంఘటనలు దేవుని ఇతరత్రా అనుగ్రహాలకు కూడా పలురూపాల్లో ఎదురవుతూ ఉంటాయి. మనిషికి అరోగ్యంతోపాటు అనారోగ్యం కూడా కలుగుతూ ఉంటుంది. అంటే ఇది శరీర గ్రహణం అన్నమాట! మంచి వాతావరణంతో పాటు చెడు వాతావరణం కూడా ఏర్పడుతూ ఉంటుంది. కనుక అది వాతావరణ గ్రహణం అవుతుంది. ఆ విధంగా మనిషికి అప్పటికే ప్రాప్తమైవున్న ఒక వరాన్ని కాస్సేపు నిలిపి ఉంచిదాని విలువ మనిషికి తెలిసివచ్చేలా చేయటం జరుగుతుంది. మనిషిలో దేవుని పట్ల కృతజ్ఞతా భావాన్ని పెంపొందించటం దీని ప్రధానోద్దేశ్యం. ఒకవేళ దేవుడే గనక ఈ మేళ్ళను అందకుండా చేస్తే మనిషి గతేంకాను? అన్న ఆలోచనను మనిషిలో కలిగించి, అతన్ని రుజువర్తనుణ్ణి చేయటమే, ఈ సంఘటనల పరమార్థం. మనిషిలో దైవభీతిని పెంపొందించడానికి దేవుని తరఫున జరిగిన ఏర్పాట్లలో ఒకటి ఈ “గ్రహణం”.

భూమి నిరంతరం తిరుగుతోంది. అదీగాక భూగోళంలోని అంతర్భాగం అత్యంత వేడివల్ల కరిగిన ధాతువులా నిత్యం మరుగుతూ ఉంటుంది. అయినప్పటికీ మన కాళ్ళ క్రింద భూమి ఏ మాత్రం కదలకుండా స్థిరంగా ఉంటుంది. ఇది మన పాలిట ఒక మహదానుగ్రహం. కాని మనం సాధారణ పరిస్థితుల్లో దీన్ని వరప్రసాదంగా భావించనే భావించము. అందుకే ఒక్కొసారి భూప్రకంపనం ద్వారా భూమి ఉపరితలాన్ని కుదిపివేయటం జరుగుతుంది. మనిషి వినాశం కొరకు ఏ విధమైన లావాను దేవుడు భూమిలో దాచి ఉంచాడో మనిషికి ఎరుకపరచటమే దీని ఉద్దేశ్యం. అలాగే వర్షం కూడా ఒక అపూర్వ అనుగ్రహమే. సూర్యుని వేడివల్ల నీటిలోని ఆవిరి పైకి వెళ్ళటం, అది మేఘాల రూపు దాల్చి చల్లని గాలుల ద్వారా పలుచోట్ల కారుణ్య జల్లులా కురవటం, మృత భూమికి జీవం పోయటం – ఇవన్నీ కారుణ్య ప్రభువు యొక్క చిత్ర విచిత్ర మహిమలే. వీటిని అల్లాహ్ నిత్యం మనిషికి ప్రసాదిస్తూనే ఉంటాడు. ఈ మహాప్రసాదాలు తరచూ మనిషికి లభిస్తుండటంవల్ల మనిషి వీటి విలువను సరిగా గుర్తించడు. అందుకే భూమిపై ఒక్కోసారి అనావృష్టిని, దుర్భిక్షస్థితిని సృష్టించి తన జీవికకై దైవకృప ఎంత అవసరమో మనిషికి బోధపడేలా చేయటం జరుగుతుంది. గాలి కూడా ఎంత గొప్ప వరం! గాలి అనుక్షణం మనిషికి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తుంది. గాలులు వర్షపాతాన్ని క్రమబద్ధం చేస్తాయి. గాలి వల్ల కలిగే ప్రయోజనాలు అమోఘం. అయితే అది మన కంటికి కనిపించనట్లే దాని ప్రాముఖ్యం కూడా మన దృష్టిలో లేకుండా పోతూ ఉంటుంది. అందుకే అల్లాహ్ ఆ గాలిని ఒక్కోసారి ఉధృతంచేసి, దాని ప్రచండ రూపం మనిషికి ఎంత అనర్థకరంగా పరిణమించగలదో చూపిస్తూ ఉంటాడు. ఇలాగే ప్రతి వస్తువుపై ఏదో ఒక రూపంలో 'గ్రహణం' పడుతుంది. మనిషికి దేవుని మహోపకారాలను ఒకసారి జ్ఞాపకం చేసి అతనిలో కృతజ్ఞతాభావాన్ని జనింపజేయటమే వాటి ఉద్దేశ్యం.

దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడింది. "మీరు నాటే ఆ వస్తువును చూడండి. దాన్ని పండించేది మీరా లేక మేము దాన్ని పండిస్తున్నామా? మేము గనక తలచుకుంటే దాన్ని ఊకలా చేసి వేయగలము. రుణ గ్రహస్తులమై పోయామని భాగ్యానికి నోచుకోలేకపోయామని మీరు మాటలు బనాయిస్తూ ఉండిపోవాల్సి వస్తుంది. మీరు త్రాగే నీళ్లను చూడండి, దాన్ని మేఘాల ద్వారా మీరు కురిపించారా లేక దాన్ని కురిపించిన వాళ్లం మేమా? మేమే గనక తలచుకుంటే దాన్ని ఉప్పునీరుగా మార్చివేయగలం. మరి మీరు కృతజ్ఞులవరేం? మీరు కాల్చే అగ్నిని చూడండి. దాని వృక్షాన్ని మీరు పుట్టించారా లేక దాన్ని పుట్టించిన వారం మేమా! మేమే దానిని చేశాము–మీకు స్మరణ చేయడానికి మరియు మీ వినియోగం కొరకు.

కనక అందరికన్నా గొప్పవాడైన అల్లాహ్ నామం యొక్క పవిత్రతను కొనియాడండి (56:63–74). మన జీవితమంతా దేవుని కరుణా కటాక్షాలపై ఆధారపడి ఉంది. ఏ క్షణంలోనైనా అవి ఆగిపోవచ్చు. అందుకే మనిషి తన సృష్టికర్త మరియు యజమానికి కృతజ్ఞుడై మసలుకోవాలి. ఈ కృతజ్ఞతా భావమే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మనిషిని దైవానుగ్రహాలకు పాత్రుణ్ణి చేస్తుంది.

అహ్మద్, తబ్రానీలు ఆయిషా గారి ఉల్లేఖనాన్ని స్వల్పమైన వ్యత్యాసంతో సంకలనం చేశారు. మక్కా నుండి మదీనాకు వలసపోయిన తరువాత దైవప్రవక్త మరియు ఆయన కుటుంబ సభ్యులు ఎదుర్కొన్న పరిస్థితుల్ని గురించి ఆయిషా ఒక వ్యక్తికి వివరించిన విశేషాలకు ఈ ఉల్లేఖనం అద్దం పడుతుంది. ఆమె ఒక రాత్రి (చీకట్లో) వెతుక్కుంటూ పనిచేస్తున్నారు. తరువాత ఈ ఉల్లేఖనంలోని మాటలివి.

“ఈ విషయాన్ని ఉటంకించిన వారు ఇలా అంటున్నారు. దీపం గురించి నేను ఆయిషాగారిని దర్యాప్తు చేశాను. ఆమె ఇలా అన్నారు. ఒకవేళ ఆ సమయంలో మా వద్ద దీపం వెలిగించేంత చమురు ఉంటే దీపం వెలిగించటం అలా ఉంచి ఆకలి బాధను ఆర్పటానికి ఆ చమురును మేము త్రాగేసే వాళ్ళమేమో! (అల్‌మోజబుల్ అల్‌ఔసత్ హదీసు 8872)

హిజ్రత్ తరువాత ఏ పురమైతే ‘మదీన తుర్రసూల్’, ‘మదీనె తయ్యిబా’గా ఖ్యాతి చెందిందో ఆ పవిత్ర స్థలంలో అప్పుడు ఒక్క పక్కా ఇల్లు కూడా లేదు. మస్జిదె నబవీ ఒక పెద్ద చావిడిగా ఉండేది. దాని గోడలు మట్టితోనూ, ఖర్జూరపు మండలతోనూ మిళితమై ఉండేవి. మస్జిద్‌లో రాత్రిపూట దీపం పెట్టే ఏర్పాటేదీ ఉండేది కాదు. హిజ్రీ 9వ సంవత్సరంలో అడుగుపెట్టిన మీదటే మస్జిద్‌లో దీపం వెలిగించబడింది (మారిఫాతి అస్సహాబ సంపుటి 1, పేజీ 448). మదీనాలోని మస్జిదెనబవీలో తొలిసారిగా దీపం పెట్టిన ఘనత తమీమ్‌దారి అనే వ్యక్తికి లభించింది. తమీమ్ దారి హిజ్రీ 9వ ఏట ఇస్లాం స్వీకరించాడు. అప్పటికి మక్కా జయించబడింది. దాదాపు యావత్తు అరేబియా ప్రాంతం ఇస్లాం ఒడిలోకి వచ్చేసింది.

ముస్లిములకు దీపం వెలిగించడానికి చమురులేని రోజుల్లో మస్జిదులు దీపం లేకుండా చీకటిలో ఉండిపోయే కాలంలో ఇస్లాం మరియు ముస్లిములు గౌరవోన్నతులు ప్రపంచంలో మార్మోగాయి. నేడు ముస్లిముల ఇళ్లు దేదీప్యమానంగా ఉన్నాయి. మస్జిదులు అధునాతన బల్బులతో కాంతులీనుతున్నాయి. కాని ప్రపంచంలో ఇస్లాంకు ఆధిక్యతాస్థానం ప్రాప్తమై లేదు. ముస్లింలకు ఎక్కడా గౌరవస్థానం లేదు.

దీనికి కారణమేమిటంటే గౌరవోన్నతుల్ని సాధించటానికి అసలైన 'మనిషి' లేకుండాపోయాడు. ముస్లిముల దగ్గర నేడు అన్నీ ఉన్నాయి గాని కావలసిన ఆ 'మనిషే' లేడు. ముస్లిం ప్రపంచం నేడు నిర్జీవ ఆత్మల ఓ పెద్ద స్మశానవాటికగా కానవస్తోంది. అందులో వెలుగుజిలుగులు, గోడల ఔన్నత్యాలైతే గోచరిస్తున్నాయిగాని దైవం కోసం తహతహలాడే మనిషి, సత్యం ముందు తలవంచే మానవుడు, పరలోకం కోసం ఇహలోకాన్ని త్యాగం చేసే త్యాగధనుడు, మనోవాంఛలను మహదాశయం ముందు లోబరచే మహనీయుడే నేడు ఎక్కడా కనిపించటం లేదు.

## 13

ప్రాచీన అరేబియాకు ఉత్తర దక్షిణాల్లో వున్న సారవంతమైన భాగాలు రెండు మహా సామ్రాజ్యాలైన రోము, ఈరాన్ చక్రవర్తుల ఆదీనంలో ఉండేవి. ఉత్తరాన గస్సానియ, బుస్రాలుండేవి. ఇవి రోము సామ్రాజ్యం చెప్పుచేతల్లో ఉండేవి. ఈ ప్రాంతాలను రోమనుల తరఫున అరబ్బు సర్దారులు పరిపాలించేవారు. రోము ప్రభావం వల్ల ఇక్కడి ప్రజల్లో అధిక సంఖ్యాకులు క్రైస్తవ మతాన్ని అవలంబించేవారు. అరేబియాకు దక్షిణాన బహ్రైయిన్, అమాన్, యమామ దీవులుండేవి. ఇవి ఈరాన్ సామ్రాజ్యంలో భాగంగా పరిగణించబడేవి. ఈ ప్రాంతాల్లో జోరాస్ట్రియన్ మతం వ్యాపించి ఉండేది.

హిజ్రీ 6వ ఏట ఖురైషులతో పదేళ్ల నిర్యుద్ధ సంధి చేసుకున్న మీదట ముస్లింలకు కాస్త తెరిపి లభించింది. దైవప్రవక్త అరేబియాకు నలువైపులానున్న రాజ్యాలకు ఇస్లాం సందేశం పంపాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా గస్సానీ రాజైన హారిస్ బిన్ అబీ సమర్ గస్సానీకి కూడా ఒక లేఖ వ్రాశారు. షుజాబిన్ దహబ్ ఈ లేఖను పుచ్చుకుని దైవప్రవక్త దూతగా అక్కడి కెళ్లారు. ఆ లేఖలో "అల్లాహ్‌ను విశ్వసించు నీ రాజ్యాధికారం సురక్షితంగా ఉంటుంది" అని కూడా లిఖించబడి ఉంది. ఈ వాక్యం చదివిన రాజుకు కోపం వచ్చింది. ఆ లేఖను నేలకేసి కొట్టాడు. 'నా అధికారాన్ని నానుండి లాక్కునేవాడెవడు?' అని అరిచాడు. (తారిజ్ అత్‌తబరి సంపుటి 2, పేజి 652)

బుస్రా గవర్నర్ ఇంతకన్నా కటవుగా వ్యవహరించాడు. ప్రవక్త దూతగా హారిస్ బిన్ ఉమెర్ ఉత్తరం తీసుకుని బుస్రా బయలుదేరారు. ఆయన సిరియా సరిహద్దుల్లో వున్న ముఅత్త అనే స్థలానికి చేరేసరికి బుస్రా అధికారి ఉత్తరువుపై ఒక పల్లెటూరి వ్యక్తి ఆయన్ని హతమార్చాడు (అల్‌తబఖాత్ అల్‌ఖుబ్రా సంపుటి 4, పేజీ 255)

అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా ఈ సంఘటన తీవ్రమైనది. ఒక రాజ్యంపై ఇంకొక రాజ్యం అవలంబించే దయనీతిని దురాక్రమణా ధోరణిని ఇది సూచిస్తుంది. అదే సమయంలో సిరియా సేనలు మదీనా వైపుకు కదలుతున్నాయని, అరేబియాలో ఒక స్వతంత్ర రాజ్యం ఏర్పడటాన్ని రోము పాలకులు ససేమిరా సహించరని పలువురు రాజకీయ వాదులు ఊహాగానాలు చేయసాగారు.

హారిస్ బిన్ ఉమైర్ హతమార్చబడ్డారన్న సంగతి తెలియగానే ప్రతీకార చర్య గైకొనటం అవసరమని భావించారు దైవ ప్రవక్త. ముస్లిములు తమ దగ్గరున్న ఆయుధాలతో సమావేశమవ్వాలని మహాప్రవక్త ఆదేశించారు. దాదాపు మూడు వేల మంది సైనికులు ఒకచోట చేరారు. దైవప్రవక్త ఆ సైన్యానికి అధిపతిగా జైద్ బిన్ హారిస్‌ను నియమించి, అవసరమైన సూచనలిచ్చి సిరియావైపుకు పంపారు.

ఇస్లాం సేన సిరియాకు సమీపంలోనున్న మ ఆన్ అనే స్థలానికి చేరి అక్కడ మజిలీ చేసింది. మరోవైపున బస్రా రాజుకూడా యుద్ధానికి సిద్ధమయ్యాడు. అతని ఆత్మ విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసిన మరో విషయం ఏమిటంటే హెరిక్లిస్ రాజు ఆ రోజుల్లోనే లక్షమంది సైనికులతో ఆ ప్రాంతానికి వచ్చి ఉన్నాడు. దానికి తోడు ఆ ప్రాంతంలోని లఖమ్, జజామ్, ఖైన్, భరా, బల్లీ అనే క్రైస్తవ తెగలు కూడా సంగఠితమై ముస్లిములతో పోరుకు సిద్ధమయ్యాయి. ఆ విధంగా 'సిరియన్ సంఘటన'లో ఒక లక్ష మంది కన్నా ఎక్కువ సైనికులే పోగయ్యారు. కాగా ముస్లిముల సంఖ్య మూడువేలు మాత్రమే.

ఈ యుద్ధం హిజ్రీ శకం 8వ ఏట జమాదివుల్ అవ్వల్ నెలలో జరిగింది. ఈ యుద్ధంలో ఖైద్  బిన్ హారిస్ అమరగతి నొందారు. జాఫర్ బిన్ అబీతాలిబ్, అబ్దుల్లా బిన్ రవాహ కూడా నేతృత్వం వహిస్తూ అసువులు బాసారు. ముస్లిముల ధ్వజం నేలకొరగటంతో గందరగోళ స్థితి ఏర్పడింది. ఆ సమయంలో ముస్లిం సైన్యంలోని ఒక జవాను సాబిన్ బిన్ అఖ్రమ్ ముందుకు పోయి ధ్వజం చేబూని బిగ్గరగా పిలిచారు. 'ముస్లిములారా! ఎవరో ఒకరిని నాయకునిగా ఎన్నుకునేందుకు ఏకాభిప్రాయం వ్యక్తం చేయండి' అని.

"మేము మీ నాయకత్వాన్ని శిరసా వహిస్తున్నాము" అని ముస్లిం సైనికులంతా ముక్త కంఠంతో చెప్పారు. "ఈ బాధ్యతను నేను సక్రమంగా నిర్వర్తించలేను. ఖాలిద్ బిన్ వలీద్‌ను సారధిగా ఎన్నుకోండి" అని అఖ్రమ్ ప్రతిపాదించారు.

"ఖాలిద్ బిన్ వలీద్ సారథ్యం మాకు సమ్మతమే" అన్నారంతా. ఖాలిద్ బిన్ వలీద్

ముందుకు వచ్చి ధ్వజం చేబూనారు. ఎట్టకేలకు వీరోచితంగా పోరాడి రోము సేనను అవతలికి నెట్టడంలో కృతకృత్యులయ్యారు (తారిఖ్ అత్‌తబరి సంపుటి 3, పేజి 36–42).

అయితే ఈ యుద్ధం నిర్ణయాత్మకంగా ముగియలేదు. ఏ క్షణంలోనైనా గస్సానీలు రొమనుల సహకారంతో మదీనాపై దండెత్తి ఈ నూతన రాజ్యాన్ని నామరూపాల్లేకుండా చేయవచ్చున్న భయం అందరినీ వెంటాడుతూ ఉండేది. హిజ్రీ 5వ సంవత్సరంలో బనూ ఖురైజ తెగను తుదముట్టించిన తరువాత మదీనాలో ఆర్థిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆ రోజుల్లోనే ప్రవక్త సతీమణుల జీవన భృతిని కాస్త పెంచమని కోరారు. దీంతో ప్రవక్త ఎంతో కలత చెంది ఒక నెలరోజుల దాకా ఇంట్లోకి రానని ప్రతినబూనారు. ఆ కాలంలో ఒక వ్యక్తి ఉమర్‌ను కలుసుకుని "మీకు తెలుసా?" అని ఏదో అనబోయేంతలోనే ఉమర్ కంగారుగా "ఏమిటీ, గస్సానీలు దండెత్తివచ్చారా?" అని అడిగారు. దీన్నిబట్టి గస్సానీల దండయాత్ర భయం మదీనా వారిని ఎంతగా వెంటాడుతూ ఉండేదో అర్థమవుతోంది.

ప్రవక్త ఈ సమస్యపై తీవ్రంగా ఆలోచిస్తూ ఉండేవారు. ఆయన తన జీవితం యొక్క చివరి కాలంలో అన్నిటికన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన అంశాలలో ఒకటి గస్సానియ వేరే మాటల్లో చెప్పాలంటే రోము సామ్రాజ్య బెడదను తొలగించడానికి అవసరమైన శక్తిని కూడగట్టుకోవడంలో నిమగ్నులై ఉండేవారు. ఈ లక్ష్య సాధనకై ఆయన ఒక సైనిక పటాలాన్ని నిర్మించారు. ఆ సైన్యంలో ఉమర్, అబూబకర్ వంటి సీనియర్ సహచరులున్నప్పటికీ దైవప్రవక్త అత్యంత వివేకవంతంగా వ్యవహరించి ఉసామ బిన్ జైద్ అనే నూనూగు మీసాల కుర్రాణ్ణి సైన్యాధిపతిగా నియమించారు. ఉసామ ఒక పరాక్రమశాలి మాత్రమేకాదు, రోమనులపై ప్రతీకారం తీర్చుకోవటానికి సమయం కోసం ఎదురుచూస్తున్నారాయన. ఎందుకంటే అంతకు ముందు రోమన్లు ముఅత్త యుద్ధంలో తన తండ్రి జైద్ బిన్ హారిస్ హతమార్చారు.

అయితే ఈ సైనిక పటాలం ప్రవక్త హయాంలో పయనం కాలేకపోయింది. ఎందుకంటే యుద్ధ సన్నాహాలు చేస్తున్న రోజుల్లో ప్రవక్త తీవ్ర అస్వస్థకు గురయ్యారు. ఆయన పరమపదించిన తరువాత ప్రప్రథమ ఖలీఫాగా ఎన్నికైన అబూబకర్ ఈ సైనిక బృందాన్ని సిరియావైపుకు పంపించారు.

ఈ పయనం కూడా ఇస్లామీయ చరిత్రలో అత్యంత రసవత్తరమైన సన్నివేశమే. ప్రవక్త మరణించటంతోనే అరేబియా నలుమూలలనుంచీ తిరుగుబాటు ధోరణులు ప్రబలుతున్నట్లు వార్తలందాయి. రాజధాని నగరం పై ప్రమాదం పొంచివున్న సమయంలో

ఉన్న కొద్దిపాటి సైన్యాన్ని బయటికి పంపించటంలో గల ఔచిత్యాన్ని కొంతమంది శ్రేయోభిలాషులు ప్రశ్నించసాగారు ఖలీఫాను. కాని కీలకమైన ఆ తరుణంలో ప్రథమ ఖలీఫా ఇచ్చిన సమాధానం అందరినోళ్లనూ మూయించింది. "ముస్లిం సైన్యం వెళ్ళిన తరువాత మదీనాలో నేను ఒంటరిగా ఉండటం చూసి తోడేళ్లు నన్ను పీక్కుతిన్నాసరే, దైవ ప్రవక్త స్వయంగా తీర్చిదిద్దిన ఈ సైనిక పటాలాన్ని నేను పంపకుండా ఉండను" అన్నారాయన (అల్ బిదాయ సంపుటి 6, పేజీ 304). తొలి ఖలీఫాలోని ఈ విశ్వాసబలం అందరికీ టానిక్కులా పనిచేసింది. రోమనులకు వ్యతిరేకంగా ఉసామ సారథ్యంలో ముస్లిం సైనికులు బ్రహ్మాండమైన విజయం సాధించటమే గాకుండా ఇస్లామీయ రాజ్యంలోని వంచకులు, తిరుగుబాటు దారుల ఉత్సాహాన్ని నీరుగార్చారు. ఆ తరువాత వాళ్లంతా చాలా సులువుగా తలవంచారు.

ఈ సంఘటనలో ఓ గొప్ప యుక్తి ఉంది. అరబ్బు తెగలు ఎల్లప్పుడూ అంతర్గత కలహాలతో సతమతమవుతూ ఉండేవి. తమ శక్తిసామర్థ్యాలను, శౌర్య ప్రతాపాలను ప్రదర్శించే రంగం ఏదీ లభించకపోతే వాళ్లు అంతఃకలహాలతో పడిపోయి ధన ప్రాణాలను దుర్వినియోగం చేసే ప్రమాదం ఆ సమయంలో పొంచి ఉండింది. దైవ ప్రవక్త తన మరణానికి కొద్దిరోజుల ముందు అరబ్బులను రోము మహాసామ్రాజ్యానికి దీటుగా నిలబెట్టివారి కర్తవ్యాన్ని చూచాయగా సూచించారు. అంటే యుద్ధ ప్రియులైన అరబ్బులకు ఓ గొప్ప కార్యక్షేత్రం అప్పటికే లభిచిందన్న మాట! ఆ తరువాత సంభవించిన పరిణామాలకు / చరిత్రే సాక్షి – అప్పటి వరకూ తమ వాళ్లను చంపటం తప్ప మరొకటి తెలియని ఆ అరబ్బు జాతి ప్రజలు ఆ తరువాత ఒక శతాబ్దం కన్నా తక్కువ కాలంలోనే విశ్వ విజేతలుగా నిలిచారు. జాన్ లెగేట్ గల్బ్ పాషా తన గ్రంథమైన "దిలైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ ముహమ్మద్"లో ఆ విషయాన్ని ప్రస్తుతిస్తూ ఇలా వ్రాశాడు.

అరబ్బులు అజ్ఞాన కాలంలో పరస్పరం యుద్ధాలు చేయటానికి, ఒండొకరితో తగవులాడటానికి అలవాటు పడి ఉండేవారు. ఈ యుద్ధాలకు ఏదో బలమైన కారణం ఉండేది కాదు. పైగా ఇవి (యుద్ధాలు) వారి జీవన సరళిలో అంతర్లీనమైపోయినవి. ఇప్పుడు వారు ముస్లిములుగా ఒండొకరిపై కాలుదువ్వరాదని వాదించటమైతే చేశారు గాని, యుద్ధకాముకులైన మనుషులను ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉండమనటం ఎలా సంభవం? ఇస్లాం ప్రవక్త స్వయంగా ఈ బృందాన్ని పంపి ముఅత్తా రణరంగంలో చవిచూసిన పరాజయానికి పరిష్కారం కనుగొన్నారు.

క్రీ.శ. 634వ సంవత్సరం శీతాకాలంలో ముగ్గురు అరబ్బు నాయకులు పాలస్తీనా, సిరియాలపై దండెత్తారు. ఈలోగా తూర్పు అరబ్బుకు చెందిన తెగలు ఫరాత్ (నైలునది) వైపుకు కదలి హీరా ప్రాంతాన్ని ఆక్రమిచుకున్నారు. అంతకు ముందు హీరా ప్రాంతాన్నే వశపరచుకున్నందుకు వారు ఈరాన్‌పై ఆగ్రహంతో ఉన్నారు. క్రీ.శ. 636 ఆగస్టు 26న రోము సేనలు 'యర్మూక్' క్షేత్రంలో సంపూర్ణ పరాజయాన్ని చవిచూశాయి. సిరియా ప్రాంతం దాదాపు–తబ్రియ వరకు–అరబ్బుల ఆధీనమైంది. క్రీ.శ. 637లో ఈరాన్ సైన్యం హీరాకు కొన్ని మైళ్లదూరంలోనే వున్న ఖాద్సియాలో మరోసారి చావు దెబ్బతిన్నది. దజ్‌లాకు దక్షిణాన ప్రస్తుత బాగ్దాద్‌కు సమీపంలో ఉండే మదాయన్‌తో సహా ప్రాచీన ఇరాక్ ప్రాంతమంతా అరబ్బుల ఏలుబదిలోకి వచ్చేసింది. క్రీ.శ. 640లో ఈజిప్టుపై దాడి జరిగింది. మరోసారి రోము రాజ్యం ఓటమికి గురైంది. క్రీ.శ. 642 నాటికి యావత్తు ఈజిప్టును అరబ్బులు హస్తగతం చేసుకున్నారు. ఆ సంవత్సరమే మిగిలిన కొద్దిపాటి ఈరాన్ సైన్యం కూడా నిహావంద్ అనేచోట చేతులెత్తేసింది. దాంతో ఈరాన్ సామ్రాజ్యం కథ కంచికి చేరింది".

దైవ ప్రవక్త మరియు ఆయన తదనంతరం ఖలీఫాగా ఎన్నికైన అబూబకర్‌లు ఆంతరంగిక పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా ఉన్నప్పటికీ ముస్లిం సేనను ఉసామ నేతృత్వంలో రోమనులపైకి పంపారు. ముస్లిం భావితరాలకు ఇదొక గొప్ప గుణపాఠం వంటింది. ముస్లింల బలాబలాల పరీక్ష స్థలం ఇంటి బయటేగాని ఇంటిలోపల కాదు. కాని ఈ గుణపాఠాన్ని తరువాత కాలంలోని ముస్లింలు మరచిపోయారు. ముఖ్యస్త్రంగా వర్తమాన కాలంలోనైతే ముస్లిం దేశాలు రెండు కూటములు (ప్రగతి శీలకులు, సనాతన వాదులు)గా చీలిపోయి ఒండొకరికి ప్రత్యర్థులుగా తయారైనాయి. వాటి సేనలు తమ దేశాలపైనే దండెత్తి "విజయం" సాధించదలుస్తున్నాయి. ముస్లిం సంఘాలు ఖర్దుగా తమ దేశ పరిపాలకులనే ప్రత్యర్థులుగా పరిగణించి పనిచేస్తున్నాయి. బయటి శత్రువులను ఎదిరించి పోరాడేవిషయంలో వారంతా నిస్సహాయులుగా కనిపిస్తున్నారు. కాని పరస్పర కుమ్ములాటలకైతే అందరూ మొనగాళ్లే. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లాం సందేశ వ్యాప్తి స్థంభించిపోతే ఆశ్చర్యమేముందీ?

## 14

ప్రామాణికమైన ఉల్లేఖనాల ప్రకారం 'పవిత్రకాబా' నిర్మాణం నాలుగు సార్లు జరిగింది. మొదటిసారి అబ్రహాము తన కుమారుడగు ఇస్మాయీల్‌తో కలసి నిర్మించారు. రెండవసారి ఇస్లాంకు పూర్వం – ఖురైషులు భారీవర్షాలవల్ల కూలిపోయిన కట్టడాన్ని పునఃనిర్మించారు.

ఈ పునఃనిర్మాణ కార్యక్రమంలో దైవప్రవక్త కూడా పాల్గొన్నారు. అప్పటికి ఆయన పిన్న వయస్కులు. ఖురైషులు కాబా పొడవులో సుమారు నాలుగు గజాలు తగ్గించారు. దైవప్రవక్త ఈ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ ఆయిషాతో ఇలా అన్నారు. "నీ జాతి వారు గనక త్వరగా అజ్ఞానకూపం నుండి బయటపడి ఉంటే నేను కాబాను పడగొట్టి మళ్ళీ అబ్రాహాము నిర్మాణం త్వరలో నిర్మించి ఉండేవాణ్ణి. దానికి తూర్పున, పశ్చిమాన రెండు ద్వారాలు పెట్టేవాణ్ణి". (సహముస్లిం హదీసు 1333)

మూడవ నిర్మాణం మజీద్ బిన్ మ ఆవియా హయాంలో (హిజ్రీ 36వ ఏట) జరిగింది. మజీద్ బిన్ మ ఆవియాకు చెందిన సిరియన్ సేనలు హసీన్ బిన్ నమర్ నాయకత్వంలో మక్కాలో వున్న అబ్దుల్లా బిన్ జుబైర్‌ను ముట్టడించి రాళ్లు రువ్వినప్పుడు, అగ్ని గోళాలు విసిరినపుడు కాబాలో అగ్ని ప్రమాదం సంభవించి అది కూలిపోయింది. ఆ తరువాత అబ్దుల్లా బిన్ ఉబైర్ దాన్ని తిరిగి నిర్మించారు. ఈయన దైవ ప్రవక్త పైన పేర్కొనబడిన హదీసును దృష్టిలో పెట్టుకుని అబ్రహాము పునాదుల మీద పునఃనిర్మాణం చేశారు. మనిషి ఒకవైపు నుంచి ప్రవేశించి రెండవ వైపునుంచి వెలుపలకు పోయేందుకు వీలుగా రెండు ద్వారాలు పెట్టించారు. అబ్దుల్లా బిన్ జుబైద్ హత్య గావించబడిన తరువాత హజ్జాజ్ అనే వ్యక్తి ఖలీఫా అబ్దుల్ మలిక్ బిన్ మద్వాన్‌కి పూర్వరంగాన్ని వివరించాడు. తాము అబ్దుల్లా బిన్ జుబైద్ విధానానికి కట్టుబడి లేమని, తిరిగి కాబా గృహాన్ని పూర్వస్థితిలో పునరుద్ధరించాలని ఆదేశించాడు అబ్దుల్ మలిక్. ఆ మేరకు ఒక ద్వారం మూసివేయబడింది (సహీముస్లిం మదీసు 1333)

ఖలీఫా హామాన్ రషీద్ పరిపాలనా కాలం వచ్చింది. కాబా గృహాన్ని మళ్ళీ అబ్దుల్లా బిన్ జుబైద్ నిర్మించిన విధంగా నిర్మించాలని ఆయన సంకల్పించుకున్నారు. ఆ సమయంలో ఇమామ్ మాలిక్ బిన్ అనస్ ఖలీఫాతో ఇలా అన్నారు.

"ఓ అమీరుల్ మోమినీన్! నేను మీకు దేవుని సాక్షిగా చెబుతున్నాను. ఈ గృహాన్ని మీదతనంతరం వచ్చే చక్రవర్తులకు ఇష్టం వచ్చినట్లు మార్చుకునే ఆటవస్తువులా చేయకండి. ఇలా చేస్తే ఈ గృహం పట్ల ప్రజలకు గల భయభక్తులు క్షీణిస్తూపోతాయి. ఈ విధంగా ఖలీఫా హారూన్ షీద్ ఇమామ్ మాలిక్ ప్రోద్బలంపై తన సంకల్పాన్ని విరమించుకున్నారు. (అల్‌రాజ్ అల్‌అవస్ సంపుటి 2, పేజీ 173).

ఆచార సంప్రదాయాలను త్రోసిరాజనకుండా నిశ్శబ్దంగా విప్లవం తీసుకురావటం

ప్రవక్తల విధానంలోని ఒక ముఖ్య నియమం. సామాజిక జీవితంలో ఆచార సంప్రదాయాలకు ఉండే ప్రాముఖ్యం అపారం. అనేకమంది ప్రజలు ఆచారాల ఆసరాతో జీవిస్తూ ఉంటారు. ఒక్కసారిగా ఆచారాలను కూకటి వ్రేళ్లతో పెకలించివేస్తే ప్రజలకోసం నీతినియమాలకు సంబంధించిన ఆధారాలే మిగిలిఉండవు.

ఏ సమాజంలోనైనా ఆచార సంప్రదాయాలు వేలవేల సంవత్సరాల చరిత్ర ఆధారంగా రూపొందుతాయి. ఒక్క చిన్న ఆచారాన్ని రూపొందించటానికి చాలా సుదీర్ఘమైన చరిత్ర అవసరమవుతుందని చెప్పిన మహానుభావుడెవరోగాని నిజం చెప్పాడు.

It requires a lot of history to make a little tradition.

ఈ కారణంగానే దైవ ప్రవక్తలు ఏకధాటిగా గాకుండా అంచెలవారీగా సంస్కరణలు తీసుకువస్తారు.

## ప్రవక్త సంప్రదాయం

అరబీలో విధానం లేక పద్ధతిని 'సున్నత్' అనంటారు. అంటే దైవప్రవక్త ద్వారా మానవాళికి తెలుపబడిన దైవ సమ్మతమైన విధానం అన్నమాట! దివ్య ఖుర్ఆన్‌లో ఈపదం దైవ శాసనాంగానికి చెందిన అన్ని విధానాలకూ వర్తిస్తుంది. ఇస్లామీయ సమాజం యొక్క నియమాలను వివరిస్తూ ఇలా చెప్పబడింది.

**"మీకు పూర్వం గతించిన సత్పురుషులు అవలంబించిన మార్గాలను మీకు విశదపరచి, వాటిపైనే మిమ్మల్ని నడపాలని అల్లాహ్ కోరుతున్నాడు. ఆయన తన కారుణ్యంతో మీ వైపుకు మరలాలని అభిలషిస్తున్నాడు. ఆయన సర్వమూ తెలిసిన వాడు, మహావివేకి కూడా". (4:62)**

అల్లాహ్ ఈ ప్రపంచాన్ని నిర్మించినపుడే నిర్ధారించాడు – ఈ ప్రపంచ నిర్వహణకై తనకు నచ్చిన విధానం ఏమిటో. ఈ విధానాన్ని అల్లాహ్ మిగతా ప్రపంచంలో తిరుగులేని రీతిలో ప్రవేశపెట్టాడు. ఏ వస్తువూ దీన్ని కాదని ఒక్క అంగుళమైనా ప్రక్కకు జరగదు. అయితే మనిషిపై అల్లాహ్ ఈ కట్టడి పెట్టలేదు. మనిషికి ఆలోచించే, అవలంభించే స్వేచ్ఛనొసగి, "మీలో ఎవరైతే మనస్ఫూర్తిగా నా విధానంపై నడుస్తారో వారికి నా దగ్గర స్వర్గం లభిస్తుంది. మరెవరైతే దీనిపై విముఖత చూపుతారో వారికొరకు నరకం నిరీక్షిస్తూ ఉంటుంది" అని స్పష్టం చేశాడు.

దైవసమ్మతమైన విధానాన్ని మానవతకు వివరించడానికే దైవప్రవక్తలు వచ్చారు.

దైవాభీష్టాను ప్రకారం జీవించటమెలాగో ప్రవక్తలు మనో వాక్కాయ కర్మలచేత స్పష్టం చేశారు. దీనికే ప్రవక్త సంప్రదాయం లేక ప్రవక్త విధానం అంటారు. ప్రవక్త సంప్రదాయం మిస్వాక్ (పనుదోముపుల్ల) గుసుల్ (స్నానం) వంటి సాధారణ మొదలుకుని సమాజ నిర్మాణం, సంఘ సంస్కరణ వంటి అసాధారణ అంధాలన్నింటితో ముడిపడి ఉంది. ఎవరైతే దైవ సమక్షంలో ప్రీతికరమైన వంటి అసాధారణ అంశాలన్నింటితో ముడిపడి ఉంది. ఎవరైతే దైవ సమక్షంలో ప్రీతికరమైన దాసులుగా గుర్తింపు పొందదలుస్తారో వారంతా తమ జీవన వ్యవహారాల్లో దైవప్రవక్త సంప్రదాయాన్ని అనుసరించక తప్పదు. తమ జీవితానికి సంబంధించిన ఏ వ్యవహారమూ ప్రవక్త సంప్రదాయానికి అతీతమని అనుకోరాదు.

దైవ ప్రవక్త వ్యక్తిగత విధానాలలో కెల్లా అత్యంత ముఖ్యమైనది. 'దైవమార్గం వైపుకు పిలుపు'. దైవ ప్రవక్త దైనందిన జీవితాన్ని అధ్యయనం చేస్తే మనకీ సంగతి బోధపడుతుంది. దైవ దాసులను దైవమార్గంలో పిలిచే విషయమై ఆయన అమితమైన చింతనచేస్తూ ఉండేవారు. ఆయనగారి చింతనను చూచి ఒకసారి సర్వోన్నత ప్రభువే ఇలా సెలవిచ్చాడు. (ఓ ప్రవక్త!) వారు విశ్వసించటంలేదన్న దుఃఖంతో మీరు కుమిలిపోయి మీ ప్రాణానికే ముప్పు తెచ్చుకునేలా ఉన్నారు" (26:3)

ఎవరైతే నా సున్నత్ (విధానం)తో సంబంధం త్రెంచుకున్నాడో అతనితో నాకెలాంటి సంబంధంలేదని దైవప్రవక్త ఒకసారి నిర్ద్వంద్వంగా చెప్పారు (బుఖారి 563). ఈ హదీసు ఏ విధంగానైతే నికాహ్ తదితర ఒప్పందాలతో ముడిపడి ఉందో అదేవిధంగా దైవసందేశ వ్యాప్తి కార్యక్రమంతో కూడా పెనవేసుకుని ఉంది.

దైవప్రవక్త విధానాలలో ఒకవిధానం (సున్నత్) 'వాస్తవిక దృష్టి' లేదా 'అంచెలవారీ మార్పు'. అంటే సైద్ధాంతికమైన విషయాలను ప్రవేశపెట్టేపుడు ఆయా ప్రజల స్థితిగతులను సరిగ్గా బేరీజు వేసి కొంతవరకు మినహాయింపుల (సడలింపుల) వైఖరిని అవలంభించటం. దైవప్రవక్త సంఘ సంస్కరణా కార్యక్రమాలను చేపట్టినప్పుడల్లా అంచెలవారీగా మార్పులు ప్రవేశపెట్టారు. నేటి పరిభాషలోనే చెప్పాలంటే ఆయన పద్ధతి విప్లవాత్మకమైనది (Revolutionary) కాదు, క్రమవికాసం (Evolutionary) తో కూడుకున్నది. ఆ విషయాన్నే ఆయిషా ఒక ఉల్లేఖనంలో ఇలా అన్నారు.

"దివ్య ఖుర్ఆన్‌లో తొలుత ముఫస్సల్ సూరాలు అవతరించాయి. వాటిలో చాలావరకు స్వర్గ నరకాల ప్రస్తావన ఉంది. ప్రజల హృదయాలు ఇస్లాం కొరకు పూర్తిగా సానుకూలమైన

తరువాత హరాం–హలాల్ (ధర్మాధర్మాల)లను వేరుచేసే ఆయత్‌లు అవతరించాయి. ఒకవేళ మద్యం సేవించరాదన్న ఆ దేశం మొదటే వచ్చి ఉంటే, "మేము మద్యం త్రాగటాన్ని ఎంతకీ మానుకునేది కాదు" అని ప్రజలు మొండిగా వ్యవహరించేవారు. వ్యభిచారం చేయరాదని ఒకవేళ మొదట్లోనే ఆదేశం వచ్చి ఉంటే "మేము వ్యభిచారాన్ని విడనాడబోము" అన్నిజనులు నిక్కచ్చితగా చెప్పేసేవారు". (బుఖారి హదీసు 4993)

హిజ్రీ 8వ సంవత్సరం రమజాన్ నెలలో మక్కా విజయం ప్రాప్తించింది. ఆ తరువాత అరబ్బు నాయకత్వం ప్రవక్త హస్తగతం అయింది. అయితే ఆయన కాబా గృహానికి సంబంధించిన ఆచార సంప్రదాయాలలో ఒక్కసారిగా మార్పులు తీసుకురాలేదని, దశలవారిగా సంస్కరణలు తీసుకువచ్చారని చరిత్ర చెబుతోంది. మక్కా విజయం చేకూరిన నాటినుంచే ఇస్లాం రాజ్యాధికారం స్థాపించబడినప్పటికీ హిజ్రీ శకం 8వ ఏట జరిగిప హజ్ క్రియలన్నీ ప్రాచీన సంప్రదాయాలకనుగుణంగానే జరిగాయి. హిజ్రీ 9వ సంవత్సరంలో మాత్రం ముస్లింలు తమ పద్ధతి ప్రకారం హజ్ చేయగా బహుదైవారాధకులు తమదైన రీతిలో హజ్ నిర్వర్తించారు. హిజ్రీ 10వ ఏట జరిగిన మూడవసారి హజ్‌లో మాత్రం ప్రవక్త ఆదేశానుసారం ప్రత్యేక రీతిలో హజ్ చేయటం జరిగింది. ఈ హజ్ యాత్రే ఇస్లామీయ చరిత్రలో 'హజ్జతుల్ విదా'గా వినతికెక్కింది.

బహుదైవాధకులు కాబాగృహంలోకి వచ్చి, బహుదైవోపాసనా రీతుల ప్రకారం హజ్ చేయటం దైవప్రవక్తకు సహించరాని విషయమే. కాని అధికారం ప్రాప్తమై ఉన్నప్పటికీ ఆయన షరీఅత్ ఆదేశాలను విధించటంలో వెగిరిపడలేదు. మక్కా విజయం తర్వాత రెండేళ్ల దాకా ఆయన హజ్‌కై మక్కా వెళ్లలేదు. హజ్ సీజన్ రాగానే ఆయన ఇలా అభిప్రాయపడ్డారు. "ముష్రికులు దైవ గృహానికి వస్తారు. నగ్నంగా హజ్ చేస్తారు. ఈ దురాచారాలు సమసిపోయేవరకూ హజ్ చేయటం నాకిష్టంలేదు" (తఫ్సీర్ ఇబ్నేకసీర్ 84/103)

మక్కా విజయం తర్వాత ముస్లిములు హిజ్రీ 8వ ఏట హజ్ చేశారు. కాని దైవ ప్రవక్త రాలేదు. మరుసటి సంవత్సరం ఆయన హజ్ యాత్రికుల బృందాన్ని అబూబకర్ నేతృత్వంలో పంపించారు. ఆ తరువాత దివ్య ఖుర్ఆన్‌లో ఒక ఆదేశం అవతరించింది. ముష్రికులు అశుద్ధులనీ, ఈ సంవత్సరం తరువాత వారు మస్జిదె హరాంకు దగ్గరకు రారాదని (9:28) సెలవీయబడింది. అందుకే ఆయన అలీని మక్కాకు పంపించి, మరుసటి సంవత్సరం నుంచి బహుదైవారాధకులెవరూ హజ్‌కు రాకూడదని మరియు నగ్నస్థితిలో కాబాను

సందర్శించకూడదు అని ప్రకటన చేయించారు. అలీ హజ్ సమ్మేళనంలో నలువైపులా తిరిగి అందరికీ వినపడేలా స్పష్టంగా ఈ ప్రకటన చేశారు. (బుఖారి హదీసు నెం. 369). ఆ విధంగా క్రమక్రమంగా బహు దైవోపాసనను నిర్మూలించిన తరువాత మూడవ ఏట ఆయన మక్కా వెళ్ళి హజ్ చేశారు. అదే ప్రవక్త గారి అంతిమ హజ్.

ప్రవక్త చట్టాలను ప్రవేశపెట్టడంలో ఎలా అంచెలవారీ విధానాన్ని అనుసరించారో దీన్ని బట్టి బోధపడుతోంది. అధికారం ప్రాప్తమైనప్పటికీ ఆయన దశలవారీ పద్ధతిని విడనాడలేదు. దైవ ప్రవక్త తనంతట తాను ఆగారు గాని బహుదైవారాధకులను ఒక్కసారిగా ఆపలేదు. తగు సమయం వచ్చే వరకూ ఆగి ఆపైన చర్యతీసుకున్నారు.

ప్రజలు సాధారణంగా దేన్నయితే "సున్నత్"గా భావిస్తారో అది మాత్రమే దైవప్రవక్త సున్నత్ కాదు, ఇదిగాక మరెన్నో సున్నత్‌లు (సంప్రదాయాలు, విధానాలు) ఉన్నాయి. వాటిలో ఒకటి : అంచెలవారీ పద్ధతి లేక వాస్తవిక దృష్టి, దైవప్రవక్త మక్కాలో ఒక ప్రవక్తగా 13 ఏండ్లు ఉన్నారు. కాని ఆయన ఎన్నడూ కాబా పట్ల జరుగుతున్న అనాచారాలకు నిరసనగా ప్రదర్శన నిర్వహించలేదు. ఆఖరికి మక్కా నగరం తన చెప్పుచేతుల్లోకి వచ్చేసిన తరువాత కూడా దురాచారాల నిర్మూలనకై తొందరపాటును కనబరచలేదు. చర్య తీసుకునే శక్తి ఉండి కూడా ఆయన రెండేళ్లదాకా నిరీక్షించారు. మూడవ సంవత్సరంగాని ఆయన తీసుకురాదలచిన సంస్కరణలను ప్రవేశపెట్టలేదు.

అంచెలవారీ పద్ధతిని అనుసరించడంలో ఎన్నో మేళ్లు ఉన్నాయి. 1. అన్నిటికన్నా ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవటం దీనివల్ల సులభతరమై పోతుంది. అంచెలవారీ విధానాన్ని అనుసరించటమంటే భావం ఒక్కో అడుగును ఆచితూచి వేస్తూ సురక్షితంగా ముందుకు సాగటమే. ఇలాంటి వ్యక్తి కార్యరంగంలో దుమికే సమయంలో కేవలం ఆవేశానికి లోనవకుండా, బాహ్యపరిస్థితులను బేరీజు వేసుకుంటూ సమయోచితంగా లక్ష్యం వైపుకు సాగిపోతాడు.

2. దీనివల్ల కలిగే రెండవ ప్రయోజనం ఏమిటంటే మనిషి నిష్ఫలమైన నష్టాల బారిన పడకుండా ఉండగలుగుతాడు. మనిషి ఒక్కసారిగా కార్యక్షేత్రంలో గెంతటంవల్ల అనవసరంగా తనకంటే శక్తిమంతులైన ప్రత్యర్థులను ఎదుర్కొనవలసిన పరిస్థితి ఉత్పన్నం కావచ్చు. తత్ఫలితంగా కొన్ని తరాలవరకు పూడ్చుకోలేని ధన ప్రాణ నష్టాలు సంభవిస్తాయి.

# ద్వితీయ భాగం

# సైద్ధాంతిక ప్రవక్త

భువిపై తన ధర్మానికి ఉన్నతి చేకూరనున్నది, ప్రపంచంలో అదొక గొప్ప సైద్ధాంతిక స్థానాన్ని పొందాలన్నది దైవాభిమతం. అయితే దైవధర్మం సైద్ధాంతిక ఆధిక్యతను పొందడానికి ప్రపంచ పరిస్థితులు సానుకూలంగా ఉండటం ఎంతో అవసరం. దేవుడు కొన్ని వేల సంవత్సరాల ప్రక్రియ ద్వారా అంతిమ దైవప్రవక్త కొరకు పరిస్థితులు సానుకూలం చేయబడ్డాయి. ఆయన ఈ పరిస్థితుల్ని సరిగ్గా అర్థం చేసుకుని, వివేకవంతంగా వాటిని సద్వినియోగం చేసుకున్నారు. దైవధర్మమైన ఇస్లాంను తిరుగులేని సైద్ధాంతిక వ్యవస్థగా నెలకొల్పారు.

కాగా, గత వెయ్యేళ్ల ప్రక్రియ ఫలితంగా దేవుడు మరెన్నో సానుకూల పరిస్థితుల్ని సమకూర్చాడు. వాటిని సద్వినియోగం చేసుకున్నట్లయితే ప్రపంచంలో ఇస్లాంను పునరుద్ధరించి ఇప్పటికీ దాన్నొక తిరుగులేని సైద్ధాంతిక వ్యవస్థగా చేయవచ్చు. గతంలో దానికి ఎలాంటి ఆధిక్యత లభించిందో అలాంటి ఆధిక్యతనే తిరిగి చేకూర్చవచ్చు.

అయితే ఇలాంటి అవకాశాలను నిజం చేసిచూపించటానికి సమయోచితమైన, సంయమనంతో కూడిన కృషి అవసరం. అది (ఆ కృషి) ప్రతీకారభావాలకు అతీతంగా సకారాత్మకంగా కొనసాగేదై ఉండాలి. అది ఇతరత్రా ఆలోచనలను విడనాడి కేవలం ధర్మోన్నతికై పాటుబడేదై ఉండాలి. అది మానవ మిడిమిడి జ్ఞానం ప్రాతిపదికపై గాక పరమ ప్రభువు మార్గదర్శక ప్రాతిపదికగా ముందుకు సాగేదై ఉండాలి. దాని ఉద్దేశం జాతీయ అహంభావాలను, కుహనా ప్రతిష్ఠలను ప్రతిష్ఠించటం గాక దేవుని ఔన్నత్యాన్ని నెలకొల్పటమై ఉండాలి. అలాంటి త్యాగధనులే గతంలోనూ దైవధర్మాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చారు. వారు నేటికీ దైవ ధర్మాన్ని ఉన్నతికి చేర్చగలుగుతారు. అలాగాక, స్థూల దృష్టితో కూడిన నినాదాలతో జనసమూహాన్ని ప్రోగుచేయటమే సిసలైన కృషి అని తలపోసినవారు, ఎదురైన ప్రతి సమస్యపై చిందులేయడానికి అలవాటుపడినవారు చేయగలిగిందల్లా ఒక్కటే – దేవుడు సృష్టించిన మహత్తర అవకాశాలను సర్వనాశనం చేయటం! వారు అవకాశాలకు కార్యరూపం చేకూర్చలేరు.

**ఒక పోలిక :**

దైవ ప్రవక్త కాలంలో వచ్చిన ఇస్లామీయ విప్లవంలో చారిత్రక ఆధారాల ప్రకారం మొత్తం 1018 మంది హతులయ్యారు. ఈ విప్లవం 23 సంవత్సరాల కాలంలో పరిపూర్తి అయింది. ఈ 23 ఏండ్ల కాలంలో జరిగిన యుద్ధాలు 81. అయితే వీటిలో దైవ ప్రవక్త

పాల్గొన్న యుద్ధాలు 27 మాత్రమే. అందులోనూ ఆయన యుద్ధం చేసినది బహు కొద్ది సందర్భాలలో మాత్రమే. ఈ యుద్ధాలలో మొత్తంమీద హతులైనవారి వివరాలు ఇలా ఉన్నాయి.

హతులైన ముస్లిము – 259

హతులైన ముస్లిమేతరులు – 789 = 1018

తొలి అధ్యక్షుని ఈ విప్లవం చరిత్రలో కెల్లా గొప్ప విప్లవం. అది చరిత్ర మలుపునే త్రిప్పివేసింది. అంత పెద్ద విప్లవంలో 1018 మంది మాత్రమే మరణించారంటే దాన్ని రక్త రహిత విప్లవం (Bloodless Revolution) అనవచ్చు.

మన రచయితలు, వక్తలలో చాలామంది ఈ విప్లవాన్ని ఇస్లామేతర విప్లవాలతో పోల్చి ఇస్లామీయ విప్లవం కేవలం ఒక్క వెయ్యి మంది ప్రాణాలనే బలిగొని విజయవంతమైందని ఆవేశపూరితంగా చెబుతూ ఉంటారు. ఫ్రాన్స్‌లో ప్రజాస్వామిక విప్లవం తీసుకురావటానికి, రష్యాలో కమ్యూనిస్టు విప్లవం రావటానికి లక్షలాది మంది ఆహుతి కావలసివచ్చిందని ఉదాహరిస్తూ ఉంటారు.

ఈ పోలిక మనకెంతో రమ్యంగా కనిపిస్తుంది. ఎందుకంటే దీని ద్వారా మన 'అహంభావాలకు' శాంతి, తృప్తి చేకూరుతూ ఉంటుంది. కాని ఒక్కడ పోలిక యొక్క మరో స్వరూపం ఉంది. దాన్ని గురించి ముస్లింలు ఎన్నడూ ఆలోచించనైనాలేదు. దీనికి కారణం బహుశా ఈ రెండవ పోలిక గుణపాఠంతో కూడిన పోలిక కావటమే. గుణపాఠం మనిషికి సర్వదా చేదుగానే ఉంటుంది మరి!

ఈ రెండవ పోలిక ఏమిటంటే, మీరు అలనాడు ఇస్లాం పరిచయ కార్యక్రమం సందర్భంగా మరణించినవారిని నేటి ముస్లిం ఉద్యమాలలో మరణిస్తున్నవారితో పోల్చటం. వేరే మాటల్లో ఆ మహనీయుని విప్లవం నుండి స్వయంగా మీ విప్లవ ప్రయత్నాల మతలబు తీయటం. ముస్లిములు వర్తమానకాలంలో ధార్మిక విప్లవం. ధర్మయుద్ధం పేర పెద్ద పెద్ద ఉద్యమాలను లేవనెత్తారు. ముస్లిములు ఏ విధంగానైతే దైవ దౌత్యకాలం నాటి ధార్మిక విప్లవాన్ని ముస్లిమేతరుల ధర్మరాహిత్య విప్లవాలతో పోలుస్తారో అదేవిధంగా వారు దైవ దౌత్య కాలంనాటి విప్లవాన్ని ముందుంచుకుని తాము లేవనెత్తిన ఉద్యమాలను తూకం వేసి చూడాలి. తమ ఉద్యమాల ఫలితాలను బేరీజు వేసుకోవాలి.

ముస్లిములు గనక ఈ విధంగా పోల్చిచూస్తే అప్పుడు వాళ్లకు అర్థమవుతుంది. ప్రవక్త విప్లవానికి ప్రతిగా ముస్లిమేతర జాతుల ధర్మరాహిత్య ఉద్యమాలు ఎక్కడ నిలిచి ఉన్నాయో సరిగ్గా అక్కడే తమ వర్తమాన ఉద్యమాలు కూడా నిలబడి ఉన్నాయన్న ఆశ్చర్యకరమైన యదార్థం వారికి అవగతమవుతుంది. అల్‌జీరియా స్వాతంత్ర్య యుద్ధంలో 25 లక్షల మంది ముస్లిములు అసువులుబాసారు. భారత స్వాతంత్ర్య సమరంలో 5 లక్షల మంది ఉలమా (పండితులు) ఆహుతి అయ్యారు. ఇస్లామీయ పాకిస్తాన్‌ను ఉనికిలోకి తెచ్చేలోగా ఒక కోటి మంది మనుషులు, అలాగే సిరియా, ఇరాక్, ఈరాన్, ఈజిప్టు, పాలస్తీనా తదితర ప్రాంతాలలో ఇస్లాం పేరిట ప్రాణాలర్పిస్తున్న వారి సంఖ్య అనేక లక్షల్లో ఉంది. అంతచేసీ ఈ సాధారణ త్యాగాల ఫలితం శూన్యం. ప్రవక్త ఉద్యమంలో ఒక వెయ్యి మంది మాత్రమే మరణించారు. కాని ఆ తర్వాత వచ్చిన విప్లవానికి యావత్ప్రపంచం ప్రభావితమైంది. వర్తమాన కాలపు ఇస్లామీయ ఉద్యమాలలో మొత్తం మీద 10 కోట్ల మంది అంతమయ్యారు. అయినా భూమండలంపై ఎక్కడా ఏ చిన్న ప్రదేశంలో కూడా ఇస్లామీయ విప్లవం నిజభావంలో విజయవంతమై సత్ఫలితాలను పొందిన దాఖలాలేదు.

అంతే కాదు, మన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇవ్వకపోగా కొన్ని దుష్ఫలితాలను మిగిల్చాయి. యూదులను గురించి బైబిల్ చెప్పిన మాటలు మనకు అక్షరాలా వర్తించేలా ఉన్నాయి. "మీరు నాటే విత్తనం వృధా అయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే మీ శత్రువులు దాని పంటను తింటారు. ఎవరికైతే మీ పట్ల శత్రుత్వం ఉందో వారే మీపై పరిపాలన చేస్తారు. మరి మీ శక్తి నిష్ప్రయోజనంగా ఖర్చవుతుంది. ఎందుకంటే మీ నేలనుండి ఏమీ ఉత్పన్నమవదు. మైదానంలోని వృక్షాలు ఫలవంతమయ్యేవి కావు".

(అహ్‌బార్, అధ్యాయం - 26:16-20)

మన ఆధునిక చరిత్ర ఈ మాటలకు అతికినట్లే సరిపోతుంది. మనం ఇస్లామీయ ఖిలాఫత్, ప్రపంచ సమైక్యత పేర్లతో ఎంతో ఆర్భాటంగా ఉద్యమాలు నడిపాము. ఈ మార్గంలో అసంఖ్యాకమైన త్యాగాలు చేశాము. కాని తీరా ఫలితం ముందుకు వచ్చేసరికి ముస్లిం జగత్తంతా అనేకానేక జాతీయ ప్రభుత్వాలుగా విభజితమైపోయింది. మనం దేశస్వాతంత్ర్యం కోసం జిహాద్ చేశాము. కాని అది స్వతంత్రమయ్యేసరికి క్రియాత్మకంగా మరో వర్గం చేతుల్లోకి వెళ్ళిపోయింది. మనం ఇస్లామీయ పాకిస్తాన్‌ను ఉనికిలోకి తేవడానికి త్యాగాలు చేశాము - కాని తీరా ఇస్లామీయ పాకిస్తాన్ ఏర్పడేసరికి అక్కడ ఇస్లామేతర నాయకుల పరిపాలన నెలకొంది. మనం ఈజిప్టులో ఇస్లామీయఅధికారాన్ని స్థాపించడానికి బ్రహ్మాండమైన ఉద్యమం

లేవనెత్తాము. కాని ఈజిప్టు భవితవ్యం నిర్ణయించబడేసరికి అది ఇస్లామీయ భావాలు గల వారికి బదులు ఫాసిస్టుభావాలు గల సైనికాధికారుల చేతుల్లోకెళ్ళిపోయింది. దాదాపు 7 దశకాలాలు పాలస్తీనా పోరాటం కొనసాగుతోంది. ముస్లిములకు అపారమైన ధన ప్రాణనష్టం సంభవించింది. కాని జరిగిందేమిటీ? యూదరాజ్యం మరింత గట్టిగా వ్రేళ్లూనుకోవటమే గాకుండా విస్తరించింది. ఈ సందర్భంగా ముస్లింలు మరొక వ్యధాభరితమైన వార్తను వినవలసివచ్చేలా ఉంది. అదేమిటంటే ఈరాన్‌లో అసాధారణమైన త్యాగాల కోర్చి ఇస్లామీయ ఉద్యమం తీసుకువచ్చారు. కాని అక్కడ అధికారంలోకి వస్తున్న వ్యక్తుల స్వభావాన్ని బట్టి ఆలోచిస్తే ఈరాన్ మరోసారి ధర్మవిహీనుల చేతుల్లోకి వెళ్ళిపోయేలా ఉంది.

ఇవీ వర్తమాన కాలంలోని వాస్తవాలు. శిలల కన్నా కఠినమైన వాస్తవాలివి! ఎవరైనా తన మనసులో అందమైన ఊహాలోకం ఒకటి అల్లి అందులో జీవించటమైతే చేయవచ్చునేమోగాని భవిష్యత్తులో కలం ఎత్తబోయే చరిత్రకారుడు మాత్రం మన ఈ ఊహాలోకాన్ని ధృవీకరించలేడు. ఫ్రెంచి, రష్యా విప్లవాలలో సంభవించిన మరణాలవల్ల కనీసం కొన్ని ప్రయోజనాలైనా చేకూరాయి. ఆ విప్లవాలు ప్రపంచానికి ఓ క్రొత్త ఆలోచనా సరళిని అందించాయి. ప్రపంచంలో అనువంశిక రాజరికాలు అంతరించి ప్రజాస్వామిక ధోరణులైనా ప్రబలినాయి. పెట్టుబడి దారీ పంథాపై సోషలిస్టు తరహా ఆర్థిక వ్యవస్థకు ఆధిక్యత చేకూరింది. కాని ఇస్లాం పేరిట చనిపోయినవారు సంఖ్యాపరంగా ఈ విప్లవాలకంటే అధికులే అయినప్పటికీ వారు ప్రపంచ విచార ధారపై ఎలాంటి ప్రభావాన్నీ చూపలేకపోయారని రేపు చరిత్ర కారులు వ్రాయబోతున్నారు!

ప్రప్రథమ ఇస్లామీయ ఉద్యమం చాటిచెప్పేదేమిటీ? దైవధర్మం కోసం ఒకవెయ్యి మంది ముందుకువచ్చి ఏ త్యాగమైనా చేయడానికి సిద్ధమని నిరూపించుకుంటే చాలు, దేవుడు వారి త్యాగాన్ని స్వీకరించి ఇస్లాంకు భువిపై ఆధిక్యతను చేకూరుస్తాడని చాటి చెబుతోంది. వర్తమాన కాలంలో కోట్లాదిమంది త్యాగాలు చేశారు. కాని దైవ సహాయం వారికి అండగా రాలేకపోయింది. ఎన్ని త్యాగాలు చేసినా వాళ్లు పరాధీనులుగా, విఫలురుగానే ఉండిపోయారు. దీన్ని బట్టి స్పష్టమయ్యేదేమిటంటే, దేవుడు ఏ గొప్ప సహాయం మరియు స్పష్టమైన విజయంం గురించి వాగ్దానం చేశాడో (48:13) దానికి నోచుకోగల త్యాగాలు రుజుమార్గంలో చేయలేదు.

ఎవరైనా సరే తాను గోధుమగింజలు జల్లగా గోధుమ మొక్కల బదులు కలుపు మొక్కలు, ముళ్ల వృక్షాలు మొలచాయని అంటే అతను అబద్ధం చెబుతున్నాడన్న మాట!

ఎందుకంటే దేవుని ఈ ప్రపంచంలో గోధుమ గింజలుజల్లగా కలుపు మొక్కలు పుట్టుకు వచ్చేందుకు ఆస్కారమే లేదు. ఇది అసంభవం. కోటిసార్లు అసంభవం. అలాగే వర్తమాన కాలంలో మనం నిజంగానే దైవప్రవక్త మార్గంలో ప్రవక్త ప్రత్యక్ష సహచరుల అడుగుజాడల్లో నడచి త్యాగాలు చేసి ఉన్నట్లయితే, ఇన్ని అసాధారణ ప్రయత్నాల తరువాత కూడా సకారాత్మక ఫలితాలు వెలువడకుండా ఉండటం అసంభవమ్యేది. ఇది నిర్ణయాతమకమైన విషయం. దీని తరువాత కూడా మనిషి తనదైన ఆలోచన కుహరంలో ఉండదలిస్తే అది వేరే విషయం. త్వరలోనే ప్రళయదినం అతని ఈ కుహరాన్ని కూల్చివేస్తుంది. ఆ తరువాత అతను చూచుకుంటాడు. తన కొరకు శిధిలావస్థలో వున్న అసత్య కుహరాలు తప్ప మరేమీ లేవని!

## దైవ సహాయం :

దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడింది. “ఓ విశ్వసించిన వారలారా! మీరు గనక దైవానికి సాయం చేస్తే దేవుడు మీకు సాయం చేస్తాడు. మీ పాదాలకు స్థిరత్వాన్ని చేకూరుస్తాడు” (47:7). ఇక్కడ దైవానికి సాయంచేయట మంటే భావం దైవప్రణాళికతో సమన్వయం చెందదమన్నమాట! అంటే సంఘటనలను ఉనికిలోకి తేవడానికి దేవుడు సమకూర్చిన అవకాశాలతో మన ప్రయత్నాలను జోడించాలి. ఈ విధంగా దైవంతో, దైవ ప్రణాళికతో సహకరించినవారికి స్థిరత్వం ప్రాప్తిస్తుంది. ఎట్టకేలకు వారు సఫలీకృతులవుతారు. దేవుని ఈ ప్రపంచంలో దైవ ప్రణాళికతో సమరసం చెందడం ద్వారానే ఏదైనా ఫలితాన్ని సాధించవచ్చు. స్వయం ప్రతిపాదిత, స్వేచ్ఛాయుత ఆచరణలతో సత్ఫలితం ప్రాప్తించదు.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవటానికి ఒక దృష్టాంతాన్ని తీసుకోండి. ఒక మతాధిపతి తన ఇంటి ముందు పచ్చని ఒక వృక్షాన్ని చూడదలిచారు. తను గనక ఒక విత్తనం నాటితే అది మొలచి వృక్షం కావటానికి పదేళ్ళ కాలం పడుతుంది. అందుకని ఆయన ఎక్కడనుంచో ఒక పెద్ద వృక్షం త్రవ్వించి తెచ్చి కిరాయి మనుషుల చేత తన ఇంటిముందు నాటారు. పదేళ్ళ వ్యవధిని ఒక్కరోజులోనే దాటేసానని ఆయన అమితానందం చెందాడు. కాని మరునాడు చూస్తే ఆ చెట్టు ఆకులు వాడిపోయివున్నాయి. ఆ సాయంత్రానికి కొమ్మలు కూడా వాడిపోయాయి. మరి కొన్నిరోజులకే చెట్టు ఆకులు ఎండి రాలిపోయాయి. మరి కొన్నాళ్ల తర్వాత చూస్తే ఇంటిముందు ఎండిపోయిన ఒక దుంగమాత్రం కనిపించింది.

ఆ రోజుల్లోనే ఆ మతాచార్యుని మిత్రుడొకడు ఆయన్ని కలుసుకోవటానికి వచ్చాడు. ఆ మతాధిపతి ఇంటి ఆవరణలో కలతచెందిన మనసుతో పచార్లు చేస్తూ ఉండటం చూసి

కుశల ప్రశ్నలు వేశాడు. దానికి ఆ మతాచార్యుడు ఇచ్చిన జవాబు గమనించదగినది. "నేను తొందరలో ఉన్నాను. కాని దేవుడు తొందరపడటం లేదు".

"I am in hurry, but god doesn't"

ఆ పైన ఆ మతాధిపతి ఆ చెట్టు గురించి చెబుతూ, ప్రపంచంలో సంభవించే సంఘటనల్లో ఒక వంతు పాత్రదైవానిదైతే ఒక వంతు పాత్ర మనిషిదని అంటాడు. దీని ఉదాహరణ ఎటువంటిదంటే, రెండు దంత చక్రాలు (Cog Wheels) ఉన్నాయి. అవి రెండూ కలిస్తేనే యంత్రం నడుస్తుందనుకోండి. ఒక చక్రం దైవానిది. మరో చక్రం మానవునిది. మానవుడు దేవుని చక్రంతో సమన్వయం చెందినపుడే అతడు సఫలీకృతుడవుతాడు. అలాగాక అతడు దేవుని చక్రవేగాన్ని లక్ష్యపెట్టకుండా నడిస్తే అది విరిగిపోతుంది. ఎందుకంటే దేవుని చక్రం బలమైనది. మానవుని చక్రం బలహీనమైనది.

దేవుడు కోట్లాది సంవత్సరాల ప్రక్రియ అనంతరం భూమిపైన సారవంతమైన మట్టి పేరుకునేలా చేశాడు. దానిపై వృక్షం మొలకెత్తాలన్నది ఆయన అభిమతం. దానికోసం ఆయన సూర్యుని ద్వారా పైనుండి ఉష్ణోగ్రతను పంపాడు. విశ్వజనీన ఏర్పాట్లానుసారం నీటిని సమకూర్చాడు. రుతువుల మార్పు ద్వారా దాని పెరుగుదలకు కావలసిన ఏర్పాట్లు చేశాడు. వేలకోట్ల సంఖ్యలో సూక్ష్మ జీవులను పుట్టించి వృక్షం వ్రేళ్లకు నైట్రోజన్ అనే ఆహారాన్ని సరఫరా చేసేలా చేశాడు. ఈ ఏర్పాట్లన్నీ దేవుని ఒక చక్రం (Cog Wheel). ఇప్పుడు మనిషి చేయాల్సిందేమిటంటే తన చక్రాన్ని దాంతో జోడించాలి. అంటే అతను విత్తనాన్ని భూమిలో నాటాలి. అతను గనక అలాచేస్తే దేవుని చక్రంతో తన చక్రాన్ని కలిపినట్లు లెక్క. దానికి బదులు మనిషి తన విత్తనాన్ని రాతినేలపై చల్లితే, లేదా విత్తనం బదులు విత్తనాన్ని పోలిన మరేదైనా కృత్రిమ వస్తువును నాటితే లేదా విత్తనం నాటే బదులు ఒక పెద్ద చెట్టునే పెకలించి తెచ్చి తన పెరట్లో పాతిపెడితే అతడు తన చక్రాన్ని దేవుని చక్రంతో కలపలేదన్నమాట! అతను దేవుని ప్రణాళికతో సమన్వయం కాలేదన్నమాట! ఇలాంటి వ్యక్తి ప్రపంచంలో పచ్చని వృక్షానికి యజమాని కాలేడుమరి.

ఇస్లామీయ విప్లవ విషయమూ ఇంతే. అది కూడా దేవుని చేత సృజించబడిన అవకాశాలను గ్రహించటం, వాటిని సద్వినియోగం చేసుకోవటం వల్లనే ఉనికిలోనికి వస్తుంది. అంతేగాని స్వయం కల్పిత ఆర్భాటాలతో కాదు. తొలికాలంలో విప్లవం వచ్చిందంటే దేవుని దాసులు కొందరు తమ చక్రాన్ని దైవచక్రంతో అనుసంధానం చేయటం మూలంగానే వచ్చింది.

దానికి బదులు వర్తమాన కాలంలో మనం దైవప్రణాళికతో సమన్వయం చెందక స్వీయకల్పిత మార్గాల్లో అనవసరమైన పోకడలకు ఒడిగట్టాము. తత్కారణంగా మన త్యాగాలన్నీ వృధా అవుతున్నాయి.

## ఏక దైవారాధన ధర్మము - బహుదైవారాధన ధర్మము

ఖుర్ఆన్ బోధనల (2:213)ను బట్టి అర్థమయ్యేదేమిటంటే ఆదం (అలైహి) తరువాత మానవుడు పుడమిపై నివసించసాగినపుడు అందరి మత ధర్మం ఏకేశ్వరోపాసనే. కొన్ని వందల సంవత్సరాల వరకూ ఇదే పరిస్థితి ఉంది. ఆ తరువాత ప్రజల్లో గోచర వస్తువులను పూజించే తత్త్వం ప్రబలింది. దానికి మరోపేరే షిర్క్. కంటికి కానరాని దైవంపై ఆధారపడటం మనిషికి కష్టభయిష్టమై పోయింది. అందుచేత అతను మతపరంగా దైవాన్ని నమ్ముతూనే కంటికి కానవచ్చే వస్తువులపై దృష్టిని కేంద్రీకరించసాగాడు. ఈ కాలంలో సూర్యచంద్ర నక్షత్రాల పూజ మొదలయింది. సముద్రాలు పర్వతాలు దేవతలుగా పరిగణించబడసాగాయి. ఆఖరికి మనుషుల్లో పుణ్యాత్ములుగా, మహనీయులుగా కనిపించిన వారినల్లా దైవంగా తలపోయసాగారు. ఆ విధంగా వెయ్యేళ్ల తర్వాత మానవ మనోభావాలపై షిర్క్ (బహుదైవారాధన) క్రమ్ముకుపోయింది.

ఏక దైవారాధనా మతంలో పొడసూపిన ఈ చెడుగును రూపుమాపటానికి దేవుడు తన ప్రవక్తలను పంపసాగాడు. అయితే ఆ ప్రవక్తలకు ఎన్నడూ, షిర్క్‌ను సమూలంగా నిర్మూలించగలిగినంత జనాదారణ ప్రాప్తం కలుగలేదు. ఆనాడు మానవులు ఎక్కడెక్కడైతే నివసిస్తుండేవారో అక్కడే దైవ ప్రవక్తలు పంపబడ్డారు (23:44). ఒక హదీసు ప్రకారం సందేశహరుల సంఖ్య దాదాపు లక్షాఇరవైనాలుగు వేలు ఉంది. అయితే ఈ సందేశహరు లందరూ హేళనకు గురి అయ్యారు (అహ్మద్ 22288)

మనిషి సత్యాన్ని తిరస్కరిస్తున్నాడంటే, అంతేకాదు సత్యాన్ని కూడా ఎగతాళి చేస్తున్నాడంటే ఉత్తుత్తిగానే అలాచేయడు. అతని ఈ వైఖరివెనుక ఏదో కారణం ఉంటుంది. ఏదో ఒక అహంభావం మూలంగానే అతను సత్యాన్ని నిర్లక్ష్యం చేస్తాడు. దీనికి సమాధానం ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్ ద్వారా లభిస్తుంది.

"వారి వద్దకు వారి ప్రవక్తలు నిదర్శనాలు తీసుకువచ్చినపుడు వాళ్లు తమ దగ్గర ఉన్న జ్ఞానం పట్ల ధీమాగా ఉన్నారు. మరివారు దేని గురించైతే ఎగతాళి చేసేవారో అది వారిని చుట్టుముట్టింది". (40:83)

పై వచనంలోని "జ్ఞానం" అంటే భావం తాతముత్తాతల ద్వారా సంక్రమించిన ఆచారాలు. వాటిని వారు పవిత్రమైనవిగా నమ్మేవారు. ఇలాంటి వారసత్వ మతం సతతం నెలకొని ఉంటుంది. దాంతో పూర్వీకుల్లోని పుణ్య పురుషుల పేర్లు ముడిపెట్టబడి ఉంటాయి. దాని పేరుతో పెద్ద పెద్ద సంస్థలు ఏర్పడి ఉంటాయి. దాని ప్రాతిపదికపైనే ఆ జాతి సౌధం నిలబడి ఉంటుంది. దీర్ఘకాలిక ఆచార సంప్రదాయాల మూలంగా అదొక ఉన్నతమైన మత ధర్మంగా చెలామణి అవుతూ ఉంటుంది.

ఇలాంటి జాతుల వద్ద ఒకవైపు బహుదైవోపాసనా పునాదులపై నిలబడిన మతం ఉండగా మరోవైపు ప్రవక్త ఏ తెంచి ప్రజలకు దాదాపు అపరిచితమైన ఏకదైవారాధనా మతం గురించి ప్రబోధించేవాడు. తన మతం సత్య ప్రధానమైందని చెప్పడానికి ఆ ప్రవక్త వద్ద తగినన్ని చారిత్రక ఆధారాలుండేవి కావు. తనకు లభించిన దైవదౌత్యం అక్షరసత్యమని నిరూపించడానికి అతని దగ్గర మాటలు తప్ప మరో బలమైన ఆధారం ఉండేదికాదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా ప్రజల్లో 'కాలపు ప్రవక్త' అంటే గౌరవ భావం ఏర్పడేది కాదు. అయితే వారసత్వంగా సంక్రమించిన మతం మాత్రం వారికి గొప్పమతంగా అనిపించేది. ఏసుక్రీస్తుకు ఇల్లు ఉండేదికాదు. ఆయన చెట్టు క్రింద పడుకునేవారు. అదే సమయంలో యూదుల మతాధిపతి హైకెల్ వైభవోపేతమైన దర్బారులో ఆసీనుడై ఉండేవాడు, మరలాంటప్పుడు చెట్టుక్రింద నిద్రించే ప్రవక్త ప్రజల కంటికి గొప్పవాడుగా సత్యసంధుడుగా ఎలా కనిపిస్తాడు? ఈ కారణంగానే ఆయా కాలాల ప్రజలు తమ సమకాలీన ప్రవక్తలను నిర్లక్ష్యం చేశారు. ఆనవాయితీగా వచ్చే మతానికి అధిపతులుగా చెలామణి అయ్యేవారిని వారు ఆశ్రయించి ఉండేవారు. వాకిళ్లు తమ పుణ్యపురుషులైన పూర్వీకుల జాబితాలో ప్రవక్తల పేర్లు కూడా చేర్చే వారనుకోండి. కాని ఆ గత ప్రవక్తల పట్ల వారికి గల భావం హీరోయిజం భావం మాత్రమే. సత్యసందేశహరుడు పరంగా మాత్రం కాదు.

## దేవుని వాక్కు నెలకొల్పాలి.

దైవ ధర్మ ఉన్నతికై మీరు చూస్తూనే ఉంటారు. కూడలి ప్రాంతాల్లో సిగ్నల్స్ అమర్చబడి ఉంటాయి. వాటిలో పచ్చగుర్తులు, ఎర్రగుర్తులూ కనిపిస్తాయి. పచ్చగుర్తులు కనిపించిన దిశలో వాహనాలు పోయేందుకు అనువు ఉంటుంది. ఎరుపు రంగు గుర్తు ఉన్న దిశలో వాహనాలు పోవడానికి వీల్లేదు. ఒకవేళ ఎవరైనా ఈ సిగ్నల్‌ను అతిక్రమించి ముందుకుపోతే వారు ట్రాఫిక్ నిబంధనలననుసరించి శిక్షార్హులవుతారు.

సత్య సందేశకుని స్థాయి కూడా ఇలాంటిదే. అతను మార్గదర్శక సిగ్నల్ వంటివాడు. అతను దేవుని తరఫున నియుక్తుడై జీవన మార్గాల్లో నిల్చుని ఎటుపోవాలో ఎటుపోకూడదో, ఏ దారిలో వెళితే స్వర్గం లభిస్తుందో, ఏదారిన పోతే నరకం ఎదురవుతుందో చెబుతూ ఉంటాడు (2:143 అనువాదం)

తొలికాలంలో – ఏకదైవారాధన అనంతరం – షిర్క్ సర్వత్రా ప్రబలిపోయినపుడు దేవుని తరఫున వచ్చిన ప్రవక్తలంతా ఈ ఆశయసాధన కోసమే వచ్చారు. జాతులకు సన్మార్గం చూపటానికి, ప్రపంచజీవితంలో తప్పేదో ఒప్పేదో తెలియబరచటానికి దేవుడు వారికి వాస్తవ జ్ఞానం ఇచ్చి పంపాడు. ప్రవక్తలందరూ ఈ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారు. వారు ప్రజలకు అర్థమయ్యే భాషలో ప్రమాణ బద్ధంగా విషయాన్ని వివరించారు మరియు పదేపదే సత్యాన్ని ఎంతవరకు వివరించారంటే శ్రోతల ముందు ఇతేమామెహుజ్జత్ (అన్ని కోణాల నుండి సత్యం యొక్క వివరణ, హద్దు వరకు దైవసందేశం చేరిపోయింది. ఆ తరువాత దైవప్రవక్త మాట విని ఆయనతో సహకరించినవారల్లా స్వర్గోర్హులుగా నిలిచారు. సత్యాన్ని తృణీకరించినవారు తిరుగుబాటుదారులుగా ఖరారై నరకాగ్నికి ఆహుతి అయ్యారు.

అయితే ఈ సత్య ప్రకటనతో పాటు సత్యాన్ని ప్రతిష్ఠింపచేయాలని కూడా దేవుడు అభిలషించాడు. సత్యప్రకటన అంటే ఏమిటీ? సత్యం గురించి ప్రజలకు క్షుణ్ణంగా ఎరుకపరచటం! శ్రేయోభిలాష, వివేచన వంటి అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఎదుటివాడికి సత్యప్రధానమైన కోణాలన్నింటినీ స్పష్టంగా విడమరచి చెప్పి, ఇంక అతను సత్యం గురించి నాకు తెలియదు అని బుకాయించడానికి ఆస్కారం లేకుండా చేయటం!

దీనినే "ఇతేమామే ఉహుజ్జత్" అంటారు. ఇక ధర్మప్రతిష్ఠత అనేది దీనికన్నా ఉన్నతమైనది. ధార్మిక భావన, ప్రపంచంపై బలమైన ప్రభావం చూపటం 'ఇజ్‌హారేదిన్'. ఇది జరిగినపుడు ఇతరత్రా భావాలు, భావనలు పటాపంచలైపోతాయి. లేదా లొంగిపోతాయి. వేరే మాటల్లో ఇది "ఏలాయు కలిమతుల్లాహ్"గా వ్యవహరించబడుతుంది. ఇజ్‌హారేదిన్ లేక ఏలాయె కలిమతుల్లాహ్ అంటే భావం దేవుని హద్దులను విధించటం కాదు, ఏలాయె కలిమతుల్లాహ్ అంటే అసలు "సైద్ధాంతిక ఆధిక్యత" అని అర్థం. అంటే వర్తమాన కాలంలో నవీన శాస్త్రాలకు ప్రాచీన శాస్త్రాలపై ఎలాంటి ఆధిక్యత ఉందో సరిగ్గా అలాంటి ఆధిక్యత అన్నమాట! ఉదాహరణకు పెట్టుబడిదారీ వ్యవస్థపై కమ్యూనిజంకు గల క్యాపిటియలిజం మీద సోషలిజం యొక్క సైద్ధాంతిక ఆధిక్యత, రాజరికంపై ప్రజాస్వామ్యానికి గల సైద్ధాంతిక

ఆధిక్యత, ఊహాజనిత తత్వంపై అనుభవపూర్వకమైన సైన్సుకు గల ఆధిక్యత! ఆధునిక శాస్త్రీయ జగత్తులో కొన్ని శాస్త్రాలు శాస్త్రీయమైన ఆధిక్యతా స్థానాన్ని ఆక్రమించాయి. మరియు కొన్ని శాస్త్రాలు తమ గతవైభవాన్ని కోల్పోయాయి. ఇలాంటి ఆధిక్యతే అసత్యంపై సత్యానికి చేకూరాలన్నది దైవాభిమతం.

దేవుడు నిరాపేక్షపరుడు. సర్వమూ చేయగలవాడు. ఆయన తలచుకుంటే సత్యానికి అసత్యంపై ఆధిక్యత చేకూర్చటం కష్టమైన పనికాదు. సూర్యకిరణాలు భూమండలంలోని వస్తువులపై ఎలా ప్రసరిస్తున్నాయో అలాగే ఆయన సత్య వెలుగును అసత్యమనే అంధకారంపై ప్రసరించేలా చేయగలడు. కాని ఈ ప్రస్తుత ప్రపంచం పరీక్ష ప్రపంచం. ఇక్కడ దేవుడు తానుకోరిన వాటిని ఉనికిలోకి తీసుకురావటానికి తగిన కారణాలను సృజించి సంఘటనల రూపంలో వాటిని ఉత్పన్నం చేస్తాడు అంతేగాని మాయల రూపంలో చిటికెలో చేయించడు. అందుకే దేవుడు కారకాల పరిధుల్లో ఈ ఆశయానికనుగుణంగా అవసరమైన పరిస్థితులన్నింటినీ సృష్టించాలని, ఆపైన ధర్మాన్ని ఆధిక్యతా స్థానంలో ప్రతిష్ఠించే ప్రవక్తను పంపాలని నిర్ణయించుకున్నాడు. ఆ మాటే దివ్య ఖుర్ఆన్‌లోని క్రింది వచనంలో చెప్పబడింది.

"అల్లాహ్ జ్యోతిని తమ నోటితో ఊది ఆర్పివేయాలని వారు కోరుతున్నారు. కాగా, తన జ్యోతిని సంపూర్ణం చేయాలన్నది దైవాభిమతం – ఇది అవిశ్వాసులకు ఎంతగా భరించరానిదైనా సరే. ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చి పంపాడు – దాన్ని ఇతర మతాలన్నింటిపై పైచేయిగా చేయటానికి! ఇది బహుదైవోపాసకులకు ఎంతగా సహించరానిదైనప్పటికిన్నీ" (61:8,9)

## ఒక నూతన జాతిని ప్రభవింపజేయటం :

"నేను అబ్రాహాము ప్రార్థనా ఫలాన్ని" అన్నారు (అల్‌తబఖాత్‌అల్ సంపుటి 1, పేజీ 119). దైవప్రవక్త అబ్రాహాము పవిత్ర కాబా గృహాన్ని నిర్మిస్తూ "ఓ దేవా! నువ్వు నా కుమారుడైన ఇస్మాయిల్ సంతతిలో ఒక ప్రవక్తను పుట్టించు" అని ప్రార్థించారు (2:129). అయితే అబ్రాహాము ప్రార్థనకు ప్రవక్త ముహమ్మద్ జనానికి మధ్య సుమారు రెండున్నరవేల సంవత్సరాల అంతరం ఉంది. ఆలోచించవలసిన విషయం ఏమిటంటే దైవప్రవక్త జకరియ్యా తన వంశంలో ఒక ప్రవక్తను ప్రభవింపజెయ్యమని ప్రార్థించగా ఒక్క సంవత్సరంలోనే ఆయనకు యహ్యా జన్మించారు (3:39). కాని అబ్రాహాము కూడా అలాంటి ప్రార్థనే చేయగా ఆయన ప్రార్థన స్వీకారయోగ్యం కావటానికి రెండున్నరవేల సంవత్సరాల సమయం పట్టింది?

ఎందుకింత వ్యత్యాసం?

ఈ వ్యత్యాసానికి కారణమేమిటంటే యహ్యా తాత్కాలికంగా తన వంతు పాత్రను నిర్వర్తించవలసి ఉండింది. యూదుల బండారాన్ని బయటపెట్టి, వాళ్ల చేతుల్లో హతులై, యూదులు ధర్మ విహీనతలో పెచ్చరిల్లిపోయారని నిరూపించటానికి, వారి స్థానంలో మరొక జాతికి దైవగ్రంథం వొసగవలసిన ఆవశ్యకత ఏర్పడిందని రుజువు చేయడానికి యహ్యా పంపబడ్డారు. మరి ఈ మహత్కార్యాన్ని నిర్వర్తించడానికి సౌశీల్యవంతమైన ఒక నవతరాన్ని, సానుకూలమైన పరిస్థితులను ఉనికిలోనికి తేవలసిన అవసరం కూడా ఉండింది. ఈ నవతరాన్ని, ఈ సానుకూల పరిస్థితులను ఉద్భవింపజేయటానికి రెండున్నర వేల సంవత్సరాలు పట్టాయి.

ఈ ప్రణాళికానుసారమే ఇరాక్‌వంటి నాగరిక ప్రదేశాన్ని వదలి హిజాజాన్ అనే ఎడారి ప్రాంతానికి వెళ్ళి తన భార్యాబిడ్డలను ఆ నిర్జన లోయల్లో వదలిపెట్టాలని అబ్రాహామును ఆదేశించటం జరిగింది (14:37). ఆ స్థలం ఆ కాలంలో కటిక ఎడారిప్రాంతం కావటం వల్ల మిగతా ప్రపంచం నుండి అది పూర్తిగా వేర్పడి ఉండేది. అక్కడ సంస్కృతీ నాగరికతల కృత్రిమ ఆలోచనలు లేవు. అక్కడి వాతావరణమంతా సహజమైనది. ప్రకృతి ప్రసాదితమైన శక్తియుక్తులకు కృత్రిమ వాసనలు సోకని, నూరుశాతం సహజత్వం ఉట్టిపడే ఒక నవతరాన్ని లక్ష్య సాధన దిశలో మలచుకునే అవకాశాలు అక్కడ మెండుగా ఉన్నాయి (2:128). మొర ఆలకించబడటానికి రెండున్నరవేల ఏండ్లు పట్టటంలో గల మరో పరమార్థం ఏమిటంటే, ఆ జాతి ప్రజలు కాలం యొక్క మెట్టపల్లాల రుచిని చూడవలసి ఉంది, క్రమశిక్షణలో పోత పోయబడవలసి ఉంది. ఈ సుదీర్ఘ ప్రక్రియలో నిగ్గుతేలిన తరువాతే ఆ జాతి దైవ ధర్మావలంబనలో సాటిలేనిదిగా నిలబడగలుగుతుంది. నిజభావంలో అదొక సజీవమైన జాతిగా ముందుకువస్తుంది. కృత్రిమ గుణాలకు దూరంగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ రెండున్నరవేల ఏండ్లలో దైవ ప్రణాళికను అమలుపరచడానికి అనువైన వేదిక సిద్ధమైంది. అప్పుడు అరేబియాలోని బనూహాషిమ్ తెగలో ఆమీన కడుపులో అబ్రాహాము ప్రార్థనా ఫలమైన "ఆ విప్లవ ప్రవక్త" పుట్టారు.

అబ్రాహాము దైవాజ్ఞానుసారం హాజిర మరియు ఇస్మాయీల్‌లను ప్రస్తుత మక్కా స్థలంలో తెచ్చి వదిలారు. అప్పట్లో అక్కడ కటికనేల, నలువైపులా రాళ్లు రప్పలు తప్ప మరేమీలేవు. నీళ్లతిత్తిలోని నీరు అయిపోయింది. పసివాడైన ఇస్మాయీల్ దాహంతో కాళ్లు

చేతులు నేలకు కొడుతున్నాడు. దైవ కారుణ్యకడలి కదలివచ్చింది. కరకునేల నుండి జమ్‌జమ్ నీటి ఊట చిమ్ముకుని వచ్చింది. దేవుడు మీకు కష్టసాధ్యమైన కార్యం కొరకు నిలబెట్టిన మాట నిజమేగాని ఆయన మిమ్మల్ని దిక్కులేనివారుగా వదలివేయలేదనీ, మీ వ్యవహారం దైవ వ్యవహారమనీ, దేవుడు ప్రతి సున్నిత ఘడియలోనూ మీకు తోడ్పడతాడనటానికి ఇదొక ప్రబల తార్కాణం. ఇస్మాయీల్ యుక్తవయస్సుకు చేరుతుండగా అబ్రాహాము ఒక కలగన్నారు. కలలో ఆయన తన ముద్దుల కొడుకును 'జిబహ్' చేస్తున్నారు. ఆ కలను ఆయన దైవోపదేశంగా భావించి కన్నకొడుకును దైవమార్గంలో అర్పించడానికి సిద్ధమయ్యారు. కాని తీరా ఆయన కత్తి కొడుకు మెడపై పడబోతుండగా దేవుడు ఆయన్ని పిలిచాడు. కొడుకు స్థానంలో బలి ఇవ్వడానికి ఒక పొట్టేలును అవతరింపజేశాడు. వాస్తవానికి దేవుడు అబ్రాహామును పరీక్షించదలిచాడు. ఇస్మాయీల్ ప్రాణాన్ని బలిగొనటం దైవాభిమతం ఎంతమాత్రం కాదు, తన ప్రణాళికను అమలుపెట్టడానికి అనువైనవిధంగా ఆ జాతి నిర్మాణం జరుగుతున్నదా లేదా అన్నదానినే దేవుడు చూడదలిచాడు.

ఇస్మాయీల్ పెద్దవారై జుర్‌హుం తెగకు చెందిన అమ్మాయిని వివాహమాడారు. జమ్‌జమ్ నీరు బయల్పడిన తరువాత జుర్‌హుం తెగ అక్కడికొచ్చి స్థిరపడింది. సిరియాలో వుంటున్న అబ్రాహాము ఒకరోజు గుఱ్ఱమెక్కి వచ్చారు. ఆ సమయంలో ఇస్మాయీల్ ఇంట్లో లేరు. ఇస్మాయీల్ గారి భార్య మాత్రమే ఇంట్లో ఉంది. ఇంటికి వచ్చిన వారు తన మామ అన్న సంగతి ఆమెకు తెలియదు. ఇస్మాయీల్ ఏడి? అని అబ్రాహాము అడిగితే షికారుకెళ్ళారని ఆమె సమాధానమిచ్చింది. ఇక్కడ మీ జరుగుబాటు ఎలా వుంది? అని ప్రశ్నిస్తే 'ఆ ఏం చెప్పమంటారు? ఆర్థికంగా మేము ఎన్నో ఇక్కట్లను ఎదుర్కోవాల్సివస్తోంద'ని సమాధానం చెప్పింది. అబ్రాహాము బయల్దేరబోతూ, 'ఇస్మాయీల్ వస్తే ఆయనకు నాసలాం చెప్పు' తన ఇంటి గుమ్మాన్ని మార్చమని కూడా ఆయనతో చెప్పు' అని చెప్పి వెళ్ళిపోయారు. ఇస్మాయీల్ ఇంటికి వచ్చాక తన భార్య ద్వారా సంగతి తెలుసుకున్నారు. ఇంటికి వచ్చింది. తన తండ్రిగారేనని అర్థం చేసుకున్నారు. "ఇంటి గుమ్మం మార్చుకో" అన్న మాటల ద్వారా ఈ భార్యను వదలిపెట్టి ఇంకొకామెను చేసుకో అని తండ్రి సంకేతప్రాయంగా తెలియజేశారని కూడా అర్థం చేసుకున్నారు. అందుచేత ఆయన మొదటి భార్యకు విడాకులిచ్చి మరొక స్త్రీని వివాహమాడారు. ఇది జరిగిన కొన్నాళ్లకు అబ్రాహాము కుమారుని ఇంటికి వచ్చారు. ఈసారి కూడా కొడుకు ఇంట్లోలేడు. లోగడవేసినటువంటి ప్రశ్నలే ఈసారి కూడా వేశారు. అయితే ఆమె తన భర్త అయిన ఇస్మాయీల్‌ని ప్రశంసలతో ముంచెత్తింది. అంతా సజావుగా ఉందని

కాపురం సుఖసంతోషాలతో సాగిపోతోందని సమాధానం చెప్పింది. అబ్రాహాము సంతోషించారు. "చూడమ్మా! ఆయన వస్తే నాసలాం చెప్పు. ఇంటి గడపను అలాగే ఉంచమని మరీ మరీ చెప్పు" అని సెలవిచ్చి వెళ్లిపోయారు. అంటే నీ భార్యనీ ఆశయాలకనుగుణంగా మసలుకుంటోందని, ఆమెను వదలకుండా నిశ్చింతగా సంసార నౌకను నడిపించాలని అబ్రాహాము కొడుక్కి చెప్పదలచారన్న మాట.

ఈ విధంగా మిగతా ప్రపంచానికి అతిదూరంగా అరేబియా ప్రాంతంలో ఇస్మాయీల్ సంతతి ఒక నూతన జాతిగా రూపుదిద్దుకోసాగింది. కడకు అది అంతిమదైవ ప్రవక్త ప్రభవించే ప్రాంతంగా తయారయింది. ఆ ప్రవక్తే చరిత్ర మలుపును తిప్పారు.

అరేబియా ఎడారుల్లో ఆరితేరిన ఈ జాతి ప్రత్యేకతలను గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే అది 'మగసిరి'గల జాతి. మగసిరిని అరబీ 'అల్ మురుహ్' అంటారు. అరబ్బుల దృష్టిలో ఈ పదానికి ఎంతో విలువ ఉంది. ఈ మగసిరికి సంబంధించి ప్రాచీన అరబ్బు కవి ఇలా అంటాడు.

(యవ్వనానికి చేరుకుంటున్న సమయంలోనే గనుక మనిషి మగసిరిని పొందకపోతే ముసలితనం వచ్చాక పొందడం చాలా కష్టం)

ప్రొఫెసర్ ఫిలిప్ హిట్టీ అరబ్బుల చరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఆయన ఏమంటాడంటే, అరబ్బు ఇసుక తెన్నెల్లో శతాబ్దాల ప్రక్రియ ద్వారా రూపొందిన జాతి ప్రపంచంలోనే విలక్షణమైనది. అందులో క్రింద పేర్కొనబడిన గుణగణాలు సమృద్ధిగా ఉండేవి.

Courage, endurance in time of trouble (sabr) observance of the rights and obligations of neigh burliness (Jiwar) manliness (muruah) generosity and hospirality, regard for women and fulfillment of solemn promises. (P.253)

ధైర్యం, ఆపద సమయాల్లో సంయమనం పాటించటం పొరుగువారి హక్కులు మరియు బాధ్యతలను నెరవేర్చటం, పురుషత్వం, ఉదార స్వభావం మరియు అతిధిపట్ల మర్యాద, స్త్రీ యెడల గౌరవ భావం, వాగ్దాన పాలన – ఇత్యాది గుణాలు వారిలో మెండుగా ఉండేవి.

## శ్రేష్ఠ సమాజం :

ఈ విధంగా రెండున్నర వేల సంవత్సరాల పరిణామం ద్వారా మానవ గుణగణాల

రీత్యా జాతులన్నింటిలోకీ ఉత్తమమైన ఒక జాతిని ఆవిష్కరించటం జరిగింది (3:110). శ్రేష్ఠ సమాజం అనేది ముహాజిర్లను (దైవప్రవక్తతో పాటు మక్కానుండి మదీనాకు వలసవెళ్ళిన వారిని) ఉద్దేశించిందని అబ్దుల్లా బిన్ అబ్బాస్ అంటారు (అల్‌తబ్రాని తఫ్సీల్ సంపుటి 5, పేజీ 672). అరేబియాకు చెందిన ప్రవక్త ప్రత్యక్ష సహచరులంతా శ్రేష్ఠ సమాజమేనని మరికొన్ని ఉల్లేఖనాలున్నాయి.

దైవ ప్రవక్తలకు అన్నికాలాలలో ఎదురయైన అవరోధం ఒక్కటే. ఆయాకాలల జాతులు తమ తాతముత్తాతల మతాచారంపై నడిచేవారు. భౌతికంగా తమకున్న స్థితిని చూచి అవి గర్వపడుతూ ఉండేవి. ఆర్భాటాలు, అట్టహాసాలు అధికంగా ఉండేవి. అదే సమయంలో దైవప్రవక్త నిరాడంబరంగా, కేవలం గ్రంథ ప్రమాణాల మీద ఆధారపడి ఉండేవాడు. అయితే అరేబియాలో తీర్చిదిద్దబడిన జాతి పరిస్థితి తద్భిన్నంగా ఉండేది. కేవలం గ్రంథ ఆధారపరమైన ఏదైనా సత్యం వారి ముందుకువస్తే దాన్ని ఆమోదించి తమ సర్వస్వాన్ని దానికోసం అర్పించే గుణం ఈ జాతిలో ఉండేది. సువిశాలమైన ఆకాశం, విస్తారమైన ఇసుక తిన్నెల మధ్య పుట్టి పెరిగిన ఈ జాతి యదార్థాన్ని నిష్కల్మషమైన రూపంలో చూడాలని తహతహలాడుతూ ఉండేది. ప్రవక్త సహచరుల్లోని ఈ లక్షణాలను గురించి అబ్దుల్లా బిన్ మస్‌వూద్ మూడు ముక్కల్లో ఇలా చెప్పారు. "వారు ఈ సమాజంలో అందరికన్నా శ్రేష్ఠులు. వారు అందరికన్నా సహృదయులు, జ్ఞాన సంపన్నులు. నిర్మొహమాటంగా వ్యవహరించేవారు. అల్లాహ్ వారిని తన ప్రవక్త సహచర్యం మరియు ధర్మాన్ని చేరవేయుట కొరకు ఎన్నుకున్నాడు" (షరహు అతేసున్న సంపుటి 1, పేజీ 214).

బహు దైవారాధన చెలామణిలో ఉన్న రోజుల్లో మానవుడు కోల్పోయిన అత్యంత ముఖ్యమైన గుణం ఏమిటంటే, అతను యదార్థాన్ని మనో నేత్రంతో చూడలేకపోయేవాడు. దానికి బదులు అతను యదార్థాన్ని ఊహలపై, గోచరాలపై ఆధారపడి చూడసాగాడు. ఈ కారణంగానే పూర్వకాలంలో దైవప్రవక్తలు నిరాదరణకు గురయ్యేవారు.

వాళ్లు దైవతిరస్కారులు కాదుగాని దైవాన్ని రకరకాలుగా ఊహించుకోసాగారు. దేవుని యెడల ఒక్కొక్కరి మనసులో ఒక్కో రూపం ఉండేది. అగోచరంగా ఉండే దైవాన్ని వాళ్లు అర్థం చేసుకోలేకపోయే వాళ్లు. అందుచేత వాళ్లు కంటికి కనిపించే వస్తువుల్లోనే దైవాన్ని చూడటం మొదలలెట్టారు. కొందరు వస్తువుల్లో మరికొందరు మనుషుల్లో దైవాన్ని చూచి తమ శ్రద్ధాభక్తులన్నింటినీ వాటిపైనే కేంద్రీకరించేవారు. ప్రజలలోని ఈ బలహీనతే దైవసందేశ

హరులను తెలుసుకోవటంలో అడ్డంకిగా నిలిచేది. ఏకాలంలో ఏ ప్రవక్తవచ్చినా అతను సామాన్యమానవుడే అయి ఉండేవాడు. గతించిన సజ్జనుల యెడల ఏర్పడే భక్తిభావం కళ్ల ముందు నిలిచివున్న ప్రవక్త పట్ల ప్రజలకు ఉండేదికాదు.

అబ్రాహాము ఇలా ప్రార్థించారు. "ఈ నగరాన్ని (మక్కాను) నువ్వు శాంతి నగరంగా చెయ్యి, నన్ను - నా సంతానాన్ని విగ్రహ పూజకు దూరంగా ఉంచు. ఓ ప్రభూ! ఈ విగ్రహాలు అనేక మందిని మార్గ భ్రష్టుల్ని చేశాయి. కనుక ఎవడు నన్ను అనుసరించాడో అతడు నావాడు. మరెవడు నా మాట వినలేదో అలాంటి వాని విషయంలో నువ్వు క్షమాగుణం కలవాడివి, కనికరించేవాడివి, ఓ స్వామీ! నేను నా సంతానాన్ని నిస్సారమైన మైదానంలో నీ పవిత్ర గృహానికి చేరువలో వసింపజేశాను. నా ప్రభూ! వారు నమాజ్‌ను స్థాపించగలందులకు గాను (ఇలా చేశాను)" (14:35-37)

అబ్రాహాము కాలంలో బహు దైవారాధన పరాకాష్ఠకు చేరుకుని ఉండేది. ఎటు చూచినా బ్రహ్మాండమైన విగ్రహాలయాలు కనిపించేవి. మనిషి వాటిని వదలి మరో ఆలోచన చేసేందుకే వీలులేకుండా పోయేది. అటువంటి పరిస్థితిలో అబ్రాహాము దైవాజ్ఞతో ఒక నిర్జన ప్రదేశంలో ఓ నవతరాన్ని తయారు చేసేందుకు వ్యూహరచన చేశారు. గోచరాల ఆధారంగా గాక వాస్తవాల ఆధారంగా ఆలోచించే జాతిని తయారు చేసే వ్యూహం అది. అలా రూపుదిద్దుకున్న జాతినుద్దేశించి ఖుర్ఆన్‌లో ఇలా అనబడింది.

"కాని అల్లాహ్ విశ్వాసాన్ని (ఈమాన్‌ను) మీ కొరకు ప్రియతమంగావించాడు. మరియు దానిని మీ హృదయాలకు శోభాయమానంగా చేశాడు. ఇంకా అవిశ్వాసం, అపచారం, అవిధేయతలపట్ల మీలో ద్వేషాన్ని రగుల్గొల్పాడు. ఇలాంటి వారే సన్మార్గగాములు" (49:7)

వెయ్యిన్నర సంవత్సరాల క్రితం ఉండే పరిస్థితులను ముందు పెట్టుకుని ఆలోచించినపుడు మనకు ఈ ఆయత్ బాగా అర్థమవుతుంది. అప్పుడు దైవప్రవక్త సహచరుల విశ్వాసం పరీక్షించబడింది. వాళ్లు కనిపించేదేముళ్ల సందోహంలో కానరాని దైవాన్ని కనుగొన్నారు. ఆ ఒక్క దైవాన్నే తమ సర్వస్వంగా చేసుకున్నారు. ఒక అపరిచిత ధర్మం, దాని దగ్గర ఏ సాధన సంపత్తులు లేనప్పటికీ అది ప్రవక్త శిష్యులను ఆకర్షించింది. దానికోసం ఎంత పెద్ద త్యాగం చేయవలసివచ్చినా వారు సంకోచించలేదు. సారాంశం ఏమిటంటే, వెనుక ఏ ఘనమైన చరిత్రాలేని నిరాడంబర ధర్మాన్ని వారు తమ హృదయానికి హత్తుకున్నారు. దానికి వారు ఏదన్నా ఇచ్చుకోవటమే తప్ప ప్రాపంచికంగా వారికి లభించే ప్రతిఫలం అప్పట్లో

ఏమీలేదు మరి!

ఇదికాక ప్రవక్త హిజ్రత్‌కు ముందు "బైతె ఉఖబా" సమయంలో ఎదురైన సంఘటన. మక్కాలో ఇస్లాంకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్న క్లిష్టకాలంలో మదీనాలో కొంతమంది ముస్లింల సందేశ పరిచయం వల్ల ఇస్లాం విస్తరించసాగింది. కడకు అది ఇంటింటా అడుగుపెట్టింది. ఆ సమయంలో కొంతమంది మదీనా వాసులు మక్కాకు వెళ్ళి ప్రవక్తకు మద్దతు ప్రకటిస్తూ శపథం చేయాలని, మదీనాకు రావలసిందిగా ఆహ్వానిద్దామని నిశ్చయించుకున్నారు. జాబిర్ అన్సారీ ఇలా అంటున్నారు : మదీనాలోని ఇంటింటా ఇస్లాం వెలుగు ప్రసరించిన తరువాత మేము సమాలోచన చేశాము. ప్రవక్త కొండల్లో భయాందోళనల మధ్య జీవిస్తుంటే మనం ఇక ఎంతకాలం చూస్తూ ఉండగలం! (అహ్మద్‌హదీసు 14:56). మదీనా వాసులు ప్రవక్త పరిస్థితిని వాస్తవిక దృష్టితో చూశారు. ఆయన వ్యవహారం దైవ వ్యవహారమని, ఆయనకు తోడ్పాటునందించడమంటే దైవకారుణ్యానికి, అనుగ్రహాలకు నోచుకోవటంవంటిదేనని మదీనా వాసులు తెలుసుకున్నారు.

'బైతె ఉఖబా' సందర్భంగా మదీనా నుంచి మరి కొంతమంది ప్రతినిధులువచ్చి దైవప్రవక్త చేతులపై ప్రమాణం చేశారు. ఈ ప్రమాణం ఎలాంటి సున్నిత పరిస్థితుల్లో జరిగిందో ఊహించుకోవటానికి కాబ్ బిన్ మాలిక్ అన్సారీ మాటలే తార్కాణం. ఆయన ఇలా తెలిపారు. "మా తెగవారు ఆనవాయితీ ప్రకారం కాబా గృహానికి వెళుతూ ఉంటే హజ్ యాత్రపేరుతో మేము కూడా ఆ బృందంలో చేరిపోయాం. ఈ యాత్రికుల బృందం మక్కాకు సమీపంలో గుడారం వేసింది. రాత్రిపూట మేము అందరితోపాటు పండుకున్నాము. రెండొంతుల రాత్రి గడచిపోయాక మేము ప్రవక్త తీర్మానం ప్రకారం నెమ్మదిగా లేచాము. చెట్టుపై పిచ్చుక నడిచినట్లే అతి జాగ్రత్తగా అడుగులు వేస్తూ 'మౌవుద్' అనే స్థలం వైపుకు నడిచాము (సీరత్ ఇబ్నే హిషామ్ సంపుటి 1, పేజీ 441).

లోకం దైవప్రవక్తను త్రోసిపుచ్చిన ఆ క్షణం కూడా ఎంత విచిత్రమైనది! కాని అదే సమయంలో మరికొంతమంది ఆయనకు స్వాగతం పలకడానికి పోటీపడుతూ ఉన్నారు. స్వగ్రామం వారు చీదరించుకున్న క్షణం అది! తాయఫ్‌వాసులు అవమానించి తరిమికొట్టిన రోజులవి! మక్కాకు చెందిన అన్ని తెగలవారు ఆయనకు రక్షణ కల్పించేందుకు నిరాకరించాయి అలాంటి సునిశిత ఘడియల్లో మదీనా ప్రజలు ఆయనలోని సత్యతను ధృవీకరించారు. ఆయన పిలుపుపై "లబ్బైక్" (హాజరయ్యాము) అన్నారు. అటువంటి కీలక ఘడియల్లో మదీనా

అన్సార్లు ప్రవక్త ఎదుట బైత్ (ప్రతిజ్ఞ) కొసం ముందుకు వచ్చారు. వారిలో ఒకవ్యక్తి నిలబడి, “మీరు ఏ విషయంపై ప్రతినబూనుతున్నారో తెలుసా?!” ఇది మీ ఆస్తిపాస్తులను, సంతానాన్ని హరించే విషయంపై ప్రతిజ్ఞ!” అన్నాడు దానికి సమాధానంగా వారంతా “అందుకు మేము సిద్ధమే” అన్నారు. “ఒకవేళ మేము ఈ ప్రతిజ్ఞను కడదాకా నిలబెట్టుకుంటే మాకు ఏం లభిస్తుంది?” అని వారు దైవ ప్రవక్తను అడిగారు. “స్వర్గం లభిస్తుంది” అన్నారు దైవప్రవక్త. “అయితే మీ చేయిచాపండి మేము మీ చేతిలో చెయ్యేసి ప్రతిజ్ఞ చేస్తున్నాము” అన్నారు అన్సార్లు. ఆ విధంగా తమ్ముతాము ఒక వివాదాస్పద సత్యానికి అప్పగించుకోవటం, తమ సర్వస్వాన్ని (అప్పటివరకు) స్థిరపడని ఒక సత్యం కొరకు అర్పించటం చరిత్రలోనే అపూర్వం.

## అనవసర విషయాలను విడనాడటం :

నేడు ఏ సమస్యలైతే జాతీయ సమస్యలుగా పరిగణించబడుతున్నాయో మరేసమస్యల ఆధారంగానైతే నేడు ఉద్యమాలు ఆందోళనలు జరుగుతున్నాయో ఆ సమస్యలన్నీ దైవప్రవక్త ప్రభవించిన కాలంలో ఉండేవి. కాని ప్రవక్త వాటి జోలికి పోలేదు. ఒకవేళ ఆయన ఈ సమస్యల్లో కూడా తలదూర్చినట్లయితే దైవ ప్రణాళికను అమలులో పెట్టేందుకు వీలు కలిగేదికాదు. రెండున్నరవేల సంవత్సరాల నిరంతర ప్రక్రియ ద్వారా సమకూర్చబడిన అవకాశాలన్నీ మంటగలిసిపోయేవి.

1. అబిసీనియన్లు క్రీ.శ. 525లో అరేబియా సరిహద్దు ప్రాంతమైన జార్డెన్ ఆక్రమించుకున్నారు. ఆ రోజుల్లో అబ్రహా అబిసీనియా చక్రవర్తి తరఫున జార్డెన్ గవర్నర్‌గా ఉండేవాడు. అబ్రహాకు ఎంత ధీమా ఉండేదంటే అతడు దైవప్రవక్త జన్మించిన సంవత్సరం (క్రీ.శ. 570)లో గజబలంతో మక్కాపై దాడిచేశాడు. మక్కాలోని కాబా గృహాన్ని నేలమట్టం చేసి ధార్మికంగా ఆ స్థలానికి ఉన్న ప్రాముఖ్యాన్ని రూపుమాపాలన్నది అబ్రహా ఆలోచన. 50 ఏళ్ల ఆక్రమణ తరువాత జార్డెన్‌పై అబిసీనియా అధికారం అంతమైంది. తరువాత అది పారసీక చక్రవర్తి ఏలుబడిలోకి వెళ్ళిపోయింది. బాజాన్ జోర్డెన్ గవర్నర్‌గా నియుక్తుడయ్యాడు. అరేబియాలో ప్రవక్త ప్రభవించిన సంగతి పారసీ చక్రవర్తికి తెలియగా అతడు బాజాన్‌కు లేఖరాస్తూ, “నువ్వు ఆ వ్యక్తిని కలుసుకో. దైవ దౌత్య ప్రకటనను ఉపసంహరించుకోమని అతనితో చెప్పు, అతను గనక ఈ ఆదేశాన్ని శిరసావహించకపోతే అతని తలనరికి నా దగ్గరకు పంపించు” అని ఆదేశించాడు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 69)

దైవప్రవక్త ప్రభవించిన కాలంలో అరేబియాకు అనుక్షణం ఎంత భయంకరమైన

విదేశీదాడుల ప్రమాదం పొంచిఉండేదో దీన్నిబట్టి తెలుస్తోంది. ఆ సమయంలో ఆయన తలచుకుంటే స్వదేశీయులను విదేశీ ఆక్రమణలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి యుద్ధానికి సన్నాహాలు చేయవచ్చు. ఒకవేళ ఆయన గనక అలాచేసి ఉంటే దైవ ప్రణాళిక పట్ల విముఖత చూపినట్లయ్యేది. ఎందుకంటే అనవసరమైన విషయాల జోలికిపోకుండా నిశ్శబ్దంగా దైవ సందేశపరిచయ కార్యం నిర్వర్తించాలన్నది దైవప్రణాళిక ప్రధానాంశం. అందువల్ల ప్రవక్త అలాగే చేశారు. కడకు జార్డెన్ గవర్నరైన బాజాన్ స్వయంగా ఇస్లాం స్వీకరించడాన్ని చరిత్ర తిలకించింది. జార్డెన్ క్రైస్తవ పౌరుల్లో కూడా చాలామంది ఇస్లాం ఒడిలోకి వచ్చేశారు. ఒక ఆశయాన్ని జాతీయ నాయకుడు ఏ రాజకీయపుటెత్తులతో సాధించడానికి విఫలయత్నాలు చేస్తాడో దాన్ని ఆయన సందేశ పరిచయకార్యం ద్వారా అవలీలగా సాధించారు.

2. అబూతాలిబ్ మరణానంతరం ట్రైబల్ సంప్రదాయం ప్రకారం అబూలహబ్ బనూహాషిమ్ తెగకు సర్దారుగా ఎంపిక అయ్యాడు. ప్రవక్తను తన తెగలోకి తీసుకుని మద్దతు ఇవ్వడానికి అబూలహబ్ నిరాకరించాడు. ఇప్పుడాయనకు వేరొక తెగమద్దతు కావలసివచ్చింది. వివిధ తెగల నాయకులను ఆయన సంప్రదించారు. లాభంలేకపోయింది. ఆఖరికి ఆయన అరేబియా సరిహద్దుల్లో ఉండే ఒక తెగవద్దకు వెళ్ళారు. ఆ తెగనాయకుడైన మస్నా బిన్ హారిస్ ఇలా అన్నాడు. మేము పారసీక (కిస్రా) సామ్రాజ్యపుటంచుల్లో ఉన్నాము. పారసీక రాజుతో మేము కొన్ని షరతులను అంగీకరించి మరీ ఈ ప్రాంతంలో నివసిస్తున్నాము. మేము ఏ కొత్త నినాదాన్ని లేవనెత్తబోమనీ, కొత్త సిద్ధాంతాలు చెప్పేవారికి ఆశ్రయం ఇవ్వబోమని మాటిచ్చి ఉన్నాము. బహుశా తమరు ఇచ్చే నినాదం కూడా మారాజులవారికి రుచించకపోవచ్చునేమో! (అస్సీరా అన్నబవియ్య సంపుటి 2, పేజీ 168)

ఈ సంఘటన ద్వారా బోధపడేదేమిటంటే, అరబ్బు చుట్టప్రక్కల విదేశీ శక్తుల ద్వారా ఉత్పన్నం చేయబడిన సమస్యలు కేవలం రాజకీయపరమైనవేగావు, మతపరమైన సమస్యలు కూడా గుండెపై కుంపటిలా తయారయ్యాయి. అయినా ఆయన రెచ్చిపోలేదు. ఆదిలోనే విదేశీశక్తులతో యుద్ధం చేస్తే గాని మత ప్రచారానికి వీలుండదన్న నిర్ణయానికి ఆయన రాలేదు. ఆయన గనక తొలి దశలోనే విదేశీశక్తులతో తలపడినట్లయితే అది దైవ ప్రణాళికకు విరుద్ధాంశంగా పరిణమించేది. ఎందుకంటే దైవప్రణాళిక మరోవిధంగా ఉంది. రోము-పారసీక రాజ్యాల మధ్య ఇరవైయేండ్ల పోరుపెట్టి వాటిని బలహీనపరచి ఆ తరువాత ముస్లిముల విజయమార్గాన్ని సులభతరం గావించాలన్నది దైవేచ్ఛ. ఒకవేళ ముస్లిములు గనక ఆదిలోనే రోము-పారసీక సామ్రాజ్యాలతో తలపడి ఉంటే ఫలితం దీనికి భిన్నంగా ఉండేది.

## దైవప్రణాళికతో సమన్వయం :

రైతు అనేవాడు ప్రకృతి నియమాలతో సమరసం చెందాలి. దేవుడు మన ధరణిపై అత్యుత్తమమైన పంటల్ని పండించే అవకాశాలను పుష్కలంగా ఉంచాడు. అయితే ఈ అవకాశాలను నిజం చేసి చూపడానికి రైతు ఒకవంతు పాత్రను నిర్వర్తించవలసి ఉంటుంది. ఉదాహరణకు భూతలంపై సారవంతమైన మట్టి పొర ఉంచబడింది. ఇలాంటి సారవంతమైన నేల మనకు తెలిసిన విశ్వమండలంలో మరెక్కడా లేదు (ఒక్క భూమిపై తప్ప). అయితే నేల ఎంత సారవంతమైనదైనప్పటికీ అందులో తేమ ఉన్నప్పుడే పంట పండుతుంది. ఈ తేమ లేకపోయినందువల్లనే కొన్ని ప్రాంతాలు కటిక ఎడారుల్లా మారిపోయాయి. ఈ సమస్యల్ని ప్రకృతి మనకు లౌడ్ స్పీకర్‌లో ప్రకటించి తెలుపదు. నిశ్శబ్ద సంజ్ఞల ద్వారానే తెలుపుతూ వుంటుంది. ఈ సంకేతాన్ని రైతు అందుకోవలసి ఉంటుంది. అతను తేమ ఉన్న నేలలో విత్తులు నాటటమో లేక పొడిగా వున్న నేలలోకి నీటి పారుదల చేయటమో చేస్తాడు. ఆ తరువాత విత్తనాలు చల్లుతాడు. ఒక సందేశ ప్రదాత వ్యవహారమూ ఇంతే. దైవప్రవక్త కోసం అరేబియాలో ఎన్నో అవకాశాలు వేచి ఉండేవి. అయినప్పటికీ దివ్య సంకేతానుసారం తన కార్యక్రమాన్ని కొనసాగించవలసిన అవసరం ఆయనకు ఉండింది. ఒకవేళ ఆయన దైవ ప్రణాళికా ఉద్దేశాన్ని లెక్కలోకి తీసుకోకుండా ముందుకు సాగివుంటే ఆయనకు విజయం చేకూరి ఉండేది కాదు.

1. దైవప్రవక్త సందేశం యొక్క ప్రధాన సూత్రం ఏమిటంటే, ఆయన తన సందేశంలో పరలోకానికి అధిక ప్రాముఖ్యం ఇచ్చేవారు. ప్రాపంచిక విషయాన్ని ఎప్పుడూ దావత్ ఇష్యూ క్రింద తీసుకోలేదు. దీనికి కారణం, పరలోక సమస్యే మనిషి యొక్క సిసలైన సమస్య. ఇతరత్రా సమస్యలన్నీ పాక్షికమైనవి, సాపేక్షికమైనవి. పరలోకం లేని అతని సాఫల్యం అర్థరహితమైనది.

మరో విషయం ఏమిటంటే మానవ జీవితంలో అన్నిరకాల సాఫల్యాలు వ్యక్తుల శీలంతో ముడిపడి ఉంటాయి. పరలోకంపై దృఢ విశ్వాసం ఉన్నప్పుడే మనిషిలో నిజమైన, శాశ్వితమైన శీలనిర్మాణం జరుగుతుంది. పరలోక విశ్వాసం అంటే ఏమిటీ?, మనిషీ పూర్తిగా స్వేచ్ఛా జీవి, స్వయం నిర్ణయాధికారి కాడు. పైగా అతను క్షణ క్షణం దేవుని అదుపులో ఉన్నాడు. ఈ ఆలోచన మనిషిలో మొదలవుతున్నంతసేపూ అతను విచ్చలవిడిగా ప్రవర్తించలేదు. పై పెచ్చు అతను నియమబద్ధుడుగా, బాధ్యతాయుతుడుగా జీవించసాగుతాడు. ఖుర్‌ఆన్

హదీసులను నిర్మల మనసుతో అధ్యయనం చేస్తే అర్థమవుతుంది – అందులో పరలోక విషయమే ప్రధానాంశమని! అయితే ఇతర అంశాలు కూడా అందులో వస్తాయనుకోండి. కాని అవన్నీ అనుబంధ అంశాలే గాని అసలు అంశాలు గావు.

2. రెండవ ముఖ్యాంశం ఏమిటంటే సందేశ ప్రదాతకు సందేశ గ్రహీత (ప్రేక్షకుడు)కి మధ్య ఎన్నడూ భౌతిక పరమైన వివాదాలు ఉత్పన్నం చేయకూడదు. సందేశగ్రహీతను మన ప్రత్యర్థిగా మారే అవకాశాన్ని ఇవ్వరాదు – దానికోసం మనం ఎంత మూల్యాన్ని చెల్లించవలసి వచ్చినా సరే! దైవ ప్రవక్త జీవితంలో దీనికి సంబంధించిన ఒక అపూర్వమైన దృష్టాంతం హుదైబియా ఒప్పందంలో కనిపిస్తుంది. ఖురైషులు ముస్లిములకు వ్యతిరేకంగా కయ్యానికి కాలుదువ్వి ఎడతెగని యుద్ధాలకు నాంది పలికారు. ఇరువర్గాలు ఒండొకరికి శత్రువులుగా మారిపోయాయి. కాలమంతా యుద్ధతంత్రాలలో యుద్ధ సన్నాహాలలోనే హరించుకుపో సాగింది. అలాంటి సమయంలో ప్రవక్త ఖురైషులు పెట్టిన ఏకపక్ష షరతులన్నింటినీ ఒప్పుకుని పదేళ్ళ నిర్యుద్ధ సంధి చేసుకున్నారు. ఈ సంధి ఏకపక్షంగా ఉండటం చూసి చాలా మంది దాన్ని ముస్లిములకు అవమానకరంగా తలపోశారు. అయితే దేవుని దృష్టిలో అది స్పష్టమైన విజయానికి (48:1) సోపానం వంటిది. ఎందుకంటే ఈ నిర్యుద్ధ సంధి వల్ల పరస్పర యుద్ధాల కారుమేఘాలు తొలగిపోయేందుకు వీలు కలిగింది. ముస్లిములు – ముస్లిమేతరుల మధ్య ప్రత్యర్థి భావన పోయి సందేశదాత – సందేశగ్రహీతల భావన ఏర్పడే అవకాశం ఉండింది. అరబ్బులు యుద్ధ పిపాసుల స్థానే సందేశగ్రహీతల స్థాయికి వచ్చేసరికి సత్య ధర్మ సందేశం వారి కర్ణపుటాలను తాకింది. రెండేళ్ల కాలంలోనే ముస్లిముల సంఖ్య పదింతలు పెరిగిపోయింది. ఏ మక్కా నగరం యుద్ధం ద్వారా కూడా హస్తగతం కాని స్థితిలో ఉండేదో అది సందేశ ప్రక్రియ ద్వారా అవలీలగా హస్తగతమైంది.

3. దైవప్రవక్త విధానంలోని ఓ ముఖ్య కోణం ఎదుటివాడు చేజిక్కిన తరువాత కూడా అతని యెడల ఉదారంగా ప్రవర్తించడం. ఈ వ్యవహారానికి సంబంధించిన దృష్టాంతాలు ఆయన జీవితంలో కోకొల్లలు. మక్కా విజయం తరువాత ఖురైషు ప్రత్యర్థులంతా తన చేతికి చిక్కారు. వాళ్లు తనపట్ల, తన సహచర ముస్లిముల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వాళ్లే. కాని ఆయన గతంలో వారు చేసిన అమానుష కృత్యాల ఆధారంగా ఎవరిపైనా కక్ష సాధించు కోలేదు. అందరికీ ఏకపక్షంగా క్షమాభిక్ష పెట్టేశారు. బందీల రూపంలో నున్న ఖురైషులను ఉద్దేశించి ఆయన, "పొండి మీరంతా స్వతంత్రులు" అన్నారు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 2, పేజీ 412).

కొంతమంది ప్రత్యేక వ్యక్తులను హతమార్చమని ఆయన ఆదేశించారు. అయితే ఆయా వ్యక్తుల తరఫున సంబంధీకులు వచ్చి క్షమాభిక్షను అర్థించగా వాళ్లను కూడా క్షమించి వదిలేశారు. అలాంటి 17 మంది వ్యక్తులలో కేవలం ఐదుగురికి మాత్రమే మరణదండన విధించబడింది. ఎందుకంటే వాళ్లు క్షమాభిక్ష కోరలేదు. ఉహద్ యుద్ధంలో వహషీ బిన్ హరబ్ హమ్జాను హతమార్చారు. ఆ తరువాత హిందా అనే మహిళ హమ్జాగారి శవాన్ని చీల్చి చెండాడింది. ఈ సంగతి దైవప్రవక్తకు తెలిసింది. దేవుడు గనక మక్కావారిపై తనకు విజయం చేకూరిస్తే సంబంధిత వ్యక్తులను తాను కూడా అలాగే చీల్చి చెండాడుతానన్న మాటలు ఆయననోట వెలువడ్డాయి (అస్సీర అన్నభవియ్యా సంపుటి 3, పేజీ 79). మక్కా విజయం తరువాత సదరు నిర్బంధిత వ్యక్తుల్లో ఆ ఇద్దరు వ్యక్తులు (వహషీ మరియు హింద) కూడా ఉన్నారు. కాని వారిద్దరూ ఆయన ఎదుటవచ్చి క్షమాభిక్షకై వేడుకొనగా ఆయన క్షమించి వదిలేశారు. ఎందుకంటే దైవప్రణాళికకు అనుగుణమైనది ఈ మన్నింపుల వైఖరే.

ఈ సూత్రం వివేకవంతమైనది. మనిషి రాయికాదు. ప్రక్కనున్న ఒక రాతిని పగులగొడితే ప్రక్కనున్న రాయి నుంచి ఎలాంటి ప్రతిస్పందనా వ్యక్తం కాదు. కాని మనిషి విషయం వేరు. అతడు సజీవ సమాజంలోని ఒక సజీవ అంశం. ఎప్పుడు ఒక సమీప మనిషిపై తీవ్రమైన చర్య తీసుకున్నా అతనికి దగ్గరలో వున్న ప్రజల్లో ప్రతీకార భావం రగులుకుంటుంది. ఆ విధంగా సమాజంలో విచ్ఛిన్నకర కార్యకలాపాలు పొడసూపుతాయి. విజయం తరువాత నవ నిర్మాణాల కోసం వెచ్చించవలసిన సమయం విచ్ఛిన్న కరశక్తుల ప్రతిఘటనలో ఖర్చయిపోతుంది. దైవప్రవక్త మక్కా విజయం తరువాత బద్ధ శత్రువులకు క్షమాభిక్ష పెట్టి భవిష్యత్తులో తలెత్తబోయే విచ్ఛిన్నకర ధోరణుల ద్వారాలన్నింటినీ మూసివేశారు. మరో విషయం ఏమిటంటే, క్షమాభిక్ష పొందిన వారిలో చాలా మంది ఇస్లాం స్వీకరించి ఇస్లామీయ శక్తిని మరింత పెంచారు. ఇక్రమ ఇబ్నె అబీ జహల్ దీనికొక ఉదాహరణ.

4. జైత్రయాత్ర ముగిసిన తరువాత సామాజిక సంస్కరణల సమస్య ఎదురవుతుంది. ఈ విషయంలో దైవప్రవక్త వేగిరిపడలేదు. పైగా కొంత సడలింపు వైఖరిని అవలంబించారు. సంస్కరణల్ని అంచెలవారీగా ప్రవేశపెట్టారు.

మక్కాలోని ఖురైషులు అబ్రాహాము ధర్మానికి వారసులు. అయితే వాళ్లు అబ్రాహాము సిసలు ధర్మాన్ని విడనాడి కొత్త పుంతలు తొక్కారు. ఉదాహరణకు అబ్రాహాము 'హజ్'ను చంద్రమాన లెక్కప్రకారం 'జిల్‌హజ్' నెలలో విధించారు. చంద్రసంవత్సరం, సూర్యసంవత్సరం

కన్నా 11 రోజులు తక్కువ. ఈ కారణంగానే చంద్రమాన నెలలు రుతువులతో సమన్వయం చెందేవిగా ఉండవు. అందుకే హజ్ కొన్ని సంవత్సరాలు ఒక రుతువులోనూ, మరికొన్ని సంవత్సరాలు ఇంకొక రుతువులోనూ వస్తూ ఉంటుంది. ఈ స్వరూపం ఖురైషుల వ్యాపార ప్రయోజనాలకు దెబ్బతీసేదిగా ఉండేది. అందుచేత వాళ్లు 'హజ్'ను ఎల్లప్పుడూ వేసవి కాలంలోనే జరపాలని నిర్ణయించుకున్నారు. దాని కొరకు వారు చంద్ర సంవత్సరంలో ఏటేటా 11 రోజులు పెంచేవారు. ఆ విధంగా వారు చంద్ర సంవత్సరాన్ని అనుసరిస్తున్నట్లు కనబడినప్పటికీ క్రియాత్మకంగా సూర్య సంవత్సరాన్నే అనుసరించేవారు. ఆ విధంగా తేదీలు 33 సంవత్సరాల దాకా మారుతూనే ఉంటాయి. ఒకసారి ఒక నెలను దానిస్థానంలో నుంచి కదిపిన తరువాత మళ్ళీ అది 'హజ్జె ఇబ్రాహీమ' ప్రకారం జిల్‌హజ్ నెలలోకి ప్రవేశించడానికి 33 యేండ్లు పట్టేవి. ఖురైషుల ఈ కొత్త పోకడలను రూపు మాపి హజ్‌ను మళ్ళీ అబ్రాహాము పద్ధతి ప్రకారం నెలకొల్పాలని దైవప్రవక్త ఆలోచిస్తూ ఉండేవారు. మక్కా విజయానంతరరం (హిజ్రీ 8వ సంవత్సరం) ఆయన అరేబియాకు అధిపతి అయ్యారు. ఆయన గనక తలచుకుంటే క్యాలెండర్ లెక్కను తక్షణం మార్చేసేవారు. కాని ఆయన కొంత సంయమనంతో వ్యవహరించారు. పైన ప్రస్తావించిన 33 సంవత్సరాల కాలచక్రం పూర్తవడానికి అప్పటికి మరో రెండు సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆయన ఆ రెండేళ్ళూ నిరీక్షించారు. మక్కాను జయించినప్పటికీ ఆయన రెండేళ్ళ దాకా హజ్‌కు వెళ్ళకుండా మూడవ సంవత్సరం (హిజ్రీ 10) మాత్రమే హజ్ చేశారు. ఆ హజ్ అబ్రాహాము గారి సంప్రదాయం ప్రకారం సరిగ్గా జిల్‌హజ్‌లో వచ్చింది. 'హజ్జతుల్ విదా' (వీడ్కోలు హజ్)గా ప్రఖ్యాతి గడించిన ఆ హజ్ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశ్యించి ప్రసంగిస్తూ, ఇక నుంచి హజ్ ఏటేటా ఇప్పుడు జరిగినట్లే జరుగుతుందనీ, అజ్ఞాన కాలపు దురాచారాలన్నీ అంతమొందించబడ్డాయని చెప్పారు. ఆయన ఇలా అన్నారు.

"ప్రజలారా! కాల చక్రం తిరిగిపోయింది. ఏనాడయితే అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించాడో ఆనాటి రేఖను అది తాకింది. నెలల లెక్క విషయానికి వస్తే అది దేవుని దృష్టిలో 12 నెలలు". (ముగాబి అల్ నాహిది సంపుటి 3, పేజీ 1112)

ప్రవక్తగారి ఈ నిరీక్షణలో గొప్ప పరమార్థం ఉంది. ఎందుకంటే మతంలో ఏదన్నా విషయం చాలా కాలం వరకూ అమల్లో ఉంటే అది ప్రజల దృష్టిలో పవిత్రమైపోతుంది. దానికి భిన్నంగా ప్రజలు వేరొకదాన్ని ఊహించనైనా లేరు. ప్రవక్త కోరుకుంటున్న తేదీలు మరో రెండేళ్లలోనే రావలసి ఉండటంతో ఆయన ఆ సమయం కోసం నిరీక్షించారు. ఒకవేళ

ఆయన ముందే చర్యకు ఉపక్రమించి ఉంటే అనవసరంగా సమస్య తలెత్తేదేమో! కాని ప్రవక్తగారు అలాంటిదానికి తావీయలేదు. సహజ పద్ధతిలోనే అది జిల్‌హజ్ నెలలో ప్రవేశించిన మీదట, అదే సిసలైన హజ్ నెల అనీ, ఇకపై కూడా ఈ నెలలోనే హజ్ జరుగుతూ ఉంటుందని ప్రకటించారు.

దైవ ప్రవక్త తన ఉద్యమ కాలంలో దేవుని వివేకంలో ఏ విధంగా దైవాభిమతాన్ని, దైవ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా వ్యవహరించారో ఈ దృష్టాంతాల వల్ల మనకు అవగతమవుతోంది. ఆయన దేవుని చక్రంతో తన చక్రాన్ని జోడించారు. ఆయన దేవుని పథకంతో సమరసం చెందుతూ తన కార్యక్రమాన్ని నడిపించారు. ఈ కారణంగానే ఆయన ప్రయత్నాలు అద్భుతమైన ఫలితాలనిచ్చాయి.

## పరిస్థితులను అధికమించి :

ప్రాచీన అరబ్బులను ఒకసారి ఊహించుకోండి. దక్షిణాన అరేబియా సముద్రం, తూర్పున సింధుశాఖ, పడమరన ఎఱ్ఱసముద్రాల మధ్య చుట్టు ముట్టబడివున్న ఈ ద్వీపకల్పం రాజకీయంగా కూడా అనేక చిక్కుల్లో కూరుకుపోయి ఉండేది. తూర్పున శక్తివంతమైన పారసీక (సాశాని అంపయిర్) ఈరాన్ సామ్రాజ్యం ఉండేది. ఉత్తరాన సుధృఢమైన రోము (బాబిమ్‌తీని అంపయిర్) మహా సామ్రాజ్యం ఉండేది. ఈ రెండు సామ్రాజ్యాల దృష్టి ఎల్లప్పుడూ అరేబియాపైనే ఉండేది. అంటే రెండు సూపర్ పవర్ల మధ్య నలిగిపోయే కీలక స్థలం అరేబియా. అరేబియాలోని సారవంతమైన క్షేత్రాలన్నీ వాటి ఆధీనంలో ఉండేవి. ఇరాక్ ప్రాంతం పారసీకుల చెప్పుచేతల్లో ఉండగా సిరియా, ఉర్దున్, పాలస్తీనా మరియు లెబనాన్ ప్రాంతాలు రోమన్ల వశమై ఉండేవి. అరేబియాకు తూర్పు-పడమరల్లో సింధుశాఖ ఎఱ్ఱసముద్రాలు ప్రకృతి ప్రసాదితమైన అడ్డుగోడల్లా ఉన్నప్పటికీ ఈ ప్రాంతాలు కూడా మహా సామ్రాజ్యాల బెడదనుంచి సురక్షితంగా ఉండేవికావు. ఎఱ్ఱ సముద్రానికి అవతలనున్న ఈజిప్టు, అబిసీనియా రాజులు కూడా రోము సామ్రాజ్యానికి సామంతులుగా ఉండేవారు. ఆ రకంగా వాళ్లు ఏ క్షణంలోనైనా అరేబియా ప్రాంతంలో జొరబడేందుకు అవకాశం ఉండేది.

అరేబియా అంతర్గత స్థితులు కూడా చిత్ర విచిత్రమైనవి. అవి చాలావరకు ట్రైబల్ ఏరియాలు (గిరిజన ప్రాంతాలు) అనేక తెగలు, ఆ తెగల నాయకుల చేతుల్లో అనేక రాష్ట్రాలు. కాని ఏ సర్దారూ సర్వ స్వతంత్రుడు కాడు. అనుక్షణం పొంచి ఉండే విదేశీ ప్రమాదాల దృష్ట్యా సర్దారులు రోము సామ్రాజ్యానికో, పారసీక సామ్రాజ్యానికో సామంతులుగా ఉండటానికే

ఇష్టపడేవారు. ఉత్తరాన సిరియా సరిహద్దులను తాకుతూ ఉండే గసానీ ప్రాంతం రోమనుల చెప్పుచేతల్లో ఉండేది. ప్రవక్తకు దైవదౌత్యం లభించిన కాలంలో ఈ ప్రాంతానికి హారిస్ బిన్ అబీ షమర్ గస్సా అధిపతిగా ఉండేవాడు. అలాగే బస్రా అనే మరో ఎమిరేట్ ఉండేది. ఇది కూడా రోము సామ్రాజ్యం ముందు తలవంచినదే. ఈ ప్రాంతంలో రోము సంస్కృతీ ప్రభావం అధికంగా ఉండేది. అనేకమంది అరబ్బులు క్రైస్తవ మతం అవలంబించేవారు.

ఇరాక్‌కు సరిహద్దున ఉన్న 'హీరా' ప్రాంతం ఈరాన్ సామ్రాజ్య ఆధీనంలో ఉండేది. సింధుశాఖ తీరంలో అసంఖ్యాకమైన (చిట్టి పొట్టి) అరబ్బు రాష్ట్రాలుండేవి. ఉదాహరణకు వాటిలో బహ్రెయిన్ ఒకటి మంజిరాన్ బిన్ సావీ దీనికి నాయకుడు. ఈ రాష్ట్రంలోని ప్రజలు పారసీకుల ప్రభావం వల్ల జోరాస్ట్రియన్ మతాన్నే అవలంబించేవారు. ఉమ్మాన్ అనేది ఒక ప్రాంతం. యమామ అనేది ఇంకొకటి. రోము–పారసీక సామ్రాజ్యాల రాజకీయ తగాదాల మూలంగా తరచూ యుద్ధాలు జరుగుతూ ఉండేవి. అందువల్ల రోము ఆధీనంలోని అరేబియా ప్రాంతాలు, పారసీకుల పలుకుబడి క్రింద ఉన్న అరబ్బు ప్రాంతాలు మధ్యలో నలిగిపోతూ ఉండేవి. రెండు మహా సామ్రాజ్యాల మధ్య అమాయక జీవులు అసువులు బాసేవారు. రక్తపుటేరులు ప్రవహించేవి.

ప్రాచీన జొర్డన్, ప్రస్తుత జోర్డన్ కన్నా చాలా విశాలంగా ఉండేది. అందులో వివిధ తెగల ప్రభుత్వాలు ఏర్పడి ఉండేవి. సనా అనబడే ప్రాంతం వాటిలో పెద్దది. నజరాన్ కూడా ఇందులోనే చేరి ఉండేది. జోర్డన్ విదేశీయుల రాక బహుశా క్రీ.శ. 343 నుండి మొదలయింది. రోము సామ్రాజ్యాధిపతులు ఈ ప్రాంతానికి తమ క్రైస్తవ మత ప్రచారకుల్ని పంపారు. ఈ మత ప్రచారకులకు నజరాన్‌లో సత్ఫలితాలు చేకూరాయి. నజరాన్‌లో చాలామంది క్రైస్తవ మతం స్వీకరించారు.

ఈ మతం మార్పిడి సంఘటన రోముకు చిరకాల ప్రత్యర్థి అయిన ఈరాన్‌ను కదిలించింది. అరేబియా దక్షిణ ప్రాంతంలో రోమనులు తమ పలుకుబడిని పెంచుకుంటున్నారన్న ఉద్దేశ్యంతో దానికి విరుగుడుగా అక్కడి యూదులను ఈరాన్ బుజ్జగించటం మొదలెట్టింది. క్రీ.శ. 70లో రోమనులు సికిమా ప్రాంతం నుంచి యూదులను తరిమి వేయగా వారు వచ్చి జోర్డన్‌లో ఆశ్రయం పొందారు. రోమనులపై, క్రైస్తవులపై ఉన్న కోపతాపాల వల్ల యూదులు ఇట్టే ఈరాన్ వల్లోపడిపోయారు. యూదమతం పుచ్చుకున్న ఒకప్పటి అరబ్బు (యూసుఫ్ జూనవాస్) ఈరాన్ అండదండలతో సనా ప్రాంతంలో యూద

ప్రభుత్వం స్థాపించాడు. ఆ ప్రాంతంలో ఈరానీయుల సహాయ సహకారాలతో ఏర్పడిన స్వయం ప్రతిపత్తిగల ఏకైక ప్రభుత్వం ఇది. యూసుఫ్ జూనవాస్ రాజ్యాధికారి అయ్యాక జోర్డన్ ప్రాంతం నుండి క్రైస్తవులను తరిమివేసే ఉద్యమం చేపట్టాడు. కడకు క్రీ.శ. 534లో నజరాన్ ప్రాంతంలో నున్న క్రైస్తవులనేకమందిని సజీవదహనం చేయించాడు.

ఇప్పుడు రోమనుల వంతు వచ్చింది. జోర్డన్‌లో క్రైస్తవుల రక్షణ సాకుతో రోముచక్రవర్తి తరుణోపాయం ఆలోచించాడు. తన రాజకీయ ప్రయోజనాల కోసం అభీసియారాజైన నజాషీని వాడుకున్నాడు. నజాషీ క్రైస్తవ మతస్తుడేగాక రోము సామ్రాజ్యానికి సామంతుడు కూడా నజాషీ ఒక నీగ్రో సర్దారుకు కొంత సైన్యం ఇచ్చి 'సనా' పైకి పంపాడు. పెద్దగా ప్రతిఘటించకుండానే సనా సేనలు లొంగిపోయాయి. జూనవాస్ సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత నజాషీ సేనలో కూడా తిరుగుబాటు పెల్లుబికింది. అబ్రహా అనే వ్యక్తి సేనాధిపతిపై తిరగబడి అతన్ని హతమార్చి నజాషీని మెప్పించి 'సనా' ప్రాంతానికి రాజ్యాధికారిగా గుర్తింపు పొందాడు. ఈ అబ్రహాయే క్రీ.శ. 571లో కాబాపై దండెత్తివచ్చాడు. అబ్రహా తరువాత అతని కొడుకు యక్సూమ్, అతని అనంతరం మరో కొడుకు మస్రూక్‌లు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు.

ప్రాచీన జోర్డన్ రాజవంశానికి చెందిన ఒక వ్యక్తి ఉండేవాడు. అతనిపేరు సైఫ్ బిన్ జీయజిన్. తన రాజ్యాన్ని అరబ్బేతరుల ఆక్రమణనుండి విముక్తి కలిగించాలన్న ఆలోచన వచ్చిందతనికి. అతడు జోర్డన్‌లో స్వాతంత్రోద్యమం నడిపాడు. ఆశయ సాధనకు స్థానికుల సహాయ సహకారాలు సరిపోవని అతను గ్రహించాడు. ఈరాన్ రాజదర్బారుకు వెళ్ళి జోర్డన్ స్వాతంత్ర్యం కొరకు సైనికి సాయం అర్థించాడు. ఈరాన్ చక్రవర్తికి ఇది సువర్ణావకాశం. ధరజ్ అనే సేనాని సారథ్యంలో ఒక సైనిక పటాలాన్ని జోర్డన్ పంపటానికి వెంటనే అంగీకరించాడు. ఈలోగా సైఫ్ బిన్ జీయజిన్ చనిపోయాడు. అయితే అతని కుమారుడైన యాదీ కరబ్ ఈరాన్ సైన్యాన్ని తీసుకురావటంలో కృతకృత్యుడయ్యాడు. ఈ సైన్యం అమ్మాన్ తీరందాటి హజర్‌మౌత్ చేరింది. ఆ తరువాత సనా ప్రాంతానికి వచ్చింది. యాదీ కరబ్ ఈరాన్ సైనికుల అండతో అబిసీనియా సేనలను అవలీలగా ఓడించారు. అబిసీనియన్లు జోర్డన్ విడిచిపోయారు. మాదీ కరబ్ సనా రాజ్యానికి అధిపతి అయ్యాడు. అయితే ఈరాన్ సైన్యం కూడా అక్కడే ఉండిపోయింది. మాదీ కరబ్ మరణించగానే ఈ ప్రాంతాన్ని ఈరాన్ సేనలు కబళించాయి. ఆ విధంగా 'సనా' ఈ రాన్ సామ్రాజ్యంలో అంతర్భాగం అయిపోయింది. ఇస్లాం జోర్డన్ ప్రాంతంలోకి అడుగుపెట్టే కాలంలో బాజాన్ సనా ప్రాంతానికి గవర్నర్‌గా

ఉండేవాడు. తరువాత ఆయన ముస్లింగా మారిపోయాడు.

పై వివరాలను బట్టి ఇస్లాం ప్రవక్త ప్రభవించకముందు అరేబియా ద్వీపం ఏవిధంగా రెండు మహా సామ్రాజ్యాల సామ్రాజ్యావాద ప్రయోజనాలకు ఆటపట్టుగా మారి ఉండేదో బోధపడుతుంది. నిజమే అలాంటి పరిస్థితుల్లో ఒక సంస్కర్త కోసం రెండు మార్గాలు తెరచుకుని ఉన్నాయి. ఒకటి : సమకాలీన కరెంట్ ఇష్యూస్ పరిస్థితుల ప్రభావానికి లోనై "సామ్రాజ్యవాద శక్తులకు" వ్యతిరేకంగా రాజకీయ యుద్ధం మొదలెట్టడం, రెండు : అరేబియా అంతరంగిక స్థితిగతులను పటిష్టవంతంగా తీర్చిదిద్ది పొరుగునున్న మహా సామ్రాజ్యాలు పేకమేడల్లా కూలిపోయే పరిస్థితిని సృష్టించటం. దివ్య ఖుర్ఆన్‌లోని 105వ సూరా (ఫీల్), 106 సూరా (ఖురైష్)లలో యమన్ చక్రవర్తి (అబ్రహా) దురాక్రమణ ప్రస్తావన వచ్చింది. కాని ఈ దండయాత్రకు సమాధానంగా దేవుడు ఏం చేయమన్నాడు? కాబా ప్రభువును సేవించమని ప్రబోధించాడు (ఖురైష్ - 3). అంటే ఇస్లామీయ స్వభావం ఏమిటంటే రాజకీయంగా ఎదురయ్యే సవాళ్లకు ఇచ్చే సమాధానం ఆరాధన ప్రక్రియ రూపంలోనే ఉండాలన్న మాట!

# ప్రవక్త ప్రణాళిక

ముహమ్మద్ (570-632)పై తొట్ట తొలి సందేశం అవతరించటంతో క్రీ.శ. 610లో ఇస్లాం యుగం ఆరంభమైంది. ఆ సమయంలో ఆయన యావత్ప్రపంచంలో ఒంటరి ముస్లిం మాత్రమే. క్రీ.శ. 622లో ఆయన మక్కా నుండి మదీనాకు వలసపోయిన మీదట ప్రప్రథమ ఇస్లామీయ ప్రభుత్వం ఏర్పడింది. ఆ సమయంలో ఆ ప్రభుత్వం ఒక చిన్న పట్టణానికి, దాని పొలిమేరలకు మాత్రమే పరిమితమై ఉండేది. ఎందుకంటే మదీనా నగరం చాలా వరకు యూదుల ఆధీనంలోనే ఉండేది. కాని పదేళ్ళ తర్వాత ప్రవక్త మరణించేనాటికి సుమారు 10 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలో - యావత్తు అరేబియాలో - ఇస్లాం రాజ్యం ఏర్పడింది. ఆ తర్వాత ఒక శతాబ్ది కాలమైనా గడవకముందే ఇస్లాం ఒకవంక ఆఫ్రికా ఉత్తర మార్గాల ద్వారా స్పెయిన్ వరకు, మరోవంక తూర్పున ఇరాన్ మార్గాల ద్వారా చైనా సరిహద్దుల వరకు విస్తరించింది. తూర్పు ఐరోపాలో ఇస్లాం విస్తరణ యొక్క చివరి అంచు 'బుడాపెస్ట్' (హంగరీ) ఉండేది. అక్కడ ఇప్పటికీ నానోబ్ నది ఒడ్డున 'గుల్ బాబా' సమాధి ఉంది. ఫ్రాన్స్‌లోని కొన్ని చర్చీల మీనార్లపై ఇప్పటికీ అరబీ లేఖనాలు కనిపిస్తాయి. క్రీ.శ. 8వ శతాబ్దిలో ఫ్రాన్స్‌కు చెందిన దక్షిణ ప్రాంతం డెమాస్కస్ ఖలీఫా ఏలుబడిలోని యూరోపియన్

రాష్ట్రంగా ఉండేది. విప్లవ ప్రవక్త అనుయాములు మదీనాలో ఒంటెలు కాచే స్థితి నుండి నడుంబిగించి కేవలం రెండువందల సంవత్సరాలకంటే తక్కువ వ్యవధిలోనే ప్రపంచానికి మార్గదర్శకులు అయిపోయారు. ఈరాన్ నగరము అస్తకర్, ఈజిప్టు నగరము జీసస్, యూరప్ నగరము రోము బదులుగా ఇప్పుడు బాగ్దాద్ నగరము యావత్ప్రపంచానికి సాంస్కృతికంగా, సైద్ధాంతికంగా మార్గదర్శక నగరంగా బాసిల్లింది.

అద్భుతమైన ఈ విజయం ఒక సాదాసీదా కార్యక్రమానుసారం ప్రాప్తించింది. దివ్య ఖుర్ఆన్ మాటల్లోనే చెప్పాలంటే "ఓ వస్త్రములో చుట్టబడినవాడా! లే. ప్రజలను జాగృతం చెయ్యి. నీ ప్రభువు గొప్పతనాన్ని కీర్తించు. నీ జీవితాన్ని పరిశుద్ధంగా మలచుకో. అశ్లీలానికి అశుద్ధతకు దూరంగా ఉండు. ఉపకారం చేసి ప్రతిఫలం ఆశించబోకు. నీ ప్రభువు కొరకు ఓర్పు వహించు" (74:1–7)

ఈ కార్యక్రమాన్ని విశ్లేషిస్తే మూడు సూత్రాలు ముందుకు వస్తాయి.

1. స్వీయ సంస్కరణ : తద్వారా దైవారాధన చేయాలి, తన శీలనిర్మాణం పట్ల శ్రద్ధ చూపాలి. అన్నిరకాల దుర్వ్యసనాలను, అపసవ్యతను విడనాడాలి.

2. మానవుడు దేవుని దాసుడని, మరణానంతరం అతను దేవునిముందు హాజరు కావలసి ఉందన్న విషయాన్ని మనుషులకు తెలియజేయాలి.

3. స్వీయసంస్కరణ మరియు ఇతరులను జాగృతం చేసే ఈ కృషిలో ఎదురయ్యే కష్టనష్టాలను ఓర్పుతో భరిస్తూ దైవనిర్ణయం కోసం నిరీక్షించాలి.

## అంతర్గత శక్తి :

ఇస్లామీయ కృషి (ఇస్లామిక్ యాక్టివిజమ్) తన వాస్తవికత దృష్ట్యా ఒక వ్యక్తిగత కృషి, విశ్వాసి అయిన ఒక దాసుణ్ణి కార్యశీలుడిగా చేసే భావన పరలోకంలో తాను ప్రభువు సన్నిధిలో మోక్షం పొందాలన్న భావనే. ఎవరి హృదయంలోనైనా ఇస్లాం నిజంగా ,ఓటు సంపాదించిందంటే అతని ఆలోచన నిత్యం ఒకటే అయిఉంటుంది. తాను ఏ విధంగా తన ప్రభువు క్షమకు, దయాదాక్షిణ్యాలకు నోచుకోవాలన్నదే అతని ఆలోచన అయి ఉంటుంది. అతడు తన భావాలు భావనలను, విశ్వాసాలను, ఆచరణలను, నీతి నడవడికలను, ఇంకా తన జీవితంలోని సకల కార్యకలాపాలను పరలోకంలో దేవుని పట్టు నుంచి కాపాడే మార్గంలో వెచ్చించాలని చూస్తూ ఉంటాడు. అతడు పరులను ఇస్లాం వైపుకు పిలిచేముందు తనను ఒక నిజమైన ముస్లింగా మార్చుకోచూస్తాడు.

"అనండి, నేను అందరికన్నా ముందు ముస్లిం కావాలని నాకు ఆదేశించబడింది" (6:14)

తొలుత తాను ముస్లిం కావటమనేది విశ్వసనీయమైన చర్య. అదొక వ్యక్తిగతమైన సంఘటన. కాని ఫలితాల దృష్ట్యా అది చాలా విస్తృతమైన – సామూహిక – సంఘటన. ఇది ఒక విధంగా పైకి కనిపించని అగ్నికణాలను అంతరంగంలో రాజేయటం వంటిదే. అయితే ఈ అగ్నికణాలే బయటికి చిమ్ముకువచ్చినప్పుడు పరిసర ప్రపంచాన్నంతటినీ చుట్టుముట్టుతాయి. దివ్య ఖుర్‌ఆన్‌లోని సూరాల అవతరణాక్రమం వెనుక ఉన్న రహస్యం కూడా ఇదే. తొలుత అంతరంగాన్ని సంస్కరించి విశ్వాస జ్యోతిని నింపే సూరాలు అవతరించాయి. ఆ తర్వాత బాహ్యలోకాన్ని సంస్కరించేందుకు ఆదేశాలు జారీ అయినాయి. ఈ విషయాన్నే విశదీకరిస్తూ మార్మడ్యూక్ పిక్తాల్ (1875–1936) తన అనువాద ఖుర్‌ఆన్ గ్రంథం పీఠికలో ఇలా అంటారు. "ఇందులో ఒక లోతైన పరమార్థం ఉంది. అదేమిటంటే ప్రవక్త ప్రేరణ అంతర్గత వస్తువుల నుండి మొదలై బాహ్య వస్తువుల వైపుకు వస్తుంది".

The inspiration of the prophet progressed from in most things to outward things.

బాహ్య ప్రపంచానికి వ్యతిరేకంగా నడుంబిగించటమే ఆచరణ అని చాలామంది అనుకుంటారు. కాని సిసలైన ఆచరణ తన అంతరంగాన్ని శక్తివంతంగా మలచుకోవటమే. అంతరంగాన్ని ఎంత శక్తివంతంగా మలచుకోవాలంటే; అది ఎప్పుడైనా బయటపడినప్పుడు మిథ్యావాదం దాని ధాటికి నిలువలేక పటాపంచలైపోవాలి. అంతరాత్మను శక్తిమంతం చేయటమంటే భావం, అదేదో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అభ్యాసమో లేక మంత్ర తంత్ర విద్యలను ఆశ్రయించటమో కాదు. ఖుర్‌ఆన్ వేటినైతే ఈమాన్ (విశ్వాసం), అమలె సాలెహ్ (సదాచరణ), సబ్ర్ (సహనం, ఓర్పు)గా పేర్కొందో వాటిని ఆశ్రయించటం. తన మనో మస్తిష్కాలలో, హృదయం లోతుల్లో దైవిక సత్యాలు నాటుకునేలా చేయాలి. సర్వోన్నత ప్రభువుతో వీలైనంత ఎక్కువగా తన సంబంధాన్ని పెంచుకోవాలి. "నాకు ఎవరిపై ఏ హక్కులులేవు. కాకపోతే అందదరి బాధ్యతలూ నాపైనే ఉన్నాయి" అన్న స్ఫూర్తిని మనసులో పదిలపరచుకోవాలి. దైవ మార్గంలో ఏ కష్టం ఎదురైనా నిశ్శబ్దంగా దాన్ని తనపై వేసుకోవాలి – ఇతరులపై నెట్టేసి చేతులు దులుపుకోరాదు. తన అంతరంగాన్ని శక్తివంతం చేసుకోవటం అంటే ఇదే. దైవప్రవక్త ఈవిషయాల్లో సంపూర్ణంగా ఆదర్శవంతులయ్యారు. ఈకారణంగానే మహోన్నతమైన

ఆయన అస్థిత్వం ముందు ఎదురుపడిన వారల్లా ఆయన వారయిపోయారు. ఆయన అంతర్గతంలో అణగిఉన్న సత్యాన్ని విస్ఫోటం ఒక్కసారి బయటపడగానే దాదాపు ప్రపంచమంతా దాని ప్రభావానికి లోనైంది.

హిందీ సాహితీవేత్త సర్దార్ పూర్ణసింగ్ (1882–1931) "బీర్తా" అనే ఒక వ్యాసరచన చేశారు. అందులో ఆయన ఇస్లాం ప్రవక్తను చరిత్రలోకెల్లా గొప్ప "వీరుడు"గా అభివర్ణించారు. అరబ్బు ఎడారిలో మందుగుండు సామాగ్రిలా ఆయన దావానలం వ్యాపింపజేశారని, ఆయనకు తారసపడిన వారల్లా ఆయనకు దాసోహమన్నారని అంటారాయన. ఆయన ఇంకా ఇలా అంటారు.

"అనుక్షణం తనను గొప్పవానిగా మలచుకోవడానికి ప్రయత్నించటమే వీరత్వం. 'ముందు పదండి' అని అన్యులు... అంటుంటారు. 'వెనక్కి జరగండి' అని వీరులంటారు. 'ఖడ్గం ఎత్తండి' అని అన్యులు... అంటారు. 'తల ముందుకు వంచండి' అని వీరులంటారు. అన్నివిధాలా శక్తిని సమీకరించుకోవటం వీరుల విధానం. వీరులైతే లోలోనే మార్చ్ చేస్తూ ఉంటారు. ఎందుకంటే వీరు ఆకాశపుటంచున నిలబడి యావత్తు ప్రపంచాన్ని కదిలించగలరు. రేకుపళ్ళెం మాదిరిగా ఒక్కసారే వేడెక్కి ఒక్కసారిగా చల్లారిపోయే వీరుడూ ఒక వీరుడేనా!? శతాబ్దాల తరబడి నిప్పుకాలుతున్నా వీరుడు వేడెక్కడు. వేలవేల సంవత్సరాలుగా అతనిపై మంచు పేరుకుపోతున్నా వీరుడు చల్లారిపోడు. 'పని చేయండం పని చేయండి' అని జనులంటుంటారు. కాని ఈ మాటలు మాకు నిరర్థకంగా తోస్తాయి. ముందు పనిచేసే శక్తిని కూడదీసుకోండి, మీలోలోపలకు దూసుకుపోయే తత్వాన్ని అలవరచుకోండి, కూసిన కోడల్లా శుద్ధమైపోయిందనటానికి ప్రపంచం ఏమన్నా చెత్తకుప్పపై నిలబడి ఉందా! ప్రపంచం ధర్మంపై స్థిరమైన నియమాలపై నిలబడి ఉంది. తనను తాను ఈ నియమాలతో జోడించి నిలదొక్కుకున్నవాడే విజేత". ("నిబంధ్ చైనికా" – సంకలనం మహేంద్ర చతుర్వేది)

ఈ వీరత్వం లేక అంతర్గతశక్తి రహస్యం క్షుద్ర విద్యలతోనో, ఆధ్యాత్మిక అభ్యాసాలతోనో ముడిపడిలేదు. బైరాగుల మతాలలోనో, ఏ కాంతకుహరాలలోనో కూర్చున్నంత మాత్రాన ఈ శక్తి లభించదు. 'క్షుద్రవిద్యల' ద్వారా ప్రాప్తించే 'శక్తి' జంతు ప్రపంచంలో కొన్ని మహిమలు చూపిస్తే చూపించవచ్చునేమోగాని వాస్తవిక జీవితంలో అది ఒక్కరోజు కూడా మనిషికి పనికిరాదు. కాగా, నిజజీవితంలో మనిషిని విజేతగా రూపొందించేదే అసలుశక్తి.

ఇక అంతతర్గత శక్తి నిర్వచనం ఏమిటో చూద్దాం. మనిషి తన్నుతాను మానసిక

చిక్కులనుండి విముక్తి చేసుకుని తన నిర్ణయాలలో ఇతరత్రా మినాయింపులకు (Considerations) ఆస్కారం లేకుండా చేసే ఉన్నత మానసిక స్థాయికి చేరడమే అంతర్గతశక్తి. హదీసు యొక్క పదాలలో "ఓ ప్రభువా! మమ్ములకు విషయాలను యధాతదంగా చూపించుము" (తఫ్సీర్ అర్రాజీ సంపుటి 1, పేజీ 119) యొక్క స్థానాన్ని చేరుకోవాలి. మంకుతనం, కోపం, పేరాశ, ద్వేషం, పదవీ వ్యామోహం, స్వార్థప్రియత్వం – ఇత్యాది భావాలు అతని ఆచరణలను, అభిప్రాయాలను ప్రభావితం చేసేంతటి స్థాయిలో మిగిలి ఉండకూడదు. వీటన్నింటికీ దూరంగా ఉండేవాడే ఎదుటివారిని జయించేటంతటి శక్తిని కలిగి ఉంటాడు. అతడు పరీక్షలన్నింటిలో నెగ్గుకు వస్తాడు. అతను ఎవరిపై చర్య తీసుకున్నా అది ఉక్కులా గట్టిగా ఉంటుంది. అతని నిర్ణయాల విషయానికి సంబంధించి అన్ని కోణాల నుంచి రాయితీలుంటాయి. వ్యతిరేకతలు, ప్రతికూల పవనాలు అతని సత్యతను సామర్థ్యాన్ని మరింతగా ప్రస్ఫుటం చేస్తాయి.

ఇక్కడ మనం మక్కా విజయానంతరం ఎదురైన పరిస్థితుల ఒక స్వరూపాన్ని చూద్దాం. అది ఒకే సమయంలో అనేక సమస్యలను ఉత్పన్నం చేసింది. అయితే ఇస్లాం ప్రవక్తలోని మనోబలం ఒక్కోసమస్యను ఇట్టే పరిష్కరిస్తూ పోయింది. ఈ మనోబలం కొన్నిచోట్ల క్షమాగుణం ద్వారా వ్యక్తమైతే కొన్ని చోట్ల ఆత్మధైర్యంలో వ్యక్తమయింది. కొన్నిచోట్ల దేవునిపై నమ్మకం రూపంలో వ్యక్తమైంది. మరికొన్నిచోట్ల ఆయనలోని దూరదృష్టి ఆయనకు విజయం చేకూర్చి పెట్టింది. మరికొన్నిచోట్ల ఆయన నిస్వార్థత విజయం చేకూర్చింది. తనను నిస్వార్థసేవా పరాయణునిగా తీర్చిదిద్దుకున్నప్పుడు అత్యంత బలశాలిగా మారుతాడని, అతనిని ఓడించటం ఎవరి తరమూ కాదని ఆయన నిరూపించారు.

హిజ్రీ 8వ సంవత్సరంలో ఆయన మక్కా నగరాన్ని వశపరచుకున్నప్పుడు కొంతమంది అవిశ్వాసులు భయకంపితులై పరారయ్యారు. హవాజీన్, సఖీఫ్ అనే తెగలవారితో కలసిపోయారు. ఆ తెగలవారిని రెచ్చగొట్టి కొత్తపోరు మొదలెడదామన్నది వారి ఎత్తుగడ. వారంతా అనేక తెగలను సంగటితం చేసి 20 వేల మంది దాకా పోగయ్యారు. హునైన్‌లో పోటీ ఎదురయింది. పర్వత శ్రేణుల్లో పొంచివున్న హవాజిన్ తెగవారు ఒక్కసారిగా బాణాలవర్షం కురిపించసాగారు. ముస్లిం సేనలు ఛిన్నాభిన్నం కాసాగాయి. 12వేల మంది సైనికుల్లో దాదాపు 11 వేలమంది పారిపోతూ కనిపించారు. అయితే తొలిదశలో ముస్లింలు వెనుకంజ వేసినప్పటికీ వారికి అద్వితీయమైన విజయం లభించిందని చరిత్ర చెబుతోంది. ఈ విజయానికి కారణం ఇస్లాం ప్రవక్త అంతరంగంలో ఉన్న శక్తి మాత్రమే. ఆ శక్తే ఆ సంక్లిష్ట ఘడియలో

ఆత్మస్థైర్యం (9:26) నూరిపోసింది. దైవ సహాయం తోడయింది. ఓటమి అంచుల్లోకి పోయిన వారుకాస్తా విజయం పొందారు ఆయన శత్రువుల నడిబొడ్డున నిలబడి ఇలా పఠించారు.

“ఓ దైవ సహాయక్షుల్లారా! ఓ ప్రవక్త సహాయకుల్లారా! నేను అల్లాహ్ దాసుణ్ణి మరియు ఆయన ప్రవక్త. నా వైపుకు రండి! నేను ఇక్కడ ధైర్యంతో నిలచి ఉన్నాను అని పిలిచారు. అబ్బాస్ కంఠం చాలా పెద్దది. దైవప్రవక్త ఆదేశంపై ఆయన ముస్లిం సేనలను ఉద్దేశ్యించి, “రిజ్వాన్ వృక్షం క్రింద కూర్చుని మరణ శపథం చేసిన వారలారా! ఎక్కడున్నారు?” అని కేకేశారు (మాగాజి అల్ వాహిదీ సంపుటి 3, పేజీ 897–899). ముస్లింలు వెనక్కి తిరిగి చూస్తే తమ నాయకుడు కదలని కొండలా ధైర్యంగా నిలబడి ఉన్నాడు. శత్రువుల ముట్టడికి ఆయన ఏమాత్రం తొణక్కుండా నిల్చుని ఉండటంతో దైవసహాయం తమకు తోడుగా ఉందని వారికి బోధపడింది. వారు నూతనోతత్సాహంతో కదన రంగంవైపుకు కదిలారా. ఒంటెలు మరలి రావటంలో ఆలస్యమవుతుందేమోనన్న ఉద్దేశ్యంతో కొంతమంది ఒంటెనుంచి క్రిందికి దూకి యుద్ధమైదానంవైపుకు పరుగెత్తారు. యుద్ధ స్వరూపమే మారిపోయింది. శత్రుసేనల పంక్తుల్లో గందరగోళం మొదలైంది. ముస్లింలకు అనూహ్య విజయం లభించింది. పెద్ద మొత్తంలో విజయ ప్రాప్తి (మాలె గనీమత్) చేజిక్కింది. 24వేల ఒంటెలు, 40వేల గొఱ్ఱెలు, 4వేల ఉఖచాల వెండి లభించింది. 6వేల మంది ఖైదీలు చేజిక్కారు.

ఈ విజయం తర్వాత కూడా సమస్య మళ్లీ సంక్లిష్టమైంది. అరేబియాలో ఖురైషుల తరువాత అంతటి శక్తివంతమైన తెగ సఖీఫ్ తెగ. ఆ తెగవారు తాయఫ్‌లో ముస్లిములను నలువైపులనుంచీ ముట్టడించి హునైన్ పోరాటం కంటే ఎక్కువ ప్రాణనష్టం కలిగించారు. సఖీఫ్ తెగవారు తలబిరుసుతనంలో అగ్రగాములు. ఆకాలంలోనే తాయఫ్‌కు చెందిన ఒక వ్యక్తి దైవప్రవక్త వద్దకు వచ్చి ఆయన సమక్షంలో ఇస్లాం స్వీకరించాడు. అతని పేరు ఉద్దబిన్ మస్‌వూద్. సఖీఫ్ తెగవారు ఆయన్ని అమితంగా ఇష్టపడేవారు. కాని ఉద్వ బిన్ మస్‌వూద్ ఒక ముస్లింగా తాయఫ్ పట్టణంలో ప్రవేశించగానే ఆ తెగవారు అతన్ని బాణాలతో చీల్చిచెండాడారు.

ఇక్కడ ఆయన మనోబలం మరొక రూపంలో వ్యక్తమైంది. సఖీఫ్ తెగవారి ముట్టడి తీవ్రతరమయ్యేసరికి ఉమర్ ప్రవక్తనుద్దేశించి, “తాయఫ్ వారికి శాపనార్థం పెట్టండి” అని సలహా ఇచ్చారు. అయితే ఆయన వాళ్లను శపించలేదు. దైవం వాళ్లకు సన్మార్గం చూపమని ప్రార్థించారు. ఆయన కోపంతో గాని, ప్రతీకార భావంతో గాని ఎలాంటి చర్యకు ఉపక్రమించ లేదు. మూడు వారాల తరువాత వెనక్కి తిరిగి పదమని సైనికులను ఆదేశించారు. అక్కడి

నుండి ఆయన 'జిరాన' అనే స్థలానికి వచ్చారు. అక్కడ హునైన్ యుద్ధ విజయ ప్రాప్తి ప్రోగై ఉంది. బనీ సఖీఫ్ తెగ పెట్టిన బాధకు గాను దాని మిత్రపక్షమైన హవాజిన్ తెగపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం చిక్కిందాయనకు. కాని ఆయన దీనికి పూర్తిభిన్నంగా వ్యవహరించారు. హవాజిన్ తెగకు చెందిన కొంతమంది చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకుని బందీలుగా పట్టుబడిన 6వేల మందినీ విడుదల చేశారు. వారందరికీ తగినంత ఆహార సామాగ్రిని, దుస్తులను ఇచ్చి ఇంటికి పంపారు. దయార్ద్రతకు, ఉదారవూకరికి ప్రతిరూపమైన ఈ సంఘటన పరిసరాలను ప్రభావితం చేయకుండా ఎలా ఉంటుంది? హవాజిన్ తెగ ప్రజలంతా ఒక్కుమ్మడిగా ముస్లింలైపోయారు.

దీని ప్రభావం తాయఫ్ ప్రజలపై పడనే పడింది. హవాజన్ – సఖీఫ్‌లు వాస్తవానికి ఒక పెద్దతెగకు చెందిన రెండు శాఖలు. తమ హవాజిన్ సోదరులంతా ఇస్లాం స్వీకరించారన్న సంగతి సఖీఫ్ ప్రజలను ముట్టడికన్నా ఎక్కువ షాక్ ఇచ్చింది. తమ కుడిభుజం తెగిపోయిందనీ, ఇకపై తాము యుద్ధాలు చేసి గెలవలేమన్న నిర్ణయానికి వచ్చారు సఖీఫ్ సర్దారులు.

"మరి సఖీఫ్ తెగవారు పరస్పరం సమాలోచన చేశారు. చుట్టు ప్రక్కలనున్న అరబ్బులతో పోరాడే తాహతు ఒక తమలో లేదని వారు అర్థం చేసుకున్నారు. ఆ తర్వాత వారంతా ప్రమాణం చేసి ముస్లిములైపోయారు" (సీరత్ ఇబ్నెహిషామ్ సంపుటి 2, పేజీ 538)

హిజ్రత్ 9వ ఏట (క్రీ.శ. 630) తాయఫ్ నుంచి ఒక ప్రతినిధి బృందం మదీనా వచ్చింది. తాము ఇస్లాం స్వీకరించటానికి సిద్ధమేనని వారన్నారు. కాని దీనికోసం వాళ్లు చిత్రవిచిత్రమైన షరతులు పెట్టారు. తమ భూభాగం గుండా సైనికుల రాకపోకలు జరగరాదని, తాము 'ఉష్ర్' (పంటపై విధిదానం) చెల్లించబోమనీ, ధర్మయుద్ధాల్లో తాము పాల్గొనబోమని, నమాజ్ చేయబోమని, తమపై తమవ్యక్తిని తప్ప మరొకరిని తమపై అధికారిగా నియమించరాదని షరతులు విధించారు. "మీ షరతులన్నీ నాకు సమ్మతమే, కాని ఏ మతంలోనైతే 'రుకూ' (వినమ్రత, తలవంచటం) లేదో అందులో ఎలాంటి శుభం లేదు" అన్నారు (అహ్మద్ హదీసు నెం. 17193). దైవప్రవక్త ఎవరికైనా ఇన్నిరకాల హామీలు ఇచ్చి ముస్లింగా మార్చటం ప్రవక్త సహచరులకు ఆశ్చర్యం కలిగించింది., అయితే ప్రవక్త దృష్టి దూరదృష్టి. ఆయన తన ప్రియసహచరులను సంతృప్తిపరచడానికి ఏమన్నారో చూడండి.

"మరేం ఫరవాలేదు. వీళ్లు గనక ఇస్లాంలో ప్రవేశిస్తే చాలు. తరువాత వీళ్ళు దానధర్మాలూ చేస్తారు. ధర్మయుద్ధాలలో కూడా పాలొంటారు (అబూదావూద్ 3025).

"మనిషి ఆయన వద్దకు వచ్చేవాడు. అతని రాకలోని ఉద్దేశ్యం కేవలం ప్రాపంచిక ప్రయోజనమే అయి ఉండేది. కాని పొద్దు గూకక ముందే అతను ప్రపంచం మరియు ప్రపంచంలోని సర్వస్వం కన్నా అధికంగా ధర్మాన్ని (దీన్) ప్రేమించసాగేవాడు.

హవాజిన్, సఖీఫ్ తెగల బెడద తొలగిపోతూ వున్న సమయంలోనే మరో కొత్త సమస్య – జఠిలమైన సమస్య తలెత్తింది. హవాజిన్‌ల నుండి లభించిన విజయప్రాప్తిని ఆయన పంపిణీ చేసే సమయంలో మక్కాకు చెందిన 'నవముస్లింలకు' ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ఇది మదీనాకు చెందిన అన్సార్లలో చాలామందికి బాధ కలిగించింది. మక్కా చేరేసరికల్లా ప్రవక్తపై 'ఖురైషీ తత్వం' ఆవహించిందని కూడా వాళ్లు చెప్పుకోసాగారు. తన బంధుమిత్రులను సంతోషపెట్టడానికి అంతా వాళ్లకే పంచిపెట్టారని కూడా పుకార్లు పుట్టాయి. అది అత్యంత సున్నితమైన సమయం. అయితే ప్రవక్త చేసిన పంపిణీలోని అంతరార్థంలేదు. అది రాగద్వేషాలతోనో, పక్షపాతంతోనో చేసిన పంపిణీ ఎంతమాత్రం కాదు. అందుకే విమర్శలకు తగిన సమాధానం ఇచ్చి సహచరుల మనస్సుల్లో ఉన్న కల్మషాన్ని దూరంచేసేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు.

ఆయన అన్సారు వర్గీయులందరినీ ఒకచోట సమావేశపరచి ప్రసంగించటానికి నిలుచున్నారు. ఆయన ఇలా అన్నారు. "ఓ అన్సారులారా! మీ గురించి నేనేం విటున్నాను! మీరు మార్గభ్రష్టులై ఉండగా నాద్వారా అల్లాహ్ మీకు సన్మార్గం చూపిన సంగతి నిజం కాదా? మీరు లేమికి గురై ఉండేవారు. అల్లాహ్ మీకు కలిమిని ప్రసాదించాడు. ఇది నిజంకాదా! మీరు పరస్పరం శత్రువులై ఉండేవారు, అల్లాహ్ నాద్వారా మీ మధ్య ఐకమత్యం సృజించిన మాట నిజంకాదా?" "అవును, నిజమే" అన్నారు అన్సార్లంతా. ప్రవక్త మళ్లీ ఇలా అన్నారు.

"దైవసాక్షి! మీరు తలచుకుంటే సమాధానం మరోవిధంగా చెప్పగలరు. అదేమిటంటే, '(ఓ దైవ ప్రవక్త!) మీరు మా వద్దకు వెళ్లగొట్టబడిన స్థితిలో వచ్చారు. మేము మీకు ఆశ్రయం ఇచ్చాము. మీరు నిరాధారిగా మా వద్దకు వస్తే మేము మీ దుఃఖంతో పాలుపంచుకున్నాము. మీరు భయకంపితులైన స్థితిలో వస్తే మేము మీకు అభయమిచ్చాము. మీరు నిస్సహాయ స్థితిలో వస్తే మేము మీకు సాయం చేశాము' అని అనండి. ఇదే నిజం....... ఓ అన్సార్ వర్గీయులారా! మీరు సామాన్యమైన ప్రాపంచిక వస్తువుల గురించి మనస్తాపానికి లోనయ్యారా! నేను నవముస్లిములను సంతోషపరచటానికి ఆ వస్తువులు వారికి ఇచ్చాను. అయితే అల్లాహ్ మీకు ప్రసాదించిన వస్తువు (అంటే ఇస్లాం)కు మిమ్మల్ని ప్రతినిధిగా చేశాను. ఓ అన్సారు

వర్గీయులారా! జనులు ఒంటెల్ని, గొఱ్ఱెల్ని తీసుకుని తమ ఇళ్లకు పోతూ ఉంటే మీరు దైవ ప్రవక్తను వెంటపెట్టుకుని మీ ఇండ్లకు వెళ్ళండి".

ఈ ప్రసంగం విని అందరూ విలపించసాగారు. వారంతా ముక్త కంఠంతో "మాకు దైవప్రవక్త చాలు" అని అన్నారు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 2, పేజీ 499-500). ఆయనలోని అంతర్గతశక్తి మూసుకున్న హృదయకవాటాలను తెరచింది. ఆయన వ్యక్తిత్వపు వరదముందు ఏ వస్తువూ ఆగలేకపోయింది.

## బాహ్యలక్ష్యం - సందేశ ఉద్దేశ్యం :

ఇస్లాం ప్రవక్త మక్కాలో ప్రారంభించిన క్రియాత్మక ప్రయత్నంలో గమనార్హమైన అంశం ఏమిటంటే అది బయట ప్రపంచానికి సిద్ధాంతానికనుగుణంగా రూపొందింది. ఆయన ప్రభవించిన కాలంలో రాజకీయ, ఆర్థిక సామాజిక ఉద్యమాలకు ప్రతిపాదికలుగా ఉండే పరిస్థితులన్నీ ఆయన చుట్టూ అలుముకుని ఉండేవి. అయితే ఆయన తన సందేశ కార్యక్రమం కోసం వాటిలో ఏ ఒక్కదానినీ ఆశ్రయించలేదు. పైగా అత్యంత ఏకాగ్రతతో పైన పేర్కొనబడిన కార్యక్రమం వైపుకు శాంతియుత పోరాటం కొనసాగించారు.

ఇస్లాం ప్రవక్త ప్రభవించిన రోజుల్లో ఆయన స్వదేశం సామ్రాజ్యవాద శక్తులకు ఆటపట్టుగా మారి ఉండేది. ముఖ్యంగా అరేబియాలోని సారవంతమైన ప్రాంతాలన్నీ విదేశీయుల చేతుల్లో ఉండేవి. అరేబియాద్వీపానికి ఉత్తరాన ఉన్న ప్రాంతమంతా రోము సామ్రాజ్యం క్రింద ఉండేది. ఆ ప్రాంతంలో రోమనుల రాజకీయ మత ప్రయోజనాలను కాపాడే వ్యక్తులు మాత్రమే గవర్నర్లుగా ఉండేవారు. దక్షిణాన జోర్డన్ ప్రాంతమంతా ఈరాన్ సామ్రాజ్యం ఏలుబడి క్రింద ఉండేది. దైవప్రవక్త కాలంలో జోర్డన్‌లో ఈరాన్ గవర్నర్‌గా 'బాజాన్' ఉండేవాడు. ఎటు తిరిగీ అరబ్బుల చేతుల్లో కేవలం హిజాజ్, లిహామ, నజద్ ప్రాంతాలు మాత్రమే ఉండేవి. ఇవిగాక మరికొన్ని ఎడారి ప్రాంతాలుండేవి. వాటిలో అక్కడక్కడా ఒకటీ అరా సారవంతమైన సీమలు ఉంటే ఉండేవి. ప్రవక్త వ్రాసినలేఖను ఈరాన్ చక్రవర్తి కిసా చించిపారేస్తూ 'నా బానిస నాకు ఇలా వ్రాస్తాడా! (తారిజ్ అత్ తబరి సంపుటి 2, పేజీ 655) అని మండిపడ్డాడంటే దానికి కారణం ఈ పూర్వరంగమే.

ఇస్లాం ప్రవక్త జన్మించిన (570) సంవత్సరంలో మక్కానగరంపై అబ్రహా దండెత్తి రావటంలోని ఉద్దేశ్యం కూడా దోపిడీయే. ఆ కాలంలో అబ్రహా అరేబియాకు దక్షిణాన ఉన్న జోర్డన్ ప్రాంతానికి రాజుగా ఉండేవాడు. ఇస్లాంకు పూర్వం కాబా గృహం అరేబియాలోకెల్లా

అతిపెద్ద విగ్రహాలయంగా ఉండేది. అందులో అన్ని జాతుల, తెగల విగ్రహాలు ఉంచబడి ఉండేవి. ఆ విధంగా అది వివిధ మతాలను నమ్మేవారికి పవిత్ర స్థలంగా అలవారేది. ఏడాదంతా ప్రజలు మక్కాకు వచ్చి తమ విగ్రహాలను దర్శించి మొక్కుబడులు చెల్లించేవారు. ఈ కారణంగా మక్కా వ్యాపార కేంద్రంగా మారింది. ఈ వాణిజ్య కేంద్రాన్ని తన వైపుకు త్రిప్పుకోవాలన్నది అబ్రహా ఉద్దేశ్యం. జోర్డన్‌లో అబిసీనియా సేనలకు అధిపతి అయిన అబ్రహా అబిసీనియా అధికారి క్రింద ఉండేవాడు. కొంతకాలం గడిచిన తరువాత అబిసీనియా అధికారిని హతమార్చి తనను రాజుగా ప్రకటించుకున్నాడు. అబిసీనియా చక్రవర్తి నజాషీ కూడా గత్యంతరం లేక అబ్రహాను జోర్డన్ రాజుగా గుర్తించాడు. అబ్రహా మతపరంగా క్రైస్తవుడు అతడు జోర్డన్‌లోని 'సన్‌ఆ'లో ఒక పెద్ద చర్చ్ నిర్మించాడు. ఆ చర్చ్‌ని నిర్మించిన కొంతమంది కళాకారుల పేర్లు కూడా చరిత్రలో పొందుపరచబడి ఉన్నాయి. ఇక ఆ చర్చ్ గురించి అబ్రహా బాగా ప్రచారం చేసి ప్రజలను ఆకర్షించాలనుకున్నాడు. ఆ విధంగానైనా మక్కా వాణిజ్యం దెబ్బతింటుందని, తన రాజధాని నగరమే వాణిజ్యకేంద్రంగా మారుతుందని ఆశించాడు. కాని అబ్రహా ఎంత ప్రయత్నించినా అతని ప్రయత్నాలు ఫలించలేదు. మక్కాలోని కాబా గృహాన్ని కూల్చివేస్తే గాని తన కల పండదని అబ్రహా నిశ్చయించుకున్నాడు. అతడు ఏనుగులతో దండెత్తి రావటంవల్ల "ఏనుగులవాడు"గా వినతికెక్కాడు. అరబ్బు చరిత్రలో అది ఎంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుందంటే, అతడు ఏ చలమ దగ్గర విడిది చేసినా దాన్ని 'ఏనుగుల చలమ' అని పిలిచారు. అతడు ఏ పట్టణంలో అడుగుపెట్టినా దాన్ని 'ఏనుగుల ద్వారం'గా వ్యవహరించారు. అతడు దాడి చేసిన సంవత్సరాన్ని 'ఏనుగుల సంవత్సరం' అన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో అరేబియా సారథిగా ముందుకు వచ్చిన ఆయన పొరుగు రాజ్యాల సామ్రాజ్యవాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాల్సింది. దేశాన్ని విదేశీ ప్రాబల్యం నుంచి కాపాడటానికి దేశప్రజల్లో జాతీయ భావాలను రగుగొల్పాల్సింది. కాని ఆయన ఇలాంటి ఉద్యమాల జోలికి పోనేపోలేదు.

అలాగే ఆ కాలంలో అరేబియా "వ్యవసాయేతర క్షేత్రం"గా ఉండటంవల్ల దానికి ఆర్థిక వనరులు దాదాపు లేవనే చెప్పాలి. ఈ లేమికి అరేబియాలోని ఒక్కో వ్యక్తి గురయ్యేవాడు. అందుచేత ప్రజలనాడిని పసిగట్టి, భవిష్యత్తుపై ఆర్థిక ఆశలుచూపి ఒక "విప్లవోద్యమం" నిర్వహిస్తే బ్రహ్మాండమైన స్పందన వచ్చేదే. కాని ఆయన ఆ రకమైన ఆర్థిక నినాదాల ఊసే ఎత్తలేదు. ఒకసారి మక్కాలోని మర్యాదస్తుల బృందం పొద్దుగూకిన తర్వాత కాబా ఎదుట

సమావేశమైంది. వాళ్లు ప్రవక్తను అక్కడికి పిలిపించి మాట్లాడారు. ఆయన తన సందేశాన్ని వాళ్లకు వినిపించగా వాళ్లు ఇలా అన్నారు.

"ఓ ముహమ్మద్! మనదేశం ఇతరదేశాలకన్నా బీదదేశం అన్న సంగతి మీకు తెలుసు. ప్రపంచంలో మనకన్నా ఎక్కువ దుర్భిక్షాన్ని ఎవరూ చవిచూడటం లేదు. మనకొరకు జీవితం అత్యంత దుర్భరమైపోయింది. మనల్ని దారిద్ర్యానికి లోనుచేసిన ఈ పర్వతాలను తొలగించమని, సిరియా ఇరాక్‌లో మాదిరిగా ఇక్కడ కూడా నదీనదాలను సృష్టించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయమని మీ ప్రభువుతో చెప్పండి" (సీరత్ ఇబ్నెహిషామ్ సంపుటి 1, పేజీ 296)

మక్కా సర్దారుల ఈ ప్రసంగం వెనుక ఉన్న పూర్వరంగం ఏమిటంటే నజద్ మరియు హిజాజ్‌లలోని పర్వత శ్రేణులు సముద్ర (రుతు) పవనాలను అడ్డుకొన్నాయి. ఈ కారణంగా ఇక్కడ ఇరాక్ సిరియాలో వలె వర్షాలు కురవటంలేదు. అరేబియా నేల వర్షాభావంతో బంజరుగాపడి ఉంటోంది అన్నది అరబ్బు నాయకుల ఉద్దేశ్యం. ఈ విధంగా ప్రవక్తకు ఒక హరిత విప్లవం లేవనెత్తటానికి బంగారు అవకాశం లభించింది. ఆర్థిక సంస్కరణల పేరిట పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేసి అప్పటికప్పుడు వారిని తన ఆశయాలకనుగుణంగా ఆకర్షించవచ్చు. కాని ఆయన ఈరకమైన సమస్యలపై ప్రత్యక్ష శ్రద్ధ వహించలేదు. దీనికి బదులు ఆయన తన్ను తాను పూర్తిగా "కలిమయె తౌహీద్" వ్యాప్తికి అంకితం చేశారు. సందేశ ప్రధాన ఉద్యమంలో అన్నిరకాల రాజకీయ ఆర్థిక అంశాలు కూడా అంతర్లీనమై ఉంటాయని తరువాత చరిత్ర నిరూపించిందనుకోండి, అయితే ఆయా అవకాశాలు పరోక్షంగా వస్తాయే తప్ప ప్రత్యక్షంగా కాదు.

ఇస్లాం ప్రవక్త దృష్టిలో ప్రాధానాంశం సందేశవ్యాప్తి మాత్రమేనని ఆయన జీవిత చరిత్ర నిరూపిస్తోంది. దైవదౌత్యం లభించగానే ఆయన ఇతరత్రా విషయాలన్నింటినీ వదలిపెట్టి కేవలం సత్యసందేశం (దావత్)పై దృష్టిని కేంద్రీకరించారు. "దేవుడు నన్ను తన సందేశాన్ని అందజేయమని నియమించాడు. మీరు నాతో సహకరించండి" అని తన వంశస్తులను అభ్యర్థించాడు. ఆయన తన వంశీయులను విందుకు ఆహ్వానించారు. అలా ఆహ్వానించబడిన వారు సుమారు 40 మంది వరకూ ఉన్నారు. వారిలో ఓ 30 మంది దాకా హాజరయ్యారు. భోజనాలయ్యాక వాళ్లందరినీ ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కాని వారిలో ఎవరూ సహకారానికి సుముఖులు కాలేదు.

"ఓ అబ్దుల్ ముత్తలిబ్ వంశీయులారా! నేను మీకొరకు ప్రత్యేకంగా మరియు జనులందరి వైపుకు సర్వ సామాన్యంగా పంపబడ్డాను. కాబట్టి మీలో ఎవరు నా రుణాల, వాగ్దానాల బాధ్యత తీసుకుంటాడో మరియు నా కుటుంబంలో నా ప్రత్యామ్నాయం అవుతాడో అతడు స్వర్గంలో నా సరసన ఉంటాడు. దైవ ప్రవక్త ఈ మాటనే మరోసారి పలికారు. అప్పుడు అలీ (అప్పట్లో ఆయన నవయువకులు), 'ఓ దైవప్రవక్త! నేనందుకు సిద్ధంగా ఉన్నాను' అని చెప్పారు. సమాధానంగా ఆయన "ఓ అలీ! నువ్వా ఓ అలీ!" అన్నారు.

ఒకసారి అబూజహల్ ఆయనపై రాయిరువ్వాడు. ఆయన శరీరానికి గాయమై రక్తం స్రవించింది. ఈ విషయం ఆయన పినతండ్రి అబ్బాస్‌కు తెలిసింది. అప్పటికి ఆయన ఇస్లాం స్వీకరించలేదు గాని ఆయనలోని మమకారం ఉప్పొంగింది. వడివడిగా వెళ్ళి అబూజహల్‌ను కొట్టారు. ఆ తరువాత ప్రవక్త వద్దకు వచ్చి 'నాయనా! నేను నీ తరఫున ప్రతీకారం తీర్చుకున్నాను' అన్నారు. దానికి ప్రవక్త ఇచ్చిన జవాబు గమనార్హం. "బాబాయి! మీరు ఇస్లాం స్వీకరిస్తే నేను ఇంతకన్నా ఎక్కువగా సంతోషిస్తాను" అన్నారాయన.

ఖురైష్ జనులు అబూతాలిబ్ దగ్గరకు వచ్చి ఇలా విన్నవించుకున్నారు.

"ఓ అబూతాలిబ్! మీవాడు మా సంతల్లో సమావేశాల్లోకి వచ్చి మాకు వేదన కలిగించే విషయాలు వినిపిస్తున్నాడు. మీకు చేతనైతే అతన్ని రాకుండా ఆపండి".

అబూతాలిబ్ తన కుమారుడైన అఖీల్ ద్వారా ఆయన్ని పిలిపించి ఖురైషుల ఫిర్యాదును వినిపించారు.

ఆయన తన చూపులను ఆకాశంవైపుకు ఎత్తారు. "దైవం సాక్షి సూర్యునితో అగ్నిజ్వాలను కాల్చటం మీకు ఎంత అసంభవమో నాకు ఒసగబడిన సందేశాన్ని నేను ప్రజలకు అందజేయకుండా ఆగిపోవటం కూడా అంతే అంసంభవం" అని ఆయి

ˆన బదులిచ్చారు (అల్ మోజుమ్ అల్‌ఔసిస్ హదీసు 8553).

ఇలా చెప్పి ఆయన ఏడ్చేశారు

ఆయన వంశమైన 'బనూహాషిమ్'కి అరేబియాలో అన్నివిధాలా ప్రాబల్యం పలుకుబడి ఉండేవి. అందుచేత ధైర్యశాలి అయిన ఈ యువకుడు బహుశా 'చక్రవర్తి'కా గోరుతున్నాడేమో అని కొంతమంది ఊహాగానం చేశారు. అయితే పరలోక సందేశాన్ని ప్రజలకు అందజేయటం తప్ప తనకు వేరొక ఉద్దేశ్యంలేదని ఆయన నిరంతర ఆచరణ నిరూపించింది. ఒకసారి ఆయన అబూజహల్‌ను ఆహ్వానించగా అతను,

"ఓ ముహమ్మద్! నువ్వు మా విగ్రహాలను విమర్శించటం ఆపుతావా! నువ్వు సందేశాన్ని అందజేసే బాధ్యతను నిర్వర్తించావని మేము సాక్ష్యమివ్వటమే కదా నీకు కావాల్సింది. నువ్వు నీ బాధ్యతను నెరవేర్చాలని మేము సాక్ష్యమిస్తాము. సరేనా!" అన్నాడు (అల్‌బిదాయ వల్‌మి హాయ సంపుటి 3, పేజీ 83).

ఆయన అబీతాలిబ్ లోయలో శరణార్థులుగా ఉన్న కాలంలో నిషిద్ధ మాసాలలో ఆయన వంశీయులు క్రయవిక్రయాలలో నిమగ్నులయ్యేవారు. వాళ్లు ఖుర్బానీ పశువుల మాంసాన్ని సేకరించి ఎండబెట్టేవారు. ఎండిన ఆ మాంసాన్ని ఇతర నెలల్లో భుజించేవారు. అయితే ఇటువంటి స్థితిలో కూడా ప్రవక్త వివిధ తెగల గుడారాల వద్దకు పోయి వారికి ఇస్లాం సందేశం అందజేసేవారు. ఆయన చేసిన హిజ్రత్ ప్రయాణం అత్యంత కఠోరమైంది. కాని ఈ ప్రయాణ సమయంలో కూడా ఆయన సందేశ పరిచయ కార్యక్రమాన్ని విడనాడలేదు. దీనికి సంబంధించి సీరత్ గ్రంథాలలో ఎన్నో దృష్టాంతాలు కనిపిస్తాయి. ఉదాహరణకు, గమీమ్ అనే చోట ఆయన బురేదా బిన్ హసీబ్‌కు దైవసందేశం వినిపించారు. తత్ఫలితంగా బురేదాతో సహా 80 ఇళ్లున్న తెగ అంతా ఇస్లాం స్వీకరించింది (అల్ తబాకాత్ అత్ ఖుబ్రా సంపుటి 4, పేజీ 182). అలాగే రకూబ పర్వతశ్రేణిలో ఆయనకు ఇద్దరు మనుషులు తారసపడ్డారు. ఆయన వారికి ఇస్లాం పరిచయం చేశారు. వారిద్దరూ విశ్వసించారు. ఆయన వారి పేర్లడిగారు. తాము అస్లం తెగకు చెందిన వ్యక్తులమనీ, దొంగతనం చేయటం తమ వృత్తి అనీ, అందుకే జనులు తమను 'ఇద్దరు నీచులు'గా అభివర్ణిస్తారని చెప్పారు వారు. దానికి ప్రవక్త ఇలా అన్నారు.

"కాదు మీరు ఇద్దరూ గౌరవనీయులే" (అహ్మద్ 16691)

ఆయన తన ప్రియ సహచరుల ప్రవృత్తినే మార్చేశారు. రాజ్యాలను జయించటం, విజయప్రాప్తిని పంచుకోవటం గొప్పపని కాదనీ, మీ ద్వారా కొంతమందికైనా సరే విశ్వాసభాగ్యం చేకూరటమే గొప్ప విషయమనీ ఆయన తరచూ బోధిస్తుండేవారు. ఖైబర్ యుద్ధం సందర్భంగా ఆయన అలీకి ధ్వజం అప్పగిస్తూ ఇలా ఉద్బోధించారు.

"వినమ్రుడవై వెళ్లు. వారి పొలిమేరల్లోకి ప్రవేశించగానే ఇస్లాం సందేశాన్ని అందజెయ్యి. అల్లాహ్‌కు వారిపై గల హక్కులు ఏమిటో విడమరచి చెప్పు. దేవునిసాక్షి! ఒకవేళ నీ ద్వారా ఒక్క వ్యక్తికైనా అల్లాహ్ సన్మార్గం చూపితే అది నీపాలిట ఎర్రని ఒంటెలకన్నా మేలైనది" (బుఖారి 2942).

ఆయన జీవితంలోని ఈ కోణం ఎంత స్పష్టమైనదంటే దాన్ని 'దావత్' (సందేశ ప్రదానం) అని తప్ప మరోపేరు పెట్టి పిలువలేము. ఆనవాయితీ ప్రకారం ఆయన రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యలను లక్ష్యంగా పెట్టుకోలేదు. దానికి బదులు ఆయన తన శ్రద్ధా సక్తులన్నింటినీ దైవమార్గం వైపుకు పిలుపు ఇవ్వటం పైనే కేంద్రీకరించారు. మొదట్లో అది పైకి ఒక పనిగా మాత్రమే కానవచ్చేది. కాని తుదిఫలితం వెల్లడయ్యేటప్పటికి అర్థమైంది. అదొక్కటి చేతికందితే మిగతావస్తువులన్నీ వాటంతట అవే లభిస్తాయని!.

## సహన స్థయిర్యాలు :

ఇక 'సబ్ర్' (సహనము)ను తీసుకోండి. అరబీలో సబ్ర్‌కు గల భావం చాలా విస్తృతమైంది. ఏదైనా విషయంపై తీవ్ర ప్రభావానికి లోనుకాకుండా స్థిరత్వం కనబరచటాన్ని అరబీలో 'సబ్ర్' అని అంటారు. విత్తనం నాటడానికి వీలులేనంత గట్టిగా ఉండే నేలను 'సబ్బారతన్'గా వ్యవహరిస్తారు. అలాగే వీరుడు యోధుడైన వ్యక్తిని సుబూర్ అని పిలుస్తారు. ఎందుకంటే అతను బయటి ఒత్తిడులను ఎదుర్కొంటూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటాడు.

ఏ మనిషిలోనైతే ఇస్లాం ఒక ఆశయంగా, ఒక ధ్యేయంగా అంతర్లీనమైందో అతనిలో ఈ సబ్ర్ (సహనం, ఓర్పు) ఉండటం చాలా అవసరం. అదే అసలు అతని వ్యక్తిత్వానికి ఆభరణం, ఇస్లాం మనిషిలో సృష్టించే చలనం వల్ల అతను ఒక సోమరిలా, అసమర్థునిలా ఉండిపోడు, అశక్తతను బయటపడనివ్వడు (3:146). ఈమాన్ మరియు ఇస్లాం అంటే అర్థం దేవునిపై నమ్మకముంచటం. ఎవరైతే దేవునిపై నమ్మకం ఉంచుతాడో అతడు అసాధారణ శక్తిమంతుడైపోతాడు. అతను ఏదశలోనూ సహనస్థయిర్యాలను కోల్పోయే ప్రశ్న ఉండదు.

1. ఒకవ్యక్తి ఇస్లాం ధ్వజవాహకునిగా నిలబడినప్పుడు అతనికి ఒక విషయం తెలుస్తుంది. అదేమిటంటే తను స్వయంగా దేవుడు విధించిన హద్దులకు కట్టుబడి ఉన్నాను కాగా, ఎదుటివాడు ఇష్టంవచ్చింది చేయడానికి, కోరుకున్నదారిలో వెళ్ళడానికి స్వతంత్రుడై ఉన్నాడు. శక్తిసామర్థ్యాలన్నింటినీ దైవమార్గంలో పిలుపు ఇచ్చే నిమిత్తం ఖర్చుపెట్టమని తనకేమో ఆజ్ఞాపించబడింది. కాని ఇతరులేమో రాజకీయ, ఆర్థిక ఉపాయాలతో తమస్థితిని మెరుగుపరచుకుంటున్నారు. తానేమో ఎట్టి స్థితిలోనూ నైతిక పరిధుల్లో ఉండాలని ఆదేశించబడింది. మరి ఇతరులైతే ఇలాంటి కట్టడులన్నింటినుండీ విముక్తులై ఉన్నారు. ఈ రకమైన ఆలోచనలు ఇస్లాం సందేశ ప్రదాతను ఎంతగా ప్రభావితం చేస్తాయంటే అతడు ఇస్లామీయ విధానాన్ని సరళమైనదిగా తలపోయసాగుతాడు. ఇతరులు అవలంబించే పద్ధతినే

తానూ అవలంబించాలన్న ఆలోచన అతని మనసులో మొగ్గతొడుగుతుంది. ఇక్కడ 'సబ్ర్' (సహనం, ఓర్పు) అతనికి అవరోధంగా పరిణమిస్తుంది. తన ఆచరణను తేలికైనదిగా తలపోయకుండా అతన్ని ఆపుతుంది సబ్ర్.

"ఓ ప్రవక్తా! ఓర్పు వహించండి. నిస్సందేహంగా దేవుని వాగ్దానం నిజమైనది. నమ్మకములేనివారు నిన్ను అసహనానికి లోను చేయరాదు" (30:60)

2. ఇస్లాం మార్గంలో సబ్ర్‌కు గల మరో భావం ఏమిటంటే, ప్రత్యర్థి తరపున కల్పించబడే కష్టాలు కడగండ్లను ఏకపక్షంగా సహించాలి.

"మీరు ఏ బాధనైతే కలిగిస్తున్నారో దానిపై మేము ఓపిక పడతాము (అని ప్రవక్తలు చెప్పారు)" (14:12)

ఈ సహనం మరియు ఓర్పు స్వతహాగా సత్యసందేశ కార్యక్రమంలో అనివార్యమైన ఒక అంశం. ఎందుకంటే సందేశ ప్రదాత గనక ఆహూతుని ప్రతిచర్యలకు బెంబేలెత్తిపోతే లేక అతనిపై చిర్రు బుర్రులాడితే వీడూ ఒక సందేశ ప్రదాతేనా అన్న సంశయం కలుగుతుంది. అతను పనిచేస్తున్నది దైవప్రసన్నతను పొందడానికేనా అన్న అనుమానం కలుగుతుంది. అతనికి ఎదురయ్యే కష్టాలయితే యదార్థానికి అతని చిత్తశుద్ధికి పరీక్షవంటివి. తాను ఒక చిత్తశుద్ధి గల కార్యకర్తనని నిరూపించుకున్ననాడే అతనిసందేశం జనబాహుళ్యంలో స్వీకారయోగ్యం కాగలుగుతుంది.

3. ప్రతిద్వంది నుంచి తనపై ఏదైనా ఆరోపణాస్త్రం సంధించబడినపుడు మనిషి సాధారణంగా దానికి అతనిపైకే తిప్పికొట్టడానికి యత్నిస్తాడు. దీనికి ప్రతిగా మౌనంగా దానిని తనపైకి తీసుకోవటం సబ్ర్ (సహనం). ఉదాహరణకు ఎక్కడైనా ముస్లిములు (మధూఖామ్ / సందేశ గ్రహిత జాతి) ఆహ్వానితుల స్థాయిలో నున్న జాతుల తరపునుంచి సమానతా ప్రాతిపదికపై ఆర్థికపరంగా చిన్నచూపుకులోనైనప్పుడు ముస్లింలు ఉద్యమించి 'మా పట్ల సమానతా దృష్టితో మెలగాలి' అని చెప్పటం సహనభావానికి విరుద్ధం. దీనికి బదులుగా వారు సవాళ్లను తమపైకి తీసుకోవాలి. సమానతా ప్రాతిపదికపై సమాజం వారికి వారి హక్కును ఇవ్వకపోతే విశిష్టమైన అర్హతను సంపాదించి దాన్ని పొందాలి. మక్కానుండి కొంతమంది ముస్లిములు అబిసీనియాకు వలసపోవటం ఒకవిధంగా ఇదే. మక్కా ఖురైషులు ముస్లింలతో వ్యాపార లావాదేవీలను నిలిపివేసినపుడు వాళ్లు పొరుగు రాజ్యమైన అబిసీనియాకు వెళ్లి కష్టించి చెమటోడ్చి తమఉపాధిని సంపాదించసాగారు. అక్కడవారు శ్రమించి, నిజాయితీగా

వ్యవహరించి ఎంత మంచిపేరు సంపాదించారంటే అబిసీనియా రాజు (నజాషీ) వారిపట్ల ప్రసన్నుడై, 'ఈ రోజునుంచి ముస్లింలను అకారణంగా వేధించినవాడు దాని పరిహారంగా ఎనిమిది దిరహమ్‌ల జరిమానా కట్టవలసి ఉంటుంది' అని ప్రకటన చేయించాడు.

ఓర్పుపైకి ఒక అణకువ గల వస్తువుగా కనిపిస్తుంది. కాని పరిణామం రీత్యా అదొక గొప్ప చర్య. తద్వారా మనిషి తన శత్రువుపై తక్షణం చర్య తీసుకునే బదులు సుదూర ఫలితాలపై భరోసా చేస్తాడు. మీరు ఏదైనా అన్యాయం లేదా కవ్వింపు చర్యకు సమాధానంగా చర్యకు ఉపక్రమిస్తే అప్పుడు మీచర్య ప్రతిచర్యగా పరిగణించబడుతుంది. ఇంకా అది ముందుగా వేసుకున్న పథకం ప్రకారం చేసిన చర్య అనిపించుకుంటుంది. మనిషిలో పొంగిపొరలే ప్రతీకార భావాల ఆధారంగా అది జరుగుతుంది. తద్భిన్నంగా దాని బాహ్య సత్యాలను, కారణాలను లోతుగా అధ్యయనం చేసి తదనుగుణంగా వ్యూహరచన చేస్తే అది 'సబ్ర్' (సహనం, స్థయిర్యం) అనిపించుకుంటుంది.

ప్రత్యర్థిపై స్వయంగా తక్షణ చర్యకు ఒడిగట్టకుండా దేవుని శాశ్విత చట్టాల ఉచ్చులో అతను బిగుసుకునేదాకా వేచి ఉండటమే ఓపిక (సబ్ర్).

మనిషి తొందరపాటుతో ప్రత్యర్థిపై పోరాడటానికి పరుగెత్తినప్పుడు అతని బుద్ధి, అతని క్షణికావేశాలు మాత్రమే అతనికి మార్గదర్శకత్వం వహిస్తాయి. ఆ సమయంలో అతను చేసే అనేక పొరబాట్లు మూలంగా అతని కేసు బలహీనమైపోతుంది. దీనికి బదులు మనిషి ఓర్పుతో వ్యవహరిస్తే అప్పుడు అతనిలోని దివ్యశక్తి జాగృతమై సరైన త్రోవచూపిస్తుంది. దీన్నే 'వివేచన' అంటారు. మనిషిలోని వివేచన ఒక అద్భుతమైన శక్తి, అది గోడకు అవతలనున్న దాన్ని చూస్తుంది. భవిష్యత్తులోకి తొంగిచూసి అందులో దాగివున్న యదార్థాలను కనుగొంటుంది. వివేచనను గనక నకారాత్మక భావాలనుండి వేరుపరచి ప్రశాంతంగా ఆలోచించే గడువునిస్తే అది యదార్థాల లోతుల్లోకి పోయి ప్రత్యర్థిని అదుపులో పెట్టే కళ్ళాన్ని మనకు అందిస్తుంది.

హిజ్రత్ సంఘటన కూడా ఇటువంటిదే. ఖురైషులు ప్రవక్తను తుదముట్టించడానికి పన్నాగం పన్నారని తెలిసినపుడు ఆయన నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోలేదు. దీనికి బదులు ఆయన ప్రశాంత మనస్సుతో ఆలోచించి మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. వేరే మాటల్లో తన నివాస స్థలాన్ని మార్చుకోవాలనుకున్నారు. ఆయిషా ఇలా అంటున్నారు. "హిజ్రత్‌కు ముందు ఆయన ప్రతిరోజూ మా నాన్న (అబూబకర్)గారి

దగ్గరకు వచ్చేవారు. కింకర్తవ్యం గురించి ఆలోచించేవారు. ఆరు నెలల తరబడి అత్యంత పకడ్బందీగా వ్యూహరచన చేశారు. ఆపైన నమ్మకస్థుడైన ఒక దారిచూపే వ్యక్తిని వెంటబెట్టుకుని మదీనా వెళ్ళిపోయారు" (అల్‌సీరా అల్‌నభవియ్య సంపుటి 2, పేజీ 246). ప్రత్యర్థితో భీకర పోరాటం సాగించి అమరగతి నొందటమే గొప్పకార్యమని తలపోసే ఆవేశపూరిత నాయకుడికి ఈ హిజ్రత్ సంఘటన ఒక విధమైన పలాయనవాదంగా కనిపించవచ్చు. కాని ఫలితాల దృష్ట్యా చూస్తే ఇది ఇస్లామీయ చరిత్రను మలుపుతిప్పిన అద్భుత సంఘటనగా కనిపిస్తుంది.

ఈ విధంగా 'సబ్ర్' భావం ఏమిటంటే మనిషి తనను తాను కట్టి పడేసుకుని పగతీర్చుకునే అవకాశం ప్రకృతికి కల్పించాలి. మానవ నైజం ఒక శాశ్వితమైన సత్యం. బాహ్యాపరమైన పరదాలను గనక తొలగించివేస్తే అది మానవ జీవితంలో అత్యంత నిర్ణయాత్మకమైన పాత్రను నిర్వహిస్తుంది. దూషణలకు ప్రతిగా మౌనం వహించిన వ్యక్తి పట్ల ప్రకృతికి ఎల్లప్పుడూ దయాభావమే ఉంటుంది. అలాగే మానవ నైజం తన అంతరాత్మ ప్రభోదానుసారం దుర్మార్గుడికి బదులు పీడితునికి అండగా నిలబడాలంటుంది. సహన స్థయిర్యాల ద్వారా మనిషిలోని సత్యనిబద్ధత స్పష్టమవుతుంది. ఉదాహరణకు ప్రవక్తకు దైవ దౌత్యం లభించి ఏడు సంవత్సరాలు గడచిన మీదట ఆయన మరియు ఆయన వంశీయులపై జరిగిన ఒక సంఘటనను తీసుకోండి. ఒక అబూలహబ్ మినహా బనూహాషిమ్ తెగకు చెందిన వారంతా సంఘ బహిష్కరణ గావించబడి ఒక పర్వత లోయలో ఉండిపోవలసి వచ్చింది. ఒక ఆశయం కోసం అత్యంత మౌనంగా – ప్రశాంతంగా వ్యధాభరితమైన యాతనను భరిస్తూ ఉండటం మానవ నైజాన్ని కుదిపివేయకుండా ఉండదు. మూడేళ్లు గడిచేసరికి శత్రుశిబిరంలోనే అబుల్ బహుతరి, హిషామ్ బిన్ అమర్, జుబైర్ బిన్ ఖురైష్ నాయకుల ముందు నిరసన ప్రకటించి బహిష్కార ఆంక్షలను చీల్చిచెండాడారు. దాంతో బనూహాషిమ్‌కు ఈ అమానుష చెరనుండి విముక్తి లభించింది.

ఓర్పు, సహనం వల్ల కలిగే అతి ముఖ్య ప్రయోజనం ఏమిటంటే దీని ద్వారా మనిషి దైవ సహాయానికి అర్హత సంపాదిస్తాడు. ఒక వ్యక్తి సదాశయం కోసం ఓపిక పట్టినప్పుడు అతను తన సమస్యల పరిష్కారం కోసం విశ్వప్రభువుపై భారం మోపుతాడు. ఒక వ్యక్తి సదాశయం కోసం విశ్వప్రభుపై భారం మోపిన తరువాత అతనికి ప్రభువు సాయపడక పోవటమా? అసంభవం!

ఈ సహాయం రకరకాలుగా అందుతుంది. ఎవరూ వాటిని గురించి ఊహించనైనా లేరు. ముస్లింలు ముస్లిమేతరుల మధ్య ఆర్థిక స్థితి గతుల్లో హెచ్చు తగ్గులు ఏర్పడవచ్చు!

విశ్వాసులలో ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించి, అవిశ్వాసుల హృదయాలలో భయాందోళనలను సృష్టించవచ్చు.

"ఓ విశ్వసించిన వారలారా! దేవుడు మీకు చేసిన మేలును జ్ఞప్తికి తెచ్చుకోండి. మీపై సేనలు దండెత్తి వచ్చినప్పుడు మేము వాళ్లపై తుఫానును, మీకు కనిపించని దళాలను పంపించాము" (అహ్జాబ్ 33:9)

పై ఆయత్ అహ్జాబ్ యుద్ధానికి సంబంధించినది. ఈ యుద్ధంలో అల్లాహ్ విశ్వాసులకు సహాయంగా రెండు వస్తువులను పంపించాడు. ఒకటి : గాలి, రెండవది : దైవదూతల సైన్యం. గాలి మనకు కొత్త వస్తువేమీ కాదు. అది అనుక్షణం భూమండలంలో ఉంటుంది. కాని ఒక ప్రత్యేక సమయంలో, ఒక ప్రత్యేకమైన స్థలంలో అది ఉధృతం గావించబడింది. పర్యసానంగా అది విశ్వాసుల పాలిట మహదానుగ్రహంగా మారింది. దీన్నిబట్టి బోధపడిందేమిటంటే దేవుడు ఏదైనా వర్గాన్ని కటాక్షించగోరినపుడు భౌతిక ప్రక్రియలో తీవ్రతరం చేస్తాడు. అది ఆయావర్గం వారికి విజయంగా పరిణమిస్తుంది.

దైవదూతల సైన్యం సహాయంగా రావటంలోని భావం, వారు ముస్లిములతో కలసి కత్తులు ఝుళిపించారని కాదు. ఇది ఒక విధమైన మానసిక తోడ్పాటు. ఒకవైపు ముస్లింలో మనో స్థిమితం కలిగింది. మరోవంక శత్రు శిబిరంలో కలవరం సృష్టించడానికే (8:12) దైవదూతలు వచ్చేవారు. వారు ముస్లింల దృష్టికి శత్రుసేనల సంఖ్యను తగ్గించి చూపేవారు. శత్రువుల దృష్టికి ముస్లిం సైనిక బలగం చాలా ఎక్కువగా ఉన్నట్లు కనిపించేలా చేసేవారు (8:44).

ఉమర్ ఖలీఫాగా ఉన్నకాలంలో సాద్ బిన్ అబీ తకాస్ ఇస్లామీయ సైన్యాన్ని తీసుకుని ఖాద్సియాలో విడిది చేశారు. అక్కడ చాలా రోజులు విడిది చేయాల్సివచ్చింది. ఆహార పదార్థాల కొరత ఏర్పడింది. కొన్ని గొఱ్ఱెలు, ఆవులు లభిస్తాయేమో చూడమని సాద్ కొంతమందిని పంపించారు. మార్గమధ్యలో ఒక పారసీక వ్యక్తి కనిపించాడు. కాని గొఱ్ఱెలు ఎక్కడ దొరుకుతాయో తనకు తెలీదన్నాడు. చూడబోతే వాడు స్వయంగా గొఱ్ఱెల కాపరి. ముస్లిం సేనలు ఆ ప్రాంతంలో విడిది చేసి ఉన్నారని తెలుసుకుని తన పశువులను ఒక దట్టమైన అడవిలో దాచిపెట్టాడు. ఆ తరువాత జరిగిందేమిటో చరిత్ర మాటల్లోనే వినండి :

పశువుల కాపరి అబద్ధం చెబుతున్నాడు. మేమిక్కడే ఈ అడవిలో ఉన్నాము అని ఒక ఎద్దు అరిచింది.

ఆ అరుపు వినగానే వాళ్లు అడవిలో జొరబడ్డారు. కొన్ని పశువులను తోలుకుని ఆ కాపరి వద్దకు వచ్చారు. ఈ సంగతి తెలియగానే ముస్లిం సైనికులు అమితంగా సంతోషించారు. దాన్ని దేవుని స్పష్టమైన సహాయంగా తలపోశారు. కాని చరిత్రకారుడైన ఇబ్నుల్ తఖ్తఖీ ఏమంటాడంటే "మేమిక్కడున్నాం" అని ఎద్దు అరబీ భాషలో అరవలేదు. అది సాధారణంగా అంబా అని మాత్రమే అరచింది. ఆ అరుపునుబట్టిఅక్కడ పశువులు ఉన్నాయని ముస్లింలు పసిగట్టగలిగారు (అల్ ఫఖరి పేజి 84).

## దైవంపై భారం :

"శత్రువు గనక సంధి వైపుకు మొగ్గుచూపితే మీరు కూడా సంధి పట్ల సుముఖత చూపండి మరియు అల్లాహ్‌పై భారం మోపండి. నిస్సందేహంగా ఆయన బాగా వినేవాడు. సర్వం ఎరిగినవాడు. ఒకవేళ వారు మీకు మోసం చేయగోరితే మీకొరకు అల్లాహ్‌యే చాలు (8:61-62)" ఖుర్‌ఆన్ యొక్క ఈ ఆదేశం ఇస్లామీయ ప్రణాళికకు తార్కాణం. ఇస్లామీయ విధానం వాస్తవానికి కల్లాకపటానికి తావీయని విధానం. ప్రత్యర్థి తరపునుంచి దగా జరిగే అనుమానం ఉన్నప్పటికీ ముస్లింలు దైవంపై భరోసాతో సంధి సంప్రదింపుల కోసం సిద్ధంగా ఉండాలి.

ఆ ఆదేశంలోని ప్రధానాంశం ఏమిటంటే, ఇతరులతో పోట్లాటలకు, కొట్లాటలకు తావులేని కార్యక్షేత్రాన్ని ఎన్నుకోండి అక్కడ మీ శక్తియుక్తుల్ని ధారబోయండి. ఇక ఇతర కార్యక్షేత్రాలలో ప్రకృతి (దైవతోడ్పాడుతో కూడిన) శక్తులు సన్నద్ధం అయ్యేందుకు అవకాశం కల్పించండి. యదార్థానికి రెండు వర్గాలు లేక ఇద్దరు వ్యక్తులు ఢీకొన్నా అక్కడ అత్యంత శక్తిశాలి అయినవాడు ఒకడుంటాడు. అతడే సర్వలోక ప్రభువు. మనం గనక మన శక్తులను సంభవమైన కార్యరంగాలకు మాత్రమే పరిమితం చేస్తే మిగిలిన క్షేత్రంలో మనకొరకు అల్లాహ్ చాలు. మిగతాసంగతి ఆయనే చూసుకుంటాడు. మనకు చేతనైన కార్యరంగాన్ని వదలిపెట్టి ఇతరుల కార్యక్షేత్రంలోకి ఉరకటం అంటే దేవుని కార్యక్షేత్రం నుండి మన పనిని మొదలెట్టడమేనన్న మాట! ఇలాంటి ఆరంభ శూరత్వం దైవాగ్రహాన్ని మరింత రెచ్చగొడుతుంది.

# మక్కాలో ప్రవక్త

దైవప్రవక్తగా ముహమ్మద్ కాలంలో రెండు ముఖ్య దశలున్నాయి. వాటిలో ఒకటి మక్కా యుగంగాను, మరొకటి మదీనా యుగంగాను పిలువబడతాయి. మక్కా మదీనాలు రెండు పట్టణాల పేర్లు. నిఘంటువులు తెరచిచూసినా ఈ రెండు పదాలకు లభించే అర్థాలు

ఇవే. కాని చరిత్రలో కొన్ని పదాలు కొన్ని సరికొత్త అర్థాలు సంతరించుకుంటాయి. మక్కా మదీనాల విషయంలోనూ అదే జరిగింది. మొదటి అర్థంలో తీసుకుంటే ఇవి రెండూ రెండు నగరాల పేర్లే. కాని చారిత్రకంగా అవి ఇస్లామీయ ప్రక్రియలో రెండు ప్రధాన ఘట్టాలుగా, ముఖ్య కోణాలుగా మారిపోయాయి. మక్కా సందేశ ప్రధానమైన కృషికి తార్కాణం కాగా మదీనా నైతిక విప్లవానికి ప్రతీకగా నిలిచింది. మక్కా యుగం ఇస్లాంను ఒక సందేశ శక్తిగా ముందుకు తీసుకురాగా మదీనా యుగం దానికి ఆధిక్యతను చేకూర్చింది. దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడింది.

"ముహమ్మద్ దైవప్రవక్త. ఆయన సహచర్యంలో ఉన్నవారు అవిశ్వాసుల పాలిట కఠినులు. ఒండొకరియెడల మాత్రం దయార్ద్ర హృదయులు. వారు రుకూ మరియు సజ్దాలతో ఉండటాన్ని మీరు చూస్తారు. వారు దైవ కృపను అన్వేషిస్తారు. సజ్దాల మూలంగా వారి ముఖాలపై స్పష్టమైన చిహ్నాలు కనిపిస్తాయి. ఈ దృష్టాంతం వాళ్ల వద్ద తోరా గ్రంథంలో ఉంది. బైబిల్‌లో వున్న వీరి దృష్టాంతం ఏమిటంటే, ఒక చేను ఉంది. అది తొలుత మొలకెత్తింది. మరి ఆ మొలకకు బలం చేకూర్చింది. తరువాత అది లావెక్కింది. ఆపైన ఆది తన కాండంపై నిలదొక్కుకుంది. వ్యవసాయదారులకు అది ఆహ్లాదకరంగా పరిణమిస్తుంది. అవిశ్వాసులు ఉడుక్కునేలా చేసేందుకు గాను ఇలా జరుగుతుంది. ఎవరైతే విశ్వసించారో మరియు సదాచరణ చేశారో వారికొరకు అల్లాహ్ మన్నింపు మరియు గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు". (49:29)

పై వచనంలో ఇస్లాం ప్రవక్త ప్రత్యక్ష సహచరుల వ్యక్తిగత గుణగణాలు ప్రస్తావించబడ్డాయి. ఆ తరువాత బైబిల్ ఆధారంగా వారి సామాజిక క్రమవికాసాన్ని విశ్లేషించడం జరిగింది. అందులో మొదటిది మక్కాతో ముడిపడి ఉంది. రెండవ దశ మదీనాతో సంబంధం కలిగి ఉంది.

ఇస్లాం ప్రవక్త జీవిత చరిత్రను వ్రాయడానికి కలం చేపట్టిన వారిలో చాలామంది వర్ణనలకు, చమత్కారాలకు అధికప్రాముఖ్యం ఇచ్చారనిపిస్తోంది. ఆమె కడుపున ఒక అద్భుతమైన అబ్బాయి పుట్టాడనీ, అతను అద్వితీయమైన శక్తులతో యావత్తు అరేబియాను పాదాక్రాంతం చేసుకున్నాడని మనోహరమైన శైలిలో రచనలు చేశారు. ఈ విధంగా సీరత్ (ప్రవక్త జీవిత చరిత్ర) గ్రంథాలు చరిత్ర గ్రంథాలకన్నా అధికంగా మహిమలు మహత్యాలతో నిండిన గ్రంథాలుగా దర్శనమిస్తాయి. ఈ విషయంలో ప్రజల అభిరుచిని కూడా ఆసరాగా తీసుకోవటం జరిగింది. ఎక్కడైనా ఏదైనా నిజమైన సంఘటనలో మహిమాన్వితమైన కోణం

కనబడకపోతే తమ బుద్ధికందిన ఏదో ఒక మహిమాన్విత విషయాన్ని దాంతో జోడించి మనోరంజకంగా చిత్రీకరించడానికి ప్రయత్నించారు మన రచయితలు? ఉదాహరణకు సుహైబ్ మక్కానుండి మదీనాకు వలసపోయిన సంఘటననే తీసుకోండి. ఆయన మదీనాకు వెళు తుండగా కొంతమంది ఖురైషు యువకులు దారిలో అడ్డుకున్నారు. ఒకవేళ నా దగ్గరున్న ధనాన్ని మీకు ఇచ్చేస్తే మీరు నన్ను వదిలేస్తారా! అని సుహైబ్ ప్రశ్నించారు. 'వదిలేస్తామ'ని వాళ్లు బదులిచ్చారు. సుహైబ్ దగ్గర కొన్ని నవరసుల బంగారం ఉంది. దాన్ని ఆయన వాళ్లకిచ్చి మదీనా వెళ్ళిపోయారు. బైహఖీ ఉల్లేఖనంలో ఈ సంఘటన ఇలా ఉంది.

సుహైబ్ తెలియజేస్తున్నారు. దైవప్రవక్త నన్ను మదీనాలో చూచి, "ఓ అబూ యహ్యా! నువ్వు చేసిన ఈ వర్తకం చాలా ప్రయోజనకరమైంది" అని అన్నారు. "ఓ దైవ ప్రవక్త! నాకన్నా ముందు ఎవరూ మీవరకు రాలేదే! నిశ్చయంగా ఈవార్త (బంగారం ఇచ్చిన సంగతి) మీకు జిబ్రయీల్ (దైవదూత) ద్వారా చేరి ఉంటుంది" అని నేను చెప్పాను (అల్‌హాఖీ 5706).

కాని ఈ సంఘటననే వ్యాఖ్యాతలైన ఇబ్నె మర్దూవియ మరియు ఇబ్నె సాద్‌లు సంకలనం చేసినపుడు ఇలా చేశారు.

"నేను ఖురైషు ప్రజలకు నా సొమ్ము ఇచ్చేసి మక్కా నుండి బయలుదేరాను. కడకు మదీనా చేరుకున్నాను. ఈ సమాచారం దైవప్రవక్తకు చేరగా, "సుహైబ్ వర్తకం ప్రయోజనకరమైంది. సుహైబ్ వర్తకం ప్రయోజనకరమైంది" అని ఆయన పలికారు (అల్ అహదీసు అల్ ముక్తారా 79).

వాస్తవమేమిటంటే ఇస్లాం ప్రవక్త వారి జీవితమంతా ఒక నిరాడంబర వ్యక్తి జీవితం వంటిది. అందుకే ఆయన మన కొరకు ఆదర్శప్రాయులు. దారిలో వెళుతున్నప్పుడు ఒక సామాన్య మనిషికి తగిలే ఎదురుదెబ్బే ఆయనకూ తగిలింది (బుఖారి). ఆయన అందరిలాంటి ఒక మామూలు మనిషి అయినందువల్లనే ఆయనకు దైవవాణి అందుతుందన్న విషయాన్ని విశ్వసించడానికి తొల్దొలో ప్రేక్షకులు సందేహించారు.

"ఆయన బజారులో క్రయవిక్రయాలు చేస్తారు. మనలాగే ఆయన ఉపాధిని అన్వేషిస్తారు" (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 297).

యదార్థానికి దైవప్రవక్త జీవిత ఔన్నత్యం ఒక సామాన్య మానవజీవితాన్ని పోలి ఉండటంలోనే ఉందిగాని మంత్రతంత్రాల్లో, చమత్కారాలలో లేదు. దైవ సహాయానుసారం

ఆయనకు విజయం లభించింది. ఆవిధంగా అది నిశ్చయంగా ఒక మహిమే. ఈ దైవ సహాయం దైవప్రవక్త అయిన కారణంగా అందించబడినదే తప్ప ఆయన మహిమాన్విత శక్తుల ఆధారంగా మాత్రం కాదు.

దివ్య ఖుర్ఆన్ దైవ సందేశహరుని గురించి ఇవ్వబడిన దృక్పథాన్ని ముందుంచుకుని చూస్తే దైవ సందేశహరుని జీవితం తదనుగుణంగానే ఉందని బోధపడుతుంది.

## సందేశ ఆరంభం :

40 ఏళ్ల ప్రాయంలో ఆయనపై హిరా కొండ గుహలో తొట్ట తొలిసారిగా 'వహీ' (దైవవాణి) అవతరించినప్పుడు ఒక సామాన్య మనిషి నుంచి వ్యక్తమయ్యే ప్రతిస్పందనే ఆయన నుంచి వ్యక్తమైంది. ఆయన భయకంపితులైన స్థితిలో ఇంటికి వచ్చారు. ఇంట్లో ఆయన సతీమణి ఖదీజా ఉంది. ఆ సంఘటనను ఆమె అతీతురాలవటంచేత ఎలాంటి ఒత్తిడికి ఆస్కారం లేకుండా అభిప్రాయం ఏర్పరచుకునే అవకాశం ఆమెకు ఉంది. ఆమె ఇలా అభిప్రాయపడ్డారు.

"ముమ్మాటికీ కాదు... దైవసాక్షి! దేవుడు మిమ్మల్ని ఎన్నటికీ పరాభవం పాల్జేయడు. మీరు బంధువుల హక్కును నెరవేర్చేవారు. బలహీనుల బరువు మోసేవారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవారు. అతిథి మర్యాదలు చేసేవారు. ఆపద సమయాల్లో ప్రజలను ఆదుకునేవారు" (బుఖారి 8:3)

ఒక కొత్త ప్రదేశంలో సందేశ ప్రదాత అయిన ఒక వ్యక్తి ఏ క్రమంలో సహజంగా తన కృషిని కొనసాగించాలో అదే క్రమంలో ఆయన సందేశపరిచయ కార్యక్రమం మొదలవుతుంది. తొలుత రహస్యంగా పనిచేయవలసిన అవసరం ఉంది.

ఇబ్నె ఇస్హాఖ్ కథనం ప్రకారం అలీ ఇబ్నె అబీ తాలిబ్ ఆయన ఇంటికి విచ్చేశారు. ఆ సమయంలో ఆయన మరియు ఆయన సతీమణి ఖదీజా నమాజ్ చేస్తూ ఉన్నారు. "ఓ ముహమ్మద్! ఏమిటిది?" అని ఆయన అడిగారు. "ఇది దైవధర్మం. దీన్ని ఆయన తనకొరకు ఎన్నుకున్నాడు. దీని వ్యాప్తికై తన ప్రవక్తలను పంపించాడు. నేను నిన్ను అల్లాహ్ వైపుకు ఆహ్వానిస్తున్నాను. ఆయనకు సహవర్తులెవరూ లేరు. ఆయన్ని ఆరాధించమని కోర్తున్నాను. ఇంకా ఏమిటంటే, నువ్వు ఈ లాత్, ఉజ్జా దేవతలను విడనాడు" అని ఆయన ఉపదేశించారు. 'ఇంతకు ముందు ఎన్నడూ వినని కొత్త విషయం ఇప్పుడు వింటున్నాను. నాన్నగారైన అబూతాలిబ్‌ను సంప్రదించే వరకూ దీని గురించి ఒక నిర్ణయం తీసుకోలేను' అని అలీ

ఇబ్నె అబీతాలిబ్ సమాధానమిచ్చారు. ప్రకటనకు ముందే ఈ రహస్యం బహిర్గతమవటాన్ని ఆయన ఇష్టపడలేదు. "ఓ అలీ! నువ్వు ఇస్లాం స్వీకరించకపోతే పోనీ. కాని ఈ విషయాన్ని రహస్యంగానే ఉండనివ్వు" అని ఆయన సూచించారు. అలీ ఇబ్నె అబీతాలిబ్ ఆ రాత్రంతా ఆలోచిస్తూ ఉండిపోయారు. మరియు అల్లాహ్ ఆయన హృదయకవాటాలను ఇస్లాం కొరకు తెరిచాడు. మరునాడు ఉదయం ఆయన దైవప్రవక్త వద్దకు వచ్చి, "ఓ ముహమ్మద్! నిన్న మీరు నాతో చెప్పిందేమిటీ?" అని అడిగారు. "అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడని, ఆయన ఒక్కడేనని, ఆయనకు సహవర్తులెవరూ లేరని, లాత్ ఉజ్జాలను నమ్మబోనని, ఎవరెవరినైతే దైవానికి సాటి కల్పించటం జరుగుతోందో వాటినుంచి ముఖం త్రిప్పుకుంటానని సాక్ష్యం ఇవ్వు" అన్నారాయన. అలీ దీనిని శిరసావహించారు. ఇస్లాం స్వీకరించారు. ఆ తరువాత అబూతాలిబ్ భయంవల్ల ప్రవక్త దగ్గరకు రహస్యంగా వస్తూ ఉండేవారు. మొదట్లో అలీ తన ఇస్లాంను బహిర్గతం చెయ్యకుండా రహస్యంగానే ఉంచారు.

ఔస్ మరియు ఖజ్‌రజ్ తెగలకు చెందిన తొలి ముస్లింలు యస్రిబ్ (మదీనా)కు వాపసు అయినప్పుడు వారు కూడా సత్యధర్మాన్ని తమ గుండెల్లోనే దాచుకుని అత్యంత రహస్యంగా సందేశ పరిచయ కార్యక్రమం నిర్వహించేవారు (అల్‌మోజమ్‌మే అల్‌కబీర్ హదీసు 849).

ఏదైనా విషయంలో దానికి సంబంధించిన అన్ని హంగులు, శక్తులు సమకూరే వరకూ చర్యకు ఉపక్రమించరాదన్న సూత్రాన్ని ఆయన తన జీవితంలో తూచా తప్పకుండా పాటించారు. ఆయిషా ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్తకు 38 మంది సహచరులు సమకూరిన మీదట, 'ప్రకటన' గావించమని అబూబకర్ సలహా ఇచ్చారు. అంటే ఇక తామంతా ప్రజా బాహుళ్యంలోనికి వచ్చి బహిరంగంగా ప్రచారం చేద్దామని చెప్పారు. దానికి ప్రవక్త, "ఓ అబూబకర్! ఇప్పటికీ మేము కొద్దిమందిమే ఉన్నాం" అని జవాబిచ్చారు. ఈ విధంగా దైవదౌత్యం లభించిన 6వ సంవత్సరంలో ఉమర్ ఇస్లాం స్వీకరించిన దరిమిలా "ఓ దైవ ప్రవక్తా! మనం సత్యంపై ఉండగా మన ధర్మాన్ని చాటుమాటుగా ఆచరించాల్సిన పనేముంది? ఇతరులు అసత్యంపై ఉండి కూడా తమ మతాచారాలను బహిరంగంగా నిర్వర్తిస్తుంటే మనకెందుకింక సంకోచం?" అని ప్రాధేయపడగా ప్రవక్త మళ్ళీ అదే సమాధానమిచ్చారు – (ఓ ఉమర్! మనమిప్పుడు కొద్దిమందిమే అని). హిజ్రత్ చేసిన మీదట ఇస్లాం శక్తి ఒకచోట సమకూరే దాకా ఆయన ఈ విధానాన్నే అనుసరించారు. ఖురైషులు ఇస్లాం శక్తిని తుద ముట్టించడానికి కంకణం కట్టుకుని దండెత్తి వచ్చినప్పుడు మాత్రమే శత్రువును ఎదిరించడానికి

అనుమతి లభించింది. బద్ర్ మైదానంలో ఆయన సహచరులు ఇస్లాం శత్రువులను ఎదుర్కొనబోతుండగా ఆయన ఇలా అన్నారు, "ముస్లిములు తమ చర్య ద్వారా ఇస్లాంకు ఓ మలుపును ఇవ్వగలిగినంత శక్తిని కూడదీసుకున్నప్పుడు మాత్రమే వారు చర్యకు సమాయత్తం కావాలి. అంతకు ముందు చర్యగైకొనడం సమ్మతం కాదు.

ఉల్లేఖనాల ద్వారా తెలిసేదేమిటంటే ఆయనపై సందేశ బాధ్యతలు మోపబడినపుడు ఇది చాలా పెద్ద కార్యమనీ, దీని కొరకు మనిషి నిలువెల్లా తనను సమర్పించుకోవలసి ఉంటుందని ఆయన భావించారు. తన కుటుంబీకులు తన ఆర్థిక బాధ్యతలను స్వీకరిస్తే తానీ కార్యాన్ని ఏకాగ్రతతో నిర్వహించవచ్చునని ఆశించారాయన. ఆయన అబ్దుల్ ముత్తలిబ్ వంశీయులను తన ఇంటికి ఆహ్వానించారు. ఆహుతులూ సుమారు 40 మంది దాకా ఉన్నారు. వేరొక ఉల్లేఖనంలో 30 మంది అని ఉంది. "దేవుడు నన్ను ప్రవక్త పదవిలో నియమించాడు. మీరంతా నాకు తోడ్పాటునందిస్తే నేనీ బాధ్యతను సవ్యంగా నిర్వర్తించ గలుగుతాను" అని విన్నవించుకున్నారు.

"ఓ అబ్దుల్ ముత్తలిబ్ వంశీయులారా! నేను మీవైపుకు ప్రత్యేకంగానూ, సమస్త మానవాళివైపుకు సర్వసామాన్యంగానూ పంపబడ్డాను. మరి మీలో నాకు సోదరునిగా, సహచరునిగా ఉంటానని ప్రతిజ్ఞ చేసేవారెవరు? మీలో ఎవరు నా రుణాలకు, వాగ్దానాలకు సంబంధించి జామీనుగా ఉంటారు! ఎవరు నా వెనుక నా కుటుంబీకుల బాధ్యత తీసుకుంటారు? ఎవరు దీనికి అంగీకరిస్తారో వారు స్వర్గంలో నాతో పాటు ఉంటారు". వారిలో ఒకడు లేచి "ఓ ముహమ్మద్! మీరొక సముద్రమాయె. ఈ బాధ్యతను మోయడానికి ఎవరు సిద్ధమవుతారు?" అన్నాడు (అహ్మద్ 883).

ఆయన వంశీయులు ఆయన బాధ్యతలను తీసుకోవటానికి సంసిద్ధం కాలేదు. అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ స్వయానా ఆయన పినతండ్రే. ఆయన స్థితిమంతుడు కూడాను. తలచుకుంటే ఆయన ఆర్థిక బాధ్యతను తీసుకోగలిగేవారు. కాని ఆయన కూడా మౌనం వహించారు (అస్సీర అన్ నబవియ్య సంపుటి 1, పేజీ 460). అయితే అల్లాహ్ ఆయనకు తోడ్పడ్డాడు. తొలుత ఆయన సతీమణి అయిన ఖదీజా సంపద, ఆ తరువాత అబూబకర్ సిద్దీఖ్ సొమ్ము మక్కా జీవితంలో ఆయన ఆర్థిక ఇబ్బందులను చాలావరకు తీర్చాయి.

ప్రజలకు సత్య ధర్మాన్ని పరిచయం చేసే విషయంలో ఆయన చిన్నపిల్లాడిలా తహతహలాడేవారు. ఇబ్నె జరీర్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ నుండి నకలుచేసిన దాని ప్రకారం

ఒకరోజు మక్కాలోని సర్దారులు పొద్దుగూకిన తరువాత కాబా సమీపంలో సమావేశమై దైవ ప్రవక్తను చర్చలకై పిలిపించారు. ఆ తరువాత ఆ ఉల్లేఖనంలోని వాక్యాలు ఇలా ఉన్నాయి.

"అంతే. దైవప్రవక్త వడివడిగా వచ్చారు. బహుశా వాళ్లు సత్య స్వీకారం పట్ల ఆసక్తి చూపుతున్నారేమోనని ఆయన ఊహించారు. ఖురైషులకు సన్మార్గం లభించాలన్న ఆశ ఆయనలో అమితంగా ఉండేది. వాళ్లు పాడైపోవటం ఆయనకెంతో బాధకలిగించేది" (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 295).

అయితే పిలిచేవారు ఆయన సందేశాన్ని స్వీకరించేందుకు గాక వాదోపవాదాల కోసం మాత్రమే పిలిచారు. సుదీర్ఘమైన చర్చల అనంతరం ఆయన దుఃఖవదనులై ఇంటికి మరలారు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 298).

"దైవ ప్రవక్త – బాధతో, దుఃఖంతో తమ ఇంటికి వచ్చారు. ఎందుకంటే ఆయన తన వాళ్ల దగ్గరకు ఏ ఆశతో వెళ్లారో అది ప్రాప్తించలేదు. ఆ ప్రజలు దానికి బహుదూరంగా ఉండిపోయారు".

అలాగే అబూతాలిబ్ మరణశయ్యపై ఉన్నప్పుడు పరామర్శించడానికి వచ్చిన వారినుద్దేశ్యించి, "నాకు – నా భ్రాతృజునికి మధ్య నేను చావకముందే ఏదో ఒక తీర్పు చేయండి" అని కోరారు అబూతాలిబ్. తరువాత ఆయన దైవప్రవక్తను పిలిపించి, "నువ్వు నీ జాతివారి నుండి ఆశించేదేమిటో చెప్పు నాయనా!" అన్నారు. దానికి ఆయన నేను వారితో కోరేదేమిటంటే అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని మరియు వేటినైతే మీరు ఆరాధిస్తున్నారో వాటిని విడిచిపెట్టాలని (అరబి పె–118) చెప్పారు. కాని జాతివారు అందుకు సిద్ధంగా లేరు. పరామర్శించడానికి వచ్చినవారు వెళ్ళిపోయిన తరువాత అబూతాలిబ్ తన భ్రాతృజుని ఉద్దేశ్యించి, "నాయనా! దైవసాక్షి! నువ్వు నీ జాతి నుండి అసాధ్యమైనదేదీ ఆశించలేదని నా అభిప్రాయం" అన్నారు. అబూతాలిబ్ అభిప్రాయం విన్న తర్వాత ప్రవక్తలో ఆశలు చిగురించాయి.

ఉల్లేఖకులు ఇలా అంటున్నారు. ఇది వినగానే అబూతాలిబ్ పట్ల దైవప్రవక్తలో ఆశలు చిగురించాయి. ఆయన ఇలా ప్రాధేయపడసాగారు – "బాబాయి! మరి మీరు ఈ కలిమా (సద్వచనాన్ని)ను పలకండి. ప్రళయదినాన మీ కొరకు నేను సిఫార్సుచేయడం ధర్మ సమ్మత మవుతుంది" (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 418).

ఆయన ఆహూతుని (ప్రేక్షకుని) తరపున వ్యక్తమయ్యే కోపతాపాలను, అయిష్టతను

ఆఖరిక్షణం వరకూ సహిస్తుండేవారు. మక్కా విజయానంతరం హింద అనే మహిళ ఇస్లాం స్వీకరించడానికి ఆయన సమక్షంలో వచ్చింది. ఆ సమయంలో ఆమె బైత్ (ప్రతిజ్ఞ) చేసింది. ఆనవాయితీగా ప్రవక్త చెప్పే మాటనల్లా ప్రతిజ్ఞ చేసేవ్యక్తి చెప్పాలి. "నువ్వు నీ సంతానాన్ని హతమార్చబోనని చెప్పు" అని ప్రవక్త అనగానే హింద ఇలా అన్నది!

"సంతానాన్ని హతమార్చడానికి మీరసలు మా సంతానాన్ని ఉండనిస్తేగా!" అని రోషంతో చెప్పింది (ముస్నద్ అబియాలా హదీసు 4754).

కాని ప్రవక్త ఆమె సూటిపోటి మాటను సీరియస్‌గా తీసుకోకుండా ప్రతిజ్ఞ పనిని ముగించారు.

దైవమార్గంలో ఆయన కేవలం తన కాలాన్ని శారీరక మానసిక శక్తులను మాత్రమే గాక తన ఆస్తిపాస్తులన్నింటినీ అర్పించారు. ప్రవక్త పదవి లభించకముందు ఆయన ఒక ధనికురాలైన మహిళను వివాహమాడటం వల్ల శ్రీమంతులుగా పరిగణించబడేవారు. మక్కాలో ఉన్నకాలంలో ఒకసారి ఖురైషు సర్దారులు ఉతబాబిన్ రబీయను తమ ప్రతినిధిగా చేసి చర్చలకోసం ఆయన వద్దకు పంపించారు. కాని చర్చలకని వచ్చిన ఉతబా ఆయన సందేశం విని ప్రభావితుడైపోయాడు.

ఆ తరువాత ఇంట్లోనే ఉండిపోయాడు. వాళ్ల దగ్గరికి వెళ్లలేదు. అబూజహల్ అన్నాడు, "ఓ ఖురైషు సోదరులారా! దైవసాక్షి! ఉతబా ముహమ్మద్ మాటల్లోపడిపోయాడని నా అనుమానం. వాడికి ముహమ్మద్ పెట్టిన కమ్మని భోజనం నచ్చి ఉంటుంది. తప్పనిసరిగా వాడు ఏదో అవసరంపైనే అలా చేసి ఉంటాడు. పదండి, మనం ఉతబా వద్దకు పోదాం". వాళ్లందరూ కలసి అతని దగ్గరకెళ్ళారు. "ఓ ఉతబా! దైవసాక్షి. నువ్వు ముహమ్మద్ వైపుకు ఎక్కడ మొగ్గిపోయి ఉంటావోనన్న అనుమానంతో నీ వద్దకు వచ్చాము. బహుశా ఆయన వ్యవహారం ఏదో నీకు నచ్చి ఉంటుంది. ఒకవేళ నీవు కోరితే నీకోసం బోలెడంత మొత్తం జమచేసి ముహమ్మద్‌పై ఆధారపడకుండా ఉండేలా చేస్తాం చెప్పు" అన్నాడు అబూజహల్. ఇది విని ఉతాబాలో ఉక్రోషం ఉప్పొంగింది. తాను ఇక ఎన్నడూ ముహమ్మద్‌తో మాట్లాడనని ప్రమాణం చేసి చెప్పాడు (అల్‌బిదాయ వఅల్ నిహాయ సంపుటి 3, పేజీ 80).

ఇలాంటిదే మరో సంఘటన – అబ్దుల్లా బిన్ అనస్ కథనం ప్రకారం వలీద్ బిన్ ముగైరా ఆయన వద్దకు వచ్చాడు. ఆయన అతనికి ఖుర్‌ఆన్ వినిపించారు. ఖుర్‌ఆన్ సాహిత్యశైలి అతన్ని ఎంతగానో ప్రభావితుణ్ణి చేసింది. ఈ సంగతి తెలుసుకున్న అబూజహల్ వలీద్ బిన్

ముగైరా వద్దకెళ్ళాడు. "నువ్వు ముహమ్మద్ సొమ్ముపై ఆశపడుతున్నావేమోనన్న ఉద్దేశ్యంతో మనవాళ్లు నీకొరకు చందాలు వసూలు చేయాలనుకుంటున్నారు" అని చురక అంటించాడు అబూజహల్.

చెప్పవచ్చిందేమిటంటే ఆయన ప్రవక్త పదవిలో నియుక్తుడయ్యే నాటికి ఆయన ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉండేది మరి. కాని దైవదౌత్యం లభించిన 13వ ఏట ఆయన మదీనా వైపుకు వలస పోయేనాటికి ఆయన వద్ద ఏమీ మిగల్లేదు. ఆఖరికి ఆయన అబూబకర్ దగ్గర అప్పు తీసుకుని ప్రయాణ సామాగ్రిని సమకూర్చుకోవలసి వచ్చింది.

## సందేశ పరిభాష :

ఇస్లామీయ సందేశ ప్రచారానికి సంబంధించిన మౌలిక సూత్రాలెన్నో తార్కిక పరంగా ఎంతో నిర్ణీతంగా ఉన్నాయి. ప్రాధాన్యత రీతిగా వాటిలో ఏ ఒక్కటీ మరో దానికి తీసిపోదు. కాని సందేశ పలుకులు సందేశ ప్రదాత నోట వెలువడినప్పుడు వాటిలో మరో విషయము కూడా లీనమైపోతుంది. అదే అతని వ్యక్తిత్వం. అది సందేశాన్ని ఒక నిర్ణీత అంశంగా, రికార్డెడ్ సబ్జెక్టుగా మాత్రమేగాక అదోక సజీవ ఆచరణగా పరిణమిస్తుంది. వాస్తవికత రీత్యా అది ఏకాంశం అయినప్పటికీ లెక్కలేనన్ని రూపాల్లో అది ప్రస్ఫుటంగా సాగుతుంది. దీనికి ఒక నిర్ణీత పట్టిక (ఆర్డర్) చార్ట్ ఉండదు కాని సందేశ ప్రదాత గుండెల్లో దైవభీతితో కనిపించే హృదయం, దైవదాసులను దైవసన్నిధికి చేర్చితే దేవుడు తనపట్ల ప్రసన్నుడవుతాడనే తపన – ఇవి సందేశ వచనాలలో అనిర్వచనీయమైన అనుభూతులను సృజించడమేగాక అత్యంత ప్రమాణబద్ధమైన పలుకులుగా కూడా చేస్తాయి. ఎందుకంటే ఎలాగైనా ఆహుతులను సంతృప్తి పరచాలన్న అతనిలోని తహతహ అతని వివేచనను ఎల్లప్పుడూ జాగరూకపరచి ఉంటుంది. శ్రోత నాడిని పసిగట్టి అతను ఎప్పటికప్పుడు సడలింపుల వైఖరిని అవలంభిస్తూ పోతాడు. ఇస్లాం ప్రవక్త జీవితంలో ప్రతివిషయం మేము సంపూర్ణంగా చూడగలము. తన రేయింబవళ్ళూ సందేశం అందించే విషయంలో నిమగ్నమై ఉండేవారు. కాని ప్రవక్త వారి విధానం కొన్ని నిర్ణీత పదాలు మరియు అంశాలు ప్రతిఒక్కరి దగ్గర రిపీట్ చెయ్యడం వంటిది కాదు. శ్రోత ఐక్యూ లెవల్ పరంగా తమ మాటను ఆచితూచి పెట్టేవారు.

మక్కాలో వుండగా ఒకసారి ఆయన అబూసుఫ్యాన్‌ను, అతని భార్య హిందను భోజనానికి ఆహ్వానించారు. ఇబ్నె అసాకర్ ఉల్లేఖనం ప్రకారం ఆయన ఇలా పలికారు.

"ఓ అబూసుఫ్యాన్! ఓ హింద! దైవసాక్షి. మీరు తప్పకుండా మరణించనున్నారు.

ఆ తరువాత మీరు తప్పక లేవబడతారు. మరెవరు మేలైనవారో వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. మరెవరు దుర్మార్గులో వారు నరకంలోకి నెట్టబడతారు. నేను చెప్పేదేదో సత్యబద్ధంగా చెబుతున్నాను" (అల్‌మోజమ్ అల్ అన్‌సీరత్ హదీసు 6615).

మక్కాకు చెందిన ఒక వయోవృద్ధుడు – హుసైన్‌తో ఆయన సంభాషణ ఇలా జరిగింది.

దైవప్రవక్త ప్రశ్నించారు. 'ఓ హుసైన్! ఎంతమంది దైవాలను కొలుస్తారు?'

'భూమిలో ఏడుగురిని, ఆకాశాన ఉన్న ఒక దైవాన్ని పూజిస్తాను' అని హుసైన్ బదులిచ్చాడు. "ఆపద వచ్చినప్పుడు ఎవరిని మొరపెట్టుకుంటారు?" అని మహాప్రవక్త అడగ్గా 'ఆకాశాన ఉన్న దేవుణ్ణి' అని హుసైన్ జవాబిచ్చాడు. "ఆస్తిపాస్తులకు నష్టం వాటిల్లుతున్నప్పుడు ఎవరిని పిలుస్తారు?" అని దైవప్రవక్త ప్రశ్నించగా 'ఆకాశాన ఉన్నవాడిని' అని హుసైన్ సమాధానమిచ్చాడు. అప్పుడు ప్రవక్త ఇలా అన్నారు. "ఆ అల్లాహ్ ఒక్కడే మీ ఫిర్యాదులను వింటున్నాడు. కాగా మీరేమో అతనికి సహవర్తుల్ని కల్పిస్తున్నారు!" (అల్‌తౌహీద్ ఇబ్నె హుజైమా సంపుటి 1, పేజీ 277).

అబూ ఉమామ నుండి ఇమామ్ అహ్మద్ చేసిన సంకలనం ప్రకారం ఒక తెగకు చెందిన వ్యక్తి ఆయన సన్నిధికి వచ్చి. 'దేవుడు మీకు ఏమిచ్చి పంపాడు?' అని ప్రశ్నించగా ఆయన ఇలా చెప్పారు.

"బంధువుల హక్కు నెరవేర్చమనీ, అన్యాయంగా ఎవరినీ హతమార్చరాదని, రహదారుల్లో శాంతిభద్రతలను కల్పించమనీ, విగ్రహాలను కూల్చివేయమని, కేవలం ఒకేదైవాన్ని సేవించమనీ, ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించరాదని (చెప్పి పంపాడు)" (ముస్నద్ అహ్మద్ 17016).

మదీనా వెళ్ళిన తరువాత ఆయన నజరాన్ వాసులనుద్దేశించి ఒక లేఖ వ్రాశారు. అందులో ఇలా వ్రాశారు.

"నేను మిమ్మల్ని దాసుల దాస్యం నుండి దేవుని దాస్యం వైపుకు ఆహ్వానిస్తున్నాను. దాసుల పూచీ నుండి దేవుని పూచీ వైపుకు పిలుస్తున్నాను" (అల్‌బిదాయ సంపుటి 5, పేజీ 53).

ఆయన సందేశ ప్రచారానికి ముఖ్య సాధనం దివ్య ఖుర్‌ఆన్. ఎప్పుడు ఏ వ్యక్తి తారసపడినా ఖుర్‌ఆన్‌లోని ఒక భాగాన్ని ఆయన వినిపించేవారు. ఉల్లేఖనాలతో తరచూ

ఇలాంటి మాటలు వినిపిస్తారు. తరువాత ఇస్లాం గురించి ప్రస్తావించారు మరియు ఖుర్ఆన్ బోధించారు (అహ్మద్ 23619) మరియు వాళ్ళ దగ్గర ఇస్లాం వివరించారు మరియు ఖుర్ఆన్ భోదించారు (అల్‌తబ్‌హత్ అల్ ఖుబ్రా సంపుటి 1, పేజీ 170). దివ్య ఖుర్ఆన్‌లోని ఆకర్షణా శక్తి అరబ్బులను ఆశ్చర్యంలో ముంచెత్తేది. బద్ధ విరోధులు సైతం రాత్రిపూట చాటుమాటుగా ఆయన ఇంటికి దగ్గరగా వచ్చి, ఆయన ఖుర్ఆన్ పారాయణం చేస్తుండగా విని తరించేవారు. ఖుర్ఆన్‌లోని ఆకర్షణాశైలి అరబ్బులను మంత్రముగ్దుల్ని చేసేది. వలీద్ బిన్ ముగైరా ఖురైషుల ప్రతినిధిగా ఆయన వద్దకు వచ్చినప్పుడు ఆయన ఖుర్ఆన్‌లోని కొన్ని భాగాలను అతనికి చదివి వినిపించారు. దానికి అతను ఎంతగా ప్రభావితుడయ్యాడంటే, ఖురైషుల వద్దకు తిరిగి వెళ్ళి అదెంతో ఉన్నతమైన వాక్కు అనీ, దానిముందు ఇతరత్రా బోధనలన్నీ దిగదుడుపు అని చెప్పేశాడు (షాబుల్ ఇమాన్ హదీసు 133). ఇస్లాం వ్యాప్తికై ఖుర్ఆన్‌ను వినిపించటం ఆకాలంలో ఒక సర్వసాధారణ విధానం అయిపోయింది. యుస్ ఆబ్ బిన్ ఉమైర్ ఒక సందేశ ప్రచారకుడుగా మదీనా పంపబడినప్పుడు ఆయన ప్రజలతో తరచూ సంభాషించటం, మరియు ఖుర్ఆన్ గాథలు వినిపించటం అలవాటుగా చేసుకున్నారు. ఖుర్ఆన్ వినిపిస్తున్న కారణంగా అందరూ ఆయన్ని 'ముఖ్రీ' (పఠిత)గా వ్యవహరించేవారు (అల్‌మోజమే అల్‌కబీర్ 849).

మక్కాలో ఆయన సందేశపరిచయ కార్యం అత్యంత చిత్తశుద్ధితో, పాండిత్య ధోరణిలో జరుగుతూ ఉండేది. కాగా, మరోవైపు వైరివర్గంలో నీలాపనిందలు, పసలేని ఆరోపణలు తప్ప మరొకటి ఉండేవి కావు. ముహమ్మద్‌కు సమాధానం ఇవ్వడానికి ముహమ్మద్ శత్రు శిభిరంలో బలమైన అస్త్రం ఏదీలేదని మక్కాలోని ఆలోచనా పరులు చెప్పుకునేవారు కూడా. మక్కాకు చెందిన మర్యాదస్తులు, కులీనులు ఒక ప్రత్యేక సమావేశంలో ఆయన్ని పిలిపించి చర్చలు జరపాలని నిర్ణయించారంటే దానికి కారణం తమ జాతి ప్రజల మంకుపట్టుకు బాధ్యులు తాముకాదని చాటడానికే (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 295).

## అరబ్బుల దక్షత (Ability) :

ఏ సందేశ ప్రాచుర్యమైనా ఆ సందేశంలోని సత్యబద్ధతపై, సందేశ ప్రదాత శ్రమపై కేవలం ఆధారపడి ఉండదు. ఇంకా అది ఆహూతుల శ్రోత స్థితిగతులపై కూడా ఆధారభూతమై ఉంటుంది. అరబ్బు భూభాగంలో ప్రోగుచేయబడివున్న మానవీయ శక్తి ఈ రకంగా చూసినపుడూ ఎంతోవిలువైందని చెప్పాలి. బాహ్యపరమైనదాని అజ్ఞానం మరియు సంగఠితత్వం

వెనుక ప్రాకృతికమైన నిరాడంబరత చెక్కుచెదరకుండా ఉంది. 30 లక్షల కిలోమీటర్ల వైశాల్యం గల ఉష్ణోగ్రతా ప్రాంతం ఉన్నతమైన మానవీయ విలువలను తనలో నిబిడీకృతం చేసుకుని ఉండింది. ఒక అరబ్బు ఆర్థికంగా – తన జరుగుబాటుకు ఆధారమైన ఒక ఒంటెను 'జిబహ్' చేసి అతిథులకు మనస్ఫూర్తిగా విందు చేసేవాడు. ఎడారిలో ఒక పీడిత వ్యక్తి పరుగెత్తుకు వచ్చి అరబ్బు గుడారంలో శరణు కోరితే అతని రక్షణకోసం ఖడ్గం పుచ్చుకుని గుడారం బయట కాపలా కాసేవాడు. శత్రువులు వచ్చి ఆ వ్యక్తిని లాక్కుపోవాలంటే ఆ కాపరిని హతమార్చినపుడే సాధ్యమయ్యేది. ఆఖరికి బందిపోటు దొంగలు ఏదేని తెగ స్త్రీల ఖరీదైన దుస్తుల్ని, నగలను దోచుకోదలిస్తే వారు ఆస్త్రీలను నగ్నం చేయటంగాని, వారిని ముట్టుకోవటం గాని చేసేవారు కాదు. మీ నగలు మాకిచ్చేసేయండి అని స్త్రీలను ఆదేశించేవారంతే. స్త్రీలు నగలను తీసి దుస్తులు విడుస్తున్నప్పుడు బందిపోట్లు తమముఖాలను త్రిప్పుకునేవారు.

అరబ్బు (సంచారకులు) మరి అమాయకులని, మొద్దులని అనుకోవటం సరైందికాదు. నిజానికి వాళ్లు, చైతన్యం గలవారు. చాలా తొందరగా మాటల లోతుల్లోకి పోగలిగేవారు.

ఒక తెగకు చెందిన ఏడుగురు నవ ముస్లింలు ప్రవక్త దగ్గరకు వచ్చారు. వాళ్లు ఇలా అన్నారు. "మేము అజ్ఞాన కాలంనుండి ఐదు విలువలు పుణికిపుచ్చుకున్నాము. మీరు వాదించకుండా ఉన్నంతకాలం మేము వాటిని అంటిపెట్టుకుని ఉండగోర్తున్నాం".

"మీరు అజ్ఞానకాలం నుండి నేర్చుకున్న ఆ విషయాలేమిటి?" అని ఆయన దర్యాప్తు చేయగా, వాళ్లు ఇలా బదులిచ్చారు. "కలిమిలో కృతజ్ఞులై ఉండటం, కష్టాల్లో ఓర్పువహించటం, ప్రతిఘటన సమయంలో సత్యమంతులుగా నిరూపించుకోవటం, విధి (అదృష్టం) వ్రాతపై రాజీపడటం, ఒకరు కష్టాల్లో ఉంటే – అతడు శత్రువైనాసరే – సంతోషపడకుండా ఉండటం". ఇది విని దైవప్రవక్త, "వీరు పండితులు, సంస్కారవంతుల్లా ఉన్నారు. ప్రవక్తల్లో ఉండే గొప్పతనం వీరిలో కనిపిస్తుంది. వీరి మాటలు ఎంత ఉత్తమమైనవి! మరియు ఎంతో పుణ్యంతో కూడుకున్నది!" అని ప్రశంసించారు (అల్‌జుహార్ అల్ కభీర్ హదీసు 970)

'జమాద్' అనే వ్యక్తి ఉండేవాడు. అతడు అజ్దషనూ తెగకు చెందినవాడు. భూతవైద్యం చేసేవాడు. అతనొకసారి మక్కా వచ్చాడు. ప్రవక్తకు ఏదో గాలిసోకిందని కొంతమంది చెప్పగా ఆ వ్యక్తి ఆయన్ని కలుసుకున్నాడు – ఆయనకు వైద్యం చేద్దామన్న ఉద్దేశ్యంతో కాని అతడు ఆయన మాటల్ని విన్న మీదట ఇలా అభిప్రాయపడ్డాడు. "దైవసాక్షి! నేను జ్యోతిష్యుల మాటలు విన్నాను. మాంత్రికుల మాటలు విన్నాను. కవుల కవిత్వం చూసాను. కాని ఇలాంటి వచనాలు

ఎన్నడూ వినలేదు. ఏదీ, మీ చేయిచాపండి, మీపై నా విశ్వాసాన్ని ప్రకటిస్తూ ప్రతిజ్ఞ చేస్తాను" అన్నాడు. అలవాటు ప్రకారం ఇస్లాం ప్రవక్త ఈ సందర్భంగా సుధీర్ఘ ఉపన్యాసమేమీ ఇవ్వలేదు. 'ముస్లిం' ఉల్లేఖనానుసారం సంక్షిప్తంగా ఇలా అన్నారు.

"ప్రశంసలన్నీ అల్లాహ్ కొరకే. నేను ఆయన్నే కొనియాడుతున్నాను. సహాయం కొరకు ఆయన్నే అర్థిస్తున్నాను. అల్లాహ్ మార్గం చూపిన వారిని ఎవరూ పెడదారి పట్టించలేరు. మరి ఆయన ఎవరికి మార్గం చూపడో వారిని ఎవరూ దారికి తీసుకురాలేరు. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేదని, ఆయన ఒక్కడని, ఆయనకు సహవర్తులెవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను".

అయితే ఈ ముక్తసరి మాటల్లోనే అతను పరమార్థాల నిధిని కనుగొన్నాడు.

జమాద్ దైవప్రవక్తతో, "ఏదీ, మరోసారి పలకండి. ఈ మాటలైతే సముద్రం లోతులకు చేరినవి" అని అన్నాడు (ముస్నద్ అహ్మద్ 2749).

ఒక అరబ్బు మాటలకు – చేతలకు మధ్య వ్యత్యాసం ఉండేదికాదు. వారు స్వయంగాను మనోవాక్కాయ కర్మలలో నిజాయితీపరులై ఉండటమేగాక ఎదుటివారిని గురించి కూడా అలాగే భావించేవారు. విషయం అర్థమైతే చాలు, దాన్ని మనస్ఫూర్తిగా గ్రహించేవారు అరబ్బులు. అబ్దుల్లా బిన్ అబ్బాస్ ఉల్లేఖనాన్ని ఇబ్నె ఇస్హాఖ్ ఉటంకించారు – బనీసాద్ తెగవారు జమాయే తమ ప్రతినిధిగా చేసి దైవప్రవక్త దగ్గరకు పంపించారు. ఆయన మదీనాకు విచ్చేశారు. తన ఒంటెను మస్జిద్ ద్వారం వద్ద కట్టేసి మస్జిద్ లోపలికి వచ్చారు. ఆ సమయంలో దైవప్రవక్త తన ప్రియశిష్యులతో కలసి కూర్చుని ఉన్నారు. జమామ్ ఒక సాహసవంతుడేగాక వివేచనాపరుడు కూడాను. ఆయన ప్రవక్తగారి సమావేశాన్నుద్దేశించి, "మీలో ఇబ్నె అబ్దుల్ ముత్తలిబ్ ఎవరు?" అని ప్రశ్నించగా 'ఇబ్నె అబ్దుల్ ముత్తలిబ్‌ను నేను' అని దైవప్రవక్త జవాబిచ్చారు. "ముహమ్మద్ అనేవారు మీరేనా?" అని జమా ప్రశ్నించాడు. 'అవును' అన్నారాయన. "ఓ ఇబ్నె అబ్దుల్ ముత్తలిబ్! నేను మీకు కొన్ని ప్రశ్నలు వేయదలిచాను. నా మాటలు కాస్త కరకుగానే ఉంటాయి. ఏమీ అనుకోవద్దు" అన్నాడు జమామ్. "నేనేమీ అనుకోను. మీరు అడగదలచినదేదో స్పష్టంగా అడగండి" అని అభయమిచ్చారు దైవప్రవక్త. "మీ దైవంతోడుగా, మీకు పూర్వం గతించిన వారి దేవుని తోడుగా, మీ తదనంతరం ఉండేవారి దైవం తోడుగా అడుగుతున్నాను – దేవుడు నిజంగానే మిమ్మల్ని ప్రవక్తగా చేసి మా వద్దకు పంపించాడా?" అని జమామ్ ప్రశ్నించగా 'అవును' అన్నారు దైవప్రవక్త. "మీ

దైవం తోడుగా, మీకు పూర్వం గతించిన వారి దైవంతోడుగా, మీ బావితరాలవారి దైవం తోడుగా అడుగుతాను – మేము కేవలం ఒకే దైవాన్ని ఆరాధించాలని, ఆయనకు సహవర్తులుగా ఎవరినీ కల్పించరాదనీ, మా తాతముత్తాతలు ఆరాధించే విగ్రహారాధనను విడనాడమని ప్రజలకు బోధించు అని చెప్పి మరీ అల్లాహ్ మిమ్మల్ని పంపించాడా?" అని తిరిగి ప్రశ్నించగా 'అవును' అన్నారాయన. "మీ దైవం తోడుగా, మీ పూర్వీకుల దైవం తోడుగా, మీ తరువాత వచ్చే వారి దైవం తోడుగా అడుగుతాను – ప్రతిరోజూ మేము ఐదు పూటలా నమాజ్ చేయాలని దేవుడు మీకు ఆదేశించాడా?" అని అడగ్గా దైవప్రవక్త 'అవును' అని బదులిచ్చారు. అలాగే అతను జకాత్, ఉపవాసం, హజ్ తదితర అంశాలను గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నాడు. ప్రతిసారీ దైవంతోడుగానే ప్రశ్నించాడు. తన ధర్మ సందేహాలన్నీ తీరిపోయిన తరువాత ఇలా అన్నాడు.

"అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడులేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇకనుంచి నేను ఈ విధులను నిర్వర్తిస్తాను. మీరు వారించినవాటి జోలికి పోకుండా ఉంటాను. ఈ విషయాలలో ఎలాంటి హెచ్చుతగ్గులు చేయను".

తరువాత జమామ్ తన ఒంటెపై కూర్చుని వెళ్ళిపోయారు. తన తెగవారి వద్దకు పోయి జరిగినదంతా వివరించారు. ఒక ఉల్లేఖనం ప్రకారం సాయంత్రం అయ్యేసరికి ఆయనతో సమావేశమైన ఆడ, మగ అందరూ సత్యాన్ని స్వీకరించేశారు (అహ్మద్ 2380).

వారిలో కాపట్యం ఉండేదికాదు. స్వీకారం – తిరస్కారాల మధ్య వాళ్లు మరొక అంశానికి ఆస్కారమిచ్చేవారుకారు. వారు ఎవరికైనా ఒక మాటిచ్చారంటే ఎట్టి స్థితిలోనూ దాన్ని పాలించే వారు – దానికోసం ప్రాణం ఇవ్వవలసివచ్చినా వెనుకాడేవారు కారు. అరబ్బుల గుణ శీలానికి సంబంధించిన కొన్ని మచ్చుతనకలు యస్రిబ్ (ఔస్, ఖజ్రజ్) తెగలవారు 'బైత్' సందర్భంగా చేసిన కొన్ని ఉపన్యాసాలలో దొరుకుతాయి.

యస్రిబ్ ప్రజలు దైవప్రవక్త సమక్షంలో శపథం చేయడానికి సమావేశమవగా అబ్బాస్ బిన్ ఉబాద వాళ్ళనుద్దేశించి, "ఓ ఖజ్రజ్ వర్గీయులారా! మీరు దేనిగురించి చేతిలో చెయ్యేసి ప్రమాణం చేయబోతున్నారో మీకు తెలుసా? అని అడిగారు. 'అవును' అని వాళ్ళంతా ముక్తకంఠంతో బదులిచ్చారు. "మీరు ఎఱుపు–తెలుపుతో యుద్ధం చేసే విషయమై ప్రతినబూనుతున్నారు. మీ సిరిసంపదలు హరించుకుపోయిననాడు, మీ కులీనులు హతమార్చబడిననాడు ముహమ్మద్‌ను ఆయన జాతి వారికి అప్పజెప్పేయాలన్నదే మీ

ఉద్దేశ్యమైతే ఇప్పుడే ఆ పని చేసేయండి. ఎందుకంటే భవిష్యత్తులో గనక మీరలా చేశారంటే, దైవసాక్షి అది ఇహపరాలకే అవమానకరంగా పరిణమిస్తుంది. మీరు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చగలమని, మీ ఆస్తిపాస్తులు కొల్లగొట్టబడినా వెనుకంజ వేయబోమని, మీ కులీనులు హతమార్చబడినా నీరుగారిపోతున్న ఉద్దేశ్యం గనక మీకు ఉన్నట్లయితే ఈయన్ని మీవెంట తీసుకుపోండి. ఎందుకంటే ఇందులో ఇహపరాల శ్రేయం ఉంది". దానికి వాళ్లు, మేము మిమ్మల్నే తీసుకుంటాము. మా ఆస్తిపాస్తులు ఏమైనా, మా కులీనులు హతమార్చబడినాసరే మేము వెనక్కితగ్గేదిలేదు. ఓ దైవప్రవక్తా! మేము మీ మాటను నిలబెట్టుకుంటే ప్రతిఫలంగా మాకేం లభిస్తుంది?" అన్నారు. "స్వర్గం" అని ఆయన సమాధానమిచ్చారు. 'మరైతే మీ చేతిని ముందుకు చాపండి' అన్నారు వారు. ఆయన తన చేతిని చాపారు. వాళ్ళంతా ప్రమాణం (బైత్) చేశారు (అల్‌బిదాయ సంపుటి 3, పేజీ 162).

వాళ్లు చేసింది కేవలం శుష్క ప్రియాలుకావని, ఆడినమాటను తూచా తప్పకుండా నెరవేర్చారని చరిత్ర నిరూపించింది. ఆఖరికి ఇస్లాంకు అధికారం లభించిన తరువాత కూడా తమ అసాధారణ త్యాగాలకు ప్రతిగా రాజకీయ ప్రయోజనాలను ఆశించకుండా 'ఖిలాఫత్'ను ముహాజిర్లకు (మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన వారికి) అప్పగించడానికి అంగీకరించారు. సామాన్య పౌరులుగానే ఉండి ఒక్కొక్కరే ఈ లోకంనుండి నిష్క్రమించారు.

## సర్వతోముఖ సందేశం :

అబ్దుల్లా బిన్ అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం ఒకసారి ఖురైష్ తెగకు చెందిన కులీనులు అబూతాలిబ్ ఇంట సమావేశమయ్యారు. వారిలో ఉతబ, షైబా, అబూజహల్, ఉమయ్యా బిన్ ఖలఫ్ అబూసుఫ్యాన్ వంటి ప్రముఖ నాయకులున్నారు వారంతా అబూతాలిబ్‌ను మధ్యవర్తిగా పెట్టి 'అసలు నువ్వేం కోరుతున్నావో చెప్పు' అని ఆయన్ని అడిగారు.

"నేను కోరేది ఒక్కటే. మీరుగనక దీన్ని అంగీకరిస్తే యావత్తు అరేబియాకు మీరు అధికారులైపోతారు. అరబ్బే తరుడు మీకు విధేయుడైపోతాడు" (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 417).

దేవుని ఏకత్వపు వచనం (కలిమాయెతౌహీద్) కేవలం ఒక విశ్వాసపరమైన వచనం మాత్రమే. కాని అందులో అన్నిరకాల విజయ రహస్యం దాగివుంది. అది మానవనైజం. వాంఛించే విషయం. అందుచేత అది మానవ మనోమయ భావాల లోతుల్లో లీనమైపోతుంది. వ్యతిరేకుల్లో నుంచి సైతం మద్దతుదార్లను సృష్టిస్తుంది. ఖాలిద్ బిన్ వలీద్ మక్కా విజయానికి

కొన్ని నెలల క్రితమే ఇస్లాం స్వీకరించారు. కాని ఇస్లాంలోని సత్యత అంతకుముందునుంచే ఆయన అంతరాత్మను వెంటాడుతూ ఉండేది. ఇస్లాం స్వీకరించిన తరువాత ఆయన ఈ సంగతి తెలిపారు. సత్యం ఖురైషుల పక్షాన లేదని, ముహమ్మద్ పక్షాన మాత్రమే సత్యం ఉందని నా మనస్సాక్షి చాలారోజుల నుంచే హెచ్చరిస్తూ ఉండేది.

"దైవప్రవక్తకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాలన్నింటిలో నేను పాల్గొన్నాను. కాని నేను సరైన చోటున లేను అని నా అంతరాత్మ మథనపడని యుద్ధమేదీలేదు" (మగాజి అల్వా ఖిది సంపుటి 2, పేజీ 746)

ఇలా ద్వంద్వాభిప్రాయాలు కలిగివుండిన వారు ఇంకా అనేకమంది ఉండేవారు. వారి హృదయాలలో ఏనాడో ఇస్లాం ప్రవేశించింది. ఇస్లాం పట్ల వారి మనసుల్లో గౌరవస్థానం ఉండేది. దీని గురించి వారు కలలు గనేవారు. ఉదాహరణకు, ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్ ఇస్లాంకు పూర్వం ఒక కలగన్నారు. ఆ కలలో ఆయన ఒక అగ్నిగుండం అంచున నిలబడి ఉన్నారు. ఎవడో ఒకడు ఆయన్ని వెనుకనుండి అగ్నిగుండంలోకి నెట్టివేయజూస్తున్నాడు. అంతలో ఇస్లాం ప్రవక్త వచ్చి ఆయన్ని అగ్నిలో పడకుండా కాపాడారు (అహద్ అల్వాబ సంపుటి 1, పేజీ 574).

సందేశ ప్రక్రియ బాహ్యంలో ఆర్థిక విషయాలతో ఎలాంటి సంబంధం కలిగి ఉండదు. కాని పరోక్షంగా అది వాటితో ముడిపడి ఉంటుంది. ఎందుకంటే సందేశ కృషి ఫలితంగా ఒకవ్యక్తి ఇస్లాంను అవలంబించినపుడు అతని సాధన సంపత్తులన్నీ వాటంతటవే ఇస్లాంకు ప్రాప్తిస్తాయి. మక్కా యుగంలోని తొల్దొలి కాలంలో ఖదీజా సంపద ఇస్లాంకు తోడ్పడుతూ ఉండేది. ఆ తరువాత అబూబకర్ విశ్వసించారు. ఆయన వాణిజ్యంలో అర్జించిన 40వేల దిర్హమ్‌లు ఇస్లామీయ ఉద్యమానికి ఆర్థికంగా ఎంతగానో ఆసరా ఇచ్చాయి. హిజ్రత్ సందర్భంగా ఆయన ఆరువేల దిర్హమ్‌లను తీసుకుని బయలుదేరారు. అవి ప్రయాణ ఖర్చులకు ఉపయోగపడ్డాయి. తబూక్ పోరాటం సందర్భంగా ఉస్మాన్ పదివేల దీనార్లు ఇచ్చారు. దీనివల్ల సైనిక అవసరాల్లో మూడోవంతు సమస్య తీరిపోయింది (అల్ సిరాతు అల్‌హలెల్ మ్యాతు సంపుటి 3, పేజీ 184). అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఒకే ఒక సమయంలో ఐదువందల గుఱ్ఱాలను జిహాద్ కోసం ఇచ్చేశారు (అల్ ఇసాబ సంపుటి 4, పేజీ 291). అదేవిధంగా ఎవరెవరు ఇస్లాం స్వీకరించినా వారి ప్రాణంతో పాటు వారి ధనం కూడా ఇస్లాం ఖజానాలో ఒక భాగంగా పరిగణించబడేది.

వర్గ విభజనకు, వర్ణ విచక్షణకు తావులేని ఏకైక సిద్ధాంతం దేవుని ఏకత్వపు (తౌహీద్) సిద్ధాంతం. అందువల్ల ఈ సిద్ధాంతం ఆధారంగా ఎక్కడ ఉద్యమం పెల్లుబికినా అది ఆయాప్రజలను అమితంగా ప్రభావితం చేస్తుంది. దేవుని ఏకత్వపు సిద్ధాంతం ఆసరాలో తాము మానవ సమానత్వాన్ని, గౌరవప్రదమైన స్థానాన్ని పొందగలమని వారు భావిస్తారు. ముగైరా గారు పారసీక సైన్యాధిపతి అయిన రుస్తుం దర్బారులోకి వెళ్ళి ప్రసంగించినపుడు ఆ ప్రసంగం దర్బారులోని సభ్యులపై ఎంతగా పడిందో క్రింద ఉల్లేఖనం ద్వారా తెలుస్తుంది.

"దైవసాక్షి! ఈ అరబ్బు చెప్పింది నిజం" అని క్రింది స్థాయివారు అభిప్రాయపడ్డారు. సర్దారులు ఇలా అన్నారు" దైవసాక్షి! ఇతను ఎలాంటి మాటను ప్రయోగించాడంటే దానికి ప్రభావితులైన బానిసలంతా దాని వైపుకు వెళ్ళిపోతారు. దేవుడు మా ఈ పూర్వీకుల్ని నాశనమొనర్చుగాక! ఈ జాతి వ్యవహారాన్ని సులువుగా తలపోసిన వాళ్ళు ఎంత అవివేకులు!" (తారిఖ్ తబరి సంపుటి 3, పేజీ 522).

దైవ దౌత్యం లభించిన 13 సంవత్సరాల అనంతరం ప్రవక్త అబూబకర్‌తో కలసి మదీనా చేరుకున్నప్పుడు మదీనా వాసుల్లో సుమారు 500 మంది ఆయనకు స్వాగతం పలకడానికి పోగయ్యారు. వాళ్ళు ఇలా అన్నారు.

"రండి తమరిక్కడ సురక్షితంగా ఉండగలరు. ఇంకా మీరు మా సర్దారు" (అల్‌తారిఖ్ అల్‌ఔసర్ హదీసు 14).

మదీనాలో ఈ సర్దారీ (నేతృత్వం) ఆయనకెలా లభించింది? అంటే సందేశ కృషి మూలంగానే. యస్రిబ్ (మదీనా) వాసుల్లో ఆయన సందేశాన్ని మొట్టమొదట విన్న వ్యక్తి బహుశా సువీద్ బిన్ సాయత్ ఖజ్రజి. అతని ముందు ఆయన ఇస్లాం ప్రస్తావన తెచ్చినపుడు "బహుశా నా దగ్గరున్నదే మీ దగ్గరుందనుకుంటాను" అన్నాడు. "నీ దగ్గరున్నదేమిటి?" అని ప్రవక్తగారు ప్రశ్నించగా 'లుక్మాన్ నీతి' అని అతను బదులిచ్చాడు. "ఏదీ కాస్త వినిపించు" అని ప్రవక్త కోరారు. అతను కొన్ని కవితలు వినిపించాడు. "నా దగ్గర ఇంతకన్నా శ్రేష్ఠమైన ఖుర్ఆన్ ఉందని" మహా ప్రవక్త చెప్పారు. ఆపైన ఆయన అతనికి ఖుర్ఆన్ పారాయణం చేసి వినిపించగా తక్షణం అతను ముస్లింగా మారిపోయాడు. యస్రిబ్ తిరిగి వచ్చిన తరువాత ఆ వ్యక్తి తన తెగవారికి ఇస్లాం సందేశం ఇవ్వగా వారు అతన్ని తుదముట్టించారు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 427).

ఆ తర్వాత యస్రిబ్ సర్దారు ఒకడు–అబుల్ హాసీ అనస్ బిన్ రాఫె–మక్కా వచ్చారు.

ఆయన వెంట బనీఅబ్దుల్, అషహాల్ తెగకు చెందిన బృందం కూడా ఉంది. ఖజ్రజ్ తెగకు మద్దతు సంపాదించే ఉద్దేశ్యంతో ఖురైషులతో మైత్రీ ఒప్పందం కుదుర్చుకోవటానికి వచ్చారు వాళ్లు; వాళ్ల రాక సంగతి తెలియగానే ఆయన వాళ్ల దగ్గరకెళ్ళి ఇలా ఉద్బోధించారు. "మీరు ఏ పనికోసం వచ్చారో దానికన్నా ఉత్తమమైన విషయం నేను మీకు చెప్పనా?" అన్నారు. తరువాత ఆయన ఏకేశ్వరోపాసనా సందేశం ఇచ్చారు. ఆ పయన బృందంలోని ఒక యువకుడు – ఆయాస్ బిన్ మాస్ – లేచి ఇలా అన్నాడు. "ఓ నా జాతి జనులారా! దైవంసాక్షి. మీరు వచ్చిన పనికన్నా ఈ విషయం ఎంతో మేలైనది" కాని ఈ విషయం ఆ బృందానికి అర్థంకాలేదు. "వదలవయ్యా! మనం వచ్చింది మరోపనికోసం" అని నిర్లక్ష్యం వహించారు. వాళ్లు యస్రిబ్ తిరిగివెళ్ళిన కొన్నాళ్లకే ఔస్ – ఖజ్రజ్ తెగలమధ్య యుద్ధం మొదలయింది. ఈ యుద్ధం 'బఆస్' పేరుతో వినతికెక్కింది (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 428).

ఖుబైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ కథనం ప్రకారం యస్రిబ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు – సాద్‌బిన్ జరారహ్ మరయిఉ జక్వాన్ బిన్ ఖైస్‌లు – మక్కా వచ్చారు. వారిరువురూ ఉదబ ఇంట ఆగారు. ఇస్లాం ప్రవక్త గురించి విని ఆయన్ని కలసుకుందామని వెళ్ళారు. ఆయన వారిద్దరికీ ఇస్లాం సందేశం ఇచ్చారు. ఖుర్‌ఆన్ చదివి వినిపించారు. ఇరువురూ ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత వారిద్దరూ తమ అతి ధీయుడైన ఉతబా ఇంటికి వెళ్లలేదు. తిన్నగా యస్రిబ్ వెళ్ళారు. యస్రిబ్ వాసులకు ఇస్లాంను పరిచయం చేసిన కార్యకర్తల్లో వీరిరువురూ ప్రముఖులే. దైవదౌత్యం అందిన పది సంవత్సరాల తర్వాత జరిగిన సంఘటన ఇది (అల్ తబఖాత్ అత్ ఖుబర్ సంపుటి 3, పేజీ 608).

పదకొండవ ఏట హజ్ సందర్భంగా యస్రిబ్ నుంచి ఖజ్రజ్ తెగకే చెందిన ఆరుగురు వ్యక్తులు మక్కా వచ్చారు. వారు ఆయన సమక్షంలో 'బైత్' చేశారు. తిరిగి వెళ్ళిన మీదట యస్రిబ్‌లో ఇస్లాం ప్రచారం మొదలెట్టారు. ఆపై సంవత్సరం 12 మంది వచ్చి 'బైత్' చేశారు. ఇది ఇస్లామీయ చరిత్రలో 'తొలి ఉఖబా' (621)గా పేరుమోసింది. 13వ ఏట దైవప్రవక్త సన్నిధికి వచ్చి ప్రతినబూనిన వారి సంఖ్య 755కి పెరిగింది.

మక్కాకు భిన్నంగా యస్రిబ్‌లో జరిగిన ఒక సంఘటన ఏమిటంటే తొలివిడతలోనే అక్కడి ప్రముఖ వ్యక్తులు ఇస్లాం స్వీకరించారు (హుల్ యతుల్ అల్‌లియా సంపుటి 1, పేజీ 107). అది ట్రైబల్ యుగం కావటం వల్లనూ, తెగ నాయకుడు ఏ మతస్థుడైతే ఆ తెగ ప్రజలంతా ఆ మతాన్నే అవలంబించటం ఆనవాయితీ కావటంవల్లనూ యస్రిబ్‌లో అత్యంత

శీఘ్రగతిన ఇస్లాం వ్యాపించసాగింది. ఆఖరికి ఇస్లాంలో అడుగుపెట్టని గడప ఒక్కటీ మిగల్లేదు. ఆవిధంగా యస్రిబ్ జనాభాలో ముస్లింలు అధిక సంఖ్యాకులుగా పరిగణించబడసాగారు. అన్నివిధాలుగా వారి పలుకుబడి కూడా ఆపురంలో పెరిగింది (అల్ మోజమ్ అల్ ఖబీర్ హదీసు 849).

ఆ విధంగా ముస్లింలు మదీనాలో అందరికన్నా ఎక్కువ పలుకుబడిగల వర్గంగా రూపొందారు. వారి వ్యవహారం కూడా చక్కబడింది.

## సందేశ పరమార్ధాలు :

ప్రతి యుగంలోనూ సమకాలీన ప్రభావాల నుండి సురక్షితంగా ఉండేవారు ఎంతో కొంత మంది తప్పక ఉంటారు. వారు మానవ నైజం వాంఛించేదేమిటో వినాలని చెవియొగ్గి ఉంటారు. అరబ్బు కవి సమ్మేళనాలలో ఇది చూచాయగా కనబడేది. అబ్రాహాము విధానాన్ని పుణికిపుచ్చుకున్న కారణంగా అరబ్బేయులలో చాలామంది సత్యామృతాన్ని ఆస్వాదించడానికి తహతహలాడుతూ ఉండేవారు. విగ్రహారాధన పట్ల అయిష్టతను వ్యక్తపరచేవారు. ఇలాంటి శుభాత్ములు 'హనీఫ్'లు (దైవ విధేయులు)గా వ్యవహరించబడేవారు. ఉదాహరణకు, ఖైస్ బిన్ సాయిద, వరకాబిన్ నౌఫల్ ఈ కోవకు చెందిన పండితులే. జుందుల్ బిన్ అమర్ కూడా అటువంటివారే. ఆయన అజ్ఞాన కాలంలో ఇలా అంటూ ఉండేవారు.

"నిస్సందేహంగా ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడు. కాని అతనెవరో నాకు తెలీదు".

ముహమ్మద్ ప్రవక్త ప్రభవించారన్న సంగతి తెలియగానే ఆయన తన తెగకు చెందిన 75 మందిని వెంటబెట్టుకువచ్చి వారందరి సమేతంగా ఇస్లాం స్వీకరించారు (అల్ ఇస్లాం సంపుటి 3, పేజీ 424). అబూజర్ గిఫారీ కూడా ఈ సత్యాన్వేషణలో ఉన్నవారే. ప్రవక్త గురించి ఆయనకు తెలియగానే దాని గురించి కనుక్కురమ్మని ఆయన తన సోదరుణ్ణి మక్కా పంపించారు. సోదరుడు మక్కా నుండి తిరిగి వెళ్ళి ప్రవక్త గురించి ఇచ్చిన నివేదిక ఇలా ఉంది.

"నేను ఒక మనిషిని చూశాను. జనులతన్ని ధర్మ భ్రష్టుడని అంటున్నారు. చూడబోతే ఆయన ధోరణి నీలాగే ఉంది" (అల్ ఇసాబ సంపుటి 7, పేజీ 107).

ఏ సమయంలోనైనా సందేశం ప్రారంభం అయినప్పుడు సందేశ ప్రదాత సైతం ఊహించని చోట్ల దాని విత్తనాలు నాటుకుంటాయి.

అరేబీయాలో ప్రజలు ఆలస్యంగా ఇస్లాం స్వీకరించారంటే దానిభావం వారిపై ఒక్కసారిగా ఇస్లాం ప్రస్ఫుటమైందని కాదు. వాస్తవమేమిటంటే దైవప్రవక్తగారి ఉన్నత నైతికత, ఆయన దినచర్యలు, సందేశ ప్రచారంలో ఆయన తలమునకలై ఉండే విధము, నిరంతర వ్యతిరేకతల మూలంగా ఆయన సందేశం ఒక ముఖ్య చర్చనీయాంశంగా మారటం, తత్కారణంగా ప్రతి ఒక్కరికీ ఆయన ఉనికి ఒక సవాలుగా పరిణమించటం – ఇత్యాది పరిణామాల వల్ల అసంఖ్యాకమైన అరబ్బులలో ఇస్లాం బీజాలు నాటుకున్నాయి. తెగల ప్రాబల్యం తాతముత్తాతల ఆచారాల పట్ల దృఢ విశ్వాసం మూలంగా ఒక వ్యక్తిపైకి మంకు తనానికి లోనై ఉన్నప్పటికీ లోలోపల మొలకెత్తిన ఇస్లాం మొక్కను అతను పెకలించలేక పోయేవాడు. అకస్మాత్తుగా సంభవించిన ఒకానొక సంఘటన ఉమర్ లాంటి వ్యక్తిని ఇస్లాం ముందు తలవంచేలా చేసింది. అయితే అంతకు ముందే ఆయన మనోక్షేత్రంలో ఇస్లాం విత్తనం నాటుకుని ఉండేది.

ఉమ్మె అబ్దుల్లా బిన్తె అబీ హష్మ ఇలా తెలియజేస్తున్నారు. దైవసాక్షి! మేము అబిసీనియా దేశానికి పోరాడడానికి సిద్ధంగా ఉన్నాం. నా భర్తగారైన ఆమిర్ అవసరార్థం బయటికెళ్ళి ఉన్నారు. అంతలో ఉమర్ బిన్ ఖత్తాబ్ వచ్చారు. నాదగ్గరకొచ్చి నిలబడ్డారు. అప్పటికి ఆయన ఇస్లాం స్వీకరించలేదు.

ఆయన మూలంగా మేము చాలా కష్టాలెదుర్కోవలసివచ్చేది.

"ఓ ఉమ్మె అబ్దుల్లాహ్! ప్రయాణ సన్నాహాలు చేస్తున్నట్టున్నావ్?" అని ఆయన గద్దించారు. 'అవును' దైవసాక్షి. మేము దేవుని ధరణిలో ఏదో ఒక ప్రాంతానికి పోయి స్థిరపడతాం. ఎందుకంటే మీ వాళ్ళు మమ్మల్ని ఇక్కడ సుఖంగా ఉండనివ్వటంలేదు. మాపై చాలా అన్యాయానికి ఒడిగడుతున్నారు. అల్లాహ్ మా కోసం ఎక్కడో ఒకచోట ఆశ్రయం కల్పిస్తాడని ఆశిస్తున్నాం" అని అన్నాను. "దేవుడు మీకు తోడ్పడుగాక" అన్నారు ఉమర్. అలా అంటున్నప్పుడు ఆయన కళ్లలో పశ్చాత్తాపభావన తొణకిసలాడిందని ఉమ్మె అబ్దుల్లా తెలియజేశారు. ఆ తరువాత ఆయన వెళ్లిపోయారు. మేము మక్కా నుండి వలసపోవటం ఆయనకెంతో బాధ కలిగించింది" (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 342–343).

ప్రతి కాలంలోనూ కొన్ని భావాలు ప్రజల మనోక్షేత్రాల్లో వ్రేళ్లూనుకొని ఉంటాయి. ఈ భావాల గోడలు కూలిపోనంతవరకూ ఏ సత్య పలుకూ అతని కర్ణపుటాలను తాకదు. ఆరంభ కాలంలో అరబ్బుల తరఫున వ్యతిరేకత వ్యక్తమయిందంటే అది కేవలం మంకుతనం

వల్లనో, స్వార్థ ప్రియత్వం వల్లనో వ్యక్తంకాలేదు. అసలు విషయం ఏమిటంటే 'కాబా' సంరక్షకులు (ముతవల్లీలు) అనుసరించే ధర్మం తప్ప మరో ధర్మం కూడా సత్యబద్ధమై ఉంటుందనేది వాళ్లు ఊహించలేనిది. యూద తెగల ఇరుగుపొరుగున నివసించే అరబ్బులు మాత్రం ఇలాంటి విశ్వాసపరమైన చిక్కుల్లో అంతగా కూరుకుపోలేదు. ఎందుకంటే, అరేబియాలో ఒక ప్రవక్త ప్రభవించనున్నాడని తమ గ్రంథాలలో వ్రాసి ఉన్నట్లు యూదులు చెబుతుండగా వారు వినేవారు.

అన్సారు ప్రజలు ఆయన సందేశాన్ని వినగానే మౌనం వహించారు. ఆయన సందేశం పట్ల వాళ్ల మనసు సంతృప్తి చెందింది. అప్పటికే గ్రంథవహుల (యూదుల) ద్వారా ఆయన గుణగణాలను గురించి విని ఉండటంవల్ల వారు, ఆయన పిలుపును త్వరగా అర్థం చేసుకుని ఆయన ఈయనేనని తెలుసుకోగలిగారు. వాళ్లు ఆయన్ని గుర్తించి విశ్వసించారు (అల్ మోజమ్ అల్ ఖబీర్ హదీసు 849).

ఉకాజ్ సంతలో ఆయన కుందా తెగవారి గుడారాల్లోకి వెళ్ళి వారిముందు తన సందేశాన్ని వినిపించిన మీదట ఒక నవయువకుడు ఇలా అన్నాడు.

"ఓ నాజాతి వారలారా! ఇతరులు త్వరపడకముందే మీరు ఈ మనిషికి తోడ్పడటంలో తొందరపడండి. దైవసాక్షి! హరం (మక్కా)లో ఒక ప్రవక్త ప్రభవించేకాలం సమీపించిందని గ్రంథ ప్రజలు చెప్పుకుంటున్నారు" (దలాయిల్ అన్ నబూవ హదీసు 222).

మదీనా వాసులైన ఔస్ ఖజ్రజ్ తెగలు విశ్వసించడంలో ముందంజవేయడం వెనుక ఉన్న పూర్వరంగం ఇదే. అయితే మక్కావాసులు, మరితర ప్రాంతాల అరబ్బుల దృష్టిలో సత్యం యొక్క ప్రమాణం ఎంతసేపటికీ కాబా అధికారమై ఉండేది. రాజరిక వ్యవస్థలో 'మకుటా' (క్రౌన్)నికి ఎలాంటి ప్రాధాన్యత ఉండేదో ప్రాచీన కాలంలో 'కాబా'కు అలాంటి ప్రాధాన్యతే ఉండేది. మకుటం (క్రౌన్)తో పాటు కేవలం రాజకీయ అధికార భావనే ముడిపడి ఉండేది. కాగా, కాబాతో పాటు అధికార ప్రాబల్యమేగాక పవిత్ర ఆచారాలు కూడా ముడిపడి ఉండేవి. కాబాపై అధికారం సంపాదించగలిగినవాడే సత్యబద్ధుడై ఉంటాడనే ఆలోచన ఒక సగటు అరబ్బులో తిష్ఠవేసి ఉండేది. ఆమిర్ తెగకు చెందిన జుల్‌జోష్న్ జబాయి ఇలా అంటున్నారు.

"ఓ జుల్‌జోష్! మీరు ఇస్లాం స్వీకరించరేం? ఇస్లాం స్వీకరిస్తే మీ పేరు తొలిసహచరుల్లో చేర్చబడుతుందికదా!" అని ప్రవక్త చెప్పారు. దానికి నేను 'లేదు' అన్నాను. 'ఎందుకని?'

అని ఆయన అడగ్గా 'మీ జాతివారు మీకు విరోధులై వెంటపడటం గమనిస్తున్నాను" అని నేనన్నాను. "బద్ర్ యుద్ధరంగంలో వాళ్ల పరాజయం గురించి మీరేం విన్నారు?" అని ప్రవక్త ప్రశ్నించగా 'ఆ సంగతి నాకు తెలుసనుకోండి' అన్నాను. "అదికాదు సన్మార్గం విషయంలో నేను నీకు బోధపరచవలసి ఉంది" అని ఆయన కోరారు. 'బోధపరచండి, కాని ఒక్క షరతు, తమరు కాబాను జయించి దాన్ని వశపరచుకున్ననాడే మీ బోధననాకు అర్థమవుతుంది' అన్నాను. దానికి ఆయన మీరు బ్రతికి ఉంటే అది కూడా చూస్తారు" అని చెప్పారు. 'ఒకరోజు నేను నా స్వస్థలమైన గౌర్‌లో ఉండగా ఒక వ్యక్తి స్వారీ అయి వచ్చాడు. వాళ్ల సంగతి ఏమైందని నేను అడగ్గా 'దైవసాక్షి! ముహమ్మద్ కాబాను జయించి దాన్ని స్వాధీనం చేసుకున్నాడు' అని చెప్పాడు. నా సొమ్ము నన్ను అనామకుణ్ణిజెయ్య! నేను ఆనాడే ఇస్లాం స్వీకరించి ఉంటే హీరా ప్రదేశాన్ని కోరినా ముహమ్మద్ నాకు ఇచ్చి ఉండేవారు" (అహ్మద్ 16633).

ఈ కారణంగానే – మక్కా జయించబడిన తరువాత జనులు తండోపతండాలుగా వచ్చి ఇస్లాంలో ప్రవేశించారు. (110:2)

## సందేశ ప్రచార ఫలితం :

ఆయన తన సందేశోద్యమాన్ని ప్రారంభించినపుడు ఒక వినూత్న పిలుపుకు ప్రతిస్పందనగా సమాజంలో ఎదురయ్యే సంఘటనలన్నీ ఆయనకు ఎదురయ్యాయి. 'ఏం జరుగుతోంది?' అని కొంతమంది ఆశ్చర్యపోయారు. అబ్దుల్లాబిన్ హమీద్ తన ముస్నద్ గ్రంథంలో చేసిన సంకలనం ప్రకారం, ఖురైష్ సర్దారులు ఒకసారి ఉతబా బిన్ రబీయను ఒకసారి తమ ప్రతినిధిగా ప్రవక్త వద్దకు పంపించారు. ఉతబ ప్రవక్త ప్రతిపాదనకు జవాబుగా ఒక సుధీర్ఘ ఉపన్యాసమిచ్చారు. అతను తన మాటచెప్పిన తరువాత 'ఇంతేనా?' అని ప్రవక్త అడిగారు. 'అవును, ఇంతే' అని ఉతబ సమాధానమిచ్చాడు. ప్రవక్త బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ పలికి 'హమ్మీమ్ సజ్దా' అనే సూరాలోని తొలి 13 వచనాలు చదివి వినిపించారు. అప్పుడు ఉతబ ఇలా అనసాగాడు. 'ఆపండి! ఆపండి! ఇది తప్ప మీ దగ్గర ఏముందనీ?'. దానికి ప్రవక్త లేదు అన్నారు. ఆ తరువాత జరిగిందేమిటో చూడండి.

ఆపైన ఉతబా ఖురైషుల దగ్గరకెళ్ళాడు. 'ఏమైంది?' అని వాళ్లు ప్రశ్నించగా "మీరేమి చెప్పారో అదంతా నేను ఆయనతో చెప్పేశాను" అన్నాడు ఉతబా. 'మరి ఆయన దానికి బదులిచ్చాడా?' అని అడగ్గా, "అవును" అన్నాడు ఉతబా. "దైవసాక్షి! ఆయన చూపిన

నిదర్శనాలు నాకేమీ మింగుడుపడలేదు. ఆద్ సమూద్ జాతులపై వచ్చిన ఆపదను ఉదాహరిస్తూ మమ్మ‌ల్ని హెచ్చరించాడు. అదొక్కటే నాకు అర్థమైంది" అన్నాడు. 'నీ పాడుగాను! ఒక వ్యక్తి నీతో అరబీలో సంభాషిస్తుంటే ఆయనేం చెప్పాడో నీకు అర్థంగాలేదా!' అని ఖురైషులు విసుకున్నారు. "దైవసాక్షిగా చెబుతున్నాను. ఆయన చెప్పిన దానిలో నాకు అదొక్కటే అర్థమైంది" అన్నాడు ఉతబా (ముస్నద్ అబూయాల హదీసు 1818).

మతం యొక్క ప్రత్యేక సాంప్రదాయక వ్యవస్థతో పెనవేసుకుని ఉండే ప్రజలు కొంతమంది ప్రవక్త సందేశం విని దానివల్ల తమ పూర్వీకులను అవమానపరచినట్లుంటుందని అన్నారు. ఒక ఉల్లేఖనం ప్రకారం కాబా సందర్శనార్థం జమాత్ మక్కావచ్చారు. ఒకరోజు అబూజహల్, ఉతబా, ఉమయ్య బిన్ ఖలఫ్‌లు కూర్చుని ఉన్న సమావేశంలో ఆయన కూడా కూర్చున్నారు. అబూజహల్ ఇలా అన్నాడు.

"ఈ వ్యక్తి మన సమాజంలో అభిప్రాయభేదాలు సృష్టించాడు. మనందరినీ మూర్ఖులుగా జమకట్టాడు. మన పూర్వీకులను మార్గభ్రష్టులుగా ఖరారు చేశాడు. మన దేవతలను నిందించాడు. అప్పుడు ఉమయ్య ఖచ్చితంగా పిచ్చివాడైపోయాడని నా అనుమానం" అన్నాడు (దలాయిల్ అన్ నబువ హదీసు 187).

అమర్ బిన్ ముర్రాజుహైని తన తెగవారైన జుహైనియాకు ఇస్లాం సందేశం అందజేయగా వారిలో ఒక వ్యక్తి ఇలా అన్నాడు.

"ఓ అమర్ బిన్ ముర్రా! దేవుడు నీ జీవితాన్ని నాశనం చెయ్య! మేము మీ దేవతలను విడనాడమని, మా తెగలో విచ్ఛిన్నం సృష్టించమనీ, మా తాతముత్తాతల మత ధర్మాన్ని విడనాడమని, గొప్ప నీతిమంతులైన మా పూర్వీకుల మాట ధిక్కరించమని నువ్వు మాకు ఆజ్ఞాపిస్తున్నావా? ఆ ఖురైషు వ్యక్తి ఏ విషయం వైపుకు పిలుపునిస్తున్నాడో అందులో మర్యాదగానీ, మహిమగానీ ఏమీలేదు".

ఆ తరువాత ఆ వ్యక్తి మూడు పద్యాలు వినిపించాడు. వాటిలో చివరి పద్యం ఇది.

(అతను గతించిన మా పూర్వీకుల్ని అవివేకులుగా నిరూపించాలనుకుంటున్నాడు. ఇలాంటి ఉద్దేశ్యమున్నవాడు ఎన్నటికీ కృతకృత్యుడు కాలేడు) – (తారిక దిమష్ సంపుటి 46, పేజీ 345).

మరికొంతమందికి అహంభావాలు అడ్డుగా నిలిచాయి. ఇంకా కొందరికి అసూయద్వేషాలు పట్టిపీడించాయి. ఒకవైపు ఇస్లాం ప్రవక్త సత్యజ్ఞానాన్ని ప్రకటిస్తూ ఉంటే

ఆ సత్యజ్ఞానం తమకు లభించలేదే అన్న అసూయతో వారు వెనుకంజవేసేవారు. ముగైరా బిన్ షోబ గారి ఉల్లేఖనాన్ని బైహఖీ సంకలనం చేసినదాని ప్రకారం ఒకరోజు అబూజహల్ ఆయనతో – ఏకాంతంలో – ఇలా అన్నాడు.

“దైవసాక్షి! వీరు ఏదైతే అంటున్నారో అది సత్యమని నాకు తెలుసు. కాని విశ్వసించటంలో నాకు ఒక విషయం అవరోధంగా నిలిచింది. కాబా గృహపర్యవేక్షణ మనదని బనీ హుసై తెగవాళ్ళు నాతో చెబితే నేను అవునని చెప్పాను. హజ్ యాత్రీకులకు నీళ్ల త్రాపే బాధ్యత మనదేకదా అని వాళ్లంటే నేను అవునన్నాను. దారున్నద్వ (శాసనమండలి)పై మనకు హక్కు ఉందికదూ అని బనూహుసై తెగవాళ్లు ప్రశ్నిస్తే నేను అవునని బదులిచ్చాను. రణరంగంలో ధ్వజమెత్తుకునే పనికూడా మనదే కదా అని అతను అడిగితే, అవును మనదే అని నేను చెప్పాను. కాగా, ఇప్పుడు వాళ్లు దైవదౌత్యం తమదని అంటున్నారు. దైవసాక్షి! నేను దీన్ని ముమ్మాటికీ ఒప్పుకోను” (అస్సీర అన్ నబువియా సంపుటి 1, పేజీ 507).

మరికొంతమంది ఆర్థిక కారణాలవల్ల ప్రవక్త సందేశాన్ని స్వీకరించలేకపోయారు. ఇస్లాంకు ముందు కాబా గృహం ఒక పెద్ద విగ్రహాలయంగా ఉండేది. అందులో అన్ని మతాలవారి విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉండేవి. ఆఖరికి అందులో ఏసుక్రీస్తు, మరియమ్మ బొమ్మలు కూడా ఉండేవి. ఆవిధంగా కాబాగృహం సర్వమతాల దర్శనాస్థలంగా అలవారేది. నిషిద్ధ మాసాలు నాలుగుగా నిర్ణయించబడటంలోని అంతరార్థం కూడా ఇదే. ఈ మాసాలలో అన్ని మతాలవారు కాబా సందర్శనార్థం మక్కాకు వచ్చేవారు. ఆ విగ్రహాలను గనక కాబాగృహంలో నుంచి తొలగిస్తే కాబా దర్శనానికి ఎవరూ వచ్చేవారుండరు వర్తక రీత్యా నాలుగు మాసాలపాటు కళకళలాడే మక్కానగరం కాస్తా వెలవెలబోతుంది. అందువల్ల మక్కా నగరవాసులు – ఆయన సందేశాన్ని స్వీకరించడమంటే ఆర్థిక ఇబ్బందులను కొనితెచ్చు కోవటమేనని భయపడేవారు. ఏక దైవారాధనా సిద్ధాంతం గనక అక్కడ ప్రబలితే నిస్సారమైన ఎడారి ప్రాంతంలో తమ నోటికి ముద్ద వచ్చే ఆస్కారమే ఉండదని వాళ్లు తలపోసేవారు. దానికి తోడు కాబా నిర్వాహణ బాధ్యతల మూలంగా అరేబియాలో ఖురైషులకు గౌరవున్నతులు ప్రాప్తమై ఉండేవి. సంఘంలో తమకున్న విశిష్ఠ స్థానం ఎక్కడ సమసిపోతుందోనన్న భయం కూడా వాళ్లను పట్టి పీడిస్తుండేది.

ఖురైషుల వర్తకం బృందాలు ప్రాక్పశ్చిమాల మధ్య పయనిస్తుండేవి. ఈ ప్రయాణాలు వాణిజ్య ఒప్పందాలననుసరించి జరుగుతుండేవి. ఉదాహరణకు : పారసీక, అబిసీనియా, రోము చక్రవర్తులతో వారు వ్యాపార లావాదేవీలు జరిపేవారు. తాము గనక ముహమ్మద్

సందేశానికి మద్దతు ప్రకటిస్తే ఇరుగుపొరుగు సామ్రాజ్యాలు తమతో ద్వైపాక్షిక సంబంధాలను త్రెంచుకుంటాయని, ఇతర అరబ్బు తెగలవారు కూడా వాణిజ్య ఒప్పందానికి తిలోదకా లిస్తారేమోనని ఖురైషులకు భయం ఉండేది. అదే జరిగితే ఖురైషుల వర్తకంపై చావుదెబ్బ పడినట్లేనని, క్రమక్రమంగా తమ నేతృత్వం ఖతమైపోతుందని వాళ్లు అనుమానించేవారు.

అందుకే వాఖియ సూరాలోని ఒక ఆయత్‌కు తాత్పర్యం ఇలా చెప్పబడింది. మీ ధిక్కారాన్ని మీ ఆహారంగా చేసుకుంటున్నారు. అంటే ఇస్లాం ప్రవక్త ఇస్తున్న ఏకదైవారాధనా సందేశాన్ని త్రోసిరాజని మీ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవచ్చునీ, మీ సిరిసంపదలను కాపాడుకోవచ్చని మీరు అనుకుంటున్నారు.

ప్రవక్త సందేశం పర్యవసానంగా ఆయన ఉనికి ఒక సవాలుగా పరిణమించింది. చూచేవాడు రెండవవానితో వాడే వీడా అని ప్రశ్నించేవాడు (ముస్నద్ అబూమాల హదీసు 6830).

"ఆయన తెగల మధ్య నడచిపోతుంటే జనులు చూపుడువ్రేలితో ఆయన వంక సైగలు చేసేవారు" (ముస్నద్ అహ్మద్ 14456).

మక్కా వచ్చిన ప్రతివాడూ తన స్వస్థలానికి తిరిగి వెళ్ళాక ఇతరత్రా విషయాలతోపాటు ప్రవక్త ప్రస్తావన కూడా తెచ్చేవాడు. ముహమ్మద్ బిన్ అబ్దుల్లా తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్నాడని, ఇబ్నె అబీ ఖహాఫా (అబూబకర్) ఆయనకు అండగా నిలిచారని చెప్పుకునేవాడు (దలాఇల్ అన్‌నబూవ పేజీ 28). ఖురైషులు ఆయన్ని ముహమ్మద్ (ప్రశంసిచబడేవాడు) బదులు ముజ్‌మన్ (దూషించబడేవాడు) అని పిలువసాగారు. ఆయన పూర్వీకులకు అపచారం చేకూరుస్తున్నారని, అవమానపరుస్తున్నారని తూలనాడేవారు. ఆయన నడచిపోయేదారిలో రాత్రిపూట కసువు, కశ్మలం తెచ్చిపడేసేవారు. ఒకసారి ఆయన వాళ్లను చూసి, "ఓ ఖురైషు వర్గీయులారా! ఇదెలాంటి ఇరుగుపొరుగు?" అని మనోవేధనను వ్యక్తపరిచారు (ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 416).

అబూతాలిబ్ బ్రతికున్నంతకాలం వాళ్లు ఆయనకు వ్యతిరేకంగా తీవ్రమైన చర్య గైకొనేందుకు సాహసించలేకపోయారు. ఎందుకంటే అక్కడి వర్గ తెగల వ్యవస్థ ప్రకారం ఆయనతో తలపడటమంటే యావత్తు బనూహాషిమ్ తెగపై యుద్ధం ప్రకటించినట్లే లెక్క. ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇస్లాం స్వీకరించకముందు ఒకసారి ఖడ్గం చేబూని ప్రవక్తను హతమారుస్తానని వెళుతుండగా ఆయన కోపాన్ని చల్లార్చడానికి దారిలో ఒక వ్యక్తి చెప్పిన

ఈ మాట సరిపోయింది". (ముహమ్మద్‌ను చంపి హాషిమ్ తెగతో యుద్ధం చేయదలుస్తున్నావా?" (దలాయిత్ అన్ నబువ సంపుటి 2, పేజీ 219).

ఎప్పుడు ఎవరు ప్రవక్తకు అపకారం చేయగోరినా తక్షణం అతని మదిలో ఆ ప్రశ్న మెదిలేది. ఈ కారణంగానే మక్కాలో అవిశ్వాసులు అధికంగా బానిసలను, బానిసరాళ్లను వేధించారు – ఇతరుల జోలికి రావాలంటే వెనుకాముందూ ఆలోచించేవారు. అబ్దుల్లాబిన్ మస్ వూద్ ఉల్లేఖనం ప్రకారం తొలికాలంలో – మక్కాలో ఏడుగురు ఇస్లాం స్వీకరణను గురించి బహిరంగ ప్రకటన చేశారు. 1. దైవప్రవక్త, 2. అబూబకర్, 3. అమ్మార్, 4. సయీద్, 5. సుహైబ్, 6. బిలాల్, 7. మిక్‌దాద్ (అహ్మద్ ఇబ్నెమాజ)

"దైవప్రవక్తను దేవుడు ఆయన పినతండ్రి ద్వారా సురక్షితంగావించాడు. అబూబకర్‌ను ఆయన జాతి ద్వారా రక్షణ కల్పించాడు. మిగిలిన ముస్లిములను బహుదైవరాధకులు పట్టుకున్నారు. వారికి ఇనుప సంకెళ్లు తొడిగించారు. మండుటెండల్లో మాడ్చారు (సునన ఇబ్నెమాజ 150).

ఇమామ్ బైహఖీగారు సంకలనం చేసిన అబ్దుల్లా బిన్ జాఫర్ ఉల్లేఖనం ఇలా ఉంది. బనూహాషిమ్ సర్దారైన అబూతాలిబ్ చనిపోయిన తర్వాత ఖురైష్ వర్గీయుడైన ఒక కుసంస్కారి ఆయనపై ఇంత మన్నువేశాడు. ఆయన ఇంటికి వచ్చిన తరువాత ఆయన కూతురు ఆ దుమ్మును దులిపింది. ఆ సమయంలో ఆయన ఇలా అన్నారు. "నేను ఖురైష్ వాళ్లచేత ఇంతవరకు ఎలాంటి అసహ్యకరమైన చేష్టకు గురికాలేదు. అబూతాలిబ్ మరణించగానే వీళ్లు ఇలాంటి వెకిలిచేష్టలు మొదలెట్టారు".

అబూహురైరాగారి ఒక ఉల్లేఖనం ఇలా ఉంది.

అబూతాలిబ్ మరణించిన తరువాత మక్కా ఖురైషులు ప్రవక్త పట్ల చాలా నిర్ధాక్షిణ్యంగా మసలసాగారు. ఆయన ఇలా అన్నారు. "బాబాయి! మీరులేని లోటు నాకు ఎంత తొందరగా కనిపిస్తోంది (అల్ మతుల్ ఔలియ సంపుటి 8, పేజీ 308).

అబూతాలిబ్ మరణించాక ఖురైషు వర్గీయులు ఆయన్ని హతమార్చేందుకు సమాలోచనలు చేయసాగారు. అబూజహల్ ఆయన మెడలో త్రాడు వేయటం, ఉఖబబిన్ మయీత్ ఆయన మెడలో కండువా వేసి లాగటం ఈ కాలంలో జరిగిన సంఘటనలే. గొంతు పిసికి ఆయన్ని తుదముట్టించాలన్న కుట్ర విఫలమైంది. అబూతాలిబ్ చనిపోయాక వ్యతిరేకుల ఆగడాలకు అడ్డు అయిపూలేకుండా పోయింది. అయితే అప్పటికీ వారిలో ఒక

విధమైన జంకు, బెరుకు ఉండేది. దానికి కారణం అరేబియా సమాజంలో అది ఒక విలక్షణమైన సంఘటన కావటమే. కాని అప్పటికీ బహుదైవారాధకులలో కొంతమంది అంతరాత్మ ప్రబోధనానుసారం ఆయన పట్ల సానుభూతి కలిగి ఉండేవారు. ఉదాహరణకు అబూజహల్ మొదటిసారి ఆయన మెడలో త్రాడువేసి గొంతు నులమడానికి ప్రయత్నించిన సంగతి తెలియగానే అబూఅల్‌బక్తహ్‌రి కొరడా తీసుకుని కాబాగృహానికి నడిచాడు. ఆ సమయంలో అబూజహల్ ఏదో ఘనకార్యం చేశానన్న ధీమాతో సహచరులతో కలసి కూర్చుని ఉన్నాడు. జరిగిన దాన్ని గురించి అబూఅల్‌బక్తహ్‌రి ప్రశ్నించి నిజ నిర్ధారణ జరిగాక అబూజహల్ తలపై కొరడాను ఝుళిపించాడు. ఆ దెబ్బకు తాళలేక అబూజహల్ గావుకేక పెట్టాడు.

మత చరిత్ర చాటి చెప్పేదేమిటంటే, బహుదైవోపాసన (షిర్క్) తనకు వ్యతిరేకంగా జరిగే విమర్శలు విని ఎన్నడూ సహించలేకపోయింది. మరి ప్రాచీన కాలపు సమాజం కూడా బహుదైవోపాసనా భావాలపై నిలబడి ఉండటం మూలంగా రాజకీయ వాదులు, అధికారులు కూడా దానికి కుమ్మక్కు వహించేవారు. అందుచేత మక్కా వాతావరణంలో ఏకేశ్వరోపాసనా సందేశం ప్రవక్త పాలిట కఠినమైన పరీక్షగా పరిణమించింది. మొదటి మూడేళ్లకాలంలో వ్రేళ్లపై లెక్కపెట్టదగ్గ – కొద్దిమంది తప్ప మిగిలిన వారు ఆయన మాటను విశ్వసించలేదు. రెండు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే మక్కాలో ఎక్కడా చెట్ల నీడలేనట్లే ఆయనకు ఆసరా ఇచ్చే నేస్తాలు కూడా అక్కడ లేకుండాపోయారు. ఆ పురములో నలుగురు వ్యక్తులు మాత్రమే ఆయనకు సన్నిహితులయ్యారు. వారే ఖదీజా, అలీ, జైద్, అబూబకర్ జన్మతః ముస్లిమైన అబూబకర్ కుమార్తె ఆయిషాను కూడా కలుపుకుంటే ఆయన సన్నిహిత సహచరుల సంఖ్య ఐదు అవుతుంది.

మూడేళ్ళ వరకూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఆ కాలంలో ఆయన ఇంటిగడప దాటి బయటకువస్తే పిచ్చివారికి ఎదురయ్యే పరిస్థితే ఆయనకూ ఎదురయ్యేది. ఒకరోజు అబూజహల్ ప్రేరణపై ఒక గుంపు ఆయన్ని తిడుతూ ఉండగా ఒకవ్యక్తి అటుగా వచ్చాడు. మక్కాకు చెందిన ఒక మర్యాదస్తునిపట్ల జనులు ఇలా ప్రవర్తించటం అతనికి బాధకలిగించింది. అతను సరాసరి ప్రవక్తగారి పినతండ్రి అయిన హమ్జా దగ్గరకెళ్ళి "మీకు ఆత్మాభిమానం లేదా? లోకులు మీ వాడిని అదేపనిగా ఎగతాళి చేస్తూ ఉంటే మీరు నిక్షేపంగా కూర్చుని ఉన్నారా? అని చురక అంటించాడు. హమ్జాలోని అరుదైన అరబ్బీ పౌరుషం పొంగిపొరలింది. హుటాహుటిన అబూజహల్ వద్దకు వెళ్ళి తనచేతిలో వున్న ఇనుప విల్లుతో అతని తలపై మోదారు. అంతేకాదు, "ఈరోజు నుంచి నేను కూడా ముహమ్మద్ ధర్మాన్ని స్వీకరిస్తున్నాను.

ఏం చేసుకుంటావో చేసుకో పో" అని చెప్పేసి మరీ వెళ్ళారు. (అల్‌మోజమ్ అల్‌కబీర్ హదీసు 2926).

అరేబియాలోని ఎన్నదగ్గ పహిల్వానులలో హమ్జా ఒకరు. ఈయన ఇస్లాం స్వీకారంతో మరికొంతమందిలో ఆత్మవిశ్వాసం పెంపొందింది. ముస్లింల సంఖ్య 30కి పెరిగింది. ఆ రోజుల్లో మక్కాలో పలుకుబడి గల ఇద్దరు వ్యక్తులుండేవారు. వారిలో ఒకరు ఉమర్ బిన్ ఖత్తాబ్, రెండవవాడు అబూజహల్ బిన్ హిషామ్, "దేవా! వీరిరువురిలో ఎవరో ఒకరిద్వారా ఇస్లాంకు బలం చేకూర్చు" (అల్‌మోజమ్ అల్ కబీర్ 10314) అని దైవప్రవక్త ప్రార్థించేవారు. ఈ మొరను దేవుడు ఆలకించి ఉమర్ హృదయాన్ని మెత్తబరిచాడు. 6వ సంవత్సరంలో ఉమర్ ఇస్లాం స్వీకరించిన మీదట, ఇస్లాం స్వీకరించేవారి సంఖ్య క్రమక్రమంగా వేగం పుంజుకుంది. ఈ సంఖ్య 40కి చేరింది. ఈ కాలంలో ముస్లింలు అర్‌ఖమ్ ఇబ్నె అర్‌ఖమ్ ఇంటిని తమ రహస్య స్థావరంగా చేసుకుని సమావేశమవుతుండేవారు (ముస్‌తగ్ అల్ హాకిమ్ హదీసు 6130).

అయితే వ్యవస్థీకృతమై వున్న ఆచారాలకు లోబడి వ్యవహరిస్తుండేవారి శక్తి నిత్యం ఎక్కువగానే ఉంటుంది. అందుకే ఉన్నట్టుండి వేధింపుల పరంపర మొదలైంది. ప్రవక్తని రకరకాలుగా యాతనలు పెట్టినప్పటికీ ఆయన్ని హతమార్చలేకపోయారు. ఎందుకంటే ట్రైబల్ వ్యవస్థలో ఏ తెగకు చెందిన వ్యక్తినైనా చంపితే ఆ తెగపై యుద్ధ ప్రకటన చేయటంతో సమానమవుతుంది. ఈ కారణంగానే పూర్వం షుఐబ్ జాతివారు ఆయన్ని ఉద్దేశించి, "తెగవాళ్ల భయమే గనక లేకుంటే నిన్ను రాళ్లు రువ్వి చంపేసేవారం" (11:91) అని చెప్పారు. ముహమ్మద్‌ను తెగనుంచి వెలివేసిన మరునాడే ఆయన్ని హతమార్చవచ్చునన్నది ఖురైషుల ఆలోచన అయితే అబూతాలిబ్‌లోని అభిజాత్యం అందుకు అంగీకరించలేదు. ఒకసారి ఖురైషుల ఒత్తిడిపై అబూతాలిబ్‌గారు ముహమ్మద్‌ను పిలిచి, నాయనా! నువ్వు వాళ్ల దేవతలను విమర్శించటం మానుకోమనేసరికి బహుశా తన బాబాయి తనను ఖురైషులకు అప్పగిస్తారేమో నన్న అనుమానం కలిగింది ప్రవక్తకు. కాని అబూతాలిబ్ తనకలాంటి ఉద్దేశ్యం లేదని చెప్పి ప్రవక్తను ఓదార్చారు (సీరత్ ఇబ్నె ఖుమ్‌షామ్ సంపుటి 2, పేజీ 266). ఆ తరువాత ఖురైషులంతా సంగఠితమై బనూహాషిమ్ వారందరినీ సంఘ బహిష్కరణ చేయాలని తీర్మానించారు. దైవదౌత్యం లభించిన ఏడవ సంవత్సరమది. అబూతాలిబ్ గారు ఆయన్ని, ఆయన తెగలవారందరినీ పిలుచుకుని మక్కా నగరాన్ని విడిచివెళ్ళి ఒక పర్వతలోయలో విడిదిచేశారు. ఆ లోయ 'షాబ్ అబీ తాలిబ్'గా పిలువబడుతుంది. అది ఒక కటిక కొండల

ప్రాంతం. అక్కడ కొన్ని అడవి వృక్షాలు తప్ప మరేమీ లేదు. మూడేళ్ళదాకా ఆయన అక్కడే నివసించవలసి వచ్చింది. ఆకలిబాదను తట్టుకోలేక ఆకులుఅలములు తినిఉండేవారు. కేవలం (4) నిషిద్ధ మాసాలలో మాత్రమే ఆంక్షల్లో సడలింపు ఉండేది. ఈ మాసాలలో బనూ హాషిమ్‌కు చెందిన వ్యక్తులు మక్కాలోకి వచ్చే ఖుర్బానీ పశువుల మాంసాన్ని సేకరించుకుని వచ్చేవారు. ఆ మాంసాన్ని ఎండబెట్టి చాలా రోజుల దాకా ఎండు మాంసం తిని గడిపేవారు.

మూడేళ్లు గడచిన తరువాత – నబువ్వత్ 10వ సంవత్సరంలో బహిష్కరణ ముగిసింది. అయితే ఈ కఠిన బహిష్కారం అబూతాలిబ్ పాలిట చావుదెబ్బే అయింది. అబూతాలిబ్ మరణించిన (620) తరువాత బనూహాషిమ్ సర్దారుగా అబ్దుల్ ఉజ్జా (అబూలహబ్) నియుక్తుడయ్యాడు. అంటే శత్రువు స్వయాన ధర్మాసనాన్ని అధిష్టించాడన్న మాట! పదవిలోకి రాగానే ఆ కర్కోటకుడు ప్రవక్తను తెగనుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాడు.

### తెగనుంచి బహిష్కరణ :

అరేబియా ఎడారి జీవితంలో ఏ వ్యక్తినైనా తెగనుంచి గెంటివేయడమంటే అతన్ని నడిసముద్రంలో ముంచేయటం వంటిదే ఎందుకంటే, బాధ్యతాయుతమైన ప్రభుత్వమంటూ లేని ట్రైబల్ వ్యవస్థలో ఏ వ్యక్తయినా సరే ఏదో ఒక తెగ అండదండలతోనే సుఖంగా జీవించగలుగుతాడు. లేకపోతే జీవితం దుర్లభమైపోతుంది. 'మీనా'లోని మైదానం గుడారాలలో ఒకసారి ఆయన ఒక తెగవారి ముందు దైవసందేశం వినిపించారు. ఆ తెగవారు దాన్ని నిరాకరించారు. అయితే ఆ తెగకు చెందిన ఒక వ్యక్తి (మైసర్ బిన్ మస్ రూఖ్) ధోరణిని బట్టి అతను సందేశానికి కొంతవరకు ప్రభావితుడైనట్లు కనిపించింది.

దైవప్రవక్తకు మైసర్‌పై ఆశలు చిగురించాయి. ఆయన అతనితో సంభాషణ జరిపారు. 'మీ మాటలు ఎంత మధురంగా, మర్యాదపూర్వకంగా ఉన్నాయి! కాని నా జాతివారు విముఖంగా ఉన్నారాయె. ఎవరైనా తన జాతి ప్రజలను అంటిపెట్టుకుని ఉండక తప్పదు కదా!" అన్నాడు మైసరా (అల్‌బిదాయ సంపుటి 3, పేజీ 170).

ఇటువంటి పరిస్థితులలో ఆయన తన తెగనుంచి బహిష్కరించబడటమంటే అది చాలా గడ్డుదశ అన్నమాట. ఇప్పుడాయనకు స్వంత ఊరులోనే ఆసరా లేకుండా పోయింది. ఏదో ఒక తెగను ఆశ్రయించి దాని అండదండలను సంపాదించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ ఉద్దేశ్యంతోనే ఆయన మక్కాను వదలి తాయఫ్ వెళ్ళారు. ఉర్వబిన్ జుబైర్ ఇలా వివరించారు.

"అబూతాలిబ్ మరణానంతరం ఆయనకు పెట్టేబాధలు మరీ ఎక్కువైపోయాయి. ఆ

సమయంలో ఆయన సఖీఫ్ (తాయఫ్) తెగవారి వైపుకు దృష్టి మరల్చారు. వాళ్లు తనకు ఆశ్రయమిచ్చిఅండగా నిలుస్తారేమోనన్న ఆశతో వెళ్లారు (దలాయిల్ అన్ నబువ హదీసు 221).

కాని అక్కడివారు ప్రవక్త యెడల ఎంతపాశవికంగా ప్రవర్తించారో ఆయన చేసిన ఈ ప్రార్థన ద్వారా వెల్లడవుతోంది. తాయఫ్ నుంచి వెనుదిరిగివస్తున్న ఆయన శోకసంతప్త హృదయం నుంచి వెలువడిన వేడుకోలువచనాలివి.

“దేవా! నా శక్తిహీనతను గురించి, ఒనరుల కొరత గురించి నీతో నివేదించు కుంటున్నాను. జనుల దృష్టిలో జరిగిన పరాభవం గురించి నీతో నివేదించుకుంటున్నాను – ఓ కరుణాకరా! దయాసాగరుడా!” (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 420).

తాయఫ్ నుంచి వాపసు అవుతున్నప్పుడు ప్రవక్త సఖీఫ్ తెగవారితో, మీరు నాకు అవమానిస్తే అవమానించారు గాని దయచేసి ఈ సంగతి మక్కా వారికి తెలియనివ్వకండి. ఈ సంగతి తెలిస్తే వాళ్లకు మరింత ధైర్యం వస్తుంది అని కోరారు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 419).

తాయఫ్ నుంచి తిరిగి వచ్చిన తరువాత ఆయన మక్కా పొలిమేరల్లో మకాం వేశారు. తనకు అండగా నిలబడమని అనేకమందికి కబురంపారు. ఎట్టకేలకు ముత్ఇమ్ బిన్ అదీ ఆయనకు మద్దతు ప్రకటించడానికి అంగీకరించాడు. అతని కుమారుల ఖడ్గాల నీడలో ఆయన తిరిగి మక్కాలో ప్రవేశించారు.

అక్కడి నుంచి ప్రవక్త సందేశ పరిచయ కార్యక్రమం నూతన పంథాలో కొనసాగింది. సంతల్లో తిరునాళ్ళలో పాల్గొనడానికి చుట్టు ప్రక్కల నుండి మక్కాకు వచ్చే వివిధ తెగల వారివద్దకు వెళ్ళి వాళ్ల మద్దతుకోరారు. ఆయన తన పినతండ్రి అయిన అబ్బాస్‌తో ఇలా అన్నారు.

“మీ దగ్గర గాని, మీ ఆత్మీయుల దగ్గర గానీ నాకు నీడలేదు. కనీసం రేపు మీరు నన్ను మార్కెట్టుకైనా పిలుచుకెళితే అక్కడ ప్రజల నివాస స్థావరాల వద్దకెళ్ళి వాళ్ళతో మాట్లాడవచ్చు”.

ఆయన ఒక్కో తెగ దగ్గరకు వెళ్ళి మీ దగ్గర ఆశ్రయం కోరిన వారికి మీరిచ్చే రక్షణ ఎలాంటిది? అని ప్రశ్నించసాగారు. “నా తెగవారు నన్ను బహిష్కరించారు. నన్ను మీ సంరక్షణ లోకి తీసుకుంటే నేను నా సందేశ కార్యకలాపాలను సవ్యంగా నిర్వర్తించుకోగలుగుతాను.

ఆ విధంగా ప్రవక్త 15 తెగలవారిని సంప్రదించారని చరిత్రకారులు ఆ తెగల పేర్ల సమేతంగా వ్రాశారు.

కాని ఎవరూ ఆయనకు రక్షణ కల్పించడానికి ముందుకు రాలేదు. ఖురైష్ వర్గీయులు వెలివేసిన ఒక వ్యక్తికి ఆసరా కల్పించటం నిప్పుతో చెలగాటమేనని వారికి తెలుసు. చివరకు ఒక తెగవారిలో మాత్రం ఆయనపట్ల కొంత ఉదారవైఖరికనువుగా, ఆ తెగకు చెందిన ఒక పెద్దమనిషి అన్నాడు.

"ఇతని తెగవారు ఇతన్ని వెడలగొట్టగా మీరు ఇతనికి ఆసరా కల్పించగోర్తున్నారా? మీరు అరబ్బులందరితో లడాయి కొనితెచ్చుకోగోరుతున్నారా? (తలాయిత్ అల్ నబువా హదీసు 222).

ఒక తెగనుంచి బహిష్కార దండనకు గురైన వ్యక్తికి ఆశ్రయం ఇవ్వటమంటే ఆ తెగతో లడాయి కొనితెచ్చుకోవటం వంటిదేనని వాళ్లకు తెలుసు మరి. అందులోనూ ఖురైష్ తెగజోలికి పోవటమంటే అది మరింత సున్నితమైన సమస్య అవుతుంది. అరబ్బు సంప్రదాయాల ప్రకారం ఒక వ్యక్తి ఎవరి దగ్గరకైనా వెళ్ళి ఆశ్రయం కోరడం అవమానకరమైన విషయంగా పరిగణించటం జరిగేది. అటువంటిది, ప్రవక్త తన ఆత్మరక్షణ కోసం నెలల తరబడి విభిన్న తెగలవారిచుట్టూ తిరగవలసి వచ్చింది. అయినా ఎవరూ ఆయనకు ఆశ్రయమివ్వలేదు. తాయఫ్ వారైనా, ఇతర ప్రాంతాలైనా – అందరూ నిరాశే మిగిల్చారు. అందుకు కారణం, ఆయన వ్యవహారం ప్రత్యేకమైనది కావడమే. ఆయన్ని కాదు, పొమ్మన్న వారు అరేబియాకే నేతృత్వం వహించగల ఖుపైషులాయెరి. ఖురైషులు వెలివేసిన వ్యక్తికి మద్దతు నివ్వడమంటే యావత్తు అరేబియాలో అంతర్యుద్ధానికి చిచ్చుపెట్టడమే అవుతుంది. ఈ పూర్వరంగాన్ని దృష్టిలో పెట్టుకునే యస్రిబ్ అన్సార్లు ప్రవక్త సమక్షంలో శపథం (బైత్) చేస్తున్న తరుణంలో అబుల్‌హైషమ్ తన సహచరులనుద్దేశించి ఇలా పలికారు.

"బాగా తెలుసుకోండి, మీరు గనక ఈయన్ని మీ వద్దకు తీసుకెళ్ళారంటే అరబ్బులంతా ఒక్కటై మీపై బాణాన్ని గురిపెడతారు".

మరో కారణం కూడా వీటికితోడై ఉండేది. సరిహద్దు ప్రాంతాలలో నివసించే తెగలు తమ పొరుగున వున్న అరబ్బేతర రాజ్యాలతో కొన్ని ఒప్పందాలు చేసుకుని ఉన్నారు. ముహమ్మద్ లాంటి వివాదస్పద వ్యక్తిని తమతో తీసుకుపోతే పొరుగురాజ్యాలు ఎక్కడ కయ్యానికి కాలు దువ్వుతామోనని వారు భయపడేవారు. ఆయన ఒకసారి 'మీనా' సంతకు వెళ్ళారు. అక్కడ

ాయన బనూషీబాన్ తెగవారితో చర్చలు జరిపారు. వాళ్లు ఆయన సందేశాన్ని మెచ్చుకున్నారు. కాని ఆఖరిలో హానీ బిన్ ఖబీషా ఏమన్నాడంటే; మేము కిస్రా (ఈరాన్ సామ్రాజ్య) సరిహద్దుల్లో ఉన్నాము. ఈరాన్ చక్రవర్తితో మేము ఇప్పటికీ కొన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నాం అని తన అశక్తి తను వ్యక్తంచేశాడు.

"మీరు ఏ విషయం వైపుకు మమ్ము ఆహ్వానిస్తున్నారో అది బహుశా చక్రవర్తుల ఆగ్రహానికి దారితీయవచ్చు" (అల్‌బిదాయ సంపుటి 3, పేజీ 144).

ఆ రోజుల్లో ప్రవక్త ఎంతటి నిస్సహాయస్థితికి లోనై ఉండేవారో ఈ క్రింది పలుకులను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఒకసారి ఆయన బనూ అబ్దుల్లా అనబడే ఒక తెగవద్దకు వెళ్ళారు.

"ప్రవక్త వాళ్లను దేవుని వైపుకు ఆహ్వానించారు. తన్నుతాను వాళ్లముందు సమర్పించుకుని తనకు ఆశ్రయమివ్వమని కోరారు. 'బనూ అబ్దుల్లాహ్! అల్లాహ్ మీకు ఎంత మంచి పేరుపెట్టాడు!' అని కూడా కొనియాడారు. అయినా వాళ్లు ఆయన ఇచ్చిన సందేశాన్ని స్వీకరించ నిరాకరించారు".

ఈ విధంగా మక్కా హయాంలోని చివరి మూడు సంవత్సరాలు వివిధ తెగలతో సంప్రదించి వాళ్ల మద్దతు కోరడంలోనే గడచిపోయాయి. కాని సకల యత్నాలు చేసినా ఏ ఒక్క తెగవారు కూడా ఆయనకు మద్దతు ప్రకటించలేదు. కొన్ని తెగలవారైతే విసుగెత్తి, మీరింకా మాపైన ఆశలు పెట్టుకునే ఉన్నారా? అని అన్నారు. ఎట్టకేలకు అల్లాహ్ యస్రిబ్ (మదీనా)కు చెందిన ఔస్, ఖజ్రజ్ తెగలకు ఈ సౌభాగ్యం ప్రసాదించాడు. ఔస్ ఖజ్రజ్‌లో దీనికి అంగీకరించడం వెనుకకూడా ఓ బలమైన కారణం ఉంది. ఈ తెగలు యూదుల మధ్య నివసించేవి. కైబర్ ప్రాంతానికి చెందిన యూదులు యస్రిబ్‌లోని సారవంతమైన భూములను ఆక్రమించుకుని పబ్బం గడుపుకునేవారు. వర్తకం కూడా వారి హస్తగతమై ఉండేది. యస్రిబ్‌లోని ఔస్ ఖజ్రత్ తెగల వారిలో చాలామందికి కైబర్ యూదుల దగ్గర చెమటోడ్చి పనిచేస్తేగాని నోటికి ముద్దరాదు. హిజ్రత్ చేసిన తరువాత దైవప్రవక్త మరియు ఆయన సహచరులు కలసి మస్జిదెనబవీని నిర్మిస్తున్నప్పుడు ప్రవక్త నోట ఈ కవితలు వెలువడ్డాయి.

("ఇది కూడా కూలిపనే. కాని కైబర్ కూలి వంటిదికాదు. మన ప్రభువుసాక్షి! ఇది దానికన్నా ఎంతో మేలైనది, శ్రేష్ఠమైనది") (బుఖారి 3906).

యూదుల ఆర్థిక ప్రాబల్యం వల్లనూ, వారి దోపిడీవిధానం వల్లనూ యూదులకు –

ఔస్ ఖ్రజజ్‌లకు మధ్య తరచూ పోరాటాలు జరుగుతూ ఉండేవి. మా గ్రంథాలలో ఇవ్వబడిన శుభవార్త ప్రకారం అరేబియాలో ఒక ప్రవక్త రానున్నారని, ఆయన ప్రభవించిన మీదట మేము ఆయనతో కలసి మీతో పోరాడతామని, సమూలంగా మిమ్మల్ని తుడిచిపెట్టేస్తామని అప్పుడప్పుడూ యూదులు వాళ్లను బెదిరిస్తూ ఉండేవారు. యూదుల ఈ మాటనే ఉదాహరిస్తూ ఖుర్‌ఆన్ ఒక చోట ఇలా చెప్పింది (2:89). అంతకుముందైతే వారు అవిశ్వాసులపై తమకు విజయం చేకూర్చమని ప్రార్థించేవారు. ఔస్, ఖ్రజజ్ తెగలవారు. ప్రవక్త సందేశాన్ని విన్నప్పుడు "దేవుని తోడుగా! యూదులు విశ్వసించకముందే తాము ఈ ప్రవక్త సందేశాన్ని స్వీకరించి ఆయన వర్గంలో చేరిపోవాలని వాళ్లు నిశ్చయించుకున్నారు. ఈ పూర్వాపరాలతో పాటు మరికొన్ని చారిత్రక, సామాజిక కారణాలవల్ల కూడా ఔస్, ఖ్రజజ్ తెగలవారు ఆయన సందేశాన్ని హృదయపూర్వకంగా స్వీకరించి ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు.

ప్రవక్త సంవత్సరాల తరబడి నిరీక్షిస్తూ వుండిన సమయం వచ్చేసింది. ట్రైబల్ ప్రజల మద్దతుతో తన కృషిని ప్రభావవంతమైన రీతిలో కొనసాగించేందుకు ఇప్పుడు ఆయనకు సరైన చోటు లభించింది. మక్కా మరియు మక్కా పరిసరాలలో నివసించే జనులందరినీ సమీకరించి దాన్ని ఒక ఇస్లాం కేంద్రస్థానంగా చేసే అవకాశాలు మెరుగయ్యాయి. యస్రిబ్ ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి ఇస్లాం స్వీకరించినట్లు ప్రమాణం చేయడంతో చెల్లాచెదురై వున్న ఇస్లాం శక్తిని, ఒనరులను ఒకచోట చేర్చి, సందేశపరిచయ కార్యాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైనట్లు కనిపించింది. అందుకేనేమో ఔస్ మరియు ఖ్రజజ్ తెగలవారు బైత్ (ప్రమాణం) చేసిపోయిన మీదట ఆయన తన ప్రియ సహచరుల దగ్గరకెళ్ళి ఇలా అన్నారు.

"ఆయన తక్షణం తన సహచరుల వైపుకు వెళ్ళి వారితో అన్నారు. దైవానికి కృతజ్ఞతలు చెప్పండి. అల్లాహ్ ఈ రోజు రబీయ సంతతికి పారసీకులపై ఆధిక్యత నొసగాడు". (అల్‌బిదాయ సంపుటి 3, పేజీ 145).

ఆయన హిజ్రత్ సన్నాహాలు మొదలెట్టారు. ఆయన అత్యంత గోప్యంగా ఏర్పాట్లు చేసుకుంటున్నప్పటికీ ఈ సంగతి ఖురైషులకు తెలిసిపోయింది. తిబ్రానీ గారు హిజ్రత్ ఉర్వా ఆధారంగా చేసిన సంకలనం ప్రకారం.

దైవప్రవక్త – మక్కా నుండి వెళ్ళిపోతారనీ, ఆయన కోసం మదీనాలో నివాస స్థానం, ఆశ్రయం లభించిందనీ, అన్సార్లు ఇస్లాం స్వీకరించారని, ముహాజిర్లు మదీనాలో సమీకరించ

బడుతున్నారని బహుదైవారాధకులైన ఖురైషులకు తెలియగానే వాళ్లు ప్రవక్తకు వ్యతిరేకంగా కుట్రపన్నారు. ముందు ఆయన్ని నిర్బంధించాలని ఆ తర్వాత ఆయన్ని చంపివేయటమో, కారాగారంలో పడవేయటమో, దేశ బహిష్కరణ చేయటమో చేయాలని తీర్మానించుకున్నారు.

ఔస్ మరియు ఖజ్రత్ తెగల వారు ముస్లిములయ్యాక ఆయన ఆరు నెలల పాటు అత్యంత పకడ్బందీగా ప్రయాణ సన్నాహాలు చేశారు. ఆ తరువాత ఎంతో చాకచక్యంగా మక్కా నుండి నిష్క్రమించారు. (మజ్మా అజ్ జవాయిత్ హదీసు 9902).

# యస్రిబ్ వాసుల ఇస్లాం

ప్రాచీన యస్రిబ్ (మదీనా) ఔస్, ఖజ్రజ్‌లనే రెండు తెగలుండేవి. వారితో పాటు కొన్ని యూద తెగలు కూడా ఆ పురంలో నివసించేవి. యూదులు నిత్యం ఔస్ – ఖజ్రజ్‌ల మధ్య తగాదాలు పెట్టి వాటి మధ్య అనైక్యత ఉండేలా చేసేవారు. ఔస్ – ఖజ్రజ్‌లు పరస్పరం కలహించుకుని బలహీనులైతేనే వారిపై యూద ప్రాబల్యం కొనసాగుతుంది మరి. ప్రవక్త వలసపోక ఐదు సంవత్సరాలకు పూర్వం ఒక సంఘటన జరిగింది. యూదుల ఉసిగొల్పుపై ఖజ్రజ్ తెగవారు ఔస్ తెగతో పోరాడటానికి సిద్ధమయ్యారు. ఔస్ తెగసర్దారైన అబుల్ హసీబ్ అనస్ బిన్ రాఫె కొంతమందిని వెంటబెట్టుకుని మక్కా వచ్చాడు – ఖురైషుల సాయం కోరే ఉద్దేశ్యంతో వాళ్లు వచ్చిన సంగతి ప్రవక్తకు తెలియగానే ఆయన వాళ్లదగ్గర కెళ్ళారు. వారికి ఇస్లాం సందేశం వినిపించారు.

ఆ బృందంలోని అయాస్ బిన్ మాజ్ అనే నవయువకుడు దీనికి ప్రభావితుడై “దైవసాక్షి! మనం దేనికోసం ఇక్కడికొచ్చామో దానికన్నా ఇది మేలైనది” అని తన వాళ్లతో అన్నాడు. కాని అతని మిత్రులకు ఆ విషయం బుర్రకెక్కలేదు. అబుల్ హోసీబ్ బిన్ రాఫె ఇంతమట్టి పుచ్చుకుని అయాస్ బిన్ మాజ్ ముఖంపై వేశారు. “ఈ మాటల్ని ఇక కట్టిపెట్టు. నా జీవితంపై ఒట్టు. మనం వచ్చింది దీనికోసం కాదు” అన్నాడు (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 427–428).

ఔస్ బృందం ఇస్లాం స్వీకరించకుండానే యస్రిబ్‌కు తిరోన్ముఖమైంది. ఆ తరువాత ఔస్–ఖజ్రత్ తెగలమధ్య ‘బుఅస’గా పేరుమోసిన యుద్ధం జరిగింది. ఇరు తెగలమధ్య శత్రుత్వం ఏ స్థాయికి చేరిందంటే ఒక తెగవారు తమ ప్రత్యర్థితెగను సమూలంగా నాశనం చేయాలని ఆరాటపడేవారు. ఈ యుద్ధంలో తొలుత ఖజ్రజ్‌కు విజయం వరించింది. తరువాత ఔస్ తెగ అబూ అసీద్ సారథ్యంలో పోరాడి ఖజ్రజ్‌ను ఓడించింది. రెండు తెగలూ వంతులవారీగా

ఒండొకరికీ తీరని నష్టం కలిగించాయి. ఆఖరికి పంటపొలాలు, నివాస గృహాలను కూడా తగలబెట్టుకున్నారు. ఆవిధంగా ఆ రెండు తెగలూ సర్వవిధాలా బలహీనమైపోయాయి.

ఈ యుద్ధం వల్ల యూదుల రొట్టె విరిగి నేతిలో పడింది. యూదులు యస్రిబ్ పై తిరుగులేని ఆధిక్యతను సంపాదించారు. ఆవేశం చల్లారిన తర్వాత ఇరుతెగలకు చెందిన ఆలోచనా పరులు కొంతమంది కూర్చుని జరిగిన పొరబాటుకు చింతించారు. ఒండొకరికి నష్టం చేకూర్చి శత్రువుకు తమపై అధికారం చెలాయించే అవకాశం కల్పించామే అని ఆత్మావలోకనం చేసుకున్నారు. పరస్పర విభేదాలను విస్మరించి ఉమ్మడి నాయకుణ్ణి ఎన్నుకోవాలని, ఇకనుంచి సంగఠితంగా ఉండాలని నిర్ణయించారు. తరువాత బహుముఖ శూరుడైన అబ్దుల్లాబిన్ ఉబైద్రాఖ్రజ్ తమ నాయకునిగా ఎన్నుకున్నారు. ఆ కాలంలో ఖ్రజ్ తెగకు చెందిన ఓ పయన బృందం కాబా సందర్శనార్థం మక్కా వచ్చింది. ప్రవక్త వారితో సమావేశమయ్యారు. తాను దైవప్రవక్తననీ, తన సందేశాన్ని స్వీకరించమనీ ఆయన వారిని కోరారు. అంతకు ముందు నుంచీ యూదులు చెబుతూ ఉండే 'ఆ ప్రవక్త' ఈయనే అయి ఉంటారని వాళ్లు ఊహించారు. యస్రిబ్ ప్రజలు ఇలా అన్నారు. "సోదరులారా! దైవసాక్షి! యూదులు ఏ ప్రవక్త గురించి మీకు సమాచారం ఇస్తూ ఉన్నారో ఆ ప్రవక్త ఈయనే. చూడండి, వాళ్లకంటే ముందే మీరు ఈ విషయంలో ముందంజ వేయాలి".

వారంతా ప్రవక్త సందేశాన్ని గ్రహించారు. పైగా వాళ్లు ఇలా పలికారు. "మేము మా జాతిని వదలిపెట్టి వచ్చాము. వారిలో వున్నంత మంకుతనం, వైరభావం మరే జాతిలోనూలేదు. బహుశా అల్లాహ్ తమరిద్వారా వారిని ఏకం చేయవచ్చేమో! మేము తిరిగి వెళ్ళిన తర్వాత ఈ సత్యవాణిని మా వాళ్లకు అందజేస్తాము. దేవుడేగనక వాళ్లను ఈ ధర్మం పేర సంగఠితపరిస్తే ఈ దేశంలో మీకన్నా శక్తిమంతుడెవడూ ఉండబోడు". (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 429).

ఆ తరువాత యస్రిబ్ వాసులు తండోపతండాలుగా వచ్చి ఇస్లాంలో చేరిపోయారన్నదానికి చరిత్రే సాక్షి. వాళ్లు ఇస్లాంకు 'అన్సార్లు' (సహాయకులు)గా నిరూపించుకున్నారు. వారి అసాధారణ త్యాగాలు, సహాయసహకారాల వల్ల ఇస్లాంకు అరేబియాలో తిరుగులేని ఆధిక్యత చేకూరింది.

యస్రిబ్ వాసులు హిజ్రత్‌కు ఐదేండ్ల పూర్వమే ప్రవక్త సందేశాన్ని పస లేనిదని చెప్పి నిర్లక్ష్యం వహించారు. కాని ఐదేళ్ళ తరువాత ఈ తిరస్కారులే ఆయన విశ్వాసులు అయ్యారు.

దీనికి కారణమేమిటంటే మొదటిసారి కలుసుకున్నప్పుడు వాళ్ల మదిలో యుద్ధ మేఘాలు అలుముకుని ఉన్నాయి. తమకొక శత్రువు ఉన్నాడని, ఎలాగైనా అతన్ని తుదముట్టించాలని పొద్దస్తమానం ఆలోచిస్తుండేవారు. వారి మనోభావాలపై రణరంగం ఆలోచనలు ఆధిక్యతను చెలాయిస్తుండడం వల్ల దేవుడు, మరణానంతర జీవితంవంటి విషయాలు వారి బుర్రకెక్కేవి కావు. పైగా ఇవన్నీ నిరర్థకమైన మాటలని అనుకునేవారు.

కాని 'బుఆస్' యుద్ధంలో తమ శక్తిసంపదలన్నీ హరించుకుపోయిన మీదట వారికి ఏమీ మిగల్లేదు – ఒక్క వినాశం తప్ప! పైగా వారికి ఇంకొక సత్యం తెలిసింది – యూదులు తమ మధ్య తలంపులు పెట్టి క్రమక్రమంగా అరబ్బు సంతతిని తుదముట్టించడానికి కుట్ర పన్నుతున్నారని వాళ్లు పసిగట్టగలిగారు. ఇప్పుడు వారిలో దూరదృష్టి పెరిగింది. అలజడుల బదులు ప్రశాంతతను, విభేదాల బదులు సమైక్యతను కోరుకోసాగారు. ప్రతివిషయాన్ని నిర్మాణాత్మక దృష్టికోణంలో ఆలోచించసాగారు. అసలు సమస్య ఔస్–ఖజ్రజ్‌లది కాదని, సమస్యల్లా ఔస్ ఖజ్రజ్‌లకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతున్న యూదులదేనని వారు అర్థం చేసుకున్నారు. వర్గతెగల విభేదాలను రూపుమాపి సైద్ధాంతిక ప్రాతిపదికపై తామందరినీ ఒక్కటిగా చేయగల ఒక విశ్వాసం, తామందరినీ ఏకతాటిపై నడిపించగల ఒక సారథి అవసరం ఇప్పుడు వారికి ఏర్పడింది. ఈ రెండు వస్తువులు కూడా వారికి ప్రవక్తలో లభించాయి. అంతే, వారంతా ఆయనవైపుకు పరుగెత్తుకువచ్చారు.

అందుకే ఆయిషా ఇలా అన్నారు. 'బఅస్' యుద్ధాన్ని అల్లాహ్ తన ప్రవక్తకు సహాయ కారిగా చేశాడు (బుఖారి 3777).

# ప్రస్థానం

హిజ్రత్ సంఘటన ఇస్లాం చరిత్రలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. ఈ కారణంగానే ప్రవక్త అనుయాయులు దానిని ఇస్లాం శకానికి నాందిగా ఉపయోగించుకున్నారు. అయితే ఈ సంఘటన యొక్క అసలు విషయం – వాస్తవికత – మహిమాన్విత గాథల్లో మరుగున పడిపోయింది.

ఉదాహరణకు : దైవప్రవక్త సూర్ గుహలో తలదాచుకున్నప్పుడు సాలెపురుగు దాని ముఖద్వారంపై గూడువేసిందని, ఆ తరువాత ఒక పిట్టవచ్చి ఆ గూడుపై గుడ్లు పెట్టిందని చెప్పబడుతుంది. సాధారణంగా ఇలాంటి సంఘటనలకు సంబంధించి ఏం జరుగుతుందో అదే ఈ విషయంలోనూ జరిగింది. అంటే అసలు విషయానికి ఒకటి రెండు వర్ణనలు

జోడించటం జరిగింది.

ఇబ్నె కసీర్ స్పష్టం చేసినట్లు, ఇమామ్ అహ్మద్‌గారు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ నుండి గ్రహించిన ఉల్లేఖనం మాత్రమే ఈ విషయంలో ప్రామాణికమైనది. ఆ ఉల్లేఖనం ఇలా ఉంది.

"వాళ్ళు ప్రవక్త జాడలను అనుసరించారు. వాళ్లు పర్వతం వరకు వచ్చాక అడుగుజాడలు కనిపించలేదు. వాళ్లు పర్వతమెక్కారు. గుహవైపునుంచి కూడా సాగిపోయారు. గుహాముఖ ద్వారంపై సాలెగూడు ఉండటం వాళ్లు గమనించారు. ఒకవేళ ఆయన ఈ గుహలోని దూరి ఉంటే సాలెగూడు ఉండేది కాదు అని చెప్పుకున్నారు". (ముస్నద్ అహ్మద్ 3251).

ఒకవేళ వాళ్లు చూసిన గుహ సూర్‌గుహేనని ఒప్పుకున్నప్పటికీ పై ఉల్లేఖనం ప్రకారం వాళ్లు సాలెగూడును చూశారంతే. దేవుడు ఆజ్ఞాపించగా సాలెపురుగు వచ్చి గూడు అల్లిందని పక్షిని ఆదేశించగా అది వచ్చి గుడ్లు పెట్టిందని ఉల్లేఖనాలలో లేదు. ఈ విధమైన మాటలన్నింటినీ ప్రజలు అసలు సంఘటనతో జోడించినవి మాత్రమే.

ఇలాంటి సాపేక్షిక విషయాలవల్ల జరిగే నష్టం ఏమిటంటే మనిషి దృష్టి పదేపదే మహిమలు, అద్భుతాలవైపుకు పోతూ ఉంటుంది. వివేచన, గుణపాఠంలాంటి ముఖ్య విషయాలు దృష్టికి రాకుండాపోతాయి.

## ముహాజిర్లకు చేయూత :

మదీనాలోని తెగలు (అన్సార్లు) ప్రవక్తకు అందించిన తోడ్పాటు చరిత్రలోనే అపూర్వ మనాలి. జనులు ఎవరికైనా ఏదైనా వస్తువు ఇస్తే అది ప్రతిఫలాన్ని ఆపేక్షించైనా ఇస్తారు లేదా భయంతోనైనా ఇస్తారు. లావాదేవీల మూడవ రకం 'శుభాన్ని' దృష్టిలో పెట్టుకుని జరుగుతుంది. మృతులైన కొంతమంది సజ్జనులకు సంబంధించి వారి పేరుతో దానధర్మాలు చేయటం లేక వారిపేర అన్నం పెట్టడం లేక శ్రద్ధాంజలి ఘటించటం వృద్ధివికాసాలకు, శుభశ్రేయాలకు ప్రతీక అని కల్పించుకోవటం జరుగుతుంది. కాని ఆశయంకోసం ఇల్లూ వాకిలీ వదలివచ్చిన ముహాజిర్ల కోసం ఒక జాతి మనస్ఫూర్తిగా తలుపులు తెరచి స్వాగతం పలకడమేగాక స్వంత అన్నదమ్ముల్లా భావించి తమ ఆస్తిపాస్తుల్లో భాగం పంచి ఇవ్వటం బహుశా మనకు తెలిసిన మానవచరిత్రలోనే అపూర్వమేమో! ముహాజిర్లకు తాము చేసే ఈ సహాయం తమను ఆర్థిక ఇక్కట్లలో పడవేయడమే గాక, అరబ్బులు – అరబ్బేతరుల మధ్య యుద్ధానికి దారితీస్తుందని తెలిసికూడా అన్సార్లు వెనుకంజ వేయలేదు. అన్సార్ల శీలం

గురించి అలీ రెండు ముక్కల్లోనైనా ఎంత చక్కగా చెప్పారు!

"ఔస్ మరియు ఖజ్రజ్ తెగలవారు గొప్ప సత్యవంతులు. గొప్ప సహానుభూతిగలవారు". (అల్ బిదాయ సంపుటి 3, పేజీ 145).

ముహాజిర్లు తమ ఊరూవాడ వదలి యస్రిబ్‌కు చేరుకున్నప్పుడు అన్సార్లు ఆనందానికి అవధుల్లేవు. వారిలో ప్రతి ఒక్కడూ ఆతిథ్యం ఇచ్చే గనత తనకే దక్కాలని ఉవ్విళ్ళూరుతూ ఉండేవాడు. అన్సార్లు తమ సిరిసంపదల్లో మేలైన భాగాలను వేరుచేసి ముహాజిర్లకు ఇచ్చారు (దలాయిల్ అన్‌నబువ హదీసు 224).

వాళ్లు అన్ని అసాధారణ త్యాగాలు చేసినప్పటికీ పదవుల పంపకంలో ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని. ఈ విషయంలో పోరు పడకూడదని వారిచేత మాట తీసుకోవటం జరిగింది. (ముస్లిం 1709).

మొత్తం మీద హిజ్రత్ అనంతరం మదీనాలో కూడా ప్రవక్త జీవితం సుఖవంతంగా గడవలేదు. అరబ్బులు కట్టకట్టుకుని వచ్చి తమపై దండయాత్ర చేస్తారనే ఆయన అనుమానం అక్షర సత్యమేనని తేలింది. ఉబైబిన్ కాబ్ ఇలా అంటున్నారు.

"మదీనాకు వచ్చిన ప్రవక్తకు మరియు ఆయన ప్రియ శిష్యులకు అన్సార్లు ఆశ్రయమిచ్చారని తెలియగానే అరబ్బులంతా కలసి ఆయనపై పగబూనారు. మదీనాలోని ముస్లింలు ఆయుధాలు తోడుంచుకుని రాత్రి నిద్రపోవలసి వచ్చేది. ఆయుధాలు పెట్టుకుని పగలు గడపవలసివచ్చేది".

యావత్తు అరేబియాలో మదీనా ప్రజలపై ఆర్థిక ఆంక్షలు విధించాలని ఖురైషులు ప్రకటించారు. మదీనాలో జనాభా అకస్మాత్తుగా రెండింతలు కావటంతో ఆర్థిక వనరులు కొరత ఏర్పడింది. దానికి తోడు నిరంతరం ఎదురయ్యే యుద్ధాలు, యుద్ధవ్యయాల వెరసి ఆర్థిక ఇబ్బందుల్ని మరింత హెచ్చించాయి. ఇస్లాం ప్రవక్త మదీనాలో పగలంతా ఆకలి బాధతో తిరగటం తాను చూచానని, కడుపునింపుకోటానికి గుప్పెడు ఖర్జూరపు పండ్లు కూడా దొరకని దినాలు గడిచాయని ఉమర్ చెప్పారు. దీపం గురించి ఎవరో ఆయిషాను ప్రశ్నించగా, దీపం వెలిగించేటంత చమురేగనక ఇంట్లో ఉంటే దాన్ని మేము త్రాగేసేవారమేమో! అని ఆమె బదులిచ్చారు. యుద్ధాలలో చాలీచాలని సామాగ్రి ఉండేది. అబూమూసా ఇలా తెలిపారు. మేము ప్రవక్తతో కలసి యుద్ధానికి బయలుదేరాము. ఆరుగురు వ్యక్తులతో కూడిన మా బృందానికి ఒక్కగానొక్క ఒంటె మాత్రమే ఉండేది. వంతులవారీగా మేము దానిపైకెక్కి

కుర్చునేవాళ్లం. నిరంతరం కాలినడకన పోవటం వల్ల మా కాళ్లలో పగుళ్లు వచ్చేవి. గుడ్డలు చించి పాదాలకు చుట్టుకున్నాం.యుద్ధ సమయాలలో ఆహారకొరత ఎంత అధికంగా ఉండేదో తెలుసా! సహచరులు ఖర్జూరపు పండ్లు 'తినే' బదులు 'చప్పరించేవారు' కడుపు నిండకపోతే ఆకులు తినేవారు. ఆహార అలవాట్లలో మార్పుకారణంగా వ్యాధులు ప్రబలేవి. మక్కా పౌరులు మాంసానికి, పాలకు అలవాటుపడినవారు. కాని వారికి మదీనాలో తినడానికి ఖర్జూరపు పండ్లు దొరికేవి. ఒకరోజు ప్రవక్త శుక్రవారం నమాజ్ చేయించడానికి మస్జిద్‌లోనికి రాగానే ఒక మక్కా ముస్లిం బిగ్గరగా...

"ఓ దైవప్రవక్తా! ఖర్జూరపు పండ్లు మా కడుపుల్ని మాడ్చేశాయి" అని ఘోషించాడు. (అహ్మద్ 15955).

ప్రవక్త మక్కానుండి మదీనాకు చేరాక ఇస్లాం క్రియాత్మకంగా సందేశ ప్రచారస్థాయిని అధిగమించి దుర్మార్గాన్ని ఎదుర్కోగలిగే స్థాయికి చేరింది. సత్య సందేశ ప్రచారం సందర్భంగా ప్రవక్త ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక తదితర వివాదాస్పద విషయాల జోలికి పోకుండా ప్రజలకు "హెచ్చరించటం, శుభవార్తనందించటమే" తన పరమావధిగా పెట్టుకున్నారు.అమిర్ బిన్‌సాకు ప్రవక్త సూఖె ఉకాజ్‌నంతలో ఇస్లాం సందేశం ఇచ్చినప్పుడు తాను తన సందేశాన్ని శాంతియుత వాతావరణంలో మాత్రమే అందజేస్తానని వారికి హామీయిచ్చారు. మీ మధ్య రాజకీయ, ఆర్థిక సామాజికమైన గొడవలను సృష్టించబోమని ఆ తెగవారికి మాటిచ్చారు.

"నేను దైవప్రవక్తను నేను మీ దగ్గరకు వస్తే మీరు నాకు రక్షణ కల్పిస్తారా? మీరు అలా చేస్తే నేను ప్రజలకు దైవసందేశం అందించగలుగుతాను. మీలో ఎవరినీ ఏ వస్తువు కొరకూ నిస్సహాయులుగా చేయను". (దాలాయిల్ అన్‌నబువ హదీసు 215).

అసలు ఆశయం దృష్ట్యా ఈ పని నిరంతరం కొనసాగుతూ ఉండింది. కాని తరువాత కాలంలో మరో విషయాన్ని కూడా చక్కదిద్దవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అదే వాతావరణ జనిత సమస్యలు. ఈ సందర్భంగా ప్రవక్త ఓ సూత్రాన్ని అనుసరించారు. అదేమిటంటే ప్రజల మనసులు మెత్తబడేలా వ్యవహరించదలిచారు. వివాదాలు, నిరసనలకు ఆస్కారం లేకుండా ప్రజలు ఇస్లాం ఆశయాలను ఆవళింపు చేసుకునేలా ఓ ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్ట గోరారు. ఆ విషయాన్నే ప్రవక్త ఇలా చెప్పారు.

"ఒకనెల సుధీర్ఘ ప్రయాణము చేయగల అంత దూరము నుండే నాపట్ల శత్రువుకి అంతర్గత భయము కలిగినట్లు దేవుడు నాకు సహకరించాడు". (బుఖారి 335)

ఈ ప్రణాళికలో రెండు విషయాలు చాలా ముఖ్యమైనవి. ఒకటి : భయపెట్టించే శక్తిని కూడదీసుకోవటం (8:60), రెండవది : హృదయాలను జయించటం (9:60)

హృదయాన్ని జయించే (తాలీఫె ఖల్) ఉద్దేశ్యంతో ఆయన జనులకు ఎంత విశాలహృదయంతో కానుకలు, వస్తువులు ఇచ్చారంటే చరిత్రలో అలాంటి ఉదాహరణ మరొకటి కనిపించదు. సఫ్వాన్ బిన్ ఉమయ్య మక్కాలో ఒక పెద్ద సర్దారు. మక్కా విజయానంతరం ఆయన ఒక నగరం నుంచి పారిపోయి ఒక పర్వతశ్రేణిలో దాక్కున్నాడు. ప్రవక్త అతనికి అభయమిచ్చి పిలిపించారు. హవాజిన్ తెగను జయించిన తరువాత ప్రవక్త 'జీరాన' అనే స్థలంలో 'విజయప్రాప్తి'ని పర్యవేక్షిస్తూ ఉన్నారు. ఆ సమయంలో సఫ్వాన్ బిన్ ఉమయ్య ప్రవక్త వెంట ఉన్నారు. అప్పటికీ ఉమయ్య అవిశ్వాస స్థితిలోనే ఉన్నారు. ఒంటెలు, గొఱ్ఱెలతో నిండివున్న ఒక పర్వతశ్రేణికి చేరారు ఉమయ్య. ఆశ్చర్యంతో, ఆశతో ఆ గొఱ్ఱెల మందను చూడసాగారు. ఉమయ్య పరిస్థితిని గమనించిన దైవప్రవక్త ఆయన్ని ఉద్దేశ్యించి "ఓ అబూవహబ్! సంపదతో నిండిన ఈ పర్వతలోయ మీకు నచ్చిందా?" అని ప్రశ్నించారు. 'అవును' అన్నాడు సఫ్వాన్. "ఇది మరియు ఇందులో ఉన్న ఒంటెలు, గొఱ్ఱెలన్నీ మీవే" అన్నారు దైవప్రవక్త. ఆది విన్నంతనే సఫ్వాన్ ఆశ్చర్యపోయాడు. 'దైవప్రవక్త తప్ప మరోవ్యక్తి ఇంతటి విశాలహృదయంతో దానం చేయడు. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవంలేడని, ముహమ్మద్ ఆయనదాసుడు మరియు ప్రవక్తయనీ నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నాడు సఫ్వాన్. తక్షణమే ఇస్లాం స్వీకరించాడు. (మాగాజి అల్ వాఖిది సంపుటి 2, పేజీ 855).

ప్రవక్త అనేక వివాహాలు చేసుకోవటంలోని అంతరార్థం కూడా ఇదే. ట్రైబల్ వ్యవస్థలో బంధుత్వ సంబంధాలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. హిజ్రత్ తరువాత ప్రవక్త అనేక వివాహాలు చేసుకోవటం లోని ముఖ్యోద్దేశం, వివిధ తెగలవారితో మైత్రీ సంబంధాలను మెరుగుపరచుకోవటం. ఆశించినట్లుగానే బాంధవ్యాలు పెరిగాయి. ఆయాతెగల మనసులు మెత్తబడ్డాయి. సత్యవాక్కు వాళ్ల మనోక్షేత్రాలలో నాటుకోగలిగింది. మక్కాలో ప్రవక్త తన మొదటి వివాహాన్ని తనకంటే దాదాపు రెట్టింపు వయసున్న వితంతు మహిళతో చేసుకున్నారు. ఇతర వివాహాలన్నీ నిజానికి దాంపత్య కోర్కెల కోసం గాక సందేశ ప్రధానమైన ఉద్దేశ్యాలతోనే జరిగాయి.

హుదైబియా ఒప్పందం జరిగిన మరుసటి సంవత్సరం క్రీ.శ. 628 ప్రవక్త రెండువేల మంది ముస్లిములతో కలసి కాబా సందర్శనార్థం మక్కా వెళ్ళారు. ఆ సందర్భంగా ఆయన మక్కాలో 3 రోజులు విడిదిచేసి హారిస్ కుమార్తె అయిన మైమూనాను నికాహ్ చేసుకున్నారు.

ఆమె కూడా వితంతువే. మైమూనాకు ఎనమండుగురు సోదరీమణులున్నారు. ఆ ఎనమండుగురి వివాహం కూడా మక్కాలోని పేరుమోసిన కులీనులతో జరిగింది. ఆయన మైమూనాను వివాహమాడి ఎనిమిది ఉన్నత కుటుంబాలతో బంధుత్వాన్ని పటిష్టవంతం చేసుకున్నారు. అదిగాక ఖాలిద్ బిన్ వలీద్ వంటి యోధుడు మైమూనాకు స్వయాన భ్రాతృజుడవుతారు. ఆయన్ని ఆమెగారు కన్నకొడుకులా పెంచారు. ఈ నికాహ్ తర్వాత ఖురైషుల అతిపెద్ద సైనిక యోధుడు ఆయనకు కుమారుడైపోయాడు. ఆనాటి నుంచీ ఖాలిద్ బిన్ వలీద్ ముస్లిములకు వ్యతిరేకంగా జరిగే ముట్టడులలో పాల్గొనలేదు – అచిర అనతి కాలంలోనే ముస్లిమైపోయారు. ఈ వివాహాన్ని పురస్కరించుకుని ఆయన మక్కా ప్రముఖులను వలీమా విందుకు కూడా ఆహ్వానించారు. అయితే ఒప్పందం ప్రకారం ప్రవక్త మక్కా నగరంలో మూడు రోజులకన్నా ఎక్కువగా ఉండరాదని పట్టుబట్టడంతో, ఆయన వెంటనే అక్కడినుంచి బయలుదేరవలసి వచ్చింది. ఈ కారణంగా హృదయాలను జయించేందుకు వచ్చిన ఈ కారుణ్యమూర్తి మక్కావారికి వలీమా విందు ఇవ్వలేకపోయారు. ఖాలిద్ బిన్ వలీద్, అమర్ బిన్ ఆస్ – ఇద్దరూ ఒకేసారి ముస్లిములయ్యారు. వాళ్లు మదీనా చేరగానే వారిని చూచిన ఒక వ్యక్తి 'వీరిద్దరి తర్వాత మక్కా తన కళ్ళాన్ని వదిలేసినట్లే"నని ఆనందాన్ని వెల్లడించాడు. (మగాజి అల్‌వాఖిది సంపుటి 2, పేజీ 744).

అబూసుఫ్యాన్ కుమార్తె అయిన ఉమ్మె హబీబా మరియు ఆమె భర్త ఉబైదుల్లాబిన్ జహష్ చాలాముందే ఇస్లాం స్వీకరించారు. వారిద్దరూ అబిసీనియాకు వలసపోయారు. కాని అక్కడికెళ్ళిన తర్వాత ఆమె భర్త క్రైస్తవమతం పుచ్చుకున్నాడు. ఇది జరిగిన కొన్నాళ్ళకే ఆయన చనిపోయాడు. ప్రవక్త వితంతువైన ఉమ్మెహబీబాను వివాహమాడాలనుకున్నారు. ఈ వివాహమే గనక జరిగితే – బద్ర్‌యుద్ధంలో అబూజహల్ మరణించిన తరువాత మక్కాలో కెల్లా అగ్రనాయకుడుగా వర్ధిల్లుతున్న అబూసుఫ్యాన్‌కు ఆయన అల్లుడు అయిపోతారు. ప్రవక్త నికాహ్ సన్నాహాలు ప్రారంభించారు. ఉమ్మె హబీబా గనక అబిసీనియానుండి మక్కాకు తిరిగివస్తే ఆమె తండ్రి తనతో నికాహ్‌కు అంగీకరించడని ఆయనకు తెలుసు. అబిసీనియా చక్రవర్తి నజాషీ మధ్యవర్తిగా ఉండి ప్రవక్తతో ఆమె వివాహాన్ని జరిపించాడు. ఇది 'గాయిబాన నికాహ్' (పరోక్ష నికాహ్) అనబడుతుంది. అప్పటికి ఆమె అబిసీనియా రాజ్యంలోనే ఉన్నారు. వివాహానంతరం ఆమె నేరుగా మదీనాకు పంపబడ్డారు. ఈ వివాహం జరిగిన నాటినుంచీ అబూసుఫ్యాన్ వ్యతిరేకత తగ్గుముఖం పట్టసాగింది. ఆఖరికి మక్కా విజయానికి ఒకరోజు ముందే ఆయన ఇస్లాం స్వీకరించారు.

ఈ డిప్లమసీలో మరో ముఖ్య కోణం ఉంది. దాన్నే ధార్మిక పరిభాషలో “ఇర్‌హాబ్ పాలసీ” విధానమంటారు (8:60). అంటే బలప్రయోగం బదులు బల ప్రదర్శన ద్వారా లక్ష్యాన్ని సాధించడమన్న మాట! అబూసుఫ్యాన్ గనక తన సైన్యాన్ని తీసుకుని తిరోన్ముఖుడవకుండా మరుసటి రోజు కూడా దాడిచేసి ఉంటే ఉహద్ (హి(జీ 3) పోరాటం ముస్లిముల పాలిట సంపూర్ణ పరాజయంగా పరిణమించేదే! ‘రోహా’ వద్దకు చేరిన తరువాతగాని అబూసుఫ్యాన్‌కు తన తప్పు తెలిసిరాలేదు. తన సైన్యాన్ని మళ్ళీ మదీనావైపుకు మళ్లించాలని అనుకున్నాడు. అయితే తీవ్రమైన ఆ గందరగోళ పరిస్థితుల్లో కూడా ప్రవక్త తన ఆంతరంగికుల ద్వారా శత్రువు కదలికలపై నిఘావేసి ఉంచారు. అబూసుఫ్యాన్ ఉద్దేశ్యాన్ని పసిగట్టిన గూఢచార సిబ్బంది తక్షణం ఆ వార్తను మదీనాకు చేరవేసింది. ప్రవక్త చర్యకు ఉపక్రమించారు. క్షతగాత్రులై ఉన్న సహచరులనే సంగఠితం చేసి మక్కావైపుకు కదలిపోసాగారు. సాదారణంగా అత్యంత గోప్యంగా పకడ్బందీగా వ్యూహరచన చేసే ప్రవక్త గారు ఈసారి బహిరంగంగా ప్రయాణ సన్నాహాలు చేశారు. ఈ సంగతి అబూసుఫ్యాన్‌కు తెలియగానే, బహుశా ముహమ్మద్‌కు చుట్టుప్రక్కల నుంచి సైనిక సాయం అంది ఉంటుందని అనుమానం వచ్చింది. మదీనావైపుకు వెళ్ళాలన్న తన ఆలోచనలను విరమించుకుని మక్కావైపుకు తోకముడిచాడు. అబూసుఫ్యాన్ సైన్యం మక్కా వెళ్ళిపోయిందని నిర్ధారణ అయ్యాక ఆయన సంతృప్తమనసుతో మదీనాకు తిరిగివచ్చాడు.

మూతా యుద్ధం (జమాది–ఉల్–అవ్వల్, హి(జీ 8) జరిగిన మరుసటి సంవత్సరమే రోము చక్రవర్తి సిరియా సరిహద్దులో సైనిక విన్యాసాలు చేయటం మొదలెట్టాడు. అతనికి తోడుగా గసానీ మరితర సరిహద్దు ప్రాంతాల అరబ్బు సర్దారులు కూడా సైనిక బలాలను సమీకరించసాగారు. ఈచర్యలకు జవాబుగా ప్రవక్త 30 వేల మంది సైనికులను వెంటబెట్టుకుని బయలుదేరారు. దానినే తబూక్ యుద్ధం (రజబ్, హి(జీ 9) అంటారు. తబూక్ యుద్ధం వాస్తవానికి ఒక యుద్ధనీతి (తంత్రం) మాత్రమే. శత్రువు దాడి జరపకముందే అతనికి తమ శక్తిసామర్థ్యాల తడాకా తెలిసివచ్చేలా చేయటం ఒకెత్తుగడ. శత్రు శిభిరంలో ఆత్మవిశ్వాసాన్ని నీరుగార్చి వాళ్లు తమ దాడి యత్నాలను విరమించుకునేలా చేయటం కూడా ఒక రణనీతే. తబూక్ వద్దకు చేరేసరికి రోము చక్రవర్తి తన సైన్యాన్ని సరిహద్దు ప్రాంతాలనుంచి వెనక్కి పిలిపించాడని తెలిసింది. దాంతో ప్రవక్త యుద్ధ సంకల్పాన్ని విరమించుకున్నారు. అయితే రోము సేనల వెనుకంజవల్ల చేకూరిన నైతిక బలంవల్ల ఆయన ఇతరత్రా రాజకీయ ప్రయోజనాలను పొందేందుకు పథకాలు వేశారు. ఆయన తబూక్‌లో 20 రోజుల పాటు

విడిదిచేసి అక్కడ నివసించే వివిధ తెగలవారితో సంప్రదింపులు జరిపారు. ఆనాటి వరకూ ఆయా తెగలు రోము సామ్రాజ్య ప్రభావానికి లోనై ఉండేవి. ఈ సందర్భంగా దోమతుల్ జుందల్‌కు చెందిన క్రైస్తవ శ్రీమంతుడు ఉకీదిర్ బిన్ అబ్దుల్ మలిక్ కిందీ, ఏలా ప్రాంతానికి చెందిన యోహనా బిన్ రూయ, అలాగే మక్నా,జర్బా, అజ్‌రుహై ప్రాంతాలకు చెందిన క్రైస్తవ ధనికులు కూడా జిజ్‌యా చెల్లించి మదీనా సంరక్షణలో ఉండటానికి అంగీకరించారు.

అబూబకర్ సిద్దీఖ్ ఖలీఫాగా నియుక్తులైన తర్వాత ఉసామ బృందం బయలుదేరి వెళ్ళటంలోని అంతరార్థం కూడా ఇదే. ప్రవక్త పరమ పదించిన తరువాత 'తై' అనే తెగవారు మినహా మదీనా పరిసరాలలోని తెగలవారంతా తిరుగుబాటు దారులైపోయారు. సంఖ్యాపరంగా తాము కొద్దిమందే ఉండగా, మరోవైపు శత్రువుల సంఖ్య అనుదినం పెరిగిపోతుండటంతో ముస్లింల పరిస్థితి "శీతా కాలపు వర్షంలో తడిసిన గొర్రె"లా తయారైంది. ఆ సమయంలో పరిస్థితిని చూస్తే మొదట ఇంటి శత్రువుల మెడలు వంచి అంతరంగికంగా రాజ్యాన్ని పటిష్టవంతం చేయవలసిన ఆవశ్యకత ఉందనిపించేది. కాని ప్రప్రథమ ఖలీఫా దైవప్రవక్త నిర్ణయానికి కట్టుబడి, 700 మంది సైనికులతో కూడిన ఉసామ బృందాన్ని రోమనులను ప్రతిఘటించేందుకు సిరియాపంపారు. ఆ సైనిక చర్యవల్ల పడిన ప్రభావం ఎటువంటిదో అబూహురైర ఉల్లేఖనాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

సిరియా వైపుకు కదం తొక్కుతున్న ఉసామ సైనిక పటాలాన్ని చూసి ధర్మభ్రష్టులై పోవాలని సంకల్పించుకున్న అనేక తెగలవారు, 'ముస్లింల వద్దనే గనక అపారమైన సైనిక బలం లేకపోతే ఇలాంటి సంకట స్థితిలో కూడా జైత్రయాత్రలు ఎందుకు చేస్తారు? అందులోనూ మనలాంటి చిన్న చిన్న తెగలపనిపట్టకుండా ఏకంగా రోము సైన్యాన్నే ఎదుర్కొనబోతున్నారంటే ఏమనుకోవాలి?" నోరు తెరచారు ముస్లిం సేనలు రోమనులతో పోరాడి, వారిని ఓడించి, సురక్షితంగా తిరిగిరావటం చూసి వైముఖ్యదశలోనున్న తెగలవారంతా ఇస్లాంపై నిలకడగా ఉండిపోయారు". (అల్‌యతిఖాద్ లిల్ బైహాఖి పేజీ 406).

ప్రవక్త మదీనా చేరినప్పుడు అక్కడ బహుదైవారధకుల వర్గమేగాక మరో రెండు పెద్ద వర్గాలు నివసిస్తుండేవి. ఈ రెండు వర్గాలు కూడా అనేక ముఠాలుగా చీలిపోయి ఉండేవి. వాళ్ల మధ్య ఐకమత్యం అన్నది నామమాత్రంగా కూడా లేదు. తమ మధ్య ఐకమత్యం పెంపొందించి తామందరినీ ఒకే త్రాటిపై నడిపించగల ప్రజ్ఞాశాలి కోసం వాళ్లు ఎదురుచూస్తూ ఉన్నారు. ప్రవక్త ఈ పరిస్థితుల స్వరూపాన్ని అధ్యయనం చేసి ఒక 'సహీఫా' (మెమోరాండం)

జారీ చేశారు. అందులో యూదులు మరియు ముస్లింలను రెండు శాశ్విత ప్రాతిపదికగల వర్గాలుగా ఆమోదించటం జరిగింది. ఆ లేఖలో అప్పటివరకూ ప్రేళ్లూనికుని వున్న ఆచారదురాచారాల జోలికి పోకుండా, వారి హక్కులు బాధ్యతలను గురించి ప్రస్తావించకుండా వాళ్లను రెండు ముఖ్యమైన వర్గాలుగా గుర్తించటం జరిగింది. ఆ తరువాత అందులో ఒక అధికరణకు చేర్చటం జరిగింది. అదేమిటంటే,

"ఎప్పుడైనా మీ మధ్య ఏదైన విషయంలో అభిప్రాయభేదం తలెత్తితే ఆ వ్యవహారం దైవం మరియు దైవప్రవక్త వైపుకు మరలించబడుతుంది". (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 1, పేజీ 501-503).

ఈ విధంగా ఈ 'సహీఫా' ఒక విధమైన రాజకీయ చర్య అన్నమాట! తద్వారా ఆయన అత్యంత నేర్పుతో మదీనాపై ఇస్లాం రాజ్యాంగ వ్యవస్థను ప్రకటించారు.

ప్రవక్త మదీనా చేరిన మీదట ఖురైషుల కోపం తగ్గకపోగా మరింత ఎక్కువైంది. చెల్లాచెదురుగా పడివున్న ముస్లింలంతా ఒక చోటకు చేరి తమ పరిస్థితిని పటిష్టవంతం గావించుకోనటాన్ని వాళ్లు విస్మరించలేదు. హిజ్రీ రెండవ సంవత్సరంలోనే ప్రవక్త ముందు సవాళ్లు ఎదురయ్యాయి. ముందుకు పోయి ఖురైషు సైనికులను ఎదుర్కోవటమో లేక శత్రువును మదీనాలో జొరబడినిచ్చి అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటున్న ఇస్లాం కుటీరాన్ని కూల్చివేయనివ్వటమో తేల్చుకోవలసిన క్లిష్టస్థితి దాపురించింది. ఖురైషు సైనికుల సంఖ్య 950కి పై చిలుకు ఉండగా ముస్లింలలో యుద్ధం చేయగలవారు 313 మంది మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ దైవప్రవక్త ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. బహుదైవారధకులు సంఖ్యాపరంగా తమకన్నా మూడింతలు అధికంగా ఉన్నప్పటికీ వాళ్ల దగ్గర అసూయాద్వేషాల వంటి నకారాత్మక మూలధనం మాత్రమే ఉంది. దీనికి భిన్నంగా ముస్లిముల వద్ద విశ్వాసమనే సకారాత్మక ఖజానా ఉంది. ఇది మొదటి వర్గం శక్తియుక్తులకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. అదీగాక అరబ్బులు తమ అజ్ఞానకాలపు విధానం ప్రకారం జట్లు విడిపోయి పోరాడేవారు. తద్వారా తమ వ్యక్తిగత ప్రతిభ వ్యక్తమవుతుందన్నది వాళ్ల ఉద్దేశ్యం. కాని ముస్లింలు దైవంపై భారం మోపిన తరువాత ఈ బలహీనతకు దూరమయ్యారు. ప్రవక్త వారికి అరబ్బు చరిత్రలో ప్రప్రథమంగా సంఘటితత్వాన్ని గురించి ప్రబోధించారు. వ్యక్తిగత ప్రతిభా పాటవాలు చూపించబోయి ప్రమాదాలు కొనితెచ్చుకోరాదనీ, ఒక పటాలంగా మారి పోరాడాలని, ఖురైషుల వ్యక్తిగత బలాన్ని మీ సామూహిక శక్తితో ఓడించమని (61:4). ఆయన వారికి బోధించారు. విశ్వాసం మరియు సంఘటిత శక్తి ద్వారా ఇస్లామీయ చరిత్రలో అద్భుతమైన తొలివిజయం

ప్రాప్తించింది. అదే బద్ర్ విజయం.

## ఇస్లాం విజయం :

బద్ర్ యుద్ధంలో కలిగిన పరాభవం ఖురైషులను మళ్లీ రెచ్చగొట్టింది. స్వల్పకాలంలోనే ముస్లింలు వాళ్లను అనేకసార్లు ఎదుర్కొనవలసిన పరిస్థితి ఏర్పడింది. వాటిలో ఉహద్ (హిజ్రీ–3), అహ్జాబ్ (హిజ్రీ 5) యుద్ధాలు పేర్కొనదగినవి. ఈ యుద్ధాలలో ముస్లింలు కష్టాలలో కూరుకుపోవలసివచ్చింది. కందక పోరాటంలో 800 మంది నిమగ్నులైవున్నారు. కాని తీవ్రమైన చలి, ఆకలి, అలసట వల్ల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందంటే, శత్రువుల కదలికలను పసిగట్టడానికి ఒక వ్యక్తిని పంపిద్దామన్న ఉద్దేశ్యంతో ప్రవక్త మూడు సార్లు కేకేసినా ఎవరూ ముందుకు రాలేకపోయారు. ఆఖరికి ఆయన హుజైఫా దగ్గరకొచ్చి, పేరుపెట్టి పిలిచి మరీ ఆయనకు ఆ బాధ్యతను అప్పగించారు.

మరోవైపున మదీనాలోని యూదులు శాశ్వితంగా ఒక అంతరంగిక బెడదగామారారు. ఇస్లాంకు వ్యతిరేకంగా వాళ్లు ఖురైషులతో కలపి కుట్రలు చేసేవారు. 20 రోజుల ముట్టడి తర్వాత ఖురైషులు ఒక పెనుగాలిలో చిక్కుకుపోయి ఇంటి ముఖం పట్టిన తరువాత ప్రవక్త మదీనాలోని యూదులకు శాస్తి జరగటానికి అదే సరైన సమయమనుకున్నారు. ఎందుకంటే కందక యుద్ధంలో యూదుల కుట్రలన్నీ బహిర్గతమైనాయి. వాళ్లు ఇంట్లోని శత్రువులని స్పష్టంగా నిరూపించుకున్నారు. ఆయన మదీనాలోని తెగలను (బనూనజీర్, బనూఖైన్‌ఖా, బనూఖురైజా తెగలు) వెంటనే ముట్టడించారు. వారిపై స్వయాన వారి గ్రంథమే అయిన తౌరాత్ చట్టాన్ని విధించి వాళ్ల సమస్యను శాశ్వితంగా రూపుమాపారు.

ఇక కైబర్ సమస్య ఉత్పన్నమైంది. హిజ్రీ 6వ ఏట ఈ సమస్య ఎదురైంది. మదీనాకు దక్షిణాన నాలుగువందల కిలోమీటర్ల దూరంలో మక్కా ఖురైషులున్నారు. మదీనాకు ఉత్తరాన రెండువందల కిలోమీటర్ల దూరంలో కైబర్ యూదులున్నారు. వీరిద్దరి మధ్య మదీనాలో (ఇస్లాం గృహం) దారుల్ 'ఇస్లాం' ఉంది. ఖురైషులు, యూదులు ఇస్లాం శత్రుత్వంలో ఒక్కటే అయినప్పటికీ వారు విడివిడిగా ముస్లింలతో ఎదిరించి ఇస్లాంను నిర్మూలించే స్థితిలో లేరు. అందుకే వాళ్లు సంయుక్తంగా దాడిజరిపేందుకు మంతనాలు ప్రారంభించారు. మరోవంక ముస్లింలు కూడా ఒకే సమయంలో ఇద్దరు శత్రువులను ఎదుర్కొనే స్థితిలో లేరు.

అలాంటి పరిస్థితుల్లో ప్రవక్త దివ్య సంకేతానుసారం హిజ్రీ 6వ సంవత్సరంలో 1500 మంది సహచరులతో మక్కావైపుకు బయలుదేరారు. తాము ఎవరితోనూ యుద్ధం చేయటానికి

పోవటంలేదని, మక్కాలో దైవగృహ (కాబా) సందర్శనార్థమే వెళుతున్నామని బహిరంగ ప్రకటన గావించారు. ఖుర్బానీ పశువులను కూడా తమ వెంట తీసుకుపోయారు. అజ్ఞానకాలపు ఆచారం ప్రకారం ఖుర్బానీ ఇచ్చే ఒంటెలకు తొడిగించే ప్రత్యేక గుర్తుగల పట్టాలను తొడిగించమని ఆజ్ఞాపించారు. తాము మక్కాకు వస్తున్నది కయ్యం కొరకు కాదని, కాబా కేంద్రాన్ని సందర్శించిపోవడానికి మాత్రమేనని మక్కావారు గ్రహించడానికే ఇన్ని జాగ్రత్తలు వహించారు.

మక్కాకు సుమారు 11 కిలోమీటర్ల దూరంలో – హుదైబియా అనే స్థలానికి చేరుకునే సరికి ఖురైషులు వారిని నిలువరించారు. ఆయన వివాదానికి అతీతంగా – ఎంతో నిగ్రహం వహించి – అక్కడే విడిదిచేశారు. ఇరువర్గాల మధ్య ఒప్పందానికి తాను సిద్ధమేనని ఖురైషులకు కబురంపారు.

“మేము ఎవరితోనూ పోరాడటానికి రాలేదు, ‘ఉమ్రా’ చేయడానికి మాత్రమే వచ్చాము. యుద్ధం ఖురైషుల స్థితిని దిగజార్చింది. వారికెంతో నష్టం వాటిల్లింది. వాళ్లు గనక కొరితే ఒక (నిర్యుద్ధ) గడువును నిర్ణయిస్తాను. దీనికి ప్రతిగా వాళ్లు నాకు మరియు ప్రజలకు మధ్య అడ్డుతొలగాలి. నేను విజేతనైన పక్షంలోవారు కోరితే ఈ ధర్మంలో ప్రవేశించవచ్చు. నాకు గనక విజయం చేకూరకపోతే వారి కోరిక వారికే ప్రాప్తిస్తుంది. ఖురైషులు గనక దీన్ని అంగీకరించకపోతే, ఎవరి ఆధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను – ఈ వ్యవహారంలో వాళ్లతో పోరాడుతాను – నా తలవేరైపోయినా సరే వెనుకంజవేయను. దైవాజ్ఞ అయితీరుతుంది. (బుఖారి 2731)

ఈ వర్తమానం వెనుక మరో అంతరార్థం కూడా ఉంది. ఖురైషులలో ఏర్పడివున్న ఒక భావన ద్వారా ప్రయోజనం పొందటం దీని ఉద్దేశ్యం. మక్కాలోని తొలిరోజుల్లో ఉతబా బిన్ రబీయా ఖురైషు ప్రతినిధిగా వచ్చి దైవప్రవక్తతో సంభాషించి వెళ్ళిన తరువాత అతను ఖురైషుల సమక్షంలో వెల్లడించిన అభిప్రాయాలలో ఒకటి ఇది.

“ఆయన్ని ఆయన మానాన వదిలిపెట్టండి. దైవసాక్షి. ఆయన పట్టిన పట్టును విడిచేవాడుకాడు. మీరు వారు మరియు మొత్తం అరబ్బుల మధ్య నుంచి తొలగిపోండి. ఆయనగనక అరేబియాపై ఆధిపత్యం సంపాదిస్తే వారి గౌరవమే మీ గౌరవమవుతుంది. ఆయన గనక ఓడిపోతే ఇతరుల ద్వారా మీరు వారి నుండి విముక్తి నొందుతారు”. (దలాయిల్ అన్నబువా హదీసు 185).

ఈ ఆలోచన ఖురైషుల నరాల్లో జీర్ణించుకుని ఉంది. ఆయన దాన్ని వాడుకున్నారు. తత్ఫలితంగా స్వయంగా శత్రువుల్లోనే ఆయనకు సహాయకులు లభించారు.

ఒకవైపు నుంచి ఈ కబురుపంపి, మరోవైపునుంచి పలురీతుల్లో ఖురైషులను ప్రభావితుల్ని చేసే యత్నాలు ప్రారంభించారు. బనీ కనానకు చెందిన ఒక వ్యక్తి మక్కా నుండి బయలుదేరి హుదైబియా చేరుకున్నాడు. ముస్లింలు ఏ ఉద్దేశ్యంతో వచ్చారో తెలుసుకోవటం అతని ఉద్దేశ్యం. ఆ వ్యక్తి వస్తున్నట్లు తెలియగానే ప్రవక్త తన సహచరులతో, అతని తెగవారు ఖుర్బానీ పశువులను మెచ్చుకోలుగా, భక్తిభావనతో చూస్తారు. కాబట్టి మీరు మీ ఖుర్బానీ పశువులతో సహా వెళ్ళి అతనికి స్వాగతం పలకండి అని పురమాయించారు. ముస్లిముల ఒంటెలను వరుసగా నిలబెట్టి "లబ్బైక్ అల్లా హుమ్మలబ్బైక్" (హాజరయ్యాము దేవా మేము హాజరయ్యాము) అని పలుకుతూ అతనికి ఎదురుగా వెళ్ళారు. ఆ వ్యక్తి మక్కాకు తిరిగివచ్చిన తరువాత అమితంగా ప్రభావితుడయ్యాడు. ''ముస్లిములు కేవలం కాబాసందర్భనార్థమే వచ్చారని దృఢ నమ్మకం. కనుక మీరు వారిని అడ్డుకోరాదని కోరుతున్నాను" అని ఖురైషు నాయకులతో చెప్పనే చెప్పాడు. (అహ్మద్ 18910).

అలాగే వెయ్యిన్నరమంది ముస్లింల ప్రవర్తనా నియమావళి కూడా వాళ్లను ముగ్ధుల్ని చేసింది. ఖురైషుల ప్రతినిధి ఒకడు హుదైబియా చేరిన సమయంలో ముస్లిం బారులు తీరి ప్రవక్త నేతృత్వంలో నమాజ్ చేస్తూ కనిపించారు. నమాజ్‌లోని క్రమశిక్షణ, సంఘటిత తత్వాల దృశ్యాన్ని చూచి అతను అదిరిపోయాడు. మక్కాకు మరలిన తర్వాత ఖురైషులతో మాట్లాడుతూ, "ముస్లిముల సంఘటన అత్యంత పటిష్టవంతమైంది. ముహమ్మద్ ఒక్క సైగ చేస్తే చాలు వాళ్లు ఏదైనా చేస్తున్నారు అని అభిప్రాయపడ్డాడు. మరొక దౌత్యవేత్త వచ్చిన సమయంలో ప్రవక్త వూజూ చేస్తూ ఉండగా ముస్లిములు ఆయన వైపుకు ఎగబడి నీటిచుక్కలు నేలపై పడకముందే వాటిని తమ దోసిట్లోకి తీసుకోవటం కనిపించింది. ఆయన ప్రవచిస్తున్నప్పుడు అందరూ గప్‌చిప్‌గా ఉండిపోవటం, భక్తి ప్రవత్తుల మూలంగా వాళ్లు ఆయనతో చూపులు కలపడానికి సైతం జంకటం కనిపించింది. దౌత్యవేత్త వాపసు అయ్యాక ముస్లిముల విశ్వసనీయతను, ప్రేమాభిమానాలను గురించి ఖురైషులకు పూసగుచ్చినట్లు చెప్పాడు. దాంతో ఖురైషుల ఆత్మవిశ్వాసం మరీ సన్నగిల్లింది. బదైల్ బిన్ వరకా ద్వారా ఈ సందేశం ఖురైషులకు చేరిన తరువాత వారి మనిషి ఒకతను (ఉర్వబిన్ మస్‌వూద్) ఇలా ఉపన్యసించాడు.

ఉర్వ ఇలా అన్నాడు :

"ఓ నా జాతి వారలారా! మీలో కొంతమంది నా తండ్రికి సమానులు అని ప్రశ్నించగా 'అవును' అని జనులు సమాధానమిచ్చారు. 'మీలో కొందరు నా సంతానానికి సమానులు కారా? అని అడగ్గా ఎందుకు కారు?' అని జనులు బదులిచ్చారు. 'మరి మీకు నాపై ఏదైనా సందేహం ఉందా?' అని ఉర్వ ప్రశ్నించగా 'లేదు' అని జనులు జవాబిచ్చారు. 'మరైతే వినండి. ఆ మనిషి మీ ముందు అత్యుత్తమమైన ఒక ప్రతిపాదిన పెట్టాడు. దాన్ని మీరు అంగీకరించండి. చర్చలు జరపడానికి నన్ను అనుమతించండి' అని ఉర్వ అన్నాడు. (అల్‌బిదాయ సంపుటి 4, పేజీ 174).

ఖురైషులు ఏ షరతు పెట్టినా దాన్ని తాను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నానని ప్రవక్త ప్రకటించారు. మొత్తానికి ఖురైషులు సంధికి సిద్ధమయ్యారు కాని ఒప్పందం వ్రాతపూర్వకంగా జరిగే సమయంలో వాళ్లు తమ అజ్ఞానపు అహంభావాలన్నింటినీ ఒలకబోశారు. ఒప్పందంలోని మ్యాటరులో 'దైవప్రవక్త ముహమ్మద్' అని వ్రాసి ఉంటే దాన్ని 'భిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్' అని ఉంటే దాన్ని 'బిస్మికల్లాహుమ్మ'గా మార్చమని కోరారు. ఆ ఒప్పందంలో ఖురైషువర్గానికి చెందిన ఏ వ్యక్తయినా ముస్లింల వద్దకు వస్తే వాళ్లు అతన్ని వాపసుచేసి తీరాలి. దీనికి బదులుగా ముస్లిం గనక ఖురైషుల వద్దకు వస్తే మాత్రం వాళ్లు అతన్ని వాపసు చేయరు" అనే అదనపు నిబంధనను చివరిక్షణాల్లో చేర్చారు. ముస్లింలు ఆ సంవత్సరం ఉమ్రా చేయకుండానే వెళ్ళిపోవాలని ఖురైషులు షరతు విధించారు. ప్రవక్త సహచరులకు ఈ ఏకపక్ష షరతులు ఆగ్రహం కలిగించాయి. ఒక దశలో ఉర్వబిన్ మస్‌వూద్ రెచ్చగొట్టే ధోరణిలో ఇలా అన్నాడు. "ముహమ్మద్! మీరు మీ చుట్టూ పోగుచేసుకున్న ఈ అనామక జనులు, కష్టకాలం వచ్చినపుడు మిమ్మల్ని వదలి వెళ్ళిపోతారు". ఇది విని అబూబకర్ లాంటి మృదుస్వభావి కూడా కోపోద్రిక్తులైపోయారు. ఆవేశంలో ఆయన నోట ఈ మాటలు వెలవడ్డాయి.

"నువ్వు 'లాత్' అంగాన్ని పీల్చు. మేము ఈయన్ని వదలి పారిపోతామని అంటావురా?" (సహీబుఖారి 2731).

కాని దైవప్రవక్త మాత్రం సంయమనం కోల్పోలేదు. కవ్వింపు చేష్టలన్నింటినీ సహించి కూర్చున్నారు. వాళ్లు పెట్టిన ఏకపక్ష డిమాండ్లన్నింటినీ అంగీకరించి ఖురైషులతో పదేండ్ల నిర్యుద్ధ సంధి చేసుకున్నారు. రాబోయే పదిసంవత్సరాల దాకా ఖురైషులు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ముస్లింలపై యుద్ధం ప్రకటించడానికి వీల్లేకుండాపోయింది.

ఈ ఒప్పందాన్ని ముస్లింలు ఎంతో అవమానకరమైనదిగా తలపోశారు. ఒప్పందం పూర్తయిన తర్వాత ప్రవక్త తన సహచరులనుద్దేశించి ఖుర్బానీ ఇవ్వండని మూడుసార్లు పురమాయించినా ఏ ఒక్కరూ పశువులను ఖుర్బానీ ఇచ్చేందుకు ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఖుర్బానీ ఇచ్చినా దుఃఖవదనంతో ఇచ్చారు. ఖుర్బానీ అనంతరం క్షవరం చేసుకుంటున్న తీరును చూడబోతే పరస్పరం కోసుకోవటానికి సిద్ధమవుతున్నారా (బుఖారి 2731) అనిపించింది. కాని అణగిమణిగి చేసుకున్న ఈ ఒప్పందం వల్ల కలిగిన ప్రయోజనాలు ఇన్నీ అన్నీ కావు.

హుదైబియా ఒప్పందం జరక్కముందు ముస్లింల ఎదుట రెండు బలమైన శత్రువర్గాలుండేవి. ఒకటి ఖైబర్‌లోని యూదవర్గం. రెండు : మక్కాకు చెందిన ఖురైష్ వర్గం. ముస్లింలు అప్పటికి ఆ రెండు వర్గాలను ఒకేసారి ఎదుర్కొనే స్థాయిలోలేరు. ఒకరిపై దాడిచేయటం రెండోవానిని దాడికి ఆహ్వానించడమే అయ్యేది. ముస్లింలు గనక ఖురైషులతో పోరాడదలచి మక్కాపైకి దాడిచేస్తే అటునుంచి ఖైబర్ యూదులు వచ్చి మదీనాను ముట్టడించి ఇస్లామీయ రాజ్యాన్ని ఖతంచేసే ప్రమాదం పొంచి ఉండింది. అందుకే ప్రవక్త షరతులన్నింటినీ ఒప్పుకుని ఖురైషులతో పదేండ్ల "నిర్యుద్ధ సంధి" చేసుకున్నారు. ఆ విధంగా వారిని మక్కా 'కడుపు'లోనే ఆపేశారు (48:24). ఆ తరువాత మదీనాకు వచ్చీ తీరిక దొరకగానే ఖైబర్‌ను ముట్టడించి యూదుల బెడదను శాశ్వతంగా నిర్మూలించారు. మొదటి సంఘటన హిజ్రీ 6వ ఏట జిల్‌ఖాఇద నెలలో సంభవించగా రెండవసంఘటన హిజ్రీ 7వ సంవత్సరం ముహర్రం నెలలో జరిగింది.

ఖైబర్‌లో యూదులకు 8 బలమైన కోటలుండేవి. ఆ కోటల్లో సాయుధులైన 20 వేలమంది సైనికులు పొంచివున్నారు. ఆ సైనిక బలం ముందు ముస్లింల బలం దేనికీ సరిపోదు. ఇంతటి బలమైన సాయుధమైన నగరాన్ని ఎలా జయించారంటే అదొక సుదీర్ఘ వృత్తాంతం. ఆ సమయంలో ఆశ్చర్యకరమైన రణతంత్రం ఒకటి అవలంబించడం జరిగింది. మచ్చుకు ఒక ఉపాయం – కోట ద్వారాలను బద్దలుగొట్టడానికి 50 మంది ఒక పెద్ద వృక్షం మొదలు పట్టుకుని తలుపులవైపుకు పరుగెత్తుకెళ్ళి గట్టిగా బాదేవారు. అలా కొన్నిసార్లు బాదేసరికి కోట తలుపు బ్రద్ధలైపోయేది. వెంటనే ముస్లిం సేనలు అగ్ని గోళాలను లోపలకు విసురుతూ, బాణాలు సంధిస్తూ తీవ్రమైన గందరగోళ స్థితిని సృష్టించేవారు. ఈ రకంగా నాలుగు కోటలు వశమయ్యాయి. మిగతా కోటల్లో ఉన్నవారు కూడా భీతావహులై వారంతటి వారే బయటకు వచ్చి ముస్లింల సమక్షంలో లొంగిపోయారు.

కైబరు విజయం తర్వాత మక్కా ఖురైషుల సమస్య మిగిలివుంది. ఈ విషయంలో ప్రవక్త దైవిక దూరదృష్టితో వ్యవహరించి శత్రువుచేసే తప్పిదం కోసం నిరీక్షించారు. ఒప్పందానికి విరుద్ధమైన పనిగనక శత్రువు చేస్తే దాన్ని పురస్కరించుకుని జోక్యం చేసుకోవచ్చు. ఖురైషులు ఇస్లాంకు శత్రువులుగా మారడానికి ప్రధాన కారణం అసూయాద్వేషాలు, అధికారదాహమని ఆయనకు తెలుసు. ఎవరైతే ఇలాంటి భావాలకులోనై ఒక వస్తువును త్రోసిరాజంటారో వారు తమంతటతామే నిర్హేతుకమైన, నీతి మాలిన కార్యాకలాపాలకు ఒడిగట్టి అవతలి వారికి పట్టుబడిపోతారు. ఖురైషుల విషయంలో కూడా అదే జరిగింది. ఖుజాఆ–బనూబకర్ తెగల మధ్య (హి్జ్రీ 8, షాబాన్ నెలలో) జరిగిన యుద్ధంలో ఖురైషులు తమ మిత్రపక్షమైన బనూబకర్‌కి అండగా ప్రవక్తగారి మిత్రపక్షమైన బనూ ఖజాఅపై దండయాత్ర చేసి ఘోరమైన తప్పిదానికి ఒడిగట్టారు. ఈ దాడి హుదైబియా ఒప్పందానికి పూర్తిగా విరుద్ధమైనది. హుదైబియా ఒప్పందం జరిగిన రెండు సంవత్సరాల తరువాత ఈ సంఘటన జరిగింది.

ఈ ఒప్పందం ఫలితంగా ఈ రెండేళ్ళ కాలంలో ఇస్లాం అత్యంత శక్తివంతమైన వ్యవస్థగా రూపొందింది. హుదైబియా ఒప్పందం జరిగిన రోజున ప్రవక్త వెంట 15 వందల మంది సహచరులుండగా ఇప్పుడు ఆయన వెనుక పదివేల మంది సహచరులున్నారు. ఆయన అత్యంత రహస్యంగా మక్కావైపుకు సాగిపోయారు. ఇదంతా ఎంత పకడ్బందీగా జరిగిందంటే దాదాపు రక్తపాతం సంభవించకుండానే మక్కాపై విజయకేతనం ఎగురవేశారు ముస్లింలు.

"ఎన్నో భాగ్యాలను ప్రసాదిస్తానని అల్లాహ్ మీకు వాగ్దానం చేశాడు. మీరు వాటిని పొందుతారు. అచిరకాలంలోనే ఆయన ఈ విజయాన్ని మీకందించాడు. మీకు వ్యతిరేకంగా జనుల చెయ్యిలేవకుండా చేశాడు". (48:20)

ఒప్పందం జరిగేనాటికి దాదాపు 20 ఏళ్ళ సందేశ కృషి ఫలితంగా ఇస్లాం ధ్వని అరేబియా అంతటా ప్రతిధ్వనించింది. అన్ని తెగలలో ఎంతో కొంతమంది హృదయాంతరాళాలలో అప్పటికే ఇస్లాం చోటు సంపాదించి ఉంది. కాని అప్పటికీ అరేబియా అధికారం ఖురైషుల చేతుల్లో ఉండటం వల్ల ప్రజలు ఖురైషులకు భయపడి తమ ఇస్లాంను బహిర్గతం చేసేవారు కాదు. ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించటమంటే ఖురైషులతో కయ్యం కొని తెచ్చుకోవటమేనని వారనుకునేవారు. ఖురైషులకు ముస్లింలకు మధ్య పదేళ్ళ నిర్యుద్ధ సంధి జరిగిందని అరబ్బు తెగలకు తెలియటంతోనేవారు ఇస్లాం స్వీకరించడానికి తండోపతండాలుగా మదీనాకు రాసాగారు. ట్రాఫిక్ పోస్టులో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తరువాత వాహనాలు ఎలా

ముందుకు దూసుకుపోతాయో అలాగే ప్రజలు ఇస్లాంవైపుకు పరుగెత్తుకు రాసాగారు.

"ఇబ్నె షిమాద్ జుహ్రీ మరియు ఇతరుల కథనం ప్రకారం, హుదైబియా ఒప్పందం ద్వారా అల్లాహ్ ముస్లిములకు చేకూర్చినన్ని విజయాలు మరే యుద్ధం ద్వారా కూడా చేకూర్చలేదు. మక్కా విజయం లభించిన రోజున ప్రవక్త పదివేల మంది సహచరులతో కలసి మక్కా నగరంలో ప్రవేశించారు. అంతకుముందు వీళ్ల సంఖ్య మూడువేలకు మించేది కాదు. దీనికి కారణమేమిటంటే, ఖురైషులు యుద్ధకాండకు స్వస్తిచెప్పినందువల్ల అరబ్బులకు ఇస్లాం స్వీకరించడంలో ఉన్న అడ్డంకి కాస్తా తొలగిపోయింది. ఎందుకంటే ఇప్పుడిక వారికి ఖురైషుల ఆగ్రహోగ్రాలకు ఆస్కారం లేదుమరి.

బరా ఉల్లేఖనాన్ని బుఖారి ఉటంకించారు. ప్రవక్త తమ శిష్యులనుద్దేశించి, "మీరు మక్కా విజయాన్ని విజయమనుకుంటున్నారా? మేమైతే హుదైబియా ఒప్పందానే విజయ మనుకునేవాళ్ళం". (బుఖారి 4150)

ఈ ఒప్పందం ద్వారా మదీనాపై గల ఆర్థికమైన ఆంక్షలు ఎత్తివేయబడ్డాయి. మదీనాకు చెందిన వర్తక బృందాలు స్వేచ్ఛగా మక్కా మీదుగా రాకపోకలు సాగించాయి. ఒప్పందానుసారం ఖురైషులకు అప్పచెప్పబడిన అబూజుందల్, అబుల్ బసీర్ తదితరులు జుల్‌మర్వాకు పారిపోయారు. ఇలాంటి ముస్లింలే మరికొంతమంది అక్కడపోగయ్యారు. ఆ ప్రాంతం కూడా ఒక ముఖ్యకేంద్రంగా మారిపోయింది. ఖురైష్ వర్తక బిడారులను వాళ్లు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు త్రాగించేవారు. ఈ ఒడిదుడుకులతో విసిగెత్తిపోయిన ఖురైషులు స్వయంగా ఒప్పందంలోని ఒక నిబంధనను ఉపసంహరించుకున్నారు. మనిషిలోని అత్యంత పెద్ద బలహీనత ఏమిటంటే అతను మహా తొందరపడేవాడై ఉంటాడు. కంటికి కనిపించే వస్తువులపై పడిచస్తానంటాడు. మనిషి గనక ఈ బలహీనతలను అధిగమించి దూరదృష్టితో ఆలోచిస్తే దేవుడు అతనికోసం శ్రేయోసాఫల్యాలతో కూడిన ఎన్నో అవకాశాలను తెరచి ఉంచాడన్న సంగతి బోధపడుతుంది.

"ఇస్లాం విజయానికి హుదైబియా సంఘటనకు మించిన విజయం వేరొకటిలేదు. కాని ఆ రోజు ప్రజల దృష్టి ప్రవక్త మరియు దేవుని అభిమతాన్ని కానలేకపోయింది. దాసులు ప్రతిదీ తొందరగా లభించాలని కోరుకుంటారు. కాని అల్లాహ్ దాసుల మాదిరిగా తొందరపడడు. వ్యవహారం చేరవలసిన చోటికి చేరే వరకూ ఆయన వేచిఉంటాడు" అని అబూబకర్ చెబుతూ ఉండేవారు (మగాబి అల్‌వాహది సంపుటి 2, పేజీ 610).

వాస్తవిక దృష్టి ప్రపంచంలో చాలా అరుదుగానే ఉంటుంది. చూడబోతే మనిషిని అంతిమ విజయానికి చేర్చే ఏకైక సాధనం వాస్తవిక దృష్టేమరి.

కైబర్ ఆపరేషన్ విజయవంతంగా ముగిసిన తరువాత ఆయన మరో ఆపరేషన్‌కు సన్నాహాలు చేయసాగారు. అయితే ఆ సన్నాహాలు ఎవరికి వ్యతిరేకంగా జరుగుతున్నాయో ఎవరికీ చెప్పలేదాయన. ఆఖరికి అబూబకర్ వంటి సన్నిహిత సహచరుడికి కూడా ఆయన ఏ దిశలో పయనించాలనుకుంటున్నారో తెలియలేదు. హిజ్రీ 8వ సంవత్సరం రమజాన్ నెల ఆరంభంలో ఆయన ఆదేశానుసారం ముస్లిం పయనబృందం మక్కావైపుకు పయనమైంది. అప్పటికిగాని సహచరులకు అర్థం కాలేదు. ప్రవక్త గమ్యస్థానమేదో! మొత్తం మీద ఆ ప్రయాణం చడీచప్పుడు కాకుండా సాగింది. 'మర్రా అజ్ జహ్రాన్' వరకు ఆయన వచ్చే దాకా మక్కావారికి కబురందలేదు. ప్రయాణానికి ముందు ప్రవక్త ఇలా వేడుకున్నారు.

"దేవా! నేను ఖురైషుల నగరంలోకి ప్రవేశించే వరకూ ఖురైష్ గూఢచారులను, వర్తమానాలను నిలిపి ఉంచు".

ఈ ప్రయాణం కోసం ఆయన అద్భుతమైన ఏర్పాట్లు చేశారు. మదీనా నగరం నుంచి ఇతర ప్రాంతాలకు గల రాకపోకలన్నీ నిలిపివేయాలని ప్రవక్త ఆజ్ఞాపించారు. మదీనాలో ఏం జరుగుతుందో బయటివారికి తెలియకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అలీ సారథ్యంలో కొంతమంది రహదారుల్లో కాపలా ఉన్నారు. వాళ్ళే హాతిబ్ బిన్ అబీబల్తా దూతను పట్టుకుని అతని దగ్గరున్న లేఖను వశపరచుకున్నారు. (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 2, పేజీ 397-400)

ముస్లిములందరినీ వెంటబెట్టుకోవటం జరిగింది. పదివేల మంది సైనికుల్ని ఆయన అనేక పటాలాలుగా విభజించారు. ప్రతి పటాలానికి ఒక సారథి ఉన్నాడు. అతను చేతిలో ధ్వజంపట్టుకుని కదం తొక్కసాగాడు. అతని వెనకే కొన్నివందల సంఖ్యలో సైనికులు మార్చ్ చేస్తూపోయారు. అబూసుఫ్యాన్‌కు తమ సేనల క్రమశిక్షణను చూపించమని ప్రవక్త తన పినతండ్రి అయిన అబ్బాస్‌ని కోరారు.

"దైవ ప్రవక్త ఇలా అన్నారు. అబూసుఫ్యాన్‌ను పర్వతమార్గం వద్ద నిలిపి ఉంచండి, దైవసేన ఆయన కళ్లముందుగానే వెళితే, ఆయన దాన్ని తిలకిస్తారు".

ఇస్లామీయ సైన్యం గుంపులుగా కదం తొక్కుతూ పోతుండగా అబూసుఫ్యాన్ ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయారు. అప్రయత్నంగా అబూసుఫ్యాన్ నోట ఈ

మాట వెలువడింది. (ఇటువంటి సైన్యంతో పోరాడేశక్తి ఎవరికీ లేదు. ఇటువంటి సైన్యాన్ని ఎప్పుడూ చూడలేదు (అల్‌మో జుమేఅల్‌ఖబీర్ 7263). ఒకవైపు ఆయన మక్కా నాయకుణ్ణి (అబూసుఫ్యాన్‌ను) ఈ విధంగా ప్రభావితుణ్ణి చేయడంతోపాటు మరోవైపు 'అబూసుఫ్యాన్ శిభిరంలో చేరిన వారికి రక్షణ లభిస్తుంద'ని ప్రకటన చేయించారు (ముస్లిం 1780). దీని ఫలితంగా స్వయంగా అబూసుఫ్యానే ముందుకువచ్చి, "ప్రజలారా! ముహమ్మద్ పట్ల విధేయత ప్రకటించండి. ఈ రోజు ఆయన్ని ఎదుర్కొనే శక్తి ఎవరికీ లేదు" అని గొంతెత్తి ఘోషించాడు. మక్కా విజయం కోసం ప్రవక్త చేసిన ఈ అసాధారణమైన ఏర్పాట్లు రక్తపాతం సృష్టించడం కొరకు కాదని, వైరివర్గంలో భయోత్పాతం సృష్టించి మక్కాను అవలీలగా జయించడంకోసమే అని ఆ తరువాతి సంఘటనలు నిరూపించాయి. ముస్లిం సేనాధిపతి అయిన సాద్ బిన్ ఉ బాద మక్కాకు చేరువలోకి రాగానే "ఈరోజు భీకరమైన రోజు" అని నినదించాడు. "లేదు, ఈరోజు కారుణ్య ప్రదమైన రోజు" అని ప్రవక్త చాటారు. తరువాత అతన్ని సారథ్య బాధ్యతలనుండి తప్పిస్తూ అతని చేతిలోని ధ్వజాన్ని లాక్కుని అతని కుమారుడైన ఖైస్‌కు అప్పగించటం జరిగింది. (తారిఖ్ దిమష్క్ సంపుటి 23, పేజీ 454).

మక్కా విజయం తరువాత కూడా కొన్ని పోరాటాలు జరిగాయి. మొత్తం మీద 80 యుద్ధాలు జరిగాయి. కాని మక్కా విజయం కీలకమైనది. ఈ విజయంతో రాజ్యంలోని ప్రధానకేంద్రంపై పట్టుబిగుసుకుంది. ఆ తరువాత అరేబియాలోని తెగలన్నీ అతిసులువుగా ఆయన చెప్పుచేతుల్లోకి వచ్చేశాయి.

## విజయానంతరం...

విజయం మనిషిలో అహంకారంతో పాటు ప్రతీకారాన్ని కూడా పెంచుతుంది. కాని ఆయన విజయం మామూలు మనిషి విజయం కాదు, అది ప్రవక్త విజయం. ఆయనలో అలాంటి నకారాత్మక భావాలేమీలేవు. ఇబ్నె ఇస్‌హాఖ్ ఉటంకించినదాని ప్రకారం. మక్కా విజయం రోజున ప్రవక్త మక్కా నగరంలో ప్రవేశించినపుడు వినమ్రతతో ఆయన తల క్రిందికి వాలి ఉంది. ప్రజలు చూడబోతే ఆయన గడ్డం ఒంటె మూపురాన్ని చుంచిస్తూ ఉంది. కాబా ద్వారంవద్ద నిలుచుని ఆయన చేసిన ప్రసంగంలో కొన్ని మాటలివి :

"ఒక అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయన తన వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు. ఆయన తన దాసునికి తోడ్పడ్డాడు. శత్రుసమూహాలను ఆయన ఒంటరిగా ఓడించాడు". (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 2, పేజీ 412).

ఆ విధంగా ఆయన విజయానికి సంబంధించిన ఈ ఘనతనంతా దేవుని ఖాతాలో జమచేశారు.

ఆ ఉపన్యాసంలోనే ప్రవక్త ఇలా అన్నారు.

"ఖురైష్ వర్గీయులారా! నా గురించి మీ అభిప్రాయం ఏమిటి? చెప్పండి. ఈ రోజు నేను మీ పట్ల ఎలా వ్యవహరిస్తాననుకుంటున్నారు?" అని దైవప్రవక్త అడగ్గా, 'మంచిగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాము. మీరు మర్యాదస్తులైన సోదరులు. మర్యాదస్తుని కుమారులు' అని వాళ్లు బదులిచ్చారు.

"యూసుఫ్ తన సోదరులతో ఏమన్నారో అదేనేనూ మీతో అంటున్నాను. ఈరోజు మీపై ఎలాంటి ఆరోపణాలేదు. పోండి, ఇకపై మీరంతా స్వతంత్రులు" అన్నారు దైవప్రవక్త.

ఈ విధంగా ఆయన విజేతకు – ఓడిపోయిన వానికి మధ్య రగులుకునే అనంతమైన ప్రతీకార భావాలను మొదటి దశలోనే తృంచేశారు. విజేతలైన జాతులు ఇలాంటి అపూర్వ విజయం లభించాక సాధారణంగా విధ్వంసానికి పూనుకుంటాయి. కాని ఆయన సర్వసామాన్యమైన మన్నింపుల వైఖరిని అవలంబించి రాజ్యంలోని శక్తులు, వనరులన్నింటినీఈ నిర్మాణాత్మక దిశలో వెచ్చించారు.

దైవప్రవక్త మక్కా విజయం సందర్భంగా నగరంలోకి అడుగుపెట్టినపుడు ఎవరైనా మీపై దాడికి దిగితే తప్ప ఎవరితోనూ లడాయికి దిగరాదని తమ సైనిక సర్దార్లకు ఆదేశాలిచ్చారు. విజయానంతరం ప్రవక్త తనకు వ్యతిరేకంగా ఘోరమైన నేరాలు చేసిన వారికి సైతం క్షమాభిక్ష పెట్టారు. కాకపోతే కొందరు ప్రత్యేకమైన వ్యక్తుల్ని మాత్రం–వాళ్లు కాబా గృహ పరదా క్రింద శరణుపొందినా సరే – హతమార్చమని ఆయన ఆజ్ఞాపించారు. ఇబ్నెహిషామ్ వంటి ప్రముఖ చరిత్రకారులు తమ సీరత్ గ్రంథాలలో ఆయా వ్యక్తులపేర్లను కూడా నమోదుచేశారు. వాళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

(1) అబ్దుల్లా బిన్ సాద్ : ఈయన మొదట ముస్లింగా ఉండేవారు. దైవప్రవక్త ఈయన్ని 'వహీ'ని లిఖించే లేఖకుడుగా నియమించుకున్నారు. కాని ఆయన మళ్లీ ధర్మభ్రష్టుడై అవిశ్వాసులతో చేరిపోయారు. మక్కా విజయం తర్వాత దైవప్రవక్త తనను హతమార్చమని ఆదేశించారని తెలియగానే ఆయన ఉస్మాన్ దగ్గరకు పరుగెత్తుకెళ్లారు. ఉస్మాన్ ఆయన్ని దాచిపెట్టి దైవప్రవక్త సమక్షంలో హాజరుపరచారు. ఈయన్ని ఉస్మాన్ మరోసారి ప్రాధేయపడగా దైవప్రవక్త ఆయన చేత బైత్ (శపథం) చేయించుకున్నారు. ఉమర్ మరియు ఉస్మాన్‌ల

ఖిలాఫత్ కాలంలో ఈయన ఈజిప్టు అధికారిగా ఉన్నారు. ఆఫ్రికాను జయించడంలో ఈయన కీలకమైన భూమికను నిర్వర్తించారు.

(2) అబ్దుల్లా బిన్ ఖతల్ : ఇతడు మొదట ఇస్లాం స్వీకరించినవాడే. ప్రవక్త ఇతన్ని సదఖా (విరాళాలు) వసూలు చేయడానికి పంపించారు. అతనివెంట ఒక బానిసతో పాటు ఒక అన్సారీ కూడా ఉన్నారు. ఒక మజిలీకి చేరిన తరువాత అబ్దుల్లా బిన్ ఖతల్ తన బానిసనుద్దేశ్యించి, ఒక కోడిని కోసి వండమని ఆజ్ఞాపించాడు. కాని ఆ బానిస అలసట వల్ల నిద్రపోయాడు. వేళకు వంట కాలేదు. దీనికి ఇబ్నె ఖతల్ ఆగ్రహించి బానిసను చంపేశాడు. ఆవేశం చల్లారిన తర్వాత అతను ఆలోచనలో పడ్డాడు. మదీనా వెళ్ళిన తరువాత ప్రవక్త తననుండి రక్త పరిహారం కోర్తారేమోనని అతనికి భయమేసింది. అందువల్ల ధర్మభ్రష్టుడై మక్కా వెళ్ళిపోయాడు. బహుదైవోపాసకుల్లో చేరిపోయాడు. అతనొక కవి. ఆయనకు వ్యతిరేకంగా కవితలు అల్లేవాడు. మక్కా విజయం జరిగిన రోజున ఇబ్నె ఖతల్ కాబా పరదాను పట్టుకుని నిలబడ్డాడు. అతనక్కడ ఉన్నాడని ప్రజలు చెబితే వాణ్ణి అక్కడే హతమార్చమని ప్రవక్త ఆజ్ఞాపించారు. అబూదర్ద అస్లమీ, సయీద్ బిన్ హరీస్‌లు అతన్ని పట్టుకుని 'హజ్రె అస్వద్' – 'మఖామె ఇబ్రాహీం'ల మధ్య అతన్ని వధించారు.

(3) ఫర్తనా : ఈమె అబ్దుల్లా బిన్ ఖతల్ దగ్గర సేవకురాలిగా ఉండేది. ఆమె ప్రవక్తను పరిహసిస్తూ కవితలు చెప్పేది. మక్కాలోని బహుదైవారాధకుల సమ్మేళనాలలో గాయనిగా, నర్తకిగా పనిచేసేది. ఇబ్నె ఖతల్‌తో పాటు ఆమెను కూడా వధించమని దైవప్రవక్త ఆజ్ఞాపించారు. ఆమె కూడా హతమార్చబడింది.

(4) ఖురైబ : ఈమె కూడా ఇబ్నెఖతల్ దగ్గర దాసీగా పనిచేసేది. ఫర్తనాలాగానే ఈమెకూడా పాటలుపాడేది. నృత్యం చేసేది. ఆయన ఈమెకు కూడా మరణదండన విధించారు. కాని ఆమె ఆయన సమక్షంలోకి వచ్చి క్షమాభిక్ష కోరింది. ప్రవక్త ఆమెను మన్నించి రక్షణ కల్పించారు.

(5) హోయ్‌రిస్ బిన్ నుఖీజ్ బిన్ వహబ్ : ఇతనొక కవి. ప్రవక్తకు వ్యతిరేకంగా కవితాగానం చేసేవాడు. వేరే మాటల్లో ఇతను ఇస్లాంను పరిహసించేవాడు. అబ్బాస్ బిన్ ముత్తలిబ్‌గారు దైవప్రవక్త కుమార్తెలైన ఫాతిమ మరియు ఉమ్మె కుల్సుమ్‌లను పిలుచుకుని మక్కా నుండి మదీనా బయలుదేరారు. హోయ్‌రిస్ బిన్ నఖీజ్ వాళ్లను తరుముకుంటూవచ్చి, ఒంటెను ఈటెతో గుచ్చి దాన్ని రెచ్చగొట్టాడు. ఫలితంగా ఇద్దరు మహిళలు క్రిందపడిపోయారు.

అతన్ని హతమార్చమని ప్రవక్త ఆదేశించారు. అలీ అతన్ని వధించారు.

(6) మిజ్‌యస్ బిన్ సుబాబ : ఇతనికి హిసామ్ బిన్ సుబాబ అనే ఒక సోదరుడుండేవాడు. జీకరద్ యుద్ధ సందర్భంగా ఒక అన్సారీ పొరబాటున హిషామ్‌ను హత్యచేశారు. ఆ తరువాత మిజ్‌యస్ బిన్ సుబాబ మక్కానుండి మదీనా వచ్చాడు. ముస్లింగా మారాడు. ఆపైన దైవప్రవక్త సన్నిధికి వచ్చి నా సోదరుని నష్టపరిహారం నాకిప్పించమని అభ్యర్థించాడు. అతనికి నష్టపరిహారం చెల్లిచమని దైవప్రవక్త ఆదేశించారు. ఆ తరువాత అతను కొన్నాళ్ళపాటు దైవప్రవక్త దగ్గరే ఉన్నాడు. ఒకరోజు అతను తన సోదరుని హంతకుణ్ణి చంపేసి అకస్మాత్తుగా మదీనా నుంచి మక్కాకు పరారయ్యాడు. ఆ తర్వాత ధర్మభ్రష్టుడైపోయాడు. ప్రవక్త ఆజ్ఞానుసారం నుమైలా బిన్ అబ్దుల్లాలైసీ ఇతన్ని వధించారు.

(7) సారహ్ : ఈమె ఇక్రమ బిన్ అబూజహల్ వద్ద బానిసరాలుగా పనిచేసేది. ప్రవక్తకు వ్యతిరేకంగా కవిత్వం చెప్పటమేగాక, ఆయన్ని అవహేళన చేసేది. ఆయన ఆమెకు కూడా మరణదండన విధించారు. కాని ఆమె ఆయన సన్నిధిలోకి వచ్చి ప్రాణరక్షణకోరగా ఆయన క్షమించి వదిలేశారు. తరువాత ఆమె ఇస్లాం స్వీకరించింది. ఉమర్ ఖిలాఫత్ హయాం వరకూ ఆమె బ్రతికి ఉంది.

(8,9) హారస్ బిన్ హిషామ్, జహీర్ బిన్ అబీ ఉమయ్య : వీరిద్దరికి కూడా మరణ దండన పడింది. వాళ్లు పరుగెత్తుకువెళ్ళి ఉమ్మెహన్నీ బిన్తె అబీతాలిబ్ అనే బంధువైన మహిళ ఇంట జొరబడ్డారు. అలీ వాళ్లను వెంబడిస్తూ వెళ్ళి, దైవసాక్షి! నేను వీరిద్దరినీ హతమారుస్తాను అన్నారు. ఉమ్మె హానీ వాళ్ళిద్దరినీ తన ఇంట్లో దాచిపెట్టి దైవప్రవక్త సన్నిధికి వచ్చింది. వాళ్ళిద్దరికీ నేను రక్షణ కల్పించాను. కాని అలీ వాళ్లను చంపగోర్తున్నారు. వాళ్లపై కనికరించండి అని విన్నవించుకుందామె. దానికి దైవప్రవక్త, “నీవు ఎవరికి ఆశ్రయమిచ్చావో వారికి మేమూ ఆశ్రయమిస్తాము. నీవు అభయమిచ్చిన వారికి మేమూ అభయమిస్తాము” కాబట్టి అలీ వాళ్ళిద్దరినీ చంపరు” అని పలికారు. ఆ విధంగా వారిద్దరూ బతికిపోయారు.

(10) ఇక్రమ బిన్ అబూజహల్ : ఇక్రమ కూడా తన తండ్రి మాదిరిగానే ఇస్లాంకు బద్ధశత్రువు. అతనికి కూడా ప్రవక్తగారు మరణదండన విధించారు. అతను మక్కానుండి యమన్‌కు పారిపోయాడు. కాని అప్పటికే ముస్లింగా మారిపోయిన అతనిభార్య తనభర్తకు ప్రాణభిక్ష పెట్టమని దైవప్రవక్త ముందు ప్రాధేయపడింది. ప్రవక్త ఇక్రమను క్షమించి భద్రత కల్పించారు. తరువాత ఆమె యమన్ వెళ్ళి ఇక్రమను వాపసు తీసుకువచ్చింది. అతను

ప్రవక్త సమక్షంలోకి వచ్చి ఇస్లాం స్వీకరించాడు. ఆ తరువాత ఇక్రమ ఇస్లాం కొరకు తన ధన ప్రాణాలతో అసాధారణమైన త్యాగాలు చేశారు. అబూబకర్ ఖలీఫాగా ఉన్న కాలంలో ధర్మభ్రష్టులతో పోరాడుతూ ఆయన అజ్‌నాదీన అనే చోట అమరగతినొందారు.

(11) హిబార్ బిన్ అస్వద్ : ఇతను ముస్లింలను అమితంగా వేధించినవాడు. దైవప్రవక్త పుత్రిక జైనబ్ మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేస్తున్న సమయంలో హిబార్ బిన్ అస్వద్ ఆమె ఒంటెకు ఈటెగుచ్చాడు. దాంతో ఆ ఒంటె బెదిరిపోయి గంతులు వేయసాగింది. గర్భవతి అయిన జైనబ్ క్రింతపడిపోయారు. ఆమెకు గర్భస్రావం జరిగిపోయింది. ఆరోజు నుంచి ఆమె కడదాకా అనారోగ్యంతోనే బాధపడాల్చివచ్చింది. ప్రవక్త హబార్‌కు మరణశిక్ష విధించారు. హబార్ ఆయన సమక్షంలోకి వచ్చి తనకు భద్రత కల్పించమని ఇస్లాం స్వీకరిస్తానని ప్రాధేయపడ్డాడు. ప్రవక్త అతనికి క్షమాభిక్ష పెట్టారు.

(12) వహ్‌షీ బిన్ హరబ్ : ఇతను ప్రవక్త పినతండ్రి అయిన హమ్జాను హతమార్చినవాడు. ఇతనికి కూడా మరణదండన విధించబడింది. అతను తొలుత మక్కా నుండి తాయఫ్‌కు పారిపోయాడు. తరువాత మదీనాకు వచ్చి ఆయన సన్నిధిలో క్షమాపణ వేడుకున్నాడు. తాను ఇస్లాం స్వీకరిస్తానన్నాడు. ప్రవక్త అతన్ని ఇస్లాంలో చేర్చుకుని క్షమాభిక్షపెట్టారు. తరువాత ఈయన ఖలీఫా అబూబకర్ కాలంలో ముసైలమ కజ్జాబ్‌కు వ్యతిరేకంగా పోరాడారు. ఏ ఆయుధంతో ఆయన లోగడ హమ్జాను చంపారో అదే ఆయుధంతో ముగ్సాలమ కిజ్జాబ్‌ను తుదముట్టించారు.

(13) కాబ్ బిన్ జుహైర్ : ఈయన అరబ్బులో ఎన్నదిగిన కవి. దైవప్రవక్తకు వ్యతిరేకంగా కవిత్వం చెప్పేవాడు. మక్కా విజయం సందర్భంగా ఈయనకు కూడా మరణ శిక్షపడింది. ఈయన మక్కా నుండి తక్షణం పలాయనం చిత్తగించాడు. తరువాత మదీనా వచ్చి తన తప్పులను మన్నించమని దైవ ప్రవక్తకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇస్లాం స్వీకరిస్తానని చెప్పాడు. ప్రవక్త అతనిచేత ప్రతిజ్ఞ చేయించుకుని తన కండువాను అతనికి బహూకరించారు.

(14) హారిస్ బిన్ తలాతిల్ : వీడు ఒక కవి. కవిత్వం ద్వారా దైవప్రవక్తను అదేపనిగా పరిహసించేవాడు. ఇతనికి కూడా మరణదండన విధించబడింది. అలీ ఇతన్ని హతమార్చారు.

(15) అబ్దుల్లా బిన్ జిబ్‌అరి : ఇతను అరేబియాలోని ప్రముఖ కవులలో ఒకడు. ప్రవక్తకు వ్యతిరేకంగా కవిత్వం చెప్పేవాడు. ప్రవక్త ఇతనికి మరణ శిక్ష విధించారు. ఇతను మక్కా నుండి నజరాన్‌కు పారిపోయాడు. కొన్నాళ్ల తర్వాత దైవప్రవక్త సన్నిధికి వచ్చి పశ్చాత్తాపం

ప్రకటించాడు. ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త అతన్ని క్షమించి వదలిపెట్టారు.

(16) హుబైరా బిన్ అబీ వహబ్ మఖ్జూమి : ఇతనొక కవి. కవిత్వం ద్వారా ప్రవక్తని, ఆయన ఉద్యమాన్ని పరిహసించేవాడు. ఆయన అతనికి మరణదండన విధించారు. అతను మక్కానుండి నజరాన్‌కు పారిపోయాడు. తిరస్కార స్థితిలోనే చనిపోయాడు.

(17) హింద బిన్తె ఉతబా (అబూసుఫ్యాన్ సతీమణి) : ఈ అరబ్బు మహిళకు ఇస్లాం అంటే బద్ధవైరం ఉండేది. ఉహద్ పోరాటంలో అమరగతినొందిన హమ్జా పచ్చికాలేయాన్ని కరకరానమిలిన నరరూపరాక్షసి. ఆయన ఆమెకు మరణదండన విధించారు. అయితే ఆమె ప్రవక్త సన్నిధిలో హాజరై క్షమాపణ కోరుకుంది. ఆయన ఆమెను క్షమించారు. తరువాత ఆమె ఇంటికెళ్ళి విగ్రహాలన్నింటినీ కూల్చివేసింది. 'దైవసాక్షి! మీవల్లనే మేము మోసపోయాము' అని చెప్పింది.

పైన పొందుపరచబడిన దానిని బట్టి ప్రవక్త మక్కా విజయం సందర్భంగా 17 మందికి మరణదండన విధించారు. వారిలో ప్రతిఒక్కడూ తానుచేసిన మహాపరాధాల కారణంగా శిరచ్ఛేదనానికి అర్హుడే. అయితే వారిలో క్షమాపణ కోరుకున్నవారినల్లా ప్రవక్త క్షమించి వదిలేశారు. క్షమాపణ కొరకు అభ్యర్థించిన వారిలో ఎవరికీ మరణశిక్ష పడలేదు. శిక్షపడిన 17 మందిలో 11 మంది ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గానీ క్షమాభిక్ష పొందారు. క్షమాభిక్ష కోరని 5గురికి శిక్ష అమలు చేయబడింది. ఒక నేరస్థుడు మాత్రం మక్కా నుండి పారిపోయి సహజమరణం పొందాడు.

### ఒక ప్రశ్న - దాని సమాధానం :

దైవప్రవక్త కాలంలో బనూ మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. ఆమెపేరు ఫాతిమ. ఆమె చేయినరికివేయబడుతుందేమోనని ఆ తెగవారికి భయమేసింది. ఉసామ బిన్ జైద్ దైవప్రవక్త సన్నిధికి వచ్చి మఖ్ జూమ్ తెగ మహిళ క్షమాపణ కొరకు సిఫార్సు చేశారు. ఇది వినగానే ప్రవక్త ముఖ కవళికలు మారిపోయాయి. "మీరు దేవుని హద్దులలో ఒకానొక హద్దుకు సంబంధించి నాతో సిఫార్సు చేస్తున్నారా?" అని ప్రవక్త ప్రశ్నించారు. తరువాత ఆయన జనులను సమావేశపరచి ప్రశంసించారు. "ఎవరి ఆధీనంలో నాప్రాణముందో ఆయన తోడుగా చెబుతున్నాను. ఒకవేళ నా కూతురు ఫాతిమా దొంగతనం చేసినా నేను ఆమె చేతిని నరికి ఉండేవాణ్ణి". తరువాత ఆ స్త్రీ హస్తం నరకబడింది. ఆ తరువాత ఆమె పశ్చాత్తాపం చెంది ఒక సజ్జనురాలిగా జీవితం గడిపింది (బుఖారి, ముస్లిం).

దీన్ని బట్టి తెలిసేదేమిటంటే దేవుడు నియమించిన హద్దులలో ఏదైన ఒక హద్దు విషయమై క్షమించే అధికారం ఎవరికీలేదు. మరి అలాంటప్పుడు దైవప్రవక్త మక్కా విజయం సందర్భంగా ఎందువల్ల ఉదారంగా ప్రజలను మన్నించారు? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీనికి కారణమేమిటంటే – సాధారణ పరిస్థితుల్లో చేసేతప్పులకు యుద్ధపరిస్థితిలో చేసే తప్పులకు వ్యత్యాసం ఉంది. సాధారణ పరిస్థితిలో మనిషి తప్పుచేస్తే అది క్షమార్హంకాదు. కాని యుద్ధం లేక అసాధారణ పరిస్థితుల్లో శత్రువర్గానికి చెందిన వారు అపరాధాలకు ఒడిగట్టినప్పటికీ, లొంగిపోయి విధేయత కనబరచి క్షమాపణ కోరిన పక్షంలో వారిని క్షమించవచ్చు. అరేబియాలో ఇస్లాం శత్రువులు ముస్లిములకు వ్యతిరేకంగా ఘోరాతి ఘోరమైన అపరాధాలకు పాల్పడ్డారు. కాని, ఈ అవిశ్వాసులు గనక దారికి వచ్చినట్లయితే అప్పటివరకూ జరిగినదంతా మన్నించబడుతుందని (8:38) ప్రకటించబడింది. శత్రువు గనక సంధికి సంసిద్ధమైతే దానికి ఒప్పుకోమని, సంధి తరువాత కూడా అతనివల్ల ఏదైనా పొరబాటు జరిగితే అప్పటికీ కరకుగా వ్యవహరించరాదని సెలవీయబడింది.

“వాళ్ళు గనక సంధివైపుకు మొగ్గు చూపితే మీరు కూడా దానివైపుకు మొగ్గండి. అల్లాహ్‌పై భారం మోపండి. నిశ్చయంగా ఆయన వినేవాడు, సర్వం ఎరిగినవాడూను. ఒకవేళ వాళ్లు మీకు మోసం చేయదలిస్తే మీ కొరకు అల్లాహ్ చాలు. ఆయన తన తోడ్పాటు ద్వారా మరియు విశ్వాసుల ద్వారా మీకు బలమొసగాడు. (8:61–62)

అలాంటి నేరస్థులకే ఈ సందర్భంగా క్షమాభిక్ష ప్రసాదించబడింది. వారిలో ఇక్రమ బిన్ అబూజహల్ కూడా ఒకడు. అతడు తన తండ్రి అబూజహల్‌తో కలసి ఇస్లాం విరోధంలో శృతిమించిపోయాడు. దైవప్రవక్తను రకరకాలుగా వేధించాడు. కాని అతడు తన దగ్గరకు విధేయుడై వస్తున్నాడని తెలియగానే ప్రవక్త తన సహచరులనుద్దేశించి, “ఇక్రమ బిన్ అబూజహల్ విశ్వాసిగా మారి మీవద్దకు వస్తున్నాడు. కాబట్టి మీరు అతని తండ్రిని దూషించకండి. మృతుని తిట్టడంవల్ల బ్రతికివున్నవాడికి బాధకలుగుతుంది”.

దైవప్రవక్తలోని ఈ ఉదారవైఖరీ, ఈ హృదయ విశాలతే అరబ్బు సమాజంలో అసాధారణమైన పరివర్తనను తీసుకువచ్చింది. మక్కా విజయానికి పూర్వం ఇస్లాంకు బద్ధ శత్రువులుగా ఉన్నవారే మక్కా విజయానంతరం ప్రగాఢ స్నేహితులుగా, మద్దతు దారులుగా మారిపోయారు.

# మూడవ భాగం

# దైవదౌత్య పరిసమాప్తి

దైవదౌత్యం అవతరించిన తొలిరోజుల్లో జరిగిన సంఘటన అరబ్బుతెగకు చెందిన ఒకానొక వ్యక్తి కాబా సందర్శనార్థం మక్కావచ్చాడు. అతను తిరిగి వెళ్ళిన మీదట ఆ తెగవారు మక్కా విశేషాలేమిటి? అని అడిగారు. దానికావ్యక్తి ఇలా అన్నాడు.

“ముహమ్మద్ తాను దైవప్రవక్తనని ప్రకటించాడు. అబూఖహాఫ (అబూబకర్) కుమారుడు ఆయనకు సహాయకుడుగా నిలిచాడు”.

క్రీ.శ. 610లో ప్రవక్త దైవదౌత్యాన్ని ప్రజలముందు ప్రకటించినపుడు ప్రజల మనస్సుల్లో ఆయనకు ఏపాటి స్థానముండేదో దీన్నిబట్టి అర్థమవుతోంది. ఆకాలంలో ఆయన వ్యతిరేకులు ఆయన్ని ‘ఇబ్నె అబీ కబ’ అని పిలిచేవారు. అంటే ఫలానా పల్లెటూరివాని కొడుకు అని భావం. కాస్త మర్యాదపూర్వకంగా మాట్లాడదలిచేవాడు మాత్రం ఖురైషు తెగకు చెందిన ఒక యువకుడు అని చెప్పేవాడు.

ఇస్లాం ప్రవక్త కాలంలో పరిస్థితి ఇది. కాని శతాబ్దాలు గడచిన మీదట పరిస్థితి దీనికి పూర్తిభిన్నంగా ఉంది. ఎందుకంటే ఆయన ప్రవక్త పదవి ఇప్పుడు వివాదాస్పద సమస్య కాదు. ఇప్పుడది వ్యవస్థీకృతమైన సత్యాల (Establishment Faets)లో ఒకటి. నేడు ఏ వ్యక్తి అయినా “దైవ ప్రవక్త ముహమ్మద్” అని అన్నప్పుడు చరిత్ర సృష్టించిన ఒక ప్రవక్త అతని మదిలో మెదులుతాడు. ఆ చరిత్ర వెనుక వెయ్యిన్నరేండ్ల తిరుగులేని ఔన్నత్యాలు నెలకొని ఉన్నాయి. ‘ఇబ్నె అబీ కబ్ను’ రూపంలో దైవప్రవక్తను తెలుసుకోవటం చాలా కష్టం. కాని దైవప్రవక్త చారిత్రకంగా ప్రమాణబద్ధమైన వ్యక్తి లేక ఖుర్ఆన్ మాటల్లో ‘ముఖామె మహ్మూద్’ (17:79) అని అర్థమైనపుడు ఆయన్ని తెలుసుకోవటం చాలాసులభం.

గత కాలంలో ప్రవక్తలను వారి సమకాలీకులు గుర్తింపునివ్వకపోవడానికి ప్రధానకారణం, దైవప్రవక్తలు వారికంటికి సామాన్య వ్యక్తులుగా కనిపించటమే. “అరె! ఈయన కూడా మనలాంటి మనిషేకదా! నిన్నటిదాకా ఈయన్ని మనం ఫలానా కుమారుడగు ఫలానా వ్యక్తి అని పిలిచేవారం. ఉన్నట్టుండి ఈయన దైవప్రవక్తగా ఎలా మారిపోయాడు!” అనేవాళ్లు అనుకునేవారు. ఎప్పుడు ఏ ప్రవక్త ప్రభవించినా వారిపై ఒక విధమైన సంశయం, తిరస్కారభావం ఆవరించేది. ఒక దైవప్రవక్తను ప్రవక్త స్థాయిలో గుర్తించి గౌరవించడానికి వాళ్ల అహం అడ్డువచ్చేది.

పరిస్థితుల ఈ స్వరూపం – అంతిమ దైవప్రవక్త ప్రభవానికి ముందువరకూ –

మానవతను నిరంతరం పట్టిపీడిస్తూ ఉండేది. ప్రతిసారీ వారిలో ఒక మానవుడు – ఒక కొత్త వ్యక్తి – దైవప్రవక్తగా నియుక్తుడై ముందుకు వచ్చేవాడు. ఆహూతులైన (మదూ – సందేశ గ్రహీత) (ప్రేక్షకులైన) జాతి ప్రజలలో అధికులు ఇంతకుముందు ప్రస్తావించిన మానసిక కారణాల దృష్ట్యా తమ సమకాలీన ప్రవక్త విషయంలో సందేహాలు సంశయాలలో పడి ఊగిసలాడేవారు. ఎట్టకేలకు వారు దైవ సాంప్రదాయానుసారం వినాశానికి గురయ్యేవారు.

ఆఖరికి అల్లాహ్ సమస్త విశ్వానికి కారుణ్య ద్వారాలను తెరచే ఒక ప్రవక్తను పంపాలని నిర్ణయించాడు. గత ప్రవక్తలకు భిన్నంగా అల్లాహ్ ఆయనకు ప్రత్యేక తోడ్పాటునిచ్చి ఆయన ప్రభోదించిన సత్యధర్మానికి ఇతర మతధర్మాలన్నింటిపై ఆధిక్యతనొసగాడు. ప్రవక్త పదవి అన్నికాలాల ప్రజలకు ఒక తిరుగులేని సత్యంగా కనబడేలా చేశాడు. ప్రజలు ఏరకమైన మనోమయభావాలకు లోనుకాకుండా ప్రవక్తకు గల "ప్రశంసా పాత్రమైన" స్థాయి (మహ్మూద్) ఆధారంగా ఈయన్ని సులువుగా గుర్తించి విశ్వసించేలా అల్లాహ్ అపూర్వమైన ఏర్పాటు చేశాడు.

'నా అనుచరసమాజంలోని సభ్యులు ఇతర ప్రవక్తలందరి అనుయాయుల కన్నా అధికంగా ఉంటారని' అంతిమ దైవప్రవక్త ప్రవచించారు. ఇదికూడా ఈ విషయంతోనే సంబంధం కలిగి ఉంది. ఆయన తరువాత మరో ప్రవక్త రావలసిన అవసరంలేకపోవటం వల్ల ఆయన అనుచరసమాజం (ఉమ్మత్)లో మళ్లీ స్వీకృతి – తిరస్కృతుల సమస్య తలెత్తబోదు. ఆయన అనుచర వర్గం క్రమక్రమంగా పెరుగుతూనే ఉంటుంది. ప్రళయదినం ఆసన్నమయ్యే వరకూ వ్యాప్తిచెందుతూనే ఉంటుంది.

ఈ వ్యవహారాన్ని బనీ ఇస్రాయీల్ దృష్టాంతం ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఏసుక్రీస్తు కాలంలో ఉండే యూదులంతా దైవశాసనంపై విశ్వాసం గలవారే. వాళ్లు దైవప్రవక్త మూసా అనుయాయులు. కాని మర్యమ్ కుమారుని రూపంలో వారిముందు ఒక ప్రవక్త ఉద్భవించినపుడు ఆయన్ని విశ్వసించటం యూదులకు గగనమైపోయింది. వాళ్లు త్రోసిరాజన్నారు. ఈ కారణంగానే 12 మంది ఏసుక్రీస్తు విశ్వాసులను వదలిపెట్టి మిగిలిన యూదులంతా అవిశ్వాసులుగా ఖరారు చేయబడ్డారు. ఏసుక్రీస్తుకు 600 సంవత్సరాల తరువాత అరేబియాలో ప్రవక్త ఆవిర్భవించేనాటికి ముస్లిముల ఈ కొత్త సమూహం (క్రైస్తవుల) సంఖ్య చాలా పెరిగింది. కాని చరిత్ర పునరావృతం అయింది. "ఇస్మాయీల్ సంతతిలో జన్మించిన ప్రవక్త"ను విశ్వసించడానికి వాళ్లకు మనసొప్పలేదు. వాళ్లు చారిత్రక ప్రవక్త (ఏసుక్రీస్తు) పట్ల భక్తీ

విశ్వాసాలు కలిగి ఉండేవారుగాని తమ సమకాలీన ప్రవక్త (ముహమ్మద్)ను మాత్రం తిరస్కరించారు. ఈ కారణంగా ముహమ్మద్ సందేశాన్ని విశ్వసించిన కొద్దిమంది క్రైస్తవులు తప్ప మిగిలిన క్రైస్తవులంతా అవిశ్వాసులుగా ఖరారయ్యారు.

దైవదౌత్య పరిసమాప్తి కారణంగా ముహమ్మద్ అనుచర సమాజంలో మళ్లీ ఇలాంటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశంలేదు. ఈ కారణంగా ప్రవక్త అనుయాయుల సంఖ్య కూడా దినదిన ప్రవర్ధమానమవుతుంది. అదీగాక దేవుడు ఆయన్ని సకలలోకాలకై కారుణ్యంగా ప్రభవింపజేశాడు. ప్రశంసాపూర్వకమైన 'మఖామె మహ్మూద్' స్థానంలో ఆయన్ని ప్రతిష్ఠింపజేశాడు. 'మఖామెమహ్మూద్' ప్రాపంచికంగా కూడా వర్తిస్తుంది – ఒక ప్రవక్తగా ఆయన ప్రపంచమంతటికీ తిరుగులేని సత్యంగా కానవస్తారు. ప్రవక్త యొక్క ఈ ప్రత్యేకతే తీర్పుదినాన కూడా ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఈ వైశిష్ట్యానికి అల్లాహ్ ఆయనకు తప్ప మరే ప్రవక్తకూ ఒసగలేదు.

అయితే ఒక ప్రవక్తను 'ప్రశంసాపూర్వకమైన స్థానం'లో నిలబెట్టడమంటే అర్థం సాదాసీదా పద్ధతిలో నియుక్తం చేయటమని కాదు. అది ఒక సరికొత్త చరిత్రను సృష్టించే వ్యవహారం. దానికోసం ఒక అపూర్వమైన వ్యక్తి – ఆదం సంతతిలోనే కనీవినీ ఎరుగని అసాధారణ వ్యక్తి – అవసరం. అంతవరకు ఎవరూ ఎన్నడూ చేయని అసాధారణ త్యాగాలు చేసే వ్యక్తి దానికి అవసరం. అలాంటి కీలక దశలో దేవుడు తన దాసుడొకడిని ఎలుగెత్తి పిలుస్తూ, ఓ దుప్పటిలో చుట్టబడినవాడా! లే. మరి ప్రజలను హెచ్చరించు... నీ ప్రభువు ఔన్నత్యాన్ని కీర్తించు అన్నాడు. దుప్పటి కప్పుకుని వున్న ఈ అసాధారణ వ్యక్తి ఈ పిలుపు రాగానే 'హాజరయ్యానం'టూ తన జీవితాన్నంతటినీ దైవప్రణాళిక కోసం అంకితం చేశారు. ఆ తరువాత – ఒక సుదీర్ఘమైన ప్రక్రియ అనంతరం – సమస్త విశ్వానికి కారుణ్యప్రదమైన దైవదౌత్యం అందించబడింది. అది మానవ చరిత్రలో మాటిమాటికీ ప్రవక్తలు ప్రభవించవలసిన అనివార్య స్థితికి ఆనకట్టవేసింది. ప్రమాణబద్ధమైన ఒక ప్రవక్త పదవిని – దైవదౌత్యాన్ని – దేవుడు ఉనికిలోకి తెచ్చి ప్రజలు తండోపతండాలుగా దైవకారుణ్యంలోనికి ప్రవేశించేందుకు ద్వారాలు తెరచాడు.

దైవదౌత్యాన్ని చారిత్రక సత్యంగా చేయటంలోని మరో ఉద్దేశ్యం భవిష్యత్తులో ప్రవక్తల పరంపర సమాప్తమవటమే. అయితే ఇది కూడా కేవలం ఒక ప్రకటన చేయటంతోనే సరిపోదు. దైవదౌత్య పరంపరపై సీలువేసే ముందు కొన్నిషరతులను నెరవేర్చవలసిన అవసరం వుండింది.

(1) జీవన వ్యవహారాలన్నింటికీ సంబంధించిన దైవాదేశాలు అవతరించటం (ఒక సవివరమయిన గ్రంథాన్ని మీ వద్దకు అవతరింపజేశాడు (6:114)).

(2) మానవ ప్రవర్తనా నియమావళిని నిర్దేశించే పరిపూర్ణమైన ఆదర్శం ప్రజల ముందుకు రావటం (మీ కొరకు దైవప్రవక్తలో అత్యుత్తమ ఆదర్శం ఉంది (33:21)).

(3) దైవ సందేశాన్ని శాశ్వత ప్రాతపదికపై సురక్షితంగా – స్వచ్ఛంగా ఉంచేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరగటం (ఈ జ్ఞాపిక (ఖుర్ఆన్)ను మేమే అవతరింపజేశాము. మేమే దాని రక్షకులం (15:9)).

అల్లాహ్ తన నిర్ణయానుసారం ఈ మూడు షరతులనూ పరిపూర్ణరూపంలో నెరవేరే మహత్తర ఏర్పాటు చేశాడు.

వెనుకటి ప్రవక్త విషయంలో దైవవిధానం ఎలా ఉండేదంటే దేవుడు ఒక్కోప్రవక్తకు కొన్ని సూచనలు (మహిమలు) ఇచ్చేవాడు. ప్రవక్త తన జాతివారి మధ్య ఉండి సందేశప్రచార బాధ్యతలను శాయశక్తులా నిర్వర్తించేవాడు. అతను తన దగ్గరున్న అసామాన్యమైన నిదర్శనాల ద్వారా తానొక దైవప్రవక్తనని నిరూపించుకోవడానికి ప్రయత్నించేవాడు. అయినా ప్రజలు విశ్వసించేవారు కారు. అటు ప్రవక్త బాధ్యత మాత్రం తీరిపోయేది. మరో వంక దైవదూతలు రంగప్రవేశం చేసి దైవాదేశానుసారం శిక్షను అవతరింపజేసి ఆ జాతిని తుదముట్టించేవారు.

కాని అంతిమదైవ ప్రవక్త విషయంలో దైవనిర్ణయం మరోవిధంగా ఉంది. ఆయన సందేశం అందజేసిన జాతివారిపై దైవశిక్ష అతరించలేదు. దానికి బదులు దైవప్రవక్త మరియు ఆయన ప్రియసహచరులు కలసి దుష్టశక్తులను, సత్యతిరస్కారులను ఎదుర్కొనేలా చేశాడు దేవుడు. వెనుక ఉండిపోయిన పల్లెటూరివారితో ఇలా అను : త్వరలోనే మీకు పరాక్రమశీలుడైన జనులతో పోరాడేందుకు పిలుపు వస్తుంది. మీరు వారితో పోరాడటమో లేదా వారు ఇస్లాం స్వీకరించటమో జరుగుతుంది (48:16). ఈ సత్యాసత్యాల ఘర్షణలో సత్యం ముందు శిరస్సువంచని వారి శిరచ్ఛేదనం జరగాలన్నది దైవాభిమతం అయింది. వారితో యుద్ధం చేయండి. దేవుడు మీ చేతుల మీదుగా వారిని శిక్షిస్తాడు (9:14). వేరేమాటల్లో చెప్పాలంటే, అంతకుముందు దైవదూతలు చేసే పనిని ఇప్పుడు మనుషుల ద్వారా చేయించాలని దేవుడు తలపోశాడు మరి.

ఈ దైవనిర్ణయ పర్యవసానంగానే హిజ్రత్ మరియు ఇస్మామే హిజ్రత్ మదీనాకు వలస మరియు సత్యం యొక్క సంపూర్ణ నిరూపణ అనంతరం – ఇతర ప్రవక్తల జాతులపై

మాదిరిగా – అరబ్బులపై అగ్నిపర్వతం బద్ధలైపడలేదు. ఆకాశం నుంచి ఆపదవచ్చి పడలేదు. పైగా దైవప్రవక్త మరియు దైవప్రవక్త ప్రియసహచరులు వ్యతిరేకశక్తులను ఎదుర్కొని పోరాడవలసి వచ్చింది. ఈ సైనిక ప్రతిఘటనలో దేవుని ప్రత్యేక తోడ్పాటుతో దైవప్రవక్త మరియు సహచర వర్గానికి విజయం వరించింది. దైవధర్మం రాజ్యాంగబద్ధమైన ఒక వ్యవస్థగా అరేబియా ద్వీపంలో నెలకొల్పబడింది.

ఈ సంఘటన యొక్క అనేక ఫలితాలలో ఒకఫలితం ఏమిటంటే దైవప్రవక్త సందేశ ఉద్యమం వ్యక్తిగత స్థాయినుండి సామూహిక వ్యవహారాల వరకు – జీవితంలోని దశలన్నింటినీ దాటుకుంటూ పోవలసివచ్చింది. జీవితంలోని అన్నిరంగాలకు సంబంధించిన ఆదేశాలు అవతరించాయి. ఈ సంఘటనలే గనక ఆనాడు ఎదురుకాకుండా ఉంటే ఇస్లామీయ షరీయత్‌లో అన్నిరకాల ఆదేశాలు అవతరించేవికావు. ఎందుకంటే పరిస్థితుల కనుగుణంగా అవసరంమేరకు ఆదేశాలు జారీ చేయటం దైవవిధానం. ఒకేసారి చట్టాలన్నీ క్రోడీకరించబడి పుస్తక రూపంలో ప్రవక్తకు ఇవ్వబడవు. దైవదూతల ద్వారా అరబ్బు ధిక్కారులను నిర్మూలించే బదులు విశ్వాసుల ఖడ్గాల ద్వారా వారిని చిత్తుచేసి షరీయత్‌కు పరిపూర్ణత చేకూర్చాలని దేవుడు నిర్ణయించాడు – తదనుగుణంగానే జరిగింది.

దైవప్రవక్త మాజీ జీవితం (ప్రవక్త పదవి లభించకపూర్వపు జీవితం) ఇస్లాం ప్రవర్తనా నియమావళికి అణుగుణంగా ఉండటం, ఆయన జీవితంలో ఎక్కడా ఎలాంటి మచ్చలు ఉండకపోవటం కూడా గమనార్హమైన విషయమే. ఆ తరువాత పరిస్థితుల క్రమ వికాసానికి అనుగుణంగా దైవప్రవక్త మస్జిద్ నుండి యుద్ధ మైదానం వరకు, ఇంటి నుండి అధికార పీఠం వరకు అన్నిచోట్లా కీలకపాత్రను పోషించవలసి వచ్చింది. ఆ విధంగా ప్రవక్త ఉన్నత మానవీయ విలువలకు ఆదర్శప్రాయంగా నిలిచి ప్రళయదినం వరకూ ప్రజలకు మార్గదర్శకులయ్యారు.

మరి ఈ సంఘటన ఖుర్ఆన్‌కు రక్షణ కల్పించే మహత్తర సాధనంగా కూడా పరిణమించింది. వెనుకటి ఆకాశ గ్రంథాలు సురక్షితంగా ఉండకపోవటానికి ముఖ్యకారణం ఏమిటంటే ఆయాగ్రంథాలను ప్రక్షిప్తాలకు లోనుకాకుండా చూచేందుకు వెనుక శక్తివంతులైన వ్యక్తులు గానీ, సంస్థలు గానీ ఉండేవి కావు. అంతిమ దైవప్రవక్త మరియు ఆయన ప్రియసహచరులు తమ సమకాలీనులైన మిధ్యాశక్తులతో పోరాడి వారిని నిస్సహాయులుగా చేయటమో, లేక వారిని తమ విధేయులుగా మలచుకోవటమో చేశారు. క్రమక్రమంగా

ప్రాచీన ప్రపంచంలో చాలా భాగం ఇస్లాం ప్రభావానికి లోనైపోయింది. తత్ఫలితంగా దైవగ్రంథపరిరక్షణకై ప్రభుత్వాధికారం కూడా తోడ్పడింది. ఇస్లామీయ ప్రభుత్వ సహకారంతో దివ్య గ్రంథమైన ఖుర్ఆన్ ఒక తరంనుండి మరో తరానికి సురక్షితంగా చేరసాగింది. పారిశ్రామిక విప్లవం వచ్చి, ముద్రణాయంత్రం ఉనికిలోనికి వచ్చిన మీదట ఖుర్ఆన్‌ను పరిరక్షించేపని మరింత సులువైపోయింది.

ఇదంతా ఇట్టే అల్లాటప్పాగా జరిగిపోలేదు. దీనికోసం ప్రవక్త మరియు ఆయన సహచరులు పెనుతుఫానులను ఎదుర్కొనవలసి వచ్చింది. కాలపు కాళనాగులను ఎదిరించి నెగ్గుకు రావలసి వచ్చింది. అవిశ్వాసులు కోరినా, ప్రవక్త ఆశించినా వారికి చిటికెలో అద్భుతాలు చేసే శక్తులు ఇవ్వబడలేదు. తత్కారణంగా వారు తమ నీతి నడవడికలనే మహిమలుగా మలచుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వాళ్లను ధిక్కరించిన ప్రజలపై నింగినుంచి గాని, నేలలోనుంచి గాని ఆపద (శిక్ష) రాలేదు. అందుచేత సత్యధర్మ ధ్వజవాహకులు తమ సదాచరణ ద్వారానే సంచలనం సృష్టించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఆ పనిని వారు చేశారు కూడా, దైవదౌత్య పరిసమాప్తి నిర్ణయానుసారం దేవుడు వారికి ఒకేసారి పూర్తిగ్రంథాన్ని అందజెయ్యలేదు. పరిస్థితులకనుగుణంగా ఆదేశాలను అవతరింపజేసి జీవితపు సమస్త రంగాల 'రుచి'ని దేవుడు వారికి చూపించాడు.

ఈ ప్రక్రియ పరిపూర్ణస్థితికి చేరేదాక ప్రవక్త మరియు ఆయన సహవాసులు ఎన్నో కఠినమైన పరీక్షలు ఎదుర్కొన్నారు? ఎన్నెన్నో కష్టాలకు ఎదురీదారు? ఖుర్ఆన్ మాటల్లోనే చెప్పాలంటే అదొక తీవ్రాతి తీవ్రమైన భూకంపం (33:11) లాంటిది. దుర్మార్గుల విషయంలో ఏకాస్త రాజీవైఖరి కూడా అవలంబించరాదని దైవప్రవక్తకు గట్టిగా ఆదేశించటం జరిగింది (17:75). పరిస్తితులు ఎంత కఠినంగా ఉన్నాసరే, ఆయన సహచరులకు వంకపెట్టేందుకు అనుమతి (9:119) ఇవ్వబడలేదు. ఆయన సతీమణులు రెండుపూటల భోజనం కోసం డిమాండుచేస్తే – మీకు ప్రవక్త సహచర్యం కావాలో, ప్రాపంచిక సుఖం కావాలో (ఏదోఒకటి) తేల్చుకోమని జవాబువస్తుంది (33:28).

వాస్తవమేమిటంటే ముహమ్మద్ దైవదౌత్యాన్ని వ్యవస్థీకృతం చేయడమన్నది మానవ చరిత్రలోకెల్లా అత్యంత కష్టసాధ్యమైన కార్యం. ఈ కార్యసాధన అనుపమమైన కృషివల్లన సాధ్యమవుతుంది. అపూర్వమైన త్యాగాలతోనే సంభవమవుతుంది. "నన్ను వేధించినంతగా ఎవరూ ఏ ప్రవక్తనూ వేధించలేదు" అని స్వయంగా అంతిమ దైవప్రవక్త చెప్పారంటే ఆయన

ఉద్యమం ఎన్నిక్లిష్టమైన దశలను అధిగమించిందో అర్థంచేసుకోవచ్చు. ప్రజలు ఆయన్ని నలిపివేసారని స్వయంగా ఆయన సహధర్మచారిణి సాక్ష్యమిచ్చారు. అంతిమ దైవప్రవక్త మరియు ఆయన సహచరులు ప్రాపంచిక సుఖసౌఖ్యాల సంగతి అటుంచి కనీస జీవితావసరాలను కూడా పొందలేకపోయారు. ఇన్ని త్యాగాలకోర్చిన తరువాతే భూమండలంపై ఒక 'కారుణ్యవ్యవస్థ'కు పునాది పడింది మరి.

భావితరాలవారికి అంతిమ దైవప్రవక్త చేసిన ఈ మహోపకారం మూలంగానే ఆయనపై దరూద్ మరియు సలాం పంపమని (దేవుడు ఆయనపై శాంతిని అవతరింపజేయమని) ఆదేశించబడింది. చరిత్రలోకెల్లా అత్యంత క్లిష్టమైన ఈ కార్యాన్ని సాధించడంలో ఆయన బంధువులు, కుటుంబీకులు, సహచరులు పూర్తి సహాయసహకారాల నందించడమేగాక అత్యంత ఓర్పుగా మెలగటంవల్ల ప్రవక్తతో పాటు ప్రవక్త కుటుంబీకులు మరియు ప్రత్యక్ష సహచరులపై కూడా కరుణానుగ్రహాలు కురిపించమంటూ ప్రార్థించాలని చెప్పబడింది. ఎవరైనా ఒకరు మరొకరికి సహాయ సహకారాలందించినపుడు కృతజ్ఞతలు చెప్పాలి. మానవనైజం వాంఛించేది కూడా ఇదే. ఈ వాంఛానుసారమే మహోపకారం చేసిన మహా మనిషిపై శాంతి కురిపించమని అల్లాహ్‌ను వేడుకోవటం జరుగుతుంది.

హదీసులో ఇలా అనబడింది.

"ప్రవక్తగారు ఇలా అన్నారు : ఏ వ్యక్తి దగ్గరయితే నా ప్రస్తావన జరిగిందో మరియు ఆయన నా కొరకు శాంతి వేడుకోలు (దరూద్ మరియు సలామ్) చేయలేదో అతనికన్నా పిసినారి మరెవరూ లేరు (నసాయి, తిర్మిజి)

## ప్రవక్త మహిమ - ఖుర్‌ఆన్

ప్రతిప్రవక్తకు ఒక మహిమ ఇవ్వబడుతుంది. అయితే అంతిమ దైవప్రవక్తకు మహిమగా ఖుర్‌ఆన్ వొసగబడింది. ఏ ప్రవక్తయితే శాశ్వితంగా ప్రళయదినం వరకూ ప్రవక్తగా చేసి పంపబడ్డాడో అతని వద్దగల మహిమ కూడా శాశ్విత ప్రాతిపదికగల మహిమ అయివుండాలి మరి. దేవుడు అంతిమ దైవప్రవక్తకు శాశ్విత మహిమగా ఖుర్‌ఆన్‌ను ప్రసాదించాడు.

వెనుకటి ప్రవక్తల మాదిరిగా నువ్వు కూడా ఏదైనా ఒక మహిమను ప్రదర్శించమని దైవప్రవక్త వ్యతిరేకులు పదేపదే డిమాండు చేశారు. ఈ ప్రవక్తకు గతించిన ప్రవక్తల మాదిరిగా మహిమలేవీ ఇవ్వబడవని ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా చెప్పివేయబడింది (17:59).

చివరకు ఖుర్‌ఆన్‌లో ఆ విధంగా కూడా హెచ్చరిక చేయబడింది. (ఓ ప్రవక్తా!) ఒకవేళ నీకు వారి వైముఖ్యాన్ని భరించటం కష్టంగా ఉంటే, మరి నీకు శక్తిఉంటే భూమిలో ఒక సొరంగాన్ని త్రవ్వి లేదా ఆకాశానికి నిచ్చెన వేసి వారివద్దకు ఏదైనా సూచనను తీసుకువచ్చే ప్రయత్నం చెయ్యి. అల్లాహ్ గనక కోరివుంటే వారందరినీ సన్మార్గంపై సమీకరించి ఉండేవాడు. కనుక నీవు మూర్ఖుడవు కావద్దు (6:35)

దీనికి భిన్నంగా మీపై అవతరింపచెయ్యబడిన ఈ ఖుర్‌ఆన్ గ్రంథమే ఒక మహిమ అని సెలవీయబడింది.

"ఈ ప్రవక్తపై సూచనలు ఎందుకు అవతరించలేదు"? అని వారడుగుతున్నారు. సూచనలైతే అల్లాహ్ ఆధీనంలో ఉన్నాయని, నేనైతే స్పష్టంగా హెచ్చరించే వాడిని మాత్రమేనని వారికి చెప్పండి. వారిపై పఠించబడే ఖుర్‌ఆన్‌ని మేము మీపై అవతరింపజేశాము. వారికి ఇది చాలాదా? విశ్వసించేవారి కొరకు ఇందులో కారుణ్యం మరియు హితబోధ ఉంది" (29:50–51)

దివ్య ఖుర్‌ఆన్ మహిమ అనేదానికి పలు కోణాలున్నాయి. ఇక్కడ మేము ముఖ్యమైన దాని కోణాలు మూడింటిని ప్రస్తావించదలిచాము.

(1) ఖుర్‌ఆన్ భాష ఒక అంతర్జాతీయ భాషగా ఇప్పటికీ సజీవంగా ఉంది.

(2) మత గ్రంథాలలో ఎలాంటి మార్పులు చేర్పులకు లోనుకాని ఏకైక స్వచ్ఛమైన – గ్రంథం ఖుర్‌ఆన్

(3) ఖుర్‌ఆన్ సవాలు విసిరినప్పటికీ దానికి సమాధానంగా దాన్ని పోలిన గ్రంథాన్ని ఎవరూ ఇంతవరకు తయారు చేయలేకపోవటం.

నేడు చెలామణిలో నున్న ప్రాచీన గ్రంథాలలో ఒక ఖుర్‌అన్ మాత్రమే విలక్షణమైనది. ఇతరాత్ర పవిత్ర గ్రంధాల భాషలన్నీ చరిత్ర బీరువాలలో మూయబడి ఉన్నాయి. కాని ఖుర్‌ఆన్ భాష (అరబీ) నేటికీ సజీవంగా ఉంది. ప్రజా బాహుళ్యంలో చెలామణిలో ఉంది. నేటికీ కోట్లాది మంది ఈ భాషలో మాట్లాడతారు. వ్రాస్తారు. సుమారు వెయ్యిన్నర సంవత్సరాల క్రితం ఈ గ్రంథం అవతరింపజేయబడినది. ఇది తిరుగులేని వాస్తవం. ఎందుకంటే మానవచరిత్రలో ఒక్క ఖుర్‌ఆన్ తప్ప మరే గ్రంథమూ తన మూలభాషను జనబాహుళ్యంలో చెలామణీలో ఉంచలేకపోయింది.

ఉదాహరణకు బైబిల్‌నే తీసుకోండి. అది ఖుర్‌ఆన్ కన్నా కేవలం కొన్ని వందల సంవత్సరాలకు పూర్వం అవతరించిన ఆకాశ గ్రంథమే. కాని ఆ గ్రంథం మూలభాష ఏదో, ఏసుక్రీస్తు ఏ భాషలో సందేశమిచ్చారో ఇంతవరకు ఎవరూ ఇతమిత్థంగా చెప్పలేక పోతున్నారు. బహుశా 'అరామీ' భాషలో అవతరించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారంతే. అయితే రూపంలో ఏసుక్రీస్తు ప్రబోధనల రికార్డు యొక్క ప్రాచీన ప్రతి ఒకటి గ్రీకుభాషలో ఉంది. అంటే ఏసుక్రీస్తు ప్రబోధనలు తర్జుమా రూపంలో లభ్యమయ్యాయన్న మాట! మరి ఈ గ్రీకు భాష కూడా నేటి గ్రీకు భాషకు పూర్తి భిన్నంగా ఉంది. ఆఖరికి 19వ శతాబ్ది చివరి వరకూ కొత్త నిబంధనలలోని కనీసం 550 పదాలకు (సుమారు 12 శాతం టెక్ట్స్‌లో) అర్థమే తెలీదు. 19వ శతాబ్దిలో ఒక జర్మన్ పండితుడు (Adolt Deissman) ఈజిప్టులో కొన్ని పురాతన రచనలు కనుగొన్నాడు. వాటి అధ్యయనం తరువాత అతను ఒక నిర్ధారణకు వచ్చాడు – 'బిబ్లికల్ గ్రీకు' భాష ఒక ప్రాచీన గ్రీకు భాష అనీ, అది క్రీ.శ. ఒకటవ శతాబ్దిలో పాలస్తీనా ప్రాంతంలో చెలామణీలో ఉండేదని! తెలియని కొన్ని పదాలకు ఈయన కొన్ని అర్థాలు నిర్ధారించాడు. అయితే ఇప్పటికీ గ్రీకు భాషలో వున్న బైబిల్‌లో 50 పదాలకు అర్థం ఎవరికీ తెలియదు.

Xavier-Leon-Dufour. S.J, the Gospels and the Jesus of History Desclee co. Inc. New York 1970, pp, 79-80

అరబీ భాషలుపై పరిశోధన జరుపుతూ ఆరిస్ట్‌రీనా (1823–1892) తన గ్రంథమైన "స్సామియు"లో ఇలా అంటాడు.

"మానవ చరిత్రలోకెల్లా ఆశ్చర్యకరమైన సంఘటన ఏదంటే అది అరబీ భాషే. ఈ భాష ప్రాచీన చరిత్రలో ఒక అనామక భాషే. మరి ఉన్నట్టుండి అది ఒక పరిపూర్ణమైన భాషగా తయారయింది. ఆ తరువాత అందులో చెప్పుకోదగ్గ మార్పు ఏమీ రాలేదు. దీనికి బాల్యంగాని, వృద్ధాధప్యంగాని లేవు. అది ప్రభవించిన నాడు ఎలా ఉండేదో ఇప్పటికీ అలాగే ఉంది".

దివ్య ఖుర్‌ఆన్ భాషగురించి ఫ్రెంచి విమర్శకుడు వెలిబుచ్చిన ఈ అభిప్రాయం యదార్థానికి ఖుర్‌ఆన్ ఔన్నత్యంపట్ల ఒప్పుకోలే. నిజానికి ఖుర్‌ఆన్ సాహితీ శైలిలోని మహత్యమే దాన్ని కాల ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా ఆపింది – ఇప్పటికీ (అరబ్బు) జన సామాన్యం అదే భాషను మాట్లాడుతోంది. ఈ ప్రత్యేకత ఒక్క ఖుర్‌ఆన్‌కు మాత్రమే దక్కుతుంది. క్రైస్తవ

పండితుడైన జర్జీజైదాన్ (1861–1914) ఈ విషయాన్ని ఇలా ఒప్పుకున్నాడు :

"సంక్షిప్తంగా చెప్పాలంటే ఖుర్ఆన్ అరబీ భాషపై ఎంత బలమైన ప్రభావం వేసిందంటే అలాంటి ఉపమానం మరే ఇతర మత గ్రంథ భాషలోనూ కనిపించదు".

ప్రపంచంలోని భాషలన్నీ మార్పుకు లోనయ్యాయన్నది వాస్తవం. ఏ పండితుడు కూడా కొన్ని వందల సంవత్సరాల క్రితం ప్రచురితమైన గ్రంథాన్ని నేడు నిఘంటువుల ఆధారం లేకుండా ఆకళింపు చేసుకోలేడు. ఈ మార్పుకు ప్రధానమైన కారణాలు రెండు. ఒకటి : సామూహిక విప్లవం. రెండు : సాహిత్య క్రమవికాసం (పరిణామం). ఈ మార్పులకు అరబీ భాష కూడా అతీతం కాదు. ఇతర భాషలవలెనే అరబీ కూడా పూర్వం క్రమ వికాసమొందుతూ వచ్చింది. అయితే ఈ పురోగతి అరబీ భాషా స్వరూపాన్ని మార్చలేకపోయింది. 1400 వందల సంవత్సరాల క్రితం ఖుర్ఆన్ అవతరించిన కాలంలో మక్కాలో ఏ అరబీ వాడుకలో ఉండేదో ఇప్పుడూ అదే అరబీ వాడుకలో ఉంది. హుమర్ (క్రీ.పూ. 850) రచన, ఎలైె, తులసీదాస్ (క్రీ.శ. 1623లో మరణం) రచించిన రామాయణం, షేక్స్ పియర్ (1564–1616) నాటకాలు సాహిత్య ప్రపంచంలో అపురూపమైన కళాఖండాలుగా అభివర్ణించబడతాయి. నాటి నుంచీ నేటి వరకూ అవి చదువరులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. కాని ఆయా గ్రంథాలు నేడు వాటి మూల భాషలో లేవు. అవి ఇప్పుడు పరిణామం చెందిన భాషలో ఉన్నాయే తప్ప ఆనాటి భాషలో లేవు. భాషా జగత్తులో ఒక్క ఖుర్ఆన్ భాష మాత్రమే తన రూపురేఖలను మార్చకుండా యథాతథంగా ఉంది. ఎన్ని సాహిత్య విప్లవాలు వచ్చినా, రాజకీయ విప్లవాలు పెల్లుబికినా అది వాటికి లోనుకాకుండా తన వైశిష్ట్యాన్ని కాపాడుకుంటూ వస్తోంది. చరిత్రలో ఇది ఏకైక దృష్టాంతం అనే అనాలి. మానవ సమాజాల్లో పొడసూపిన ఏమార్పు దాన్ని మార్చలేకపోయింది. దివ్య ఖుర్ఆన్ ప్రోక్తం అత్యున్నతమైందనడానికి ఇది ప్రబల తార్కాణం. ఖుర్ఆన్ ఒక తిరుగులేని మహిమ అనీ, దాని ఘనత్వం కొరకు మరో ప్రమాణం ఏదీ అవసరం లేదని గత వెయ్యిన్నరేండ్ల చరిత్ర స్పష్టంగా నిరూపించింది.

## సామూహిక విప్లవాలు :

సామాజిక విప్లవాలు ఏ విధంగా భాషలపై ప్రభావం చూపుతాయో అర్థం చేసుకోవాలంటే లాటిన్ ఉదాహరణను తీసుకోవాలి. తదుపరి కాలంలో ఇటలీ లాటిన్‌కు కేంద్ర స్థానమైందనుకోండి, కాని వాస్తవానికి ఈ భాష పుట్టినిల్లు ఇటలీకాదు. దాదాపు

క్రీ.పూ 1200లో రాతియుగం అనంతరం మధ్య ఐరోపాలోని తెగల చుట్టుప్రక్కల ప్రాంతాలలో విస్తరించినపుడు – కొంతమంది – ముఖ్యంగా అలప్ పర్వతజాతివారు ఇటలీలో ప్రవేశించారు. రోమునగరంలోనూ, దాని పరిసర ప్రాంతాలలోనూ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వారు మాట్లాడే భాష, స్థానిక భాష కలసి రూపొందిన భాషే తొలి లాటిన్ భాష. ఆ విధంగా లాటిన్ భాష ఒక సాహితీ భాషగా మారింది. క్రీ.పూ. ఒకటవ శతాబ్దిలో రోము ప్రభుత్వం నెలకొన్నప్పుడు అది లాటిన్ భాషను అధికారభాషగా చేసుకుంది. క్రైస్తవ మత వ్యాప్తి ద్వారా కూడా ఈ భాషకు బలం చేకూరింది ఈ విధంగా మత, రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రోద్బలం ద్వారా ఇది పురోభివృద్ధి చెందింది. ఆఖరికి అది ప్రాచీన ఐరోపాలోని ముఖ్య ప్రదేశాలన్నింటిలో అది వ్యాప్తి చెందింది. సెయింట్ ఆగస్టిన్ (354–430) హయాంలో లాటిన్ భాష ఉచ్ఛస్థితికి చేరింది.

ఎనిమిదవ శతాబ్దిలో ముస్లిం జాతులు ముందుకు దూసుకువచ్చాయి. అవి రోము సామ్రాజ్యాన్ని బలహీనపరచి ఆఖరికి అది ఇస్తాంబుల్‌లో శరణు జొచ్చవలసిన పరిస్థితిని సృష్టించాయి. 1453లో తురుష్కులు ఇస్లాంబుల్‌ను జయించి అక్కడి నుండి కూడా రోము అధికారాన్ని అంతమొందించారు.

వెయ్యేండ్ల క్రితం రోము మహాసామ్రాజ్యం ముక్కచెక్కలవడంతో వివిధ ప్రాంతీయ భాషలు ఉనికిలోకి వచ్చేందుకు ఆస్కారం లభించింది. లాటిన్ భాష మూలం (ఆధారం లేక మిశ్రమం)తో వెర్రి తలలువేసిన భాషలనే నేడు మనం ఫ్రెంచి, ఇటాలియన్, స్పానిష్, పోర్చుగీసు, రుమేనియన్ భాషలుగా వ్యవహరిస్తున్నాము. ఇప్పుడు లాటిన్ భాష రోము చర్చీ ఆరాధనా భాషగా మాత్రమే మిగిలిపోయింది. కాకపోతే కొన్ని ప్రత్యేక పారిభాషిక పదాలు మాత్రం సైన్సు, న్యాయశాసన రంగాల్లో వాడుకలో ఉన్నాయి. అంతేగాని ఇప్పుడది జనాదరణగల ఒక సజీవభాష మాత్రం కాదు. అదొక చారిత్రక భాషగా ఉండిపోయిందంటే, ఉదాహరణకు న్యూటన్ (1642–1727) సిద్ధాంతాన్ని గనక ఎవరైనా దాని మూలభాషలో చదవాలంటే అతను లాటిన్ భాషను నేర్చుకొనక తప్పదు.

ఇతర ప్రాచీన భాషలన్నింటికీ ఇదే గతి పట్టింది. ప్రతి భాషా వివిధ సామాజిక స్థితిగతులకనుగుణంగా మార్పులు చెందుతూ ఉండింది. అలా అలా తొలి భాష కాస్తా మరుగున పడిపోయి దానిస్థానంలో మార్పు చెందిన భాష వచ్చింది. ఈ పరిస్థితులన్నీ గత వెయ్యిన్నరేండ్లుగా అరబీ భాషకు కూడా ఎదురయ్యాయి. కాని ఆశ్చర్యకరమైన విషయం

ఏమిటంటే అరబీ భాషలో ఎలాంటి మార్పు రాలేదు. భాషా జగత్తులో ఈ పరిణామానికి అరబీ భాషలోనుకాకపోవటం నిజంగా ఖుర్ఆన్ మహత్యమనే చెప్పాలి.

క్రీ.శ. 70లో యూదతెగలు సిరియానుంచి వలసపోయి యస్రిబ్ (మదీనా) ప్రాంతంలో వచ్చి స్థిరపడ్డాయి. ఆ కాలంలో అక్కడ 'అమాలిఖ' అనబడేవారు ఉండేవారు. వారి భాష అరబీ. అమాలిఖలతో కలసి జీవించడం వల్ల యూదుల భాషకూడా అరబీ భాష అయిపోయింది. అయితే వారి అరబీ భాష సాధారణ అరబ్బుల కంటే కొంత భిన్నంగా ఉండేది. అది హెబ్రూ మరియు అరబీల మిశ్రమంగా ఉండేది. ఇలాంటి సంఘటనే ఇస్లాం అనంతరం అరబ్బులకూ ఎదురైంది. వాళ్లు అరేబియా ఎల్లలు దాటి ఆసియా ఆఫ్రికా ఖండాలలోని పెక్కు దేశాలకు వెళ్లినప్పుడు అరబీతోపాటు ఆయా ప్రాంతాల భాషల్లో మాట్లాడసాగారు. అయితే ఈ మిశ్రమ సంస్కృతీ ప్రభావం వారి భాష (అరబీ)పై పడలేదు. అరబీ భాష తన మూలస్వరూపాన్ని కాపాడుకుంటూవచ్చింది.

ఖుర్ఆన్ అవతరణ తరువాత అరబీ భాషకు ఇలాంటి మొదటి అవకాశం తొల్దొలి కాలంలోనే ఎదురైంది. ఇస్లాం అరేబియాలోని అనేక మండలాల్లో, తెగలవారిలో వ్యాపించింది. వారి మాండవికాల్లో ఎంతో వ్యత్యాసం ఉండేది. ఈ కారణంగానే అబూ అమర్ బిన్ అల్ఊలా ఒకసారి : "హుమైర్ తెగవారి భాష మా భాషకాదు" అని అనవలసివచ్చింది. ఉమర్ ఒకసారి, ఒక పల్లెటూరి వ్యక్తి ఖుర్ఆన్ చదువుతూ ఉండగా విని అతన్ని పట్టుకొచ్చి దైవప్రవక్త సమక్షంలో హాజరు పరచారు. ఎందుకంటే, అతని ఉచ్ఛరణ ఎంతో భిన్నంగా ఉండటం వల్ల అతను ఖుర్ఆన్లోని ఏ భాగాన్ని పారాయణం చేస్తున్నాడో అంతుబట్టక ఆయన అలాచేశారు మరి. అలాగే వేరొక సందర్భంలో దైవప్రవక్త ఒకసారి ఒక అరబ్బు తెగ ప్రతినిధి వర్గంతో మాట్లాడుతుండగా అలీ విన్నారు. ఆ సంభాషణా తీరును చూసి ప్రవక్తకు అరబీతోపాటు మరో భాషకూడా వచ్చా! అన్న సందేహం కలిగింది అలీకి.

ఉచ్ఛరణలోని వైవిధ్యమే దీనికి ప్రధాన కారణం. ఉదాహరణకు తూర్పు నజద్ ప్రదేశంలో నివసించే బనూమీమ్ తెగవారు 'జ'ను 'యా'గా పలుకుతారు. వాళ్లు మస్జిద్ను మసీద్గా షజరాత్ను 'సరాత్'గా పలుకుతారు. అలాగే వాళ్లు 'ఖ'ను 'జా'గా ఉచ్ఛరిస్తారు. ఉదాహరణకు, 'తరీఖ్' అనమంటే 'తరీజ్' అని అంటారు. 'సిద్ధిఖ్'ను 'సిద్ధిజ్'గా వ్యవహరిస్తారు. 'ఖద్ర్'ను 'జద్ర్'గా పేర్కొంటారు. 'ఖాసిమ్' అనవలసివస్తే 'జాసిమ్' అంటారు. ఇలా అనేక తెగలు కలసినపుడు భాషాచరిత్ర నియమానుసారం కొంగ్రొత్త భాష రూపం దాల్చింది. కాని

ఖుర్‌ఆన్‌లోని ఉన్నతమైన సాహిత్యం, మనోహరమైన శైలి అరబీ భాషను కాల ప్రవాహంలో కొట్టుకుపోకుండా కాపాడింది. అంతేగాక, అది ప్రపంచంలో అనేకానేక భాషలు మాట్లాడే తెగలను, జాతులను తనలో లీనం చేసుకోగలిగింది. ఆ మాటనే డా॥ అహ్మద్ హుసైన్ జియాత్ ఇలా అంటారు.

“ఇస్లాం తరువాత అరబీ భాష ఒక జాతీయ భాషగా ఉండలేదు. పైగా అది దైవధర్మంలో ప్రవేశించిన అన్ని తెగలవారి భాషగా మారిపోయింది”.

మరి ఈ అరబ్బులు తమ ద్వీపం నుంచి బయటకు వెళ్ళారు. ప్రాక్పశ్చిమాలకు విస్తరించారు. ఈ ప్రాంతాలలో అనేక భాషలు చెలామణిలో ఉండేవి. వాటిలో పారసీ, ఖబ్తీ, బర్బరీ, సిరియన్, హెబ్రూ, గ్రీకు, లాటిన్, ఆరామి భాషలు ముఖ్యమైనవి. ఈ భాషలు మాట్లాడేవారిలో కొన్నిజాతులవారు సంస్కృతీ నాగరికతల రీత్యాఅరబ్బులకన్నా ఎంతో ఉచ్ఛస్థితిలో ఉన్నవారే. రాజకీయంగా కూడా ఆయాజాతులు అరబ్బుల కన్నా ఎంతో ముందంజలో ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో అరబ్బులు ప్రాచీన సంస్కృతికి పుట్టినిల్లయిన, గొప్ప గొప్ప జాతులకు కేంద్రస్థానమైన ఇరాక్‌లో అడుగుపెట్టారు. ప్రపంచంలోనే రెండు అతి పెద్ద సామ్రాజ్యాలలో ఒకటైన ఈరాన్ల వాళ్ళు కాలుమోపారు. రోము సంస్కృతితో, క్రైస్తవ మతంతో వారి ఢీకొనవలసి వచ్చింది. ఫైనీఖి, కనాన్, ఈజిప్షియన్, గ్రీకు, గసానీ ఇత్యాది జాతుల సభ్యతా సంస్కృతులను ఆకళింపు చేసుకుని సంస్కృతి నాగరికతలలో ఉన్నత స్థానాన నిలిచిన సిరియాను సైతం వారు ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రాక్పశ్చిమ తత్వ శాస్త్రాలకు సంగమమైన ఈజిప్టుతో వారికి ప్రతిఘటన ఎదురైంది. అరబీ భాష కొత్త పుంతలు తొక్కి, ఇతర భాషల్లాగా సరికొత్త స్వరూపాన్ని సంతరించుకోవడానికి ఈ అవకాశాలు చాలు. కాని అరబీ భాష ఈ వెల్లువల్లో కలసిపోకుండా తన విశిష్టతను కాపాడుకుందంటే అది ఖుర్‌ఆన్ యొక్క అత్యున్నతమైన సాహిత్యం, అనితరసాధ్యమైన శైలివల్లనే సాధ్యమైంది.

## ప్రవక్త సహచరులు

దైవప్రవక్త వారి ప్రియసహచరులు సాధారణ పరిభాషలో కేవలం సహవాసులు మాత్రమే కారు, వాళ్లు స్వయంగా దైవదౌత్యం (రిసాలత్) చరిత్రలో అనివార్యమైన అంశం లాంటివారు. దైవప్రవక్తకు సహాయకులుగా రాణించడానికే దేవుడు వారిని ఎన్నుకున్నాడు. ఏ కార్యన్నయితే నెరవేర్చటం దైవప్రవక్త విద్యుక్త ధర్మంగా చేయబడిందో దాన్ని సంపూర్తిచేయటంలో ఈ ‘సహాబా’ భాగస్థులుగా ఉన్నారు. ప్రవక్త ప్రత్యక్ష సహచరుల గురించి

అబ్దుల్లా బిన్ మస్ఊద్ ఇలా అన్నారు. "అల్లాహ్ వారిని దైవప్రవక్త సహచర్యం కోసం, ధర్మ సంస్థాపన నిమిత్తం ఎన్నుకున్నాడు".

ప్రవక్త సహచరులకు ఇంతటి చారిత్రకస్థానం కల్పించినవారి గుణగణాలు ప్రత్యేకతలేవి? దీనికి సంబంధించిన కొన్నికోణాలను ఈ సందర్భంగా ప్రస్తావించటం అవసరం.

## ధర్మంవారికి ఎంతో ప్రీతికరం :

ప్రవక్త సహచరుల గుణగణాలు ఖుర్ఆన్లో ప్రస్తావించబడ్డాయి. వాటిలో ఒకటేమంటే 'ఈమాన్' (విశ్వాసం) వారి కొరకు అత్యంత ప్రీతికరమైన అంశంగా మారింది (49:7). ఏదేని వస్తువుతో సంబంధానికి ఉచ్ఛస్థితి ప్రేమ. ఏ విషయంతోనైనా మనిషి సంబంధం ప్రేమ అనే స్థాయికి చేరినపుడు మనిషి దానికోసం దేనినైనా ధారబోస్తాడు. దానికి సంబంధించిన ప్రతి విషయాన్ని తనంతటతానే - ఒకరు చెప్పకపోయినా తెలుసుకోగలుగుతాడు. తనకు ప్రియతమైన ఆ వస్తువు కోసం తాను చేయవలసిందేమిటో, చేయరానిదేమిటో తెలుసుకుంటాడు. ప్రత్యేకించి అతనికెవరూ చెప్పనక్కరలేదు (9:46).

ప్రేమ స్థాయిలో సంబంధం ఏర్పడటమంటే భావం శ్రద్ధాసక్తులతో కూడిన సంబంధం అన్నమాట! అంటే మనిషి, ఇస్లాం లాభనష్టాలను తన స్వంత లాభనష్టాలుగా భావించాలి. ప్రవక్త సహచరులకు ఇస్లాంతో ఏర్పడిన సంబంధం ఇటువంటిదే మరి. ఒకవ్యక్తి తన కన్న కొడుకుకు చేకూరిన ప్రయోజనంపై సంతోషించినట్లే ప్రవక్త సహచరులు ఇస్లాంకు ప్రయోజనం చేకూరినపుడు సంతోషించేవారు. ఒక వ్యక్తి తన కుమారునికి సంబంధించి దుర్వార్తను విని కలతచెందినట్లే ప్రవక్త సహచరులు ఇస్లాంకు నష్టం వాటిల్లినప్పుడు బాధతో తల్లడిల్లిపోయేవారు. ఆ నష్టాన్ని పూడ్చే వరకూ వారికి మనశ్శాంతి కలిగేది కాదు.

ఏదైనా విషయంతో ప్రగాఢసంబంధం - ప్రేమ స్థాయిలో సంబంధం - ఏర్పడినపుడు మనిషి మనో మస్తిష్కాలు ఆవిషయమై పూర్తిగా జాగృతమవుతాయి. దానికోసం అతను ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతాడు. ఒకరు చెప్పకముందే దాని అవసరాలేమిటో తెలుసుకోగలుగుతాడు. దానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవటంలో అతనికి మానసికమైన ఏ అవరోధమూ ఏర్పడదు. దాని మార్గంలో తన వంతు పాత్రను పోషించటంలో వంకలు పెట్టడు, సాకులు వెతకడు.

మనిషి ఏ విషయాన్నైనా తన స్వవిషయంగా తలపోసినపుడు అతనికి పదేపదే నచ్చజెప్పవలసిన అవసరం ఉండదు. అతను ఎలాంటి ప్రతిఫలాన్ని ఆపేక్షించకుండానే

ఏకపక్షంగా దానికోసం తన సర్వస్వాన్ని అర్పించడానికి సంసిద్ధుడవుతాడు. దాని కొరకు పోగొట్టుకోవడాన్నే ప్రాప్తంగా తలపోస్తాడు. దానికొరకు మూల్యం చెల్లించటమే అతని దృష్టిలో పోగొట్టుకోవడాన్నే ప్రాప్తంగా తలపోస్తాడు. దానికొరకు మూల్యం చెల్లించటమే అతని దృష్టిలో అమూల్యం అవుతుంది. దానికోసం అతను ప్రతి రెండవ పరమార్థాన్నీ విస్మరిస్తాడు. దానికోసం అతను ఎంతటి బాధనైనా సంతోషంగా భరిస్తాడు.

ప్రవక్త సహచరులంటే వాళ్ళేదో అసాధారణమైన మనుషులు కారు. మానవాతీత శక్తులు గలవారు అంతకన్నా కారు. వాళ్ళంతా మనలాంటి మనుషులే. కాకపోతే వారిలో ఒక సుగుణం ఉండేది. ఒక సాధారణ మనిషి తన స్వయంతో ఉండే 'ప్రేమ'స్థాయి సంబంధం ప్రవక్త సహచరులకు విశ్వాసంతో ఉండేది. ఒక సగటు మనిషి తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటం పట్ల కనబరచే శ్రద్ధాసక్తులను ఇస్లాం భవిష్యత్తుపట్ల కనబరచేవారు సహాబా, ఒక వ్యక్తి తన పురోభివృద్ధి కొరకు ఎంతగా పరితపిస్తాడో ప్రవక్త సహచరులు ఇస్లాం ధర్మంకొరకు అంతే పరితపించేవారు. వారిలోని ఈ సుగుణం మూలంగానే వారు చరిత్ర సృష్టించారు. ఇస్లాంకు అద్భుతమైన విజయం చేకూర్చారు.

## వైభవచరిత్రకు ముందే దైవప్రవక్తను ఆమోదించటం :

సహాబాలోని మరో విశిష్ఠత ఏమిటంటే వారు తమ సమకాలీన ప్రవక్తను తెలుసుకుని ఆయనతో సహకరించారు. ఈ పనిఎంత క్లిష్టమైనదంటే మనకు తెలిసిన చరిత్రలో – సామూహిక స్థాయిలో కేవలం ఒక్కసారి మాత్రం వర్షం కురిసింది. ప్రాచీన చరిత్రలో అన్నికాలాల్లోనూ ఈ సంఘటన పునరావృతం అయ్యేది. ప్రవక్త సందేశాన్ని విన్న ప్రేక్షకులు ఆయన మాటను త్రోసిరాజనేవారు. ఆయన్ని పరిహసించేవారు. "మీరు నా ప్రవక్తలను అసమర్థులుగా జమకట్టారు" అని బైబిల్‌లో కూడా ఉంది. ప్రవక్తలను అసమర్దులుగా పరిగణించిన వాళ్ళెవరు? అంటే వాళ్లు దైవసందేశ అవతరణను నమ్మేవారే, ప్రవక్తల పేరుతో వాళ్లు సంస్థలను నెలకొల్పి ఉండేవారు. ప్రవక్తల జ్ఞాపకార్థం పెద్ద పెద్ద సభలు పెట్టేవారు. పర్వదినాలు జరుపుకునేవారు. అయితే ఇదంతా గతించిన ప్రవక్తల పేరుతో చేసే తతంగమే. కాని సమకాలీన ప్రవక్తకు సంబంధించినంత వరకూ ఎగతాళిచేయటం, చులకన దృష్టితో చూడటం తప్ప మరొకటి చేసేవారుకారు.

యూదులు ఏసుక్రీస్తును తిరస్కరించారు. క్రైస్తవులు ముహమ్మద్‌ను తిరస్కరించారు. చూడబోతే వాళ్లు ఏసుక్రీస్తును అమితంగా గౌరవిస్తారు, ఆయన్ని పూజించే దాకా పోయారు.

అలాగే ఖురైషులు ముహ్మద్‌పై రాళ్లు రువ్వారు. ఆయన్ని వూరి నుంచి వెళ్లగొట్టారు. మరి చూడబోతే వాళ్లు దైవప్రవక్త అబ్రాహాము వారసులమని చెప్పుకోవడానికి గర్వపడేవారు.

దీనికి కారణం ఏమిటి? కారణమేమిటంటే పూర్వపు (గతించిన) ప్రవక్త యొక్క ప్రవక్త పదవి చారిత్రకస్థాయిని సంతరించుకుని ఉంటుంది. అది ఏదేని ఒక జాతి యొక్క జాతీయ సంపదలో ఒక అవిభాజ్య అంశంగా వుంటుంది. ఒక జాతిలో ప్రభవించిన ప్రవక్త ఆ జాతికి చెందిన భావితరాల దృష్టిలో పవిత్రనాయకుడు లేక మహనీయుడైపోతాడు. అతన్ని నమ్మి నడవటం ఆ జాతి మనుగడకు ఆవశ్యమైపోతుంది. మరి అలాంటి ప్రవక్తను ఎవరు మాత్రం నమ్మకుండా ఎలా నడుస్తారు? అయితే సమకాలీన (వర్తమానకాలపు) ప్రవక్త పదవి వివాదాస్పద అంశంగా కనిపిస్తుంది. దాన్ని నమ్మడానికి గోచరాల తెరలను చీల్చి యదార్థాన్ని తిలకించవలసి ఉంటుంది. ఆ ప్రవక్తకు తోడ్పాటునివ్వడానికై తన అహాన్ని చంపుకోవలసి ఉంటుంది. అతని ఉద్యమం కొరకు తన సిరిసంపదలను ఖర్చుపెట్టడమన్నది ఒక అపూర్వ విషయమై ఉంటుంది. అంటే ఆ ప్రవక్త చేపట్టిన కార్యక్రమం సత్యబద్ధమైందేనా అన్నవిషయంలో భిన్నాభిప్రాయాలున్నప్పటికీ దాని కొరకు సర్వస్వాన్ని ధారబోయటమంటే మామూలు విషయం కాదు మరి. అయితే ప్రవక్త ప్రియసహచరులు తమ సమకాలీన ప్రవక్త పట్ల ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించారు. మరోవిధంగా చెప్పాలంటే వారు ముహమ్మద్‌ను చారిత్రక ప్రవక్తగానే చూశారు.

## తమ కిరీటాన్ని ఇతరుల తలపై పెట్టడం :

మదీనాలో అబ్దుల్లాబిన్ ఉబైవంటి తెలివైన, పలుకుబడిగల వ్యక్తి ఉండడేవాడు. అతను మదీనాలోకెల్లా విశిష్ఠమైన సర్దారుగా పరిగణించబడేవాడు. అందుకే మదీనా వాసులకు, పరస్పరం కలహించుకోవటం మాని కలసికట్టుగా బ్రతకాలన్న స్పృహ రాగానే వారంతా అబ్దుల్లా బిన్ ఉబైని తమ చక్రవర్తిగా చేసుకోవాలి నిర్ణయించుకున్నారు. దీనికి చిహ్నంగా వాళ్లు అతనికి ఒక కిరీటం తొడిగించారు. (సీతర్ ఇబ్నె హిషామ్ సంపుటి 2, పేజీ 216)

అబ్దుల్లా బిన్ ఉబై అటు మకుటం ధరించగానే ఇటు మదీనాలో ఇస్లాం అడుగుపెట్టింది. మదీనా వాసుల్లోని మానవనైజం ఈ సత్యానికి సాక్ష్యమిచ్చింది. ఇంటింటా ఇస్లాం అడుగుపెట్ట సాగింది. ఆ తరువాత మదీనా పౌరుల ప్రతినిధి బృందం ఒకటి మక్కా వచ్చి దైవప్రవక్తను కలుసుకుంది. ఆయననోట సందేశం విన్నది. మదీనా సమాజాన్ని సంఘటితం చేయడానికి తగిన వ్యక్తి ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ మాత్రమేనని వారు గ్రహించారు. మీరు మదీనాకు ఏతెంచి మా సర్దారుగా ఉండండని మదీనా ప్రజల తరఫున ఆహ్వానించారు. ఇస్లామీయ

చరిత్రలోని ఈ సంఘటనే 'బైతె ఉఖబా సానియా' (ఉఖ్‌బా ప్రదేశంలో జరిగిన రెండవ ప్రమాణము)గా వినతికెక్కింది.

ఈ సంఘటన మామూలు సంఘటన కాదు. ఇది తమ కిరీటాన్ని ఇతరులకు తొడిగించటం వంటిది. ప్రాచీన తెగల కాలంలో ఇలాంటి సంఘటన జరగటమంటే అదొక అపూర్వ సంఘటనే అనాలి. తమ జాతి, తమ తెగల పరిధిని దాటి పరాయి వ్యక్తిని – బేషరతుగా – సర్దారుగా చేసి ఆహ్వానించటమన్నది సర్వదా మనిషికి కష్టంగానే తోచింది. ప్రాచీన కాలంలోనైతే ఇది అనూహ్యం కూడా. అదీ గాక ఈ సంఘటన జరిగే నాటికి 'ముహమ్మద్' విశ్వవిఖ్యాత వ్యక్తికారు. ముహమ్మద్‌కు అది ఎంతో గడ్డుకాలం. ఆ సమయంలో ఆయన ఊరివారే ఆయన్ని బహిష్కరించారు. ఆయన వెనుక అప్పటికింకా ఘనమైన చరిత్రగాని, జాత్యాభిమానంగాని లేవు. ఆ సమయంలో ఆయన ఒక వివాదాస్పద వ్యక్తి మాత్రమే కాదు, సర్వాన్నీ పోగొట్టుకున్న నిరాశ్రయుడు కూడాను. ఆ సమయంలో ఏదైనా ఆయనకు ఇచ్చుకోవటమే తప్ప పుచ్చుకునేదేమీలేదు. 20వ శతాబ్దిలో ఏ బెర్నార్డ్‌షా వంటివారో ముందుకు వచ్చి ఐరోపాకు నాయకత్వం వహించమని ఇస్లాం ప్రవక్తను ఆహ్వానించటం సులభమే. కాని క్రీ.శ. 6వ శతాబ్దిలో అతనిలాంటివారు ఆయన్ని ప్రవక్తగా అంగీకరించి తమ నాయకునిగా ఆహ్వానించటాన్ని ఊహించనేలేము.

## తమ పరిమితిని గ్రహించటం :

దైవప్రవక్త ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా తన సహచరులను సంప్రదించి సలహా తీసుకునేవారు. తన ప్రియసహచరులను సమావేశపచి, "ప్రజలారా!నాకు సలహా ఇవ్వండి అని అడిగేవారు. పైకి ఆయన అందరినీ అడిగేవారు. కాని క్రియాత్మకంగా ఏం జరిగేదంటే కొంతసేపు వాతావరణం గంభీరంగా ఉండేది. తరువాత అబూబకర్ నిలబడి క్లుప్తంగా తన అభిప్రాయాన్ని చెప్పేవారు. ఆ తరువాత ఉమర్ నిల్చుని సంక్షిప్తంగా తన ఉద్దేశం చెప్పి కూర్చునేవారు. ఆపైన మరికొంత మంది తమ మనసులోని మాటను వెల్లడించేవారు. ఆఖరికి అందరూ ఏకాభిప్రాయంతో ఒక నిర్ణయం తీసుకునేవారు. ప్రవక్త పరమపదించిన తరువాత అబూబకర్ ఖలీఫాగా ఎన్నికయ్యారు. అబూబకర్ కూడా ప్రజలను సమావేశపరచి సలహా అడిగేవారు. ఉమర్ తన మనోగతాన్ని వెల్లడించాక మిగిలిన సహచరులు కూడా తమ మనోభావాన్ని ప్రకటించేవారు. ఆఖరికి వారంతా కలసి ఒక నిర్ణయానికి రావటం జరిగేది. ఉమర్ తర్వాత సహాచరుల సంఖ్య అధికమైపోయింది. పై పరిస్థితిలో కూడా మార్పువచ్చింది.

ఇది పైకి ఒక సామాన్య విషయంగా కనబడవచ్చు. కాని ఇది ఎంత ముఖ్యమైన విషయమంటే చరిత్రలో మరేసమాజమూ ఇలాంటి ఆదర్శాన్ని నెలకొల్పలేకపోయింది. మనిషి తనలోని తప్పులను, పరిమితులను తెలుసుకున్ననాడే ఇలాంటి ఆదర్శాలు ఉనికిలోనికి వస్తాయి మరి. ఎదుటివాడు తనను ఏ దృష్టితో చూస్తున్నాడో ఆ దృష్టితోనే తాను ఎదుటివాడిని చూసినపుడు మాత్రమే ఇలాంటి ఉదాహరణలు నెలకొంటాయి.

ఈ సంఘటన ఏ అబూబకర్ ఉమర్‌లకు ఎదురైందో వారు మనకు తెలిసిన అబూబకర్ ఉమర్‌లు కారు. నేడు మనం సంపూర్ణ చరిత్రగల అబూబకర్ ఉమర్‌లను ఎరిగి ఉన్నాము. కాని వారు (అప్పటి ప్రజలు) ప్రారంభచరిత్రగల అబూబకర్ ఉమర్‌లను తెలుసుకున్నారు. నేడు మనకు చరిత్రలో ఉన్నత శిఖరాలను చూచించిన గొప్ప నాయకులుగా కనిపిస్తున్న అబూబకర్ ఉమర్‌లు ఆ కాలపు ప్రజల యెడల మామూలు మనుషులే, సమకాలీన వ్యక్తులే. చరిత్రకెక్కిన తర్వాత "అబూబకర్ ఉమర్"లను గుర్తించటం ఎంత సులభమో చరిత్రకెక్కక ముందు "అబూబకర్ ఉమర్"లను కనిపెట్టడం అంతేకష్టం. కాని ప్రవక్త సహచరుల కష్టసాధ్యమైన ఇలాంటి ప్రమాణాలనెన్నింటినో నెలకొల్పారు.

## బాధ్యతను తమపైన వేసుకోవటం :

జాతుస్సలాసిల్ పోరాటానికి సంబంధించిన ఒక సంఘటన. దైవప్రవక్త తొలుత ఒక సైనిక బృందాన్ని అమర్ బిన్ ఆస్ నేతృత్వంలో పంపించారు. ఆ యుద్ధస్థలం సిరియా సరిహద్దు ప్రాంతంలో ఉంది. అమర్ బిన్ ఆస్ అక్కడికి చేరుకుని శత్రుసేనల కదలికలపై నిఘావేశారు. ప్రత్యర్థి బలాన్ని బేరీజు వేసినపుడు తమ సైనికబలం చాలా స్వల్పమైనదని ఆయనకు బోధపడింది. ప్రస్తుత సైనికబలం సరిపోదని, మరింత సైనిక సాయం అవసరమని ఆయన ప్రవక్తకు సందేశం పంపించారు. ప్రవక్త మూహాజిర్లలో నుంచి రెండు వందల మందిని ఎన్నుకుని మరో సైనికపటాలం తయారుచేశారు. అబూ ఉబైదా జరాహ్ సారథ్యంలో ఆ పటాలాన్ని యుద్ధస్థలం వైపుకు పంపించారు.

అబూ ఉబైద తన సైనిక బృందంతో గమ్యానికి చేరారు. రెండు సైనిక బృందాలు కలసిపోయిన తర్వాత ఆ సైన్యానికి అధిపతిగా ఎవరుండాలన్న ప్రశ్న తలెత్తింది. రెండవ సైనిక బృందం అదనపుదళంగా – మద్దతు కొరకే వచ్చిందని, అందువల్ల సైన్యాధిపతిగా తనే కొనసాగవలసి ఉంటుందని అమర్ బిన్ ఆస్ వాదించారు. కాని అబూ ఉబైద సహచరులు ఈ వాదనతో ఏకీభవించలేదు. అభిప్రాయభేదం తీవ్రస్థాయికి చేరినప్పుడు అబూఉబైద బిన్

జరాహ్ ఇలా అన్నారు. "ఓ అమరవ్! దైవప్రవక్త నానుండి తీసుకున్న ఆఖరిప్రతిజ్ఞ ఏమిటో తెలుసా! మీరు మీ స్నేహితులను కలుసుకోగానే ఒకరిమాట ఇంకొకరు వినాలని, విభేదించుకోరాదని సూచించారు. అందుచేత దైవసాక్షిగా చెబుతున్నాను – ఒకవేళ మీరు నా మాటను ఖాతరు చేయకపోయినా నేను మీకు విధేయుడనై ఉంటాను'.

అబూ ఉబైద గనక కోరితే అమర్ బిన్ ఆస్‌తో వాగ్యుద్ధానికి దిగగలిగేవారే. తన వాదన సత్యమని నిరూపించుకోవడానికి ఆయనకు ఎన్నో మాటలు, ఆధారాలు దొరికేవి. కాని ఆయన చేసిందేమిటీ? బాధ్యత అంతా తనపైనే వేసుకుని ఏకపక్షంగా సమస్యను నిర్మూలించారు. సామూహిక జీవితంలో ఇది ఎంతో అవసరం. ఏ సమాజంలోని వ్యక్తులైనా ఈ స్థాయికి ఎదిగినప్పుడే సామాజిక జీవితం సాఫీగా సాగిపోతుంది. వారు హక్కుల కోసం ప్రాకులాడక వీలైనంతవరకు బాధ్యతలను తమ నెత్తిన వేసుకోవడానికి సాహసించాలి. ఈ స్ఫూర్తి కొరవడినప్పుడల్లా ఐకమత్యం స్థానే అనైక్యతే తిష్ఠవేస్తుంది.

## ఆరోపణలకు తావీయని ఆలోచన :

ఖాలిద్ బిన్ వలీద్ గొప్ప సేనాని. యుద్ధ వ్యూహాన్ని రచించడంలో సాటిలేని మేటి. దైవప్రవక్త కాలంనుంచి అబూబకర్ ఖలీఫాగా ఉన్నంతవరకు ఆయన నిరాఘాటంగా ఇస్లామీయ సైన్యానికి అధిపతిగా ఉన్నారు. అయితే ఉమర్ గార్కి ఆయనలోని కొన్ని అలవాట్లు నచ్చేవికావు. అందుకే ఆయన్ని సైన్యాధిపతి హోదా నుంచి తొలగించమని ఉమర్‌గారు ఖలీఫా అయిన అబూబకర్‌కి సిఫార్సు చేశారు. కాని అబూబకర్ దీన్ని అంగీకరించలేదు. అయితే ఉమర్ ఈ విషయంలో ఎంత దృఢంగా ఉన్నారంటే తాను ఖలీఫాగా ఎన్నికైన వెంటనే ఖాలిద్ బిన్ వలీద్‌ను సైన్యాధిపతి పదవి నుంచి తొలగించి ఒక మామూలు సిపాయిగానే ఉంచారు.

ఆ రోజుల్లో ఖాలిద్ కీర్తి నలువైపులా వ్యాపించి ఉండేది. సిరియా సరిహద్దు ప్రాంతంలో ఆయన సారధ్యంలోని ఇస్లాం సైన్యం విజయఢంకా మ్రోగిస్తూ ఉంది. సరిగ్గా ఆ సమయంలోనే రెండవ ఖలీఫా ఆయనకు ఉద్వాసన పలికి అబూ ఉబైదబిన్ జరాహ్‌ను సైన్యాధిపతిగా నియమించారు. ఆ వెంటనే సైనికుల ఓ వర్గం ఖాలిద్ బిన్ వలీద్ శిబిరంలో సమావేశమై మేము మీ వెంట ఉన్నామని మద్దతు ప్రకటించింది. కాని ఖాలిద్ వారందరినీ సముదాయించారు. "నేను పోరాడేది ఉమర్ కొరకు కాదు, ఉమర్ ప్రభువు కొరకు" అని పలికి వాళ్లను పంపించేశారు. అప్పటివరకూ యుద్ధాలలో ఓ సైన్యాధిపతిగా పోరాడే ఖాలిద్

ఆనాటినుంచీ ఓ సైన్యాధిపతికి లోబడి సాధారణ సిపాయిలా పోరాడారు.

మనిషి ఫిర్యాదులు, కాఠిన్యాల నుండి పైకి వచ్చి సకారాత్మకంగా ఆలోచించినపుడే ఇలాంటి నడవడిక సాధ్యమవుతుంది మరి.

## చట్ట పరిధులను దాటి సహకరించడం :

హిజ్రీ 2వ సంవత్సరం షాబాన్ నెల ఖురైషు సర్దారులందరి సారథ్యంలో వెయ్యిమంది సైనికులు మక్కానుండి మదీనాపైకి దండెత్తి వస్తున్నారని దైవప్రవక్తకు కబురందింది. వారిలో 600 మంది కవచం ధరించి సాయుధులై ఉన్నారని, వందమంది స్వారీ దళం కూడా ఉందని తెలియవచ్చింది. అది అత్యంత సంక్లిష్ట సమయం. ప్రవక్త మదీనాలోని అన్సార్లను , ముహాజిర్లను సమావేశ పరచి ప్రసంగించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితిలో తానేంచేయాలో చెప్పమని సలహా అడిగారు. అనవాయితీగానే ముహాజిర్లకు చెందిన అగ్రశ్రేణి వ్యక్తులు నిలబడి “ఓ దైవప్రవక్తా! మీ ప్రభువు దేనిగురించి ఆదేశిస్తున్నాడో అదే చేయండి. మేము మీ వెంట ఉన్నాం. నువ్వూ నీ దేవుడు వెళ్ళి పోరాడండి అని యూదులు చెప్పినట్లుగా మేము చెప్పేవారం కాము (5:24). మీరు మీదేవుడు పోరాడటానికి పదండి, మేమూ మీవెంట ఉన్నామని మేము చెప్పదలుస్తున్నాము. మాలో ఏ ఒక్కరికనుబొమ్మయినా కదలాడుతున్నంత సేపూ మేము మీ సహచర్యాన్ని వదిలేవారం కాము”.

అయితే ముహాజిర్లు మాటిమాటికీ ఇలా భరోసా ఇస్తున్నప్పటికీ దైవప్రవక్త “ప్రజలారా! నాకు సలహా ఇవ్వండి” అనే అంటున్నారు. కడకు సాద్ బిన్ మ ఆజ్ లేచి నిలబడి “ఓ దైవప్రవక్తా! బహుశా మమ్మల్ని ఉద్దేశ్యించి మీరలా అంటున్నారేమో!” అన్నారు. “అవును” అన్నారు ఆయన (స). సాద్ బిన్ మ ఆజ్ అన్సార్ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ ఇలా అన్నారు. “మేము మిమ్మల్ని విశ్వసించాం. మీరు సత్యవంతులని ధృవీకరించాం. మీరు అందజేసే ప్రతిదీ సత్యబద్ధమని సాక్ష్యం కూడా ఇచ్చాము. మీ ఆదేశాలను శిరసావహిస్తామని మాటిచ్చి ఉన్నాము. కనుక ఓ దైవప్రవక్తా! మీరు కోరిందల్లా చేసేయండి. మేమంతా మీకు అండగా ఉన్నాము. మీకు సత్యాన్నిచ్చి పంపిన వాని సాక్షిగా చెబుతున్నాను – ఒకవేళ మీరు మమ్మల్ని తీసుకెళ్ళి సముద్రంలో దూసుకుపోయినా మేము కూడా మీతోపాటు సముద్రంలో దూసుకుపోతాము. మాలో ఏ ఒక్కడూ వెనుకంజ వేయడు. రేపటి రోజున మీరు మాతోపాటు పోయిన శత్రువును ఢీ కొనటం మాకేమాత్రం ఆక్షేపణీయం కాదు. మేము యుద్ధంలో స్థయిర్యాన్ని కనబరచేవాళ్ళం. ప్రతిఘటన సమయంలో నిజాయితీపరులని నిరూపించుకునే

వాళ్ళం. బహుశా అల్లాహ్ మా ద్వారా మీకు మీ కంటికి చలువను ప్రసాదించే ఘనకార్యం ఏదన్నా చూపెట్టనున్నాడేమో – కనుక అల్లాహ్ శుభం చేకూరుస్తాడన్న భరోసాతో మమ్మల్ని తీసుకుపోండి". అన్సార్ నాయకుడు ఇలా అభిప్రాయపడిన మీదట చర్యగైకొనాలని నిర్ణయించారు దైవప్రవక్త.

బద్ర్ యుద్ధానికి ముందు ప్రవక్త పదేపదే అన్సార్ల వైపుకు తిరిగి చూడటం అకారణం కాదు. దాని వెనుక ఒక ప్రత్యేకమైన నేపథ్యం ఉంది. ఆ సంఘటనను ప్రస్తావిస్తూ ఇబ్నె హిషామ్ ఇలా వ్రాశారు.

ఈ సమస్య ఎందుకు తలెత్తిందంటే అంతకు మునుపు అన్సార్లు ఉఖబ అనే చోట ప్రతిజ్ఞ చేస్తున్నప్పుడు వారు ఇలా అన్నారు. "ఓ దైవప్రవక్తా! మీరు మా రాజ్య పరిధుల్లోకి వచ్చేవరకూ మీ రక్షణా బాధ్యత మాపైలేదు. మీరు మా వద్దకు వచ్చేసిన నాటినుంచీ మా రక్షణలో ఉంటారు. మేము మా ఆలుబిడ్డలను కాపాడుకుంటున్నట్లే మిమ్మల్ని కాపాడుతాము'. ఈ మాటే దైవప్రవక్తను సందేహంలో పడవేసింది. శత్రువులు మదీనాలో జొరబడే దాకా తనను కాపాడవలసిన బాధ్యత అన్సార్లపై లేదని వారు తలపోస్తున్నారేమో బహుశా. బస్తీబయటకు పోయి పోరాడవలసిన బాధ్యత తమపై లేదని ఒకవేళ అన్సార్లు అనుకుంటున్నారేమోనన్న సంశయం దైవప్రవక్తకు కలిగింది.

అన్సార్లు ప్రవక్త సమక్షంలో చేసిన ప్రతిజ్ఞ ప్రాచీన అరబ్బు పరిభాష ప్రకారం 'బైతేనసా' (ఆత్మరక్షణా శపథం)గా వ్యవహరించబడేది. దీనిప్రకారం మదీనాకు 80 మైళ్ల అవతలకుపోయి – బద్ర్‌లో – పోరాడవలసిన అవసరం వారికిలేదు. అయితే అన్సార్లు దానిని సాకుగా చేసుకోలేదు. వాళ్లు చట్టపరిధులను దాటి దైవప్రవక్త సహాయార్థం యుద్ధానికి బయలుదేరారు. బద్ర్ యుద్ధమైదానంలో అసాధారణమైన పోరాట పటిమను ప్రదర్శించారు.

## విభేదాలను విడనాడి లక్ష్యాన్ని అంటిపెట్టుకొని ఉండటం :

మస్‌వూద్ బిన్ మఖ్రమ కథనం ప్రకారం దైవప్రవక్త తన సహచరులను సమావేశపరచి ప్రసంగించారు. ఆయన ఇలా అన్నారు. "అల్లాహ్ నన్ను సమస్త మానవాళి కొరకు కారుణ్యంగా చేసి పంపాడు. కనుక మీరు నా తరఫున ఈ బాధ్యతను నిర్వర్తించండి. దేవుడు మిమ్మల్ని కరుణిస్తాడు. మర్యమ్ కుమారుడగు ఏసుక్రీస్తు సహచరులైన హవారీలు విభేదించుకున్నట్లుగా మీరూ విభేదించుకోకండి. నేను దేనివైపుకు మిమ్మల్ని పిలుస్తున్నానో ఆ విషయం వైపుకే ఆయన కూడా తన హవారీలను పిలిచారు. ఎవరి చోటు దూరంగా ఉండేదో వారికి అక్కడికి

వెళ్ళటం కష్టంగా తోచింది. అందుచేత మర్యమ్ కుమారుడగు ఏసుక్రీస్తు ఈ విషయమై అల్లాహ్‌తో ఫిర్యాదుచేసుకున్నారు”. “ఓ దైవప్రవక్తా! మేము మీ బాధ్యతను నిర్వర్తిస్తాము. మీరు కోరిన చోటల్లా మమ్మల్ని పంపండి’ అని దైవప్రవక్త సహచరులు బదులిచ్చారు (అల్ తబ్రాని)

సామూహిక కార్యంలో అవరోధం కల్పించే అతిపెద్ద వస్తువు అభిప్రాయభేదం. అయితే ప్రవక్త సహచరుల్లోని దైవభీతి వారిని విభేదాలకు లోనుచేయలేదు. వాళ్లు విభేదాల నుండి పైకి వచ్చి నిజాయితీగా, నిస్వార్థంగా తమ బాధ్యతలను నెరవేర్చడంలో నిమగ్నులై ఉండేవారు. అందుకే దైవప్రవక్త కాలంలో వారు అరేబియాలోనూ, అరేబియాపరిసర ప్రాంతాలలో సందేశ ప్రధానమైన కార్యక్రమాన్ని చక్కగా నడిపించారు. ప్రవక్త పరమపదించిన తరువాత వాళ్లు సరిసంపదలను ప్రోగుచేసుకోవటంలోనో, అధికారాన్ని ప్రాప్తం చేసుకోవటంలోనో నిమగ్నులవ్వలేదు. భిన్నంగా ఇవన్ని సౌకర్యాలను వదులుకొని అపరిచయ ప్రదేశాలలో సందేకార్యాన్ని నిర్వర్తిస్తూ కనుమరుగైయ్యారు. అంతేకాకుండా ప్రతి సహచరుని ఇల్లు ఆరోజుల్లో ఒక పాఠశాలగా రూపుదాల్చి ఉండేది. వారు కేవలం దైవప్రసన్నత కోసం ప్రజలకు అరబీ నేర్పేవారు. ఖుర్ఆన్ హదీసుల సారాంశాన్ని ప్రజలకు విడమరచి చెప్పేవారు. ఆ రోజుల్లో ఒకవైపు ముస్లింలోని ఒక వర్గం జైత్రయాత్రలో, రాజకీయ ఏర్పాట్లలో నిమగ్నులై ఉండేది. సర్వసాధారణ పద్ధతి ప్రకారం ప్రవక్త సహచరులు కూడా తమ రాజకీయ పాత్రను పోషించాల్సింది. కాని వారు దీనికి అతీతంగా మెలిగారు. వారు ఇస్లామీయ విజయాల ద్వారా జనించే వాతావరణాన్ని ధర్మవ్యాప్తి (సందేశరంగం) కొరకు వినియోగించుకున్నారు. ఆ విధంగా వారు మరియు వారి శిష్యులు నిరంతరం ఏభై సంవత్సరాల పాటు చేసిన నిశ్శబ్ద కృషివల్ల ‘అరబ్బు ప్రపంచం’గా పిలువబడే భౌగోలిక భాగం ఉనికిలోకి వచ్చింది. ఈ భూభాగంలోని ప్రజలు ధర్మపరివర్తనేగాక, వారి భాష, సంస్కృతీ నాగరికతలు కూడా పరివర్తన చెందాయి.

## వెనుక సీట్లో కుర్చోవడానికి అంగీకరించడం :

దైవప్రవక్త పరమపదించిన తరువాత ఉత్పన్నమైన మొట్టమొదటి సమస్య ఖలీఫా (నాయకుడు) ఎంపిక. అన్సార్లు బనూసాద బావిడిలో సమావేశమయ్యారు. ఆ సమయంలో సాద్ బిన్ ఉబాద అన్సార్లలో అందరికన్నా ఎక్కువ యోగ్యుడుగా పరిగణించబడేవాడు. అందువల్ల సాద్‌బిన్ ఉబాదను ఖలీఫాగా ఎంపిక చేస్తే బావుంటుందని అన్సార్లలో చాలా మంది అనుకున్నారు. ముహాజిర్ ప్రముఖులకు ఈ సంగతి తెలియగానే వారు వడివడిగా

అక్కడికి నడచివెళ్లారు. అబూబకర్ వారినుద్దేశ్యించి ఇలా ప్రసంగించారు.

"(అన్సారులారా!) మీరు ఏ ప్రాధాన్యత గురించి చర్చించుకుంటున్నారో దానికి మీరే యోగ్యులు. కాని అరబ్బులు ఈ (నాయకత్వపు) విషయంలో ఖురైషులు తప్ప మరో తెగను ఊహించనైనాలేరు. వంశపారం పర్యంగా గానీ, పేరుప్రతిష్ఠల దృష్ట్యాగాని వారు అరేబియాలో అందరికన్నా శ్రేష్ఠులు. నేను మీ కొరకు ఆఇద్దరు వ్యక్తు (ఉమర్ మరియు అబూ ఉబైద)లలో ఎవరో ఒకరిని ప్రతిపాదించదలిచాను. వారిరువురిలో మీరు కోరినవారిపై ప్రమాణ స్వీకారం చేయండి" (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 4, పేజీ 339)

అయితే ఆ తర్వాత ఉమర్ నిలబడి తక్షణం అబూబకర్‌ను ఖలీఫాగా శిరసావహిస్తున్నట్లు ప్రమాణం చేశారు. మిగిలిన ముహాజిర్లందరూ ఉమర్‌ను అనుసరించారు. ఆ తర్వాత అన్సార్లు కూడా అబూబకర్ చేతిలో చెయ్యేసి ప్రతినబూనారు. అయితే అన్సార్లలో ఒక ప్రత్యేక వర్గానికి ఈ పరిణామం సహించరానిదయింది. మీరంతా కలసి సాద్‌బిన్ ఉబాద గొంతునులిమేసారని ఒక వ్యక్తి చెప్పనేచెప్పాడు.

అన్సార్లు ఇస్లాం కొరకు అసామాన్యమైన త్యాగాలు చేశారు. వూరినుంచి వెళ్లగొట్టబడిన నిస్సహాయ బృందానికి వారు మదీనాలో రక్షణ కల్పించారు. అయినప్పటికీ వారు అధికారం కోసం ప్రాకులాడకుండా పరిస్థితులతో రాజీపడ్డారు. ముహాజిర్లలోని (ఖురైషు) వ్యక్తినే ఖలీఫాగా ఎన్నుకోవాలన్న ప్రతిపాదనను మనస్ఫూర్తిగా ఆమోదించారు. దీనివెనుక లోతైన పరమార్థం ఉందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఖురైషులు ఎన్నో సంవత్సరాలుగా అరేబియాకు నాయకత్వం వహిస్తూ ఉన్నారు. అలాంటి పరిస్థితిలో ఒక ఖురైషేతర వ్యక్తి చేతిలోకి అధికార పగ్గాలు వస్తే పరిపాలనా వ్యవహారాలను సజావుగా నడపటం అతనికి దుర్లభం కావచ్చు. అన్సార్లు తమలోని ఈ వెలితిని గ్రహించటం వారి యదార్థ దృష్టికి ప్రబల తార్కాణం. అధికార దావాను ఏకపక్షంగా ఉపసంహరించుకుని తాము వెనుక సీట్లో కుర్చోవడానికే అంగీకరించారు. అన్సార్ సోదరులు చరిత్రలో ఇలాంటి దృష్టాంతాలు చాలా అరుదు.

## ఆవేశాలకతీతంగా నిర్ణయంగైకొనే శక్తి :

ఉహద్ యుద్ధం ఇస్లాం యుద్ధాలన్నింటికన్నా భీకరమైనది. ఆగ్రహోదగ్రులైన ఖురైషు యువకులంతా ఒకుమ్మడిగా ముస్లింలపై దాడిజరిపారు. హోరాహోరీగా సంగ్రామం జరుగుతున్న సమయంలో దైవప్రవక్త తన ఖడ్గాన్ని చేబూని ఈ ఖడ్గాన్ని దాని హక్కుతో పాటు పుచ్చుకునేవారెవరని ప్రశ్నించారు. కొంతమంది ఆయన్ని సమీపించారు. కాని ఆయన

వాళ్లకు ఖడ్గం ఇవ్వలేదు. తరువాత అబూ దుజాన ముందుకువచ్చి 'ఓదైవ ప్రవక్తా! ఈ ఖడ్గంతో ముడిపడి వున్న దాని హక్కు ఏమిటి?" అని ప్రశ్నించారు. "ఈ ఖడ్గం వంకరయ్యే వరకూ నువ్వు శత్రువుతో పోరాడటం" అని ఆయన వివరించారు. అయితే నేను ఈ ఖడ్గాన్ని దాని హక్కు సమేతంగా తీసుకుంటున్నాను' అని అబూదుజానా చెప్పారు. ప్రవక్త ఆ ఖడ్గాన్ని ఆయనకు ఇచ్చేశారు.

అబూదుజానా తన తలకు ఎర్రని గుడ్డకట్టుకున్నారు. మృత్యువును లక్ష్యపెట్టకుండా పోరాడటానికి తాను సిద్ధంగా ఉన్నాననేవారికి అది సంకేతం. ఆయన గొప్ప శూరునిలా పోరాడసాగారు. ఆయన ముందుకు వచ్చినవాడల్లా ఆ ఖడ్గం వాతన పడిపోయాడు. ఆ తరువాత ఓ అద్భుతం జరిగింది. అదేమిటో అబూదుజాన మాటల్లోనే వినండి :

''నేనొక మనిషిని చూశాను. అతను జనులను పోరాడమని తీవ్రంగా ఉసిగొల్పుతున్నాడు. నేనతని వైపుకు లంఘించాను. నేనతనిపై కరవాలం ఎత్తగానే అతను 'యావైలా' (ఇదేమి నాశనమయ్యో!) అన్నాడు. నాకప్పుడు తెలిసింది – ఆమె ఒక స్త్రీ అని. కనుక నేను దైవప్రవక్త గాని ఖడ్గాన్ని (ఒక స్త్రీ ని హతమార్చటం ద్వారా) అపవిత్రం కాకుండా ఆపాను". (సీరత్ ఇబ్నె హిషామ్ సంపుటి 3, పేజీ 14)

ఈ సంఘటనను ఒక సహాబి ఇలా వివరించారు. "మరి ఆయన ఖడ్గం ఉతబా కుమార్తె అగు హిందపై లేవటం నేను కళ్ళారా చూశాను. కాని ఆ తర్వాత ఆయన ఆ ఖడ్గాన్ని ఆపుకున్నారు". యుద్ధం విషయంలో దైవప్రవక్త చేసిన సూచనలలో ఒక సూచన ఏమిటంటే, స్త్రీల, పిల్లల, వృద్ధుల జోలికిపోరాదు. అబూదుజాన భీకర సంగ్రామం జరుగుతున్న సమయంలో కూడా ఈ ఉపదేశాన్ని మరువలేదు.

ప్రవక్త సహచరులకు తమ భావోద్రేకాలపై ఎంతగా అదుపు ఉండేదో ఈ సంఘటన ద్వారా రుజువవుతోంది. వారి చేష్టలు వారి చైతన్యానికి లోబడి ఉండేవేగాని భావోద్రేకాలకు లోబడికాదు. వారు అత్యంత ఉద్రేకపూరిత క్షణాల్లో కూడా అత్యంత ప్రశాంతంగా నిర్ణయాలు గైకొనేవారు. పగ ప్రతీకారాలు పరాకాష్ఠకు చేరిన వేళ కూడా వారు అకస్మాత్తుగా తమ ఆలోచనాసరళిని మార్చుకోగలిగేవారు. వారు ఒక దిశలో అత్యంత వేగంగా దూసుకుపోతు న్నప్పటికీ అమాంతం మరోదిశలో అంతే వేగంగా పోగలిగేవారు. పైకి ఇది ఒక సాదాసీదా విషయంగా కనిపించవచ్చు. కాని క్రియాత్మకంగా ఇది అంత తేలికైన విషయం కాదు. దేవుడు తనను తీక్షణవీక్షణాలతో శాసిస్తున్నాడన్న భయము, భావన ఉన్న మనిషి మాత్రమే

అంతటి అప్రమత్తతను, వివేచనను కనబరచగలుగుతాడు.

## మహావృక్షంలా ముందుకు పోవటం :

దివ్య ఖుర్‌ఆన్‌లో తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలోని రెండు ఉపమానాలివ్వబడ్డాయి. తౌరాత్ ఉపమానం ప్రవక్త సహచరుల వ్యక్తిగత లక్షణాలకు సంబంధించినది. ఆ తర్వాత ఇంజీల్ ఉపమానం ద్వారా వారి సామూహిక గుణగణాల ప్రస్తావన ఇలా చేయబడింది.

"మరి బైబిల్ (ఇంజీల్)లో ఇవ్వబడిన ఉపమానం ప్రకారం వారు ఒక పంట పొలం వంటివారు. అది మొక్కను మొలకెత్తించింది. దానికి బలాన్నిచ్చింది. మరి అది లావెక్కింది. ఆపైన అది తన కాండంపై నిలదొక్కుకుంది. చూడ్డానికి రైతులకు ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. తద్వారా అవిశ్వాసుల మనసు వారిని చూచి చివుక్కుమనటానికి. ఎవరైతే విశ్వసించారో మరియు మంచిపనులు చేశారో వారికి అల్లాహ్ మన్నింపు మరియు గొప్ప ప్రతిఫలం గురించి వాగ్దానం చేశాడు". (48:29)

ప్రస్తుత బైబిల్‌లో ఈ ఉపమానం ఈ విధంగా ఉంది : "మరి అతనన్నాడు – దేవుని సార్వభౌమత్వం ఎలాంటిదంటే ఒక మనిషి నేలలో విత్తనం నాటి, రాత్రి నిద్రించి పగలు మేల్కొనేటటువంటిది. ఆ విత్తనం ఎలా మొలకెత్తి, ఏ విధంగా పెరుగుతుందో అతనికి తెలియదు. నేల తనంతట తానే పండ్లు తెస్తుంది. ఆకులు, మరియు వెన్నులు, మరి ఆ వెన్నులో తయారైన గింజలు మరి ఆ ధాన్యం పంపిపోగానే అతను కత్తిపుచ్చుకుంటాడు. ఎందుకంటే కోతకోసే సమయం వచ్చేసింది". (మార్కు 4:26–32)

బైబిల్ మరియు ఖుర్‌ఆన్‌లోని ఈ ఉపమానంలో చెప్పబడిందేమిటంటే అంతిమ దైవప్రవక్త ప్రియసహచరుల సామూహిక క్రమవికాసం వృక్షాన్ని పోలినది. దాని ప్రారంభం విత్తనంతో అవుతుంది. మరి అది క్రమక్రమంగా పెరుగుతుంది. అది తన కాండాన్ని దృఢతరం చేసుకుంటూ ఎదుగుతుంది. కడకు అది సహజమైన వేగంతో అంచెలవారీగా వృద్ధి చెందుతూ పరిపూర్ణతకు చేరుకుంటుంది. దాని ఎదుగుదల ఎంత చక్కగా ఉంటుందంటే ఒకవైపు విశ్వాసులు దాన్ని చూచుకుని మురిసిపోతుండగా మరోవైపు శత్రువులు దాన్ని చూసి పటపటా పళ్ళుకొరుక్కుంటూ ఉంటారు.

ఇస్లాంను ఒక మహావృక్షంలా ఎదుగుదల నివ్వడానికి దేవుడు 'సహాబా'ను ఎన్నుకుని వారి ద్వారా ఆ లక్ష్యాన్ని నెరవేర్చాడు. అయితే ఇదేమంత సులభం కాదు. దీనికోసం తొందరపాటుకు ఆస్కారమివ్వకుండా అత్యంత ఓర్పుతో వ్యవహరించవలసి ఉంటుంది.

దీనికోసం ప్రతి చిన్న విషయానికి ఆవేశపడి చర్యకు ఉపక్రమించకుండా సమయోచితంగా మెలగవలసి ఉంటుంది. దీనికోసం మనిషి తన అభిరుచులతో నిమిత్తం లేకుండా ప్రకృతి చట్టాలను అనుసరించవలసి ఉంటుంది. దీనికోసం ఫలితాన్ని పట్టించుకోకుండా మనిషి తన పనిని తాను చేసుకుపోవలసి ఉంటుంది. “ఇస్లాం వృక్షాన్ని” పెంచడానికి అతను తన భావోద్రేకాలను అణచుకుని, తన మనోవాంఛను పూడ్చిపెట్టవలసి ఉంటుంది. ప్రవక్త సహచరులు తదనుగుణంగానే వ్యవహరించారు. వారు ఎలాంటి రక్షణలేకుండానే తమను దైవప్రనాళికకు అప్పజెప్పుకున్నారు. దీని పర్యవసానంగానే భూమిలో దైవధర్మం ఓ శాశ్విత వృక్షం రూపంలో నిలబడింది. దాన్ని యావత్తు ప్రపంచం ఒక్కటై పెకలించదలచినా పెకలించజాలదు.

# నాల్గవ భాగం

# వర్తమాన కాలంలో దైవదౌత్య ప్రతిష్ఠత

ఇస్లాం ప్రవక్తకు ప్రత్యేకంగా "ధర్మవిశిష్ఠత" వరము వొసగబడింది. ఆయన ప్రబోధించిన ధర్మం ఇతర మత ధర్మాలన్నింటిపై సైద్ధాంతిక పరంగా ఆధిక్యతను పొందేలా దేవుడు అనుగ్రహించాడు. ప్రవక్త అనుచరవర్గానికి కూడా ఇదే వాగ్దానం వర్తిస్తుంది. రెండున్నరవేల సంవత్సరాల ఒక ప్రత్యేక కార్యాచరణ పథకం ద్వారా అల్లాహ్ ఇస్లాం ప్రవక్తకు అవసరమగు వనరులను (కారకాలను) సమకూర్చాడు. వాటిని సద్వినియోగం చేసుకుని దైవధర్మాన్ని ప్రతిష్ఠింపచేయాలన్నదే ఉద్దేశ్యం. ప్రవక్త అనుచరవర్గం విషయంలో కూడా దేవుని అభిమతం ఇదే. అందుకే వెయ్యేళ్ళ ప్రక్రియ ఫలితంగా దేవుడు ఆధునిక యుగంలో ఇస్లాం 'సైద్ధాంతిక ఔన్నత్యానికి' అవసరమైన సానుకూలమైన పరిస్థితులను పరిపూర్ణస్థాయిలో సమకూర్చాడు. ఈ సానుకూల పరిస్థితులను గనక ప్రవక్త అనుయాయులు ఓర్పుతో నేర్పుతో ఉపయోగించుకున్నట్లయితే స్వయంగా దైవప్రవక్తకు తోడ్పడినట్లే దేవుడు ఆయన అనుచర వర్గానికి కూడా తోడ్పడతాడు. ఇది దేవుని వాగ్దానం.

అమెరికాలో "మానవుడు మరియు అతని దేవుళ్ళు" (Man and his Gods) అనే ఎన్‌సైక్లోపీడియా ఒకటి ప్రచురితమైంది. ఆ గ్రంథంలో అనేక మతాలకు సంబంధించిన వ్యాసాలున్నాయి. ఇస్లాంపై వ్యాసాన్ని రచించిన క్రైస్తవ రచయిత, ఇస్లామీయ విప్లవానంతరం ఉనికిలోనికి వచ్చిన అద్భుత ఫలితాలను గురించి ఇలా అంటాడు; దీని ప్రభవం మానవ చరిత్ర దిశనే మార్చివేసింది.

Its advent changed the coursse of human history (p. 389)

ఒక పాశ్చాత్య మేధావి ఇస్లాం విప్లవ ఫలితాలను గురించి ఇలా ఒప్పుకోవటంతో చరిత్రలో నూతన అవకాశాలకు మార్గం తెరచినట్లయింది. దీనివల్ల వానకురిసిన తరువాత పొలంలో పంటపండించటం ఎంత సులభమో ఇస్లామేతర ధర్మాలపై ఇస్లాంకు సైద్ధాంతిక పరమైన ఆధిక్యతను చేకూర్చటం అంతే సులభమైపోయింది.

అంతిమ దైవప్రవక్త మరియు ఆయన సహవాసుల ద్వారా తీసుకురాబడిన విప్లవం మౌలికంగా ఏకదైవారాధన, మరణానంతర జీవితాలను నొక్కి వక్కాణించే ధార్మిక విప్లవమైనప్పటికీ అది ఎన్నో దీర్ఘకాలికమైన ఐహిక ఫలితాలకు కూడా జన్మనిచ్చింది. ఆయన తీసుకువచ్చిన విప్లవం ద్వారా ఒనగూడిన ప్రాపంచిక సత్ఫలితాలలో ఒక ముఖ్యమైన ఫలితం ఏమిటంటే, అప్పటివరకూ సత్య ధర్మప్రచారంలో ప్రధాన అవరోధంగా నిలిచే ప్రాచీన కాలపు

దురాచార భుయిష్టమైన వ్యవస్థ కుప్పకూలిపోయింది.

సూరె తౌబ (9) అవతరించిన తరువాత దైవప్రవక్త గారు అలీని మక్కాకు పంపించి, ఆ సంవత్సరం తరువాత ఇక ఎన్నడూ ఒక బహుదైవోపాసకునికి కాబాగృహాన్ని సందర్శించి హజ్ చేసే అనుమతిలేదని ప్రకటన చేయించారు. "హజ్ సమావేశాలలో నేను బిగ్గరగా ప్రకటన చేస్తూ తిరిగేవాణ్ణి. అలా గొంతెత్తి చాటి చాటి నా గొంతు బొంగురుపోయిందని" (అన్‌నసాయి 2958) అలీ అభిప్రాయపడ్డారు. లౌడ్ స్పీకర్లు కనుగొనబడిన ఈ కాలంలో ప్రకటన చేయటం ఎవరికైనా కష్టంగా తోచకపోవచ్చు. ఈ రోజుల్లో సత్యధర్మాన్ని ప్రజల్లో చాటిచెప్పటం ఎంత సులభమైపోయిందనే దానికి ఇదొక సాదాసీదా మచ్చుతునక.

ధర్మప్రచారానికి సంబంధించినంతవరకు రెండు పెద్ద కాలాలున్నాయి. ఒకటి : అంతిమ దైవప్రవక్త ప్రభవించకమునుపు కాలం. రెండు : అంతిమదైవ ప్రవక్త ప్రభవించిన తరువాతి కాలం. ప్రవక్తకు పూర్వం అవతరింపజెయ్యబడిన దైవగ్రంథాల రక్షణా బాధ్యత ఖుద్దుగా ఆయా గ్రంథ వహులపై మోపబడింది. అందుకే వాటి విషయంలో – ఖుర్‌ఆన్‌లో – "ఇస్తె హీఫాజ్ (పరిరక్షించుచునుగాక!)" అన్నమాట ఉపయోగించబడింది. "దైవగ్రంథానికి పరిరక్షులుగా నియమితులయ్యారు'' (5:44). వారు కాని ఖుర్‌ఆన్ విషయంలో ఏమనబడిందంటే; "దేవుడు ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు. దాన్ని కాపాడే బాధ్యత కూడా ఆయనదే". (15:9)

ప్రవక్త మరియు ప్రవక్త సహచరుల కృషివల్ల వచ్చిన విప్లవం తరువాత షిర్క్ (బహుదైవోపాసన) శాశ్వితంగా తలవంచేసింది. షిర్క్ మరోసారి తిరుగులేని సైద్ధాంతిక శక్తిగా ప్రపంచంలో తలెత్తేందుకు ఆస్కారం లేదు. అయితే ప్రస్తుత ప్రపంచంలో మరో సంఘటన జరిగింది. 'తౌహీద్' (ఏకేశ్వరోపాసనా సిద్ధాంతం) తిరుగులేని ఓ సైద్ధాంతిక వ్యవస్థగా తన స్థానాన్ని కోల్పోయింది. నాస్తికవాదం దాని ప్రధాన ప్రత్యర్థిగా నిలిచింది. నేడు ప్రపంచంలో నాస్తికవాదం తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తోంది. దైవతిరస్కార తత్వం లేదా మత ప్రమేయంలేని లౌకికతత్వం నేడు ప్రపంచంలో వ్యవస్థీకృతమైవుంది. దీనికి ప్రతిగా 'తౌహీద్' తత్వం – క్రియాత్మకంగా – ద్వితీయ స్థానంలో నెట్టివేయబడివుంది.

రాబోయే కాలంలో నాస్తికవాదం ఉత్పన్నమవుతుందన్న సంగతి నిస్సందేహంగా అల్లాహ్‌కు తెలుసు. అందుకే ఆయన తోడ్పాటు మరోసారి ముందుకువచ్చింది. గత వెయ్యేళ్ల ప్రక్రియలో ఆయన ఉత్పన్నం చేసిన పరిస్థితులు ఎట్టకేలకు ఏకేశ్వరోపాసన సిద్ధాంతానికి

ఆధిక్యతను చేకూర్చటానికి అనువైన భూమికగా పనిచేశాయి. ఈ ప్రక్రియ ఇప్పుడు పరిపూర్ణ దశకు చేరుకుంది. నేడు పైకి సర్వత్రా నాస్తిక లౌకిక వాదాలు ఆధిక్యతలో ఉన్నట్లు కానవస్తున్నప్పటికీ పరిస్థితులు ప్రతికూలంగా మాత్రం లేవు – అనుకూలంగానే ఉన్నాయి. ఈ అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటే మళ్ళీ తౌహీద్‌కు (ఏకేశ్వరోపాసన) సైద్ధాంతికపరమైన ఆధిక్యత చేకూర్చటం కష్టతరమేమీ కాదు.

1. అబ్రాహాము సుమారు 4వేల సంవత్సరాల క్రితం ప్రాచీన ఇరాక్ రాజ్య (ఉర్) ప్రజలను ఉద్దేశ్యించి – దేవుడనేవాడొకడున్నాడనీ, ఆయన లాభనష్టాలు చేకూరుస్తాడనీ, దైవత్వంలో ఆయనకు సహవర్తులెవరూ లేరని, కనుక మీరంతా ఆయన్నే సేవించాలని, సహాయంకొరకు ఆయన్నే అర్థించాలని పిలుపుఇచ్చారు. ఈ ఏకదైవారాధనా సందేశానికి వ్యతిరేకంగా బహుదైవారాధకుడైన నమ్రూద్ చక్రవర్తి చాలా తీవ్రంగా స్పందించాడు. ఆయన్ని ఒక అగ్నిగుండంలో పడవేయించాడు. నేటికీ ప్రపంచంలో అన్నిచోట్లా బహుదైవారాధనా విశ్వాసం కనిపిస్తుంది. కాని నేడు ఏ దేశంలోనైనా అబ్రాహాము సందేశాన్ని తీసుకుని ఉద్యమిస్తే ఏ పాలకుడూ నమ్రూద్ తరహాలో అమానుషంగా ప్రవర్తించడు.

దీనికి కారణం ప్రభుత్వ విధానాలలో వచ్చిన పరివర్తనే. నమ్రూద్ కాలంలో షిర్క్ అధికారస్థాయిలో ఉండేది. కాగా, ఇప్పుడది కేవలం ఒక మత విశ్వాసం మాత్రమే. ప్రాచీన కాలంలో బహుదైవోపాసనా సిద్ధాంతం సర్వసామాన్యంగా రాజకీయ జగత్తులో వ్రేళ్ళూనికుని ఉండేది. ఇతర చక్రవర్తుల్లాగా నమ్రూద్ కూడా ఇలాంటి సిద్ధాంతాల ప్రాతిపదకపైనే పరిపాలన చేసేవాడు. తాను సూర్యదేవత సాక్షాత్కారమనీ, అందువల్ల తాను ఇతరులకన్నా శ్రేష్ఠుడననీ, ఇతరులపై అధికారం చెలాయించే హక్కు తనకు దైవికంగా అబ్బిందని చెప్పుకునేవాడు. నమ్రూద్. కాని నేటి పాలకులెవరూ నమ్రూద్ మాదిరిగా చెప్పరు. చెప్పలేరు. వారు ప్రజాభిప్రాయం ప్రకారం పరిపాలనా హక్కును పొందుతారు. అంతేగాని దైవాంశ సంభూతుల మన్న విశ్వాసాలను ప్రజలనెత్తిన రుద్ది వారు పబ్బం గడుపుకోలేరు. అందుకే తౌహీద్ ఏకేశ్వరోపాసన సిద్ధాంతంలో నేటి పరిపాలకులెవరికీ సవాలు ఎదురుకాదు. దానివల్ల వారి అధికారం పోయే ప్రమాదం కనిపించదు. కాగా, నమ్రూద్ మరియు అతని సమకాలీన రాజులకు ఏకదైవారాధనా సిద్ధాంతం ప్రమాదకారిగా కనబడింది. ఈ సిద్ధాంతమే గనక ప్రబలితే తమ సింహాసనాలు కదలిపోతాయని ఆయా రాజులు భయపడ్డారు.

పూర్వం ఎప్పుడు ఏ ప్రవక్త ప్రభవించినా తొలి దశలోనే కాలపు చక్రవర్తిని ఎదుర్కొన

వలసివచ్చేది. అనవసరమైన చిక్కులన్నీ ఆ ప్రవక్త మార్గంలో కల్పించబడేవి. రాజ్యాధికారంతో మూఢనమ్మకాలు ముడిపడి ఉండటమే దీనికి ప్రధాన కారణం. తాము దేవతల సంతానమనీ, దేవుడు తమలో సాక్షాత్కరిస్తాడనీ ప్రజలను మభ్యపెట్టి అధికారం చెలాయించేవారు. పూర్వపు రాజులు. అలాంటి వాతావరణంలో ఎవరైనా రంగప్రవేశం చేసి స్వచ్ఛమైన దేవుని ఏకత్వపు భావనను చాటేసరికి తమ పదవికి ఎసరుపెట్టే ఉద్యమం పుంజుకోనుందని రాజులు అనుమానించేవారు. విశ్వాసపరమైన ఈ చిక్కు సత్యసందేశకునితో ఢీకొనడానికి పురికొల్లేది. అన్నిరకాల అధికారాలు దైవాధీనమై ఉన్నాయనీ, మానవులంతా సమానులేనని, ఎవరిపై ఎవరికీ ప్రధాన్యతలేదనీ ఇస్లాం నిరూపించింది. ఆ విధంగా ఇస్లాం రాజకీయ సంస్థను విశ్వాసాల నుండి వేరుపరచింది. ఇప్పుడు పరిపాలించే హక్కు ఎవరికైనా ప్రజాభిప్రాయానుసారమే లభించేదిగాని దేవునితో బూటకపు సంబంధం జోడించటం వల్ల కాదు.

దీని ఉపమానం ఎటువంటిదంటే, పూర్వకాలంలో కొంతమంది తాము 'జిన్ను' (మానవాతీత శక్తి)ను తమగుపెట్లో పెట్టుకున్నామనీ, వాడు తమ దగ్గరకొచ్చి వైద్యరంగంలోని చిట్కాలు చెప్పి వెళుతుంటాడని ప్రచారం చేసుకునేవారు. అలాంటి వాతావరణంలో ఎవరైనా ముందుకువచ్చి వైద్యశాస్త్రం మెడికల్ కాలేజీల్లో నేర్పబడుతుందే తప్ప జిన్నాతుల ద్వారా కాదని పిలుపుఇస్తే ఆ కోవకు చెందిన వైద్యులంతా అతనికి బద్ధశత్రువులైపోతారు. కాని నేటికాలపు ఎం.బి.బి.యస్. డాక్టర్లు మాత్రం ఇలాంటి పిలుపునిచ్చేవారిపై ఎలాంటి ఆక్షేపణా తెలుపరు.

2. దైవప్రవక్త తెచ్చిన విప్లవం ద్వారా చరిత్ర గతిని మార్చే ప్రక్రియ క్రీ.శ. 7వ శతాబ్దిలో ప్రారంభమైంది. ఇప్పుడది పరిపూర్ణ దశకు చేరుకుంది. ధర్మప్రచారకుల కోసం ఇప్పుడు స్వయంగా మానవ సంస్కరణా విభాగంలో అన్నిరకాల అవకాశాలు ఉన్నాయి. ఆధునిక చట్టాలు మరియు సామాజిక మార్పులు ధర్మప్రచారానికిగాను అన్నిరకాల అవకాశాలను కల్పించాయి. సత్యధర్మ ప్రచారకుని అడ్డుకొనే ఏ నమ్రూద్, మరే ఫిరౌన్ ఇప్పుడులేడు. మానవ విజ్ఞాన పరిధిలోకి వచ్చిన వాస్తవాల ప్రపంచం ధర్మం యొక్క సత్యతను శాస్త్రీయ బద్ధంగా నిరూపించడానికి అవసరమయ్యే ఆధారాలన్నింటినీ సమకూర్చింది.

వర్తమానకాలంలో ఓ గొప్ప భావ విప్లవం వచ్చిఉంది. సాధారణంగా వైజ్ఞానిక విప్లవంగా పిలువబడే విప్లవమే ఇది. ఆధునిక వైజ్ఞానిక విప్లవం మానవ చరిత్రలో మొట్టమొదటి

సారిగా ఏకేశ్వరోపాసనా సందేశానికి అనువైన సైద్ధాంతిక మార్పులను సృజించింది. వాటిని గనక సముచితమైన రీతిలో వాడుకున్నట్లయితే కేవలం కలము ద్వారా, వాక్పటిమ ద్వారా సత్యధర్మాన్ని ఆధిక్యతాస్థానానికి చేర్చవచ్చు. పూర్వం ఏకార్యం కొరకు కరవాలం చేపట్టవలసి వచ్చేదో దాన్ని ఇప్పుడు కలం ద్వారానే సాధించవచ్చు.

వాస్తవమేమిటంటే, ఆధునిక వైజ్ఞానిక విప్లవం దైవప్రవక్త కాలంనాటి ఇస్లామీయ విప్లవం యొక్క ఒక అనుబంధ ఉత్పాదన (by product). అంతిమ దైవప్రవక్త ద్వారా తేబడిన విప్లవం ద్వారా అల్లాహ్ చరిత్రలో వినూత్న ప్రక్రియకు నాందిపలికే అవకాశాలను సృజించాడు. క్రమ వికాసంతో కూడుకున్న ఈప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉండింది. కడకు అది ఆధునిక సైన్సువిప్లవం అనబడే విప్లవస్థాయికి చేరింది. అంటే దేవుడు తొలికాలంలో తౌహీద్‌కు షిర్క్‌పై ఆధిక్యతను వొసగటంతోపాటు భవిష్యత్కాలంలో నాస్తికవాదంపై తౌహీద్‌కి పైచేయి అయ్యే అవకాశాలను కూడా పుష్కలంగా పొందుపరచాడన్న మాట!

ఇస్లాం ద్వారా తౌహీద్ విప్లవం రాకమునుపు ప్రపంచమంతటా బహుదైవోపాసనా తత్వం పేరుకుపోయి ఉండేది. ఆకర్షించే విషయాల పూజకు మరోపేరే షిర్క్ (బహుదైవారాధన). ప్రపంచంలో తన కంటికి అందంగా, ఆకర్షణగా కనిపించిన దానినల్లా మనిషి పూజించటం మొదలెట్టాడు. ఎంతవరకు అంటే నింగి సూర్యుణ్ణి నుండి నేలరాజువరకు. ఈ కారణంగా షిర్క్ యుగంలో వైజ్ఞానిక పరిశోధనలకు ఆస్కారం లేకుండాపోయింది. ఆర్నాల్డ్ ట్వాయిన్ బీ మాటల్లో చెప్పాలంటే ఆనాడు ప్రకృతి దృశ్యాలు పూజకు ప్రధానాంశం (object of worship)గా మారి ఉండేవి. మరలాంటప్పుడు అవి పరిశోధనకు ప్రధానాంశం (object of Investigation)గా ఎలా రూపొందుతాయి? ఇస్లాం షిర్క్‌ను ఓడించి తౌహీద్‌కు విజయం చేకూర్చగానే ఒక సృష్టికర్త తప్ప మిగతా వస్తువులన్నీ 'సృష్టించబడిన వస్తువులు'గా కనిపించసాగాయి. ఈ విప్లవం వస్తువులపై పరిశోధన జరిపేందుకు వీలుకల్పించింది. పరిశోధనా మార్గంలో గల మూఢనమ్మకాలను దూరం చేసింది. ఈ ప్రక్రియ ఒక విధంగా తొలికాలంలో ప్రవక్త కాలంలోనే మొదలైందని చెప్పవచ్చు. ఒకసారి ప్రవక్త చంద్రగ్రహణమైనా, సూర్యగ్రహణమైనా దైవనిదర్శనాలలో రెండు నిదర్శనాలు మాత్రమేనని, అవి ఏ మహనీయుని జీవస్మరణాలతోనో ముడిపడిలేవనీ స్పష్టం చేశారు. ఈ విధంగా ప్రవక్త భౌతికమైన అహంభావాన్ని కూడా పూడ్చిపెట్టేశారు. ఈ భావతరంగాలు "విశ్వాసం" నుండి వేర్పడి ఐరోపాలో అడుగుపెట్టి కడకు ఆధునిక విప్లవానికి మార్గం సుగమం చేశాయి.

1. ఈ విప్లవం వల్ల ఒనగూడిన ఒక ప్రయోజనం ఏమిటంటే మూఢనమ్మకాలకు

కాలం చెల్లింది. మూఢనమ్మకాలంటే ఏమిటి? వాస్తవిక పునాదులపై అభిప్రాయం ఏర్పరచుకునే బదులు ఊహల, కల్పనల ప్రాతిపదికలపై అభిప్రాయం ఏర్పరచుకోవటం. (ఉదాహరణకు : ఏ గొప్పవాడైనా చనిపోతే సూర్యగ్రహమో చంద్రగ్రహణమో పడుతుందని కల్పించుకోవటం) ఈ ఆలోచనా ధోరణి మనిషి ఇస్లాం వైపుకు పోకుండా అడ్డుకుంటుంది. ఇలాంటి వ్యక్తి వాస్తవాల ఆధారంగా ఇస్లాం మరియు ఇస్లామేతర సిద్ధాంతాలను విశ్లేషించక ఊహల ఆధారంగా – నిర్హేతుకంగా – ఒకదాన్ని సత్యమైనదిగా, మరో దానిని అసత్యమైనదిగా ఖరారుచేస్తాడు. ఉదాహరణకు : ఇస్లాం చారిత్రకంగా ఒక ప్రామాణికమైన ధర్మం. కాగా ఇతరత్రా మతాలన్నీ చారిత్రక ప్రమాణాలకు నోచుకోని విధంగా ఉన్నాయి. కాని మూఢనమ్మకాల యుగంలో మనిషి దీనికి ప్రాముఖ్యం ఇవ్వలేకపోయేవాడు. ఆధునికయుగం ఈ ప్రాముఖ్యాన్ని తగురీతిలో గుర్తించింది. అందుకే నేటియుగంలో ఉన్నత విమర్శ (Higer Critism) పేరుతో ఒక శాశ్విత విద్య ఉనికిలోకి వచ్చింది. తద్వారా చారిత్రకంగా పరిగణలోకి తీసుకోదగ్గ మతధర్మం ఏదన్నా ఉంటే అది ఇస్లాం మాత్రమేనన్న యదార్థం స్పష్టమైపోయింది. ఇతర మతాలకు చారిత్రకంగా ఆధారంలేదు మరి.

2. వైజ్ఞానిక మనస్తత్వం విశ్వమండలాన్ని ప్రయోగాల వెలుగులో తెలుసుకోగోరింది. దీని ఫలితంగా దాగివున్న ఎన్నో ప్రకృతి సత్యాలు మానవుని దృష్టికి వచ్చాయి. ఇస్లామీయ ప్రబోధనలు అక్షరసత్యమని నిరూపించడంలో అవి ఎంతగానో దోహదపడ్డాయి. ఉదాహరణకు విశ్వమండలంలో అన్నిచోట్లా ఒకే ప్రకృతి శాసనం పనిచేస్తుందన్న సంగతి మానవ పరిశోధనల్లో స్పష్టమైంది. ఏ చట్టమైతే భూభాగంపై చెల్లుతుందో అదేచట్టం విశ్వవ్యవస్థలోని ఇతర మండలాలలో కూడా చెలామణీ అవుతోంది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ఈ విశ్వవ్యవస్థకు దేవుడు ఒక్కడే. ఇద్దరులేక అనేక దైవాలకు ఈ విశ్వంలో తావులేదు.

3. ఏకదైవారాధనా ధర్మాన్ని స్వీకరించడంలో పూర్వకాలంలో ఏర్పడిక విద్యా విషయమైన ఒక అవరోధం ప్రాచీన తత్వశాస్త్రం. ప్రాచీన కాలంలో తత్వశాస్త్రం శాస్త్రాలన్నింటిలోకి పెద్ద శాస్త్రంగా చెలామణీ అయ్యేది. పర్యవసానంగా దేవుని ఏకత్వపు మార్గంలో ఒకపెద్ద కృత్రిమ అడ్డంకి ఏర్పడింది.

ప్రాచీన తత్వశాస్త్రం యొక్క చివరి లక్ష్యం ఎప్పుడూ ఒక్కటే అంతిమ సత్యాన్ని అన్వేషించటం. కాని 5వేల సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉండి కూడా తత్వశాస్త్రం తన లక్ష్యాన్ని అందుకోవటంలో సంపూర్ణ విజయం సాధించలేకపోయిందనేది చేదుసత్యం. దీనికిగల

ముఖ్యకారణం ఏమిటంటే తత్వశాస్త్రం మానవ పరిమితులను (Limitations) పరిగణణలోకి తీసుకోలేకపోయింది. అది అంతిమ సత్యం వరకు చేరుకోవడానికి సకల యత్నాలూ చేస్తూ ఉండిపోయింది. కాగా, మానవుడు తన పరిమిత శక్తి సామర్థ్యాల మూలంగా తనంతట తానుగా అంతిమ సత్యాన్ని చేరుకునే తాహతు కలిగిలేడు. మీకు ఇవ్వబడిన జ్ఞానం బహుస్వల్పం (19:85).

ఈ తాత్విక ఆలోచనా సరళి మూలంగా కొన్ని వేల సంవత్సరాల దాకా మానవుడు కోరుకున్నదేమిటంటే, తౌహీద్ (ఏకేశ్వరోపాసన) ఏ మౌలిక విశ్వాసాలపై నిలబడి ఉన్నదో దాన్ని మనిషి కొరకు సంపూర్ణ స్థాయిలో ఆవిష్కరించాలనుకున్నాడు. కాని అవన్నీ అగోచర సత్యాలు. మానవుడు తన వద్దనున్న పరిమిత శక్తులతో ఈ అగోచర సత్యాలను పరిపూర్ణంగా పరివేష్ఠించలేడు. ధార్మిక దృష్టికోణంలో ఆధునిక సైన్సు యొక్క అతిపెద్ద ఘనకార్యం ఏమిటంటే అది ఊహాసౌధాన్ని నేలకూల్చింది. మానవుని తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు బహుస్వల్పమని అతడు తన పరిమిత శక్తులదృష్ట్యా యదార్థాన్ని పరిపూర్ణ స్థాయిలో కనుగొనజాలడని అది రుజువు చేసింది. ప్రాచీన తత్వశాస్త్రం ఏ ఆలోచనా క్షేత్రానికి జన్మనిచ్చిందో అది ఇప్పుడు నిలువనీడకోల్పోయే స్థితిలో ఉంది. ఆధునిక సైన్సు నుండి జన్మించిన ఆలోచనా క్షేత్రం ఇప్పుడు శాస్త్రీయ జగత్తులో అప్రహస్తంగా సాగిపోతూ ఉంది. మానవ జ్ఞానం చాలా పరిమితమని స్వతహాగా ఒక మానవ శాస్త్రం రుజువు చేయటం మనకు తెలిసిన చరిత్రలోనే అపూర్వ విషయం. మానవుడు శాస్త్రీయ ఆధారాల ద్వారా విశ్వరహస్యాలను కనుగొనడానికి ఉపక్రమించినపుడు ఈ నిఖిల జగతి మానవ మేధకు అంతుబట్టనంత విశాలమైందన్న యదార్థం అతనికి తేటతెల్లమైంది. సైన్సు యొక్క ఈ 'ఆవిష్కరణ' ఇస్లాం దృష్టికోణం నుంచి ఎంతో ముఖ్యమైనది. ఎందుకంటే దీని ద్వారా దైవదౌత్య (రిసాలత్) ప్రాముఖ్యం తెలిసివస్తుంది. ఒకవైపు మనిషి యదార్థపు ఆఖరి అంచులదాకా చేరాలని ఆరాటపడుతున్నాడు. మరోవైపు అతను తన స్వభావస్వరూపాల రీత్యా పరిమితికిలోనై జీవితంలో ఎన్నటికీ యదార్థపు ఆఖరి అంచుకు చేరలేని స్థితిలో ఉన్నాడు. మానవ జీవితంలోని ఈ వెలితికోరేదేమిటి? తనకు ఒక ఉన్నతుని మార్గదర్శకత్వం కావాలని మానవ నైజం వాంఛిస్తోంది. ఈ ఉన్నత మార్గదర్శకునికి మరోపేరే ప్రవక్త లేక సందేశహరుడు. మానవ పరిమితులను సైన్సు తేటతెల్లంచేసి – శాస్త్రీయ ప్రాతిపదికపై – ప్రవక్త అవసరం ఎటువంటిదో అది నిరూపించింది.

4. ప్రాచీన కాలంలో మనిషికి అభిప్రాయ స్వాతంత్ర్యం ఉండేది కాదు. దీనికి ప్రధానకారణం చక్రవర్తుల, పెద్దమనుషుల పట్ల గల పవిత్ర (మూఢ) విశ్వాసం. ఉన్నత

స్థాయికి చేరిన మనుషులంతా పరమ పవిత్రులుగా భావించబడేవారు. వారి అభిప్రాయానికి, నిర్ణయాలకు ఎంతో విలువ ఉండేది. తాము కోరిన విధంగా ఇతరులను మలచుకునే, ఆంక్షలు విధించే అధికారం వారికి ప్రాప్తించేది. తౌహీద్ (ఏకేశ్వరోపాసన) విప్లవం వచ్చి ఈ మానవ అహంభావాలను కాళ్ల క్రింద తొక్కేసింది. ఒక మనిషికి మరోమనిషిపై ఎలాంటి ఆధిక్యత, ప్రాధాన్యతలేదని చాటిచెప్పింది. ఆ తరువాత చరిత్రతలో ఒక భావ ప్రభంజనం వీచింది. ఈ భావ ప్రభంజనమే అంచెలంచెలుగా ఉధృతమై ఆఖరికి ఐరోపా రాజకీయ రంగంలో ప్రజాస్వామ్యంగా రూపుదాల్చింది. ప్రజాస్వామిక విప్లవం మానవులందరినీ సమానులుగా నిలబెట్టింది. ప్రతిమనిషికీ తన మనోభావాన్ని చెప్పుకునే, వ్రాసుకునే సహజహక్కు కల్పించబడింది. ఈ విప్లవం చరిత్రలో ప్రప్రథమంగా మత ప్రచార మార్గంలోని అవరోధాలను సూత్రప్రాయంగా నిర్మూలించి మత ప్రచారకులపై గల ఆంక్షలను తొలగించింది.

5. సైన్సు నేడు మనిషికోసం వేనవేల సంవత్సరాలుగా విశ్వమండలంలో దాగివున్న దేవుని భౌతికానుగ్రహాలను బయల్పరచింది. ఇస్లాం సందేశ దృష్టికోణం నుంచి చూస్తే వీటిలో అత్యంత ముఖ్యమైనది ప్రసారవిభాగం. ముద్రణాలయం, రేడియో, టెలివిజన్, అత్యంత వేగంగా పయనించే వాహనాలు ఇవి ఇస్లాం పాలిట మహదానుగ్రహాలు. వీటిని సద్వినియోగం చేసుకుని ఇస్లాం సందేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో వ్యాపింపజేయవచ్చు.

ఇస్లాం సందేశానికి అనుకూలంగా ఉన్న ఈ అవకాశాలు గత వెయ్యేళ్ల ప్రక్రియ ద్వారా ఏర్పడ్డాయి. ప్రాచీన కాలంలో అల్లాహ్ రెండున్నర వేల సంవత్సరాల నిరంతర ప్రక్రియ ద్వారా ఏ విధంగానైతే ఇస్లాం విజయవంతమయ్యే అవకాశాలను సృష్టించాడో అదేవిధంగా ఆయన మళ్లీ వెయ్యేళ్ల నిరంతర ప్రక్రియ ద్వారా ఇస్లాం పునరుజ్జీవనానికి పరిస్థితులను సానుకూలం చేశాడు. అయితే ఈ పరిస్థితులు మరియు అవకాశాలు తమ స్వశక్తితోనే సంఘటనగా రూపు దాల్చలేవు. ఈ అవకాశాలను నిజంచేసి చూపడానికి చైతన్యవంతమైన ఓ మానవ సమూహం అవసరం. ఇలాంటి ఒక సమాజం గనక నడుంబిగించి నిలబడితే సమీప భవిష్యత్తులో మరోసారి ఇస్లాంకు సైద్ధాంతిక ఆధిక్యత లభించటం అసంభవం కాదు. ఏ విధంగానైతే తొలికాలంలో దానికి షిర్క్‌పై విజయం లభించిందో అదేవిధంగా అది మరోసారి కూడా మిథ్యావాదాలపై తిరుగులేని ఆధిక్యతను సంపాదించగలదు.

పైన మేము ప్రస్తావించిన 'పుష్కలమైన అవకాశాలు' గత నూరేళ్లుగా ఓ సజీవ మానవ సమూహం కోసం ఎదురుచూస్తూ ఉన్నాయి. కాని దురదృష్టవశాత్తు అలాంటి సమూహ

(జమాఅత్) యేదీ ముందుకు రాలేదు. ఈ నూరేళ్ల కాలంలో మననాట అనేక జమాతులు, ఉద్యమాలు ఉద్భవించిన సంగతి నిజమే. కాని ఈ ఉద్యమాలు తాత్కాలికంగా పరిస్థితుల ప్రభావానికి లోనై ఉనికిలోకి రావటమో లేక ప్రతిచర్యగా ఆవిర్భవించటమో జరిగింది తప్ప దేవుడు కల్పించిన మహదవకాశాలను సద్వినియోగం చేసుకుని సత్యధర్మోన్నతికై పాటుపడే సదుద్దేశ్యంతో ఉనికిలోనికి రాలేదు.

బద్ర్‌యుద్ధ మైదానంలో భౌతికంగా బలిష్టులైన అవిశ్వాసులు బలహీనులైన విశ్వాసులపై అమాంతం దాడి జరిపినపుడు దైవప్రవక్త తీవ్రమైన వినమ్రతా భావంతో దైవసమక్షంలో మోకరిల్లి, తమకు సహాయమందించమని ప్రార్థించినట్లు ఆయన జీవిత చరిత్ర గ్రంథాల ద్వారా తెలుస్తోంది. ఆ సున్నితమైన ఘడియలో ఆయన నోట వెలువడిన మాటల్లో ఒకటి ఇది : దేవా! ఈ చిన్న సమూహం గనక అంతమైపోతే భూమండలంలో నిన్ను ఆరాధించేవారూ ఉండరు. ఇదేదో అతిశయోక్తి కానేకాదు. వాస్తవమేమిటంటే, తగినంత యుద్ధ సామాగ్రి లేకుండానే బద్ర్ రణరంగంలో శత్రువులను ఎదుర్కొనడానికి నిలబడివున్న ఆ 313 శుభాత్మలు మామూలు మనుషులు కారు. రెండున్నర వేల సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ఎన్నోసార్లు పోతపోయబడిన తరువాత ఎగిరిపోకుండా నిలబడిన మేలిమి పంట అది. శ్రేష్ఠ సమూహం (ఇసాబ అస్‌సాబెరసూల్) అది . ఈ ఇసాబ (సహచరుల బృందము) యదార్థానికి గత రెండువేల ఐదువందల సుదీర్ఘ కాలదైవిక ప్రణాళికకి ఫలవంతమైన ముగింపు. అలాంటి మరోకొత్త (ఇసాబ) ఏర్పడాలి. ఇక్వానెరసూలు దేనిమీదైతే గత వెయ్యి సంవత్సరాల చరిత్ర ఫలవంతం అవ్వవలసి ఉన్నదో, అది గత వెయ్యి సంవత్సరాల యొక్క చరిత్రకి జ్ఞానవివేక పరమైన వారసులు అవ్వాలి. తమ సత్ప్రవర్తన ద్వారా అవకాశాలను నిజం చేసి చూపించే వజ్ర సంకల్పంగల శ్రేష్ఠ సమాజం, ఆశయాన్ని అంటిపెట్టుకుని ఉండి ముందుకు పురోగమించే ఓ మానవ నవనీతం నేడు కావాలి. ఇలాంటి వారే దైవాభిమతంతో తమ అభిమతాన్ని జోడించి సిసలైన విజయాన్ని సాధిస్తారు.

## హీరోల నర్సరీ

బద్ర్ యుద్ధరంగంలో 313 మంది బలహీనులైన విశ్వాసులపై వెయ్యిమంది అవిశ్వాసులు విరుచుకుపడినపుడు దైవప్రవక్త ప్రభువు సమక్షంలో మోకరిల్లి అత్యంత దీనంగా అర్థించారని సీరత్ గ్రంథాల ద్వారా తెలుస్తోంది. ఆ సమయంలో ఆయన బద్ర్ రణరంగం అంచుల్లో ఒక పందిరి క్రింద ఉన్నారు. దైవసహాయాన్ని కోరుతూ ప్రార్థన చేస్తున్నారు. ఆ

సున్నిత ఘడియలో ఆయన నోట వెలువడిన మాటల్లో ఒకటి ఇది :

"దేవా ఈ సమూహం గనక ఈ రోజు అంతమైపోయినట్లయితే ఒకపై ఈ ధరణిలో నిన్ను సేవించేవాడే ఉండడు" (అస్సీరా అన్‌నబవియ్యా సంపుటి 2, పేజీ 411).

ఇదేదో అతిశమోక్తితో కూడిన మాటకాదు. ఇది వాస్తవస్థితికి ఒక తార్కాణం. బద్ర్ యుద్ధరంగంలో శత్రువులను ఎదిరించడానికి వచ్చి ఆ 313 మంది ధన్యజీవులు మామూలు మనుషులు కారు. ఆ శ్రేష్ఠ సమూహం వెనుక రెండున్నరవేల సంవత్సరాల పరిశ్రమ ఉంది. రెండున్నర వేల సంవత్సరాల కాలంలో ప్రత్యేక పరిస్థితులలో సచేతనమైన ఒక జాతి నిర్మించబడింది. మరి ఆ సచేతనమైన జాతిని వడబోసి వేరొక సమూహాన్ని తీయడం జరిగింది. ఖుర్‌ఆన్ పరిభాషలోనే చెప్పాలంటే అదొక "శ్రేష్ఠ సమాజం". చారిత్రాత్మకమైన ఆ వర్గం తనకు తానై వచ్చి శత్రువు ఖడ్గాల ముందు నిలుచుంది.

ఈ ప్రపంచం ఒక పరీక్షా ప్రపంచం. ఇక్కడ ఎదురయ్యే సంఘటనలు అవకాశాలు మరియు ఆచరణల పరదాలో దాగి ఉంటాయి. దీనిభావం ఏమిటంటే ఈ గుప్పెడు మనుషులే గనక ఈ యుద్ధంలో అంతమైపోతే ప్రస్తుత ప్రపంచంలో దైవ సాంప్రదాయానుసారం మరో రెండున్నర వేల సంవత్సరాలు అవసరమవుతాయి.

వర్తమాన కాలంలో ఇస్లాం సైద్ధాంతిక ఆధిక్యత కొరకు వేరేమాటల్లో ప్రవక్త దౌత్యం యొక్క పునఃప్రతిష్టత కొరకు నేడు మరొక ఇసాబ బృందము (ఇక్వానేరసూల్) అవసరమున్నది. ఈ సమాజం గత వెయ్యేళ్ల కృషి ప్రతిరూపంగా, వెయ్యి సంవత్సరాల కాలంలో దేవుడు సమకూర్చిన అసంఖ్యాకమైన అవకాశాలను పూర్తిగా అవగాహన చేసుకోగల వర్గంగా ఉండాలి.

మనో వాక్కాయకర్మల చేత గల వెయ్యిసంవత్సరాలకు నిజమైన వారసులుగా నిరూపించుకున్నవారే ఆ "శ్రేష్ఠ సమాజం" అనబడతారు. ఎవరైతే తమ నడవడిక ద్వారా దేవుడు సమకూర్చిన మహదవకాశాలను సంఘటనగా మలిచే యోగ్యతను కలిగివున్నారో, ఎవరైతే తమ ఉనికే ధర్మ సంస్థాపనకు ప్రతీక అని క్రియాత్మకంగా రుజువుచేసుకుంటారో అటువంటి వర్గం ఒకటి నేడు ముందుకు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇలాంటి వర్గం ఒకటి లోగడ ఇస్లాంకు సైద్ధాంతిక ఆధిక్యత నొసగింది. నేడు కూడా అలాంటి వర్గం తిరిగి ఇస్లాంకు సైద్ధాంతిక ఆధిక్యతను నొసగగలదు. అవకాశాలు మెండుగా గల ప్రస్తుత ప్రపంచంలో ఇస్లాం ధర్మ విశిష్టతకు ఇంతకు మించిన మార్గం వేరొకటి లేదుమరి.

ప్రొఫెసర్ హిట్టీ తన గ్రంథం – హిస్టరీ ఆఫ్ అరబ్స్‌లో ఇలా అభిప్రాయపడ్డాడు.

After the death of the prophet sterile Arabia seens to have been converted as it by magic into a nursery of heroes the like of whoom both in number and quality is hard to friend anywhere.

- P.K. Hitti, History of Arabs (1979) p.142

"ఇస్లాం ప్రవక్త దివంగతులైన తరువాత అరేబియా బంజరు నేల ఇంద్రజాలంతో హీరోల నర్సరీగా మార్చబడిందేమోననిపించింది. అలాంటి హీరోల దృష్టాంతాన్ని సంఖ్యాపరంగా గానీ, విశిష్టత రీత్యాగాని ఎక్కడైనా కనుగొనడం చాలా కష్టం".

ప్రపంచంలో ఇస్లాంకు ఆధిక్యత నొసగటమన్నది ఒక పరిపూర్ణ సైద్ధాంతిక వ్యవస్థకు పోటీగా మరో పరిపూర్ణ సైద్ధాంతిక వ్యవస్థకు ఆధిక్యత నొసగటంవంటిదే. ఇది చరిత్రలోకెల్లా అత్యంత కష్టసాధ్యమైన పథకం. దీన్ని అమలులోకి తేవడానికి 'ఒక హీరోల నర్సరీ' అవసరం. బహుదైవోపాసనా భావం జడలు విప్పిన ప్రాచీన కాలంలో హీరోల నర్సరీ ద్వారా ఇస్లాం ఆధిక్యతను సంపాదించింది. కాగా, ఇప్పుడు నాస్తికవాదంతో నిండిన ఈ ప్రపంచంలో మరోసారి ఇస్లాంకు ఆధిక్యత చేకూరాలంటే దీనికొరకు మరో 'హీరోల నర్సరీ' ఆవశ్యకత ఎంతైనా ఉంది. దేవుని సంవిధానం ప్రకారం ఏ నిబంధనైతే దైవప్రవక్త మరియు ఆయన సహచరులకు అనివార్యమైందో అది భావితరాల వారికి వర్తించకుండా ఎలా ఉంటుంది.

దైవప్రవక్త కాలం నాటి ముస్లింలు ధార్మిక పునరుజ్జీవనం కోసం అవిరళ కృషి సలిపారు. అలాగే వర్తమాన కాలపు ముస్లింలు కూడా ఇస్లాం పునరుజ్జీవనం కొరకు అసాధారణమైన ప్రయత్నాలు చేశారు. బాహ్య దృష్టితో చూస్తే వర్తమాన కాలపు ముస్లింలు చేసిన కృషి తొలికాలపు ముస్లింలు చేసిన కృషికంటే తక్కువేమీ కాదు. ధన త్యాగం, ప్రాణ త్యాగం, రచనల ద్వారాను, ఉపన్యాసాల ద్వారాను వెచ్చించిన సమయం, ధరణిలో నడిపిన ఉద్యమాలు, మొదలగు కార్యకలాపాలను చూడబోతే అవి పూర్వకాలపు కృషికన్నా ఎక్కువగానే అనిపిస్తాయి. కాని పరిణామం రీత్యా చూస్తే ఈ రెంటికీ మధ్య పొంతనే కనిపించదు. గతంలో జరిగిన ఇస్లామీయ ప్రయత్నాలు చరిత్ర గతినే మార్చివేయగా వర్తకాలపు ప్రయత్నాలు మన వినాసాన్ని మాత్రమే వృద్ధిచేశాయి.

ఈ వ్యత్యాసం వెనుక మానసికమైన కారణాలున్నాయి. తొలికాలపు ముస్లింలకు 'పొందే భావన' ప్రేరక శక్తిగా నిలవగా నేటి ముస్లింలకు 'పోగొట్టుకున్నామన్న భావన'

ప్రేరకశక్తిగా నిలిచింది. తొలికాలపు ముస్లిములు మనోమయమైన భావాలకనుగుణంగా ముందుకు దూసుకువచ్చారు. దీనికొక మచ్చుతునక జాఫర్ బిన్ అబీతాలిబ్ నజాషీ దర్బారులో చేసిన ప్రసంగం. ఆ ప్రసంగ సారాంశం ప్రకారం ఇస్లాం అంటే మనిషి దృష్టిలో అజ్ఞానంతో కూడిన జీవితానికి బదులు చైతన్యవంతమైన జీవితం గడపటం వంటిది. వాళ్లు బహుదైవోపాసనకు బదులు ఏకేశ్వరోపాసనను కనుగొన్నారు. వారు మార్గవిహీనతకు బదులు దైవప్రవక్త మార్గదర్శకత్వాన్ని పొందారు వాళ్లు ఇహలోకానికి బదులు పరలోకాన్ని పొందారు. వాళ్లు విశృంఖలమైన నీతినియమాల స్థానంలో కట్టడులతో కూడిన నీతి నియమాలను అవలంబించారు. వాళ్లు అన్యాయం అధర్మాలకు బదులు న్యాయాన్ని ధర్మాన్ని పొందారు. కాని వర్తమాన కాలపు ముస్లింల వ్యవహారం మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది మరి.

తొలికాలపు ముస్లింల భావోద్రేకాలలో 'మేము పొందాము' అన్న ధోరణి తొణకిసలాడేది. దీనికి భిన్నంగా వర్తమానకాలపు ముస్లింల ఆలోచనా సరళిలో "మేము పోగొట్టుకున్నాం, మాకు కాకుండా చేశారు" అన్న ధోరణి పొడసూపింది.

వర్తమాన కాలపు ముస్లింల ఉద్యమాలన్నీ ఈ 'పీడిత' భావాలకనుగుణంగానే ఉద్భవించాయి. రెండు ఉద్యమాల మధ్య ఉన్న ముఖ్యమైన వ్యత్యాసం ఏమిటంటే ఒక ఉద్యమం సాదాసీదా (లాజికల్) తీరులో ప్రజల ముందుకు రాగా రెండవది విచారగ్రస్తమైన (ఫ్లాసిఫికల్) తీరులో తన ఉద్దేశ్యాన్ని ప్రజలకు తెలియజెప్పింది. అంతకుమించిన వ్యత్యాసమేదీలేదు. ఒక ఉద్యమంలో ధార్మిక పదజాలాలు ఎక్కువ మోతాదులో ఉంటే మరొక ఉద్యమంలో జాతీయ పదజాలాలు ఎక్కువ మోతాదులో ఉన్నాయి.

గ్రీకు తత్వవేత్త ఆర్కిమెడిస్ గురుత్వాకర్షణ సూత్రాన్ని కనుగొని తాను సర్వస్వాన్ని పొందినట్లు అనుభూతి చెందాడు. ఈరాన్ చక్రవర్తి రజా షాపహెల్వీ కేవలం పదవీచ్యుతుడైన దానికి సర్వాన్నీ పోగొట్టుకున్నట్లు ఫీలయ్యాడు. పొందడమైనా పోగొట్టుకోవడమైనా మనిషి ఈ వస్తువుకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాడు.

ఈ మనోమయభావాల ఫలితంగా 'Discovary' లేక 'ఆవిష్కరణ' మనిషిలోని సహజశక్తులను జాగృతం చేస్తుంది. అతడు పరిపూర్ణ స్థాయిలో ఒక సజీవ మనిషైపోతాడు. అతని ఆత్మవిశ్వాసానికి హద్దే ఉండదు. దీనికి భిన్నంగా మనిషిలో పోగొట్టుకున్నానన్న భావన ప్రబలిపోయినపుడు అతని ఆలోచనాశక్తులు, ఆచరణా శక్తులు ఒక్కసారిగా స్థంబించిపోతాయి. నిస్సత్తువ ఆవరిస్తుంది. పైకి అతను సజీవంగా ఉన్నప్పటికీ వాస్తవానికి జీవచ్ఛవం వంటివాడే.

పూర్వం మన సజ్జనులు పొందిన భావనతో ఉద్యమించారు. అందుకే నిద్రాణమైవున్న వారిలోని సద్గుణాలన్నీ పూర్తిస్థాయిలో మేల్కొన్నాయి. కాని వర్తమాన కాలంలో మన నవతరాలు భావదారిద్ర్యానికి లోనైఉన్నాయి. ఈ కారణంగానే వీళ్లలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. సహజ సిద్ధమైన వీరి శక్తులు జాగృతం కాలేకపోతున్నాయి.

"పొందే" భావన ద్వారా సకారాత్మక (Positive) గుణగణాలు అబ్బుతాయి, "పోగొట్టుకున్న" భావన ద్వారా నకారాత్మక (Negetive) గుణాలు అబ్బుతాయి. ఇది నిజం. తొలికాలపు ముస్లింలలో వారు అవలంబించిన ఇస్లాం ధర్మం ఉన్నత గుణగణాలు సృజించటాన్ని మనం తెలుసుకున్నాం. వాళ్లు సత్యం ముందు తలవంచేవారు. వాళ్లు ఇతరులను ఎలా గౌరవించాలో తెలుసుకున్నారు. వాళ్లు చెప్పిందే చేసేవారు. వాళ్లు జనులను క్షమించి వదలిపెట్టే విశాలహృదయతను కలిగి ఉండేవారు. వాళ్లు ఫిర్యాదులన్నింటినీ ప్రక్కకు నెట్టి ఎదుటివారితో వ్యవహారం చేసేవారు. వాళ్లు రాగద్వేషాలకతీతంగా నిర్ణయంగైకొనే స్థితిలో ఉండేవారు.

దీనికి భిన్నంగా నకారాత్మక భావాలు ఎంతసేపటికీ నకారాత్మక గుణాలనే పెంచిపోషిస్తుంటాయి. ఇలాంటి వారికి ఉద్రేకాలే మార్గదర్శకంగా నిలుస్తాయి. వాళ్లు సహజంగానే జగడాలకు, రాగద్వేషాలకు లోనై ఉంటారు. యదార్థ దృష్టితో కూడిన మాటలు వాళ్ల మనోమస్తిష్కాలను తాకవు. వాళ్లు నిత్యం విభేదాలకు లోనై, అయోమయావస్థలో పడి కొట్టుమిట్టాడుతుంటారు. సత్యాన్ని అంగీకరించి స్వీకరించే సహృదయత వారిలో ఉండదు. వాళ్లు ఓడిపోయినా తమ ఓటమిని అంగీకరించరు. ఒకవేళ వారు గెలిచినా లోపభూయిష్టమైనవారి మనసు అచిరకాలంలోనే వారి గెలుపును ఓటమిగా మార్చివేస్తుంది. ఈ వ్యత్యాసమే నిన్నటి ముస్లింలకు, నేటి ముస్లింలకు మధ్య గొప్ప తేడాను సృష్టించింది. ఈ తేడాను మనం మన చర్మచక్షువులతో వీక్షిస్తూనే ఉన్నాం.


ఇస్లాం ప్రవక్త తెచ్చిన విప్లవం సకారాత్మక గుణాలునిండిన క్షేత్రంలో నకారాత్మక గుణాలు పేరుకున్న క్షేత్రంలో ఉద్భవింపజేయాలని అభిలషిస్తున్నట్లయితే అలాంటివారు తమ కొరకు మరో దైవాన్ని, మరో ప్రవక్తను వెతుక్కోవలసి ఉంటుంది.

# సైద్ధాంతిక ప్రవక్త

## MUHAMMAD - A PROPHET FOR ALL HUMANITY

"అబ్రాహాము మక్కాలో దైవగృహాన్ని నిర్మిస్తున్న సమయంలో "దేవా! నువ్వు ఇస్మాయిల్ వంశంలో ఒక ప్రవక్తను ప్రభవింపజెయ్యి అని ప్రార్థించగా ఆ ప్రార్థన స్వీకారయోగ్యమైంది. ఆమె కడుపున ఇస్మాయిల్ ప్రవక్త పుట్టారు. అయితే అబ్రాహాము ప్రార్థనకు - ఇస్మాయిల్ ప్రవక్త ప్రభవానికి మధ్య సుమారు రెండున్నరవేల సంవత్సరాల అంతరం ఉంది. ఎందుకనీ? ఎందుచేతనంటే ప్రవక్త దైవదౌత్య పరంపరకు పరిసమాప్తిగా వచ్చారు. దైవధర్మాన్ని ప్రచారం  చేయడంతో పాటు దైవధర్మానికి ఆధిక్యత నొసగవలసిన బాధ్యత కూడా ఆయనపై ఉందిమరి.

దేవుని వరాలు పరిపూర్తి కావాలంటే ప్రవక్త తెచ్చిన ఆకాశ గ్రంథ (ఖుర్ఆన్) రక్షణ కోసం శాశ్వితమైన ఏర్పాట్లు జరగటం కూడా ఈ సుదీర్ఘప్రక్రియలో ఒక భాగమే. ప్రస్తుత పరీక్షా ప్రపంచంలో తగినన్ని ఒనరులు, అవకాశాలు చేకూర్చినప్పడే ఈ కార్యం నెరవేరుతుంది. ఈ సానుకూలమైన అవకాశాలను సమకూర్చుకొనడానికి రెండున్నరవేల సంవత్సరాల సమయం పట్టింది. గత వెయ్యి సంవత్సరాల ప్రక్రియ ద్వారా సమకూరిన కొంగ్రొత్త అవకాశాలు కూడా ఇస్లామీయ ధర్మోన్నతికి దోహదకారిగా నిలిచి ఉన్నాయి. మీ ముందున్న ఈ పుస్తకంలో వివరించదలిచిన మౌలిక ఉద్దేశ్యం కూడా ఇదే".



Maulana Wahiduddin Khan (1925-2021) was an Islamic scholar, spiritual leader and peace activist. Having founded *Centre for Peace and Spirituality International*, he was internationally recognized for his contributions to world peace. He authored over 200 books dealing with Islam's spiritual wisdom, the Prophet's non-violent approach, religion's relation with modernity and other contemporary issues. His English translation of the Quran is popular because its language is simple, contemporary and easily understandable.

Goodword
www.goodwordbooks.com
info@goodwordbooks.com